
# మీరే న్యూమరాలజిస్టు

## నిత్య జీవితంలో సంఖ్యా శాస్త్రము





జ్యోతిష విద్వాన్, జ్యోతిష రత్న

**మహమ్మద్ దావూద్**

M.Com., LLB., MA(Jyothishyam)

Astro - Numerology Columnist

Expert in Astrology, Nadi Astrology, Numerology, Graphology, Signature Analysis & Palmistry

Ph:9985038135


6 9 1 8 0 9 0786

www.mddawood.com

# "మీరే న్యూమరాలజిస్టు"

## నిత్య జీవితంలో సంఖ్యాశాస్త్రం

జ్యోతిష విద్వాన్, జ్యోతిష రత్న

**మహమ్మద్ దావూద్**

**M.Com., L.LB., MA (Jyothishyam)**

**M.Sc., (Psychology)**

**Expert in Astrology, Nadi Astrology, Numerology, Graphology, Signature Analysis &Palmistry**

# Meerey Numerologist

By

**MOHAMED DAWOOD**

**First Edition : February 2013**

ప్రథమ ముద్రణ : ఫిబ్రవరి 2013

ద్వితీయ ముద్రణ : ఏప్రిల్ 2013

© Author

రూ. 370/-

ప్రచురణ :

కాక్స్‌టన్ ఆఫ్‌సెట్ ప్రై.లి.
రెడ్‌హిల్స్, హైదరాబాద్.

ప్రతులు లభించు స్థలం:
ప్రముఖ పుస్తక విక్రయ కేంద్రాలు

మరియు

మహమ్మద్ అర్షద్
ఇ.నెం.8-3-825/5/3/6/3, ఎల్లారెడ్డిగూడ,
సుభాష్‌నగర్, అమీర్‌పేట, హైదరాబాద్ - 500 073.
ఫోన్ : 040 - 23738217, సెల్ : 99850 38135, 81259 68303
Website: www.mddawood.com

# అంకితం



తల్లి దండ్రులు




పిన్ని, బాబాయ్

కన్న తల్లిదండ్రులకు, పెంచిన తాతయ్య, అమ్మమ్మలకు, ఆదరించిన
పిన్ని, బాబాయ్‌లకు మరియు మిత్రులు, శ్రేయోభిలాషులకు

– మహమ్మద్ దావూద్

# MESSAGE FROM



I am very Happy to note my very good friend Mr. Dawood noted Numerologist authored a book namely "Meere Numerologist" for the benefit of lovers of Numerology and others. I am aware of his past experience in the field of Palmistry, Numerology and Astrology both in practice and also in teaching. In these days when scholors do not share their experience and findings of Research Activities, Mr. Md. Dawood has boldly putforth all his years of experience. I wish him all the best and look forward to many more works from his pen.

Place : Secunderabad
Date : 6-1-2013

**A.V. Sundaram**
**Chapter Advisor I.C.A.S**

# విషయసూచిక

## 1వ భాగం (న్యూమరాలజీ అంటే ఏమిటి?)


| | | | |
|---|---|---|---|
| 1. | ముందుమాట | – | 8–11 |
| 2. | పరిచయం | – | 12–13 |
| 3. | జ్యోతిషం – న్యూమరాలజీ | – | 14–15 |
| 4. | నాడీ జ్యోతిషం – న్యూమరాలజీ | – | 16–17 |
| 5. | న్యూమరాలజీ – టారోకార్డ్స్ | – | 18 |
| 6. | న్యూమరాలజీ – సంతకం | – | 19–20 |
| 7. | న్యూమరాలజీ – వివిధ పద్ధతులు | – | 21–26 |


## 2వ భాగం (సంఖ్యలతో సంబంధం)


| | | | |
|---|---|---|---|
| 1. | జన్మదిన సంఖ్యలు | – | 27–51 |
| 2. | మాస్టర్ నెంబర్లు | – | 52–54 |
| 3. | డెస్టినీ నెంబరు | – | 55–62 |
| 4. | వ్యక్తిగత సంఖ్యలు<br>(జన్మసంఖ్య – డెస్టినీ నంబరు)<br>1 నుండి 9 వరకు | – | 63–267 |


## 3వ భాగం (అక్షరాలతో అనుబంధం)


| | | | |
|---|---|---|---|
| 1. | నేమాలజీ–నామ సంఖ్యలు (పేరు మార్పు) | – | 268–312 |
| 2. | నామ విశ్లేషణ<br>ఎ) మోటివేషన్ నెంబరు<br>బి) ఇంప్రెషన్ నెంబరు<br>సి) ఎక్స్‌ప్రెషన్ నెంబరు | – | 313–319 |

## 4వ భాగం (అక్షరాల ప్రభావం)


| | | | |
|---|---|---|---|
| 1. | అచ్చుల ప్రాముఖ్యత | – | 320–322 |
| 2. | అక్షర సమృద్ధి | – | 323–324 |
| 3. | లోపించిన అక్షరాలు | – | 325–327 |
| 4. | అక్షర లక్షణాలు | – | 328–345 |


## 5వ భాగం (సంఖ్యా జ్యోతిషం)


| | | | |
|---|---|---|---|
| 1. | సంఖ్యా సమృద్ధి | – | 346–356 |
| 2. | బలాబలరేఖలు | – | 357–364 |
| 3. | వ్యక్తిగత సంవత్సర సంఖ్య | – | 365–371 |
| 4. | వ్యక్తిగత మాస సంఖ్య | – | 372–375 |
| 5. | వ్యక్తిగత దిన సంఖ్య | – | 376–379 |
| 6. | జన్మ మాసాలు | – | 380–391 |
| 7. | జన్మరాశులు | – | 392–407 |
| 8. | జన్మ సంవత్సరం | – | 408–413 |


## 6వ భాగం (సంఖ్యల్లో సుఖజీవనం)


| | | | |
|---|---|---|---|
| 1. | సఖ్యత సహజీవనం | – | 414–418 |
| 2. | వివాహ ముహూర్తాలు | – | 419–422 |
| 3. | ప్లాటు / సైటు నెంబరు | – | 423–425 |
| 4. | ఇంటి నెంబరు | – | 426–430 |
| 5. | వెహికిల్ నెంబరు | – | 431–433 |
| 6. | మొబైల్ నెంబరు | – | 434–435 |
| 7. | బ్యాంకు అకౌంటు నెంబరు | – | 436–437 |
| 8. | వ్యాపార సంస్థలు | – | 437–438 |
| 9. | మనవి | – | 439–440 |

# 1వ భాగం

# న్యూమరాలజీ అంటే ఏమిటి?

## ముందుమాట

నేను నా జీవితంలో ఇంతవరకూ గ్రహించిన విజ్ఞానం అక్షర రూపంలో మీ చేతుల్లో ఉంది. న్యూమరాలజీ ఒక శాస్త్రం. కానీ న్యూమరాలజీ నా జీవితం! నాకు బాల్యం నుండి హస్తసాముద్రికం, న్యూమరాలజీ మొదలైన విషయాలపై కొంత ఆసక్తి ఉండేది. నా బాల్యంలో మా కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల చేతిరేఖలు చూసి, పుట్టినతేదీని పరిశీలించి వారికి ప్రెడిక్షన్స్ చెప్పటం, అందులో నేను చెప్పేవి 'నిజం' కావటం, దానితో అందరూ నన్ను అభినందించటం లాంటి స్ఫూర్తిదాయక సంఘటనల వలన నాకు వాటిపై మరింత ఆసక్తి పెరుగుతూ వచ్చింది. నేను తొమ్మిదవ తరగతిలో ఉన్నప్పుడు సెలవులకు మా బాబాయిగారింటికి వెళ్ళాను. మా బాబాయి కీ॥శే॥ మహమ్మద్ యాకుబ్ అగ్రికల్చరల్ డిమాన్‌స్ట్రేటర్‌గా పనిచేసేవారు. వాళ్ళ ఇంట్లో పెద్ద గ్రంథాలయం ఉండేది. రకరకాల పుస్తకాలు అందంగా అరలలో అమర్చి ఉండేవి. సెలవుల్లో ఆ పుస్తకాలన్నీ చదివేవాడిని. పండిట్ లక్ష్మీదాస్, చెన్నై గారు రచించిన న్యూమరాలజీ, హస్తసాముద్రికం పుస్తకాలు అప్పుడే నా కంట పడటం, నేను వాటిని చదవటం జరిగింది. వాటిలో కొన్ని గ్రంథాలలో న్యూమరాలజీ గురించి, సంఖ్యల వివరణ గురించి, పైథాగరస్ గురించి వ్రాయబడిన విషయాలు చాలా సంక్లిష్టంగా అనిపించాయి. ఆ తరువాత నుంచి న్యూమరాలజీ వైపు నేను ఎక్కువ ఆకర్షితుడనయ్యాను. అప్పటి నుండి నాకు తెలిసిన వారందరి 'జన్మదినం' తెలుసుకొని దానిలో బర్త్ నెంబర్ (జన్మసంఖ్య)ల గురించి విశ్లేషణలు చేయటం ప్రారంభించాను. నా ఆసక్తి అన్వేషణగా మారి అధ్యయనంలా రూపొంది, నాకు తెలిసింది పదిమందితో పంచుకోవాలన్న తపన ఫలితంగా ఈ పుస్తకం రూపొందింది. ఈ పుస్తకంలో న్యూమరాలజీ లింగభేదం, వయస్సు లేదా జాతీయతతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరికి ఉపయోగపడే విధంగా రూపొందించాను.

న్యూమరాలజీలో పైథాగరస్ ఆద్యుడు. ఆయన గురించి తెలుసుకోవటానికి చాలా న్యూమరాలజీ పుస్తకాలలో పైథాగరస్ ప్రస్తావనలను చదివి, వాటి ప్రకారం ఆయన గురించి తెలుసుకున్నాను. పైథాగరస్ క్రీ॥పూ. 520 ప్రాంతంలో నివసించినట్లు, ఆయన రకరకాల సిద్ధాంతాలు కనుగొన్నట్లు తెలిసింది. ప్రపంచంలో ఆయన అనేక ప్రదేశాలను

సందర్శిస్తూ అందులో భాగంగా ఒకసారి ఈజిప్టు దేశ పర్యటనలో ఆ దేశంలోని పిరమిడ్స్‌ని దర్శించినట్లు చదివాను. పిరమిడ్స్‌లో న్యూమరాలజీలోని అంకెల అర్థాన్ని బొమ్మల రూపంలో చెక్కినట్లు, మొత్తం 108 బొమ్మలు కనుగొని ప్రతి అంకె / సంఖ్య అర్థాన్ని విశ్లేషించినట్లు తెలుసుకున్నాను. అయితే ఆయనకున్న సమయాభావం వలన కేవలం 77 బొమ్మల రూపాలనే విశ్లేషించినట్లు, తరువాత ప్రపంచంలో మొట్టమొదటి సారిగా ఆయన ఇనిస్టిస్ట్యూట్ ఆఫ్ అకల్ట్ సైన్సెస్ అనే సంస్థను స్థాపించి, అందులో న్యూమరాలజీ, జ్యోతిష శాస్త్రాలను బోధించినట్లుగా తెలుస్తుంది.

కొన్ని గ్రంథాలు పైథాగరస్ భారతదేశం వచ్చి భారతీయ విజ్ఞాన శాస్త్రాలను అధ్యయనం చేసి వాటిలో కూడా పట్టు సాధించినట్లు తెలియజేస్తున్నాయి. ఈ స్ఫూర్తితోనే నేను కూడా గత 25 సంవత్సరాల నుండి అధ్యయనం చేసి నేర్చుకున్న న్యూమరాలజీని, ఆ విజ్ఞానాన్ని దానిలో అభిరుచి ఉన్న వారికి బోధిస్తూ వస్తున్నాను. ఆ క్రమంలోనే, విద్యార్థుల ప్రతిస్పందనలను చూసి, ఈ శాస్త్రాన్ని మరింత సరళతరం చేసి సులువైన పద్ధతిలో, ఆంధ్రప్రదేశ్‌లో చాలా ప్రాంతాల్లో, శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నాను. దీని వలన నాకున్న జ్ఞానం నలుగురికీ ఉపయోగపడుతుందనే సంతృప్తి ఉన్నా, ఇంకా ఏదో తెలియని వెలితి, ఏదో చెయ్యాలనే తపన, నన్ను వెంటాడుతూ ఉండేది. నా పరిజ్ఞానాన్ని పది మందితో పంచుకోవాలనీ శాస్త్రాన్ని సరళతరం చేసి వ్రాయాలన్న సంకల్పం, ఈ గ్రంథ సంకలనానికి అంకురార్పణ చేసింది. న్యూమరాలజిస్టునైన నన్ను కలం పట్టుకునేందుకు ఉపక్రమింపజేసింది. రచయిత కాని నన్ను రచన వైపు మళ్ళించింది.

చాలా మంది నా దగ్గరకు వచ్చిన వారూ మరియు సాక్షి దినపత్రికలో నా కాలమ్స్ చదివిన వారూ పుట్టినతేది, డెస్టిని నెంబరుల గురించి అడగటం, వివిధ పుట్టిన తేదీలకు వివిధ డెస్టినీలు ఉన్నప్పుడు వారి వారి గుణగణాలు, వారి అదృష్టదినాలు, అదృష్ట తేదీలు వంటి ప్రశ్నలు అడగటం చేసేవారు. ఇలాంటి సందేహాలు ఇంకా వేలాది మందికి ఉండొచ్చు. వాటికి సంబంధించి ఏ పుస్తకం అందుబాటులో లేకపోవడంతో, ప్రజలందరికి ఈ విధంగా నా అనుభవాన్ని పుస్తక రూపంలో వివరించాను.

న్యూమరాలజీలో, ప్రిడిక్టివ్ న్యూమరాలజీలో తెలుగులో ఇంతవరకు ఏ గ్రంథం లేకపోవటం వలన ఈ పుస్తకంలో ప్రిడిక్టివ్ న్యూమరాలజీని పెట్టడం జరిగింది. ఎవరు

ఏ సంవత్సరంలో పుడితే ఎలా ఉంటుంది అనేది ఎక్కడా అందుబాటులో లేకపోవడం వలన ఎవరెవరు ఏ సంవత్సరంలో పుడితే ఏఏ ఫలితాలు వస్తాయి అనేది సులభంగా, క్లుప్తంగా ఇచ్చాను.

ఏ నెలలో పుడితే ఏఏ ఫలితాలు వస్తాయి అనేది వెస్ట్రన్ న్యూమరాలజీలో సూర్యమానం ప్రకారం, సూర్యగమనాన్ని అనుసరించి ఉంటుంది. న్యూమరాలజీకి వెస్ట్రన్ ఆస్ట్రాలజీకి అత్యంత దగ్గర సంబంధం ఉన్నందున అది కూడా అందించాను. అదీకాక ఏ నెలలో అంటే 1వ తేదీ నుండి 31వ తేదీ లోపల అంటే, ఏ ఆంగ్లమాసంలో పుడితే ఏఏ ఫలితాలు వస్తాయి అనేది కూడా ఇవ్వడం జరిగింది. ఈ పుస్తకంలో అదృష్ట రత్నాలు ఇవ్వలేదు. అదృష్ట రత్నం అనేది జాతక పరంగా, జ్యోతిష్యపరంగా, సంఖ్యాశాస్త్ర పరంగా విశ్లేషించి సరైన రత్నాన్ని సూచించాలి. అందువలన ఇక్కడ అదృష్టరత్నాన్ని ఇవ్వడం జరుగలేదు.

మన జన్మదినం, పేరు కూడా మనం పూర్వ జన్మలో చేసిన పాపపుణ్యాల అనుగుణంగా వస్తాయని నా నమ్మకం. అందువలన మన తేదీలో వచ్చే అంకెల విశ్లేషణ కాకుండా మన తేదీలో లేని నంబరు యొక్క ఫలితాలు మొట్టమొదటగా నా అనుభవం ప్రకారం వ్రాశాను. అలాగే మన పేరులో కొన్ని అక్షరాలు రావటం, కొన్ని అక్షరాలు మిస్ అవటం గురించి కూడా నేను నా అనుభవం ప్రకారం రాశాను. ముందు తరాల వారు దీనిపై ఇంకా లోతైన పరిశోధన చేసి ఈ శాస్త్రాన్ని ఇంకా అభివృద్ధి చేస్తారనే ఆశతో దీనిని ప్రజలందరికి అందించటం జరిగింది.

నేను ఈ స్థాయికి రావటానికి ముఖ్య కారకులు మా బాబాయి, ఆయన నాకు మార్గదర్శి, గురువు, రోల్‌మోడల్. ఈ రంగంలో నేను ప్రవేశించినపుడు, నాకు సొంతంగా నోట్స్ రాసుకోమని సలహా ఇచ్చి, ఎంతగానో ప్రేరేపించి, చిన్నతనం నుండి నన్ను ఆదరించిన మహానుభావుడు మా బాబాయి. అలాగే నన్ను ఎంతగానో ప్రేమించి, నా ఎదుగుదలకు మనసులోనే నన్ను దీవించిన మా అమ్మగారు – వీరిద్దరు ఈ గ్రంథం మీ ముందుకు వచ్చే సమయంలో, ఈ లోకంలో లేకపోయినా, స్వర్గం నుండే నన్ను దీవిస్తారని ఆశిస్తూ రెండు చేతులతో వారికి నా నమస్సుమాంజలి ఘటిస్తున్నాను.

ఈ సంకల్పం కలగటానికి ప్రేరణ, స్ఫూర్తి ఇచ్చి అన్ని విధాల ప్రోత్సహించిన నా

సహధర్మచారిణి శ్రీమతి రసూల్ బీ, (చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ / ఐ.సి.డి.యస్); శిక్షణా తరగతుల నిర్వహణకు ప్రోత్సాహం ఇచ్చిన నా కుమార్తె శ్రీమతి జరీనా, ఎన్నో రకాలుగా సహాయం చేసిన నా పెద్ద కుమారుడు చి॥ అర్షద్, మౌనంగానే సూచనలు ఇచ్చిన నా చిన్న కుమారుడు చి॥ షఫీ, నేను న్యూమరాలజీని రీసెర్చ్ చేస్తున్న కాలంలో నా పిల్లల బాగోగులు చూసిన నా అత్తమామలకు మరియు ఎప్పటికప్పుడు నాలో ప్రతిభను మేల్కొలిపి ఉత్సాహపరిచిన నా శ్రేయోభిలాషులు, నా గురుతుల్యులు శ్రీమతి శ్యామల, మిత్రులు అచ్యుత సాంబశివరావు, శ్రీ యలమంచి నాగేశ్వరరావు గార్లు మరియు వారి సహధర్మచారిణి శ్రీమతి విజయలక్ష్మి గారు మొట్టమొదటిసారిగా ఆంధ్రప్రదేశ్ ప్రజలకు న్యూమరాలజీని మీడియా పరంగా తెలియజేయటానికి జీ 24 గంటలులో అవకాశం ఇచ్చిన శ్రీ రామ్‌గారు, పత్రికాముఖంగా న్యూమరాలజీ గురించి తెలుగు పాఠకులకు అవగాహన కల్పించటానికి అవకాశం ఇచ్చిన సాక్షి యాజమాన్యం, సంపాదక వర్గం, ఇతర సిబ్బంది మరియు ఆప్తమిత్రులు, రచయిత శ్రీ ఖదీర్ గారు, నా తోడు నీడ నా తమ్ముడు శ్రీ అబ్దుల్ రహమాన్, మిత్రుడు శ్రీ జనార్ధన మహర్షి గారు, నా పుస్తకాన్ని చదివి తగిన సూచనలు ఇచ్చి మరియు ఎడిటింగ్ చేసిన నా మిత్రుడు, సీనియర్ సబ్‌ఎడిటర్ శ్రీ డి.వి.ఆర్.భాస్కర్ గారు, ఈ గ్రంథ సంకలనంలో తనవంతు సహకారాన్ని అందించిన మిత్రులు **శ్రీ పట్నాయకుని శంకరప్రసాద్** గారు మరియు ఆదరించిన శ్రేయోభిలాషులు, ఆత్మీయులు, నా సహోద్యోగులు, అభిమానులు, నా శిష్యులు, ఎందరో మహానుభావులు అందరికీ ఇవే నా కృతజ్ఞతలు. నా ఈ చిరు ప్రయత్నాన్ని ఆదరిస్తారని ఆశిస్తూ...

ఈ గ్రంథ సంకలనంలో ఈ క్రింది గ్రంథాలను రిఫర్ చేయుట జరిగింది.

1. పండిత్ లక్ష్మీదాసు “న్యూమరాలజీ”
2. హరిశ్ జోహరి “న్యూమరాలజీ”
3. సఫైరెల్ “సీక్రెట్స్ ఆఫ్ కబాలా”
4. ఎలిజబెత్ గీతాంజాలి “గాడ్ స్పోక్‌ఇన్ నెంబర్స్”
5. మాంత్రో “న్యూమరాలజీ ఫర్ ఎవ్రీబడీ
6. రవీంద్రకుమార్ “న్యూమరాలజీ” పై గ్రంథ రచయితలకు నా ప్రగఢ కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

మీ

**మహమ్మద్ దావూద్**

# న్యూమరాలజీ - పరిచయం

**న్యూమరాలజీ అంటే అంకెల యొక్క భాష.**
**మీ పేరుకు, జన్మదినానికి ఉన్న అర్థాన్ని తెలిపేది న్యూమరాలజీ.**
**మార్పును అర్థం చేసుకోవటానికి న్యూమరాలజీ ఎంతో ఉపయోగకరం.**
**న్యూమరాలజీ మీలో దాగి ఉన్న విశ్వాంతరాళ నిగూఢ చిహ్నాన్ని తెలియజేస్తుంది.**

**న్యూమరాలజీ మీలో అంతర్గతంగా ఉన్న శక్తిని తెలియజేస్తుంది.**
**అంకెలను, పేర్లను సాంకేతికంగా తెలియజేసేది న్యూమరాలజీ.**
**మీ సంఖ్యలు మీలో ఉన్న సారాంశాన్ని తెలియజేస్తాయి.**

**ప్రతి అంకెకు అర్థం ఉంటుంది.**
**ప్రతి అక్షరానికి అర్థం ఉంటుంది.**
**వాటిని అర్థం చేసుకోవటానికే న్యూమరాలజీ ఉంది.**

న్యూమరాలజీ అంటే సంఖ్యాశాస్త్రం, అంకెలకు సంబంధించిన ఒక పురాతనమైన గతి తార్కిక శాస్త్రం. అంకెలు మనుషుల గుణగణాలను ఎలా తెలియచేస్తాయి, వాటి ప్రభావం మానవ జీవితంపై ఏ విధంగా చూపిస్తాయి, మనలో దాగున్న అదృశ్య శక్తులు, మనలోని బలాన్ని, బలహీనతల్ని ఏ విధంగా ప్రేరేపితం చేస్తాయి అనే విషయాలను న్యూమరాలజీ విశ్లేషణాత్మకంగా వివరిస్తుంది.

వ్యక్తి జన్మించిన వెంటనే అతనికి అంకెలతో సంబంధం ఏర్పడుతుంది. పుట్టిన తేదీ, సమయం, సంవత్సరం, నెల వీటన్నిటినీ సంఖ్యలలోనే మనం వివరిస్తాం. ఈ సంఖ్యలే మానవుల గుణగణాలను దశ, దిశానిర్దేశం చేసి అతనిలో దాగున్న అదృశ్య శక్తులు, బలహీనతలు తదితరాలను అన్నింటినీ తెలియచేస్తాయి. కాబట్టి న్యూమరాలజీని ఒక సాంకేతిక శాస్త్రంగా మనం అభివర్ణించవచ్చు.

మానవ జీవితంలో జరిగే ప్రతి సంఘటనకు సంఖ్యలతో అవినాభావ సంబంధం ఉంటుంది. పుట్టినరోజు, పెళ్ళి రోజు, పిల్లల పుట్టిన రోజు, బస్సు రూట్లు, ట్రైన్ నెంబర్లు, టెలిఫోన్ నెంబర్, మొబైల్ నెంబర్, కారు నెంబరు, అడ్రసు, ఆఫీసు చిరునామా, ఎక్కడికి వెళ్ళినా ఈ సంఖ్యలు మనల్ని పలకరిస్తూనే ఉంటాయి. ఆ పలకరింపులో ఉన్న అంతరార్థాన్ని

సాంకేతికంగా న్యూమరాలజీ వివరిస్తుంది.

ఒక వ్యక్తి పుట్టిన దగ్గర నుండి మరణించినంత వరకు ఈ సంఖ్యల పరంపరను దాటుకొనే వెళ్ళాల్సి ఉంటుంది. భౌతికంగా సంఖ్యలను చూస్తే అది "గణితం" అవుతుంది. అదే ఆధ్యాత్మిక కోణం నుంచి చూస్తే అవి మనిషి యొక్క విధిని, గమ్యాన్ని ఎలా నిర్ణయిస్తాయో తెలుస్తుంది.

జ్యోతిష్య శాస్త్రంలో నవగ్రహాలు (9) ఏ విధంగా మానవ జీవనం పై ప్రభావం చూపుతాయో అలాగే న్యూమరాలజీలోని నవ సంఖ్యలు (1 నుండి 9) కూడా మానవ జీవితాన్ని ప్రభావితం చేస్తాయి. మానవ జీవితంపై ప్రథమంగా పుట్టినతేదీ, అతని పేరు యొక్క ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

పుట్టినతేదీని 3 భాగాలుగా విభజించవచ్చు. తేదీ, నెల, సంవత్సరం. ఇందులో తేదీ వ్యక్తి గుణాన్ని, వ్యక్తిత్వాన్ని, మానసిక స్థితిని, అభిరుచులను, విద్య, ఆరోగ్యం మొదలైన వాటిని వివరిస్తుంది. నెల, వ్యక్తి యొక్క వృత్తి, కుటుంబం, జీవిత భాగస్వామి, తల్లిదండ్రులు, తోబుట్టువులు మొదలైన వాటిని తెలియచేస్తుంది. సంవత్సరం వ్యక్తుల జీవన విధానం, కాలానుగుణంగా ఆ వ్యక్తుల జీవితంలో జరిగే మార్పులు, ఉద్యోగ, వ్యాపార మార్పులు మొదలైన వాటిని తెలియజేస్తుంది.

మనం పెట్టుకున్న పేరు కూడా న్యూమరాలజీలో ప్రధానపాత్ర పోషిస్తుంది. పేరులో ప్రతి అక్షరానికి ఒక అంకె యొక్క వైబ్రేషన్ ఉంటుంది. ఆ వైబ్రేషన్‌ల సమాహారమే పేరు. ఆ పేరు న్యూమరాలజీ ప్రకారం శాస్త్రీయంగా ఉన్నట్లయితే, పేరు పిలిచినపుడు ఆ సంఖ్యల ప్రకంపనలు క్రమబద్ధంగా ఉండి, మంత్రంలా పని చేసి, ఆ వ్యక్తి జీవితంపై మంచి ప్రభావం కలుగచేస్తాయి. ఆ నాదం వేదంలా పనిచేస్తుంది.

సంఖ్యాశాస్త్రవేత్తను ప్రశ్న అడిగిన సమయం కూడా కీలక పాత్రవహిస్తుంది. ప్రశ్న వేసిన కాలాన్ని బట్టి నిర్ణయం చేసేది ప్రెడిక్టివ్ న్యూమరాలజీ పద్ధతి. ఇలా న్యూమరాలజీలో అనేక రకాలు, పద్ధతులు ఉన్నాయి. ప్రధానంగా ప్రాచుర్యంలో ఉన్నవి. (1) ఛాల్డియన్ (2) పైథాగరస్ (3) కబాలా (4) Unit System, (5) Sepharial System మొదలైనవి. ఈ గ్రంథ సంకలనం ప్రధానంగా చాల్డియన్, పైథాగరస్ పద్ధతులపై ఆధారపడి చేయడం జరిగింది. పాఠకులు ఈ గ్రంథాన్ని పాఠ్యపుస్తకంలా కాకుండా న్యూమరాలజీ గైడ్‌లాగా ఆకళింపు చేసుకొని ఆస్వాదిస్తారని నా నమ్మకం.

# న్యూమరాలజీ - జ్యోతిషం

**జ్యోతిష్యశాస్త్రంలో న్యూమరాలజీ ఒక భాగం. న్యూమరాలజీ సులభంగా నేర్చుకోవచ్చు. జ్యోతిష్యశాస్త్రాన్ని నేర్చుకోవటం కొంచెం కఠినం.**

భారతీయ జ్యోతిష శాస్త్రంలో చంద్రుడి గమనాన్ని ఆధారంగా చేసుకొని గోచారం చూడటం జరుగుతుంది. అదే పాశ్చాత్య జ్యోతిష్యశాస్త్రంలో సూర్యుడు ఆధారంగా ఉన్న నవగ్రహాలను అనుసరించి జ్యోతిష్యం చెప్పటం జరుగుతుంది. న్యూమరాలజీలో కూడా గ్రహాలకు గల నెంబర్లను అనుసరించి, వ్యక్తుల లక్షణాలు, గుణగణాలు, జీవనం మొదలైనవి చెప్పటం జరుగుతుంది. జ్యోతిష శాస్త్రంలో నవగ్రహాలు ఉంటాయి. న్యూమరాలజీలో నవ సంఖ్యలు ఉంటాయి. ఆయా గ్రహాలకు గల సంఖ్యల విలువలు ఈ క్రింద ఇవ్వటం జరిగింది.

| | |
|---|---|
| 1 = సూర్యుడు | 6 = శుక్రుడు |
| 2 = చంద్రుడు | 7 = కేతువు (NEPTUNE) |
| 3 = గురుడు | 8 = శని |
| 4 = రాహువు (URANUS) | 9 = కుజుడు |
| 5 = బుధుడు | 0 = ప్లూటో (PLUTO) |

అలాగే వారంలో ఉన్న 7 రోజులకు కూడా, న్యూమరాలజీతో ఉన్న సంబంధం, సంఖ్యల విలువలతో ఈ విధంగా ఉంటుంది.

| | | | |
|---|---|---|---|
| ఆదివారం | – 1, 4 | గురువారం | – 3 |
| సోమవారం | – 2, 7 | శుక్రవారం | – 6 |
| మంగళవారం | – 9 | శనివారం | – 8 |
| బుధవారం | – 5 | | |

దీని ప్రకారం ఆదివారానికి రెండు సంఖ్యలు ఇవ్వటం జరిగింది. 1 అంటే పాజిటివ్ సూర్యుడు, 4 నెగిటివ్ సూర్యుడు లేదా రాహువు లేదా URANUS. అలాగే సోమవారానికి రెండు సంఖ్యలు ఇవ్వటం జరిగింది. 2 పాజిటివ్ చంద్రుడు, 7 నెగిటివ్

చంద్రుడు లేదా కేతువు లేదాNEPTUNE. దీనిని విశ్లేషించటం వలన తెలిసేది ఏమిటంటే 1,4లకు మరియు 2,7లకు స్వాభావిక స్నేహ బంధం ఉంటుందని తెలుస్తుంది.

చారిత్రక ఆధారాలను బట్టి, పైథాగరస్ రచనలను బట్టి, పైథాగరస్ ఈజిప్టు పర్యటనలో పిరమిడ్లలో న్యూమరాలజీకి సంబంధించిన 108 బొమ్మలను చూసి, అందులో సమయా భావం వల్ల 77 బొమ్మలకు గల సంఖ్యల అర్థాలను విశ్లేషించాడని తెలుస్తుంది

న్యూమరాలజీలో ఉన్న 108 బొమ్మలకి మన జ్యోతిష్య శాస్త్రంలో ఉన్న 27 నక్షత్రాలకు గల అనుబంధం ఇలా తెలుసుకోవచ్చు. మన జ్యోతిష్య శాస్త్రంలో కూడా 27 నక్షత్రాలు, నక్షత్రానికి గల 4 పాదాలు మొత్తం 27×4 = 108 పాదాలు ఉన్నాయి. హిందూ దేవతల స్తోత్రాలు కూడా 108 నామాలతో చేయటం జరుగుతుంది (అష్టోత్తర శత నామావళి). పూర్వీకులు పిరమిడ్‌లో కూడా న్యూమరాలజీని 108 బొమ్మల రూపంలో చెక్కాడాన్ని బట్టి జ్యోతిష్యం, న్యూమరాలజీలు మానవాతీతమైన అనుబంధం కలిగి ఉన్నట్లు తెలుసుకోవచ్చు. ఈ రెండు శాస్త్రాలలోను గ్రహాల సంఖ్యల ప్రభావం మానవులపై తెలియచేయటం జరిగింది.

జ్యోతిష్య శాస్త్ర ప్రకారం గ్రహాల మధ్య మిత్రత్వ, శత్రుత్వాలు ఉన్నట్టే న్యూమరాలజీ ప్రకారం సంఖ్యల మధ్య మిత్రత్వం, శత్రుత్వం కూడా ఉంటుంది.

దీనిని విశ్లేషణాత్మకంగా పరిశీలిస్తే జ్యోతిష్య శాస్త్రం న్యూమరాలజీ ఒకదానికొకటి అనుబంధ శాస్త్రాలని తెలుస్తుంది. కాకపోతే జ్యోతిష్యశాస్త్రం చాలా కఠినమైన, సంక్లిష్టమైన శాస్త్రం. దీనిని చాలా లోతుగా అనేక కోణాల నుండి అధ్యయనం చేయాల్సి ఉంటుంది. న్యూమరాలజీ సరళమైన శాస్త్రం. దీనిని చాలా తక్కువ వ్యవధిలో అధ్యయనం చేసి నేర్చుకొనవచ్చు. ఇందులో పేరు, పేరులోని అక్షరాలు మార్పు చేసి, అద్భుత ఫలితాలు ఏ విధంగా పొందవచ్చో వివరంగా తెలుసుకోవచ్చు. ఈ గ్రంథ రచయిత జ్యోతిష్యాన్ని అభ్యసించి, సంఖ్యాశాస్త్రాన్ని అధ్యయనం చేసి, పరిశోధన చేసిన తరువాత, ఈ శాస్త్రంలో విషయాలను సరళతరం చేసి, ఆంధ్రదేశంలో చాలా మందికి బోధించటం జరిగింది. ఆ భోదనలో భాగంగా విద్యార్థులు అడిగిన ప్రశ్నలను దృష్టిలో ఉంచుకొని ఈ సరళతర, సంఖ్యాశాస్త్ర విధానం, అందరికి ఉపయోగపడాలని ఆశయంతో ఈ గ్రంథ రూపంలో తీసుకురావటం జరిగింది.

# న్యూమరాలజీ - నాడీ జ్యోతిషం

**నాడీ జ్యోతిషం, న్యూమరాలజీలు, పుట్టిన తేదీని అనుసరించే భూత, భవిష్యత్తు, వర్తమాన కాలాలను తెలియజేస్తాయి.**

నాడీ జ్యోతిషం రెండు రకాలు. వైదీశ్వరన్ కోవెలలో జ్యోతిష్యులు వ్యక్తుల బొటన వ్రేలి ముద్రననుసరించి, తాళపత్ర గ్రంథాలు పరిశీలించి, ఆ వ్యక్తి పేరు మరియు జీవిత విశేషాలు, తల్లిపేరు, తండ్రి పేరు, భవిష్యత్తు, గతం చెప్పగలుగుతారు. ఈ తాళపత్ర గ్రంథాలలో అగస్త్యనాడి, చంద్రకళా నాడి మొదలైన నాడీ గ్రంథాలు ఉన్నాయి.

నాడీ జ్యోతిష్యంలో వేరే పద్ధతులు కూడా ఉన్నాయి. అవి భృగునాడీ, నందినాడీల సిద్ధాంతం ప్రకారం పుట్టిన సమయం అవసరం లేకుండానే అనగా లగ్నం, చంద్రుడి గమనం లాంటివి లేకుండానే, ఆ రోజు ఉన్న గ్రహం, గ్రహాల మధ్య సంబంధాలు అనుసరించి జ్యోతిష్యం చెప్పటం జరుగుతుంది. దీనినే నాడీ జ్యోతిష్యం అంటారు. ఈ మధ్య కాలంలో కీ.శే. శ్రీ ఆర్.జి రావుగారి వలన, ఆంధ్ర దేశంలో మా గురువు గారు శ్రీ ఎ.వి. సుందరం గారి వలన ఇది ప్రాచుర్యంలోనికి వచ్చింది.

అలాగే న్యూమరాలజీ ప్రకారం కూడా వ్యక్తి యొక్క పేరు, వారి జన్మదినాన్ని అనుసరించి పుట్టిన తేదీ లేదా డెస్టినీ నంబర్ ప్రకారం వారి పేరును విశ్లేషించి జాతకం చెప్పవచ్చు. జన్మదినంలో ఉన్న అంకెలు, తేదీ, నెల, సంవత్సరంలోని అంకెలు మరియు ఫలానా సంవత్సరంలో జాతక ఫలాలు తెలుసుకోవాలంటే, ఆ సంవత్సరం ఆధారంగా, న్యూమరాలజీని అనుసరించి, జ్యోతిష్యం చెప్పగలుగుతున్నాం. దీని వలన, పుట్టిన తేదీ ప్రకారం పేరు, నాడీ జ్యోతిష్యం ప్రకారం ఎలా వస్తుందో, అదే విధంగా న్యూమరాలజీ ప్రకారం కూడా వస్తుంది.

వ్యక్తియొక్క జన్మదినానికి అనుగుణంగా పేరు కాకతాళీయంగా రావటం, వారి పేరులో బలం ఆధారంగానే జీవితంలో సంఘటనలు జరగటం చూసి, మనం పుట్టిన తేదీ, మన పేరు అనేది పూర్వజన్మలో చేసుకున్న కర్మల ఫలితంగానే వస్తుందని తెలుసుకోవచ్చు. అలాగే నాడీ జ్యోతిష్యంలో కూడా మనం పూర్వజన్మలో చేసిన కర్మల ఫలితంగానే, పుట్టిన తేదీ, పేరు వస్తాయని రూఢీ అవుతుంది. అందువలన నాడీ

జ్యోతిష్యంలో కూడా జాతకుడు ఫలానా ఊరిలో ఫలానా తల్లిదండ్రులకు ఫలానా పేరుతో జన్మించాడని చెబుతారు. న్యూమరాలజీలో పుట్టినతేదీకి అనుగుణంగా డేటాఫ్ బర్త్ వస్తుంది, నాడీ జ్యోతిష్యంలో కూడా ఏ పేరుతో పుడతాడో తెలుస్తుంది. అందువలన రెండింటిలోను పుట్టిన బిడ్డ యొక్క పేరు జన్మతేదీ అనుగుణంగా వస్తుంది కాబట్టి ఈ రెండు శాస్త్రాలకు అవినాభావ సంబంధం ఉన్నదని చెప్పవచ్చు.

దీని వెనుక అంతుపట్టని మానవాతీత శక్తి, నాడీ జ్యోతిష్యం, న్యూమరాలజీ లోని సంఖ్యలు, వాటికి సంబంధించిన అనుబంధ అంకెలలో ఉన్నది. దీనిని మన పూర్వీకులు, వారి వారసత్వంగా మనకు అందించారు. నాకు ఉన్న ఈ చిరు జీవితంలో దీని శాస్త్రీయతను సరళతరం చేసి ప్రజలకు అతీంద్రియ శక్తుల ప్రభావం తెలియచేయటానికి చేసిన ఈ చిరు ప్రయత్నాన్ని ఆదరిస్తారని ఆశిస్తున్నాను. దీనిలో ఇంకా లోతైన పరిశీలన ముందుతరాల వారు చేస్తారని ఆశిస్తున్నాను.

# న్యూమరాలజీ - టారో కార్డ్స్

**77 బొమ్మలు ఉన్న పేక ముక్కలు, అందులో ఉన్న బొమ్మల సాయంతో భవిష్యత్తు చెప్పే విధానమే టారో కార్డ్స్.**

**TAROT CARDS** (టారో కార్డ్స్) అనే విద్యలో జరుగబోయే విషయాలను పేకముక్కల వంటి టేరో కార్డు చూసి చెప్పటం జరుగుతుంది. టారో కార్డులో 77 పేకముక్కలు ఉంటాయి. ఈ పేక ముక్కలపై 77 బొమ్మలు ఉంటాయి. భవిష్యత్తు తెలుసుకోగోరే వ్యక్తి చేత ఈ పేకముక్కలలో నుండి ఒక కార్డు తీయించటం జరుగుతుంది. ఆ కార్డుపై ఉన్న బొమ్మను విశ్లేషించి, వ్యక్తి అడిగిన ప్రశ్నకు సమాధానం, జరుగబోయే ఫలితాల గురించి చెప్పటం జరుగుతుంది.

ఈ టారో కార్డులలో ఉన్న 77 బొమ్మలు, పైథాగరస్, ఈజిప్టు పిరమిడ్‌లో కనుగొన్న 108 బొమ్మలలో, ఆయన విశ్లేషించిన 77 బొమ్మల ఆధారంగా తయారు చేయబడినవి. న్యూమరాలజీలో ఈ కార్డుల ఫలితాలను జన్మసంఖ్య లేదా డెస్టినీ సంఖ్యను విశ్లేషించటానికి ఉపయోగిస్తారు. ఈ టారో కార్డులు, అందులోని 77 బొమ్మలను వ్యక్తుల సమస్యలకు అప్పటికప్పుడు తక్షణ ఫలితాలు చెప్పటానికి ఉపయోగిస్తారు.

అంటే న్యూమరాలజీలో పైథాగరస్ వాడిన 77 బొమ్మలను వీరు వేరొక పద్ధతిలో వాడతారన్న మాట. దీనిని బట్టి న్యూమరాలజీలో భవిష్యత్తు చెప్పటం, టారో కార్డుల ద్వారా ఫలితాలు చెప్పటం ఈ రెంటికి సారూప్యం ఉందని తెలుస్తుంది. కాబట్టి న్యూమరాలజీకి, టారో కార్డులకు అవినాభావ సంబంధం ఉంది. ఈ మధ్య కాలంలో ఈ టారో కార్డులలో అదనంగా ఒక కార్డు – 'ఓషో కార్డును చేర్చి' 78 కార్డులతో ఫలితాలు చెప్పటం జరుగుతోంది. కనుక ఈ టారో కార్డుల విధానం, న్యూమరాలజీలో జరగబోయే సంఘటనలను ముందే చెప్పడం ఒక విధానంగా భావించవచ్చు.

# న్యూమరాలజీ - సంతకం

**మన సంతకం మన అభివృద్ధికి దోహదం చేస్తుంది. కాబట్టి సరైన సంతకం చేయటం అలవాటు చేసుకుంటే, విజయానికి సహాయకారిగా ఉంటుంది.**

న్యూమరాలజీ ద్వారా వ్యక్తుల జన్మదినం, పేరు విశ్లేషించి ఆ వ్యక్తి తల్లిదండ్రులు, జీవిత భాగస్వామి, సంతానం, కుటుంబ పరిస్థితులు, మానసిక పరిస్థితి, విద్యా విషయాలు, ఆర్థిక స్థితి, భవిష్యత్తు మొదలైన విషయాలన్ని అంచనా వేయవచ్చు. న్యూమరాలజీలో ముఖ్యంగా జన్మదినం, డెస్టినీ నంబర్‌కు పేరు, పేరులోని సంఖ్యలు సఖ్యతగా (హార్మోనియస్) ఉన్నాయా లేదా అనే విషయం పరిశీలించి చూస్తారు. ఒకవేళ జన్మసంఖ్యకు అనుగుణంగా నామ సంఖ్య లేకపోతే, జన్మ సంఖ్యకు అనుగుణంగా పేరు ఉండేట్లు పేరులో కొన్ని అక్షరాలు మార్చటం కానీ లేదా పేరు మొత్తం మార్చటం గానీ జరుగుతుంది.

కానీ ప్రస్తుతం న్యూమరాలజిస్టులు తమ వద్దకు వచ్చే వ్యక్తుల జన్మసంఖ్యకు అనుగుణంగా పేరు మార్పును సూచించి పని అయిపోయినట్లుగా భావిస్తున్నారు. అది సరికాదు. న్యూమరాలజిస్టుకు గురుతర బాధ్యత ఇంకొకటి ఉంది. వ్యక్తి యొక్క సరైన పేరుకు లేదా మార్చబడిన పేరును బట్టి ఆ వ్యక్తి సంతకం సరిగా ఉందా లేదా అనే అంశం కూడా చూడాలి. వ్యక్తి సంతకాన్ని బట్టి కూడా ఆ వ్యక్తి మానసిక పరిస్థితి, ఎంచుకున్న రంగంలో రాణింపు తదితర అంశాలు తెలుస్తాయి.

చాలా మంది సంతకం తమ తల్లినో, తండ్రినో, ఇంట్లో పెద్దవారినో లేదా గురువునో చూసి అనుకరించి చేస్తుంటారు. దీనికి కారణం మన దేశంలో సంతకం విశ్లేషణ, చేతిరాత విశ్లేషణ, గ్రాఫాలజీ లాంటి నూతన పద్ధతులు ఎక్కువ ప్రాచుర్యంలో లేకపోవటమే! విదేశాలలో చాలామంది, నిపుణుల వద్దకు వెళ్లి చేతిరాతను, సంతకాన్ని వారికి ఉపయుక్తంగా మార్చుకోవటం జరుగుతుంది. దాని వలన వారు, వారి వారి రంగాలలో ఎంతో ఉన్నతిని, అభివృద్ధిని సాధించడం జరుగుతుందనేది సత్యం. అందువలన మన దేశంలో కూడా న్యూమరాలజిస్టులు, వారి దగ్గరికి వచ్చే వ్యక్తుల సంతకాలను, చేతిరాతను వారికి అనుగుణంగా మార్చటం అభిలషణీయం. దీని వలన ఆ వ్యక్తులలో

ఉన్న నెగిటివ్ గుణాలు పోయి, పాజిటివ్ గుణాలు వృద్ధి చెంది ప్రగతి సాధిస్తారు. నిరాశ, నిస్పృహలు వదిలించుకొని, నూతన ఉత్సాహంతో ముందుకు సాగుతారు.

అందువలన పాఠకులకు నా వినతి ఏమిటంటే న్యూమరాలజిస్టు వద్దకు వెళ్ళినప్పుడు వారి సంతకం, చేతిరాత, మార్పు గురించి కూడా తెలుసుకొని ఆ విధంగా చేస్తే వంద శాతం ఫలితాలు సాధిస్తారు. సంతకం, చేతిరాతల సవరణ కూడా న్యూమరాలజీలో ఒక భాగమే. సంతకం, చేతిరాతల గురించి తరువాత వచ్చే నా గ్రంథంలో చర్చించటం జరుగుతుంది.

# న్యూమరాలజీలో వివిధ పద్ధతులు

**పైథాగరస్ పద్ధతిని విదేశాల్లో (అమెరికా, యూరప్, ఆస్ట్రేలియా) ఎక్కువగా అనుసరిస్తారు. చాల్డియన్ పద్ధతిని ఆసియా దేశాల్లో ఎక్కువగా అనుసరిస్తారు.**

భావ ప్రకటనకు శబ్ద రూపమైన సాధనం భాష. తొలుత మానవులు వారి భావాలను శబ్ద రూపంలో తెలియచేసేవారు. ఈ శబ్దాలే భాషలుగా రూపాంతరం చెందాయి. శబ్దానికి మూలం ప్రణవనాదమైన ఓంకారం. ఈ ఓంకారం నుండే సమస్త శబ్దాలు, భాషలు ఉత్పన్నమయ్యాయి. కాబట్టి భాష దైవదత్తం. ప్రతి శబ్దానికి ప్రకంపనలు ఉంటాయి. ఈ ప్రకంపనలు కూడా వివిధ శబ్దాలకు, వివిధ పౌనఃపున్యాలు (ఫ్రీక్వెన్సీ) కలిగి ఉంటాయి. శబ్దం తరంగరూపంలో ఉంటుంది. ప్రథమంగా శబ్దం ఏర్పడింది. ఆ తరువాత శబ్దాలకు లిపి అనేది ఏర్పాటు చేయటం జరిగింది. శబ్దాలను అక్షర రూపంలో నిక్షిప్తం చేసారు. అక్షరం అంటే నాశనం లేనిది అని అర్థం. శబ్దానికి, భాషకు, అక్షరానికి నాశనం లేదు. ప్రతి అక్షరానికి ఉండే ప్రకంపనల పౌనఃపున్యానికి అనుగుణంగా వైబ్రేషన్స్ ఇవ్వటం జరిగింది.

అక్షరాల సముదాయం ప్రకంపనల సముదాయంగా ఉంటుంది. ఈ ప్రకంపనలు క్రమబద్ధంగా ఉంటే, అంటే అక్షరాలు క్రమబద్ధంగా ఉంటే, అది మంత్రంలా పనిచేస్తుంది. మంత్రశాస్త్రంలో ఒక యంత్రానికి ప్రతి మంత్రం ఉంటుంది. మంత్రం అక్షర రూపమైతే యంత్రం భౌతిక రూపం. భగవంతుని సృష్టిలో ప్రతి జీవికి ఒక యంత్ర రూపం ఉంటుంది. ఆ రూపానికి తగిన మంత్రం కలిగి ఉంటే, యంత్ర, మంత్రాలకు సఖ్యత కుదిరి, ఆ జీవి లేదా మనిషి శాంతిని, ఆనందాన్ని, సుఖాన్ని పొందుతారు. వ్యక్తి అనే యంత్రానికి ఆ వ్యక్తి పేరే మంత్రము.

అందువలనే న్యూమరాలజీలో నామ సంఖ్యకు ఎనలేని ప్రాధాన్యత ఉంది. సంఖ్యాశాస్త్రము చాలా పురాతనమైనది. కీస్తు పూర్వం నుండి ఈ శాస్త్రం ప్రాచుర్యంలో ఉంది. దివ్యజ్ఞానం కల గొప్పవ్యక్తులు, వారి వారి అనుభవాలను, దివ్యదృష్టిని క్రోడీకరించి ఈ శాస్త్రాన్ని రూపొందించారు. ఈ శాస్త్రంలో హిబ్రూ లేదా చాల్డియన్ పద్ధతి, పైథాగరస్ పద్ధతి అనేవి ప్రధానంగా ఉన్నాయి. హిబ్రూ జాతీయులు వారి వర్ణమాలలో ప్రతి అక్షరానికి సంఖ్యలను ఆపాదించారు. అది క్రమంగా రోమన్ / ఆంగ్ల వర్ణములకు

అనుగుణంగా ఆపాదించటం జరిగింది.

సంఖ్యాశాస్త్రంలో సంఖ్యలు గ్రహాలను, వాటి ప్రభావాన్ని తెలియచేస్తాయి. పేరు యొక్క నామసంఖ్య, ఆ పేరులో ఉన్న అక్షరాల మొత్తం, ఏ సంఖ్యగా వస్తుందో, దాని అనుగుణమైన గ్రహ సంఖ్య తెలుసుకోవడం ద్వారా, ఆపేరు గల వ్యక్తిపై ఆ గ్రహ ప్రభావం ఎలా ఉంటుందో సంఖ్యశాస్త్రం ప్రకారం తెలుసుకోవచ్చు. సంఖ్యలు ప్రధానంగా 9(గ్రహాల వలె) ఇపుడు సంఖ్యాశాస్త్రములో ఉన్న చాల్డియన్ / హిబ్రూ, కబాలా, పైథాగరస్ పద్ధతులు గురించి తెలుసుకుందాం.

ప్రఖ్యాత ఆంగ్ల జ్యోతిష సంఖ్యా శాస్త్రవేత్త కీరో (Chiero) చాల్డియన్ పద్ధతిని అనుసరించాడు. ఈ పద్ధతిలో వర్ణమాలలో అక్షరాలకు వివిధ సంఖ్యలు ఇవ్వటం జరిగింది. అదే పైథాగరస్ పద్ధతిలో వర్ణమాలలో అక్షరాలకు వరుసగా సంఖ్యలు ఇవ్వటం జరిగింది. A,B,C,D ...లకు 1, 2, 3, 4 ... విధంగా, కానీ ఈ పద్ధతిని చాలా మంది న్యూమరాలజిస్ట్లు అనుసరించరు.

ఈ రచయిత అభిప్రాయం ప్రకారం వీరి నమ్మకం అర్థం లేనిది, హేతుబద్ధం కానిది. ఎందుకంటే భాష అనేది దైవదత్తం. వర్ణమాలలో అక్షరాలు A,B,C,D.... అనే క్రమంలో ఎందుకున్నాయి. A, K, R, U, V.... లా ఎందుకు లేవు ? అంటే A, B, C, D అనే క్రమం సక్రమమైనది కాబట్టే, ఆ విధంగా వర్ణమాల ఉంది. ఈ సక్రమమైన A, B, C, D.. వర్ణమాలకు, సక్రమమైన 1, 2, 3, 4.. అని సంఖ్యలు వరుసగా పైథాగరస్ ఇవ్వటంలో తప్పులేదని ఈ గ్రంథ రచయిత అభిప్రాయం. ఇపుడు సంఖ్యాశాస్త్రంలోని రకాల గురించి తెలుసుకుందాం.

**కబాలా / హిబ్రూ పద్ధతి / కీరో పద్ధతి**

కబాలా అనగా హిబ్రూ భాషలో దేవుని నుండి గ్రహించినది అని అర్థం. బాబిలోనియాలో నివసించిన హెబ్రస్ అనే తెగవారు, వారి భాషయైన హెబ్రాలో ప్రతి అక్షరానికి ఒక ప్రకంపన ఉన్నట్టు ప్రథమంగా గుర్తించారు. ఈ అక్షరాల ప్రకంపనాలు వారికి దైవీకంగా తెలిసినట్లు వారు ప్రకటించారు. అందువల్ల ఈ పద్ధతిలో, అక్షరాలకు సంఖ్యలను ఆపాదించటం అనే విధానాన్ని కబాలా విధానం అన్నారు. ఇది దైవదత్తమైనది చెప్పటం జరిగింది. హెబ్రూస్ మొట్టమొదటగా ప్రపంచానికి తెలియజేయటం వలన ఈ పద్ధతిని హిబ్రా పద్ధతి అని అంటారు. ఈ పద్ధతి ఆ కాలంలో బాగా ప్రాచుర్యం పొందింది.

వ్యక్తుల యొక్క పేరులో అక్షరాల ప్రకంపనలు, వ్యతిరేకంగా ఉన్నపుడు, ఆ వ్యక్తుల యొక్క పేరు లేదా అందులోని అక్షరాలు మార్చటం ద్వారా, దాని ప్రకంపనలు, అనుకూల ప్రకంపనలుగా మార్చవచ్చని గుర్తించటం జరిగింది. ఈ హిబ్రూ భాష నుండే ఆంగ్ల వర్ణమాల ఉత్పన్నమయింది. ఈ హిబ్రూ భాషలో ఉన్న అక్షరాల ప్రకంపనాలకు అనుగుణంగా ఆంగ్ల వర్ణమాలకు ఆపాదించటం జరిగింది.

ఉదాహరణకు పవిత్ర గ్రంథమైన బైబిల్‌లో (17.3 జెనిసిస్) అబ్బరం(Abram), దైవాన్ని సంతానం కావాలని కోరితే, పరమపిత, అబ్బరం(Abram) పేరును మార్పు చేసినట్లయితే సంతానం కలుగుతుందని సందేశం ఇవ్వటం, దానికి అనుగుణంగా అబ్బరం(Abram) లోని పేరులో 'H' అనే అక్షరాన్ని కలుపుకొని (Abraham) అబ్రహంగా, పేరు మార్పు చేసుకొని సంతానం పొందటం జరిగింది. 17.6లో Sara పేరులో 'H' చేర్చి Sarah గా మార్చిన తరువాత, సంతానం కలగటం జరిగింది. ఈ విధంగా పవిత్ర గ్రంథం బైబిల్ నర్మగర్భంగా, న్యూమరాలజీకి ఉన్న అద్భుత శక్తిని ప్రకటించటం జరిగింది. దీని ద్వారా పేరులో ఉన్న అక్షరాలను మనకు అనుగుణంగా మార్చుకోవటం వలన అద్భుతమైన ఫలితాలు పొందవచ్చని తెలుస్తోంది.

అలాగే వేరొక సందర్భంలో జాకబ్ తనకు మంచి జ్ఞానాన్ని ప్రసాదించమని కోరితే పరమపిత, ఆయన్ను పేరు మార్పు చేయమని సందేశం ఇవ్వటం, ఆ ప్రకారంగా జాకబ్ తన పేరును ఇజ్రాయిల్‌గా మార్చుకొని దైవజ్ఞానాన్ని పొంది, గొప్ప ప్రవక్తగా మారటం మనకు పవిత్ర గ్రంథం బైబిల్ ద్వారా తెలుస్తుంది. ఈ విధంగా న్యూమరాలజీ ద్వారా, పేరులోని అక్షరాలను మార్చటం లేదా మొత్తం పేరును మార్చటం ద్వారా, దైవ శక్తి వలన అద్భుత ఫలితాలు వస్తాయని తెలుస్తుంది.

హిబ్రూ భాషలో అక్షరాలకు ఉన్న ప్రకంపనలను, తరువాత తరాలలో వచ్చిన న్యూమరాలజిస్టులు (ఉదా: Saphrial, German మొదలగువారు) రోమన్ / ఆంగ్ల వర్ణమాలలోని అక్షరాలకు ఆపాదించి ప్రాచుర్యంలోనికి తీసుకొచ్చారు. 19వ శతాబ్దంలో నివసించిన ఆంగ్ల, జ్యోతిష్య సంఖ్యా శాస్త్రవేత్త, కీరో న్యూమరాలజీని భారతదేశంలో జైన గురువుల వద్ద అభ్యసించినట్లు అతడు హిబ్రూ పద్ధతిని బాగా ప్రచారంలోనికి తీసుకొని రావటం వలన, దానికి హిబ్రూ పద్ధతి లేదా కీరో పద్ధతి అని పేరు వచ్చినట్లు తెలుస్తుంది. కీరో పద్ధతి ప్రకారం, అక్షరాలకున్న ప్రకంపనాలు ఈ విధంగా ఉంటాయి.

| | |
|---|---|
| A, I, J, Q, Y = 1 | B, K, R = 2 |
| C, G, L, S = 3 | D, M, T = 4 |
| E, H, N, X = 5 | U, V, W = 6 |
| O, Z = 7 | F, P = 8 |

దీనిలో ఏ అక్షరానికి '9' అంకె ఇవ్వలేదు. హెబ్రూస్ 9 అంకెను దేవుని సంఖ్యగా గుర్తించారు. గణితపరంగా చూసినా, 9 సంఖ్య వేరే ఏ ఏక సంఖ్యకు కలిపినా, ఆ వచ్చే ఏక మొత్తం మరలా అదే సంఖ్య అవుతుంది. ఉదా : 5+9 = 14 = 1+4=5. అందువలన ఈ 9 సంఖ్యను వదిలివేయటం జరిగిందని ఈ గ్రంధ రచయిత అభిప్రాయం.

ఈ పద్ధతినే ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాలలో వాడుతున్నారు. ప్రధానంగా కీరో దీనిని ప్రచారంలోకి తీసుకొని రావటం వలన ఈ పద్ధతిని కీరో పద్ధతి అంటారు. మనదేశంలో ఈ పద్ధతినే అందరూ ఉపయోగిస్తున్నారు. కాని ఈ గ్రంథ రచయిత అభిప్రాయం ప్రకారం, ఇంతకు ముందు చెప్పినట్లే, కీరో పద్ధతితో పాటు, పైథాగరస్ పద్ధతిని కూడా పాటించటం మంచిది.

## పైథాగరస్ పద్ధతి

**పైథాగరస్ న్యూమరాలజిస్ట్ మాత్రమే కాదు.**
**రేఖా గణితంలో పైథాగరస్ సిద్ధాంతం కనిపెట్టింది ఈయనే!**

న్యూమరాలజీ గురించి మాట్లాడినపుడు పైథాగరస్ గురించి ప్రస్తావించకుండా ఉండటం, ఆ మహానుభావుడికి శ్రద్ధాంజలి ఘటించకపోవటం అసాధ్యమైనది. చారిత్రక ఆధారాలను అనుసరించి పైథాగరస్ తల్లిదండ్రులైన Mnesarchus, Parthenis వారి వ్యాపార ప్రయాణంలో Delphi దేశం సందర్శించిన కాలంలో, అక్కడ ప్రవక్తలు, పైథాగరస్ తల్లి గర్భవతి అని ఆమెకు స్ఫురద్రూపి, జ్ఞాని అయిన పుత్రుడు జన్మిస్తాడని, అతడు ప్రపంచాన్ని, మానవజాతిని, తన జ్ఞాన సంపదతో ఉద్ధరిస్తాడని భవిష్యత్తు చెప్పటం జరిగింది. వారి తిరుగు ప్రయాణంలో పైథాగరస్ సిరియా దేశంలో జన్మించటం జరిగింది. (క్రీ.పూ.582) పైథాగరస్ అనే పేరు, భవిష్యత్తు చెప్పిన ఆ ప్రవక్త పైథాసిస్ గౌరవార్థం పెట్టడం జరిగింది.

బాల్యం, యవ్వనంలో పైథాగరస్ Melchizedek ఆలయంలో విద్యాభ్యాసం చేసి "దైవపుత్రుని"గా పేరుగాంచాడు. పైథాగరస్ దీర్ఘకాలం జీవించినా, ముదుసలిగా కాకుండా యవ్వనంగా, బలంగా, శక్తివంతంగా కనిపించే వాడు. ప్రాథమిక విద్య అనంతరం అతడు తన స్వస్థలం Samos విడిచిపెట్టి 30 ఏళ్ళ పాటు ప్రపంచంలోని అనేక దేశాలు సందర్శించి, అనేక మంది గురువుల వద్ద విద్యను అభ్యసించాడు. గ్రీకు తత్వజ్ఞానుల నుంచి చాలా విషయాలు గ్రహించాడు. బాబిలోనియన్, చాల్దియన్ పద్ధతుల రహస్య దివ్యజ్ఞానాన్ని పొందాడు. జోరాస్టర్‌తో కలిసి విద్యను అభ్యసించాడని తెలుస్తుంది.

పైథాగరస్ తన విద్యార్థిని అయిన Theano ను 60 సంవత్సరాల వయసులో వివాహం చేసుకున్నాడు. వారికి ఏడుగురు సంతానం కూడా కలిగారు. ఈతని మరణం గురించి విభిన్న కథనాలు ఉన్నాయి. ఎక్కువ మంది విశ్వసించే కారణాన్ని బట్టి – చెడు ప్రవర్తన కలిగిన ఒక వ్యక్తికి, విద్యాలయంలో చోటు ఇవ్వకపోవటం వలన, అతడు కొందరు దుండగులతో కలిసి చేసిన దాడిలో పైథాగరస్ మరణించాడని తెలుస్తుంది. ప్రపంచ దేశాల పర్యటనలో భాగంగా పైథాగరస్ ఈజిప్ట్ దేశంలోని పురాతన కట్టడాలయిన "పిరమిడ్స్"ను సందర్శించటం జరిగింది. వాటిలో న్యూమరాలజీని 108 బొమ్మల రూపంలో చెక్కారని, ఒక్కొక్క సంఖ్య యొక్క అర్థాన్ని బొమ్మల రూపంలో ఉంచారని గ్రహించి, తనకున్న అతి తక్కువ సమయంలో 108లో, 77 బొమ్మలకు అనగా 77 సంఖ్యల వరకు మాత్రమే విశ్లేషించగలిగి వాటిని తన విద్యాలయంలో విద్యార్థులకు బోధించినట్లు చారిత్రక ఆధారాల వలన తెలుస్తుంది.

పైథాగరస్, ప్రతి అక్షరానికి ఒక ప్రకంపన ఉన్నట్లు, ఇది హెబ్రూ పద్ధతిలో అక్షరాలకున్న ప్రకంపనలకు కొంచెం భిన్నంగా ఉన్నట్లు గమనించాడు. అందువలన పైథాగరస్ అక్షరాలకు సంఖ్యలను ఈ క్రింది విధంగా ఇచ్చాడు.

| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 |
|---|---|---|---|---|---|---|---|---|
| A | B | C | D | E | F | G | H | I |
| J | K | L | M | N | O | P | Q | R |
| S | T | U | V | W | X | Y | Z | |

దీనిని అమెరికా, ఆస్ట్రేలియా లాంటి దేశాలలో, మొత్తం ప్రపంచంలో 75% దేశాలలో ఉపయోగిస్తున్నారు. కొందరు ఇది సరియైన పద్ధతి కాదని వాదిస్తారు. ముఖ్యంగా ఇంగ్లాండ్, ఇండియా, చైనా వంటి దేశాలలో హెబ్రూ / కబాలా/ కీరో పద్ధతి వాడతారు.

పైథాగరస్ ఆంగ్ల వర్ణమాలకు వరుస క్రమంలో సంఖ్యలు ఇవ్వటం సరియైన పద్ధతి కాదని వీరి వాదన. కానీ ఈ గ్రంథ రచయిత అభిప్రాయం ప్రకారం, భగవంతుడు, అక్షరాలను, వాటి క్రమాన్ని, వాటి యొక్క ప్రకంపనలకు అనుగుణంగా సృష్టించాడు. అందువలన పైథాగరస్ పద్ధతి చాలా ప్రభావవంతంగా పని చేస్తుందని గుర్తించటం జరిగింది. కొందరు న్యూమరాలజిస్టులు ఈ పద్ధతిని “ఆధునిక సంఖ్యాశాస్త్రం” గా అభివర్ణించటం జరిగింది. ఏదీ ఏమయినప్పటికీ వాదనలు, ప్రతివాదనలు ఎలా ఉన్నా పైథాగరస్ పద్ధతితో పాటు, కబాలా పద్ధతిలో కూడా పేర్లను విశ్లేషించి చూడటం మంచిది.

పైథాగరస్ భారతదేశం సందర్శించి, చాలా సంవత్సరాల పాటు హిందూ గురువుల వద్ద విద్యాభ్యాసం చేసినట్లు తెలుస్తుంది. ఆ సమయంలో అతడు 'యవనాచార్య' గా సంబోధించబడ్డాడని. "Y" అక్షరం పై అతనికున్న అభిమానమే ఈ పేరుకు నిదర్శనం.

క్రీ.పూ. 526 లో తన 56వ ఏట ఇటలీలో ఉన్న, గ్రీకు మాట్లాడే ప్రాంతమైన Crotona కు వెళ్ళి, అక్కడ ఒక విద్యాలయం స్థాపించాడు. అందులో మత సంబంధిత కర్మకాండలు, శాస్త్రీయ దృక్కోణంలో బోధించేవారు. చరిత్ర ఆధారంగా Western Countries లో ఇదే మొట్టమొదటి విశ్వవిద్యాలయం అనుకోవచ్చు. ఈ విశ్వవిద్యాలయంలో ఎన్నిక చేయబడిన కొంతమందికి మాత్రం, సంఖ్యాప్రకంపనల రహస్యాలు, పైథాగరస్ స్వయంగా బోధించటం జరిగేది. ఈ బోధన మౌఖికంగా ఉండేది. లిఖితరూపం లేదు వేదాధ్యయనం వలె. ఈ విధంగా పైథాగరస్ తన జ్ఞానాన్ని వేదంలా, మౌఖికంగా తన శిష్య పరంపరకు అందచేయటం జరిగింది. కొందరు శిష్యులు మాత్రం కొన్నింటిని గ్రంథస్తం చేయటం జరిగింది.

ఈ విద్యాలయంలో చాలా కఠిన నిబంధనలు ఉండేవి. ఎన్నో పరీక్షలలో ఉత్తీర్ణులయిన వారికే పైథాగరస్ ప్రత్యక్ష దర్శనం జరిగేది. 7 జన్మసంఖ్య గల వారికి ఈ విశ్వవిద్యాలయంలో నేరుగా ప్రవేశం లభించేది. పైథాగరస్ అభిప్రాయం ప్రకారం ఈ సంఖ్య కలవారు. ఆధ్యాత్మిక, దివ్యజ్ఞానం పొందగలుగుతారు. విద్యాలయంలో చేరిన వారు మొదట 5 సంవత్సరాలు మౌనం పాటించాలి. నాలుకను అదుపులో ఉంచుకోవటమే దీని లక్ష్యం. మౌనంగా ఉండి ఇతరులను ఆకర్షించటం వివేకానికి చిహ్నం అనేది పైథాగరస్ సిద్ధాంతం. జ్ఞానం అన్నింటి కంటే గొప్పది. ఈ జ్ఞానమే మనిషికి, మృగానికి ఉన్న తేడా అని పైథాగరస్ బోధించేవాడు.

# ౨వ భాగం

# సంఖ్యలతో సంబంధం

# జన్మదిన సంఖ్యలు

**జన్మదిన సంఖ్యను ప్రత్యేకంగా లెక్కకట్టాల్సిన అవసరం లేదు. అది మీరు ఏ నెలలో జన్మించారో ఆ నెలలో మీరు పుట్టినరోజు. అదే మీ జన్మ సంఖ్య. 1 నుండి 31వ తేదీ వరకు ఏ నెలలో జన్మించినా, ఆ తేదీ ప్రభావం వ్యక్తులపై ఏ విధంగా ఉంటుందో తెలుసుకోవచ్చు.**

మన జీవితంలో జన్మదినం ఎంతో విశిష్టత కలిగి ఉంది. వ్యక్తి యొక్క జన్మదినం చూసి ఆ వ్యక్తి గుణగణాలు, నైజం, భవిష్యత్తు, కుటుంబ పరిస్థితులు, శరీరాకృతి, ఏ విద్యలో రాణిస్తారు, కుటుంబ సభ్యులతో సంబంధబాంధవ్యాలు, ఆహారపు అలవాట్లు తోటి సమాజంలోని వారితో సంబంధాలు ఏ రంగంలో రాణిస్తారు మొదలైన విషయాలు జన్మ సంఖ్యతో ఖచ్చితంగా అంచనా వేయవచ్చు.

ప్రతిఒక్కరికీ జన్మదినం ఉంటుంది. ఈ జన్మదినాన్ని తేదీ, నెల, సంవత్సర రూపంలో మనం తెలియచేస్తాం. ఇపుడు మనం తెలుసుకోబోయేది జన్మసంఖ్య గురించి. అంటే పుట్టిన తేదీ గురించి. మనకున్న కాలమానం ప్రకారం, మనకు గరిష్టంగా 31 తేదీలు ఉన్నాయి. 1 నుండి 31 తేదీల వరకు జన్మించిన వారి విశిష్టతలను తెలుసుకుందాం.

జన్మ సంఖ్య అనేది ఏక సంఖ్యలోను, ద్విసంఖ్యలోనూ ఉంటుంది. ఉదాహరణకు ఒక వ్యక్తి 14వ తేదీన జన్మిస్తే అతని జన్మసంఖ్య 1+4 = 5 అవుతుంది. కానీ ఇందులో రెండు సంఖ్యలున్నాయి. అవి 1,4 మొత్తం 5. ఈ జన్మ సంఖ్య 5 ఆ వ్యక్తి యొక్క గుణగణాలను తెలియచేస్తుంది. అలాగే 1,4, సంఖ్యలు కూడా ఆ వ్యక్తిలో దాగున్న, అంతర్లీనంగా ఉన్న మరికొన్ని ప్రత్యేక గుణాలను తెలియచేస్తాయి. ఎలా అంటే, జన్మదినం 14 ఉన్న వ్యక్తి, జన్మదినం 23 ఉన్న వ్యక్తి, ఇద్దరి జన్మ సంఖ్య–5, కానీ ఇరువురి లక్షణాలు ఒకేలా ఉండవు. కారణం జన్మదినంలోని సంఖ్యల మార్పు, జన్మ సంఖ్య 5 ఇద్దరిపై ఒకే రకం ప్రభావం చూపించినా, 1, 4, 2, 3 సంఖ్యలు ఆయా వ్యక్తులపై విభిన్న ప్రభావాలు చూపిస్తాయి. దాని వలన వ్యక్తుల లక్షణాలు కూడా విభిన్నంగా ఉంటాయి. ఇపుడు 1 నుండి 31 వరకు జన్మదినాలు కలవారి జన్మసంఖ్యల గురించి తెలుసుకుందాం.

## జన్మదినం-1

**వీరికి నాయకత్వ లక్షణాలు ఉంటాయి. ఒకరికి తలవంచరు. వీరికి బద్ధకం ఎక్కువ.**

వీరు నాయకత్వ లక్షణం కలిగి ఉంటారు. స్వతంత్ర భావాలు కలిగి ఉంటారు. పనిచేసేటప్పుడు ఎటువంటి షరతులను, నిబంధనలను వీరు ఒప్పుకోరు. ఇతరులతో కలిసి పనిచేయుట కంటే స్వంతంగా పనిచేయటానికి మొగ్గుచూపుతారు. ఎప్పుడూ ఉండే రొటీన్ పని కన్నా వినూత్నత్వాన్ని కోరుకుంటారు. మంచి తెలివితేటలు కలిగి, గంభీరమైన రూపంతో గొప్ప ఆత్మవిశ్వాసం, మంచి సృజనాత్మకత కలిగి ఉంటారు. వ్యాపార వ్యవహారాలలో మంచి బుద్ధి కుశలత కలిగి పెద్ద వ్యాపారాలు నడపగలిగే శక్తి కలిగి ఉంటారు. ఒకరికి తలవంచరు.

తెలిసిన సమాచారం, జ్ఞానం, వీలైనంత వరకు ఉపయోగకరంగా ఉండాలని భావిస్తారు. పనికిరాని సమాచారం, జ్ఞానం ఇష్టపడరు. ఇతరుల ఉద్దేశాలు, భావాలు తెలుసుకున్నా, వీరికి నిర్దిష్ట ఉద్దేశాలుంటాయి. ఒకసారి నిర్ణయం తీసుకుంటే మారరు. ఆ విషయంలో మొండిగా ఉంటారు. ఏదైనా పని వీరు అనుకున్నంత తొందరగా జరుగకపోతే కోపగించుకుంటారు.

కళల పట్ల ఆసక్తి కలిగి ఉంటారు. ప్రేమాభిమానాలకు విలువనిస్తారు. సమాజంలో మంచి గుర్తింపు పొందుతారు. వీరికి కంటికి, చర్మానికి సంబంధించిన రుగ్మతలు ఉంటాయి. కళ్ళజోడు వాడవలసి వస్తుంది. వీరు ప్రతిరోజు ఉదయాన్నే సూర్యరశ్మిలో 10, 15 నిమిషాలు నిలబడడం, సూర్యారాధన చేయటం మంచిది.

## జన్మదినం-2

**వీరు సున్నిత మనస్కులు. ఎమోషనల్‌గా ఉంటారు. ఎవరినీ గాయపరచరు.**

వీరు చాలా సున్నిత మనస్కులు. అసాధారణ స్ఫురణ(ఇంట్యూషన్) కలిగి ఉంటారు. చుట్టుపక్కల వాతావరణానికి ప్రభావితం అవుతారు. సౌందర్య ఆరాధకులు. సున్నిత మనస్కులు, ఎమోషనల్‌గా ఉంటారు. చిన్న సంఘటనను కూడా వీరు మనసులో తీసుకొని

ఎక్కువగా ఆలోచిస్తారు. ఒక్కొక్కసారి దిగులు, మనోవ్యాకులత కలిగి ఆత్మవిశ్వాసం కోల్పోయే అవకాశం ఉంది. ఎదుటి వారి మనసులో ఏముందో వెంటనే గ్రహించి దానికి అనుగుణంగా ప్రవర్తిస్తారు. ఎవరినీ గాయపరచటానికి ఇష్టపడరు.

ఎదుటి వ్యక్తుల నుండి ప్రేమాభిమానాలు కోరుకుంటారు. అలాగే ఎదుటి వారిని వాత్సల్యంతో చూస్తారు. వీరు మంచి మధ్యవర్తిత్వం చేయగల నేర్పు కలిగి ఉంటారు. అందరికీ సహకారం అందిస్తూ, భాగస్వామ్యంలో పనులు చేయటానికి వీలుగా ఉంటారు. ఒక్కొక్కసారి పసిపిల్లల్లా ప్రవర్తిస్తారు. మంచి వాదనాపటిమ కలిగి ఉంటారు.

అహింసా విధానాన్ని నమ్ముతారు. వీరు అధినేతలుగా ఉండే కంటే, నేతలను తయారు చేసే వాళ్ళుగా ఉంటారు. గొప్ప రచయితలు, కవులు, రాజనీతిజ్ఞులు, నటులు, సంగీత కళాకారులు ఈ జన్మదినం కలవారే. బయట తిరిగే ఉద్యోగం కన్నా ఒకచోట కూర్చొని చేసే పనులను కోరుకుంటారు. మనసు చంచలంగా ఉంటుంది. దీని నివారణకు వీరు చంద్రకాంతిలో రోజు 30 నుంచి 40 నిమిషాల పాటు ఉండడం మంచిది. వీరిని 'తిక్క మనుషులు' అని అనుకునే అవకాశం ఉంది.

## జన్మదినం-3

**వీరు సృజనాత్మకత, కళాత్మకత కలిగి ఉంటారు. పరోపకార బుద్ధి కలిగి ఉంటారు.**

వీరు గొప్ప సృజనాత్మకత, కళాత్మక హృదయం కలిగి ఉంటారు. సంగీతం, నాట్యం వంటి లలిత కళలపై ఆసక్తి, పరోపకార బుద్ధి, మంచి మాటకారితనం కలిగి ఉంటారు. రచనలు, దృశ్య చిత్రీకరణలో మంచి ప్రావీణ్యం కలిగి ఉంటారు. మంచి ఊహాశక్తి, దైవకృప కలిగి ఉంటారు. వీరిని చాలా మంది స్ఫూర్తిగా తీసుకుంటారు. జీవిత ద్వితీయార్ధంలో మంచి పేరు ప్రఖ్యాతులు గడిస్తారు. జనాకర్షణ శక్తి కలిగి ఉంటారు.

ఒడిదుడుకులు ఎదురైనపుడు మూడీగా ఉంటారు. మంచి కళాత్మక దృష్టి కలిగి అందమైన దుస్తులు ధరించి, ఇంటిని అందంగా అలంకరించుకుంటారు. పూలతోటల పట్ల ఆసక్తి కలిగి ఉంటారు. అనవసరమైన శ్రమ చేయరు. మంచి శరీర దారుఢ్యం కలిగి ఉంటారు.

విజ్ఞాన శాస్త్రం, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ఇంజనీరింగ్, కంప్యూటర్ రంగాలలో అభివృద్ధి సాధించి ఉన్నత స్థితిని పొందుతారు. పెద్దల, గురువుల పట్ల అభిమానం ఉంటుంది. వీరు మాట్లాడుతుంటే ఇంకా వినాలనిపిస్తుంది. తొందరగా ఐశ్వర్యవంతులు కావాలనే కోరిక బలంగా ఉంటుంది. అందరిచేత గౌరవించబడతారు. వీరు దక్షిణామూర్తిని ఆరాధించటం మంచిది.

## జన్మదినం – 4

**వీరు కష్టపడి పనిచేసే గుణం, వివేకం కలిగి ఉంటారు. వీరికి శీఘ్రకోపం ఉంటుంది.**

వీరు కష్టపడి పని చేసే తత్వం కలిగి మంచి వివేకం కలిగి ఉంటారు. చేసే పనిపట్ల ఎంతో శ్రద్ధ కనబరుస్తారు. నియమబద్ధత, క్రమశిక్షణ, బాధ్యతతో మెలుగుతారు. నైతిక విలువలు కలిగి ఉంటారు. మంచి వాక్పటిమ, ఆత్మవిశ్వాసం కలిగి ఉంటారు. వీరు జన్మించిన తరువాత వారి కుటుంబం అభివృద్ధిలోకి వస్తుంది. వీరికి స్వాభిమానం ఉంటుంది కాని, అహంకారం, మొండితనం ఉండవు. వీరికి కోపం త్వరగా వచ్చి పోతుంది. కుటుంబాన్ని ఎంతగానో ప్రేమిస్తారు.

వీరికి భావావేశం ఎక్కువ ఉండదు. తమ ప్రేమను బయటకు ఎక్కువగా ప్రదర్శించరు. జీవిత లక్ష్యాన్ని తెలుసుకుని దానికి అనుగుణంగా నడుచుకుంటారు. మంచి తార్కికబుద్ధి కలిగి ఉంటారు. జీవితంలో ఉన్నతికోసం బాగా శ్రమ చేస్తారు. బంధువులు, తోటివారు వీరిపై ఆధారపడి ఉంటారు. నెమ్మదిగా, ఓర్పుతో, దృఢంగా, కార్యనిర్వహణ చేస్తారు. పనిచేసేటపుడు మరీ కఠినంగా కాకుండా, కొంచెం సడలింపు ధోరణి అవలంబిస్తే మంచిది. శక్తికి మించిన శ్రమ చేయకుండా ఉంటే మంచిది.

జీవితంలో నెమ్మదిగా ఉన్నతిని సాధిస్తూ, వయసు పెరిగిన కొలదీ పేరు ప్రఖ్యాతులు, సంపద గడిస్తారు. కోపం తగ్గించుకుంటే ఫలితం బాగుంటుంది. కొత్త టెక్నాలజీలో బాగా రాణిస్తారు. కంప్యూటర్ ఇంజనీరింగ్‌లో కాని కామర్స్‌లో గాని బాగా రాణిస్తారు. ఎం.బి.ఎ, ఎల్.ఎల్.బి కోర్సులు చేస్తారు. వీరు దుర్గామాతను ఆరాధించటం, అనాథలను ఆదుకోవటం వలన ఉన్నత స్థితి పొందుతారు.

## జన్మదినం - 5

**వీరికి తెలివితేటలు, సమయస్ఫూర్తి ఉంటుంది. ప్రయాణాలు అంటే ఇష్టం.**

వీరు చాలా తెలివితేటలు, సమయస్ఫూర్తి కలిగి ఉంటారు. జీవితంలో మార్పు, నూతనత్వం ఎపుడూ కోరుకుంటారు. ప్రయాణాలంటే వీరికి ఇష్టం. సర్దుకుపోయే గుణం కలిగి ఉంటారు. కళల పట్ల ఆసక్తి కలిగి ఉంటారు. రచనలు, ప్రజా సంబంధాలలో నైపుణ్యం కలిగి ఉంటారు. మంచి ఆధ్యాత్మికత కలిగి ఉంటారు. దేవునిపై, మత గ్రంథాలపై విశ్వాసం, ఆకర్షణీయమైన రూపం కలిగి ఉంటారు. అనవసర నిబంధనలు లేకుండా అందరినీ కలుపుకుపోయి చక్కగా పని చేయగలుగుతారు.

ఆఫీసులో ఒక దగ్గర కూర్చుని పనిచేసే కంటే బయట తిరిగి పని చేయటాన్ని వీరు ఎక్కువగా కోరుకుంటారు. వీరికి తొందరగా 'బోర్' కొడుతుంది. వీరు ఒక్కొక్కసారి బాధ్యతా రహితంగా ఉంటారు. క్రమశిక్షణ అలవరుచుకుంటే మంచిది. వీరు మంచి తార్కిక విశ్లేషణాత్మక బుద్ధి కలిగి ఉంటారు. ఒక్కొక్కసారి అధిక ఆత్మవిశ్వాసం కలిగి తలపొగరుగా కూడా ఉండవచ్చు.

స్నేహితుల సహకారంతో ఉన్నతిని సాధించి సంపద, కీర్తి పొందుతారు. కొంతమంది రుచికరమైన భోజనం, శృంగారం పట్ల ఆకర్షితులవుతారు. ఆహార నియమాలు పాటిస్తే మంచిది. కమ్యూనికేషన్ మరియు కంప్యూటర్ రంగాలలో బాగా రాణిస్తారు. వీరు పి.ఆర్.ఓ లుగా కాని, రిప్రెజెంటేటివ్‌గా కాని, ప్రజాసంబంధాలలో, మధ్యవర్తులుగా, బ్రోకర్లుగా బాగా రాణిస్తారు. వీరు శారీరకంగా కష్టపడటం కన్నా మేధాశక్తితో చేసే పనుల్లో ఆసక్తి చూపిస్తారు. జీవితంలో క్రమేపి ఉన్నత స్థితికి వస్తారు.

## జన్మదినం - 6

**వీరు అందంగా ఉంటారు. కుటుంబాన్ని ప్రేమిస్తారు. మధ్యవర్తిత్వం చేయగలరు.**

వీరు చాలా అందంగా ఉంటారు. కుటుంబ జీవితాన్ని ప్రేమిస్తారు. నీతి నిజాయితీ కలిగి ఉంటారు. మంచి కల్పనాశక్తి కలిగి, దీర్ఘాలోచన చేస్తారు. కళాత్మక హృదయం కలిగి ఉంటారు. మధ్యవర్తిత్వం చేయటంలో మంచి ప్రావీణ్యం కలిగి ఉంటారు. కళలు,

సౌందర్యం పట్ల ఆసక్తి కలిగి ఉంటారు. బాధ్యతాయుతంగా ఉండి, పొందిన మేలుకు బదులు తీర్చుకునే గుణం కలవారు. వీరికి వ్యాధులు నయం చేసే శక్తి ఉంటుంది. అందువలన డాక్టర్లుగా రాణించగలుగుతారు. మంచికృషి చేసి ధన సంపాదన చేస్తారు.

ఆనందంగా, స్వేచ్ఛగా జీవించటానికి మొగ్గు చూపుతారు. ఒకరి కింద వెట్టిచాకిరీ నచ్చరు. ప్రశాంత వదనం కలిగి మంచి శరీర సౌష్టవం కలిగి ఉంటారు. స్త్రీలకు పురుషుల ద్వారా, పురుషులకు స్త్రీల ద్వారా లబ్ధి చేకూరుతుంది. కానీ పొగడ్తలకు లొంగిపోతారు. ఇతరులకు సాయం చేసేటపుడు సుఖాన్ని కూడా త్యాగం చేస్తారు. దాన, దయాగుణాలు కలిగి అర్థం చేసుకునే తత్వం కలిగి ఉంటారు. వీరు మీడియా రంగాల్లో ఎక్కువగా రాణించే అవకాశం ఉంది.

## జన్మదినం – 7

**వీరు దైవభక్తి కలిగి శాంతిని కోరుకుంటారు. సినిమా రంగాల్లో రాణిస్తారు.**

వీరు మంచిబుద్ధి వికాసం, దైవభక్తి కలిగి ఉంటారు. శాంతియుత జీవనాన్ని కోరుకుంటారు. ఆధ్యాత్మిక, తాత్విక భావనలు కలిగి ఉంటారు. అసాధారణ స్ఫురణ (ఇంట్యూషన్) కలిగి ఉంటారు. వీరి చేతిలో సంజీవనియోగం ఉంటుంది. మంచి విశ్లేషణాత్మకత, తార్కిక బుద్ధి కలిగి ఉంటారు. రచనలు, చిత్రలేఖనం, సినిమా రంగాలలో రాణించగలుగుతారు. ఒకసారి ప్రారంభించిన పనిని మధ్యలో ఆపటానికి ఇష్టపడరు. సున్నిత స్వభావం కలిగి ఉన్న వీరు తమ భావాలను ఇతరులకు తొందరగా తెలియనీయరు. నిష్కల్మషమైన మనస్తత్వం కలిగి ఉంటారు.

కుటుంబ జీవితంలో కలతలు వచ్చినా చెప్పుకోదగ్గ ప్రమాదకరంగా ఉండవు. ఇతరుల విషయాలలో అనవసర జోక్యం చేసుకోరు. కొందరు తమ అభిప్రాయాల విషయంలో మొండి పట్టుదల కలిగి ఉంటారు. అధికంగా ఆలోచించటం మానుకోవాలి. వివాహం విషయంలో జాగ్రత్త తీసుకోవాలి. వివాహం తర్వాత జీవిత భాగస్వామి పట్ల విధేయత / ప్రేమ కలిగి ఉంటారు. కాని వీరికి సంసార జీవితం పట్ల ఆసక్తి తక్కువగా ఉంటుంది.

వీరి ఆర్థికపరిస్థితి అంత బాగా ఉండదు. ఎక్కువగా ఎదుటవారి సుఖం, క్షేమం

కొరకు పాటుపడతారు. వైద్యులుగా, మఠాధిపతులుగా, గురువులుగా, పురోహితులుగా మంచిపేరు సాధిస్తారు. వీరికి అతీంద్రీయ శక్తులపై ఆసక్తి ఉంటుంది. కాస్తంత ప్రయత్నంతోనే అతీంద్రియ శక్తులపై పట్టు సాధిస్తారు.

## జన్మదినం - 8

**వీరు చిన్నతనంలో తల్లిదండ్రులకు దూరంగా ఉంటారు. ఏకాంతాన్ని కోరుకుంటారు. దైవభక్తి, త్యాగబుద్ధి కలిగి ఉంటారు.**

వీరు చిన్నతనంలో కుటుంబ సమస్యలతో బాధపడతారు. తల్లిదండ్రులకు దూరంగా ఉండే అవకాశం ఉంది. ప్రతి చిన్న విషయానికి ఎంతో కష్టపడితే కాని ఫలితం దక్కదు. ధనం పట్ల అవగాహన, వ్యాపార నైపుణ్యం ఉంటాయి. మంచి నిర్ణయాత్మక శక్తిని కలిగి ఉంటారు. మంచి తార్కిక బుద్ధి ఉంటుంది. ఏకాంతాన్ని కోరుకుంటారు. భాగస్వామ్య వ్యాపారాలు వీరికి పనికిరావు. దైవభక్తి, త్యాగబుద్ధి కలిగి ఉంటారు. ఏ పనైనా బాగా ఆలోచించి చేస్తారు. దాని వలన కార్యసిద్ధి కలుగుతుంది. నాయకత్వ లక్షణాలు కలిగి ఉంటారు. వాస్తవికత, ఆత్మవిశ్వాసం, మంచి అభిరుచి మంచి లక్ష్యం కలిగి ఉంటారు. ఇంద్రియసుఖాలు కోరుకుంటారు.

కుటుంబ జీవితంలో ఒడిదుడుకులు ఉన్నా అవి తొందరగానే సమసిపోతాయి. జీవిత ద్వితీయార్ధంలో సుఖాల పట్ల విముఖత కలుగుతుంది. కృషి పట్టుదలతో ఉన్నత స్థానం సంపాదిస్తారు. తమ మనసులో భావాలు బయటకు తెలియనీయరు. కొంచెం సహనం, ఓర్పు అలవరచుకుంటే మంచిది.

జీవితంలో ఎదురయ్యే కష్టాలను, జయాపజయాల మధ్య అంతరంగా భావిస్తారు. సవాళ్ళను ధైర్యంగా స్వీకరించి ఎదుర్కొంటారు. కుటుంబాన్ని, సాటి మనుషులను, సమాజాన్ని ప్రేమిస్తారు. కామర్స్, మేనేజ్‌మెంట్, సి.ఎ., ఎల్.ఎల్.బి రంగాలలో రాణిస్తారు. ఏది చదివినా వీరు అకౌంట్స్, మేనేజ్‌మెంట్, న్యాయ మరియు రాజకీయ రంగాలలో స్థిరపడే అవకాశాలు ఎక్కువ.

## జన్మదినం - 9

**వీరు విశాల దృక్పథం, బంధువులు, స్నేహితుల పట్ల వాత్సల్యం కలిగి ఉంటారు. సమాజ శ్రేయస్సు కోరుకుంటారు. కళాకారులుగా రాణిస్తారు.**

వీరు విశాల దృక్పథం, నూతన ఆలోచనా విధానం, ప్రేమ వాత్సల్యం కలిగి ఉంటారు. సమాజం పట్ల అంకిత భావం కలిగి ఉంటారు. ఈ జీవితం సమాజ శ్రేయస్సు కొరకే అని నమ్ముతారు. కళలకు సంబంధించిన విద్యను అభ్యసించి, గొప్ప కళాకారులుగా రాణిస్తారు. ఆత్మ విశ్వాసం, ఆత్మాభిమానం కలిగి స్వేచ్ఛా జీవితం కోరుకుంటారు. తాము నమ్మిన సిద్ధాంతాలను విడవరు. అందువలన కొంతమంది వీరిని మొండివారుగా గుర్తిస్తారు.

వీరు పోలీస్, మిలటరీ లాంటి యూనిఫార్మ్ ధరించే జాబ్స్ మరియు రియల్ ఎస్టేట్, నిర్మాణరంగం భూ సంబంధిత వ్యాపారాలలో చక్కగా రాణిస్తారు. వీరికి వారసత్వం వలన గాని లేదా అదృష్టం వలన గాని అనుకోకుండా ధనం ప్రాప్తం అవుతుంది. ఉద్వేగానికి లోనుకాకుండా, మనోబలంతో ప్రవర్తిస్తే విజయం వీరి సొంతం. మంచి వాక్పటిమ కలిగి, ఎలాంటి వ్యతిరేకతనయినా సమర్థవంతంగా ఎదుర్కోగలరు.

ప్రశాంత వదనం కలిగి ఉంటారు. విశాల భావాలు కలిగి, రాజకీయాలు, సమాజ సేవ పట్ల ఆసక్తి కలిగి ఉంటారు. తత్వశాస్త్రం, తార్కిక శాస్త్రం లాంటి మనోవికాసం కలిగించే వాటి పట్ల అభిరుచి కలిగి ఉంటారు. కుటుంబ సమస్యలు వచ్చినా అంతగా బాధించవు. సివిల్, మెకానికల్ ఇంజనీరింగ్ రంగాలవైపు ఆకర్షితులవుతారు.

## జన్మదినం - 10

**వీరు నాయకత్వ లక్షణాలు, ఓర్పు, శాంతం కలిగి ఉంటారు. శత్రువులు మిత్రులుగా మారతారు.**

వీరు నాయకత్వ లక్షణం కలిగి ఉండి విజయకాంక్ష కలిగి ఉంటారు. ఓర్పు, శాంత స్వభావం కలిగి ఉంటారు. వీరి ప్రవర్తన, ప్రేమాభిమానాల వలన మిత్రులు ఎక్కువగా ఉంటారు. స్వతంత్రేచ్ఛ కలిగి ఉంటారు. చురుకైన బుద్ధి, తార్కిక విశ్లేషణ కలిగి ఉంటారు. వీరి సహకారగుణం వలన శత్రువులు మిత్రులుగా మారతారు. ఏ

పనైనా ప్రణాళికాబద్ధంగా, ఒక పద్ధతిగా చేసి విజయం సాధిస్తారు. రాజకీయాలు, రచనలు, కళలు, సినిమా, టి.వీ రంగాలలో రాణించగలుగుతారు. పరిశ్రమల రంగంలో కూడా కీర్తి గడించగలరు.

ఎప్పుడూ ఉండే రొటీన్ కార్యక్రమాలను నచ్చరు. వినూత్నంగా ఏదైనా చేయటానికి ప్రయత్నిస్తారు. మనసులో భావాలు బయటకు తెలియనీయరు. దృఢసంకల్పం, సృజనాత్మకతను పెంపొందించుకుంటే విజయం వీరి స్వంతం అవుతుంది. జీవితంలో ఒడిదుడుకులు ఉంటాయి అందువలన వీరు స్పెక్యులేషన్ వ్యాపారం లాంటి వాటికి దూరంగా ఉండటం మంచిది. వీరికి కళ్ళజోడు ఉండే అవకాశం ఉంది. వీరు తమ నామసంఖ్యను న్యూమరాలజీ ప్రకారం సరిచేసుకోగలిగితే విజయం ప్రాప్తిస్తుంది.

## జన్మదినం - 11

**మాస్టర్ నెంబర్ కావటం వలన వీరు ఆధ్యాత్మికత, దైవభక్తి కలిగి ఉంటారు. అతీంద్రియ శక్తులు పొందగలుగుతారు.**

ఈ సంఖ్య న్యూమరాలజీలో మాస్టర్ నంబర్. వీరు, గొప్ప ఆధ్యాత్మికత, దైవభక్తి, మతవిశ్వాసాలు కలిగి ఉంటారు. అసాధారణ స్ఫురణ (ఇంట్యూషన్) కలిగి ఉంటారు. ఎదుటి వారి మనసులో ఏముందో ఇట్టే పసికట్టగలరు. ఇతరులకు ఆదర్శంగా ఉంటారు. నాయకత్వ లక్షణాలు కలిగి ఉంటారు జీవితంలో ఎపుడూ లక్ష్యసాధన వైపే పయనిస్తుంటారు. వీరి మనసు తార్కికంగా కంటే అసాధారణంగా స్పందించి ఇంట్యూషన్ తో సమస్యలకు పరిష్కారం పొందుతారు. ఆధ్యాత్మిక అతీంద్రియ శాస్త్రాలు, జ్యోతిషం, వేదం, మంత్రశాస్త్రం, వైద్యం వంటి వాటిలో నైపుణ్యం కలిగి ఉంటారు.

వీరి శక్తియుక్తులను సంఘశ్రేయస్సు కోసం వినియోగిస్తారు. ఉన్నతభావాలు, మంచి గుణాలు కలిగి ఉండటం వలన అందరి చేత గౌరవింపబడి, ఆదర్శమూర్తిగా ఉంటారు. వీరు ఆహార నియమాలు పాటించాలి, ముఖ్యంగా, కొవ్వు పదార్థాలు, చక్కెర తగ్గించి, ఖనిజ లవణాలు ఎక్కువగా తీసుకుంటే నరాల వ్యాధులు రాకుండా ఉంటాయి. ఆత్మన్యూనతా భావం ఉంటుంది. ఏ పనిచేసినా అందులో కొత్తదనం కనిపిస్తుంది.

## జన్మదినం - 12

**వీరు కళాత్మకత కలిగి అన్ని విషయాలను సీరియస్‌గా తీసుకుంటారు. చక్కగా మాట్లాడతారు.**

వీరికి మంచి కళాత్మక నైపుణ్యం ఉంటుంది. ప్రతీ విషయాన్నీ సీరియస్‌గానే తీసుకుంటారు. అది ఇంటి గురించి అయినా, వంట గురించి అయినా, కళాప్రక్రియల గురించయినా సరే, దేనినీ తేలికగా తీసుకోరు. మంచి ఊహాశక్తి, చతురత కలిగి ఉంటారు. వీరి బుద్ధిని, తెలివితేటను సక్రమంగా వినియోగిస్తే సంపన్నులవుతారు. సాహిత్యం, నటన, సంగీతం మొదలైన వాటిలో నైపుణ్యం ఉంటుంది. వాటి వలన కూడా ఆదాయం సమకూరుతుంది.

పదిమంది కలిసినపుడు వీరే అందరినీ ఆకట్టుకుంటారు, వారి కథలు, జోకులు, చమత్కారమైన మాటల ద్వారా అందరిని ఆకర్షిస్తారు. వీరికున్న చతురత, ఉత్సాహంతో సమయాన్ని, శక్తిని వృథా చేయకుండా, నిబద్ధత, క్రమశిక్షణ పెంపొందించుకుంటే విజయం వీరి సొంతం అవుతుంది. తొందరగా ధనవంతులు అవ్వాలనే కోరిక తగ్గించుకోవాలి. అంచెలంచెలుగా జీవితంలో రాణిస్తారు. అందరిచేత గౌరవించబడతారు.

## జన్మదినం - 13

**వీరి వలన వీరి తల్లిదండ్రులు, కుటుంబ పరిస్థితి బాగుపడుతుంది. ఏ పని చేసినా వీరే మూల స్తంభంలా ఉంటారు.**

చాలా మంది ఈ నెంబరు చూసి భయపడుతుంటారు. ఈ నెంబరుతో పిల్లలు పుడితే వీరి కుటుంబ ఆర్థిక పరిస్థితి ఉన్నత స్థితికి వస్తుంది. వీరు కుటుంబాన్ని, సంప్రదాయాన్ని, వర్గాన్ని ఎంతో ప్రేమిస్తారు. ఎంతో నిజాయితీ కలిగి ఉంటారు. ఏ పనినిగాని, సంస్థను గాని ప్రారంభిస్తే, వీరు మూల స్తంభంగా ఉంటారు. బాల్యంలో జీవితంలో కష్టాలు సంప్రాప్తం అవుతాయి. కుటుంబ బాధ్యతలో పాలు పంచుకోవాల్సి వస్తుంది. దృఢచిత్తంతో, నిజాయితీ తో ముందుకెళ్తే విజయం లభిస్తుంది. ఈ అనుభవాల వలన వీరు మంచి శారీరక, మానసిక బలం సంపాదిస్తారు.

వీరి జన్మసంఖ్యకు నామ సంఖ్య సరియైనదిగా ఉంటే, జీవిత ద్వితీయార్ధంలో వీరికి అభివృద్ధి ఉంటుంది. దైవభక్తి, పెద్దల ఆసరా మూలంగా వృద్ధి పొందగలుగుతారు. దృఢ సంకల్పం, మనోబలం కలిగి ఉంటారు. అందరూ వీరి క్రమశిక్షణను, నిబద్ధతను గుర్తిస్తారు. సరియైన రీతిలో వీరి లక్ష్యాన్ని నిర్ణయించుకుంటే, ఉద్యోగం మాటి మాటికీ మార్చాల్సిన అవసరం ఉండదు. మేనేజ్‌మెంట్, కమ్యూనికేషన్ రంగాలలో బాగా రాణిస్తారు. మొండితనాన్ని విడనాడితే జీవితంలో రాణిస్తారు. వీరు దుర్గామాతను, సుబ్రహ్మణ్యస్వామిని ఆరాధిస్తే మంచి ఫలితం ఉంటుంది.

## జన్మదినం – 14

**వీరు మార్పును, వినోదాన్ని, ప్రయాణాలను ఇష్టపడతారు. మంచి వాక్పటిమ కలిగి ఉంటారు.**

వీరు మార్పును, వినోదాన్ని, ప్రయాణాలను ఇష్టపడతారు. తీవ్రమైన కృషి చేసి, కీర్తి ప్రతిష్టలు, సంపద గడిస్తారు. కళలలో మంచి ప్రవేశం ఉంటుంది. మంచి వాక్పటిమ, వాదనా సామర్థ్యం కలిగి ఉంటారు. ఎంతోమందితో వీరికి సత్సంబంధాలు ఉంటాయి. ఎపుడూ అదృష్టవంతులుగా ఉంటారు. విదేశీ ప్రయాణాలు చేస్తారు. భోగభాగ్యాలు అనుభవిస్తారు. స్వయంకృషితో కూడా చాలా సంపద గడిస్తారు. మంచి సంతానం కలుగుతుంది.

అధికమైన ఆత్మవిశ్వాసం కలిగి ఒక్కొక్కసారి మొండివారుగా ఉంటారు. రచనలు, రాజకీయాలు, సినిమా రంగాలలో పేరు పొంది గొప్ప ఐశ్వర్యం కలుగుంది. రొటీన్ జీవితం వీరికి నచ్చదు. నూతనత్వం, నూతన భావాలు కోరుకుంటారు. అందరి సహకారం వీరికి ఎప్పుడూ ఉంటుంది.

వీరికి అవకాశాలు అప్రయత్నంగా వస్తాయి. వీరికి మంచి జ్ఞాపక శక్తితో పాటు సందర్భానుసారం ఇతరులు ఇష్టపడే విధంగా మాట్లాడతారు. వీరు సంపాదించిన ధనం తమపై ఆధారపడిన వారు ఎక్కువగా అనుభవిస్తారు. వీరు ఎప్పుడూ బయట తిరిగి చేసే పనులలో రాణిస్తారు.

## జన్మదినం - 15

**వీరు సృజనాత్మకత, కళాత్మకత కలిగి ఉంటారు. అందంగా ఉంటారు. వీరు చాలా అదృష్టవంతులు.**

వీరు సృజనాత్మకత, కళాత్మక హృదయం కలిగి ఉంటారు. మంచి భాషా పరిజ్ఞానం కలిగి ఉంటారు. మంచి శరీర సౌష్టవం, స్ఫురద్రూపం కలిగి ఉంటారు. చక్కటి రూపం కలిగి అందరినీ ఆకర్షిస్తారు. మంచి వాక్పటిమ కలవారు. వీరు చాలా అదృష్టవంతులుగా ఉంటారు. సంపద, సుఖాలు, భోగాలు వీరిని తమంతట తామే వరిస్తాయి. ఇల్లు, ఇల్లాలు, గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. దృశ్యకళలు, పెయింటింగ్, శిల్పకళ లాంటి వాటిపై ఆసక్తి కలిగి ఉంటారు. వ్యాధులను నయం చేసే శక్తి కలిగి ఉంటారు. ఆ రంగంలోకి తగిన శిక్షణ తీసుకుని వెళ్తే బాగా రాణిస్తారు.

అందరితో మంచి సంబంధ బాంధవ్యాలు కలిగి ఉంటారు. మంచి తల్లి / తండ్రిగా వ్యవహరించి సంతానాన్ని ప్రేమించి వారి అభ్యున్నతికి అన్ని చర్యలు తీసుకుంటారు. కొంచెం సున్నిత మనస్కులుగా ఉంటారు. విమర్శలను తట్టుకోలేరు. బాధ్యతాయుతంగా ఉంటారు. స్వంతనిర్ణయాలు తీసుకుంటారు. వీరు తమ వయసు కంటే చిన్నవారిగా కనిపిస్తారు. వివాహం అనంతరం చాలా సంపన్న జీవితం గడుపుతారు.

## జన్మదినం - 16

**వీరు తాత్వికత, ఆధ్యాత్మికత కలిగి ఉంటారు. రచనలు, సంగీతం, జ్యోతిషం, అతీంద్రియ శాస్త్రాలలో ప్రావీణ్యం సంపాదిస్తారు.**

వీరిపై తాత్వికత, ఆధ్యాత్మికతల ప్రభావం ఉంటుంది. ఈ భూమిపై దిగిన ఇతర గ్రహవాసిలా అనిపిస్తారు. సునిశిత పరిశీలన, విశ్లేషణాశక్తి కలిగి ఉంటారు. ఏ విషయం పైనైనా దృష్టిని కేంద్రీకరించగలుగుతారు. ఇది కేతు సంబంధిత సంఖ్య, ఈ సంఖ్య భౌతిక జ్ఞానాన్ని, ఆధ్యాత్మిక జ్ఞానాన్ని ఇచ్చేది కాబట్టి, రచనలు, సంగీతం, జ్యోతిష్యం, మానసిక విజ్ఞానశాస్త్రంలో ప్రావీణ్యం పొందగలుగుతారు. దీనిపై దృష్టిని కేంద్రీకరిస్తే, మంచి ఆదాయం కూడా పొందుతారు. వీరికి అసాధారణ స్ఫురణ (ఇంట్యూషన్), మానసిక దివ్యశక్తి ఉంటాయి. వీటి ఆధారంగా జీవితంలో ప్రగతి సాధించగలుగుతారు.

వీరు ఏకాంతంగా ఉండటానికి ఇష్టపడతారు. సమాజంలో గౌరవప్రదమైన జీవితం గడుపుతారు. దానగుణం, జాలి, దయ, కలిగి ఉంటారు. వీరు సున్నిత మనస్కులు. తమ మనసులో భావాలకు బయటకు తెలియనీయరు. పేరు పొందిన కళాకారులు, నటులు, గాయకులు ఈ జన్మదినం కలవారే. వీరి చేతిలో సంజీవని యోగం ఉంటుంది. వీరు డాక్టర్‌గా, జ్యోతిష్యులుగా, గురువులుగా, తాంత్రికవేత్తలుగా చాలా ప్రఖ్యాతి చెందుతారు. వీరికి జరగబోయే సంఘటనలు కలల రూపంలో ముందే తెలుస్తాయి. వీరి వాక్కు ఫలిస్తుంది. అందువలన వీరు అందరి బాగు కోరి పాజిటివ్‌గా మాట్లాడటం వలన ఎదుటి వారు లాభం పొందుతారు. వీరు నామసంఖ్యను న్యూమరాలజీకి అనుగుణంగా సరిచేసుకుంటే జీవితంలో ఉన్నతస్థితికి వస్తారు.

## జన్మదినం - 17

**వీరు జీవితంలో క్రమంగా అభివృద్ధి సాధిస్తారు. స్వేచ్ఛాభావాలు కలిగి ఉంటారు. బాధ్యతలు తమపై వేసుకుంటారు.**

వీరు జీవిత ప్రథమంలో ఒడిదుడుకులు ఎదుర్కొని, క్రమక్రమంగా ఉన్నత స్థితికి చేరుకుంటారు. వ్యాపార, ఆర్థిక విషయాలలో మంచి దృక్పథం కలిగి ఉంటారు. మంచి నిర్ణయాత్మక శక్తి కలిగి ఉంటారు. కళాత్మకత కలిగి లలితకళలపై ఆసక్తి కలిగి ఉంటారు. స్వేచ్ఛా భావాలు కలిగి ఉంటారు. బాధ్యత మొత్తం తమపైనే వేసుకుంటారు. బాధ్యతలతో పాటు అధికారాలు వస్తాయి కాబట్టి, కొందరు నియంతలుగా మారే అవకాశం కూడా ఉంది. జాలి, కరుణ కలిగి ఉంటారు. ధనం బాగా సంపాదిస్తారు. తమ కష్టార్జితం ఇతరులతో పంచుకొని ఎనలేని ఆనందాన్ని పొందుతారు.

శని వ్యతిరేక ప్రభావం చూపితే చెడు మార్గాల వైపు వెళ్ళే అవకాశం ఉంది. జీవిత భాగస్వామి తమ మాట వినే వారుగా ఉండాలని కోరుకుంటారు. ఇంటిని, కుటుంబాన్ని ప్రేమిస్తారు. ఆధిక్యతను ప్రదర్శించటం తగ్గించుకుంటే మంచిది. సమాజంలో మంచి పేరు ప్రతిష్టలు కలిగి, గౌరవప్రదమైన జీవితం గడుపుతారు. వీరు తమ నామసంఖ్యను మంచి న్యూమరాలజిస్ట్‌ని కలిసి సెట్ చేయించుకోవాలి. మరణానంతరం వీరిని కీర్తిస్తారు.

## జన్మదినం - 18

**వీరు నాయకత్వ లక్షణాలు కలిగి ఉంటారు. ఆధ్యాత్మికత కలిగి ఉంటుంది. వీరు క్షమాగుణం నేర్చుకుంటే మంచిది.**

వీరు జన్మతః నాయకత్వ లక్షణాలు కలిగి ఉంటారు. ఇతరులకు ప్రేరణ కలిగించి పనులు చేయించగలుగుతారు. ఆధ్యాత్మికత కలిగి ఉంటారు. విశాల దృక్పథం కలిగి వివిధ విద్యలలో, కళల్లో ప్రావీణ్యం సంపాదిస్తారు. మంచి కళాకారులు ఈ జన్మదినం కలవారే. ఉద్వేగం, ఎమోషన్, స్వార్థం మొదలైన నెగిటివ్ గుణాలను అధిగమించగలిగితే చక్కటి ప్రతిభ ప్రదర్శించి ప్రగతిని సాధించగలుగుతారు. ప్రజల జీవన స్థితిగతులు, సమాజ దేశశ్రేయస్సు కోరుకుంటారు. వీరు క్షమాగుణం అలవరుచుకుంటే మంచిది.

సరైన నామసంఖ్య ఉంటే మంచి జీవితాన్ని, సుఖభోగాలు అనుభవిస్తూ, కీర్తి ప్రతిష్ఠలు కలిగి ఉంటారు. ప్రేమ వ్యవహారాల జోలికి వెళ్ళకుండా ఉంటే మంచిది. ప్రతీకార వాంఛ తగ్గించుకుంటే మంచిది. ఆధ్యాత్మిక, తాత్విక ధోరణిని అవలంబిస్తే వీరికి అన్ని విధాల శ్రేయస్కరం. వీరు మొండితనాన్ని వదలకపోతే సమాజంలో వీరి పట్ల వ్యతిరేకత ఉండే అవకాశం ఉంది. వీరు ఎప్పుడూ మానసిక ఆందోళనలో ఉంటారు. వారి భావాలను ఎవరితో పంచుకోకుండా మధనపడుతుంటారు.

## జన్మదినం-19

**వీరు దృఢ నిశ్చయం, స్వతంత్రేచ్ఛ, ఆధ్యాత్మిక చింతన కలిగి ఉంటారు. వయసు పైబడుతున్నా హుషారుగా ఉంటారు.**

వీరు దృఢనిశ్చయం, స్వతంత్రేచ్ఛ కలిగి ఉంటారు. ఆధ్యాత్మిక చింతన కలిగి ఉంటారు. కార్యసిద్ధి వీరి ఆశయం. కళలో మంచి ప్రవేశం ఉంటుంది. ప్రశాంత వదనంతో శాంతంగా కనిపిస్తారు గాని నిక్కచ్చిగా ఉంటారు. వీరు తమ భావాలను ఇతరులతో పంచుకుంటే మంచిది. లేకపోతే ఒక పరిధిలోనే ఉండిపోతారు. భయం వలన మొండితనం వస్తుంది కాబట్టి అనవసర భయాలు వీడి కార్యసాధన వైపు అడుగులు వేయాలి. సున్నితమైన మనసున్న వారు కాబట్టి ఎవరిని ఇబ్బంది పెట్టరు.

అధికారుల సహకారంతో పనులు సాధించగలుగుతారు. వయసు పైబడుతున్నా హుషారుగా ఉంటారు. ఆత్మవిశ్వాసం కలిగి ఉన్నా ఇతరుల ప్రోత్సాహం కోరుకుంటారు. కష్టించి పనిచేస్తారు. వాత్సల్యం, ప్రేమ బయటకు కనబరుస్తారు. త్యాగబుద్ధి కలిగి ఉంటారు. ఉన్నత ఆశయాలు కలిగి ఉంటారు. దృఢ సంకల్పం, సృజనాత్మకత వలన ఆర్థికంగా ప్రగతిని సాధించగలుగుతారు. 1, 10, 19, 28 తారీఖులలో పుట్టినవారిలో 19వ తేదీ పుట్టిన వారు చాలా అదృష్టవంతులు. వీరి ప్రతిభను తొందరగా పెద్దలు గుర్తించటం వలన జీవితంలో చాలా మంచి కీర్తి సంపాదిస్తారు. ఈ తేదీలో పుట్టిన వారికి నాయకత్వ లక్షణాలతో పాటు ధైర్యసాహసాలు ఉండటం వలన జీవితంలో ఉన్నత స్థితికి ఎదుగుతారు.

## జన్మదినం - 20

**వీరు సున్నితమైన మనసు కలిగి ఆకర్షణీయంగా ఉంటారు. వీరిపై దైవకృప ఉంటుంది. ఎమోషనల్‌గా ఉంటారు. కళాకారులు, కవులు, నటులు ఈ జన్మతేదీ కలవారే.**

వీరు సున్నితమైన మనసు కలిగి ఆకర్షణీయంగా ఉంటారు. ఇతరుల మనసులోని భావాలు ఇట్టే గ్రహించగలుగుతారు. దృఢ సంకల్పం కలిగి ఉంటారు. వీరిపై దేవుని కరుణ ఉంటుంది. ఎమోషనల్‌గా ఉంటారు. సునిశిత బుద్ధి కలిగి అధికార వర్గంలో ఉన్న వారికి సలహాలు ఇచ్చే స్తోమతు కలిగి ఉంటారు. వీరు నెమ్మదస్తులు. అందరితో మర్యాదగా మసులుకుంటారు. గొప్ప కళాకారులు, కవులు, నటులు ఈ తేదీల్లో జన్మించిన వారే. మంచి మార్కెటింగ్ ఆఫీసర్లుగా, లాయర్లుగా, రాజనీతిజ్ఞులుగా రాణించగలరు. సర్దుకుపోయే గుణం కలిగి ఉంటారు.

కొత్త సంస్థలు, ప్రాజెక్టులు ప్రారంభించే కంటే, పాతవి సమర్థంగా నడపడానికి తగిన శక్తియుక్తులు కలిగి ఉంటారు. ప్రేమ, వాత్సల్యాన్ని కోరుకుంటారు. కుటుంబాన్ని, స్నేహితులను ప్రేమిస్తారు. సున్నిత మనస్కులు కాబట్టి అందరి వ్యధలను అర్థం చేసుకొని వాటిని పరిష్కరించటానికి ప్రయత్నిస్తారు. ధన, కనక, వస్తు, వాహనాలు కష్టపడి సంపాదిస్తారు. ఎంతోమంది స్నేహితులు కలిగి కీర్తి, ప్రతిష్ఠలు పొందుతారు.

వీరికి బిడియం ఉంటుంది. దానిని విడనాడాలి. కల్పనా శక్తి ఎక్కువ. అందువలన మంచి రచయితలుగా, కళాకారులుగా పేరుగాంచుతారు. వీరు స్వతంత్ర నిర్ణయాలు తీసుకోకుండా పక్కవారి సలహాలను కూడా పరిగణలోకి తీసుకోవాలి. అప్పుడే జీవితంలో ఉన్నత స్థితిని పొందుతారు.

## జన్మదినం - 21

**వీరికి సృజనాత్మకత ఉంటుంది. దైవభక్తి కలిగిన వీరికి దైవకృప ఉంటుంది. కళయందు ఆసక్తి, ప్రవేశం ఉంటుంది. బాగా మాట్లాడతారు.**

వీరు సృజనాత్మకత కలిగి విజయం పట్ల దృఢ సంకల్పం కలిగి ఉంటారు. దైవభక్తి కలిగిన వీరిపై దైవకృప ఉంటుంది. సునిశిత ఊహాశక్తి కలిగి ఉంటారు. మంచి చతురత కలిగి హాస్య సంభాషణలు చేయగలుగుతారు. మంచి బుద్ధిబలం కలిగి కొత్త విషయాలు కనుగొనగలుగుతారు. కళలయందు ఆసక్తి, ప్రవేశం ఉంటుంది. రచనలు, సంగీతం, శిల్పకళ, చిత్రలేఖనంపై వీరికి మక్కువ. పదిమందిలో వీరి సంభాషణా చాతుర్యం వలన అందరినీ ఆకర్షిస్తారు.

జీవిత ద్వితీయార్థంలో కీర్తి ప్రతిష్ఠలు, సంపద గడిస్తారు. కుటుంబ జీవితం ఆనందమయంగా ఉంటుంది. సమాజ సేవ పట్ల ఆసక్తి కలిగి ఉంటారు. అందరినీ గౌరవించి తాము కూడా గౌరవాన్ని పొందుతారు. తమ నైపుణ్యాన్ని సరిగా ఉపయోగించకపోతే తగిన గుర్తింపు లభించదు. అందరూ వీరి పట్ల ఆకర్షితులై వీరు ఆదరాభిమానాలు పొందుతారు. వీరు వారి బంధువర్గం మధ్య, సమాజంలో చాలా మంచి వారుగా గుర్తింపు పొందుతారు.

## జన్మదినం - 22

**ఇది మాస్టర్ నెంబరు. వీరికి నాయకత్వ లక్షణాలు, కార్యనిర్వహణ శక్తి ఉంటాయి. రొటీన్‌కి విరుద్ధంగా ఆలోచిస్తారు.**

ఈ సంఖ్యను న్యూమరాలజీలో మాస్టర్ నెంబరు అంటారు. వీరు నాయకత్వ లక్షణం, కార్యనిర్వహణా సామర్థ్యం కలిగి ఉంటారు. సంస్థలను, వ్యాపారాలను స్థాపించే

శక్తి కలిగి ఉంటారు. పద్ధతిగా, ఓర్పుగా ఉంటారు. కాని కొందరు చెడు మార్గాల వైపు వెళ్ళే అవకాశం ఉంది. వీరి ఆలోచనా విధానం కొత్త తరహాలో ఉంటుంది. రొటీన్‌కి విరుద్ధంగా పాత పద్ధతులకు కొత్త ఆలోచనలు జోడించి తనదైన శైలిలో మార్పులు చేస్తారు. దీనిని ప్రజలంతా అంగీకరిస్తారు. వీరు మంచి గ్రహణశక్తి కలిగి ఇంట్యూషన్ కలిగి ఉంటారు. కొందరు అక్రమ మార్గాలలో ధన సంపాదనకు ప్రయత్నిస్తారు.

వీరు ఇతరుల మాట వినరు. వీరికి తోచింది చేస్తారు. సాధారణంగా వీరికి మంచి తెలివితేటలు, కార్యనిర్వహణ శక్తి ఉండటం వలన విజయం సాధిస్తారు. కాని మనసు చెడు మార్గాల వైపు వెళ్ళకుండా యోగా, ఆధ్యాత్మిక పద్ధతుల ద్వారా అదుపుచేస్తే గొప్పవారిగా రాణిస్తారు. చాలా మంది ఆవిష్కరణకర్తలు, కళాకారులు, నోబెల్ ప్రైజ్ విన్నర్లు ఈ జన్మదినం కలవారే.

హోటల్ వ్యాపారం, సినిమా రంగం లాంటివి అనుకూలం. వీరు అప్పుడప్పుడు మొండిగా ప్రవర్తిస్తారు. దానిని విడనాడాలి. వీరు జన్మతేదీకి అనుగుణంగా పేరు పెట్టుకుంటే జీవితంలో ఉన్నత స్థితి పొందుతారు. లేదా జీవిత చరమాంకంలో మధనపడుతూ గడపవలసి వస్తుంది.

## జన్మదినం - 23

**ఇది న్యూమరాలజీలో చాలా గొప్ప సంఖ్య. వీరికి రాజయోగం ఉంటుంది. ఆత్మవిశ్వాసం అధికం. కొత్తదనాన్ని, మార్పుని కోరుకుంటారు.**

న్యూమరాలజీలో ఇది అత్యంత గొప్ప సంఖ్య. వీరికి జీవితంలో రాజయోగం ఉంది. వీరు మార్పుని, వినోదాన్ని, ప్రయాణాలను కోరుకుంటారు. ఆత్మవిశ్వాసం అధికంగా ఉంటుంది. అన్ని పరిస్థితులు, వాతావరణాలకు సర్దుకుపోగలరు. మంచి సంభాషణా చాతుర్యం కలిగి ఉంటారు. అదృష్టవంతులుగా ఉంటారు. ధనానికి కొరత ఉండదు. అందరి సహకారం లభిస్తుంది. వీరు రచనలు కూడా చేయగలుగుతారు.

ఎటువంటి నిబంధనలు లేకుండా సహృద్భావ వాతావరణం ఉన్నట్లయితే చక్కగా సమర్థవంతంగా పనిచేస్తారు. రొటీన్ జీవితాన్ని నచ్చరు. నూతనత్వాన్ని, మార్పుని కోరుకుంటారు. దూరప్రయాణాలు, విహారయాత్రలు ఇష్టపడతారు. వీరు కళాప్రియులు.

సినిమాలు, రాజకీయాల్లో రాణించగలుగుతారు. దానధర్మాలు చేస్తారు. ఇతరులకు అసాధ్యమైన పనులు చేయగలుగుతారు. ఆధ్యాత్మిక దృష్టి ఉండి దైవప్రార్థన చేస్తారు.

దైవానుగ్రహంతో మంచి పదవులు, సిరిసంపదలు వీరికి అకస్మాత్తుగా లభించే అవకాశం ఉంది. వీరు జీవితంలో అన్ని సుఖాలు అనుభవించగలరు. మరణానంతరం కూడా వీరిని చాలా సంవత్సరాల వరకు ప్రజలు, బంధువులు కీర్తిస్తుంటారు.

## జన్మదినం – 24

**వీరు అందంగా ఉంటారు. సున్నితమైన మనసు కలిగి ఉంటారు. కష్టపడి పనిచేసి పేరు, హోదా, సంపద గడిస్తారు.**

వీరు మంచి రూపం, శరీర సౌష్టవం కలిగి అందరిని ఆకర్షిస్తారు. కుటుంబానికి ప్రాధాన్యత ఇస్తారు. అందరితో మంచి సంబంధ బాంధవ్యాలు కలిగి ఉంటారు. సున్నిత మనస్కులు. భావావేశం కలవారు. నైతిక విలువలకు ప్రాధాన్యత ఇస్తారు. కళాహృదయం కలిగి ఉంటారు. ఉత్సాహంగా, బాధ్యతాయుతంగా, సహకారంగా ఉండి సానుభూతి కలిగి ఉంటారు.

వీరు తమ పరిధులు తెలుసుకొని ఉంటే మంచిది. ధనం, పేరుప్రతిష్టలు గడిస్తారు. జీవిత భాగస్వామి సంపన్న కుటుంబం నుంచి వచ్చిన వారై ఉంటారు. పెళ్లి తరువాత జీవితంలో దినదినాభివృద్ధి ఉంటుంది. సాంస్కృతిక కళలు, నయం చేసే గుణం వీరిలో దాగి ఉంటాయి. మంచి స్నేహితులుగా, మంచి సహచరులుగా ఉంటారు. వీరు అదృష్టవంతులు, కష్టపడి పనిచేయటం వలన పెద్ద హోదా, గౌరవం లభిస్తాయి.

సమాజశ్రేయస్సు కొరకు పాటుపడుతుంటారు. కుటుంబ జీవితాన్ని ఆస్వాదిస్తారు. మంచి ఊహాశక్తి, సృజనాత్మకతతో రచనలు చేయగలుగుతారు. వీరి జీవితం వడ్డించిన విస్తరిలా ఉంటుంది. వీరు న్యూమరాలజీ ప్రకారం పేరు పెట్టుకుంటే పైన వివరించిన సుఖాలన్నీ అనుభవిస్తారు. నెగిటివ్ నెంబరులో పేరు పెట్టుకొని ఉంటే అపోజిట్ సెక్స్ వలన ఇబ్బందులు, నయం కాని వ్యాధులతో బాధపడవలసి వస్తుంది.

## జన్మదినం - 25

**వీరు తెలివితేటలు, దైవభక్తి కలిగి ఉంటారు. తత్వశాస్త్రం, అతీంద్రియ శాస్త్రాలలో రాణిస్తారు. కుటుంబంపై ప్రేమ ఉన్నా బయటకు తెలియనీయరు.**

వీరు సునిశిత బుద్ధి, మేధాశక్తి కలిగి ఉంటారు. దైవభక్తి కలవారై ఉంటారు. అసాధారణ స్ఫురణ (ఇంట్యూషన్) కలిగి ఉంటారు. వీరిని అనుసరించే వారు చాలా మంది ఉంటారు. ఏ విషయమైనా తార్కికంగా, విశ్లేషణాత్మకంగా ఆలోచిస్తారు. విజ్ఞానశాస్త్రం, తత్వశాస్త్రం, తర్కశాస్త్రం, మానసికశాస్త్ర వేత్తలుగా, డాక్టర్లుగా బాగా రాణించగలుగుతారు. ధృడ అభిప్రాయాలు కలిగి ఉంటారు. అందరూ వీరిని ప్రశంసిస్తూ ఉంటారు. కుటుంబంపై ప్రేమాభిమానాలు ఉన్నా బయటకు తెలియనీయరు.

ఏకాంతంగా పనిచేయటానికి ఇష్టపడతారు. ఒకసారి ప్రారంభించిన పని మధ్యలో ఆపరు. స్వయంకృషితో ఉన్నత స్థానాన్ని చేరుకుంటారు. మంచి మాటకారితనం, చతురత కలిగి ఉండి అందరినీ ఆకర్షిస్తారు. మంచి రూపం కలిగి అందమైన వస్త్రధారణ చేస్తారు. నీతి నిజాయితీ, నియమ నిబద్ధతలతో జీవనం గడుపుతారు.

వీరిపై దైవకృప ఉండటం వలన పురోగతి సాధిస్తారు. వీరికి జోతిష్యం, న్యూమరాలజీ, తాంత్రిక, వైద్య శాస్త్రాలపై అవగాహన ఉంటుంది. వీరు ఈ విద్యలలో బాగా రాణించటమే గాక చాలా ఖ్యాతి పొందుతారు. పైథాగరస్ లాంటి మహానుభావుడు ఈ తేదీలో జన్మించిన వారికి న్యూమరాలజీని బోధించినట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. ఇది గొప్ప వశీకరణ కలిగిన తేదీ.

## జన్మదినం - 26

**వీరికి మనీ మేనేజ్‌మెంటు బాగా తెలుస్తుంది. ఓర్పు తక్కువ. సంపదతో అన్ని సుఖాలు అనుభవిస్తారు. 26వ సంవత్సరం నుండి అభివృద్ధి కలుగుతుంది.**

వీరికి వ్యాపార మెళుకువలు, మనీ మేనేజ్‌మెంట్ (ధన నియంత్రణ) బాగా తెలుసు. ఉన్నతి, అభివృద్ధి సాధించటానికి తీవ్రప్రయత్నాలు చేస్తారు. మంచి నిర్ణయాత్మక శక్తి కలిగి ఉంటారు. ధనం, మానవ సంబంధాల మధ్య సమతుల్యత పాటించటానికి

ప్రయత్నించాలి. పరోక్షశత్రువులు ఉంటారు. జీవిత ప్రథమార్ధంలో కష్టనష్టాలు, ఒడిదుడుకులు ఎదుర్కొని రాటుదేలతారు. ఆ అనుభవంతో తరువాత బాగా శ్రమించి ప్రగతి సాధిస్తారు. అనుకూలమైన నామ సంఖ్య ఉంటే అభివృద్ధిని సాధించగలుగుతారు.

సంపద లభించిన తరువాత ఆడంబరంగా జీవిస్తారు. మంచి ప్రతిభ, మేధాశక్తి, ఊహాశక్తి, ఇంట్యూషన్ కలిగి ఉంటారు. ధన కనక వస్తు వాహనాలు సంపాదిస్తారు. కానీ వీరికి సహనం, ఓర్పు కొంచెం తక్కువ. గతంలో పడిన కష్టాలు మరచిపోరు. దానివలన తరువాత జీవితంలో ఐశ్వర్యం ఎంతో ఇష్టంగా అనుభవిస్తారు.

వీరిపై అపవాదులు ఉంటాయి. వీరికి మంచి నాయకత్వ లక్షణాలు ఉంటాయి. ముఖ్యంగా డిసెంబర్, జనవరి నెలలో ఈ తేదీలో జన్మించిన వారు అట్టడుగు స్థాయిలో జీవితం మొదలుపెట్టినా ఉన్నత స్థాయిలోకి వెళతారు. ముఖ్యంగా వీరి 26వ సంవత్సరం నుండి అభివృద్ధి ఉంటుంది. 49 సంవత్సరాలు దాటిన తరువాత ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తారు.

## జన్మదినం – 27

**వీరికి నాయకత్వ లక్షణాలు ఉంటాయి. తత్వజ్ఞానం కలిగి ఉంటారు. వ్యవసాయం బాగా చేయగలుగుతారు. ప్రజాక్షేమం కోసం పాటుపడతారు.**

వీరు పుట్టుకతోనే నాయకత్వ లక్షణాలు పుణికిపుచ్చుకుంటారు. ఇతరులను ప్రభావితం చేయగలిగి కార్యనిర్వహణ సామర్థ్యం కలిగి ఉంటారు. మంచి తత్వజ్ఞానం కలిగి భవిష్యద్దర్శనం చేయగలుగుతారు. విశాల హృదయం కలిగి మంచి విద్యాభ్యాసం చేసి అనేక రంగాల్లో ముఖ్యంగా కళల్లో మంచి జ్ఞానం కలిగి ఉంటారు. కొందరు వ్యవసాయ భూములు కలిగి మంచి పంటలు పండించగలుగుతారు.

మంచి సృజనాత్మకత కలిగి ఉంటారు. చాలా మంది కళాకారులు ఈ జన్మదినం కలవారై ఉంటారు. ప్రయాణాలు చేయటానికి ఇష్టపడతారు. వివిధ ప్రదేశాలు తిరిగి విశేష అనుభవం, జ్ఞానం సంపాదిస్తారు. కొందరు వ్యాపార, పారిశ్రామిక రంగాల్లో చాలా ఉన్నత స్థితిని పొందగలుగుతారు.

రాజకీయ, ఆర్థిక, ఆధ్యాత్మిక, కళా రంగాలలో కీర్తి ప్రతిష్టలు పొందుతారు.

ప్రజా సంక్షేమం కోసం పాటుపడతారు. అయితే వీరు క్షమాగుణం అలవరుచుకుంటే మంచిది. ప్రతీకారం తీర్చుకునే ప్రయత్నం చేస్తే చెడు ఫలితాలు ఉంటాయి. ఆధ్యాత్మిక, తాత్విక ధోరణి అవలంబించుట అన్ని విధాల శ్రేయస్కరం. 9, 18, 27 తేదీల్లో 27వ తేదీ చాలా మంచి సంఖ్య.

వీరు నాయకులుగా ఎదుగుతారు. వీరికి మంచి పేరు ప్రతిష్టలు ఉంటాయి. వీరి తదనంతరం కూడా ప్రజలు గుర్తుంచుకుంటారు. రాజకీయ, మిలటరీ, పోలీస్, రియల్‌ఎస్టేట్, కోర్ ఇండస్ట్రీస్ రంగాలలో బాగా రాణిస్తారు.

## జన్మదినం – 28

**వీరు ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు కలిగి ఉంటారు. కపటం లేనివారు. స్త్రీలకు పురుషులు, పురుషులకు స్త్రీల హావభావాలు ఉంటాయి. ప్రజాసేవ చేస్తారు.**

వీరికి గొప్ప ఆత్మవిశ్వాసం కలిగి నాయకత్వ లక్షణాలు కలిగి ఉంటారు. కపటం లేనివారుగా ఉంటారు. మంచి విశ్లేషణాత్మక, తార్కిక బుద్ధి కలిగి ఉంటారు. ఎవరినీ తొందరగా నమ్మరు. నమ్మితే ప్రాణం ఇస్తారు. గొప్ప దైవభక్తి కలిగి ఉంటారు. మంచి శరీర సౌష్టవం, స్ఫురద్రూపం కలిగి గంభీరంగా ఉంటారు. ప్రశాంతవదనం కలిగి చిరునవ్వులు చిందిస్తుంటారు. కొందరు పురుషులకు, స్త్రీల వంటి హావభావాలు ఉంటాయి.

మనసులో ఉన్న ప్రేమాభిమానాలను బయటకు తెలియజేస్తారు. చిన్న పిల్లల్లా ఇట్టే కరిగిపోతారు. వీరి చూపులో ఆకర్షణ శక్తి కలిగి అందరూ వీరి చుట్టూ గుమికూడి ఉంటారు.

కళాకారులుగా, నటులుగా, రాజకీయ నాయకులుగా గొప్ప ఉన్నత స్థితిని చేరుకుంటారు. ఆత్మాభిమానం కలిగి ఉంటారు. ప్రజాసేవ చేయాలని కూడా కోరుకుంటారు. నామసంఖ్యకు, జన్మ సంఖ్యకు సఖ్యత లేకపోతే వీరి సంసార జీవితంలో కొన్ని ఒడిదుడుకులు ఉంటాయి. అందువలన వీరి వివాహ తేదీలు కూడా వీరి జన్మసంఖ్యకు సఖ్యత ఉండేలా చూసుకోవాలి.

## జన్మదినం - 29

**వీరు సిక్త్ సెన్స్ ప్రకారం పనులు చేస్తారు. జీవితంలో కొంచెం ఆలస్యంగా అభివృద్ధి వస్తుంది. భౌతిక, ప్రాపంచిక, ఆధ్యాత్మిక రంగాల్లో ఉన్నతి సాధిస్తారు.**

వీరు అసాధారణ స్ఫురణ (ఇంట్యూషన్), సృజనాత్మకత కలిగి పనులు సిక్త్ సెన్స్ ప్రకారం చేస్తుంటారు. ఆధ్యాత్మిక దృక్పథం కలిగి ఉంటారు. ఆధ్యాత్మిక, తాత్విక ధోరణిలో మాట్లాడటం వలన మిత్రులు, సన్నిహితులు అపార్థం చేసుకునే అవకాశం ఉంది. ఎటువంటి తర్కానికి అందని విధంగా వీరు తమ బుద్ధిని అనుసరించి ప్రవర్తిస్తారు. జీవితంలో కొంచెం ఆలస్యంగా వెలుగులోకి వస్తారు. అభివృద్ధి కొంచెం ఆలస్యం అవుతుంది. అనగా 29వ సంవత్సరం నుండి ఉద్యోగం, పెళ్ళి వంటివి జరుగుతాయి.

వీరి ఆలోచనలు తరచూ మారుతుంటాయి. ఏది చేయాలో ఒక నిర్ణయానికి తొందరగా రాలేరు. వీరు తమ శ్రేయోభిలాషుల సలహాలకనుగుణంగా వ్యవహరిస్తే జీవితంలో ఉన్నత స్థితికి వస్తారు. వీరి నామసంఖ్యను జాగ్రత్తగా పెట్టుకోవాలి లేకపోతే నిరాశకు లోనయ్యే అవకాశం ఉంది.

వీరికున్న ఇంట్యూషన్ వలన ఆధ్యాత్మిక సలహాదారులుగా రాణించగలుగుతారు. సున్నితమైన మనసు కలిగి చుట్టుపక్కల వాతావరణానికి ప్రభావితం అవుతారు. చాలా తొందరగా వీరి మనసు గాయపడుతుంది. దైవప్రార్థనలు, పూజల వలన మంచి అవకాశాలు చేజిక్కించుకుంటారు. చివరకు భౌతిక, ప్రాపంచిక, ఆధ్యాత్మిక రంగాల్లో ఉన్నతి సాధిస్తారు.

## జన్మదినం - 30

**వీరు సృజనాత్మకత కలిగి మేధావులుగా ఉంటారు. ఇతరులకు స్ఫూర్తి కలిగిస్తారు. ఇంటిని అందంగా అలంకరించుకుంటారు. వంట బాగా చేయగలుగుతారు.**

వీరు సృజనాత్మక నైపుణ్యం కలవారై ఉంటారు. మంచి మేధావులుగా, నిశిత బుద్ధి, శాస్త్రజ్ఞానం కలిగి ఉంటారు. రచనలు, దృశ్య కళలలో మంచి ప్రావీణ్యం

సంపాదిస్తారు. మంచి ఊహాశక్తి కలిగి, చతుర సంభాషణలు చేయగలరు. ఇతరులకు మంచి స్ఫూర్తిని కలిగించగలరు. స్నేహం, ప్రేమ, వాత్సల్యం కలిగి ఉంటారు.

పూల మొక్కలు, పువ్వుల యందు శ్రద్ధ కలిగి పూదోటలు పెంచుతారు. ఇంటిని అందంగా అలంకరించుకుంటారు. తమ ఆలోచనలను మాత్రమే కార్యరూపం చేస్తారు. ఇతరులు చెప్పేది విన్నా చివరికి వీరి ఆలోచన ప్రకారమే నిర్ణయం తీసుకుంటారు. అందంగా వస్త్రధారణ చేస్తారు. పాకశాస్త్రంలో ప్రావీణ్యం ఉంటుంది. ఒడిదుడుకులు వచ్చినపుడు మూడీగా ఉంటారు. వీరు ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ మరియు సైన్స్ సబ్జెక్టులో ఆసక్తి ఉంటుంది.

మంచి కీర్తిప్రతిష్టలు, ధనం సంపాదిస్తారు. ధనాన్ని సుఖాల కోసం, అలంకారాలు, ఆడంబరాల కోసం ఖర్చు చేస్తారు. అనవసర విషయాలపై దృష్టి పెట్టకుండా జీవిత లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకొని ముందుకు సాగితే మంచిది. వీరిని సంఘంలో గురువులుగా భావించి వీరి సలహాలను పొందుతారు. వీరి సలహాలను పాటించే వారు అభివృద్ధిని సాధిస్తారు.

## జన్మదినం - 31

**వీరు కుటుంబాన్ని, సంప్రదాయాల్ని ప్రేమిస్తారు. వాస్తవికంగా ఆలోచిస్తారు. నేల విడిచి సాము చేయరు. సరైన గుర్తింపు లభించలేదని బాధపడతారు. స్వేచ్ఛా జీవితం కోరుకుంటారు.**

వీరు తమ కుటుంబాన్ని, సాంప్రదాయాల్ని, వర్గాన్ని ప్రేమిస్తారు. ధైర్యం, సాహసం, ఆత్మవిశ్వాసం కలిగి ఉంటారు. వాస్తవికంగా ఆలోచిస్తారు. నేలవిడిచి సాము చెయ్యరు. మంచి శాస్త్రీయ పరిజ్ఞానం, సూక్ష్మ బుద్ధి కలిగి ఉంటారు. ఎక్కువ సమయం కష్టపడి పనిచేయగలుగుతారు. కానీ శక్తికి మించిన శ్రమ చేయకుండా విశ్రాంతి తీసుకోవటం వీరికి అవసరం. వీరి సామర్థ్యం పూర్తిగా గుర్తింపబడలేదనే భావం ఉంటుంది.

ఏదో తెలియని దివ్యశక్తి వీరిని నడిపిస్తున్నట్లుగా ఉంటుంది. ఒక్కొక్కసారి మొండిగా, కఠినంగా ఉండి నూతన విధానాలు, పద్ధతులను వ్యతిరేకిస్తారు. సాంప్రదాయ పద్ధతులనే ఇష్టపడతారు. దీని వలన ఒక్కొక్కసారి నిరాశ, నిస్పృహలకు లోనయ్యే

అవకాశం ఉంది. ఏకాంత జీవనం, స్వేచ్ఛా జీవితం కోరుకుంటారు. వీరిపై ఆధారపడిన వారిని ప్రేమతో, వాత్సల్యంతో చూస్తారు. వారి కోసం ఎవరినైనా ఎదిరిస్తారు. వీరు ఎంబీఏ, సీఏ, ఎల్ఎల్బీ, కంప్యూటర్ రంగాలపై ఆసక్తి చూపుతారు.

దైవకృప వలన గొప్ప పనులు చేయగలుగుతారు. రచనలు, నటన, సంగీతం వంటి వాటిలో ప్రావీణ్యం ఉంటుంది. స్నేహితులు, బంధువులతో సత్సంబంధాలు కలిగి ఉంటారు. ఏకాగ్రతతో కృషి చేస్తే విజయం వీరికి సొంతం. వీరి నామసంఖ్యను జన్మ తేదీకి సఖ్యత గల నామసంఖ్యతో పేరు పెట్టుకుంటే అవరోధాలను అధిగమించవచ్చు.

# మాస్టర్ నెంబర్లు

**న్యూమరాలజీలో ఎక్కువ ప్రభావం, శక్తి కలిగిన రెండు నెంబర్లు మాస్టర్ నెంబర్లు. అవి 11 మరియు 22. 11 సంఖ్య ఇంట్యూషన్, దివ్యదృష్టిని కలిగిస్తుంది. 22 సంఖ్యను మాస్టర్ బిల్డర్‌గా చెప్పవచ్చు.**

న్యూమరాలజీలో సంఖ్యల ప్రాముఖ్యత తెలుసుకున్నాం. ఇందులో ప్రత్యేకమైన లక్షణాలు కలిగిన రెండంకెల సంఖ్యలు రెండు ఉన్నాయి. అవి 11 మరియు 22. వాటిని వాటికున్న ప్రత్యేకత, ప్రాధాన్యత బట్టి 'మాస్టర్ నెంబర్లు'గా పిలువబడుతున్నాయి. వీటికి మిగతా నెంబర్ల కంటే ఎక్కువ శక్తి, ప్రభావం ఉన్నాయి కాబట్టి ఇవి "మాస్టర్ నెంబర్"గా వర్ణించబడ్డాయి. ఈ సంఖ్యలు చాలా శక్తివంతమైనవి. హాండిల్ చేయటానికి కష్టమైనవి, సంక్లిష్టమైనవి. వ్యక్తుల యొక్క వ్యక్తిత్వం, స్వభావంకి ఈ నెంబర్లు అనుసంధానం కావటానికి సమయం, పరిణితి, గొప్ప ప్రయత్నం అవసరం.

ఈ మాస్టర్ నెంబర్లు అనేవి జన్మదినంలోనూ, నామసంఖ్యలోనూ రెండింటిలోనూ చూసుకోవాలి. జన్మదినంలోని సంఖ్యలను మార్చలేంగాని నామసంఖ్యను మార్చుకొని 'మాస్టర్ నెంబర్' వచ్చేటట్టుగా చేసుకోవచ్చు.

కొందరికి పేరులో మాస్టర్ నెంబర్లు రెండుసార్లు రావడం అనేది అరుదుగా జరుగుతుంది. పేరులో మాస్టర్ నెంబరు రెండు అంతకంటే ఎక్కువసార్లు వచ్చిన వ్యక్తులు చాలా ఆధ్యాత్మికత, తాత్విక భావం కలిగి అతి సున్నితత్వం కలిగి ఉంటారు.

అటువంటి వారు ఆధ్యాత్మిక, తాత్వికభావం, మానవత్వం, సున్నితమైన మనస్సు ఉండి బాహ్య ప్రపంచంలో చుట్టూ ఉండే వారి ప్రవర్తనను ఏవగించుకొని, ఒత్తిడిని తట్టుకోలేక సతమతమవుతారు.

ఈ అతి ప్రవర్తన వలన మాస్టర్ నెంబరు పేరులో ఎక్కువసార్లు వచ్చిన వారిలో కొందరు దుర్వ్యసనాలకి బానిస కావటం, ఆత్మహత్య చేసుకోవాలని అనిపించటం వంటివి జరిగే అవకాశం ఉంది.

అందువల్ల ఈ విధంగా మాస్టర్ నెంబరు రెండుసార్లు ఉన్న వారికి వారి తల్లిదండ్రులు, చిన్నతనం నుండే ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకొని, వారిలో పాజిటివ్ ఆలోచనలు ప్రేరేపింపజేస్తే, అటువంటి వారు ఉన్నత స్థితికి ఖచ్చితంగా చేరుకుంటారు.

**11 సంఖ్య:** అన్ని సంఖ్యల కంటే అసాధారణమైనది. ఈ సంఖ్య ప్రకాశాన్ని సూచిస్తుంది. మనసు పొరల లోతుల్లోకి ఇది ఒక మార్గం లాంటిది. హేతుబద్ధమైన ఆలోచన అవసరం లేకుండానే అసాధారణ స్ఫురణ, దివ్యదృష్టిని కలిగించేది. సున్నితత్వాన్ని, నరాల బలాన్ని, సిగ్గుని, అవాస్తవికతను సూచిస్తుంది. ఇది కలలు కనేటట్టు చేస్తుంది. 2 సంఖ్యకు ఉన్న లక్షణాలన్నీ 11 సంఖ్యకు కూడా ఉంటాయి. దీనికి తోడుగా మెరుగైన ఆకర్షణ శక్తి, నాయకత్వ లక్షణాలు, ఉత్సాహం దీనికి ఉంటాయి. జన్మతః దీనికి ద్వైత గుణాలు ఉంటాయి. అవి ఉత్సాహాన్ని, లోలోపల సంఘర్షణలు కలిగిస్తాయి. ఈ సంఖ్య లక్ష్యం మీద గురిలేనప్పుడు, వ్యక్తులలో భయాలను, ఆందోళనలను కలుగజేస్తుంది. గొప్ప అభివృద్ధికి, వినాశనానికి మధ్య ఉన్న సన్నని సరిహద్దు రేఖపై ఈ సంఖ్య నడుస్తుంది. దీని శక్తి, ప్రగతి, స్థిరత్వం, ఆధ్యాత్మిక సత్యాలను సరిగ్గా అవగాహన చేసుకున్న వారికి సొంతం అవుతాయి. ఇది శాంతిని, ప్రశాంతతను, తర్కం, లాజిక్ ద్వారా కాకుండా నమ్మకం, విశ్వాసం ద్వారా కలిగిస్తుంది. ఇది మానసిక సంఖ్య.

డెస్టినీ నంబరు 11 ఉన్న వ్యక్తులు ఆత్మజ్ఞానం కలిగి ఉంటారు. ఊహాలోకంలో ఉండి మంచి దార్శనికత కలిగి ఉంటారు. వీరికి అసాధారణ స్ఫురణ (ఇంట్యూషన్) ఉంటుంది. ఏదో తెలియని దివ్యశక్తి తమకు సందేశం పంపుతున్నట్లుగా వీరికి అనిపిస్తుంటుంది. వీరికి తత్వశాస్త్రం, అతీంద్రియ శక్తుల పట్ల ఆసక్తి ఉంటుంది. మానవత్వం కలిగి ఉంటారు.

నామసంఖ్యలో 11 ఉన్న వ్యక్తులు ఆదర్శభావాలు, అసాధారణ స్ఫురణ కలిగి తమ చుట్టూ ఉన్న వారిని ప్రభావితం చేస్తారు. మానవత్వం, తాత్వికభావం, కళాత్మక హృదయం, వాస్తవిక దృష్టిని కలిగి ఉంటారు. వీరు మంచి పనితనం కలిగి ఉండి ఎదుటి వారి నుండి కూడా అదే కోరుకుంటారు. విరుద్ధ భావాలున్న వ్యక్తుల మధ్య సామరస్యం కలిగించగలుగుతారు. ఈ సంఖ్య నెగిటివ్ ప్రభావం గాని చూపితే, క్షుద్ర తాంత్రిక విద్యలు, దుర్వ్యసనాల వైపు ఆకర్షణ కలుగుతుంది. అందువల్ల పాజిటివ్ ఆలోచనలు పెంపొందించుకుంటే, ఉన్నత స్థితిని పొందగలుగుతారు.

**11 సంఖ్య ఉన్నవారికి అనుకూల వృత్తులు:** జ్యోతిషం, ఖగోళశాస్త్రం, న్యాయవాద వృత్తి, కంప్యూటర్స్, నాట్యం, సినీ రంగం, మ్యాజిక్, సంగీతం, మానసిక వైద్యం మొదలైనవి అనుకూలం.

**సంఖ్య 22:** అన్ని సంఖ్యల్లోకెల్లా గొప్ప శక్తివంతమైనది. దీనిని 'మాస్టర్ బిల్డర్'గా చెప్పవచ్చు.

కలలు సాకారం చేస్తుంది. మంచి విజయవంతమైన సంఖ్య. 11 సంఖ్యకున్న ఉత్సాహపూరిత, అసాధారణ దృష్టి లాంటి లక్షణాలు ఈ సంఖ్యకు కూడా ఉన్నాయి. అయినప్పటికీ ఇది 11లా కాకుండా వాస్తవికతను, క్రమబద్ధమైన స్వభావాన్ని 4 సంఖ్యలాగే కలిగిస్తుంది. ఇది పరిమితులు లేని సంఖ్య కాని క్రమశిక్షణ కలది. ఊహాలోకంలో ఉన్న కలలను ఇది భౌతికంగా తీసుకొనిరాగలదు. గొప్ప ఆలోచనలు, ప్రణాళికలు, ఆదర్శాలు, నాయకత్వం, ఆత్మవిశ్వాసం కలిగిస్తుంది. దీనిని ప్రాక్టికల్‌గా వినియోగించకపోతే శక్తి అనవసరంగా వ్యర్థం అవుతుంది. అందువలన 11 వలె కుచించుకుపోయి, ఒత్తిడిని తట్టుకోలేని విధంగా అవుతుంది. ఈ 11, 22 సంఖ్యలు జీవిత ప్రారంభంలో ఒత్తిడిని ఎక్కువగా కలిగిస్తాయి. జీవిత గమ్యాన్ని, లక్ష్యాన్ని తెలుసుకొని ఆశావహ దృక్పథంతో ముందుకు వెళితే ఈ సంఖ్యలు ఎనలేని మేలు చేస్తాయి.

డెస్టినీ నంబరు 22 ఉన్న వ్యక్తులు, వినూత్న భావాలు కలిగి ఉంటారు. వీరికి కొత్త కొత్త ప్రయోజనాత్మకమైన ఆలోచనలు వస్తుంటాయి. వీరు తమ మానసిక, ఆధ్యాత్మిక శక్తులను వాస్తవ రూపంలోకి తీసుకురాగలుగుతారు.

ఆదర్శభావాలు, తొందరగా అర్థం చేసుకునే శక్తి కలిగి ఉంటారు. నాయకత్వ లక్షణాలు కలిగి ఉంటారు. వీరు గౌరవప్రదమైన స్థానంలో ఉండి, అంతర్జాతీయ స్థాయిలో, వ్యాపార, విద్య, రాజకీయ, మత సంస్థలు నడపగలిగే శక్తి కలిగి ఉంటారు.

నామసంఖ్యలో 22 ఉన్న వ్యక్తులు ఎంతో జాగ్రత్త వహించాల్సి ఉంటుంది. ఏదో తెలియని గొప్ప శక్తి వీరిలో ఉంటుంది. కాని దానిని పాజిటివ్‌గా ఆలోచించి సరైన దశలో వాడగలిగితేనే మంచి ఫలితాలు పొందుతారు. ఆదర్శభావాలు కలిగి వాటి వలన ఇతరులకు ఏ విధంగా ఉపయోగం అవుతుందో వీరికి బాగా తెలుసు. వీరు మధ్యవర్తిత్వం బాగా చేయగలుగుతారు. కాని అధికమైన పని ఒత్తిడి వలన నీరసించిపోయే అవకాశం ఉంది. వీరు ఒంటరిగా ఉండి తమ మానసిక శక్తిని సరైన మార్గంలో పెట్టడానికి తగు ప్రయత్నం చేస్తే మంచిది.

**22 సంఖ్య ఉన్న వారికి అనుకూల వృత్తులు:** అకౌంట్స్, న్యాయవాద వృత్తి, సహకార సంస్థలు, ఇంజినీరింగ్, ఫైనాన్స్, రియల్ ఎస్టేట్, గణితం, మానసిక వైద్యం, సంగీతం, సినీరంగం మొదలైనవి.

# డెస్టినీ నంబరు

**జన్మదినంలో తేదీ, నెల, సంవత్సరంలో ఉండే మొత్తం సంఖ్యలు కలుపగా వచ్చే ఏక సంఖ్యను డెస్టినీ నంబరు అంటారు. డెస్టినీ నెంబరు వ్యక్తుల జీవిత గమనం, విధి ఎలా ఉంటుందో తెలియజేస్తుంది. మాస్టర్ నెంబర్లు అయిన 11, 22ను మాత్రం మళ్ళీ కలుపరాదు.**

జన్మదినం, తేదీ, నెల, సంవత్సరం మొత్తం కలిసి సాధారణంగా తెలియచేస్తాం. ఉదా : 31-03-1960. ఇందులో 31; అంటే తేదీ జన్మ సంఖ్యను తెలియచేస్తుంది. అపుడు జన్మసంఖ్య 3+1=4 అవుతుంది. జన్మదినంలో మొత్తం అంకెలు కూడగా వచ్చే సంఖ్యను డెస్టినీ నెంబర్ అంటారు. ఉదా : 3+1+3+1+9+6+0 = 23 = 5. జన్మసంఖ్య వ్యక్తి యొక్క శారీరక, మానసిక స్వభావాన్ని తెలియచేస్తుంది. అయితే జన్మదినం మొత్తం కూడగా, 11 గానీ, 22 గానీ వస్తే వాటిని మళ్ళీ కలపకూడదు (1+1=2) (2+2=4) ఎందుకంటే, 11, 22 రెండూ 'మాస్టర్ నెంబర్లు' వాటికి న్యూమరాలజీలో చాలా ప్రాముఖ్యత ఉంది. ఉదాహరణకు ఒక వ్యక్తి జన్మదినం 10-10-1991. అయితే ఆ వ్యక్తి డెస్టినీ నెంబరు 1+0+1+0+1+9+9+1 = 22 అవుతుంది. మరలా 2+2 అని కలపకూడదు. డెస్టినీ నెంబరు వ్యక్తి యొక్క "విధి" ని తెలియచేస్తుంది. అందుకే దీనిని 'విధి సంఖ్య" అని కూడా అంటారు.

డెస్టినీ నెంబరు వ్యక్తుల జీవితంలో ఎంతో ప్రాధాన్యత కలిగి ఉంది. ఈ సంఖ్య, ఆ వ్యక్తి యొక్క జీవితం ఎలా ఉండబోతుంది, ఏ వృత్తులు స్వీకరిస్తారు, ఆదరాభిమానాలు, సన్మానాలు, వివాహ విషయం, చదివిన చదువుకు ఎలాంటి గుర్తింపు వస్తుంది, జీవిత గమనంలో ఎటువంటి వ్యక్తుల సాంగత్యం కలుగుతుంది. జీవితంలో ఎటువంటి సంఘటనలు జరుగబోతాయి, చివరకు వ్యక్తుల జీవితానికి ఏవిధమైన ముగింపు కలుగుతుంది లాంటి విషయాలు డెస్టినీ నెంబరు వలన అంచనా వేయవచ్చు. వ్యక్తుల, భౌతికశరీరం, మనసు, బుద్ధి మొదలగునవి జన్మ సంఖ్య ప్రభావంలో ఉంటాయి. జీవితగమనం మాత్రం డెస్టినీ నెంబరుపై ఆధారపడి ఉంటుంది. జన్మ సంఖ్య కంటే, డెస్టినీ నంబరు శక్తివంతంగా ఉన్నపుడు అది వ్యక్తుల, భౌతిక శరీరం, బుద్ధి, మనసు

స్వభావాలపై కూడా ప్రభావం చూపిస్తుంది.

జీవిత గమనంలో సంఘటనలపై డెస్టినీ నెంబరు ప్రభావం చూపిస్తుంది. జీవిత గమనంలో 35 సంవత్సరాలు దాటిన తరువాత డెస్టినీ నెంబరు నెమ్మదిగా పనిచేయటం ప్రారంభించి వ్యక్తుల, స్వభావం, ప్రవర్తనలో మార్పును తీసుకొస్తుంది. ఒక వ్యక్తి వృత్తి, ఉద్యోగాలు డెస్టినీ నెంబరు పైనే ఆధారపడి ఉన్నాయి. డెస్టినీ నంబర్ల గురించి విపులంగా అంటే 37 అంటే ఏమిటి, 29 అంటే ఏమిటి అనేది నా తదుపరి గ్రంథములో వివరిస్తాను.

## డెస్టినీ నంబరు - 1

**స్వతంత్రత వీరి ప్రథమ లక్షణం. మేధావులుగా, నాయకులుగా ఉంటారు.**

స్వతంత్రత వీరి ప్రథమ లక్షణం. డెస్టినీ నంబరు 1 ఉన్న వ్యక్తులు జీవితంలో ఏదైనా వారి స్వయంకృషితోనే సాధిస్తారు. జీవిత ప్రారంభంలో వేరొకరిపై ఆధారపడి ఉన్నా, తరువాత క్రమంగా, స్వతంత్రను సంతరించుకొని, స్వయంకృషి చేస్తారు. వీరు, మేధావులుగా, నాయకులుగా, మార్గదర్శకులుగా ఎదుగుతారు. గొప్ప ఆత్మవిశ్వాసంతో, ఆశావహ దృక్పథంతో దృఢ సంకల్పం, హఠం చేసే మనస్తత్వం కలిగి ఉంటారు. విశ్లేషణాత్మక బుద్ధి, నాయకత్వ లక్షణాలు కలిగి ఉంటారు. మంచి నిర్వహణా సామర్థ్యం కలిగి తమ రంగంలో కీలకస్థానానికి చేరుకుంటారు.

డెస్టినీ నెంబరు 1 గల కొందరు వ్యక్తులు దాని వ్యతిరేక ప్రభావానికి లోనవుతారు. ఈ నెగిటివ్ ప్రభావం వలన కొందరు పూర్తిగా ఇతరులపై ఆధారపడే విధంగా ఉండటం, దానిని ఇతరులు దుర్వినియోగం చేయటం జరుగుతుంది.

ఇంకొక నెగిటివ్ లక్షణం, వీరు అహంభావులుగా మారి, తమ ఉన్నతి కోసం ఇతరుల వినాశనానికి ప్రయత్నిస్తారు. “నేనే నంబర్ 1” అనే అహంభావం కలిగి ఉంటారు. డెస్టినీ నెంబరు 1 గల కొందరు ప్రముఖవ్యక్తులు జార్జ్ వాషింగ్టన్, హెన్రీ ఫోర్డు, చార్లీ చాప్లిన్, ఫ్లోరెన్స్ నైటింగేల్, మిఖాయిల్ గోర్బచేవ్.

## డెస్టినీ నంబరు - 2

**సహకారం వీరి ప్రథమ లక్షణం. అందంగా ఉంటారు. అతిథి మర్యాదలు చేస్తారు. నాయకులుగా కాకుండా నెంబరు 2గా ఉంటారు.**

డెస్టినీ నెంబరు 2 గల వ్యక్తుల వద్ద అందరూ చాలా సౌకర్యంగా ఉన్నట్టు భావిస్తారు. వీరు అతిథి సత్కారాలు బాగా చేయగలుగుతారు. ఇతరుల యొక్క అవసరాలను తొందరగా పసిగట్టి వారికి సాయంచేసి స్నేహితులుగా చేసుకుంటారు. అందరితో శాశ్వత సత్సంబంధాలు కలిగి ఉంటారు. వీరు అసాధారణ స్ఫురణ (ఇంట్యూషన్) కలిగి, సున్నితమైన మనసు కలిగి, శాంతికాముకులుగా ఉంటారు.

వ్యక్తుల యొక్క హోదా, స్థితి గతులు చూడకుండా అందరితో స్నేహపూరితంగా ఉంటారు. అందువలన వీరు "నెంబర్ 1" కాకుండా "నెంబర్ 2" స్థానంలో ఉంటారు. అధికారం చేజిక్కుంచుకునే కంటే, "కింగ్ మేకర్స్" గా ఉండటానికి ఇష్టపడతారు. అందరి చేత గుర్తింపు పొంది గౌరవింపబడతారు.

ఈ సంఖ్య నెగిటివ్ ప్రభావం చూపితే, ఆ వ్యక్తులు నాయకులుగా ఎదగటానికి విశ్వప్రయత్నం చేసి, అందులో విజయం సాధించినా "నెంబర్ 1" స్థానంలో తృప్తిని పొందలేక సతమతమవుతారు. డెస్టినీ నంబరు 2 గల కొందరు ప్రముఖులు రోనాల్డ్‌రీగన్, మడోన్నా, జూల్స్‌వెర్న్, బాబీఫిషర్, ప్రిన్స్ ఫిలిప్.

## డెస్టినీ నంబరు - 3

**భావ ప్రకటన వీరి ప్రథమ లక్షణం. కవులుగా, రచయితలుగా గుర్తింపు పొందుతారు.**

భావప్రకటన వీరి ప్రథమ లక్షణం. డెస్టినీ నెంబరు 3 గల వ్యక్తులు ఆదర్శవంతంగా, సృజనాత్మకంగా వారి భావాలను ప్రకటించగలుగుతారు. మంచి వక్తలుగా, కవులుగా, రచయితలుగా గుర్తింపు పొందుతారు. చక్కటి సంభాషణా చాతుర్యం కలిగి, జీవితమాధుర్యాన్ని వర్ణించగలుగుతారు. చురుకుగా ఉండి గొప్ప ఆలోచనలు

కలిగి ఉంటారు. వాటిని కార్యరూపం దాల్చే విషయంలో కొంత వెనుకబడి ఉంటారు.

అందరితో స్నేహపూర్వకంగా ఉంటారు. వీరు తమ చుట్టూ ఎపుడూ జన సందోహాన్ని కోరుకుంటారు. ఈ సంఖ్య నెగిటివ్ లక్షణాల వలన కొందరు ఊరికే ఊకదంపుడుగా, స్థిరమైన బుద్ధి లేకుండా ఉంటారు. అన్ని విషయాలలో ప్రవేశం ఉన్నట్లుగా ఉన్నా ఎందులోనూ రాణించలేరు. ఈ వైఫల్యం వలన కొందరు త్రాగుడు, మత్తు పదార్థాల వంటి దుర్వ్యసనాలకు లోనుకావచ్చు. డెస్టినీ నెంబరు – 3 గల కొందరు వ్యక్తులు, ఆల్‌ఫ్రెడ్ హిచ్‌కాక్, బిల్‌కోస్బి, జూన్ బెలూషీ లాంటి ఎంటర్‌టైనర్స్.

## డెస్టినీ నంబరు - 4

**పద్ధతి, క్రమశిక్షణ వీరి ప్రథమ లక్షణం. ఏ పనైనా పద్ధతిగా చేస్తారు.**

పద్ధతి, క్రమబద్ధత వీరి ప్రథమ లక్షణం. ఈ డెస్టినీ నంబరు గల వ్యక్తులు, వారి లక్ష్యసాధనకు చాలా కష్టించి పనిచేస్తారు. వీరు చాలా నమ్మకస్తులుగా, వాస్తవికంగా, పద్ధతిగా, క్రమబద్ధతతో కార్యనిర్వహణ చేస్తారు. ఎంతటి గందరగోళ పరిస్థితులనైనా చక్కదిద్ది క్రమబద్ధీకరణ చేయగలరు. కష్టపడిపనిచేసి, ఫలితాన్ని చూసి ఆనందిస్తారు. ఫలితం కోసం ఎన్ని సంవత్సరాలైనా నిరీక్షణ చేస్తారు.

ఒకసారి నిర్ణయం తీసుకున్న తరువాత దానిని మార్చరు. ఆ విషయంలో మొండిగా ఉంటారు. ఇష్టాయిష్టాలను తెలియచేయటానికి వెనుకాడరు. దీని నెగిటివ్ ప్రభావం వలన కొందరు వారి వారి పరిమితులను, హద్దులను ఏవగించుకొని, దురుసుగా ప్రవర్తిస్తారు. దుర్భాషలు కూడా మాట్లాడతారు. నిరాశనిస్పృహలకు లోనవుతారు. ఈ డెస్టినీ నెంబరు గల కొందరు ప్రముఖులు – మార్కొనీ, థామస్ బీచమ్, జె.పి. కెన్నడీ.

## డెస్టినీ నంబరు - 5

**స్వేచ్ఛ, విభిన్నత వీరి ప్రథమ లక్షణం. రొటీన్‌కి భిన్నంగా ఉన్న వాటిని ఇష్టపడతారు.**

స్వేచ్ఛ, విభిన్నత వీరి ప్రథమ లక్షణం. డెస్టినీ నెంబరు 5 గల వ్యక్తులు, జీవితంలో

స్వేచ్ఛగా, విభిన్నమైన పనులు చేయటానికి ఇష్టపడతారు. వీరి మార్గానికి ఎటువంటి ఆటంకాలు, అవరోధం కలిగినా చాలా అసహనానికి గురవుతారు. ప్రయాణాలు, వినోదం, ఎప్పుడూ రొటీన్‌గా ఉండే వాటికి భిన్నమైనవి ఇష్టపడతారు. మెరుపు వేగంతో ఆలోచించి సమస్యలకు పరిష్కారం కనుగొంటారు. జీవిత ప్రారంభంలో కొంత తడబాటు ఉన్నా, తరువాత గమ్యాన్ని తెలుసుకొని, విజయమార్గం వైపు పయనించి ఫలితాన్ని పొందుతారు.

వీరు చాలా ఉత్సాహంగా, ఆసక్తిగా, మానసిక యవ్వనంతో ఉంటారు. ఈ నెంబరు నెగిటివ్ ప్రభావం వలన కొందరూ అన్నింటా "అతి" చేస్తుంటారు. మనసు చంచలంగా ఉండి నిర్ణయాలు వెంట వెంటనే మార్చటం, దుర్వ్యసనాలకు లోనయ్యే అవకాశం ఉంది. ఈ సంఖ్య గల ప్రముఖులు అబ్రహం లింకన్, న్యూటన్, రూజ్‌వెల్ట్, మార్క్‌ట్వైన్, హెలెన్ కెల్లర్.

## డెస్టినీ నంబరు - 6

**కుటుంబ బాధ్యత వీరి ప్రథమ లక్షణం. సహాయకారులుగా ఉండి ఇతరుల బాధ్యతలు స్వీకరిస్తారు.**

ఇల్లు, కుటుంబ బాధ్యతలు వీరి ప్రథమ లక్షణం. ఈ డెస్టినీ నంబరు కలవారు, బాధ్యతాయుతంగా, వాత్సల్యపూరితంగా, అందరిని ఆదరించే విధంగా ఉంటారు. ఇతరుల బరువు బాధ్యతలు సంతోషంగా స్వీకరించి వారికి ఆసరాగా ఉంటారు. తాము ఇష్టపడే వ్యక్తులకు సహాయకారులుగా ఉంటారు. ఇతరుల సమస్యలను, అందరికీ ఆమోదయోగ్యమైన, సంతోషకరమైన పరిష్కారాలు చేయగలుగుతారు.

స్నేహితులు, ప్రేమించేవారు దగ్గర ఉన్నపుడు, అంతులేని ఆనందాన్ని పొందుతారు. వీరు మంచి సృజనాత్మకత కలిగి, కళారంగాలలో రాణిస్తారు. ఈ డెస్టినీ నెంబరు కలవారికి చాలా అరుదుగా నెగిటివ్ ప్రభావం ఉంటుంది.

కానీ, అందరి సమస్యలను నెత్తిన వేసుకోవటం వలన ఉక్కిరిబిక్కిరి అయ్యే అవకాశం ఉంది. ఈ డెస్టినీ నెంబరు కల కొందరు ప్రముఖులు థామస్ అల్వా ఎడిసన్, ఐన్‌స్టైన్, ఐసన్‌హోవర్, జవహర్‌లాల్ నెహ్రూ, నిక్సన్ తదితరులు.

## డెస్టినీ నంబరు - 7

**విశ్లేషణ, అవగాహన వీరి ప్రథమ లక్షణం. ఆలోచనలు, పనులు ఒరిజినాలటీ కలిగి ఉంటాయి.**

విశ్లేషణ, అవగాహన శక్తి వీరి ప్రథమ లక్షణం. ఈ డెస్టినీ నెంబరు కలవారు మంచి జ్ఞానం, వివేకం కలిగినవారై యుంటారు. చేసే ఏ పనిలోనైనా చాలా ప్రత్యేకమైన అభిరుచి, అవగాహన కలిగి ఉంటారు. దీని వలన వీరి ఆలోచనలు, పనులు, ఒరిజినాలిటీ కలిగి ఉండి మార్పులు, చేర్పులు చేయటానికి కష్టతరంగా ఉంటాయి. అందువలన వీరు పదుగురుతో కలిసి పనిచేసేటపుడు కొంత అసౌకర్యానికి గురవుతారు. వీరు కొద్దిమంది ఆంతరంగిక స్నేహితులనే కోరుకుంటారు.

ఎక్కువ మంది మిత్రులుండటం వీరికి నచ్చదు. అంత తొందరగా స్నేహం చేయరు. కానీ ఒకసారి స్నేహం చేస్తే వారిని విడువరు. జాగ్రత్తగా, గుంభనంగా, ఆత్మవిమర్శతో, ఆధ్యాత్మిక భావాలతో ఉంటారు. వీరి జీవితంలో తాత్వికత, వయసుతో పాటు పెరుగుతుంది. ఈ నెంబరు నెగిటివ్ ప్రభావం వల్ల కొందరు, ఎవరితో కలవక ఒంటరిగా ఉంటారు. ఎక్కువగా ఆత్మవిమర్శ చేసుకుంటూ "నేను" అనే పరిధిలోనే ఉండిపోతారు. ఈ డెస్టినీ నెంబరు కల ప్రముఖులు చర్చిల్, కెన్నడీ, లూయిస్‌పాశ్చర్, లేవాలేసా, క్వీన్ ఎలిజబెత్-2, మెల్‌గిబ్సన్, తదితరులు.

## డెస్టినీ నంబరు - 8

**భౌతికవాదం వీరి ప్రథమ లక్షణం. వ్యాపారం, భారీ పరిశ్రమలలో విజయం సాధిస్తారు.**

భౌతిక వాదం వీరి ప్రథమ లక్షణం. ఈ డెస్టినీ నంబరు కలవారు భారీ పరిశ్రమల వంటి వ్యాపారాలలో ఉండి అభివృద్ధి, విజయం సాధిస్తారు. భారీ లక్ష్యాలు నిర్ణయించుకొని దానికి అనుగుణంగా ప్రణాళికలు వేసుకుంటారు. ఆశావాద దృక్పథం ధృడసంకల్పం కలిగి లక్ష్యసాధన చేస్తారు. ఊహాలోకాలలో విహరించరు. కలలు కనే మనస్తత్వం

కాదు. వాస్తవికంగా ఆలోచిస్తారు. వీరు మంచి ధన నియంత్రణ కలిగి గొప్ప సంపద పొందిన తరువాత దానగుణం, ఉదారత కలిగి ఉంటారు.

వ్యక్తుల మనస్తత్వాలను బాగా విశ్లేషించగలుగుతారు. మంచి నాయకత్వ లక్షణాలు కలిగి, బాధ్యతాయుతమైన ఉన్నతపదవులు అలంకరిస్తారు. ఇతరులకు వీరు మొండివారుగా కఠినంగా కనిపించినా, వీరు మాత్రం తమలోని ఈ లక్షణాలను గుర్తించరు. ఈ నెంబరు నెగిటివ్ లక్షణం వలన కొందరు, సంబంధ బాంధవ్యాలు, ఆరోగ్యం, సంతోషం లాంటివి చెడుతున్నా ధనసంపాదనే ధ్యేయంగా ఉంటారు. అసహనం, ప్రతీకారం, అధికారదాహం కూడా వ్యతిరేక లక్షణాలే. ఈ డెస్టినీ నెంబరు కల కొందరు ప్రముఖులు జార్జ్ బెర్నార్డ్ షా, జాన్‌కెల్లీ, ఎలిజబెత్ టేలర్, పికాసో మొదలగువారు.

## డెస్టినీ నంబరు - 9

**మానవతావాదం వీరి ప్రథమ లక్షణం. సున్నితమైన మనసు, త్యాగబుద్ధి కలిగి ఉంటారు.**

మానవతావాదం వీరి ప్రథమ లక్షణం. ఈ డెస్టినీ నెంబరు కలవారు త్యాగబుద్ధి కలిగి ఉంటారు. వీరు సున్నిత మనస్కులుగా ఉండి, ఇతరుల అవసరాలు తెలుసుకుని వారికి సాయం చేస్తూ ఆనందిస్తారు. ఎదుటివారి నుండి తిరిగి ఏమీ ఆశించరు. ఇది సాకుగా తీసుకొని కొందరు వీరిని వాడుకుంటారు. వీరు శృంగారభరితమైన హృదయం కలిగి ఉంటారు. తగిన ప్రేమను పొందలేనపుడు నిరాశకు గురవుతారు.

మానవతావాదం, సృజనాత్మకత కలిగిన వీరు తమ భావాలను ఆలోచనలు, రచనల ద్వారా రకరకాలుగా తెలియచేస్తారు. దీని నెగిటివ్ లక్షణం ఈ విధంగా స్వార్థరహితంగా ఉండటం చాలా కష్టం. వీరు ఎప్పుడూ ఇవ్వటమే కాని తీసుకోరు. భావ, వ్యక్తిత్వ సంఘర్షణ వలన వీరు సంతృప్తులుగా ఉండలేరు. ఈ డెస్టినీ నెంబరు కల ప్రముఖులు మహాత్మాగాంధీ, డస్టిన్ హాఫ్‌మాన్, హారిసన్ ఫోర్డు, రాక్‌ఫెల్లర్, జిమ్మీకార్టర్, బెనజీర్ భుట్టో తదితరులు.

## డెస్టినీ నంబరు - 11 (మాస్టర్ నెంబర్)

**ఆదర్శభావాలు వీరి ప్రథమ లక్షణం. ఊహాశక్తి, క్రియాశీలత కలిగి ఉంటారు.**

ఆదర్శభావాలు వీరి ప్రథమ లక్షణం. ఈ డెస్టినీ నెంబరు కలవారు మంచి ఊహాశక్తి, ఆదర్శభావాలు కలిగి ఉంటారు. క్రియాశీలత కంటే, ఆలోచనలే వీరికి ప్రధానం. వీరికి సరియైన ప్రోత్సాహం లభించినట్లయితే, అద్భుతాలు సాధించగలుగుతారు. వీరి ఆలోచనలు ఊహాజనితంగా, వాస్తవికత లోపించి ఉంటాయి కాబట్టి వీరు తమ ఆలోచనలను, జాగ్రత్తగా విశ్లేషణ చేసి ఏ పనైనా చేయాలి. వీరికి అసాధారణ స్ఫురణ (ఇంట్యూషన్) వాత్సల్యం ఉంటాయి. ఈ నెంబర్ నెగిటివ్ లక్షణం, వీరు అవాస్తవికమైన కలల ప్రపంచంలో ఉంటారు. అభూత కల్పనకు, వాస్తవికతలకు మధ్య కొట్టుమిట్టాడుతారు. ఈ సంఖ్యగల ప్రముఖులు, హ్యారీహోడినీ, ఆండర్సన్, హాన్స్ క్రిస్టియన్ తదితరులు.

## డెస్టినీ నంబరు - 22 (మాస్టర్ నెంబర్)

**'మాస్టర్ బిల్డర్' వీరి ప్రథమ లక్షణం. వీరి లక్ష్యాలు పెద్దవిగా ఉంటాయి. కలలు సాకారం చేసుకుంటారు.**

"మాస్టర్ బిల్డర్" వీరి ప్రధాన లక్షణం. ఈ డెస్టినీ నెంబరు కలవారు తమ మనసులో కోరుకున్నది ఏదైనా సాధించగలరు. వీరికి లక్ష్యాలు పెద్దవిగానే ఉంటాయి. శక్తి సామర్థ్యాలు చాలా ఎక్కువగా ఉంటాయి. వాటిని సరైన దిశలో, నిర్మాణాత్మకంగా నడిపించగలగాలి. కలలు కంటారు. వాటిని సాకారం చేసుకుంటారు. వాస్తవికంగా ఆలోచిస్తారు. సాంప్రదాయ విరుద్ధంగా ఉంటారు. ఆకర్షణీయంగా ఉంటారు. వీరు తమ మాటల ద్వారా చేతల ద్వారా ఇతరులను ఉత్తేజితుల్ని చేయగలరు.

ఈ సంఖ్య నెగిటివ్ లక్షణం, స్వార్థం. వీరు తమ శక్తి సామర్థ్యాలను ఇతరుల కొరకు కాక కేవలం వారి కొరకే వినియోగిస్తారు. ఈ లక్షణాన్ని గుర్తించినా వీరు మారలేరు. ఈ డెస్టినీ నెంబరు కల ప్రముఖులు, మేరీక్యూరీ, ఆర్నాల్డ్ స్వార్జ్‌నెగ్గర్. మార్గరెట్‌థాచర్, బిల్‌గేట్స్ తదితరులు.

# వ్యక్తిగత సంఖ్యలు (జన్మసంఖ్య - డెస్టినీ నంబరు)

పైథాగరస్ సిద్ధాంతం ప్రకారం, ప్రతి అంకెకి నాలుగు ప్రధాన లక్షణాలు ఉంటాయి.

1. **పాజిటివ్ ఎఫెక్ట్**
   ఇది మనిషి సహజ స్వభావాన్ని, ఆశాభావ వ్యక్తిత్వాన్ని తెలియచేస్తుంది.
2. **అవకాశాలు మరియు వృత్తి**
   వృత్తి పరమైన అవకాశాలు, వ్యాపార కార్యకలాపాలను తెలియచేస్తుంది.
3. **నెగటివ్ ఎఫెక్ట్ :** సంక్షోభ సమయంలో మనిషి ప్రవర్తనా తీరుని తెలియచేస్తుంది.
4. **వ్యక్తిగతమైనది :** ప్రవర్తన, మానవ సంబంధాల ఫలితాలను తెలియచేస్తుంది.

సంఖ్యాశాస్త్రం ద్వారా మీ అదృష్టాన్ని తెలుసుకోవచ్చు. మీ దురదృష్టాన్ని తెలుసుకుని నివారించుకోవచ్చు. అదృష్టాన్ని పెంచుకోవచ్చు. కష్టాలకు కారణాలను, విజయాలకు సోపానాలను తెలుసుకొని ఆచరించవచ్చు. అపజయమార్గాల నుంచి, అపాయాలనుంచి కాపాడి విజయపథం వైపు నడిపించేదే సంఖ్యాశాస్త్రం. దీనిని సరైన మార్గంలో వినియోగించుకుంటే ప్రతి వ్యక్తి విజయం వెనుక ఒక జీవిత భాగస్వామి ఉన్నట్లే ప్రతి మనిషి విజయం వెనుక సంఖ్యాశాస్త్రం ఉండి తీరుతుంది.

# మీ అదృష్ట సంఖ్య తెలుసుకునే విధానం

**అదృష్ట సంఖ్యలు రెండు రకాలు**

1. బర్త్ నెంబర్ లేదా జన్మ సంఖ్య (పుట్టిన తేదీ)
2. డెస్టినీ నంబర్ లేదా విధి సంఖ్య (పుట్టిన తేదీ, నెల, సంవత్సరం, మొత్తం కలిపితే వచ్చే సంఖ్య)

   ఇవి రెండూ మీ జన్మ తేదీని బట్టి వస్తాయి.

మీ జన్మతేదీలో ఏ రోజు పుట్టారో ఆ తేదీ బర్త్ నంబర్ లేదా జన్మ సంఖ్య అవుతుంది.

మీ పుట్టిన తేదీలో అన్ని అంకెలను కలపగా వచ్చేదే మీ విధి సంఖ్య

**ఉదాహరణకి :** 1) ఒక వ్యక్తి జన్మ తేదీ 23-1-1974 అని అనుకుందాం.

ఇందులో అదృష్ట సంఖ్య పుట్టిన తేదీ అయిన 23 నుంచి వస్తుంది. 23 ను మరల 2+3 = 5 గా తీసుకుంటే ఇదే మీ అదృష్ట సంఖ్య లేదా జన్మసంఖ్య లేదా బర్త్ నంబర్ అవుతుంది.

ఇక విధి(డెస్టినీ) సంఖ్య ఎలా వస్తుందంటే అతను పుట్టిన తేదీలోని అంకెలన్నిటినీ కలుపగా

23-01-1974=2+3+0+1+1+9+7+4=27 = 2+7 = 9

ఇతని విధి సంఖ్య లేదా డెస్టినీ నంబర్ 9 అవుతుంది.

# జన్మ సంఖ్య - 1 (సూర్యుని సంఖ్య)

**పుట్టిన తేదీలో దినం యొక్క అంకెల మొత్తం జన్మ సంఖ్యను, మొత్తం అంకెల మొత్తాన్ని అంటే దినం, నెల, సంవత్సరం మొత్తం డెస్టినీ నెంబరు తెలియజేస్తాయి. 1వ సంఖ్య సూర్యునికి సంకేతం. సూర్యుడు ఎలా గ్రహాలకు అధిపతో, అలా ఈ సంఖ్య కలవారు నాయకులుగా ఉంటారు.**

**1వ సంఖ్య కలవారు దృఢ సంకల్పం కలిగి ఉంటారు. ఆత్మాభిమానం ఎక్కువ. కార్యదక్షత కలిగి ఉంటారు. సూర్యునిలా ఉన్నతంగా, ప్రకాశవంతంగా ఉంటారు.**

ఒకటో అంకెను సూచించే గ్రహం సూర్యుడు. నవగ్రహాలకు అధిపతి అయిన సూర్యుడు, సకల చరాచర ప్రాణికోటికి ఆరోగ్యాన్ని, శక్తిని ఇచ్చే జీవ ప్రదాత. ఎవరైనా 1, 10, 19, 28 తేదీలలో జన్మిస్తే వారి జన్మసంఖ్య, అదృష్ట సంఖ్య, '1' అవుతుంది. ప్రతి అంకె / సంఖ్యలు ఇతర అంకెలు, సంఖ్యలతో పాటు కలవటం వలన దానికి కొన్ని పాజిటివ్ గుణాలు, కొన్ని నెగిటివ్ గుణాలు ఉంటాయి.

ఈ నంబర్‌లో పుట్టిన వారు గొప్ప ఆశావాదులు, ధైర్యవంతులు. వీరి నాయకత్వం సహాయ సహాకారాల కోసం ఇతరులు ఎదురుచూస్తారు. ఎన్నో కొత్త విషయాలు, విజ్ఞానశాస్త్రాలు, సంస్థలు ప్రారంభించటంలో ముందుంటారు. వీరు తాము చేపట్టే కార్యక్రమాలలో చొరవ, ధైర్యం చూపి ముందుకు దూసుకుపోయే తత్వం కలిగి వుంటారు. సహచరుల్లో ఉత్సాహాన్ని, ఉత్తేజాన్ని కలిగిస్తారు. ధైర్యంతో కొత్త దారుల్లో పయనిస్తూ, కొత్త పంథాలను అనుసరించి విజయం సాధిస్తారు. దృఢమైన శరీరం కలిగి, బలవంతులై ఉంటారు. స్థిరత్వం, పట్టుదల కలిగినవారు.

ఒకటో అంకె ఆరోగ్యానికి ఆధిపత్యం వహిస్తుంది. వీరు సాధారణంగా చాలా ఆరోగ్యవంతులు. శత్రువులను అణిచివేయటంలో వీరిది అందెవేసిన చెయ్యి. అవకాశాల కోసం ఎదురుచూడక వాటిని సృష్టిస్తారు. భయం, సందేహం, అధైర్యం మొదలైన వాటిని దరిచేరనీయరు. ఆత్మన్యూనత, అసంతృప్తి అనేవి వీరి స్వభావానికి విరుద్ధం. సూర్యుడు ఎలా అయితే ఉన్నతంగా వుంటాడో అలాగే వీరు కూడా ఉన్నత స్థానాన్ని ఆశిస్తారు,

పొందుతారు. చిన్నవిషయాలకు లొంగిపోవడం, నీచకార్యాలకు ఒడిగట్టడం లాంటివి చెయ్యనే చెయ్యరు.

ఒకరికి లొంగి ఉండడం కన్నా పోరాటానికే ప్రాధాన్యతనిస్తారు. వారికి కొన్ని విషయాలు తెలియకపోయినా, శక్తి సామర్థ్యాలు లేకపోయినా వాటిని బయటపడనీయక లోపలే దాచుకుని, బయటకు గుంభనంగా, గంభీరంగా కనిపిస్తారు.

ఆత్మగౌరవం, ఆశావహదృక్పథం కలిగివుంటారు. గర్వం, అహంకారంతో పాటు దయ, ఔదార్యం ఉంటాయి. డాబు, ఆడంబరాల కోసం దుబారా చేస్తారు. వీటిని నియత్రించుకుంటేనే పూర్తి ఆనందాన్ని పొందగలరు.

జీవితంలో ముందుకు పోయే కొలది, వీరి అదృష్టం పెరుగుతుంది. లక్ష్యసాధనలో చాలా ముందుంటారు. ప్రయత్నాలలో తప్పక విజయాన్ని సాధిస్తారు. భౌతిక సంపదలు పొందటమే కాక, అధికారాన్ని అందిపుచ్చుకుంటారు. ఉన్నత వర్గాల ఆదరణ పొంది వారి నమ్మకాన్ని సంపాదిస్తారు. అధికారంలో వున్న వారి గౌరవాన్ని, ఆదరణను చూరగొంటారు. ఉన్నత శిఖరాలను అధిరోహించి, నాయకులుగా మారి వారి వారి విభాగాలకు నేతృత్వం వహిస్తారు. గౌరవాన్ని, గుర్తింపుని సొంతం చేసుకుంటారు.

నాయకత్వ లక్షణాలతో పాటు భారీ పరిశ్రమలను నిర్వహించే సామర్థ్యాన్ని కలిగివుంటారు. కార్యసాధన శక్తి కలిగి, ఎంతో ఆలోచించి గానీ ఏ కార్యాన్ని ప్రారంభించని వారు అయి ఉంటారు. వీరికి మంచి మిత్రులు ఉంటారు. నిక్కచ్చిగా మాట్లాడే స్వభావం వలన శత్రువులు కూడా ఉంటారు.

ఎంతో మందికి ఉపాధిని కల్పించే శక్తిని కలిగి ఉంటారు. చిత్రలేఖనం, సంగీతం, శిల్పం, సినిమా రంగాలలో అభినివేశం కలిగి రచనా శక్తిని కలిగి ఉంటారు.

కవులు, కళాకారులు, రాజకీయనాయకులు, ఇంజనీర్లు, సైంటిస్టులు, వైద్యులు, సైనికులు, శస్త్ర చికిత్సా నిపుణులు, డెంటిస్టులు, జ్యోతిష్యులు, క్రీడాకారులు, రోదసీ పరిశోధకులు, వర్తకులు, సైన్యాధికారులు చాలా మందీ ఈ ఒకటవ నంబరులోనే జన్మించినవారై ఉంటారు. వీరు పెద్ద పదవులు కలిగి పాలనా సామర్థ్యాన్ని కలిగి ఉంటారు.

ఈ సంఖ్యలో జన్మించిన స్త్రీలు అలంకార ప్రియులు. వీరికి సువాసనలపైన, సుగంధ ద్రవ్యాలపైన మక్కువ. దేశభక్తి ఎక్కువ. తమ జీవిత భాగస్వామిపై ఎక్కువ ప్రేమ, తల్లిదండ్రులపై భక్తి ప్రపత్తులు కలిగి ఉంటారు.

ఈ అంకెలో పుట్టినవారు ప్రతిరోజు ఉదయం కొన్ని నిమిషాల పాటు సూర్యున్ని రెప్పవాల్చకుండా చూడటం వలన, శరీరంలో సూర్యాకర్షణ శక్తి వృద్ధి చెంది మనోబలం, రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. మెదడులో రసాయనిక మార్పులు జరిగి, బుద్ధికుశలత పెరిగి మేధావులవుతారు.

**1వ నెంబరు వ్యక్తి పాజిటివ్ లక్షణాలు**

1. కొత్తవి, నిర్మాణాత్మకమైన ఆలోచనలు
2. ఏ పని ప్రారంభానికైనా మొదటిగా ఉండటం
3. అందరిలోనూ కొట్టొచ్చినట్టుగా కనిపించడం
4. ఆశావాదం
5. ధృడ సంకల్పం
6. మంచి వ్యక్తిత్వం కలిగి ఉండటం
7. నిర్ణయాలు వెంటనే తీసుకొనే శక్తి కలిగి ఉండటం
8. అనుకున్నది తొందరగా సాధించగల శక్తి
9. నాయకత్వ లక్షణాలు కలిగి ఉండడం
10. తనకింది వారిని అదుపులో ఉంచగలిగే శక్తి
11. ధైర్యం, సాహసం, శత్రు భయం లేకపోవటం

**1వ నెంబరు నెగిటివ్ లక్షణాలు**

1. అహంకారం
2. ఇతరులు చెప్పినది పట్టించుకోకపోవటం
3. కింది వారిపై అనవసరపు పెత్తనం చెలాయించటం
4. అనుకున్నది సాధించటానికి ఎంతకైనా తెగించటం

రాజకీయ నాయకులు, ఇంజినీర్లు, రచయితలు చాలా మంది 1వ నంబరు కలవారే.

జన్మ సంఖ్య ప్రభావం వ్యక్తులపై ఏ విధంగా ఉంటుందో, డెస్టినీ సంఖ్య యొక్క ప్రభావం కూడా అలాగే ఉంటుంది. అందువలన జన్మసంఖ్య 1 ఉన్న వ్యక్తులందరి గుణగణాలు ఒకే విధంగా ఉండవు. కారణం డెస్టినీ నెంబరు మారటమే. ఇదే విధంగా

మిగతా జన్మసంఖ్యలకు కూడా (2 నుండి 9 వరకు) డెస్టినీ సంఖ్య ప్రభావం వలన గుణగణాలు మారుతూ ఉంటాయి. కాబట్టి ప్రస్తుత సంఖ్య 1 గుణగణాలు కూడా డెస్టినీనంబరు బట్టి మారుతూ ఉంటాయి. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరని ప్రార్థన!

ఇప్పుడు వేరువేరు తేదీల్లో పుట్టిన వారు వారి బర్త్ నంబర్ 1, 10, 19, 28 అయి డేట్ ఆఫ్ బర్త్ మొత్తం కూడగా 1 వచ్చిన వారు అనగా...

ఉదా: 10-5-1966 మొత్తం కూడగా

1+0+5+1+9+6+6=28=2+8=10=1+0=1

అప్పుడు బర్త్ నంబర్ 1 మరియు డెస్టినీ నంబర్ 1 అవుతుంది.

ఉదా: ఒక వ్యక్తి 28-6-1966 లో పుడితే అతని జన్మ సంఖ్య 2+8=10=1

డెస్టినీ నంబర్ = 2+8+6+1+9+6+6=38=3+8=11=1+1=2

పైన ఉదహరించిన వ్యక్తి యొక్క బర్త్ నెంబర్ 1, డెస్టినీ నంబర్ 2 అవుతుంది. ఆ వ్యక్తి ఈ అధ్యాయంలో జన్మ సంఖ్య 1, విధి సంఖ్య 2 ఉన్న భాగాన్ని చూడవలసి ఉంది.

## జన్మసంఖ్య-1, డెస్టినీ నంబరు-1 గల వ్యక్తుల లక్షణాలు

**1/1 వ్యక్తులు అందంగా, పొడుగ్గా ఉంటారు. అబద్ధం ఆడరు. నిజాయితీ కలిగి ఉంటారు. దేశభక్తి కలిగి, సంఘంలో గౌరవం కలిగి ఉంటారు.**

ఒక వ్యక్తి 19-7-1964లో పుడితే అతని జన్మ సంఖ్య 1 మరియు డెస్టినీ నంబరు 1 అవుతుంది.

ఎవరు 1, 10, 19, 28 తేదీల్లో పుట్టి వారి డెస్టినీ నంబర్ 1 అవుతుందో వారు ఈ వర్గంలోకి వస్తారు. వీరు పొడుగ్గా, అందంగా ఉంటారు. కన్నులు కొద్దిగా ఎరుపుగా ఉంటాయి. సూర్యాధిక్యత అధికంగా కలిగిన వారు, గంభీరమైన రూపం కలిగి, దృఢమైన దేహపుష్టి, తీక్షణమైన చూపులు కలిగి ఉంటారు. విశాలమైన వక్షస్థలం, కంఠం, భుజ ప్రదేశం గంభీరంగాను, దృఢంగాను, ఆకర్షణీయమైన నడకని కలిగి ఉంటారు. వీరి

శరీరంలో రక్తప్రసరణ వేగంగా, వేడి ఎక్కువగా ఉండి, గుండె బలంగా ఉంటుంది.

వీరు మంచి ఆలోచనా పరులు, జీవన ప్రమాణాలను ఎలా పెంచుకోవాలో నూతన పథకాలు వేస్తూ ఉంటారు. వేగంగా అభివృద్ధి చెందడానికి ప్రయత్నిస్తారు. అగ్ని, ఆహార, ఇనుము, విద్యుచ్ఛక్తికి సంబంధించిన వృత్తుల్లో ఉంటే వేగంగా అభివృద్ధి సాధిస్తారు. గవర్నమెంట్ ఆఫీసర్లుగా, ఎడ్మినిస్ట్రేటర్లుగా, మంచి టీచర్లుగా రాణిస్తారు. వీరి శరీరం వేడిగా ఉంటుంది. వేడిని తగ్గించే శీతల ఆహార పానీయాలు ఇష్టపడతారు. వీరి తృప్తి కోసం ఖర్చుకు వెనుకాడరు.

వీరికి మంచి జీవిత భాగస్వామి లభిస్తారు. పిల్లలపై ప్రేమ, మమకారం ఎక్కువ. యువకులుగా ఉన్నప్పుడే కొన్ని సిద్ధాంతాలను, కట్టుబాట్లను ఏర్పరచుకుంటారు. వాటి కోసం పోరాటం చేస్తారు. నిజాయితీని గౌరవిస్తారు. మోసాన్ని, నటనను ఇష్టపడరు. ఎలాంటి పరిస్థితుల్లో అబద్ధమాడరు. ప్రకృతి సౌందర్యాన్ని, పర్వతాలను, చారిత్రక కట్టడాలను దర్శించడాన్ని ఇష్టపడతారు.

వీరికి చాలా మంది విశ్వాసపాత్రులైన మిత్రులుంటారు. సహజంగా సహాయకారులు. తమకిష్టమైన వారికి స్వచ్ఛందంగా సహాయపడతారు. తమ హోదాకి, గౌరవానికి తగిన జీవిత భాగస్వాములను ఎన్నుకుంటారు. సరైన మార్గంలోనే వీరి సంపాదన ఉంటుంది. అక్రమార్జన తెలిసినా వాటి జోలికి వెళ్ళరు. పారదర్శకత, నిజాయితీ, నీతిని కలిగి ఉంటారు. వీరికి ప్రామిసరీ నోట్‌తో పనిలేకుండా ఎంత మొత్తంలోనైనా డబ్బుని అప్పుగా ఇవ్వొచ్చు. వాహనాలంటే ప్రీతి, తరచుగా మారుస్తారు. వీరికి సంఘంలో గౌరవ మన్ననలు అధిక,. దేశభక్తులు, కుటుంబాన్ని సరిగ్గా సంరక్షించుకుంటారు.

వీరి పేర్లు, వీరి జన్మ సంఖ్యకు అనుకూలంగా వుంటేనే పైన చెప్పిన లాభాలు కలుగుతాయి. ప్రతికూలంగా ఉంటే మిశ్రమ ఫలితాలను పొందుతారు.

ఆపోజిట్ సెక్స్ వారి వలన వీరికి అభివృద్ధి, అదృష్టం కలుగుతుంది. విద్యుత్, కంప్యూటర్, ఇనుము, అగ్ని సంబంధమైన పరిశ్రమలను ఎగుమతి-దిగుమతి సంబంధమైన వ్యాపారాలను నిర్వహించగలరు. సూర్యుని ఆధారంగా సాగే పరిశ్రమలను చక్కగా నిర్వహిస్తారు. నిప్పుకు సంబంధమైన పరిశ్రమలలో రాణిస్తారు.

ఇటువంటి వారు సంఖ్యాశాస్త్ర నిపుణుల్ని సంప్రదించి అనుకూలమైన సంఖ్య వచ్చేవిధంగా పేరు మార్చుకుంటే జీవితంలో అభివృద్ధి కలిగి ఉంటారు.

## పేరు పెట్టే విధానం

ఒకటో నంబరు వ్యక్తులపై సూర్యుని ప్రభావం ఎక్కువ. కాబట్టి వీరి పేర్లు, వ్యాపార సంస్థల పేర్లు రవి, గురు, కుజ గ్రహాలకు అనుకూలంగా పెట్టుకోవాలి. రవి సంఖ్యలు - 19, 37, 46, 64, 73, 82. గురు సంఖ్యలైన 21, 30, 39, బుధ సంఖ్యలైన 5, 14, 23, 32, 41, 50, 59, కుజ సంఖ్యలైన 9, 27, 54 సంఖ్యల్లో వీరి పేరు ఉంటే స్థిరమైన అభివృద్ధిని సాధిస్తారు.

## వ్యాధులు

వీరికి సూర్యుని ప్రభావం వలన వేడి, పైల్స్, రక్తపోటు, సెగ్గడ్డలు, కంటి వ్యాధులు, గుండె వ్యాధులు లాంటివి రావొచ్చు. చల్లని ఆహార పానీయాలను సేవించడం ఒక సూచన. సరైన చికిత్స తీసుకుంటే ఉపశమనం కలుగుతుంది.

## సూచనలు

| | | |
|---|---|---|
| లక్కీ నంబర్లు | - | 1, 3, 5, 9 |
| లక్కీ తేదీలు | - | 1, 3, 5, 9, 10, 12, 14, 18, 19, 21, 23, 27, 28, 30 |
| అన్‌లక్కీ డేట్స్ | - | 8, 17, 26 |
| లక్కీ కలర్స్ | - | పసుపు, లేత నీలిరంగు, గులాబీ, ఆరెంజి |
| అన్‌లక్కీ కలర్స్ | - | నలుపు, కాఫీ రంగు |
| అదృష్ట దినాలు | - | ఆది, బుధ, గురువారాలు |
| లక్కీ వివాహ తేదీలు | - | 1, 3, 6, 10, 12, 15, 19, 21, 24, 28, 30 |
| రెమిడీస్ | - | ఆదిత్య హృదయం, సూర్యాష్టకం పఠించాలి, కోతులకు అరటి పండ్లు పెట్టాలి, శివ ఆరాధన, వరాహి కవచం, కాల భైరవ కవచం పఠించాలి. |
| ఉదా | - | చక్రవర్తి రాజగోపాలాచారి : 10.12.1878 |
| | | ధీరూభాయ్ అంబానీ : 28.12.1932 |

## జన్మసంఖ్య - 1, డెస్టిని నంబరు - 2 గల వ్యక్తులు

**1/2 వ్యక్తులకు ఎదుగుదల, ఒడిదుడుకులు రెండూ ఉంటాయి. చంద్ర ప్రభావం వలన మానసిక ప్రశాంతత తక్కువ.**

ఉదా : ఏ వ్యక్తి అయిన 10-6-1930లో జన్మిస్తే వారి జన్మ సంఖ్య 1, డెస్టినీ నంబరు 1+0+6+1+9+3+0 = 20 = 2+0=2

ఎవరు 1, 10, 19, 28 తేదీల్లో జన్మించి వారి డెస్టినీ నంబర్ 2 అవుతుందో వారు ఈ వర్గం కిందకి వస్తారు. వీరు సూర్యుడు, చంద్రుడు ప్రభావానికి లోనై ఉంటారు. వీరు అందంగా ఉంటారు. సూర్యుడు, చంద్రుడు ఒకేసారి వెలుగునివ్వని కారణంగా ఈ నంబర్లు గల వారు ఎప్పుడూ ఏదో పోగొట్టుకున్నట్లు తరచూ అయోమయానికి లోనవుతారు. చంద్రుని వృద్ధి క్షయాలను అనుసరించి వీరి జీవితం ఒడిదుడుకులు, ఆటుపోట్లు, ఎత్తుపల్లాలు కలిగి ఉంటుంది.

ఏదో అపాయం ఉందన్నట్లుగా ఊహించుకుని అకస్మాత్తుగా అశాంతికి గురవుతారు. అనుకూలమైన పేర్లు పెట్టుకుంటే ఈ చెడు ప్రభావాన్ని తొలగించుకోవచ్చు.

వీరికి శారీరక బలం ఎక్కువగాను, మానసిక బలం తక్కువగాను ఉంటుంది. ఇతరుల కోసం పనిచేసినప్పుడు ధైర్యంగాను, తమ కోసం పనిచేసినప్పుడు అయోమయంగాను ఉంటారు. పురుషులు స్త్రీల వలన సమస్యలు ఎదుర్కొంటారు.

వీరు చూడటానికి ఆకర్షణీయంగాను, తియ్యగా మాట్లాడతారు. కొన్నిసార్లు తాము తెలివిగా మసలుకుంటున్నానని భావిస్తూ పనులు చేస్తారు. తర్వాత మోసపోయినట్లుగా తెలుసుకుంటారు. కానీ తమ అసంతృప్తిని మాత్రం బయటపడనీయరు.

ప్రభుత్వ ఉద్యోగులు వారి అధికారుల వలన, సహచరుల వలన కొంత ఇబ్బందులు పడతారు. వ్యాపారులు ఆటుపోట్లని ఎదుర్కొంటారు. సమస్యలు వచ్చినప్పుడు అయోమయానికి గురవుతారు. ఇవన్నీ వీరి పేర్లు అనుకూలంగా లేనప్పుడు కలిగే ఫలితాలే. విదేశీ ప్రయాణాల వలన లబ్ధి పొందుతారు. వీరి పేరు అనుకూలంగా ఉంటే మంచి జీవిత భాగస్వామి లభిస్తారు.

## పేరు పెట్టే విధానం

వీరి నామసంఖ్య 1, 3, 6 వచ్చేలా పెట్టుకోవడం మంచిది. ఇది శుక్రుని సూచిస్తుంది. పేర్లు, వ్యాపార సంస్థల పేర్లు 1, 15, 19, 21, 24, 28, 30, 33, 37, 39, 42, 46, 55, 64, 69, 73, 82, 99 నంబర్లు వచ్చేలా పెట్టుకుంటే మంచి ఫలితాలు వస్తాయి.

## రాణించే రంగాలు

వీరిలో చాలా మంది ఉద్యోగులై ఉంటారు. కొంత మంది స్వతంత్ర వ్యాపారులై ఉంటారు. తక్కినవారు సౌందర్య సాధనాలు, విలాస వస్తువులు అమ్మే వారై ఉంటారు. అగ్నికి, విద్యుచ్ఛక్తికి సంబంధించిన రంగాలు, సరుకులు బదిలీ చేసే రంగాలు లాభదాయకంగా ఉంటాయి.

## వ్యాధులు

గుండె వ్యాధులు, ఊబకాయం, పంటినొప్పి, తలనొప్పి, కీళ్ళ జబ్బులు, కడుపునొప్పి మొదలైనవి రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలి. పేర్లు అనుకూలంగా ఉంటే పై జబ్బుల ప్రభావం అంతగా ఉండదు.

## సూచనలు

| | | |
|---|---|---|
| లక్కీ నంబర్లు | - | 1, 2, 6, 7 |
| లక్కీ తేదీలు | - | 1, 2, 6, 7, 10, 11, 15, 16, 19, 20, 24, 25, 28, 29 |
| అన్‌లక్కీ తేదీలు | - | 8, 17, 26, 9, 18, 27 |
| లక్కీ కలర్స్ | - | లేత పసుపు, లేత నీలం, లేత ఆకుపచ్చ, తెలుపు, గులాబీ |
| అన్‌లక్కీ కలర్స్ | - | నలుపు, ఎరుపు |
| అదృష్ట దినాలు | - | ఆది, సోమ, గురు, శుక్రవారాలు |
| లక్కీ వివాహ తేదీలు | - | 1, 6, 10, 15, 19, 24, 28 |
| రెమిడిస్ | - | ఆదిత్య హృదయం పఠించాలి, అమ్మవారిని కొలవటం మంచిది, అనాథ బాలికలకు సహాయం చేయటం మంచిది. |

## జన్మసంఖ్య - 1, డెస్టినీ నంబరు - 3 వ్యక్తులు

**1/3 వ్యక్తులు జ్ఞానం కలిగిఉంటారు. మంచి ఆలోచనాపరులు, నిదానంగా ఉంటారు. వీరిని మేధావులుగా చెప్పొచ్చు. ఉపాధ్యాయులు, ప్రొఫెసర్లు, పురోహితులు, జ్యోతిష్కులు చాలా మంది ఈ సంఖ్యలు కలవారే.**

ఉదా : ఎవరైనా 10-6-1965లో పుడితే వారి జన్మ సంఖ్య 1 మరియు డెస్టినీ నంబర్ 3 అవుతుంది.

ఎవరు 1, 10, 19, 28 తేదీల్లో జన్మించి, వారి డెస్టినీ నంబర్ 3 అవుతుందో వారు ఈ వర్గం కిందకి వస్తారు. ఈ సంఖ్యలు గలవారు సూర్యుడు, గురుడు ప్రభావానికి లోనవుతారు. మామూలుగా వీరు పొడవుగానే ఉంటారు. ఉంగరాల జుత్తు, పొడవైన కనుబొమ్మలు కలిగి ఉంటారు. యువకులుగా ఉండగానే కొంతమందికి బట్టతల వస్తుంది. వీరు జ్ఞాన సంపన్నులు. తొందర లేకుండా పనులు చేస్తారు. నిదానంగా, ప్రేమగా సంభాషిస్తూ, ఎప్పుడూ ఉత్సాహంగా అప్రమత్తంగా ఉంటారు. మాట్లాడే ముందు ఎంతో ఆలోచిస్తారు. సమాజంలో బాధ్యతాయుతమైన పదవులలో ఉంటారు. గణితంలో నేర్పరులై, భవిష్యత్తును బాగా ఊహించగలుగుతారు. ఎదుటివారి ఉద్దేశాన్ని చెప్పకుండానే గ్రహించగలరు.

సమయస్ఫూర్తి, సరైన సలహాలిచ్చే సామర్థ్యం వలన ప్రజలు వీరికి ఎంతో గౌరవాన్ని ఇస్తారు. ఎవరూ వీరి రహస్యాలను తెలుసుకోలేరు. వీరికి అత్యంత ఆప్తులైన స్నేహితులు, బంధువులు సైతం వీరిని అర్థం చేసుకోలేరు.

వీరు పై అధికారులు ఇచ్చిన పనులను ఖచ్చితంగా చేసి మంచి పేరుని సంపాదించుకుంటారు. ఒక పనిలో నిమగ్నమయినపుడు అది పూర్తి అయ్యేంతవరకు దాని గురించి మాట్లాడరు. నిరుపయోగమైన, లాభం కాని పనులను చేయరు. ఒక పనిని ఆరంభించే ముందు దాని గురించి కూలంకషంగా వివరాలు సేకరించి, ఈ పని విజయవంతమవుతుందా లేదా? అని పరిశీలిస్తారు. ఇతరులు అందుకే వీరిని మేధావులుగా పరిగణిస్తారు. వీరికి నేర్పుగా పనిచేయడమే గాక పనిచేయించే సామర్థ్యం కూడా ఉంటుంది. అందుకే జీవితంలో ఉన్నత స్థానాన్ని చేరుకుంటారు. అందరి మన్ననలను పొందుతారు. కానీ వీరు జీవితంలో స్థిరపడటం కొంత ఆలస్యమవుతుంది.

పరిస్థితుల ప్రభావం వలన వీరు చిన్న ఉద్యోగాల్లో కానీ, చిరు వ్యాపారంలో గాని ఉంటారు. వీరికి అనుకూలమైన పేర్లు ఉంటే అంచెలంచెలుగా అభివృద్ధి సాధిస్తారు. ప్రతికూలమైన పేర్లు ఉంటే అభివృద్ధి అంతంత మాత్రంగానే ఉంటుంది.

వీరికి ఆత్మవిశ్వాసం ఎక్కువ. కొందరు రాజకీయ వేత్తలుగాను, ప్రభుత్వ అధికారులుగాను, వ్యాపారులుగాను ఉంటారు. వీరికి మంచి జీవిత భాగస్వాములు లభిస్తారు. గృహం, భూమి, వాహన సౌఖ్యాలు కలిగి ఆనందకరమైన జీవితాన్ని పొందుతారు.

న్యూమరాలజిస్టులు 3 జన్మసంఖ్యగా గాని, విధిసంఖ్యగా గాని ఉన్నప్పుడు వారికి '6' కాని దాని అనుబంధ సంఖ్యలతో కాని పేర్లు పెట్టకూడదని చెప్తారు. కాని నా అభిప్రాయం ప్రకారం 3, 6లో పేరు తప్పనిసరి పరిస్థితుల్లో పెట్టుకోవచ్చు. 3 యొక్క రెట్టింపు సంఖ్య '6' అవుతుంది. చాలా మంది ఆస్ట్రాలజీ ప్రకారం గురు, శుక్రులకు పొసగదు అని 3 వారికి 6లో పేరు పెట్టకూడదని అంటారు కాని న్యూమరాలజీ ప్రకారం 3 వారు '6' కానీ దాని అనుబంధ నెంబర్లలో గానీ పేరు పెట్టుకోవచ్చు.

వీరికి పరిశోధనలపై ఆసక్తి ఉంటుంది. బోధన, పౌరోహిత్యం, జ్యోతిష్యం, వేదాంతం మొదలైన విద్యలలో ప్రావీణ్యం ఉంటుంది. వీరికి అనుకూలమైన పేర్లు ఉంటే వారు ఎంచుకున్న రంగాల్లో, వ్యాపారాల్లో విజయం సాధిస్తారు.

వీరి నామసంఖ్య '1', కాని 5, 9 వచ్చేలా పెట్టాలి. వ్యాపార సంస్థల పేర్లు సైతం '1, 5, 9' వచ్చేలా పెడితే మంచి ఫలితాలు వస్తాయి.

## రాణించే రంగాలు

అన్ని రకాల ఫుడ్ ఐటమ్స్ వ్యాపారం కలిసి వస్తుంది. డైరీఫాం, కోళ్ళఫారం, ట్రాన్స్‌పోర్ట్ వ్యాపారం, విద్యా సంస్థలకు సంబంధించినవి అనుకూలం.

## వ్యాధులు

చర్మవ్యాధులు, దురదలు, కలుషిత నీరు, శరీరంపై పడుట వలన వ్యాధులు వస్తాయి. సరైన చికిత్స తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది.

## సూచనలు

లక్కీ నంబర్స్ – 1, 3, 5, 9

| | | |
|---|---|---|
| లక్కీ తేదీలు | - | 1, 3, 5, 9 ,10, 12, 14, 18, 19, 21, 23, 27, 28, 30 |
| అన్‌లక్కీ డేట్స్ | - | 8, 17, 26 |
| లక్కీ కలర్స్ | - | పసుపు, నీలం, గులాబీ, నారింజ, ఉదారంగులు |
| అన్‌లక్కీ కలర్స్ | - | నలుపు |
| అదృష్ట దినాలు | - | ఆది, మంగళ, గురువారాలు |
| లక్కీ వివాహ తేదీలు | - | 1, 3, 9, 10, 12, 18, 19, 21, 27, 28 |
| రెమిడీస్ | - | గురు చరిత్ర పారాయణం, ఆదిత్య హృదయం చదవాలి, దక్షిణామూర్తిని ఆరాధించడం |
| ఉదా | - | అభినవ్ బింద్రా 28-09-1982 (ఒలంపిక్ గోల్డ్ మెడలిస్ట్)<br>ఎన్‌టీరామారావు 28-05-1923<br>దినేష్ కార్తీక్ 01-06-1985 (ఇండియన్ క్రికెటర్) |

## జన్మసంఖ్య - 1, డెస్టినీ నంబరు - 4 గల వ్యక్తులు

**1/4 వ్యక్తులు నిజాయితీపరులు, కళలు తెలిసినవారు. కొందరు ఉద్యోగం, మరికొందరు వ్యాపారం చేస్తారు. మాటల చతురత కలవారు.**

ఎవరు 1, 10, 19, 28 తేదీల్లో జన్మించి వారి డెస్టినీ నంబరు 4 అవుతుందో వారు ఈ వర్గం కిందకి వస్తారు. ఈ నంబర్లు కల వ్యక్తులు సూర్యుడు, రాహు గ్రహ ప్రభావంలో ఉంటారు. వీరు పొడవుగా, లావుగా, రాజసంతో అలల్లాంటి జుత్తుతో ఉంటారు. వీరు శృంగారప్రియులైనా, అనైతిక పనులు చేయటానికి ఇష్టపడరు. వీరి ఉపన్యాసాలతో, రచనలతో ప్రపంచాన్ని సంస్కరించాలని కోరుకుంటారు. చర్చలలో, వ్యాఖ్యానాలలో కల్పించుకుంటారు.

ఇతరుల మాటలను ఊరికే నమ్మరు. మంచి పరిశీలనా శక్తి కలిగి ఉంటారు. వీరు పూర్తిగా సంతృప్తి చెందిన పిమ్మటే దేనికైనా అంగీకరిస్తారు. నిజాయితీగా జీవితం గడపాలని కోరుకుంటారు.

మోసం, నటనను అసహ్యించుకుంటారు. మిత్రులతో సత్ప్రవర్తన కలిగి ఉండటం

వలన వారు వీరితో స్థిరంగా ఉంటారు. వీరికి ఎవరైనా నచ్చకపోతే వారికి హాని కలిగించక దూరంగా వుంచుతారు. వీరు ఎంతో తెలివైన వారై ఉండి, కథలు, శిల్పాలు, మతం, జ్యోతిష్యం మొదలైన వాని యందు అభిరుచి కలిగి ఉంటారు. అందుకు అవసరమైన సమాచారాన్ని సేకరిస్తారు. ఉద్యోగం చేస్తూనే చిన్న చిన్న వ్యాపారాలు కూడా చేస్తారు. బాగా మాట్లాడగలరు. తమ వాగ్ధాటితో కొంతమంది రాజకీయాలలో రాణిస్తారు.

వీరు ఎప్పుడూ ఏదో విషయం గూర్చి ఆలోచిస్తూ ఉంటారు. ఇతరుల కోసం తాము ఇబ్బందులు ఎదుర్కొంటారు. దైవకృప వలన ప్రమాదాల నుంచి తప్పించుకొంటారు. వీరు ప్రముఖులై, ఎంతోమందితో చుట్టుముట్టబడి వుంటారు. డబ్బు విషయంలో నిజాయితీ పరులై ఉండటం వలన వీరి నాయకత్వానికి గుర్తింపు లభిస్తుంది. పొగడ్తలకు పొంగిపోకుండా ఉంటే మంచిది.

ఎక్కువమంది వేతనంతో కూడిన ఉద్యోగంలో ఉంటే కొందరు మాత్రం స్వతంత్ర్య వ్యాపారాన్ని కలిగి ఉంటారు. ఈ సంఖ్య చాలా మంచిది. అనుకూలమైన పేరు లేకపోతే వీరు జీవితంలో అభివృద్ధి సాధించలేరు.

## పేరు పెట్టే విధానం

వీరు సూర్యుడు, రాహు గ్రహ ప్రభావితులైనందున, వీరి నామసంఖ్యలు సూర్యుడు, బుధ, శుక్ర గ్రహాలకు అనుకూలంగా ఉండాలి. రవి సంఖ్యలు 19,37,46,73,82, బుధ, శుక్ర సంఖ్యలు 5, 14, 15, 23, 24, 32, 33, 41, 42, 50, 60, 69. ఈ నంబర్లతో వీరి పేర్లు వ్యాపార సంస్థల పేర్లు ఉంటే మంచిది.

వీరికి మేనేజ్‌మెంట్ / అడ్మినిస్ట్రేషన్ మీద ఎక్కువ ఆసక్తి ఉంటుంది. ఒకరి క్రింద పనిచేయడం కన్నా ఇతరుల మీద అజమాయిషీ చేసే వృత్తులు వీరికి బాగా సరిపోతాయి. వీరికి ఎక్కువగా మెకానికల్, సివిల్ ఇంజనీరింగ్ చదువుతోపాటు, ఎం.బి.ఎ లాంటి వాటి మీద ఆసక్తి ఎక్కువగా ఉంటుంది. మంచి మేనేజ్‌మెంట్ స్కిల్స్ ఉంటాయి. అందువలన సివిల్ సర్వీసెస్ లాంటి కాంపిటీటీవ్ పరీక్షలకు హాజరైతే మంచి ఫలితం పొందుతారు.

## రాణించే రంగాలు

కథారచనలు మొదలైన వాటినుంచి వీరికి సంపాదన ఉండొచ్చు. స్టీలు, లోహాలు,

ఫర్నిచర్, మెడికల్, ట్రాన్స్‌పోర్ట్ వ్యాపారాలు కలసివస్తాయి.

### వ్యాధులు

ఉష్ణ సంబంధిత వ్యాధులు, పైల్స్, బి.పి., గ్యాస్ ట్రబుల్ బారిన పడకుండా చూసుకోవాలి.

### సూచనలు

| | | |
|---|---|---|
| లక్కీ నంబర్లు | - | 1, 5, 6, 9 |
| లక్కీ తేదీలు | - | 1, 5, 6, 9, 10, 15, 14, 18, 19, 23, 24, 28, 27 |
| అన్‌లక్కీ డేట్స్ | - | - - - |
| లక్కీ కలర్స్ | - | పసుపు, నీలిరంగు, ఆకుపచ్చ, ఉదారంగు, గోల్డెన్, గులాబీ |
| అన్‌లక్కీ కలర్స్ | - | నలుపు |
| అదృష్ట దినాలు | - | ఆదివారం, బుధవారం, శుక్రవారం |
| లక్కీ వివాహతేదీలు | - | 1, 3, 6, 9, 10, 12, 15, 18, 19, 21, 24, 27, 28, 30 |
| రెమిడీస్ | - | సూర్య ఆరాధన, సుబ్రమణ్యస్వామి ఆరాధన చేయాలి. |
| ఉదా | - | వీవీఎస్ లక్ష్మణ్ 01-09-1974 (ఇండియన్ క్రికెటర్) |
| | | లాలాలజపతిరాయ్ 28-01-1865 |

## జన్మసంఖ్య - 1, డెస్టినీ నంబరు - 5 కల వ్యక్తులు

**1/5 వ్యక్తులు అన్నపానాలు మాని పనిచేస్తారు. వారిలో వారే మాట్లాడుకుంటారు.**

ఎవరు 1, 10, 19, 28 తేదీల్లో జన్మించి వారి డెస్టినీ నంబరు 5 ఉంటుందో వారు ఈ వర్గం కిందకి వస్తారు. వీరు రవి, బుధ గ్రహాల ప్రభావంలో ఉంటారు. చాల చురుకైనవారు. చాలా అప్రమత్తత కలిగి ఒకేచోట ఎక్కువ కాలం ఉండరు. వీరు ఏమి చేస్తారో ఇతరులకు అర్థం కాదు. ఒక మోస్తరు ఎత్తు, లావు కలిగి ఉంటారు.

వీరు ప్రతి పనిని వేగంగా పూర్తిచేయాలని అనుకుంటారు. పని పూర్తయ్యేంత వరకు, తీవ్రంగా శ్రమించి, అన్నం కూడా తినరు. పనిచేసేటప్పుడు అశుభ్రమైన దుస్తులను వేసుకోవటానికి సైతం లెక్క చేయరు. వీరు శుభ్రమైన దుస్తులలో కనిపిస్తే పని పూర్తయింది అనుకోవచ్చు.

వీరు ఒంటరిగా ఉన్నప్పుడు వారితో వారే మాట్లాడుకునే అలవాటు వుంటుంది. ఊహాశక్తి ఉండి దానితో అలౌకికానందాన్ని పొందుతుంటారు. వినయవిధేయతలు పెద్దగా ఉండకపోయినా, నిజాయితీగా వీరిపై ప్రేమ చూపించేవారిని గౌరవించి, సహాయం చేస్తారు. ఎక్కువగా మేనేజీరియల్ రంగాల్లో మరియు పీఆర్ఓలుగా బాగా రాణిస్తారు.

ఎవరైనా శత్రుత్వం పెంచుకొని, వీరితో గొడవ పెట్టుకొని హాని తలపెడితే మాత్రం వారి అంతుచూస్తారు. శత్రువులపై పగ తీర్చుకోడానికి సుదీర్ఘ పథకాలు వేస్తారు. కొంత కాలం తర్వాత శత్రువులు, క్షమాభిక్ష కోరితే వారిని క్షమించి సహాయం చేస్తారు.

వీరు ఎక్కడికి వెళ్తున్నారో ఎవరికీ చెప్పరు. ఒత్తిడి చేస్తే తప్పు అడ్రస్ చెప్తారు. వీరి చుట్టూ ఎప్పుడు జనం గుమికూడి ఉంటారు. ఎంతోమంది జీవించటానికి నిలదొక్కుకోవటానికి సాయం చేస్తారు.

కొందరు పనిలో విజయవంతం కాకపోతే దైవదూషణ చేస్తారు. ఉద్యోగం చేసినా మరింత సంపాదన కోసం ఏదో ఒక వ్యాపారం చేస్తారు.

అనుకూలమైన పేరు పెట్టుకొంటే వీరి పథకాలన్నీ ఫలిస్తాయి. వీరికి 41 వ ఏడు వచ్చేసరికి ఏన్నో వ్యాపారాలతో ముడిపడి ఉంటారు. బంధువులు, కుటుంబ సభ్యుల సహాయంతో జీవితంలో అభివృద్ధి సాధించడానికి యిష్టపడరు. స్వయంకృషితోనే సంపద, పేరు ప్రఖ్యాతులు సంపాదిస్తారు. వీరు అనుకూలమైన పేరు పెట్టుకుంటే ఉన్నతమైన జీవితాన్ని అనుభవిస్తారు. వీరు రాజకీయాలలో కొంత ఆసక్తి కనబరుస్తారు. కానీ శాశ్వతంగా రాజకీయవేత్తలు కావాలని కోరుకోరు. వీరు అదృష్టవంతులు.

## పేరు పెట్టే విధానం

వీరి పేరు రవి, బుధుల సంఖ్యలతో ఉంటే మంచిది. రవి సంఖ్యలు 19,37,46,64,82. బుధ సంఖ్యలు 14,23,32,41,59 వ్యాపార సంస్థలకి ఈ సంఖ్యల్లో నామకరణం చేస్తే లాభాలు గడిస్తారు.

## రాణించే రంగాలు

కమీషన్ ఏజంట్లు, కాంట్రాక్టర్లు, అగ్ని, స్టీలు పరిశ్రమలు, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ మరియు ఎగుమతి వ్యాపారాలు లాభదాయకమైనవి. అనుకూలమైన పేరు ఉంటే చాలా సంపదను పొందుతారు.

### వ్యాధులు

ఉష్ణసంబంధమైన వ్యాధులు, చర్మ వ్యాధులు, జాయింట్ పెయిన్స్ రావొచ్చు. సరైన చికిత్స తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది.

### సూచనలు

| | | |
|---|---|---|
| లక్కీ నంబర్లు | - | 1, 5, 6, 9 |
| అన్‌లక్కీ నంబర్ | - | - - - |
| లక్కీ తేదీలు | - | 1, 5, 6, 9, 10, 14, 15, 18, 19, 23, 24, 27, 28 |
| అన్‌లక్కీ డేట్స్ | - | - - - |
| లక్కీ కలర్స్ | - | పసుపు, లేత నీలిరంగు, బూడిదరంగు, ఆకుపచ్చ, గులాబీ, ఆరెంజి |
| అన్‌లక్కీ కలర్ | - | నలుపు |
| అదృష్ట దినాలు | - | ఆదివారం, బుధవారం, శుక్రవారం |
| లక్కీ వివాహతేదీలు | - | 1, 6, 9, 10, 15, 18, 19, 24, 27, 28 |
| రెమిడీస్ | - | నవగ్రహ పూజ, సూర్య ఆరాధన, వెంకటేశ్వర స్వామి ఆరాధన పేద విద్యార్థులకు సహాయం చేయడం మంచిది. |
| ఉదా | - | హృతిక్ రోషన్ 10-01-1974 |
| | | సన్ని డియోల్ 19-10-1956 |
| | | బాలకృష్ణ 10-06-1960 |
| | | పూరీ జగన్నాథ్ 28-09-1966 |

## జన్మసంఖ్య - 1, డెస్టినీ నంబరు - 6 గల వ్యక్తులు

**1/6 వ్యక్తులు ఎక్కువ కష్టపడకుండానే ధనసంపాదన చేస్తారు. ఎప్పుడూ యవ్వనంగా కనిపిస్తారు. అందంగా ఆకర్షణీయంగా ఉంటారు.**

ఎవరు 1, 10, 19, 28 తేదీల్లో జన్మించి, వారి డెస్టినీ నంబరు 6 అవుతుందో వారు ఈ వర్గం కిందకి వస్తారు. వీరు రవి, శుక్ర గ్రహ ప్రభావంలో ఉంటారు.

రవిగ్రహ ప్రభావం వలన నిజాయితీ ప్రవర్తన, మంచిపేరు, మంచి స్నేహితులు ఉంటారు. శుక్ర గ్రహ ప్రభావం చేత ఐహిక సుఖాలను, అధికారాలను అనుభవించాలని కోరిక కలుగుతుంది. వీరు పొడగరులు, హుందాయైన నడక కలిగి ఉంటారు. వీరి వస్త్రధారణ, హావభావాలు ఆకర్షణీయంగా ఉంటాయి. చాలా వరకు మంచివారు. వీరున్నంత అందంగా ఇతర ఒకటో నంబరు వ్యక్తులు ఉండరు.

వీరు సాధ్యమైనంత సౌకర్యవంతమైన జీవితాన్ని గడుపుతారు. వీరి పేర్లపై గురు ప్రభావం ఉంటే స్త్రీలు, పిల్లల నుంచి సమస్యలు ఎదుర్కొంటారు. వాహనాలను అలంకరించడం వీరికి ఇష్టం. పరిమళ, సుగంధ ద్రవ్యాలు, ప్రకృతి సౌందర్యం, విదేశీ ప్రయాణాలన్నా మక్కువ. వీరు చాలా శుభ్రంగా, శుచిగా ఉండి దేనికి జంకరు.

కష్టపడకుండానే డబ్బు సంపాదిస్తారు. భాష ఏదైనా చక్కగా, పొందికగా, మితంగా మాట్లాడతారు. చిన్నదైనా, పెద్దదైనా ఏ ఉద్యోగాన్నైనా ఇష్టపడతారు. వీరికి విలాసవంతంగా ఉండాలనే కోరిక. కొందరు జీవిత భాగస్వామి పేరు మీద వ్యాపారం చేస్తారు.

ఏ రకమైన వస్త్రాలను ధరించినా అందంగా కనిపిస్తారు. పురుషులు స్త్రీలతో జాగ్రత్తగా ఉండకపోతే చెడ్డ పేరు పొందవలసి వస్తుంది. పేరు అనుకూలంగా ఉంటే ఏ సమస్యా ఉండదు. పేర్లు అనుకూలంగా ఉంటే స్త్రీ మూలక ధనలాభం వుంటుంది. కొన్నిసార్లు కటువుగా మాట్లాడి తరువాత చింతిస్తారు.

వీరికి అనుకూలమైన పేర్లు ఉంటే, విదేశీ ప్రయాణాలు, విహారయాత్రలు, సౌకర్యవంతమైన జీవితం, పెద్ద భవంతి, వాహనాది సదుపాయాలు లభిస్తాయి. అందరితోను స్నేహాన్ని కోరరు. పరిమిత స్నేహాన్ని మాత్రమే వాంఛిస్తారు. ఆదాయం రాని ఏ పనినీ చెయ్యరు. ఈ విషయం గూర్చి ఒంటరిగా వున్నప్పుడు బాధపడతారు.

హుందాగా, దర్జాగా ఉంటారు. వయసును ఏ మాత్రం కనిపించనీయరు. ఆనందకరమైన, ఉల్లాసవంతమైన జీవితాన్ని గడపాలని కోరుకుంటారు. కళ్ళజోడు వేసుకోవాలనుకుంటే అందమైన ఫ్రేమునే సెలక్ట్ చేసుకుంటారు. ఇంటిని అందంగా తీర్చిదిద్దుకుంటారు. ఇంటిని విలాసవంతమైన సామాగ్రితో అలంకరిస్తారు.

వీరు పాతవాహనాన్ని కొని, దాన్ని కొత్తగా కనిపించే విధంగా అలంకరిస్తారు.

వీరు చల్లని కొండ ప్రాంతాలలో గడపడానికి, సంతోషకరమైన జీవితాన్ని అనుభవించడానికి ఇష్టపడతారు. ఆడవారు పెళ్ళయిన తరువాత ఉన్నత జీవితాన్ని పొందుతారు.

## పేరు పెట్టే విధానం

వీరికి పేరు రవి సంఖ్యలు, శుక్ర సంఖ్యలు వచ్చేలా పెట్టుకోవాలి. రవి సంఖ్యలు 19,37,46,73,82 మొ॥ శుక్ర సంఖ్యలు 15,24,33,42,60,69 మొ॥ వ్యాపార సంస్థల పేర్లు కూడా ఈ సంఖ్యల్లోనే ఉండాలి.

## రాణించే రంగాలు

విలాసవస్తువులు, స్టీల్, విద్యుచ్ఛక్తి పరిశ్రమలు, కాంట్రాక్ట్ వర్క్, నగల దుకాణం, రవాణా వ్యాపారాలు, కంప్యూటర్ రంగాలు లాభదాయకంగా ఉంటాయి.

## వ్యాధులు

రక్తపోటు, చర్మ వ్యాధులు, కలుషిత నీటి సంబంధ వ్యాధులు రావొచ్చు. తగిన చికిత్స తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది.

## సూచనలు

| | | |
|---|---|---|
| లక్కీ నంబర్లు | - | 1, 6, 9 |
| లక్కీ డేట్స్ | - | 1, 6, 9, 10, 15, 18, 19, 24, 27, 28 |
| అన్‌లక్కీ డేట్స్ | - | 3, 8, 12, 17, 21, 26 |
| లక్కీ కలర్స్ | - | పసుపు, నీలి రంగు, పచ్చ, ఎరుపు, తెలుపు, గోల్డెన్ |
| అన్‌లక్కీ కలర్స్ | - | నలుపు, నారింజ, ఊదా |
| అదృష్ట దినాలు | - | ఆదివారం, మంగళవారం, శుక్రవారం |
| లక్కీ వివాహతేదీలు | - | 1,6,9,10,15,18,19,24,27,28 |
| రెమిడీస్ | - | ఆదిత్య హృదయం వినడం, సూర్య ఆరాధన, నవగ్రహ అభిషేకం, పేదలకు అన్నదానం చేయడం, పేద అమ్మాయిల వివాహ ఖర్చులలో పాలుపంచుకోవడం |
| ఉదా | - | బ్రహ్మానందం 01-02-1956<br>ఆర్. మాధవన్ 01-06-1970<br>రతన్ టాటా 28-12-1937 |

## జన్మసంఖ్య - 1, డెస్టినీ నంబరు - 7 గల వ్యక్తులు

**1/7 వ్యక్తులు మంచి రచనా శక్తి కలిగి ఉంటారు. వేదాంతులుగా పేరు పొందుతారు. పొగడ్తలకు లొంగరు.**

ఎవరు 1, 10, 19, 28 తేదీల్లో జన్మించి, వారి డెస్టినీ నంబరు 7 అవుతుందో వారు ఈ వర్గంలోకి వస్తారు. వీరిపై రవి, కేతువు గ్రహాల ప్రభావం ఉంటుంది. వీరు పొడవుగాను, ఆకర్షణీయంగా ఉంటారు. సాధారణ దుస్తులు ధరించినపుడు శుభ్రంగా కనిపిస్తారు. మంచి జ్ఞానం, ఆలోచనా శక్తి, సృజనాత్మక, రచనా శక్తి, కవితా శక్తి కలిగి ఉంటారు. అనుకూలమైన పేర్లుంటే వీరి జీవితం ఆనందమయంగా ఉంటుంది. లేదంటే అపజయాలు, ఆపదలు, చేదు అనుభవాలతో జీవితం నిండి పోతుంది. నిద్రలో కలవరిస్తారు. కఠినంగా కనిపించినా జాలి, దయ ఉంటాయి. దేవుని మీద విశ్వాసం, మతం పై ఆసక్తి వుంటాయి. నుదుట మీద బొట్టుని చెరగనివ్వరు.

చూడగానే వీరు ఉద్రేకానికి గురి కావచ్చు అన్నట్లుగా ఉన్నా, సామాన్యంగా గౌరవనీయులు. ఇతరులు కూడా అలాగే వుండాలని ఆశిస్తారు. వీరికి సన్నిహితులు కావటం కష్టం. వీరికి నిజమైన స్నేహితులు దొరకటం కష్టం. ఎవరినీ నమ్మరాదని విశ్వసిస్తారు. కష్టాలొచ్చినప్పుడు తాళలేక కన్నీరు పెడతారు.

పొగడ్తలకు లొంగరు. పొగడటం మొదలెడితే అప్రమత్తులవుతారు. సత్యాన్ని యిష్టపడి, నటనని ద్వేషిస్తారు. కాబట్టి ఇతరులతో నిరంతరం అభిప్రాయభేదాలు వస్తాయి. చాలా మంది ప్రభుత్వ ఉద్యోగాల్లో వుండి నిజాయితీగా వుంటారు.

వీరు వేదాంతులుగా ప్రశంసించబడతారు. మతంపై అచంచల విశ్వాసం ఉండటంతో ఆనందంగా ఉన్నప్పుడు అందరితో కలసిపోతారు. కొంతమంది కుటుంబ వాతావరణానికి అసంతృప్తి చెందుతారు. వీరికి అనుకూలమైన పేరు ఉంటే ఈ సమస్యరాదు. వీరి జీవిత భాగస్వామి జన్మసంఖ్య, డెస్టినీ సంఖ్య, నామసంఖ్య అనుకూలంగా ఉన్నట్లు చూసుకోవాలి.

అనుకూల సంఖ్య గల భాగస్వామి దొరికితే జీవితం అదృష్టవంతంగా ఉంటుంది. కుటుంబ జీవితం సంతృప్తికరంగా లేనపుడు ఇతర ఐహిక సుఖాల వైపు దృష్టిపెడతారు.

మానసిక ఆందోళనకు గురి అవుతారు.

అనుకూల నామసంఖ్య ఉంటే ఉన్నత స్థానాలకు చేరుకుంటారు. పరిశోధకులవుతారు. వ్యాపార వేత్తలు, నాయకులు అవుతారు. అనుకూల నామసంఖ్య లేకుంటే కష్టాలు, వ్యాధుల పాలవుతారు. అదృష్ట తేదీలలో పెళ్ళి అయితే ఆనందకర జీవితం లభిస్తుంది. వీరికి మంచి కార్యనిర్వహణా సామర్థ్యం ఉంటుంది.

## పేరు పెట్టే విధానం

వీరికి రవి సంఖ్యలు 19, 37, 46, 73, 82, బుధ సంఖ్యలైన 5, 14, 23, 32, 41, శుక్ర సంఖ్యలు 15, 24, 33, 42 వచ్చేట్లుగా పేరు పెడితే విజయం సాధిస్తారు.

## రాణించే రంగాలు

లోహాలు, రాళ్ళు, ఖనిజాలు, రత్నాలు, రవాణా, కమీషన్ వ్యాపారాల్లో రాణింపు. దేవాలయాల్లో ఉద్యోగాలు, పూజా సామాగ్రి అమ్మే దుకాణాలు అనుకూలంగా ఉంటాయి.

## వ్యాధులు

వీరికి మానసిక వ్యాధులు, అకారణ వ్యాధులు వస్తాయి. ఆకస్మిక ప్రమాదాలు, రక్తదోషాలతో వచ్చే వ్యాధులు వస్తాయి. సరైన చికిత్స చేసుకుంటే ఉపశమనం లభిస్తుంది.

## సూచనలు

| | | |
|---|---|---|
| లక్కీ నంబర్లు | - | 1, 2, 6, 7 |
| లక్కీ డేట్స్ | - | 1, 2, 5, 6, 7, 10, 11, 14, 15, 16, 19, 20, 23, 24, 25, 28, 29 |
| లక్కీ కలర్స్ | - | పసుపు, లేతనీలం, లేత ఆకుపచ్చ, తెలుపు, గోల్డెన్, క్రీమ్ |
| అన్‌లక్కీ డేట్స్ | - | 8, 9, 17, 18, 26, 27 |
| అన్‌లక్కీ కలర్స్ | - | నలుపు, ఎరుపు |
| లక్కీ వివాహతేదీలు | - | 1,6,10,15,19,24,28 |
| రెమిడీస్ | - | సూర్య ఆరాధన, సుబ్రమణ్యస్వామి ఆరాధన, అనాధలకు అన్నదానం, కేతు జపం చేయించుకోవటం, పార్వతి అమ్మవారిని ఆరాధించడం మంచిది. |
| ఉదా | - | కల్పనా చావ్లా 01-07-1961 |

## జన్మసంఖ్య - 1, డెస్టినీ నంబరు - 8 కల వ్యక్తులు

**1/8 వ్యక్తులు వయసు పెరిగే కొద్ది ఆధ్యాత్మికత పొందుతారు. ఆడిన మాట తప్పరు.**

ఎవరు 1, 10, 19, 28 తేదీల్లో జన్మించి, డెస్టినీ సంఖ్య 8 ఉంటుందో వారు ఈ వర్గంలోకి వస్తారు. వీరిపై సూర్యుడు, శని గ్రహాల ప్రభావం ఉంటుంది. సూర్యుడు, శని విరోధ గ్రహాలు, కాబట్టి వీరు తమ జన్మసంఖ్యకు గానీ, డెస్టినీ నంబరుకు గాని అనుకూలమైన నామసంఖ్య ఉండేట్లు పేరు మార్చుకోవాలి.

వీరి పేర్లు 5 లేదా 6 అంకెతో వస్తే వీరికి అన్ని సౌకర్యాలు, ఇల్లు, పొలాలు, వాహనాలు ఉంటాయి. మేనేజ్‌మెంట్ రంగంలో రాణిస్తారు. వీరు తప్పక ఎంబీఏ కాని ఎల్‌ఎల్‌బీ కాని చదువుతారు. మీడియం ఎత్తు కలిగి లేదా పొట్టిగా ఉంటారు. ధైర్యం కలిగి ఏ పనినైనా తెగువతో చేస్తారు. దేవునిపై విశ్వాసం ఉంటుంది. అపజయాలు ఎదురైనపుడు విశ్వాసం సడలుతుంది. మళ్ళీ దేవునిపై విశ్వాసం కలిగి ఆధ్యాత్మిక మార్గంలో నడుస్తారు. ఆధ్యాత్మిక, తాత్విక ఆలోచనలు కలిగి ఉంటారు. వయసు పెరిగే కొద్దీ ఆధ్యాత్మిక భావనలు పెరుగుతాయి.

4వ నంబరు కల వారితో వీరు గౌరవంగాను, వినయవిధేయతలతోను ఉంటారు. ఒకసారి పని మొదలెట్టారంటే ఎవరేమనుకున్నా అందులోంచి వెనకకు మళ్ళరు. ఆరోగ్యాన్ని, అలసటని లెక్కచెయ్యక కష్టించి పనిచేస్తారు. వీరిని చూసిన వారు వీరు మంచి వారే కాని కొన్నిసార్లు మొండివారు అని అనుకుంటారు.

ఎవరికైనా మాటయిస్తే దాన్ని ఎలా అయినా నిలబెట్టుకుంటారు. అది చేయకూడని సహాయమైనా సరే లెక్క చెయ్యరు. ఖర్చు తక్కువ చేయాలి అనుకుంటూనే ఎక్కువ చేస్తారు.

వీరి పేర్లు అనుకూలంగా ఉంటే, కష్టాలను అధిగమించి అభివృద్ధిని సాధిస్తారు. కాంపిటీటివ్ పరీక్షల్లో విజయం పొందే అవకాశాలు ఉన్నాయి. అందువలన ఆ దిశగా చిన్నతనం నుంచి సన్నద్ధం అయితే మంచిది. మంచిస్థాయిలో ఉండి అధిక సంపాదన కలిగి ఉంటారు. స్వయంకృషితో పైకి వస్తారు. ఒంటరితనాన్ని యిష్టపడతారు. భూములు

కొంటారు. వీరికి ఈ విషయంలో అదృష్టం కలసి వస్తుంది. వీరు సాధించిన ప్రగతిని బయటపెట్టరు.

## పేరు పెట్టే విధానం

వీరిపై రవి, శని ప్రభావం ఎక్కువ. వీరి నామసంఖ్య రవి, బుధ, శుక్ర సంఖ్యలలో వచ్చే విధంగా పెట్టుకోవాలి. 19, 37, 46, 64, 14, 23, 32, 41, 59, 15, 24, 33, 42, 69 మొదలైనవి.

## రాణించే రంగాలు

స్టీలు, రవాణా, కాంట్రాక్ట్, కమిషన్, లా ప్రొఫెషన్, సీఏ, మెడిసిన్, భూ వ్యాపారాలు అనుకూలం.

## వ్యాధులు

మలబద్ధకం, గ్యాస్ట్రబుల్, బి.పి., కడుపునొప్పి, వెన్నునొప్పి వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. సరైన చికిత్స తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది.

## సూచనలు

| | | |
|---|---|---|
| లక్కీ నంబర్లు | - | 1, 5, 6 |
| లక్కీ తేదీలు | - | 1, 5, 6, 10, 14, 15, 19, 23, 24, 28 |
| అన్‌లక్కీ తేదీలు | - | 2, 11, 20, 29 |
| లక్కీ కలర్స్ | - | పసుపు, నీలం, గులాబీ, గోల్డెన్ |
| అన్‌లక్కీ కలర్స్ | - | ఎరుపు |
| అదృష్టదినాలు | - | ఆది, బుధ, శుక్ర, శనివారాలు |
| లక్కీ వివాహతేదీలు | - | 1, 6, 10, 15, 19, 24, 28 |
| రెమిడీస్ | - | సూర్య ఆరాధన, శనికి తైలాభిషేకం, అనాథలకు అన్నదానం చేయడం. కాకులకు ఆహారం పెట్టడం మంచిది. |
| ఉదా. | - | విద్యాబాలన్ 01-01-1986 |
| | | శృతిహాసన్ 28-01-1986 |

## జన్మసంఖ్య - 1, డెస్టినీ నంబరు - 9 కల వ్యక్తులు

**1/9 వ్యక్తులు లాయర్లు, జడ్జీలుగా ఉంటారు. వీరు స్వేచ్ఛను కోరుకుంటారు.**

ఎవరు 1, 10, 19, 28 తేదీల్లో జన్మించి వారి డెస్టినీ సంఖ్య 9 అవుతుందో వారు ఈ వర్గంలోకి వస్తారు. వీరిపై కుజుడు, రవి ప్రభావం ఉంటుంది. రవి మంచి చదువు, జ్ఞానం, సజ్జన సాంగత్యాన్నిస్తాడు. కుజుడు, మానసిక బలం, ఆత్మ విశ్వాసం, శారీరక బలాన్ని ఇస్తాడు. ఒకటో నంబరు వ్యక్తుల్లో వీరు చాలా ధైర్యవంతులు. వీరి మితిమీరిన ధైర్యం హింసా కార్యక్రమాలకి ప్రేరేపించవచ్చు. వీరికి అనుకూలమైన పేరు ఉంటే, స్త్రీ మూలక ధనలాభం కలుగుతుంది. ఎన్నో కష్టాలు, అడ్డంకులు ఎదురైన తర్వాత సౌకర్యవంతమైన జీవితాన్ని పొందుతారు. యుక్త వయసులో వారు ఎదుర్కొనే కష్టాలు వారికి పరిపక్వత, అనుభవాన్ని నేర్పుతాయి. విద్యా విఘ్నాలు ఎదురైనా చివరకు విజయాన్ని పొందుతారు. వీరు పోలీస్, మిలటరీ వంటి యూనిఫామ్ ధరించే వృత్తులపై ఉత్సాహం చూపిస్తారు.

వీరు ధైర్య సాహసాలు ప్రదర్శిస్తారు. ఇతరులకు సహాయపడటానికి సంకోచించరు. ఎటువంటి వ్యతిరేకతనైనా ఎదుర్కొని ఉన్నత స్థానాన్ని చేరతారు. కాని వీరి నామ సంఖ్య 2 గాని 7 గాని అయితే అవి వీరిపై దుష్ఫలితాలను చూపుతాయి. వీరు రాజసంగా, అందంగా ఉంటారు. ఒక మోస్తరుగా పొడవుగా ఉంటారు. వీరికి గ్రహణశక్తి అధికం. వీరు కఠినంగా మాట్లాడినా రహస్యంగా ఉంచవలసిన దానిని రహస్యంగా వుంచుతారు.

వీళ్ళలో కొందరు లాయర్లు, జడ్జిలు, న్యాయకోవిదులు, నిర్ణేతలుగా ఉంటారు. చాలా మంది ప్రభుత్వ ఉద్యోగులుగా ఉంటారు. కొంతమంది స్వయం ఉపాధి కల్గి ఉంటారు. వీరికి రాజకీయాలందు ఆసక్తి ఉండి అందులో కూడా ఉన్నత శిఖరాలను అందుకుంటారు. ఇతరుల అభిప్రాయాలను తొందరగా గ్రహించి, సాధ్యాసాధ్యాలను విచారించి, విచక్షణతో సమస్య పరిష్కారం చేస్తారు.

వీరు స్వేచ్ఛను కోరుకుంటారు. ఇంకొకరి క్రింద జీవించటానికి, వారి అదుపు ఆజ్ఞలలో ఉండటానికి ఇష్టపడరు. వీరికి ఎందరో తెలిసినా కొందరే స్నేహితులు ఉంటారు. స్నేహితులకు అన్ని రకాల సహాయాలు చేస్తారు.

అనుకూలమైన పేర్లు ఉంటే, తక్కువ అపజయం, ఎక్కువ విజయాలు ఉంటాయి. ప్రతీ అడుగులోను ఎంతో వ్యతిరేకతను ఎదుర్కొని అంచెలంచెలుగా అభివృద్ధి సాధిస్తారు. 10 రూపాయలతో అయ్యే పని వీరికి 100 రూపాయలు ఖర్చవుతుంది. అలాగే ఇతరులకు 1000 రూపాయలు ఖర్చయితే కాని జరగని పని వీరికి 10 రూపాయలతోనే అయిపోతుంది. తమ ఆత్మ సంతృప్తి కోసం డబ్బును మంచినీళ్ళ ప్రాయంగా ఖర్చు చెయ్యటానికి వీరు వెనుకాడరు. అతి ఖర్చు తర్వాత నిదానించి మితవ్యయానికి కట్టుబడి ఉంటారు. వీరు సొంత ఊరికి దూరంగా జీవిస్తారు. తమ స్నేహితుల్లో వీరు నాయకుడిగా గుర్తింపబడతారు. స్నేహితులు బాధల్లో ఉంటే వీరు వారిని ఓదారుస్తారు.

## పేరు పెట్టే విధానం

వీరిపై రవి, శుక్ర, కుజ గ్రహాల ప్రభావం ఎక్కువ. రవి సంఖ్యలైన 19, 37, 46, 64 మొ॥వి, శుక్ర సంఖ్యలు 15, 24, 42, 69 సంఖ్యలలో పేరు పెట్టుకుంటే వీరి జీవితం ఆనందమయమవుతుంది.

## రాణించే రంగాలు

స్టీలు, భూమి, కమిషన్, కాంట్రాక్టు, ఏజెన్సీ వ్యాపారాలందు లాభం ఉంటుంది. అనుకూలమైన పేరు ఉన్నప్పుడు, వ్యాపారం విస్తరించి పెరుగుతుంది. ప్రతికూలమైన పేర్లు ఉంటే, ఏ పని చేసినా అపజయం ఎదురవుతుంది.

## వ్యాధులు

ప్రతికూలమైన పేర్లుంటే అకస్మిక ప్రమాదాలు, కడుపులో నలత, జాయింట్ పెయిన్స్, మధుమేహం వస్తాయి. సరైన చికిత్స తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది.

## సూచనలు

| | | |
|---|---|---|
| లక్కీ నంబర్లు | - | 1, 9, 6 |
| లక్కీ తేదీలు | - | 1, 6, 9, 10, 15, 18, 19, 24, 27, 28 |
| అన్‌లక్కీ డేట్స్ | - | 3, 8, 12, 17, 21, 26 |
| లక్కీ కలర్స్ | - | పసుపు, నీలం, ఎరుపు |
| అన్‌లక్కీ కలర్స్ | - | నలుపు, పచ్చ |
| అదృష్ట దినాలు | - | ఆదివారం, మంగళవారం, శుక్రవారం |

| | | | |
|---|---|---|---|
| లక్కీ వివాహతేదీలు | - | 1, 6, 9, 10, 15, 19, 24, 27, 28 | |
| రెమిడీస్ | - | సుబ్రమణ్యస్వామి ఆరాధన, | |
| | | వీలైతే వీరు రక్తదానం చేయడం మంచిది. | |
| ఉదా | - | నానా పటేకర్ | 01-01-1951 (హిందీ నటుడు) |
| | | మంగళ్ పాండే | 19-07-1927 (ఫ్రీడమ్ ఫైటర్) |
| | | భగత్‌సింగ్ | 28-09-1907 |

# జన్మసంఖ్య - 2 (చంద్రుని సంఖ్య)

**2వ సంఖ్య చంద్రునికి సంకేతం. ఈ నెంబరు గలవారు మంచి నాయకులుగా కంటే మంచి సహచరులుగా రాణిస్తారు. సున్నిత మనస్తత్వం కలిగి ఉంటారు. చంద్రునిలాగే వీరి మనసు ఆటుపోట్లుకు లోనవుతుంటుంది.**

ఏ నెలలోనైనా 2,11,20,29 తేదీలలో పుట్టిన వారు 2 వ నెంబరు వ్యక్తులు. ఈ 2వ నంబరు వ్యక్తులపై చంద్రుడి ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

## అనుకూల ప్రభావాలు

శాంతి, సహకారం, భాగస్వామ్యం, రాయబారం, న్యాయ మధ్యవర్తిత్వం, అంగీకారం, సర్దుకుపోయే తత్వం, అణుకువ, విధేయత, స్నేహతత్వం, హుందాతనం, ధ్యానం, ఆధ్యాత్మిక ప్రభావం

## అవకాశాలు, వృత్తులు

2 వ నెంబరు వ్యక్తులు నాయకులు కారుగానీ మంచి అనుచరులుగా ఉంటారు. వివరాలు సేకరించే సామర్థ్యం, ప్రభావితం చేయగలిగే తత్వం, ఐకమత్యాన్ని తీసుకురాగలిగే గుణం, కాలానుగుణ ప్రవర్తన కలిగి ఉంటారు. కళ, మార్మిక, ఆధ్యాత్మిక శాస్త్రాభిలాష ఉంటాయి. 1వ నెంబరు వ్యక్తులు ఆరంభాన్నిస్తే, 2వ నెంబరు వ్యక్తులు దాన్ని ముందుకు తీసుకెళ్ళి ఆ పనిని పూర్తిచేసే సామర్థ్యం కలవారు. కలహ స్వభావం లేనివారు, వినయ విధేయతలు కలవారు. సహచరులకి ఇష్టమైనవారు. నాయకత్వం అవసరం లేని ఎక్కడైనా వీరు విజయాన్ని సాధిస్తారు. ఆఫీసులో కూర్చుని చేసే పనులు బాగా చేయగలుగుతారు. బయట తిరిగి చేసే పనిలో అంతగా ఆసక్తి చూపరు.

రేడియో, టెలివిజన్, వైద్యం, మందులు, ల్యాబ్ టెక్నిషియన్స్, టీచింగ్, బ్యాంకింగ్, సంగీతం, కళ, డిజైనింగ్, మ్యూజియమ్స్, విద్యారంగ సంస్థ లలో విజయాలను సాధిస్తారు. సేవారంగంలో రాణిస్తారు. కన్సల్టెన్సు, నర్సింగ్, బుక్ కీపింగ్, సెక్రటరీ, ఆతిథ్యం ఇచ్చే రంగాలలో రాణిస్తారు. ట్రైనింగ్, కేర్ టేకింగ్ లలో రాణిస్తారు. విషాద వాతావరణంలో, ఆనందాన్ని ప్రశాంతతని నెలకొల్పడంలో వీరిది అందెవేసిన చెయ్యి.

## ప్రతికూల ప్రభావాలు

అతి సున్నితమైన వారు, తొందరగా మనసు గాయపడే వారు. సిగ్గు, బిడియం, పిరికితనం, దు:ఖం, ఒంటరితనాలు వీళ్ళని నిరోధిస్తాయి.

వివరాల సేకరణపై ఎక్కువ సమయం కేటాయించడం వలన, పని పూర్తి చెయ్యడంలో ఆలస్యం చేస్తారు. పనిలో భరోసా, ప్రోత్సాహం ఇస్తేనే అభివృద్ధి సాధిస్తారు లేదా నిరాశాభావాన్ని పొందుతారు.

## వ్యక్తిగతం

ఆప్యాయత, సహకారగుణం ఉండటం వలన ఇతరులు వీరి సహచర్యంలో ఓదార్పుని, ఉపశమనాన్ని పొందుతారు. బాధ్యతాయుతమైన తల్లిదండ్రులుగా ఉంటారు. వీరికి ఎక్కువ మంది పరిచయస్తులు, భాగస్వాములు ఉంటారు. ఇతరులచే సులభంగా మోసపోతారు. తొందరగా మనసు నొచ్చుకొని, అయోమయానికి గురవుతారు. వీరికి సంతోషకరమైన వాతావరణం, ప్రేమ, పెళ్ళి ఎంతో అవసరం. వీరు సమాజంలో ప్రముఖులుగా ఉంటారు.

## 2వ నెంబరు పాజిటివ్ లక్షణాలు

1. ఇల్లు, కుటుంబంపై ప్రేమానురాగాలు
2. అర్థం చేసుకునే గుణం, సానుభూతి
3. సాయం చేసే గుణం
4. సున్నితమైన మనసు
5. మధ్యవర్తిత్వం చేయగలగటం
6. ఇతరుల భావాలను పట్టించుకొనే గుణం
7. వినయం, విధేయత కలిగి ఉండటం
8. ఒక పద్ధతిగా ఉండటం
9. ప్రశాంతంగా ఉండి శాంతిని కోరుకోవటం

## నెగిటివ్ లక్షణాలు

1. ఊహలపై ఆధారపడటం
2. ఆత్మ విశ్వాసం తక్కువగా ఉండటం

3. ప్రతి చిన్న విషయానికి చిన్నబుచ్చుకోవటం
4. పిరికితనం, సిగ్గు, భావావేశం కలిగి ఉండటం
5. ఇతరుల సంతోషం కోసం తమ ఆత్మాభిమానం దెబ్బతిన్నా భరించటం

వీరు మంచి భాగస్వాములుగా ఉంటారు. దయకలిగి, అర్థం చేసుకొనే మనస్సు కలవారై ఉంటారు. అత్యంత విశ్వసనీయత, విశ్వాసపాత్రత కలిగి సాంప్రదాయ, ఆచార వ్యవహారాలకు ప్రాధాన్యం ఇస్తారు. తమను చూసి ఆశ్చర్యం పొందే వాళ్ళు, మద్దతుదారుల మధ్య వీరు అత్యంత ప్రభావవంతంగా వుంటారు.

చంద్ర ప్రభావిత వ్యక్తులు ప్రజాదరణ పొంది, ప్రముఖ వ్యక్తులుగా పేరు ప్రఖ్యాతులు పొందుతారు. కానీ ఇవన్నీ శాశ్వతం కాదు. చంద్రుడు రాచరికానికి సంబంధించిన వాడైనందున వీరు ప్రభుత్వ సంబంధిత విభాగాలలో ముఖ్యమైన పదవులను అలంకరిస్తారు. చంద్రుడిలో వచ్చే మార్పులకు అనుగుణంగా ఈ నంబరు వ్యక్తుల గుణాలు మార్పుచెందుతూ ఉంటాయి. జీవన గమ్యంలో ధైర్యసాహసాలు లోపించడం వలన మిగతా వారికన్నా వెనుకబడి ఉంటారు. అవకాశాలు వస్తాయి కానీ వీరి నెమ్మదితనం వలన అవి చేజారిపోవచ్చు. దృఢ సంకల్పం లేకపోవటం వలన సాహసోపేతమైన పనులలో రాణింపు ఉండదు. వీరి డెస్టినీ నంబరు బాగా ఉంటే జీవితంలో విజయం సాధిస్తారు.

వీరు అద్భుత సృజన శక్తి కలిగి ఉంటారు. తమ ఫలప్రదమైన ఆలోచనలను ఇతరులకి అందించడం ద్వారా వీరి ఉనికిని, ప్రతిభను చాటుకోవచ్చు. వీరి ఆలోచనలను సరైన విధంగా పదును పెడితే రాణిస్తారు. కవిత్వం, సాహిత్యం, కళలలో వీరి సృజనాత్మకత ఎంతగానో ఉపయోగిస్తుంది. రెండవ నంబరు వ్యక్తుల సృజనాత్మకత ఎంత గొప్పదో చెప్పడానికి చక్కని ఉదాహరణ గాంధీజీ తన సృజనాత్మకతతో బ్రిటిష్ వారిని జయించాడు.

ఇతరులు అతికష్టంతో సాధించలేని కార్యాలను వీరు సునాయాసంగా సాధిస్తారు. వీరికి దివ్యశక్తి ఉంటుంది. తమని వ్యతిరేకించిన వారి ముందు మౌనంగా ఉంటారు. తనకు లోబడిన వారిని ఆజమాయిషీ చేస్తారు. బ్రతిమాలితే అలక్ష్యం చేస్తారు. అలక్ష్యం చేస్తే బ్రతిమాలతారు. మాటల్లో ధైర్యం కనబరిచినా, మనసులో భయం వెన్నాడుతుంది.

వీరు తమకు అనుగుణమైన సంఖ్య గల వారితో కలిసి పనిచేస్తే విజయం సాధిస్తారు. వీరికి కొన్ని సందర్భాలలో సోమరితనం ఉంటుంది. వీరికి ప్రత్యక్షంగా స్నేహం, పరోక్షంగా

పగ వృద్ధి చెందుతుంది. కల్పనల ద్వారా సంపద చేకూరుతుంది. కవులు, రచయితలు, ప్రఖ్యాతిగాంచిన నటులు, ఛాయాచిత్ర కళాకారులు, దర్శకులు మొదలైన వారు ఈ సంఖ్యలో జన్మించిన వారే.

ఓటమికి, దుఃఖానికి భయపడతారు. ఇవి ఎక్కువైనప్పుడు మానసికంగా కుంగిపోతారు. యవ్వనంలో సామాన్యంగా ఉన్నా ఆ తర్వాత రాజులాంటి జీవితం సాధ్యపడుతుంది. దేవునిపై నమ్మకం, మనోబలం రెండింటినీ సమర్థంగా వినియోగిస్తే గొప్ప ధనవంతులు కావడం ఖాయం.

ఏకాగ్రతతో ఆచరించే అన్ని వృత్తులలో తప్పనిసరిగా విజయం సాధిస్తారు. ప్రజాభిమానాన్ని, కీర్తిని కాంక్షిస్తారు. సువాసన ద్రవ్యాలు, ముత్యాలు, రత్న సంబంధ వ్యాపారాలలో రాణిస్తారు. కుటుంబ జీవితంలో సమస్యలు ఏర్పడి తొలగిపోతాయి.

జన్మ సంఖ్య యొక్క ప్రభావం, వ్యక్తులపై ఏ విధంగా ఉంటుందో, అదే విధంగా డెస్టినీ నంబరు ప్రభావం కూడా ఉంటుంది. దాని వలన జన్మసంఖ్య 2 ఉన్న వ్యక్తులందరి గుణగణాలు ఒకే విధంగా ఉండవు. దానికి కారణం డెస్టినీ నంబరు మారటమే. కాబట్టి ప్రస్తుత 2 జన్మ సంఖ్య కలవారి గుణగణాలు కూడా డెస్టినీ నంబరు బట్టి మారుతూ ఉంటాయి. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరని ప్రార్థన!

## జన్మసంఖ్య - 2, డెస్టినీ నంబరు - 1 కల వ్యక్తులు

**2/1 వ్యక్తులు యవ్వనంలో తల్లిదండ్రులకు దూరంగా వుండే పరిస్థితి రావొచ్చు. వీరికి లలిత కళలపై ఆసక్తి ఉంటుంది. మంచి ఉద్యోగం, ఇల్లు, భూములు సంపాదిస్తారు.**

ఎవరు 2, 11, 20, 29, తేదీలలో జన్మించి, వారి డెస్టినీ సంఖ్య 1 అవుతుందో వారు ఈ వర్గం క్రిందికి వస్తారు. వీరిపై చంద్రుడు, సూర్యుడి ప్రభావం ఉంటుంది. ఒక మోస్తరు ఎత్తుగా, ఆకర్షణీయంగా ఉంటారు. ప్రభుత్వ ఉద్యోగులుగా ఉంటారు. కొంతమంది విలాస వస్తువుల వ్యాపారంలో, స్టీలు పరిశ్రమలు వ్యాపారాల్లో ఉంటారు. వీరికి అనుకూల పేర్లు ఉంటే జీవితంలో ప్రగతిని సాధిస్తారు. వీరికి కుటుంబ జీవితంలో సమస్యలు వచ్చే అవకాశం ఉంది.

వీరికి దైవంపై విశ్వాసం ఉంటుంది. వీరికి దైవ మత సంబంధాలపై ఆకస్మిక ఆసక్తి కలుగుతుంది. ఇతరుల భావాలను గ్రహిస్తారు. వీరికి జ్యోతిష్యం, చిత్రలేఖనం, సంగీతాది లలిత కళలపై ఆసక్తి ఉంటుంది. ఇతరులతో కలివిడిగా ఉండరు. వీరు స్నేహితులుగా గుర్తిస్తే వారిని నిజంగా ప్రేమిస్తారు. వీరు సైన్స్‌కి సంబంధించిన కోర్సులు చేస్తారు. వీరికి కల్పనా శక్తి ఉండటం వలన మంచి సహాయకారులుగా ఉంటారు. ప్రస్తుతం వీరు ఎలక్ట్రానిక్, కంప్యూటర్ మరియు మీడియా రంగాల్లో బాగా రాణిస్తున్నారు.

వారేపని చేసినా అభివృద్ధి సాధిస్తారు. వీరికి ఇల్లు, వాహనం, భూములు ఉంటాయి. ఉద్యోగం చేస్తారు. వీరు కష్టాల్లో ఉన్నప్పుడు చాలా మంది సహాయాన్ని అందిస్తారు. వీరికి వేగంగా అభివృద్ధి చెందాలని ఉంటుంది. వీరికి సూర్యుడికి సంబంధించిన నంబర్లు అనగా 19, 37, 46, 55, శుక్రునికి సంబంధించిన నంబర్లు 6, 15, 24, 33, 42, కేతు సంబంధిత నంబర్లు 25, 34 లలో పేరు పెట్టుకుంటే మంచిది

## పేరు పెట్టే విధానం

వీరికి 15, 19, 24, 25, 34, 37, 33, 42, 46, 55, 60, 69 నంబర్లు వచ్చే విధంగా పేర్లు పెట్టాలి.

**రాణించే రంగాలు :** విలాస వస్తువులు, కమీషన్ వ్యాపారం, కాంట్రాక్టులు, వ్యవసాయం, పచ్చడి వస్తువుల వ్యాపారాలు కలసివస్తాయి.

**వ్యాధులు :** అధిక వేడి వలన వ్యాధులు, కంటి వ్యాధులు, పైల్స్, రక్తపోటు వస్తాయి. సరియైన చికిత్స తీసుకుంటే ఉపశమనం కలుగుతుంది.

## సూచనలు

| | |
|---|---|
| లక్కీ నంబర్లు | - 1, 2, 7, 6, అన్‌లక్కీ నంబర్లు - 8 |
| లక్కీ తేదీలు | - 1, 6, 7, 10, 15, 16, 19, 24, 25, 28 |
| అన్‌లక్కీ డేట్స్ | - 8, 17, 26 |
| లక్కీ కలర్స్ | - పసుపు, లేత నీలిరంగు, లేత ఆకుపచ్చ |
| అన్‌లక్కీ కలర్స్ | - నలుపు, ఎరుపు |
| అదృష్ట దినాలు | - ఆదివారం, సోమవారం, శుక్రవారం |
| లక్కీ వివాహ తేదీలు | - 1,6,10,15,19,24,28 |

| | | | |
|---|---|---|---|
| రెమిడీస్ | - | అమ్మవారిని పూజించటం, | |
| | | చంద్రుని కాంతిలో 30-40 నిమిషాలు గడపటం | |
| ఉదా | - | అమితాబ్ బచ్చన్ | 11-10-1942 |
| | | జూనియర్ ఎన్టీఆర్ | 20-05-1983 |
| | | సత్యజిత్ రే | 02-05-1921 |
| | | రాజీవ్‌గాంధీ | 20-08-1944 |
| | | వీరేంద్ర సెహ్వాగ్ | 20-10-1978 |

## జన్మసంఖ్య - 2, డెస్టినీ నంబరు - 2 గల వ్యక్తులు

**2/2 వ్యక్తులు అందరితో కలుపుగోలుగా ఉంటారు. ప్లాన్సు మారుస్తూ ఉంటారు. వీరిపై చంద్రుని ప్రభావం పూర్తిగా ఉంటుంది. ముఖంలో ఏదో తెలియని ఆకర్షణ ఉంటుంది.**

ఎవరు 2, 11, 20, 29 తేదీలలో జన్మించి, వారి డెస్టినీ నంబరు 2 అవుతుందో వారు ఈ వర్గంలోకి వస్తారు. వీరిపై చంద్రుని ప్రభావం పరిపూర్ణంగా ఉంటుంది. వీరు పొట్టిగా ఉండినా అందమైన వారు. కొందరు పొడుగ్గా ఉంటారు. వీరి ఆలోచనలు, చంద్రుని వృద్ధి, క్షయాల వలె మారుతూ ఉంటాయి. వీరి ముఖంలో ఏదో తెలియని ఆకర్షణ ఉంటుంది. వీరు చంచలమైన స్వభావం కలిగి ఉంటారు.

వీరు ప్లాన్స్ మారుస్తూ ఉంటారు. ఇతరులతో కలివిడిగా ఉంటారు. మొండితనం ఎక్కువగా ఉంటుంది. వీరు దుష్ట ప్రచారం చేస్తారని చాలా మంది అపార్థం చేసుకుంటారు. కొంతమంది ఉద్యోగాలు మరికొంత మంది వ్యాపారాలు చేస్తారు. సౌందర్య సాధనాలను, వస్తువులను అమ్మటం ద్వారా డబ్బు సంపాదన ఉంటుంది. మంచి కల్పనాశక్తి, ఊహాశక్తి కలిగి ఉంటారు. వీరు కవిత్వం, రచనలు వంటివి చేయగలుగుతారు. వీరు ఎక్కువగా సైన్స్, కంప్యూటర్ విద్యలలో రాణిస్తారు. మేనేజ్‌మెంట్ రంగంలో అరుదుగా రాణిస్తారు. మిడిల్ మేనేజ్‌మెంట్‌లో రాణిస్తారు. మంచి సలహాలు ఇవ్వగలిగే శక్తి కలిగి ఉంటారు.

అనుకూలమైన పేర్లు ఉంటే ఉన్నతమైన జీవితం ఉంటుంది. ప్రకృతి సౌందర్యాన్ని

ఆరాధిస్తారు. విదేశీ ప్రయాణాలందు యిష్టత. శీతల ప్రదేశాలను చూడాలని కోరుకుంటారు.

## పేరు పెట్టే విధానం

వీరికి 15, 19, 24, 25, 34, 37, 33, 42, 46, 55, 60, 69 నంబర్లు వచ్చే విధంగా పేర్లు పెట్టాలి.

## రాణించే రంగాలు

వీరికి విలాస వస్తువులు, సౌందర్య సాధనాలు, ఆహార, వ్యవసాయ పదార్థాలు, కంప్యూటర్ రంగం, బోధనా వృత్తులు కలిసివస్తాయి.

## వ్యాధులు

వారిని వేధించే సమస్యలను బయటకు చెప్పక, వారిలో వారే బాధపడతారు. వీరికి మానసిక క్రమశిక్షణ అవసరం. మనోవ్యాధులు, చర్మవ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. సరియైన చికిత్స తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది.

## సూచనలు

| | | | |
|---|---|---|---|
| లక్కీ నంబర్లు | - | 1, 7, 6 | |
| అన్‌లక్కీ నంబర్లు | - | 8, 9 | |
| లక్కీ తేదీలు | - | 1, 2, 5, 6, 7, 10, 11, 14, 15, 16, 19, 20, 23, 24, 25, 28, 29 | |
| అన్‌లక్కీ డేట్స్ | - | 8, 9, 17, 18, 26, 27 | |
| లక్కీ కలర్స్ | - | పచ్చ, నీలం, తెలుపు, గోల్డెన్, పసుపు | |
| అన్‌లక్కీ కలర్స్ | - | ఎరుపు, నలుపు | |
| అదృష్ట దినాలు | - | ఆదివారం, సోమవారం, శుక్రవారం | |
| లక్కీ వివాహతేదీలు | - | 1, 6, 10, 15, 19, 24, 28 | |
| రెమిడీస్ | - | శివారాధన, లలితా సహస్రనామ పారాయణం | |
| ఉదా | - | పవన్‌కళ్యాణ్ | 02-09-1971 |
| | | మౌలానా ఆజాద్ | 02-11-1888 |
| | | లాలూప్రసాద్ యాదవ్ | 11-06-1947 |

## జన్మసంఖ్య - 2, డెస్టినీ నంబరు - 3 గల వ్యక్తులు

**2/3 వ్యక్తులు జీవితంలో కొంచెం ఆలస్యంగా స్థిరపడతారు. పొగడ్తలకు లొంగిపోతారు. ఆలస్యమైనా జీవిత ద్వితీయార్థంలో మంచి అభివృద్ధి ఉంటుంది.**

ఎవరు 2, 11, 20, 29 తేదీలలో జన్మించి, వారి డెస్టినీ నెంబరు 3 అవుతుందో వారు ఈ వర్గంలోకి వస్తారు. వీరిపై చంద్రుడు, గురువు ప్రభావం అధికంగా ఉంటుంది. 2వ నెంబరు అస్థిరత్వాన్ని, చంచలత్వాన్ని కలిగి ఉన్నా 3వ నంబరు బ్యాలెన్స్ చేస్తుంది. వీరు స్వార్థరహితమైన జీవితాన్ని గడుపుతారు, సమాజహితం, ప్రజాసంక్షేమం కోరుకుంటారు. చాలా మంది దగ్గర మంచి పేరు పొందినా, అసూయపరుల వలన చెడ్డపేరును కూడా పొందుతారు. వీరు సైన్స్ సబ్జెక్ట్‌పై ఆసక్తి చూపుతారు. చదువులో రాణిస్తారు. సంగీతం, నాట్యం, క్రీడలు వంటి వాటిపై ఆసక్తి ఎక్కువ. వీరు ఈ రంగంలో కృషి చేస్తే జీవితంలో ఉన్నతిని పొందుతారు. ఆత్మగౌరవానికి పెద్దపీట వేస్తారు. వృత్తి ఉద్యోగాలలో అవమానాలని భరించక అవసరమైతే వాటిని వదులుకునేందుకు కూడా సిద్ధపడతారు. జీవితంలో కొంచెం ఆలస్యంగా స్థిరపడతారు. అందువలన అధైర్యపడకుండా పాజిటివ్ దృక్పథంతో ప్రయత్నం చేయాలి.

మంచి గ్రహణశక్తి కలిగి ఉండి, శత్రువులను సులభంగా గుర్తిస్తారు. తమను గౌరవించి సహాయం కోరే వారి అభివృద్ధికి పాటుపడతారు. దీని వలన మంచి పేరుని పొందుతారు. అడుగు వేసే ముందు ఆలోచించు అన్న సూక్తిని అనుసరిస్తారు. ఉద్దేశ్యపూర్వకంగా ఏ పనులూ చేపట్టరు. ఒకసారి పని మొదలెడితే ఏదో విధంగా దానిని పూర్తిచేస్తారు. వీరికి అనుకూల నామసంఖ్యలు లేకపోతే చెడ్డపేరు, దుఃఖాన్ని పొందుతారు. వృద్ధాప్యంలో అనారోగ్యం వచ్చే అవకాశం ఉంది.

వీరు దేశభక్తులు. సమాజాన్ని ఉద్ధరించాలని అనుకుంటారు. ఉద్యోగంలో వున్నా, వ్యాపారంలో ఉన్నా చాలా మందికి సహాయం చెయ్యటానికి ముందుకు వస్తారు. వీరిని పొగిడి, పనిచేయమని బతిమలాడితే, శక్తివంచన లేకుండా కృషి చేసి విజయాన్ని పొందుతారు. కొంతమంది వీరి మంచి గుణాన్ని దుర్వినియోగపరుస్తారు. కాని దైవ

సహాయం వీరికుంటుంది.

జీవితంలో సమస్యలు ఎదురైనా దైవబలంతో వాటిని ఎదుర్కొని విజయవంతంగా నిలుస్తారు. వీరికి అనుకూల నామసంఖ్యలుంటే మొదట సామాన్య జీవితమున్నా తర్వాత సౌభాగ్యవంతమైన జీవితం లభిస్తుంది. గురువు యొక్క శుభదృష్టి వలన విజయాలను సాధిస్తారు. గురుసంఖ్య చెడు ప్రభావాలను తగ్గిస్తుంది.

## పేరు పెట్టే విధానం

వీరు 14, 19, 21, 23, 37, 39, 41, 46, 50, 55, 59 మొ॥ నంబర్లు వచ్చేలా పేరు పెట్టుకుంటే మంచిది.

## రాణించే రంగాలు

పుస్తకాల షాపు, వంట పాత్రల తయారీ, కమీషన్, ఏజన్సీస్, కాస్మోటిక్స్, ఫ్యాషన్ డిజైనింగ్, సంగీత వాయిద్యాల అమ్మకం, వడ్డీవ్యాపారంలో రాణిస్తారు. వీరికి నృత్యం, సంగీతం వంటి కళలలో ఆసక్తి, ప్రవేశం ఉండటం వలన వాటిని బోధించగలరు, ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్, కంప్యూటర్ రంగాల్లో రాణిస్తారు.

## వ్యాధులు

వీరికి జాయింట్‌పెయిన్స్, గుండె జబ్బులు, మల బద్ధకం, తలనొప్పి, కడుపునొప్పి వచ్చే అవకాశం ఉంది. సరియైన చికిత్స తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది.

## సూచనలు

| | | |
|---|---|---|
| లక్కీ నంబర్లు | - | 1, 2, 3, 7 |
| అన్‌లక్కీ నంబర్లు | - | 9 |
| లక్కీ తేదీలు | - | 1, 2, 3, 7, 10, 11, 12, 16, 19, 20, 21, 25, 28, 29, 30 |
| అన్‌లక్కీ డేట్స్ | - | 9, 18, 27 |
| లక్కీ కలర్స్ | - | పసుపు, నీలం, తెలుపు, గోల్డెన్ |
| అన్‌లక్కీ కలర్స్ | - | ఎరుపు |
| అదృష్ట దినాలు | - | ఆదివారం, సోమవారం, గురువారం |

| | | | |
|---|---|---|---|
| లక్కీ వివాహ తేదీలు | - | 1, 3, 10, 12, 19, 21, 28 | |
| రెమిడీస్ | - | వీరు అమ్మవారిని, దక్షిణామూర్తిని కొలవాలి. పేద విద్యార్థులకు సాయం చేస్తే మంచిది. | |
| ఉదా. | - | రాజేష్ ఖన్నా | 29-12-1942 |
| | | విశ్వనాథ్ ఆనంద్ | 11-12-1969 |
| | | చంద్రబాబునాయుడు | 20-04-1950 |

## జన్మసంఖ్య - 2, డెస్టినీ నంబరు - 4 గల వ్యక్తులు

**2/4 వ్యక్తులు ఉద్యోగం చేస్తున్నా, ఇంకో చిన్న వ్యాపారం కూడా చేస్తారు. తగవులు తీర్చగలిగే సమర్థత కలిగి ఉంటారు.**

ఎవరు, 2, 11, 20, 29 తేదీలలో జన్మించి, వారి డెస్టినీ నెంబరు 4 అవుతుందో వారు ఈ వర్గంలోకి వస్తారు. వీరిపై చంద్రుడు, రాహువు ప్రభావం అధికంగా ఉంటుంది. వీరు ఒక మోస్తరు పొడవుగా ఉండి ఏదో దాని గురించి ఎపుడూ ఆందోళన చెందుతూ వుంటారు. వీరికి వచ్చే అన్ని లాభాలను పూర్తిగా పొందలేరు. అనుకూల నామసంఖ్య ఉంటే లాభాన్ని పొందుతారు. లేకుంటే ఆరోగ్యం, కుటుంబ జీవితం, ఆదాయంలో మంచి ఫలితాలను పొందలేరు. చాలా కష్టపడి పనిచేస్తారు. ఉద్యోగంలో ఉన్నా చిరువ్యాపారాన్ని కూడా నిర్వహిస్తారు. తగాదాలు తీర్చుట ద్వారా కొందరు పేరును పొందుతారు.

రవాణా సంబంధిత, సౌందర్య సాధనాలు, ఎగుమతి వ్యాపారాలలో రాణిస్తారు. మాదకద్రవ్యాల జోలికి వెళ్ళరాదు. వీరికి మంచి సృజనాత్మకత ఉంటుంది. తాము చూసిన సుందర దృశ్యాలను చక్కగా వివరిస్తారు. కవితలు, కథలు అల్లడంలో నేర్పరులు. అయితే ఎందులోనూ స్థిరంగా ఉండరు. దేవునిపై విశ్వాసాన్ని పెంపొందించుకోవాలి. ఉద్యోగులు, అధికారుల పట్ల గౌరవ మర్యాదలు కలిగి ఉంటే మంచిది.

### పేరు పెట్టే విధానం

వీరు 15, 19, 24, 33, 37, 42, 46, 55, 60, 69, 73, 82 నంబర్లలో వారి

పేరు ఉండేలా చూసుకోవాలి.

## రాణించే రంగాలు

సైన్స్ సబ్జెక్ట్‌పై ఆసక్తి చూపి తరువాత ఎంబీఏ, ఎల్‌ఎల్‌బీ వంటి కోర్సులు చేస్తారు. వీరు మేనేజ్‌మెంట్ రంగాల్లో, అకౌంట్స్, న్యాయ సంస్థల్లో పనిచేసే అవకాశం ఉంటుంది. ఖనిజాలు, రత్నాలు, సౌందర్యవస్తువులు, ఎగుమతులు కలిసివస్తాయి. రవాణా, చర్మవ్యాపారాలు కలసివస్తాయి. ఉపన్యాసాలు, కథారచనలనుంచి కూడా లబ్ధిని పొందుతారు.

## వ్యాధులు

ఎనీమియా, బైల్, పైల్స్, జాయింట్ పెయిన్స్ పంటినొప్పి, నడుం నొప్పి మొదలైనవి వచ్చే అవకాశం ఉంది. సరియైన చికిత్స తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది.

## సూచనలు

| | | |
|---|---|---|
| లక్కీ నంబర్లు | - | 1, 2, 6 |
| అన్‌లక్కీ నంబర్లు | - | 8, 9 |
| లక్కీ తేదీలు | - | 1, 2, 6, 10, 11, 15, 19, 20, 24, 28, 29 |
| అన్‌లక్కీ డేట్స్ | - | 8, 9, 17, 18, 26, 27 |
| లక్కీ కలర్స్ | - | లేత పసుపు, లేత నీలం, ఆకుపచ్చ, తెలుపు, గోల్డెన్ |
| అన్‌లక్కీ కలర్స్ | - | నలుపు, ఎరుపు |
| అదృష్ట దినాలు | - | ఆది, సోమ, శుక్రవారాలు |
| లక్కీ వివాహ తేదీలు | - | 1, 6, 10, 15, 19, 24, 28 |
| రెమిడీస్ | - | శివునికి అభిషేకం, రాహు జపం,<br>సుబ్రహ్మణ్య స్వామి ఆరాధన,<br>దుర్గామాత ఆరాధన, అనాధలకు అన్నదానం |
| ఉదా | - | అజయ్ దేవగణ్ 02-04-1969<br>తరిమెళ్ళ నాగిరెడ్డి 11-02-1911 (కమ్యూనిస్టు, ఆర్థికవేత్త) |

## జన్మసంఖ్య - 2, డెస్టినీ నంబరు - 5 కలవారు

**2/5 వ్యక్తులు మంచి జాగ్రత్తపరులు. 30 ఏళ్ళ తరువాత స్థూలకాయం రావొచ్చు. అన్నీ విషయాలలో పరిజ్ఞానం ఉంటుంది.**

ఎవరు 2, 11, 20, 29 తేదీలలో జన్మించి, వారి డెస్టినీ నెంబరు 5 అవుతుందో వారు ఈ వర్గంలోకి వస్తారు. వీరిపై చంద్ర, బుధుల ప్రభావం అధికంగా ఉంటుంది. ఒక మోస్తరు పొడవు, అందమైన వారు, తెలివైన వారు. 2వ నెంబరు వ్యక్తుల్లో 2-5 నంబరు వ్యక్తులు చాలా చురుకైన వారు. వ్యాపారంలో అగ్రస్థానం పై కన్ను వేస్తారు. ఉద్యోగాల్లో ఉన్న వారు ఉన్నతస్థానాలకు చేరుకుంటారు. విలాస వస్తువులపై ఇష్టం, కమీషన్, ఏజన్సీల ద్వారా అదృష్టం, సంపద లభిస్తాయి. కాంట్రాక్టులు, సౌందర్య సాధనాలు, ఎలక్ట్రిక్ వస్తువుల ద్వారా లాభం ఉంటుంది. వీరు ఎంతో జాగ్రత్తపరులు, ఎంతో ఆలోచించి గాని ఏ పనిని మొదలుపెట్టరు. మంచి వైబ్రేషన్‌తో పేరు పెట్టుకుంటే వ్యాధుల నుండి ఉపశమనం పొందే అవకాశం ఉంది.

వీరు వీరి మతాన్ని ఖచ్చితంగా అనుసరిస్తారు. ఇతరులకు గౌరవాన్ని ఇస్తారు. ఎప్పుడూ చురుకుగా, అప్రమత్తంగా ఉంటారు. అలసిపోతే వేరే పనిని చేపట్టడం ద్వారా ఉత్సాహాన్ని పుంజుకుంటారు. జీవితంలో మంచిస్థాయికి రావడానికి, తమ మీద ఆధారపడ్డవారిని మంచిస్థాయికి తేవడానికి కృషి చేస్తారు. కటువుగా, పదునుగా మాట్లాడతారు. కానీ దయాహృదయులు. ఇతరులను తమతో పోల్చుకుని, వారికి అవసరమైన సహాయాన్ని అందిస్తారు. పైకి మానసికంగాను, శారీరకంగాను బలంగా కనిపించినా వీరు మానసికంగా అంత బలవంతులు కారు. నరాల బలహీనతలతో బాధపడతారు. ప్రతి విషయంలో కొంత ప్రవేశం ఉంటుంది. వీరికి సాధారణంగా మంచి భాగస్వామి లభిస్తారు. చెప్పిందే చెబుతుంటారు. వీరి నడక, వస్త్రధారణ ఆకర్షణీయంగా ఉంటాయి.

### పేరు పెట్టే విధానం

వీరు నామసంఖ్యను 1, 4, 6, 15, 19, 23, 24, 32, 33, 37, 42, 46, 41, 50, 55, 59, 77లు వచ్చేలా చూసుకోవాలి.

## రాణించే రంగాలు

వీరు కంప్యూటర్, ఎలక్ట్రానిక్స్, అకౌంట్స్, ఫైనాన్స్ రంగాల్లో రాణిస్తారు. మంచి రచయితలుగా సంగీత, లలిత కళలలో కొత్తదనాన్ని చూపగలరు. కమీషన్ వర్కు, కాంట్రాక్ట్, సౌందర్య సాధనాల అమ్మకం, ఎలక్ట్రిక్ సామాన్లు, పచ్చని వస్తువుల వ్యాపారాల్లో, పీఆర్ఓలుగా, కమిషన్ ఏజెంట్లుగా, మంచి వక్తలుగా రాణిస్తారు.

## వ్యాధులు

నరాల బాధలు, వెన్నునొప్పి, కీళ్ళనొప్పులు కలిగే అవకాశం ఉంది. సరియైన చికిత్స తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది. సరైన నామసంఖ్యతో పేరు పెట్టుకుంటే వాటిని అధిగమించవచ్చు.

## సూచనలు

| | | |
|---|---|---|
| లక్కీ నంబర్లు | - | 1, 5, 6 |
| అన్‌లక్కీ నంబర్లు | - | 8, 9 |
| లక్కీ తేదీలు | - | 1, 5, 6, 7, 10, 14,<br>15, 16, 19, 25, 28, 23, 24 |
| అన్‌లక్కీ డేట్స్ | - | 8, 9, 17, 18, 26, 27 |
| లక్కీ కలర్స్ | - | ఆకుపచ్చ, బూడిదరంగు, తెలుపు, గోల్డెన్, సిల్వర్, గ్రీన్ |
| అన్‌లక్కీ కలర్స్ | - | ఎరుపు |
| అదృష్ట దినాలు | - | ఆది, బుధ, శుక్రవారాలు |
| లక్కీ వివాహ తేదీలు | - | 1, 6, 10, 15, 19, 24, 28 |
| రెమిడీస్ | - | అమ్మవారిని కొలవడం,<br>వెంకటేశ్వర స్వామిని ఆరాధించడం,<br>తల్లి, తల్లితో సమానమైన వారిని ఆదరించడం మంచిది.<br>బీద విద్యార్థులకు సహాయం చేయడం. |
| ఉదా | - | జెఆర్‌డి టాటా 29-07-1904<br>ప్రణబ్ ముఖర్జీ 11-12-1935<br>రాహుల్ ద్రవిడ్ 11-01-1973 |

## జన్మసంఖ్య - 2, డెస్టినీ నంబరు - 6 గల వ్యక్తులు

**2/6 వ్యక్తులు అందంగా ఆకర్షణీయంగా ఉంటారు. చక్కగా మాట్లాడతారు. వీరికి సాధారణంగా ఎటువంటి కష్టాలు ఉండవు.**

ఎవరు 2, 11, 20, 29 తేదీలలో జన్మించి వారి డెస్టినీ నెంబరు 6 అవుతుందో వారు ఈ వర్గంలోకి వస్తారు. వీరిపై చంద్ర, శుక్రుల ప్రభావం వలన ఆకర్షణీయంగా ఉంటారు. వీరు మంచి వక్తలు. అనుకూల నామసంఖ్య లేకపోతే దుర్వ్యసనాలకి లోనవుతారు. సహజంగా వీరు అందమైన నడక, ఆకర్షణీయమైన వస్త్రధారణ, హావభావాలు కలిగి ఉంటారు. రచన, ఉపన్యాసం, బేరసారాల ద్వారా సంపాదన ఉంటుంది. కొంతమంది గొప్ప న్యాయవాదులుగా, వైద్యులుగా, సీఈఓలుగా, కళాకారులుగా రాణిస్తారు.

వీరు పొగడ్తలకి లొంగిపోతారు. లోపాలను ఎత్తి చూపేవారిని యిష్టపడరు. వీరు తమ లోపాలను తెలుసుకొని, సరిదిద్దుకోవాలి. నిరంతరం ఆలోచిస్తూ ఉంటారు. వేగంగాను, క్రమశిక్షణతోను పనులు చేస్తారు. అకస్మాత్తుగా అసంతృప్తికిలోనై నీరసపడతారు. ఉద్యోగాలలో ఉండే వారికి ఆదాయం అసంతృప్తి కలిగిస్తుంది. అదనపు పని ద్వారా ఆదాయాన్ని వెదుక్కోవలసి వస్తుంది. అనుకూల నామసంఖ్యలుంటే ధనవంతులవుతారు.

వీరు చక్కగా మాట్లాడతారు. గొప్ప కల్పనాచాతుర్యం ఉంటుంది. సుఖవంతమైన జీవితానికి కావలసిన సకల సదుపాయాలు ఉండేలా చూసుకుంటారు. జీవితంలో సాధారణంగా ఎటువంటి కష్టాలు రావు. అనుకూల నామసంఖ్య ఉంటే వీరికి సొంత ఇల్లు, భూమి వాహన సదుపాయాలు ఉంటాయి.

### పేరు పెట్టే విధానం

వీరి పేరు 15, 19, 24, 25, 33, 34, 37, 42, 43, 46, 55, 69 సంఖ్యల్లో పెట్టుకోవాలి.

### రాణించే రంగాలు

వీరు ప్రస్తుత పరిస్థితుల్లో కంప్యూటర్ రంగంలోనూ, టీవీ, సినిమా వంటి మీడియా మరియు రచనా రంగాల్లో రాణిస్తున్నారు. పచ్చని వస్తువుల వ్యాపారం వీరికి లాభదాయకం. వ్యవసాయం, కూరగాయలు, సౌందర్యసాధనాలు, నగలు, సువాసన ద్రవ్యాలు, కమీషన్,

కాంట్రాక్టులు కలిసి వస్తాయి. వీరు ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉన్నా, భాగస్వామ్య వ్యాపారాలు చేసి సంపాదిస్తారు.

## వ్యాధులు

వీరికి కంటిజబ్బు, మనోవ్యాధులు, కడుపునొప్పి వచ్చే అవకాశముంది. సరియైన చికిత్స తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది. మంచి నామసంఖ్యతో పేరు పెట్టుకుంటే వాటిని అధిగమించవచ్చు.

## సూచనలు

| | | |
|---|---|---|
| లక్కీ నంబర్లు | - | 1, 7, 6, 2 |
| అన్‌లక్కీ నంబర్లు | - | 9 |
| లక్కీ తేదీలు | - | 1, 2, 6, 7, 10, 11, 14, 15, 16, 19, 20, 24, 29, 25 |
| అన్‌లక్కీ డేట్స్ | - | 9, 18, 27 |
| లక్కీ కలర్స్ | - | నీలం, ఆకుపచ్చ, తెలుపు, సిల్వర్, క్రీమ్ |
| అన్‌లక్కీ కలర్స్ | - | నలుపు, ఎరుపు |
| అదృష్ట దినాలు | - | ఆది, సోమ, శుక్రవారాలు |
| లక్కీ వివాహ తేదీలు | - | 1, 2, 6, 10, 11, 15, 19, 20, 24, 28 |
| రెమిడీస్ | - | శివ పంచాక్షరీ జపం చేయాలి, అమ్మవారిని ఆరాధించడం |

| | | | |
|---|---|---|---|
| ఉదా | - | సంజయ్‌దత్ | 29-07-1959 |
| | | నజీరుద్దీన్ | 20-07-1950 |
| | | జయప్రకాశ్ నారాయణ్ | 11-10-1902 |
| | | చిన్నికృష్ణ (సినీ రచయిత) | 02-01-1965 |

# జన్మసంఖ్య - 2, డెస్టినీ నంబరు - 7 గల వ్యక్తులు

**2/7 వ్యక్తులు మంచి నిజాయితీ కలవారు. ఇతరుల బాధను చూసి తట్టుకోలేరు. వీరు సాధన చేస్తే అతీంద్రియ శక్తులు కలుగుతాయి.**

ఎవరు 2, 11, 20, 29 తేదీలలో జన్మించి, వారి డెస్టినీ నెంబరు 7 అవుతుందో వారు ఈ వర్గంలోకి వస్తారు. వీరిపై చంద్ర, కేతు గ్రహాల ప్రభావము ఉంటుంది. పొడవుగా, లావుగా, చక్కని శరీర సౌష్టవం కలిగి ఉంటారు. వీరికి మంచి నిర్వహణా సామర్థ్యం, ప్రేమపూరిత హృదయం గల భాగస్వామి లభిస్తారు. చక్కని కుటుంబ జీవితం లభిస్తుంది. చక్కని విద్యార్హతలు కలిగి ఉంటారు. ఆదాయం సంతృప్తికరంగా ఉంటుంది. అనుకూల నామసంఖ్య లేనిచో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటారు.

వీరు నిజాయితీ పరులు. ఇతరుల బాధలను చూసి ఓర్చుకోలేరు. ఒంటరిగా ఉండి, ఆలోచనలలో మునిగిపోతారు. నిర్దేశిత లక్ష్యాలతో జీవితాన్ని ప్రారంభించి, అనుకున్న వాటిలో విజయాన్ని పొందుతారు. వీరు మానసిక క్రమశిక్షణ అవలంబించడం ద్వారా అద్భుత శక్తులను పొందవచ్చు. దేవునిపై విశ్వాసముంటుంది. వీరు శుచి, ఆరోగ్యకరమైన జీవితాన్ని గడుపుతారు. ఎప్పుడూ పరిశుభ్రంగా కనిపిస్తారు. అనుకూల నామసంఖ్యలుంటే ధనలాభం ఉంటుంది. ఉద్యోగాలలో ఉన్నతిని పొందుతారు. గురువులుగా, పీఠాధిపతులుగా, ప్రవచనాలు బోధించే పండితులుగా కొనసాగుతారు.

వీరికి చక్కని వాగ్ధాటి ఉంటుంది. గొప్ప కల్పనాశక్తి ఉంటుంది. భవిష్య ప్రణాళిక లను రచించడంలో నేర్పరులు. ఇతరులతో సులువుగా కలిసిపోలేరు. వీరు మంచి మూడ్‌లో ఉన్నప్పుడు బలంగా మాట్లాడతారు. ఎప్పుడు ఏదో పాటను పాడుకుంటూ ఉంటారు.

సమస్యలు ఎదురైనప్పుడు అయోమయానికి గురవుతారు. ఇతరుల అభిప్రాయాలను వ్యతిరేకించటానికి వెనుకాడరు. వీరికి రచనా శక్తి ఉంటుంది. రసాయనిక పరిశోధనలు, రంగులు మొదలైన వ్యాపారాల ద్వారా సంపాదన కలుగుతుంది. వీరికి మంచి పేరు, ధనం, సంపాదించే అవకాశం ఎక్కువగా ఉంది. వయసు పెరిగే కొద్ది భక్తి మీద ఎక్కువగా ఆసక్తి చూపుతారు. దైవ ఆరాధనలో ఎక్కువ సమయాన్ని గడపటాన్ని వీరు కోరుకుంటారు.

## పేరు పెట్టే విధానం

వీరికి పేరు 15, 24, 25, 33, 34, 42, 43, 51, 60, 69 సంఖ్యలలో పెట్టుకోవాలి.

## రాణించే రంగాలు

వీరికి రసాయనాలు, రచనారంగం, దైవ సంబంధమైన వస్తువుల విక్రయం, రంగులు, విద్యా సంస్థలు, నూలు వ్యాపారాల్లో లాభాలు, కళా సంబంధ వ్యాపారాల్లో రాణింపు కలుగుతాయి.

## వ్యాధులు

వీరికి రక్తపోటు, గ్యాస్ ట్రబుల్, కీళ్ళనొప్పులు, మానసిక భయం కలుగవచ్చు. సరియైన చికిత్స తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది.

## సూచనలు

| | | |
|---|---|---|
| లక్కీ నంబర్లు | - | 1, 6, 7 |
| అన్‌లక్కీ నంబర్లు | - | 8, 9 |
| లక్కీ తేదీలు | - | 1, 6, 7, 10, 15, 16, 19, 24, 25, 28 |
| అన్‌లక్కీ డేట్స్ | - | 9, 18, 27 |
| లక్కీ కలర్స్ | - | నీలం, లేతపసుపు, ఆకుపచ్చ, బూడిదరంగు, సిల్వర్ |
| అన్‌లక్కీ కలర్స్ | - | ఎరుపు, నలుపు |
| అదృష్ట దినాలు | - | ఆదివారం, సోమవారం, శుక్రవారం |
| లక్కీ వివాహ తేదీలు | - | 1, 6, 10, 15, 19, 24, 28 |
| రెమిడీస్ | - | రుద్రాభిషేకం, కేతుజపం, పార్వతి అమ్మవారి ఆరాధన |
| ఉదా. | - | షారుఖ్‌ఖాన్ 02-11-1965 |
| | | నాగార్జున 29-08-1959 |

# జన్మసంఖ్య - 2, డెస్టినీ నంబరు - 8 గల వ్యక్తులు

**2/8 వ్యక్తులు డబ్బు బాగా ఖర్చు చేస్తారు. వీరికి జ్ఞాపక శక్తి తక్కువ. పెద్దల మాట విని గుడికి వెళ్తారు.**

ఎవరు 2, 11, 20, 29 తేదీలలో జన్మించి వారి డెస్టినీ నెంబరు 8 అవుతుందో వారు ఈ వర్గంలోకి వస్తారు. వీరిపై చంద్ర, శనుల ప్రభావం ఉంటుంది. చంద్రుడు, చంచలత్వాన్ని, శని మందత్వాన్ని కలిగిస్తారు. వీరిలో కొందరు పొడుగ్గా, కొందరు పొట్టిగా ఉంటారు. వీరికి ఆకర్షణీయమైన, ఆకట్టుకొనే ఆకారం ఉంటుంది. శారీరక బలం ఉంటుంది. ఆకస్మికంగా మనోవ్యాకులతకులోనై ఆత్మవిశ్వాసాన్ని కోల్పోతారు. అసందర్భంగా మాట్లాడతారు. పీడకలలు వస్తుంటాయి. వీటిని అనుకూల నామసంఖ్య ద్వారా నివారించవచ్చు.

సహజంగా వీరు ఇతరులతో ప్రేమపూర్వకంగా ఉంటారు. డబ్బున్నప్పుడు మంచినీళ్ళ ప్రాయంగా ఖర్చుపెడతారు. డబ్బులు లేనప్పుడు విచారంగా కనిపిస్తారు. ఇతరులను సంతోషపెట్టే సామర్థ్యం ఉండటం వలన వీరు పేరు పొందుతారు. స్టీల్‌వర్క్స్, మెకానిజమ్, కాంట్రాక్టు పనులు, రచనల ద్వారా సంపాదన కలిగి ఉంటారు. వీరికి వాహనాలు పొందే అదృష్టం, విదేశీ ప్రయాణాలు చేసే అవకాశం ఉంటుంది. న్యాయ విభాగంలో, మేనేజ్‌మెంట్ రంగాల్లో రాణిస్తారు.

ప్రతి విషయంలోనూ వీరికి సందేహాలు వస్తాయి. వీరు చేసింది తప్పా, ఒప్పా అనే సందేహం కూడా వస్తుంది. దీని వలన అయోమయానికి గురవుతారు. ఇతరులయందు విశ్వాసం ఉండదు. అనుకూల నామసంఖ్య కలిగిఉంటే విజయం లభిస్తుంది. విద్యాభ్యాసం యందు ఆసక్తి కలిగి ఉంటారు. సాంకేతిక, మేనేజ్‌మెంట్ విద్యలో విజయాన్ని సాధిస్తారు. వారికి నచ్చిన దాని కోసం వాదిస్తారు. ప్రశ్నలడగటంలో నేర్పుని కల్గి ఉంటారు. సలహాలు తీసుకోవడానికి ఇష్టపడరు. దేవుని యందు విశ్వాసాన్ని కల్గిఉంటారు. మానసిక పూజకు ప్రాధాన్యతనిస్తారు. పెద్దల సలహాలను పాటించి గుడికి వెళ్తారు.

ఉత్సాహంతో పనులను చేపడతారు. సమస్య ఎదురైతే అయోమయానికి గురవుతారు. ఉత్సాహం మాయమవుతుంది. అనుకూల నామసంఖ్య ఉంటే అయోమయం నుంచి

తప్పించుకుని విజయం సాధిస్తారు. ఒంటరిగా ఉన్నప్పుడు కల్పనాశక్తికి పదును పెట్టి భవిష్య ప్రణాళికలను వేస్తారు. స్నేహితులతో ఉన్నప్పుడు వీరి ఆలోచనలు వేరే చోట ఉంటాయి. పరధ్యానంగా ఉంటారు.

## పేరు పెట్టే విధానం

వీరికి 15,24,33,42,51,60,69,14,23,32,41,50,59 సంఖ్యలలో పేరు అనుకూలంగా ఉంటుంది.

## రాణించే రంగాలు

విలాసవస్తువులు, రవాణా, లోహ, మెకానిజమ్, కాంట్రాక్టులు, కమిషన్, సూపర్‌వైజింగ్ పనులు, కళాసంబంధిత పనుల్లో రాణిస్తారు.

## వ్యాధులు

వెన్నునొప్పి, నడుంనొప్పి, తలనొప్పి, మనోవ్యాకులత, కడుపులో సమస్యలు రావొచ్చు. సరియైన చికిత్స తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది.

## సూచనలు

| | | |
|---|---|---|
| లక్కీ నంబర్లు | - | 2, 5, 6, 7 |
| అన్‌లక్కీ నంబర్లు | - | 9 |
| లక్కీ తేదీలు | - | 5, 6, 7, 14, 15, 16, 23, 24, 25 |
| అన్‌లక్కీ డేట్స్ | - | 9, 18, 27 |
| లక్కీ కలర్స్ | - | ఆకుపచ్చ, నీలం, పసుపు, తెలుపు, బ్లూ |
| అన్‌లక్కీ కలర్స్ | - | నలుపు, ఎరుపు |
| అదృష్ట దినాలు | - | సోమ, శుక్ర, బుధ, శనివారాలు |
| లక్కీ వివాహ తేదీలు | - | 1, 3, 6, 10, 12, 15, 19, 21, 24, 28 |
| రెమిడీస్ | - | అమ్మవారిని ఆరాధించడం, శివారాధన, నల్ల కుక్కలకు ఆహారం పెట్టడం, కాకులకు బెల్లం వంటి తీపి పదార్థాలు పెట్టడం |
| ఉదా | - | లాల్‌బహదూర్ శాస్త్రి 02-10-1904 |

## జన్మసంఖ్య - 2, డెస్టినీ నంబరు - 9 కల వ్యక్తులు

**2/9 వ్యక్తులకి మేధస్సు ఎక్కువగా ఉంటుంది. వయసు పెరిగే కొద్దీ స్థిరత్వం కలుగుతుంది.**

ఎవరు 2, 11, 20, 29 తేదీలలో జన్మించి వారి డెస్టినీ నెంబరు 9 అవుతుందో వారు ఈ వర్గంలోకి వస్తారు. వీరు చంద్ర, కుజ గ్రహాల ప్రభావంలో ఉంటారు. తాము చేస్తున్నది తప్పని తెలిసినా, దాన్ని చేసి, సమస్యలు ఎదుర్కొని, తరువాత పశ్చాత్తాపపడటం వీరి నైజం. వీరి మనసు ఎప్పుడూ ఆందోళనతో ఉంటుంది. తమలో తాము మదనపడుతుంటారు. అనుకూల నామ సంఖ్య ఉంటే వీరు సంతోషకరమైన జీవితాన్ని పొందుతారు. వీరికి మేధోబలం అధికంగా ఉంది. ఎంతటి కార్యాన్నైనా ధైర్యంగా సాధిస్తారు. విజయమైనా, అపజయమైనా మానసికంగా సంసిద్ధులై ఉంటారు. ఆత్మవిశ్వాసం ఉంటుంది. వయసు పెరిగేకొద్దీ, స్థిరత్వం, నిలకడ సంపాదిస్తారు. గట్టిగా మాట్లాడే సామర్థ్యం కలిగి ఉంటారు. ప్రశ్నలు సంధించే శక్తి ఉంటుంది. వీరు న్యాయవాదులైతే బాగా రాణిస్తారు.

ఇతరులు వీరిని వివాదాస్పద వ్యక్తులుగా పరిగణిస్తారు. వీరు తమ న్యాయ నిర్ణయ శక్తితో ఇతరులపై అత్యంత ప్రభావాన్ని కలిగి ఉంటారు. శత్రువులకి వీరంటే భయం. వీరికి సదా వ్యతిరేకత ఎదురవుతూ ఉంటుంది. ఉద్యోగులకి ఆఫీసులో వ్యతిరేకత ఉంటుంది. సహజంగా వీరు మంచి వారు. కానీ ఈ మంచి పేరుని వీరి దుందుడుకుతనంతో పోగొట్టుకునే అవకాశం ఉంది. వీరికి వైద్యరంగం వైపు, మతాలు, గ్రంథాలపై ఆసక్తి ఉంటుంది. వీరికి అనుకూల నామ సంఖ్య లేకపోతే, వివాహం ఆలస్యమై సమస్యాత్మకమవుతుంది. కుటుంబ జీవితం సంతృప్తికరంగా ఉండదు. మంచి పేరు ద్వారా పై సమస్యలను నివారించవచ్చు.

### పేరు పెట్టే విధానం

వీరికి 15, 19, 24, 33, 37, 42, 46, 51, 55, 60, 69 సంఖ్యలలో పేర్లు అనుకూలంగా ఉంటాయి.

## రాణించే రంగాలు

వ్యవసాయం, కమిషన్ వ్యాపారం, కాంట్రాక్టులు, బోధన, ప్రభోదం, న్యాయ మధ్యవర్తిత్వం, పోలీసు, మిలటరీ రంగాల్లో రాణిస్తారు.

## వ్యాధులు

వీరికి పైల్స్, వేడి వలన వ్యాధులు వస్తాయి. సరియైన చికిత్స తీసుకుంటే ఉపశమనం కలుగుతుంది.

## సూచనలు

| | | |
|---|---|---|
| లక్కీ నంబర్లు | - | 1, 6, 5 |
| అన్‌లక్కీ నంబర్లు | - | 8 |
| లక్కీ తేదీలు | - | 1, 5, 6, 10, 14, 15, 19, 23, 24, 28 |
| అన్‌లక్కీ డేట్స్ | - | 8, 17, 26 |
| లక్కీ కలర్స్ | - | లేతనీలం, లేతపసుపు, వయొలెట్, సిల్వర్, గోల్డెన్ |
| అన్‌లక్కీ కలర్స్ | - | ఎరుపు |
| అదృష్ట దినాలు | - | ఆది, మంగళ, శుక్రవారాలు |
| లక్కీ వివాహ తేదీలు | - | 1, 6, 9, 10, 15, 19, 24, 27, 28 |
| రెమిడీస్ | - | పార్వతి అమ్మవారిని ఆరాధించడం,<br>సత్యనారాయణ స్వామి ఆరాధన,<br>రక్తదానం చేయడం ద్వారా పాపనివృత్తి చేసుకోవచ్చు. |
| ఉదా | - | సునీల్ శెట్టి 11-08-1961 (హిందీ నటుడు)<br>మహాత్మా గాంధీ 02-10-1869<br>రాబిన్ ఉతప్ప 11-11-1985 (ఇండియన్ క్రికెటర్)<br>ప్రవీణ్ కుమార్ 02-10-1986 (ఇండియన్ క్రికెటర్) |

# జన్మసంఖ్య - 3 (గురుని సంఖ్య)

**3వ సంఖ్య గురుగ్రహానికి చిహ్నం. వీరు గురువులుగా, విద్యావేత్తలుగా, వేదాంతులుగా ఉంటారు. నాయకత్వ లక్షణాలు కలిగి ఉంటారు. మంచి ఆధ్యాత్మికత కలిగి ఉంటారు. వీరిలో పేరుపొందిన రాజకీయ నాయకులు ఉంటారు. కొందరు క్రీడాకారులు కూడా ఈ సంఖ్య కలవారే.**

ఏ నెలలోనైనా 3, 12, 21, 30వ తేదీల్లో జన్మించిన వారు 3వ నంబరు వ్యక్తులు. వీరిపై గురుగ్రహ ప్రభావం అధికంగా ఉంటుంది.

## పాజిటివ్ లక్షణాలు

కళాత్మకమైన, సృజనాత్మకమైన ప్రతిభ, కల్పనా చాతుర్యం, ప్రేరణ, బహుముఖ ప్రజ్ఞత, సుఖాసక్తి, అదృష్టం, సంతోషం, తెలివితేటలు, దివ్యశక్తి, ఆనందం, మంచిని ప్రభోదించటం.

## అవకాశాలు, వృత్తులు

అన్ని నంబర్లలో అత్యంత మంచివారు, అందరి మన్ననలను పొందే అదృష్టవంతులు, నిరంతర శక్తి సంపన్నులు, ఆత్మ విశ్వాసం కలవారు, ఏ వృత్తి ఎంచుకున్నా అందులో తమ కల్పనాశక్తితో విజయాన్ని సొంతం చేసుకునే సామర్థ్యం ఉంటుంది. వీరు ఆశావాదులు, తమ ప్రతిభ ద్వారా ఇతరుల కన్నా ఎక్కువగా రాణిస్తారు. ఆరంభం, కొనసాగింపు, ముగింపులున్న త్రివిధ గుణాలకు ప్రాతినిధ్యం వహించేది మూడవ నంబరు. ఈ నంబరుకి విజయం, సంపద, ప్రయాణాలు సహజం. జీవితంలో ఉన్నతమైనవి కోరుకుంటారు, సాధించుకుంటారు. వీరు ఇతరులకి స్ఫూర్తి ప్రదాతలు.

మేధోపరంగా, శ్రమశక్తి కన్నా సృజన శక్తిని నమ్ముకోవడం వలన సంగీతం, కళలు, రచన, వస్తు నిర్మాణ రంగాల్లో రాణిస్తారు. కళా, సౌందర్యానికి సంబంధించిన వృత్తుల్లో రాణిస్తారు. టీచర్‌గాను, పండితులుగా, పీఠాధిపతులుగా, వ్యాఖ్యాత గాను, సేల్స్‌మన్‌గా రాణింపు. నూతన వస్తువులు, బొమ్మలు, ప్రయాణ, వ్యాపారాత్మక కళలకు సంబంధించిన వ్యాపారాల్లో రాణింపు. వీరికి భవిష్యత్తుని ఊహించే శక్తి ఉంటుంది. వీరు మార్మిక శాస్త్రాలలో విజయాన్ని సాధించి, ఆధ్యాత్మిక, వేదాంత విషయాలలో

ఉన్నతిని సాధిస్తారు. ఎవరూ సాహసించని పనులు చేపట్టి, కొత్త విషయాలను వెలుగులోకి తీసుకొస్తారు.

## నెగిటివ్ లక్షణాలు

వీరు కలివిడిగా ఉన్నా ముభావ స్వభావం ఎక్కువ. ఒక్కొక్కసారి నిరాశ కలుగుతుంది. హేళన, అతిగా మాట్లాడటం, స్వార్థం వీరికి చెడ్డపేరు తెస్తుంది. వీరిని అలుసుగా తీసుకున్న వారిని క్షమించరు.

## వ్యక్తిగతం

ప్రేమానురాగాలకు విలువనిస్తారు. వీరు మంచి మనసు కలిగి, హాస్యప్రియులుగా ఆనందాన్నిచ్చేవారుగా ఉంటారు. వీరి సాహచర్యంలో ఎవరైనా సరే ఆనందాన్ని పొందుతారు. వీరు ప్రపంచానికి సంపద లాంటివారు. ఆపోజిట్ సెక్స్ నుంచి ప్రేమని, ఆనందాన్ని కోరుకుంటారు. వివాహ విషయంలో వీరు విశ్వాసంగాను, ప్రేమ పూరితంగాను, త్యాగవంతులుగాను ఉంటారు.

వీరు సహజంగా జీవితంలో విజయాన్ని పొందుతారు. వీరికి ఎంతో మంది స్నేహితులు, పరిచయస్తులు, బంధువులుంటారు. మంచి ఆహారాన్ని, వస్త్రధారణను ఇష్టపడతారు. మనసుని గాయపరిచిన వారిని క్షమించలేరు.

## 3వ నంబరు వ్యక్తుల మరికొన్ని పాజిటివ్ లక్షణాలు

1. మనసులో భావాలు బాగా చెప్పగలగటం
2. ఉన్నతంగా ఉండాలని కోరుకోవటం
3. బాగా మాట్లాడగటగటం
4. రచనలు చేయగలిగే శక్తి కలిగి ఉండటం
5. ఉన్నత ఆశయాలు కలిగి ఉండటం
6. మంచి ప్రవర్తన కలిగి ఉండటం
7. అందరితో కలుపుగోలుగా ఉండటం
8. కళల పట్ల ఆసక్తి
9. మంచి ఆభరణాలు, బట్టల పట్ల ఇష్టం
10. అందమైన రూపం కలిగి ఉండటం
11. జీవిత ప్రమాణాలను వృద్ధి చేసుకోవాలనే కోరిక

## 3వ నంబరు వ్యక్తుల మరికొన్ని నెగిటివ్ లక్షణాలు

1. అహంకారం, గర్వం
2. ఆశయ సాధనలో అతిగా ప్రవర్తించటం
3. అనవసరమైన అలౌకిక విషయాలపై నమ్మకం
4. ఇతరుల పట్ల అసూయ
5. సహనం, ఓర్పు లేకపోవటం
6. సహాయం చేస్తామని చెప్పి చేయకపోవటం
7. విలాసాలు, భోగాల కోసం ఆరాటపడటం

మూడవ నంబరుని సూచించే గ్రహం గురుడు. గురుడు అతి పెద్ద గ్రహం. సహజంగా ఇది లాభకారి. ఇది ఆధ్యాత్మికత, దైవ సంబంధ గ్రహం. మేధస్సు, తెలివితేటలు, ఉన్నత ఆలోచనా సరళికి సంబంధించినది. వీరు జ్ఞానులు, ఐహిక విషయాల్లో అదృష్టవంతులు. వీరు అత్యంత ఉన్నతంగా ఎదిగి, గౌరవాన్ని పొందుతారు. 3వ నంబరు శక్తివంతమైనది, పురుషాధిక్యత గలది. భావవ్యక్తీకరణకి ఎక్కువ ప్రాధాన్యతనిస్తారు. వీరిని గుర్తించకపోతే దాన్ని సహించరు.

వీరెప్పుడూ ప్రచారంలోనూ, పేరులోనూ ఉండాలని చూస్తారు. అందరిలో గుర్తింపు పొంది తాము చెప్పదలుచుకున్నది చెప్పాలని గాఢంగా కోరుకుంటారు. సహజంగా వీరు శక్తిమంతులు. స్నేహితులను, సంపదను, పేరును సంపాదిస్తారు. ఆత్మవిశ్వాసం ఎక్కువ, స్వతంత్ర ఆలోచన కలవారు. ఆత్మాభిమానం కలిగి ఉంటారు.

3వ నంబరు వ్యక్తుల్లో సహజంగా టీచర్లు, విద్యావేత్తలు, ఉపన్యాసకులు, వక్తలు, న్యాయవాదులు, సంపాదకులు, ప్రచురణకర్తలు, విమర్శకులు, వేదాంతులు, పత్రికా విలేకరులుంటారు. వీరికి మంచి గుణగణాలుంటాయి. ఉన్నతాశయాలుంటాయి. మేధోపరంగా విజయం సాధించటానికి, వీరి స్వతంత్ర ఆలోచన, కుశాగ్ర బుద్ధి, మేధోవికాసం మొదలైన లక్షణాలు కలిగి ఉండడమే కారణం.

వీరి ఉన్నతమైన ఆలోచన, మేథస్సు వీరి బాహ్య స్వరూపంలో చూడవచ్చు. కొంతమంది, మార్గదర్శకులుగా అత్యంత హుందా, వ్యక్తిగత పరువు ప్రతిష్ఠ కలిగి ఉంటారు. వీరు సంప్రదాయవాదులు, ఆచార వ్యవహారాలు పాటిస్తారు. కొంతమంది ఆధ్యాత్మికంగా వేదాంతంగా ఉన్నతులై ఉంటారు. జాతకచక్రంలో గురుడు బలమైన స్థానంలో ఉంటే వీరి ఆశలు, ఆశయాలు నెరవేరుతాయి. నమ్మకం, కలివిడితనం, హుందాతనంతో ఉంటారు.

జాతక చక్రంలో గురుడు బలహీనమైనా, పేరు సరిగా లేకపోయినా, వీరు సహనం కోల్పోయి హింసాత్మకంగా మారటం, బద్ధకంగా ఉండటం, తక్కువ పనికే ఎక్కువ సంపాదించాలనే దురాశ, మొదలైన నెగెటివ్ లక్షణాలు ఆలోచనలు వచ్చే అవకాశం ఉంది. అందువలన మంచి సంఖ్యాశాస్త్ర నిపుణుడిని సంప్రదించి పేరు సరి చేసుకోవాలి.

వీరిలో కొందరు, సుగుణ సంపన్నులు, గొప్ప బాధ్యతాపరులు, కార్య దురంధరులు, ఉన్నతమైనవారు. మంచి నిర్వహణా సామర్థ్యం ఉంటుంది. నాయకత్వ లక్షణాలుంటాయి. వీరిలో మంచి క్రీడాకారులుంటారు. సమాజంలో ఉన్నత వర్గాలతో సత్సంబంధాలుంటాయి. కఠోరశ్రమ, సామర్థ్యం వలన పేరు పొందుతారు. విన్స్టన్ చర్చిల్, రూజ్‌వెల్ట్, లింకన్ వంటి వారు మూడవ నంబరు వ్యక్తులు.

తమ సుఖ దుఃఖాలను ఇతరులకు తెలియనివ్వరు. పట్టుదలతో కార్యసాధన చేస్తారు. వీరి దగ్గర డబ్బు ఎల్లప్పుడూ ఉంటుంది. పారిశ్రామికవేత్తలుగా రాణిస్తారు. ప్రయాణాలు అధికంగా చేస్తారు. వీరికి తగిన వయసులో వివాహం, జరిపించాలి లేకపోతే ప్రేమ వ్యవహారాలలో చిక్కుకుంటారు ఒకవేళ ప్రేమించినా, పెద్దల సమ్మతితోనే వివాహం చేసుకుంటారు.. మంచి గుణాలు కల భాగస్వామిని పొందుతారు.

వీరికి 1, 2, 9, 10, 11, 18, 19, 20, 27, 28, 29 తేదీల్లో జన్మించిన వారు మంచి స్నేహితులుగా ఉంటారు. వీరి ద్వారా పెద్ద ఎత్తున సాయం అందుతుంది.

వీరికి నరాల సంబంధమైన ఇబ్బందులు, చర్మ వ్యాధులు, పక్షవాతం వచ్చే అవకాశాలున్నందున జాగ్రత్తగా ఉండాలి. 3వ తేదీన జన్మించిన వారు తెలివైన వారు, శాస్త్రవేత్తలయ్యే లక్షణాలుంటాయి. సంగీత, సాహిత్య, నాటక రంగాలలో ప్రావీణ్యత ఉంటుంది. కళల ద్వారా ధనార్జన ఉంటుంది. 30వ తేదీన జన్మించిన వారు మేధావులు, జ్ఞానులు. గూఢచర్యంలో నేర్పరులు, పోటీతత్వం ఎక్కువ. కళలలో అభిరుచి ఉంటుంది. రచనలు, నటనలు మొదలైన లలిత కళలలో రాణిస్తారు.

జన్మ సంఖ్య యొక్క ప్రభావం వ్యక్తులపై ఏ విధంగా ఉంటుందో, డెస్టినీ నెంబరు వ్యక్తులపై అలాంటి ప్రభావమే చూపుతారు. దాని వలన జన్మ సంఖ్య 3 ఉన్న వ్యక్తులందరి గుణగణాలు ఒకే విధంగా ఉండవు. దానికి కారణం డెస్టినీ నెంబరు మారటమే. కాబట్టి ప్రస్తుత 3 జన్మసంఖ్య కలవారి గుణగణాలు కూడా డెస్టినీ నెంబరు బట్టి మారుతూ ఉంటాయి. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరని ప్రార్థన.

# జన్మసంఖ్య - 3, డెస్టినీ నంబరు - 1 గల వ్యక్తులు

**3/1 వ్యక్తులు ఎక్కువ మంది ప్రభుత్వ ఉద్యోగం చేస్తారు. అతిథి సత్కారం బాగా చేస్తారు. వేడి వల్ల జుత్తు ఊడిపోతుంది.**

ఎవరు 3, 12, 21, 30 తేదీలలో జన్మించి, వారి డెస్టినీ నెంబరు 1 అవుతుందో వారు ఈ వర్గంలోకి వస్తారు. వీరిపై గురుడు, సూర్యుడి ప్రభావమధికం. వీరిలో అధికులు ప్రభుత్వోద్యోగులుగా ఉంటారు. వీరు నిజాయితీపరులు. పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొంటారు. అధికారుల సూచనలను పాటిస్తారు. బానిసలుగా చూస్తే ఎదిరిస్తారు. నిష్పక్షపాతం ఎక్కువ. వీరు పొడగరులు, ఎర్రని కన్నులు కల్గి ఉంటారు. ఉంగరాల జుత్తు ఉంటుంది. శరీరం ఉష్ణతత్వం వలన జుట్టు ఊడిపోతుంది. ఆ ఉష్ణాన్ని తగ్గించుకునేందుకు శీతల పానీయాలు సేవిస్తారు. స్నేహ భావం, సహకార భావం కలిగి ఉంటారు. అతిథులను గౌరవిస్తారు.. ఖచ్చితంగా, ముక్కుసూటిగా మాట్లాడతారు.

వీరికి మంచి కార్యనిర్వహణా సామర్థ్యం, ఆజమాయిషీ శక్తి ఉంటుంది. అనుకూల నామసంఖ్య ఉంటే ఆభరణాలు, సంపద, మంచి జీవిత భాగస్వామి, ఆరోగ్యం, సంతానం కలుగుతాయి. రాతి, ఖనిజ, రత్న, లోహ సంబంధిత వ్యాపారం నుంచి అధిక సంపాదన ఉంటుంది.

## పేరు పెట్టే విధానం

వీరికి 3, 9, 19, 21, 27, 30, 37, 39, 45, 46, 54, 55, 73 నంబర్లలో పేర్లు అనుకూలంగా ఉంటాయి. బాల్యంలో మంచి అనుకూల నామసంఖ్య ఉంటే వీరికి మంచి విద్య, జ్ఞానం అబ్బుతుంది. దీనితో ఉన్నతస్థానాలు అధిరోహిస్తారు.

## రాణించే రంగాలు

వీరు కంప్యూటర్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మేనేజ్‌మెంట్ రంగాలలో రాణిస్తారు. సంగీతం, నాట్యం రంగాలలో ఆసక్తి ఉంటుంది. వాటిలో కృషి చేస్తే చాలా ఉన్నతమైన స్థితికి వెళతారు. నాయకులుగా చెలామణి అవుతారు. మేనేజ్‌మెంట్ రంగాలలో ఉంటే కింది వారిని నొప్పించకుండా వారి చేత బాగా పనిచేయించగలుగుతారు. ఎంత

పనిచేయించినా వారి కింద ఉద్యోగులు వీరిని ప్రశంసిస్తూ ఉంటారు. వీరు బ్యాంకింగ్, రవాణా, ఇన్సూరెన్స్ రంగాలలో కూడా రాణిస్తారు.

**సూచనలు**

| | | |
|---|---|---|
| లక్కీ నంబర్లు | - | 1, 3, 9 |
| అన్‌లక్కీ నంబర్లు | - | 8 |
| లక్కీ తేదీలు | - | 1, 3, 9, 10, 12, 18, 19, 23, 27, 28, 30 |
| అన్‌లక్కీ డేట్స్ | - | 8, 17, 26 |
| లక్కీ కలర్స్ | - | పసుపు, క్రీమ్, గోల్డెన్, సాండల్, గులాబీ, ఆరెంజి |
| అన్‌లక్కీ కలర్స్ | - | నలుపు |
| అదృష్ట దినాలు | - | ఆది, గురు, మంగళవారాలు |
| లక్కీ వివాహ తేదీలు | - | 1, 3, 9, 10, 12, 19, 21, 27, 28 |
| రెమిడీస్ | - | గురువులను, పురోహితులను, పండితులను గౌరవించటం, వారికి ఆర్థికంగా సహాయపడటం.<br>దక్షిణామూర్తిని సేవించటం. |
| ఉదా | - | హర్భజన్‌సింగ్ 3-7-1980 |

## జన్మసంఖ్య - 3, డెస్టినీ నంబరు - 2 గల వ్యక్తులు

**3/2 వ్యక్తులు సాధారణంగా అదృష్టవంతులు. వీరికి ఇల్లు, భూములు, వాహనాలు ఉంటాయి. కుటుంబం పట్ల ప్రేమ కలిగి ఉంటారు.**

ఎవరు 3, 12, 21, 30 తేదీలలో జన్మించి, వారి డెస్టినీ నెంబరు 2 అవుతుందో వారు ఈ వర్గంలోకి వస్తారు. వీరు గురువు, చంద్రుడు ప్రభావంలో ఉంటారు. ఒక మోస్తరు పొడవు, స్థూలకాయం ఉంటుంది. ధైర్యంగా కనిపిస్తారు. జీవిత ప్రథమార్థంలో ఎంతో సంతోషాన్ని అలాగే దుఃఖాన్ని అనుభవిస్తారు. కొందరు ప్రభుత్వ రంగంలో పనిచేస్తారు.

వీరి విధి సంఖ్య చంద్రుడిని సూచిస్తుంది. చంద్రుని వృద్ధి క్షయం వలే వీరి ఆలోచనలు అస్థిరంగా ఉంటాయి. వీరి పథకాలు స్థిరంగా ఉండవు. అయినా వీరు అదృష్టవంతులనే చెప్పాలి. అందువల్ల వీరికి ఇల్లు, భూమి, వాహనం లాంటి చక్కని జీవన సౌకర్యాలుంటాయి. వీరు నిజాయితీపరులు, బాధల్లో వున్న వారిపై సానుభూతిని చూపిస్తారు. కొన్ని సమయాలలో కఠిన వైఖరి అవలంబించినా త్వరగానే సున్నితంగా మారతారు. వీరికి మంచి జీవిత భాగస్వామి, బాధ్యత గల సంతానం ఉంటారు. లాభాపేక్షపై దృష్టి కలిగి ఉంటారు.

రాబోయే ప్రమాదాలని ముందుగా పసిగట్టి అవి మొగ్గగా వున్నప్పుడే తుంచివేస్తారు. చిన్న సమస్యలను పెద్దవిగా ఊహించుకొని కొన్నిసార్లు అయోమయానికి గురవుతారు. వ్యక్తిగత సమస్యలను ఎదుర్కొనేటప్పుడు అస్థిరతకు లోనవుతారు. వాహనాలు, వాహనాలను నడుపుటలో ఆసక్తి కలవారు. జీవిత భాగస్వామి, సంతానం పట్ల ఆపేక్ష కలిగి ఉంటారు. దగ్గర స్నేహితులు, బంధువులు చిన్న తప్పులు చేస్తే వాటిపై దృష్టిపెడతారు. వీరికి అనుకూల నామసంఖ్య ఉంటే దారి తప్పరు. లేకపోతే ధైర్యం కొరవడి, ఏ పని చెయ్యటానికైనా జంకుతారు. వీరు సైన్స్ సబ్జెక్ట్‌పై మక్కువ చూపుతారు. ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ మరియు కంప్యూటర్ రంగాలపై ఆసక్తి చూపుతారు. కొందరు మ్యూజిక్ డైరెక్టర్లుగా కొత్త బాణీలలో ప్రయోగాలు చేస్తుంటారు. కొందరు డైరెక్షన్ విభాగాలలో వినూత్నాన్ని చూపుతారు. కొందరు నాట్యాచార్యులుగా పేరు పొందుతారు.

లలిత కళలయందు అభిరుచి ఎక్కువ. వీరికి దైవబలం అధికంగా ఉండి, పనిచేసిన దాని కన్నా ఎక్కువ ప్రతిఫలం దక్కుతుంది. గృహాలంకరణ అంటే ప్రీతి, విలాస వస్తువులను సేకరిస్తారు. వీరికి ముక్కు సూటితనం ఎక్కువ. ప్రకృతి సౌందర్యాన్ని వర్ణించడంలో దిట్ట. పరుల సొమ్ము ఆశించరు. సొంత వస్తువుల పట్ల జాగ్రత్త ఎక్కువ. వీరికి విదేశీ యాత్రలంటే ప్రీతి. చారిత్రాత్మక ప్రదేశాలు, దేవాలయాలు, మ్యూజియాలు, ఆర్ట్‌గ్యాలరీలను సందర్శిస్తారు. మంచి జీవిత భాగస్వామి లభించి సంతృప్తికర గృహస్తు జీవితం ఆనందంగా గడుపుతారు.

## పేరు పెట్టే విధానం

వీరు 14, 21, 23, 25, 34, 39, 41, 50, 59 సంఖ్యలు వచ్చే విధంగా పేరు పెట్టుకోవాలి.

### రాణించే రంగాలు

రసాయనాలు, ద్రవ్యాలు, సౌందర్యవస్తువులు, కమీషన్ వ్యాపారం, కాంట్రాక్టులు ఏజన్సీలు, అనుకూలం. టీచర్లు, ఘనాపాఠిలు, డాక్టర్లుగా రాణిస్తారు.

### వ్యాధులు

మధుమేహం, రక్తపోటు, కళ్ళ సమస్యలు, మానసిక ఆందోళన, చర్మవ్యాధులు రావొచ్చు. అనుకూల నామసంఖ్య ఉంటే ఇవి తగ్గుముఖం పడతాయి. సరియైన చికిత్స తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది.

### సూచనలు

| | | |
|---|---|---|
| లక్కీ నంబర్లు | - | 1, 3, 5, 7 |
| అన్‌లక్కీ నంబర్లు | - | 8 |
| లక్కీ తేదీలు | - | 1, 3, 5, 7, 10, 12,<br>14, 16, 19, 21, 23, 25, 28, 30 |
| అన్‌లక్కీ డేట్స్ | - | 8, 17, 26 |
| లక్కీ కలర్స్ | - | గులాబీ, నారింజ, ఊదా, పసుపు, గోల్డెన్, తెలుపు, సిల్వర్ |
| అన్‌లక్కీ కలర్స్ | - | ఆకుపచ్చ, ఎరుపు |
| అదృష్ట దినాలు | - | ఆది, సోమ, గురువారాలు |
| లక్కీ వివాహ తేదీలు | - | 1, 3, 9, 10, 12, 18, 19, 21, 27, 28 |
| రెమిడీస్ | - | తండ్రిని, తల్లిని, గురువులను ఆదరించి వారి ప్రేమ పొందేటట్లుగా ప్రవర్తించాలి. అమ్మవారిని, మరియు దక్షిణామూర్తిని ఆరాధించటం మంచిది. |
| ఉదా | - | గోవిందా 21-12-1958 (హిందీ నటుడు)<br>శరద్‌పవార్ 12-12-1948<br>ఎస్.వి. రంగారావు 03-07-1918 |

## జన్మసంఖ్య - 3, డెస్టినీ నంబరు - 3 గల వ్యక్తులు

**3/3 వ్యక్తులకు ముందు రెండు పళ్ళు పెద్దవిగా ఉంటాయి. అభ్యుదయ రచనలు చేస్తారు. 30 సంవత్సరాల తర్వాత అభివృద్ధి సాధిస్తారు.**

ఎవరు 3, 12, 21, 30 తేదీలలో జన్మించి వారి డెస్టినీ నెంబరు 3 అవుతుందో వారు ఈ వర్గంలోకి వస్తారు. వీరిపై గురు ప్రభావం సంపూర్ణంగా ఉంటుంది. సహజంగా, వీరు న్యాయం, నిజాయితీ, స్థిరత్వం, నమ్మకం, విశ్వాసపాత్రత కలిగి ఉంటారు. బలంగాను, స్థూలకాయంతో వుంటారు. మృదువైన జుత్తు ఉంటుంది. వీరికి యవ్వనంలోనే బట్టతల వస్తుంది.

రెండు దంతాలు ముందుకు వచ్చి, మిగతావి మామూలుగా ఉండి ముత్యాలలాగా మెరుస్తాయి. నవ్వినప్పుడు అందంగా ఉంటారు. వీరి ఆలోచనలకు స్పష్టత ఉంటుంది. భాష స్పష్టంగా ఉంటుంది. వీరి మంచిగుణాలను ఇతరులు పొగుడుతారు. వీరు తమ మాటల ద్వారా, రచనల ద్వారా ఇతరులను సంస్కరిస్తారు. తమ వృత్తి ద్వారా ఇతరులకు లాభాన్ని చేకూర్చుతారు. వీరి కింద చాలా మంది పనిచేయాలని కోరుకుంటారు. దైవంపై విశ్వాసం వలన దేవాలయ నిర్మాణానికి ముందుకొచ్చి మతాభివృద్ధికి పాటుపడతారు.

ద్వంద్వ వైఖరి వీరికి నచ్చదు. ప్రారంభంలో కష్టాలు అనుభవించి 21 ఏళ్ళు గడిచిన తరువాత అభివృద్ధి సాధిస్తారు. ముప్పై ఏళ్ల తరువాత పూర్తిగా ప్రగతి సాధిస్తారు. వీరు కొంత ఆలస్యంగా జీవితంలో సెటిల్ అవుతారు. వీరికి ముందు నుంచి అనుకూల నామసంఖ్య ఉంటే మంచి విద్య, తల్లిదండ్రుల వలన చరస్థిరాస్తులు పొందుతారు. వైజ్ఞానిక శాస్త్రం, పరిశోధనల పట్ల ఆసక్తి ఉంటుంది. బాధ్యతాయుత ప్రవర్తన వలన ఉద్యోగులయితే ఉన్నత స్థానాన్ని అందుకొంటారు. ముఖ్యంగా వీరు ఎలక్ట్రికల్ మేనేజ్‌మెంట్, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ రంగాలకు సంబంధించిన వ్యాపారాలు మరియు కళలకు సంబంధించిన వాటి ద్వారా జీవితంలో ఉన్నత స్థితికి వస్తారు.

వీరికి అనుకూల నామసంఖ్య ఉంటే ఉన్నత అధికారులు, న్యాయమూర్తులు, డాక్టర్లుగా, ప్రభుత్వ ఉద్యోగులుగా ఉంటారు. సంగీతం, నాట్యం లాంటి కళలలో అభిరుచి ఉంటుంది. దినదినాభివృద్ధి సాధిస్తారు. ఆదాయమెంత పెరిగినా విలాసవంత జీవితాన్ని

కోరుకోరు. అనుకూల నామసంఖ్య లేకపోతే వ్యర్థ కార్యాలతో నష్టం కలుగుతుంది. వ్యాపారులు, సంస్థలు 1, 5, 9వ నంబరు వచ్చేట్లు పేరు పెట్టుకుంటే కలిసి వస్తుంది.

## పేరు పెట్టే విధానం

వీరు 14, 19, 21, 23, 27, 30, 37, 39, 41, 45, 46, 50, 55, 73 సంఖ్యలలో పేరు పెట్టుకొవాలి.

## రాణించే రంగాలు

పాలవ్యాపారం, పాడి పరిశ్రమ, కిరాణా, టోకు, కాంట్రాక్టుల ఏజన్సీ, రవాణా వ్యాపారాలు అనుకూలం.

## వ్యాధులు

మానసిక ఆందోళనలు, పైల్స్, గ్యాస్‌ట్రబుల్, రక్తపోటులకు గురవుతారు. సరియైన చికిత్స తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది.

## సూచనలు

| | | |
|---|---|---|
| లక్కీ నంబర్లు | - | 1, 3, 9 |
| అన్‌లక్కీ నంబర్లు | - | --- |
| లక్కీ తేదీలు | - | 1, 3, 9, 10, 12, 18, 19, 21, 27, 28, 30, |
| అన్‌లక్కీ డేట్స్ | - | --- |
| లక్కీ కలర్స్ | - | గులాబీ, ఆరెంజి, పసుపు, క్రీమ్, గోల్డెన్, సాండల్, ఊదా |
| అన్‌లక్కీ కలర్స్ | - | ఆకుపచ్చ |
| అదృష్ట దినాలు | - | ఆది, మంగళ, గురువారాలు |
| లక్కీ వివాహ తేదీలు | - | 1, 3, 9, 12, 18, 19, 21, 27, 28 |
| రెమిడీస్ | - | గురుచరిత్ర పారాయణం, గురుజపం, దక్షిణామూర్తిని ఆరాధించడం |
| ఉదా | - | సోనూ నిగమ్ 30-07-1973 (హిందీ గాయకులు) |
| | | రజనికాంత్ 12-12-1950 |
| | | జమున 30-08-1936 |
| | | జయప్రద 03-04-1958 |

## జన్మసంఖ్య - 3, డెస్టినీ నంబరు - 4 గల వ్యక్తులు

**3/4 వ్యక్తులు లాయర్లుగా రాణిస్తారు. సంఘసేవ చేస్తారు. ఇష్టమైన వారికి ఏదో ఒక బహుమతి ఇస్తూ ఉంటారు. డబ్బు ఆదా చేయటం వీరికి కష్టం.**

ఎవరు 3, 12, 21, 30 తేదీలలో జన్మించి వారి డెస్టినీ నెంబరు 4 అవుతుందో వారు ఈ వర్గం క్రిందికి వస్తారు. వీరు గురు, రాహు గ్రహ ప్రభావంలో ఉంటారు. వీరికి మంచి తెలివితేటలు ఉంటాయి. మంచి వక్తలుగా రాణిస్తారు. సాధారణంగా రాజకీయాలలోను, ప్రభుత్వ రంగంలోను ఉంటారు. సమయానుకూలంగా మాట్లాడటం వలన మంచి న్యాయవాదులుగా రాణిస్తారు. శక్తివంతంగా మాట్లాడటం వలన కార్యసాధన చేస్తారు. సంఘసేవ చేసి ఉన్నత స్థానాన్ని పొందుతారు. అనుకూల నామసంఖ్య లేకుంటే, వారి శక్తి నిరుపయోగమవుతుంది.

ఉపన్యాసం, రచనల ద్వారా ఆదాయం పొందుతారు. అయినా జీవితంలో అనేక ఇబ్బందులను ఎదుర్కోవలసి ఉంటుంది. ఇతరులకు సహాయం చేసి వీరు ఇబ్బందులకు లోనవుతారు. సమస్యలను ధైర్యంగా ఎదుర్కొంటారు. కష్టపడి సంపాదించి, ఆనందంగా ఖర్చుపెడతారు. ఆకస్మాత్తుగా కోపం రావటం వలన దగ్గరి వారిని దూరం చేసుకుంటారు. సైన్స్ సబ్జెక్ట్ చదివిన తరువాత ఎంబీఏ, ఎల్ఎల్‌బీ వంటి కోర్సులు చేస్తారు. బ్యాంకులు, ఇన్సూరెన్స్ వంటి ఆర్థిక సంబంధమైన సంస్థల్లో పనిచేస్తారు.

ఒక మోస్తరు పొడవు, అలల్లాంటి జుత్తు కలిగి ఆకర్షణీయంగా ఉంటారు. వీరికి ప్రజాసేవ, ఇతరులకు సాయం చేసే గుణం అధికం. వీరి చుట్టూ ఎప్పుడూ స్నేహితులుంటారు. అందరూ వీరి సహాయ సహకారాలను కోరుతారు. వీరికి వ్యాపారంలో బేరసారాలు జరపడం బాగావచ్చు. కమీషన్ వ్యాపారం, వస్తు రవాణా ద్వారా అదృష్టం ఉంటుంది. అనుకూల నామసంఖ్య లేకపోతే వ్యాపారం కలిసిరాదు.

వీరికి వాహనయోగం ఉండి వాటిని నడుపుటలో అభిరుచి ఉంటుంది. విదేశీ యాత్రలు, విహార యాత్రలయందు ప్రీతి. సంపాదనలో, తమకు ఇష్టమైన వారికి ఏదో ఒక గిఫ్ట్ కొంటారు. అనుకూల నామసంఖ్య ఉంటే, డబ్బును ఆదా చేస్తారు. ఈ నంబరు వ్యక్తులు పేరు ప్రఖ్యాతులను, హోదాను, సంపదను, మంచి జీవిత భాగస్వామిని, మంచి

సంతానాన్ని, గృహ, వాహన సౌఖ్యాలను కలిగి ఉంటారు. వీరి జీవితం సుఖవంతంగా ఉంటుంది. సైన్స్ గ్రూపులు, రవాణా, మేనేజ్‌మెంట్ రంగాలు ఎం.బి.ఎ లాంటి కోర్సులపై మక్కువ చూపుతారు.

## పేరు పెట్టే విధానం

వీరి పేర్లు రవిసంఖ్యలైన 19, 37, 46, 55, గురు సంఖ్యలైన 21, 30, 39, కుజ సంఖ్యలైన 9, 27, 45, 54 లలో ఉండాలి.

## రాణించే రంగాలు

టీచర్లు, ప్రొఫెసర్లు, మేనేజ్‌మెంట్ రంగాలు, స్కిన్ డాక్టర్లు, ఫిలాసఫర్, క్రీడాకారులుగా రాణిస్తారు. బేరసారాలు, వివాద పరిష్కారాలు, ఉపన్యాస, రచనల ద్వారా సంపాదన చేస్తారు. అనుకూల నామసంఖ్య లేకపోతే అనవసర ఖర్చులు చేస్తారు.

## వ్యాధులు

గ్యాస్‌ట్రబుల్, కీళ్ళనొప్పులు, తలనొప్పులకు గురయ్యే అవకాశం ఉంది. సరియైన చికిత్స తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది.

## సూచనలు

| | | |
|---|---|---|
| లక్కీ నంబర్లు | - | 1, 3, 9 |
| అన్‌లక్కీ నంబర్లు | - | --- |
| లక్కీ తేదీలు | - | 1, 3, 9, 10, 12, 18, 19, 21, 27, 28, 30 |
| అన్‌లక్కీ డేట్స్ | - | --- |
| లక్కీ కలర్స్ | - | గులాబీ, ఎరుపు, నారింజ, ఉదా, లేతపసుపు, నీలం |
| అన్‌లక్కీ కలర్స్ | - | నలుపు, ఆకుపచ్చ |
| అదృష్ట దినాలు | - | ఆది, మంగళ, గురువారాలు |
| లక్కీ వివాహ తేదీలు | - | 1, 3, 9, 10, 12, 18, 19, 21, 27, 28 |
| రెమిడీస్ | - | దక్షిణామూర్తిని, సత్యనారాయణ స్వామిని ఆరాధించడం, అనాథలకు, బీదలకు అన్నదానం చేయటం మంచిది. |
| ఉదా | - | జిడ్డు కృష్ణమూర్తి 12-05-1895 (తత్త్వవేత్త) |
| | | అమర్త్యసేన్ 03-11-1933 (ఆర్థిక వేత్త, నోబుల్) |

మునాఫ్‌పటేల్ 12-07-1983 (క్రికెటర్)
యువరాజ్‌సింగ్ 12-12-1981 (క్రికెటర్)
స్వామి వివేకానంద 12-01-1863 (ఆధ్యాత్మిక వేత్త)

## జన్మ సంఖ్య - 3, డెస్టినీ నంబరు - 5 గల వ్యక్తులు

**3/5 వ్యక్తులు నీతి నిజాయితీ కలిగి ఉంటారు. వీరిని మోసం చేయటం కష్టం. ముందు సైన్స్ చదివి తర్వాత మేనేజ్‌మెంట్ రంగంలోకి వెళ్తారు.**

ఎవరు 3, 12, 21, 30 తేదీలలో జన్మించి వారి డెస్టినీ నెంబరు 5 అవుతుందో వారు ఈ వర్గంలోకి వస్తారు. వీరు గురువు, బుధ గ్రహాల ప్రభావంలో ఉంటారు. గురువు వీరికి నీతిని, నిజాయితీని ఇస్తాడు. బుధుడు ఉత్సాహాన్ని, తెలివి తేటలను ఇస్తాడు. వీరి జీవితం 23 ఏళ్ళు గడిచిన తరువాత అభివృద్ధికరంగా ఉంటుంది. గృహ, వాహన, భూ, ఉద్యోగ సౌఖ్యం ఉంటుంది. అనుకూల నామసంఖ్య ఉంటే, పై వాటి సౌఖ్యం ఉంటుంది. వీరు మేధావులు. కావున వీరిని మోసం చేయడం కష్టం. ఇతరులు తమను అనుసరించాలని కోరతారు. చక్కని విచక్షణతో పనిచేసి అన్ని పనుల్లో విజయం పొందుతారు. ఎప్పుడూ ఏదో ఒక పథక రచనలో నిమగ్నమై ఉంటారు. వీరిలో కొందరికి మనశ్శాంతి తక్కువ. వీరికి అనుకూల నామసంఖ్య ఉంటే చెడు ప్రభావం తగ్గుతుంది. మెరుపువేగంతో ఆలోచిస్తారు. ఏ ప్రశ్నలకైనా సమాధానాలు రెడీగా ఉండి మెరుపువేగంతో ఇస్తారు. కొన్నిసార్లు నిశ్శబ్దంలోకి జారుకుంటారు. మాట్లాడటం మొదలుపెడితే అందరినీ కట్టిపడేస్తారు. సరియైన సమయం చూసి శత్రువులను దెబ్బతీస్తారు. అపాయాలనుంచి తప్పించుకోవడానికి వ్యక్తిగత భద్రతను కల్పించుకుంటారు. పొగడ్తలకు లొంగరు.

వీరు స్థిరంగా, అనుభవపూర్వకంగా పనిచేస్తారు. అవకాశం వచ్చినప్పుడు, ఇతరులను వినియోగించుకుని శత్రువులపై ప్రతీకారం తీర్చుకుంటారు. తమపై ఆధారపడిన వారి అభివృద్ధి కోసం శ్రమిస్తారు. వయసు పెరిగే కొద్దీ ఆహారంలో ఉప్పు, పంచదార పాళ్ళు తగ్గించాలి. వీరి పథకాలు అన్ని విజయవంతం కావటం వలన దేవునిపై విశ్వాసం పెరుగుతుంది. తమ ఆలోచనలను అన్నింటినీ బహిర్గతం చెయ్యరు. వీరు ఏదైనా స్వయంగా

ఒక పథకం ద్వారా పనిచేస్తారు. సైన్స్ గ్రూప్స్ చదువుతారు. తరువాత ఎం.బి.ఎ లాంటి కోర్సులపై ఆసక్తి చూపుతారు. ఎక్కువగా బయట తిరిగే జాబ్స్‌పై ఆసక్తి చూపుతారు. పి.ఆర్.ఓ లుగా, ఎడిటర్స్‌గా, ప్రభుత్వ ఉద్యోగులుగా మంచి పేరు తెచ్చుకుంటారు. వీరికి లౌక్యం తెలుసు. అవసరానుసారంగా మాట్లాడుతారు. ఎవరిని బాధపెట్టరు. ప్రేమ, ఆప్యాయత చూపిస్తారు. ఎవరిని నొప్పించరు.

## పేరు పెట్టే విధానం

రవి సంఖ్యలైన 19, 37, 46, 55, గురు సంఖ్యలైన 21, 30, 39, బుధ సంఖ్యలైన 14, 23, 32, 41, 59, కుజ సంఖ్యలైన 9, 27, 45, 54 లలో అనుకూలంగా ఉంటుంది.

## రాణించే రంగాలు

వీరికి ఆదాయం, ఏజన్సీలు, రత్నాలు, ఖనిజాలు, రాళ్ళు, లోహ సంబంధ వస్తువులు, లలిత కళలు, వినోద కార్యక్రమాలు, టీచింగ్, శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్లు, పి.ఆర్.ఓస్ ల ద్వారా సమకూరుతుంది. ప్రతికూల నామసంఖ్య ఉంటే పై ఆదాయం తగ్గుతుంది.

## వ్యాధులు

వీరికి మానసిక సమస్యలు, మానసిక అశాంతి, మధుమేహం, రక్తపోటు, కీళ్ళ జబ్బులు వచ్చే ప్రమాదమున్నది. సరియైన చికిత్స తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది.

## సూచనలు

| | | |
|---|---|---|
| లక్కీ నంబర్లు | - | 1, 3, 5, 9 |
| అన్‌లక్కీ నంబర్లు | - | --- |
| లక్కీ తేదీలు | - | 3, 12, 21, 30, 5, 14, 23, 9, 18, 27 |
| అన్‌లక్కీ డేట్స్ | - | --- |
| లక్కీ కలర్స్ | - | గులాబి, నారింజ, ఊదా, బూడిద రంగు, ఆకుపచ్చ, నీలం |
| అన్‌లక్కీ కలర్స్ | - | నలుపు |
| అదృష్ట దినాలు | - | ఆది, మంగళ, బుధ, గురువారాలు |
| లక్కీ వివాహ తేదీలు | - | 1, 3, 9, 10, 12, 18, 19, 21, 27, 28 |

| | | | |
|---|---|---|---|
| రెమిడీస్ | - | దక్షిణామూర్తిని, విష్ణుమూర్తిని ఆరాధించడం, బీద విద్యార్థులకు చదువులో సహాయం చేస్తే బాగుంటుంది. | |
| ఉదా | - | విక్రమ్ సారాబాయి | 12-09-1919 |
| | | హోమి జె బాబా | 30-10-1909 |
| | | రోహిత్ శర్మ | 30-04-1987 |

## జన్మసంఖ్య - 3, డెస్టినీ నంబరు - 6 గల వ్యక్తులు

**3/6 వ్యక్తులు గురు, శుక్రులు వ్యతిరేక గ్రహాలు కాబట్టి కొన్ని వ్యతిరేక ఫలితాలు పొందే అవకాశం ఉంది. సరైన పేరు మార్పు చేసుకోవాలి.**

ఎవరు 3, 12, 21, 30 తేదీలలో జన్మించి వారి డెస్టినీ నెంబరు 6 అవుతుందో వారు ఈ వర్గం లోకి వస్తారు. వీరిపై గురు,శుక్రుల ప్రభావం ఉంటుంది. వీరు చాలా అదృష్టవంతులు. తెలివితేటలతో పాటు అందంగా ఉండటం వలన జీవితంలో త్వరగా ఉన్నత స్థితికి వస్తారు. వీరిలో కొందరు ప్రభుత్వ ఉద్యోగం చేస్తారు. వ్యాపారంలో వున్న వాళ్ళు బాగా రాణిస్తారు. అనుకూలమైన పేరు ఉంటే సౌఖ్యవంతమైన జీవితాన్ని పొందుతారు. వీరికి సైన్స్ సబ్జెక్ట్‌పై మక్కువ ఎక్కువగా ఉంటుంది. కాంపిటీటివ్ పరీక్షల్లో విజయం సాధిస్తారు. ఉన్నత పదవులు లభిస్తాయి.

ఆపోజిట్ సెక్స్ వలన ఇబ్బందులు పడతారు. వీరికి ఆకర్షణీయమైన రూపం ఉంటుంది. ముందు చూపు, జ్ఞానం ఉన్నా ఒక్కొసారి తప్పులు చేస్తారు. మంచి వారయినప్పటికీ కొన్ని పరిస్థితులు చెడ్డపేరు తెస్తాయి. అనుకూల నామసంఖ్య ఉన్న వారు చెడు ప్రభావాన్ని తక్కువగా పొందుతారు.

విలాసవస్తువుల వ్యాపారం, లలితకళ సంబంధిత పనులు, చేతిపనులు చేపట్టడం, ఫ్యాషన్ టెక్నాలజీ, సౌందర్య వస్తువుల అమ్మకం ద్వారా ఆదాయం పొందుతారు. పర్వత ప్రాంతాలు, ప్రకృతి సౌందర్యాన్ని ఆనందిస్తారు. విలాసవంతమైన జీవనం యిష్టమైనప్పటికీ కొన్నిసార్లు జీవితంలో అన్ని కోల్పోయిన వారి వలె కనపడతారు. ఈ స్థితిలో వీరు

అయోమయానికి గురవుతారు. అనుకూల నామం వలన సమస్యలను అధిగమించవచ్చు.

## పేరు పెట్టే విధానం

వీరికి 14, 19, 23, 27, 32, 36, 37, 41, 45, 46, 50, 59, 73 నామసంఖ్యలు అనుకూలం.

## రాణించే రంగాలు

వీరు విలాసవస్తువుల వ్యాపారం, వస్త్ర వ్యాపారం, పరిశ్రమలు, కమీషన్ వ్యాపారం వలన లాభాన్ని పొందుతారు.

## వ్యాధులు

మానసిక జబ్బులు, గుండెనొప్పి, కీళ్ళనొప్పి, పంటినొప్పి, కంటి సమస్యలు రావచ్చు. సరియైన చికిత్స తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది.

## సూచనలు

| | | |
|---|---|---|
| లక్కీ నంబర్లు | - | 1, 9, 5 |
| అన్‌లక్కీ నంబర్లు | - | --- |
| లక్కీ తేదీలు | - | 1, 10, 19, 28, 9, 18, 27, 5, 14, 23 |
| అన్‌లక్కీ డేట్స్ | - | - |
| లక్కీ కలర్స్ | - | లేతనీలం, లేత పసుపు, పసుపు, క్రీమ్, సిల్వర్, గోల్డెన్ |
| అన్‌లక్కీ కలర్స్ | - | నలుపు |
| అదృష్ట దినాలు | - | ఆది, గురు, శుక్రవారాలు |
| లక్కీ వివాహ తేదీలు | - | 1, 9, 10, 18, 19, 27, 28 |
| రెమిడీస్ | - | దక్షిణామూర్తిని, లక్ష్మీ దేవిని ఆరాధించటం, శుక్రజపం చేయడం, బీద అమ్మాయిల పెళ్ళి ఖర్చులు భరించటం |

## జన్మసంఖ్య - 3, డెస్టినీ నంబరు - 7 గల వ్యక్తులు

**3/7 వ్యక్తులకు ఒంటరి జీవితం ఇష్టం. కొత్త విషయాలు కనుగొంటారు. దైవభక్తి కలిగి ఉంటారు. వీరు మితభాషులు.**

ఎవరు 3, 12, 21, 30 తేదీలలో జన్మించి వారి డెస్టినీ నెంబరు 7 అవుతుందో వారు ఈ వర్గంలోకి వస్తారు. వీరిపై గురువు, కేతువు గ్రహ ప్రభావం ఉంటుంది. ఏకాంత జీవితమంటే ప్రీతి. వీరు పాత, కొత్తల మేలు కలయిక, కొంత సంప్రదాయం, మరికొంత ఆధునికత కలిగి ఉంటారు. వీరి వేషధారణ, భక్తి, ఆధ్యాత్మికతల మేలుకలయికగా ఉండి, చూపరులకు వీరిపై భక్తిభావం కలిగే విధంగా ఉంటుంది. మాట్లాడేటప్పుడు, ముందుగా సిద్ధమై, వారేం మాట్లాడాలనుకుంటారో వాటిని మాత్రమే మాట్లాడతారు. సమస్యలు వచ్చినప్పుడు వాదన చేసి తమ ఉద్దేశ్యములను నెరవేర్చుకుంటారు. అనవసర సంభాషణ చేయరు. వీరి పద్ధతులు ఇతరులకు అంత సమ్మతం కాదు. అందువల్ల ఇతరులు వీరిని అపార్థం చేసుకుంటారు.

వీరికి నమ్మకస్తులైన స్నేహితులు తక్కువ. ఒక వేళ దొరికితే చాలా ఆత్మీయంగా ఉంటారు. త్వరగా కోపం వస్తుంది. తప్పు చేసిన వారిని విమర్శిస్తారు. తమ కష్టాలను ఇతరులకు చెప్పరు. పరిశోధన, కళలు, విద్య, జ్యోతిష్యం, న్యూమరాలజీపై ఇష్టం ఉంటుంది. వైద్యవిద్య అభ్యసిస్తే సంఘానికి తగిన విధంగా మేలు చేస్తారు. నయం కాని వ్యాధులకు కూడా వీరి చేత్తో మందు ఇస్తే ఉపశమనం కలుగుతుంది. వీరికి దైవ శక్తి ఉండటం వలన వ్యాధి గురించి చెప్పకనే వ్యాధి ఏమిటో కనుక్కోగలరు. వీరి వాక్కు ఫలిస్తుంది. అందువలన వీరు ఎప్పుడూ పాజిటివ్‌గా మాట్లాడితే మంచిది. వీరికి జరుగబోయే విషయాలు ముందుగానే కల రూపంలో తెలుస్తాయి. ఉద్యోగులైన వారు తీరిక సమయాన్ని వృథా చేయరు. ఏదో ఒకటి ఆలోచిస్తూ, రాస్తూ ఉంటారు. పరిశోధనాత్మక దృష్టి కల్గిఉంటారు. అనుకూల నామసంఖ్య ఉంటే కొత్త విషయాలు కనిపెడతారు. అత్యంత దేశభక్తి, దైవభక్తి ఉంటుంది. శత్రువులు బలమైన వారైనా దీటుగా ప్రతిఘటిస్తారు. సంసార జీవితంలో అయోమయానికి లోనవుతారు. అనుకూల నామం పెట్టుకుంటే లాభం పొందుతారు.

కొందరు స్వతంత్ర వ్యాపారులై ఉంటారు. మితభాషులై నందున వ్యాపారాన్ని విస్తరించలేరు. తమ సమస్యలు ఇతరులతో పంచుకోరు. వ్యాపార సమస్యలను కూడా ఇతరులతో చర్చించరు. అందువలన ఆ రంగంలో రాణింపు తక్కువ. మంచి పేరు కొంత లాభాన్ని ఇస్తుంది. వ్యాపారం విస్తరిస్తుంది.

## పేరు పెట్టే విధానం

రవి సంఖ్యలైన 19, 37, 46, 55, గురు సంఖ్యలైన 3, 21, 30, 39, చంద్రుని సంఖ్యలైన 11, 20, 38, 47, కేతు సంఖ్యలైన 25, 34లలో పేర్లు అనుకూలం.

## రాణించే రంగాలు

ఫైనాన్స్ వ్యాపారం లాభసాటిగా ఉంటుంది. రాళ్ళు, రత్నాలు, ఖనిజాలు, మందుల షాపులు, కళాసంబంధిత వ్యాపారాలు అనుకూలం.

## వ్యాధులు

మానసిక వ్యాధులు, పక్షవాతానికి గురికావచ్చు. అధిక వేడి వలన నరాల బలహీనత కల్గవచ్చు. సరియైన చికిత్స తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది.

## సూచనలు

| | | |
|---|---|---|
| లక్కీ నంబర్లు | - | 1, 2, 3, 7 |
| అన్‌లక్కీ నంబర్లు | - | 9 |
| లక్కీ తేదీలు | - | 1, 2, 3, 5, 7, 10, 11, 12,<br>14, 16, 19, 20, 21, 23, 25, 28, 29, 30 |
| అన్‌లక్కీ డేట్స్ | - | 9, 18, 27 |
| లక్కీ కలర్స్ | - | పసుపు, క్రీమ్, గులాబి, ఆరెంజ్, ఊదా, ఆకుపచ్చ, నీలం |
| అన్‌లక్కీ కలర్స్ | - | ఎరుపు |
| అదృష్ట దినాలు | - | ఆది, సోమ, గురువారాలు |
| లక్కీ వివాహ తేదీలు | - | 1, 3, 10, 12, 19, 21, 28 |
| రెమిడీస్ | - | దక్షిణామూర్తిని ఆరాధించడం, కేతు జపం చేయడం,<br>కంచిలో కాని, హైదరాబాద్ ఉప్పుగూడలో ఉన్న చిత్రగుప్తుని ఆలయం దర్శించటం,<br>పార్వతి మాతను దర్శించడం, పూజించడం మంచిది. |

## జన్మసంఖ్య - 3, డెస్టినీ నంబరు - 8 గల వ్యక్తులు

**3/8 వ్యక్తుల కళ్ళు ఉబ్బినట్లుగా ఉంటాయి. క్రమక్రమంగా జీవితంలో అభివృద్ధి సాధిస్తారు. ఖర్చు ఎక్కువ చెయ్యరు.**

ఎవరు 3, 12, 21, 30 తేదీలలో జన్మించి వారి డెస్టినీ నెంబరు 8 అవుతుందో వారు ఈ వర్గంలోకి వస్తారు. వీరు గురుడు, శని ప్రభావంలో ఉంటారు. ఒక మోస్తరు పొడగరులు, ఉబ్బిన కళ్ళు ఉండి ధైర్యంగా కనిపిస్తారు. తొలినాళ్లలో కష్టాలను ఎదుర్కొంటారు. ఎన్నో కష్టనష్టాలను ఓర్చి అంచెలంచెలుగా అభివృద్ధి సాధిస్తారు. ఎన్నో బాధ్యతలను భుజాలపై వేసుకుంటారు. నిజాయితీగా తాము నమ్మిన సిద్ధాంతాలకు అనుగుణంగా జీవించడం వలన రావలసిన గుర్తింపు రాదు. కళలకు సంబంధించిన జ్ఞానం కల్గి ఉంటారు. వీరికున్న ప్రత్యేక నేర్పు వలన, స్టీల్, రవాణా, మేనేజ్‌మెంట్, న్యాయశాస్త్రాలందు రాణిస్తారు. కొన్నిసార్లు వ్యాపారంలో ఒడిదుడుకులు వస్తాయి. అనుకూలమైన పేరు ఉంటే అభివృద్ధి ఉంటుంది.

ఉద్యోగాలలో ఉన్నతికి, అభివృద్ధికి అవకాశాలు కలుగుతాయి. వీరికి తమ ఆదాయం సంతృప్తినివ్వదు. అందుకే వ్యాపారం చేసి అదనపు ఆదాయం పొందాలని కోరుకుంటారు. అనుకూల నామం ఉంటే కొత్త ఆదాయ వనరులు తప్పక లభిస్తాయి. భౌతిక విషయాలన్నింటిలో విజయం సాధిస్తారు. పేర్లు ప్రతికూలంగా ఉంటే కోర్టు సమస్యల్లో చిక్కుకుని రోగగ్రస్తులు అయ్యే అవకాశం ఉంది. వీరు కొన్నిసార్లు విలువైనది ఏదో కోల్పోయినట్లు కనిపిస్తారు.  ఇతరులను సులభంగా నమ్మక జాగ్రత్త పడతారు. మిత వ్యయం చేస్తారు. కానీ అనివార్యమైన ఖర్చు తప్పదు. దీన్ని దైవ ప్రార్థన ద్వారా తప్పించుకొనవచ్చును. వీరు అతిజాగ్రత్త పరులు. ఒకటికి రెండు సార్లు తనిఖీ చేసుకుంటారు.

వీరు  ముందు సైన్స్ గ్రూపుల వైపు మొగ్గు చూపి తరువాత కామర్స్ లో రాణిస్తారు. మేనేజ్‌మెంట్ రంగాలలో రాణిస్తారు. వీరికి ఎం.బి.ఎ చదవాలనే బలమైన కోరిక ఉంటుంది. ఎప్పటికైనా సాధిస్తారు. సంఘ సంస్కర్తగా జీవించాలని కోరుకుంటారు. పేరు మార్పు జీవితంలో ఆనందాన్ని తీసుకొస్తుంది.

## పేరు పెట్టే విధానం

వీరికి రవి సంఖ్యలైన 19, 37, 46, 55, గురు సంఖ్యలైన 3, 21, 30, 39, చంద్రుని సంఖ్యలైన 11, 20, 38, 47, కేతు సంఖ్యలైన 25, 34 లలో పేర్లు అనుకూలం.

## రాణించే రంగాలు

లోహసంబంధమైన వ్యాపారాలు లాభసాటిగా ఉంటాయి. ఇంజనీరింగ్, ఆటోమొబైల్, స్టీలు, ఇనుము, రచనారంగం, కాంట్రాక్ట్ కమీషన్ వ్యాపారాలు లాభదాయకంగా ఉంటాయి.

## వ్యాధులు

వీరికి కీళ్ళ నొప్పులు, కడుపు నొప్పి, రక్త దోషం, గ్యాస్ట్రిక్ ట్రబుల్ వచ్చే అవకాశం ఉంది. సరియైన చికిత్స తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది.

## సూచనలు

| | | |
|---|---|---|
| లక్కీ నంబర్లు | - | 1, 3, 5 |
| అన్‌లక్కీ నంబర్లు | - | --- |
| లక్కీ తేదీలు | - | 1, 3, 5, 10, 12, 14, 19, 21, 23, 28, 30 |
| అన్‌లక్కీ డేట్స్ | - | --- |
| లక్కీ కలర్స్ | - | గులాబి, నారింజ, ఊదా, నీలం, పసుపు |
| అన్‌లక్కీ కలర్స్ | - | నలుపు |
| అదృష్ట దినాలు | - | ఆదివారం, గురువారం, శనివారం |
| లక్కీ వివాహ తేదీలు | - | 1, 3, 9, 10, 12, 18, 19, 21, 27, 28 |
| రెమిడీస్ | - | దక్షిణామూర్తిని ఆరాధించడం,<br>శనికి తైలాభిషేకం చేయించటం,<br>అనాథలకు, వికలాంగులకు అన్నదానం చేయటం,<br>కాకులకు ఆహారం పెట్టడం. |
| ఉదా | - | గోపీచంద్ 12-06-1979 (సినీ నటుడు)<br>వివేక్ ఒబెరాయ్ 03-09-1976 |

## జన్మసంఖ్య - 3, డెస్టినీ నంబరు - 9 గల వ్యక్తులు

**3/9 వ్యక్తులు చాలా అదృష్ట వంతులు. అన్ని సుఖాలు అనుభవిస్తారు. వారసత్వపు ఆస్తి, జీవిత భాగస్వామి నుండి కూడా ఆస్తి లభిస్తుంది.**

ఎవరు 3, 12, 21, 30 తేదీలలో జన్మించి, వారి డెస్టినీ నెంబరు 9 అవుతుందో వారు ఈ వర్గంలోకి వస్తారు. వీరు గురు, కుజగ్రహ ప్రభావంలో ఉంటారు. మానసికంగా స్థిరమైనవారు, దృఢమైనవారు. జీవితంలో అన్ని సౌఖ్యాలు అనుభవించే అదృష్టవంతులు. ప్రతికూల నామం ఉంటే సమస్యలు వస్తాయి. అనుకూలమైన పేర్లు ఉంటే లాభాల్ని పొందుతారు. వీరికి రాజసం ఉంటుంది. ఖచ్చితంగా మాట్లాడతారు. జన్మతః అదృష్ట వంతులైనందున తల్లిదండ్రులు, జీవితభాగస్వామి నుంచి ఆస్తి లభిస్తుంది. సివిల్, మెకానికల్ ఇంజినీరింగ్, భూ సంబంధ వృత్తులు, వైద్య వృత్తిలో ఉంటే మంచి సర్జన్లుగా పేరు ప్రఖ్యాతులు పొందుతారు. క్రీడా రంగంలోకి వస్తే మంచి అథ్లెట్లుగా పేరు పొందుతారు. వీరికి మంచి విద్య అబ్బుతుంది. అనుకూలమైన పేరుంటే మంచి ఉద్యోగం లభిస్తుంది.

ఇతరులను తమ కింద పనిచేయించగల సామర్థ్యం ఉంటుంది. శత్రుజయం కలుగుతుంది. సాహసోపేతమైన కార్యాలు చేస్తారు. పోలీసు, సైన్యం, అధికార ఉద్యోగాలలో రాణిస్తారు. వ్యాపారం చేస్తే ఎంతో మందికి ఉపాధి కలిగే విధంగా పెద్ద ఎత్తున చేస్తారు. భవన నిర్మాణం, పరిశ్రమలు, కాంట్రాక్టులు అనుకూలం. నిజాయితీతో కూడిన అప్రమత్తత కల్గిఉంటారు. క్షణికావేశంలో కఠినంగా మాట్లాడిన తర్వాత పశ్చాత్తాపపడతారు. వీరికి డబ్బుపై దురాశ ఉండదు. వీరు దేశభక్తులు, దేశాభ్యుదయం కోసం శ్రమిస్తారు. నిరంతర శ్రామికులు.

ఇతరులను గౌరవిస్తారు. చిన్నవారు సహచరుల నుంచి వినయవిధేయతలను ఆశిస్తారు. మాటలో నిలకడ లేని వారిని నచ్చరు. శాంతియుతంగా ఏమి సాధించలేమని, అధికారంతోనే ఏదైనా సాధించగలమని అనుకుంటారు. శత్రు నాశనం కోసం పథకరచన చేస్తారు. శత్రువులు వీరికి భయపడతారు. వీరిచ్చే మద్దతుతో వీరిపై ఆధారపడిన వారు చొరవగా పనిచేస్తారు. ఎంతోమంది వీరికి సాయం చేయటానికి ముందుకు వస్తారు. వీరికి మంచి స్నేహితులు, మంచి జీవిత భాగస్వామి ఉంటారు. చివరకు అదృష్టకరమైన జీవితాన్ని పొందుతారు. పేరు ప్రతికూలంగా ఉంటే వ్యతిరేక ఫలితాలు రావచ్చు.

## పేరు పెట్టే విధానం

వీరికి రవి సంఖ్యలైన 19, 37, 46, 55, గురు సంఖ్యలైన 3, 21, 30, 39, కుజ సంఖ్యలైన 9, 27, 54 లలో పేర్లు అనుకూలం.

## రాణించే రంగాలు

కాంట్రాక్టులు, భవన నిర్మాణం, లాభసాటిగా ఉంటాయి.

## వ్యాధులు

వీరికి ఉదర సమస్యలు, అధిక ఉష్ణ సంబంధ వ్యాధులు, రక్తపోటు ఉండవచ్చు. సరియైన చికిత్స తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది. సైన్స్ గ్రూపుపై ఎక్కువ మక్కువ చూపిస్తారు. మెకానికల్, సివిల్ ఇంజనీరింగ్ వైపు ఆసక్తి చూపుతారు. మైన్స్, రియల్ ఎస్టేట్ రంగాల వైపు మరియు ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్ స్థాపించే అవకాశం ఉంది.

## సూచనలు

| | | | |
|---|---|---|---|
| లక్కీ నంబర్లు | - | 1, 3, 9 | |
| అన్‌లక్కీ నంబర్లు | - | 2, 7, 8 | |
| లక్కీ తేదీలు | - | 1, 3, 5, 9, 10, 12, 14, 18, 19, 21, 23, 27, 28, 30 | |
| అన్‌లక్కీ డేట్స్ | - | 2, 7, 8, 11, 16, 17, 20, 25, 26, 29 | |
| లక్కీ కలర్స్ | - | పసుపు, గులాబి, నారింజ, ఊదా, ఎరుపు, గోల్డెన్ | |
| అన్‌లక్కీ కలర్స్ | - | ఆకుపచ్చ | |
| అదృష్ట దినాలు | - | ఆది, మంగళ, గురువారాలు | |
| లక్కీ వివాహ తేదీలు | - | 1, 10, 19, 28, 3, 12, 21, 30, 9, 18, 27, 28 | |
| రెమిడీస్ | - | దక్షిణామూర్తిని, సుబ్రహ్మణ్య స్వామిని ఆరాధించడం, వికలాంగులకు, అనాథలకు అన్నదానం లేక సహాయం చేయటం, ముఖ్యంగా రక్తదానం చేయటం వలన ప్రమాదాల నుండి తప్పించుకునే అవకాశం ఉంది. | |
| ఉదా | - | జగదీష్ చంద్రబోస్ | 30-11-1858 |
| | | డా॥ బాబూ రాజేంద్రప్రసాద్ | 03-12-1884 |

# జన్మ సంఖ్య - 4 (రాహువు సంఖ్య)

**ఈ సంఖ్య కలవారు నిజాయితీగా ఏ పనైనా చేస్తారు. అకస్మాత్తుగా వచ్చే మార్పును నచ్చరు. కుటుంబం పట్ల బాధ్యతాయుతంగా ఉంటారు. ఈ నంబరు చాలా మంది ఇంజినీర్లకు, లాయర్లకు, శాస్త్రవేత్తలకు ఉంటుంది. విశాల భావాలు కలిగి ఉంటారు.**

ఏ నెలలోనైనా 4, 13, 22, 31వ తేదీలలో పుట్టిన వారు ఈ కోవకి చెందిన వారు. ఈ నంబరు వ్యక్తులపై రాహువు ప్రభావం ఉంటుంది. ఈ తేదీల్లో పిల్లలు పుట్టినప్పుడు తల్లిదండ్రులు కొంచెం నిరాశకు గురి అవుతున్నారు. ముఖ్యంగా 13 వ తేదీన పిల్లలు పుడితే నా అనుభవంలో తల్లిదండ్రుల ఆర్థికపరిస్థితి మెరుగుపడుతుంది. ఇంకా తల్లిదండ్రుల ఉద్యోగాలలో కూడా ఎదుగుదల ఉంటుంది. అందువలన 13వ తేదీన పిల్లలు పుడితే అధైర్యపడవద్దు.

## 4వ నంబరు పాజిటివ్ లక్షణాలు

నిర్మాణాత్మక వైఖరి, పద్ధతి, వాస్తవిక పంథా, స్థిరత్వం, ప్రశాంతత, నైపుణ్యత, శాస్త్రీయమైన, బాధ్యతాయుతమైన, దృక్పథం, కష్టించేతత్వం, నిజాయితీ, విశ్వాసపాత్రత, పట్టుదల.

## అవకాశాలు, వృత్తులు

వీరు గొప్ప ప్రారంభకులు కానప్పటికీ, లక్ష్యాలను నిర్దేశిస్తే ఏ రంగంలోనైనా కృషిచేస్తారు. నిజాయితీ అనే పునాదిపై ఎటువంటి కార్యాన్నైనా సాధిస్తారు. పనిలేకపోతే ఆనందంగా ఉండలేరు. ఏమీ చేయకుండా కూర్చోడాన్ని ఇష్టపడరు. ఒక పద్ధతి, నిర్మాణాత్మకత, నిర్వహణ వీరి వ్యవహార శైలి. ఏ పనినైనా సకాలంలో పూర్తి చేస్తారు. నిరంతర శ్రమతో ఉన్నత స్థానాన్ని అధిరోహిస్తారు. వీరు స్వార్థపరులు కారు. ఇతరులు వీరి సహాయాన్ని అర్థిస్తారు.

ఈ నంబరు వ్యక్తులలో ఇంజనీర్లు, డిజైనర్లు, మ్యానుఫాక్చరర్స్, శాస్త్రవేత్తలు, రైతులు, న్యాయవాదులు, అధ్యాపకులు, విద్యావేత్తలు, వ్యాపారవేత్తలు ఉంటారు.

ఫలితాన్నిచ్చే పనులలో నిమగ్నమై ఉంటారు. స్టోర్‌కీపర్స్, ఆఫీసర్లుగా ఉండి నిర్మాణ రంగంలో ఉంటారు. సహజంగా నిర్మాణ రంగ నిపుణులు అయి ఉండటంతో చిన్నస్థాయిలో ప్రారంభించినా చివరకు ఉన్నత స్థానాన్ని అందుకుంటారు. వీరు రాజకీయ నాయకులుగా, లాయర్లుగా, మేనేజర్స్‌గా మంచి పేరు సంపాదిస్తారు. నూతన టెక్నాలజీ అయిన కంప్యూటర్స్ రంగాలలో మంచి పేరు గడిస్తారు.

## నెగిటివ్ లక్షణాలు

వీరికి కల్పనాచాతుర్యం తక్కువ. స్థిరమైన ఆలోచనలతో మంకు పట్టుదలతో ఉంటారు. వాదన, అతి గంభీరత, ఆధిపత్యం వీరికున్న చెడు లక్షణాలు. వీటి వలన వీరి ప్రగతి కుంటు పడుతుంది. విశ్రాంతి లేకుండా శ్రమించడం వలన వ్యక్తిగత జీవితం, ఆరోగ్యం దెబ్బతింటాయి.

## వ్యక్తిగతం

వీరు నిబద్ధత, సహకారం, ముక్కుసూటితనం గలవారు. కుటుంబ జీవితానికి ప్రాధాన్యతనిస్తారు. వీరికి జనంతో కలిసి ఉండటం, అందరూ వీరిపై ఆధారపడి ఉండటం లాంటివి యిష్టం. స్థిరమైన పద్ధతులను అవలంబిస్తారు. కుటుంబంలోను, వ్యాపారం లోను భద్రతకు ప్రాధాన్యత ఇస్తారు. ఆకస్మిక మార్పులు, ఇంకొకరి ఆజమాయిషీ నచ్చదు.

ఒక పద్ధతి కలిగి, నిదానంగా వ్యవహరించడం వలన వేగం లోపిస్తుంది. ఆర్థిక భద్రతను సాధిస్తారు. కుటుంబీకుల, బంధువుల బాధ్యతలను భుజానికేసుకోవడం వలన ఇబ్బందులు వస్తాయి. వీరిలో ఇతరులకు సహాయం చేసే గుణాన్ని ఇతరులు దుర్వినియోగం చేసుకుంటారు. వీరు ఎన్నో కుటుంబ సమస్యలని పరిష్కరించి, ఎన్నో బాధ్యతలను భరిస్తారు.

## 4వ నంబరు వ్యక్తుల మరికొన్ని లక్షణాలు

## పాజిటివ్ లక్షణాలు

1. వాస్తవికంగా ఆలోచించటం
2. క్రమశిక్షణ కలిగి ఉండటం
3. ప్రతి పనీ పద్ధతిగా చేయటం

4. కష్టపడే గుణం
5. ఖచ్చితత్వం
6. సంప్రదాయాల పట్ల గౌరవం
7. నిజాయితీ కలిగి ఉండటం
8. ఇంటికి, కుటుంబానికి తగిన గుర్తింపునివ్వటం
9. నీతి, దేశభక్తి కలిగి ఉండటం

## నెగిటివ్ లక్షణాలు

1. సోమరితనం, బద్ధకం లేదా
2. అతిగా పనిచేయటం
3. మొండి అభిప్రాయాలు కలిగి ఉండటం
4. కొత్తదనానికి భయపడటం
5. అతి జాగ్రత్త కలిగి ఉండటం
6. పిసినారితనం
7. క్రూరంగా, హింసాత్మకంగా మారటం
8. ఇతరుల పట్ల అసూయ

వీరిలో ఎంతో మంది ధనవంతులుగా, సినిమారంగంలో ప్రముఖులుగా ఉంటారు. ఎక్కువ ధనం లేకపోతే అసంతృప్తి ఉంటుంది. ధనికులతో తమను పోల్చుకుంటారు. ఎక్కువ ధనం వచ్చే కొద్దీ మరింత ఎక్కువ ధనాన్ని కోరుకుంటారు.

4వ నంబరు వ్యక్తులపై రాహు గ్రహ ప్రభావం వలన తొందరగా విజయం సాధిస్తారు. కొందరికి వ్యక్తిగత ఆకర్షణ ఉంటుంది. వీరు సంప్రదాయేతర పద్ధతులను అవలంబించుట వలన వ్యతిరేకతను ఎదుర్కొంటారు. కులాంతర, మతాంతర వివాహాలను సమర్ధిస్తారు. వీరు ప్రముఖ వ్యక్తులుగా ఉంటారు. వీరికి బహిరంగ, రహస్య శత్రువులుంటారు. వీరు సంఘ సంస్కర్తలు, రాజకీయ సంస్కర్తలు, స్త్రీ విద్య, స్త్రీ అభివృద్ధికై పాటుపడతారు.

వీరికి ఎలక్ట్రికల్ వర్క్, ఇంజనీరింగ్, మెకానికల్ వర్క్, భవనాలు, కాంట్రాక్టులు, సాంకేతిక పనులు, బోధన, అకౌంటింగ్, వాణిజ్యం, అనుకూల వృత్తులు. వీరిలో కొందరు,

నటులు, చిత్రకారులు. వీరు పద్ధతి, నిబద్ధత కలిగి ఉంటారు. వీరు నమ్మదగిన వారు, ఆధారపడదగ్గవారు. బేరసారాలలో దిట్ట. వీరు పరిశీలన, క్రమశిక్షణ కలిగి ఉంటారు.

శత్రువులను అణచివేస్తారు. వీరిని అదుపు చేయడం, ప్రభావితం చేయడం కష్టం. ఇతరుల ఉద్దేశ్యాలను తొందరగా గ్రహించగలుగుతారు. వీరికి 1,2,7,8 నంబరు వ్యక్తులతో స్నేహం ఉంటుంది. దయ, జాలి, సానుభూతి కలిగి ఎలా అయినా న్యాయం జరగాల్సిందేనని పట్టుబడతారు. వీరిలో కొందరు విలాసవంతమైన జీవితాన్ని కోరుకోవడంతో వీరి చుట్టూ స్నేహితులు చేరతారు. వీరిలో సంగీతకారులు, కళాకారులు, నటులు, నటీమణులు ఉంటారు. కొందరు ప్రమాదాలకు, ఆకస్మిక మరణాలకు గురయ్యే అవకాశం ఉంది.

వీరికి ప్రయాణాలంటే ఇష్టం. ప్రకృతి ఆరాధనను యిష్టపడతారు. అభిప్రాయాలను స్పష్టంగా చెప్తారు. వీరు సాహసికులు, మంచి వక్తలు. నిర్దిష్ట అభిప్రాయాన్ని కలిగి ఉంటారు. స్నేహితుల వలన లాభం పొందుతారు. కీర్తికాంక్ష ఉండదు. నీతి నిజాయితీలు ఎక్కువ. ఉన్నత ఆశయాలు ఉంటాయి. చరిత్రను సృష్టించగలిగే సత్తా కలిగి ఉంటారు.

లావైన, వెడల్పైన ముఖం, ఆకర్షణీయమైన చూపు ఉంటుంది. వెంట్రుకలు దట్టంగా ఉంటాయి. వీరికి చిన్నవయస్సులోనే వివాహమై కుటుంబ భారం మీద పడుతుంది. జీవితభాగస్వామి వలన లాభాన్ని పొందుతారు. మంచి సంతానం ఉంటుంది. వీళ్ళు ఇతరులకు రోల్‌మోడల్స్‌గా జీవిస్తారు. కళలు, కావ్యాలు, చిత్రలేఖనం, సాహిత్యం, జ్యోతిష్యం వంటి రంగాలలో విజయం సాధిస్తారు.

4 వ నెంబరు వ్యక్తులు సరోజినీ నాయుడు, ఘంటసాల, దాశరథి, మైకేల్ ఫారడే, సర్ధార్ వల్లభాయ్‌పటేల్, రామానుజన్, షెల్లి, జార్జి వాషింగ్టన్, రామానుజాచార్యులు, మార్గరెట్ థాచర్.

జన్మసంఖ్య యొక్క ప్రబావం వ్యక్తులపై ఏ విధంగా ఉంటుందో, అలాగే డెస్టినీ నెంబరు యొక్క ప్రభావం కూడా ఉంటుంది. కాబట్టి 4 జన్మ సంఖ్య ఉన్న వ్యక్తులందరి గుణగణాలు ఒకేలా ఉండవు. దానికి కారణం డెస్టినీ నెంబరు మారటమే. కాబట్టి ప్రస్తుత 4 జన్మసంఖ్య కలవారి గుణగణాలు కూడా డెస్టినీ నెంబరు బట్టి మారుతూ ఉంటాయి. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరని ప్రార్థన.

# జన్మ సంఖ్య - 4, డెస్టినీ నంబరు - 1 గల వ్యక్తులు

**4/1 వ్యక్తులు నిజాయితీ కలవారు. నీతి కలిగిన వారు. వీరి స్నేహాన్ని అందరూ కోరుకుంటారు. పొగడ్తలకు లొంగిపోతారు. అనుకూలమైన పేరుంటే అదృష్టం వీరి సొంతం.**

ఎవరు 4, 13, 22, 31 తేదీలలో జన్మించి వారి డెస్టినీ నెంబరు 1 అవుతుందో వారు ఈ వర్గంలోకి వస్తారు. వీరు రాహువు, రవిగ్రహ ప్రభావంలో ఉంటారు. ఒక మోస్తరు పొడగరులు. గంభీరంగా ఉంటారు. అధిక ఉష్ణాన్ని కలిగి ఉంటారు. అనైతిక ప్రవర్తనను ఇష్టపడరు. ఉపన్యాస రచనలతో గొప్పగా ఎదుగుతారు. మంచి కుటుంబ జీవితాన్ని పొందుతారు. ఇతరులు మాట్లాడేటప్పుడు మధ్యలో కల్పించుకుంటారు. అందరికి సహాయం చేసే గుణం ఉంటుంది. తప్పు చేస్తే సరిదిద్దుకుంటారు. ఇతరులకు ఏ హానీ చెయ్యరు. నిజాయితీని యిష్టపడతారు.

వీరి స్నేహాన్ని అందరూ కోరుకుంటారు. వీరికి ఎవరైనా నచ్చకపోతే వారికి దూరంగా ఉంటారు. ఎవరైనా వీరిని ప్రశ్నిస్తే మెరుపు వేగంతో సమాధానమిస్తారు. వీరికి గల విశిష్ట లక్షణాలతో ఉన్నత స్థానానికి చేరుకుంటారు. కొందరు ఉద్యోగులు, మరికొందరు వ్యాపారులుగా ఉంటారు. కొంతమంది వక్తలుగా, రచయితలుగా రాణిస్తారు. వీరికి ఒకరి కింద పనిచేయటానికి ఇష్టం ఉండదు. ఎలాగైనా అజమాయిషీ చేసే పనిలో ఉండాలని కోరుకుంటారు. అందుకు తగిన కృషి చేస్తారు. కాంపీటేటీవ్ పరీక్షల్లో విజయావకాశాలు మెరుగ్గా ఉంటాయి. అడ్మినిస్ట్రేటీవ్ పోస్ట్‌లో పనిచేయాలనే సంకల్పం ఉంటుంది. దాని కోసం కృషి చేస్తారు. విజయం సాధిస్తారు.

ఇతరులకు సాయం చేయడం వలన ఇబ్బందులు వస్తాయి. అనుకూల నామసంఖ్యతో ఈ సమస్యను అధిగమించి, జీవితంలో అంచెలంచెలుగా అభివృద్ధి సాధిస్తారు. తగిన సంపద పొందినా ఖర్చులకోసం ఆందోళన చెందుతారు. నిజాయితీకి విలువనిస్తారు. అందువలన చాలా మంది వీరిని నమ్మి నాయకునిగా అంగీకరిస్తారు. పొగడ్తలతో వీరి స్నేహితులు తమ పనులను పూర్తి చేసుకుంటారు.

వీరు ఆహారప్రియులు. రుచికర వంటకాలను కోరుకుంటారు. ఎలాంటి ఇబ్బంది

ఎదురైనా అనుకున్న పనికోసం కష్టిస్తారు. అనుకూల నామసంఖ్యతో పేరు మార్చుకుంటే వీరికి మంచి జీవిత భాగస్వామి, మంచి సంతానం, మంచి ఆరోగ్యం, సంపద లభిస్తాయి. మిత్రుల మద్దతు లభిస్తుంది.

## పేరు పెట్టే విధానం

వీరికి రవి సంఖ్యలైన 19, 37, 46, 55, బుధ సంఖ్యలైన 5, 14, 23, 32, 41, 50, శుక్ర సంఖ్యలైన 6, 15, 24, 33, 42, 51, 60 సంఖ్యలు పేరుకు అనుకూలం.

## రాణించే రంగాలు

వీరికి ఉపన్యాస రచనల ద్వారా మంచి సంపాదన ఉంటుంది. కమీషన్ వ్యాపారం, రవాణా, మెకానికల్, సివిల్ ఇంజినీరింగ్, లోహ, ఫర్నిచర్ వ్యాపారాలు లాభసాటిగా ఉంటాయి.

## వ్యాధులు

అధిక ఉష్ణ సంబంధిత వ్యాధులు, పైల్స్, రక్తపోటు, గ్యాస్ట్రిక్ ట్రబుల్స్‌కు గురికావచ్చు. అనుకూల నామసంఖ్యతో వీటిని నివారించవచ్చు. సరియైన చికిత్స తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది.

## సూచనలు

| | | |
|---|---|---|
| లక్కీ నంబర్లు | - | 1, 6 |
| అన్‌లక్కీ నంబర్లు | - | --- |
| లక్కీ తేదీలు | - | 1, 10, 19, 28, 6, 15, 24 |
| అన్‌లక్కీ డేట్స్ | - | 8, 17, 26 |
| లక్కీ కలర్స్ | - | పసుపు, నీలం, ఆరెంజి |
| అన్‌లక్కీ కలర్స్ | - | నలుపు, ఎరుపు |
| అదృష్ట దినాలు | - | ఆదివారం, బుధవారం, శుక్రవారం |
| లక్కీ వివాహ తేదీలు | - | 1, 3, 6, 9, 10, 12, 15, 18, 19, 21, 24, 27, 28 |
| రెమిడీస్ | - | సుబ్రహ్మణ్య స్వామి, శివుడిని ఆరాధించడం మంచిది. అనాథలకు అన్నదానం చేయటం మంచిది. |
| ఉదా | - | |

## జన్మసంఖ్య - 4, డెస్టినీ నంబరు - 2 గల వ్యక్తులు

**4/2 వ్యక్తులు కూడా నీతి నిజాయితీ కలిగి ఉంటారు. చంద్రుని ప్రభావం వలన మానసిక కలతలు, అయోమయం కలుగుతాయి. సరైన పేరు పెట్టుకుంటే అంతా సవ్యంగా ఉంటుంది.**

ఎవరు 4, 13, 22, 31 తేదీలలో జన్మించి వారి డెస్టినీ నెంబరు 2 అవుతుందో వారు ఈ వర్గంలోకి వస్తారు. వీరు రాహు, చంద్రగ్రహ ప్రభావంలో ఉంటారు. వీరి విధిసంఖ్య చంద్రునికి సంబంధించి కాబట్టి అయోమయానికి గురవుతారు. తరచూ జలుబుకి లోనవుతారు. ధనవంతులుగా పుట్టినా దైవం వీరికి పరీక్షలు పెడతాడు. అనుకూల నామ సంఖ్యలతో వీటిని నెగ్గవచ్చు. వీరికి ఎప్పుడూ ఏదో ఒక సమస్య ఉంటుంది. కుటుంబ జీవితంలో ఏదో లోటు వుండి, ఆరోగ్యం, జీవిత భాగస్వామి, సంతానం, సంపదలలో ఎంతో కొంత అసంతృప్తి ఉంటుంది. అనుకూల నామ సంఖ్యలతో వీటిని అధిగమించవచ్చు. వీరికి కామర్స్ సబ్జెక్ట్‌పై మక్కువ ఉంటుంది. ప్రస్తుతం ఈ తేదీలో పుట్టిన వారు కంప్యూటర్స్, ఎలక్ట్రానిక్స్, ఎంసీఏ రంగాల్లో రాణిస్తున్నారు. వీరిలో కొందరు సైన్స్ సబ్జెక్ట్ చదివి మరల ఎంబీఏ, ఎల్ఎల్‌బీ వంటి కోర్సులపై కోరికతో తప్పక చదువుతారు.

వీరికి ఇతరులకు సహాయం చేయాలనే కోరిక, అప్రమత్తత, చొరవ ఉంటాయి. నిజాయితీగా ఉండి, చెడ్డ పనులకు దూరంగా ఉంటారు. కష్టించి సంపాదిస్తారు. అనుకూల నామ సంఖ్యలుంటే జీవితం సౌకర్యవంతంగా, సంతృప్తికరంగా ఉంటుంది. ఎంతటి కష్టాన్నైనా భరిస్తారు. కష్టాలలో ఉన్న వారికి సాయం అందిస్తారు. ఆలోచనలను స్పష్టంగా వ్యక్తీకరిస్తారు. అప్పు చేయడానికి ఇష్టపడరు. వీరికి వినయవిధేయతలు ఉంటాయి. ఆప్యాయతతో వీరిని జయించవచ్చు.

వీరు నీతిగా ఉండి ఇతరులు కూడా, అలాగే ఉండాలని కోరుకుంటారు. అనుకూల సంఖ్యలతో పేరుంటే వీరికి జీవితంలో ప్రగతి, గృహ, భూ, వాహన సౌఖ్యాలు ఉంటాయి. ఆకలితో ఉన్న వారిని ఆదరిస్తారు. వాద ప్రతివాదాలలో దిట్ట. ప్రశ్నలు వేయటంలో నేర్పరులు. పెద్దల మాటలను శిరసా వహిస్తారు. న్యాయాన్ని, చట్టాన్ని, మతాన్ని, జ్యోతిష్యాన్ని నమ్ముతారు. విద్యను పూర్తిచేసే ముందు ఎన్నో వైఫల్యాలను ఎదుర్కొని

చివరికి విజయాన్ని సాధిస్తారు. వీరు డెస్టినీ నంబరు 2 కావటం వలన తరచు వారి ఐడియాలని మారుస్తూ ఉంటారు. అదీ కాక ఒక్కోసారి వింతగా ప్రవర్తిస్తుంటారు. కొన్ని సందర్భాలలో మౌనంగాను, మరికొన్ని సందర్భాల్లో అతిగాను మాట్లాడతారు. వీరి ప్రవర్తనలో నిలకడ కొరవడుతుంది. కొందరే ఉద్యోగంలో ఉండి, చాలా మంది వ్యాపారంలో ఉంటారు.

## పేరు పెట్టే విధానం

వీరికి రవి సంఖ్యలైన 19, 37, 46, 55, శుక్ర సంఖ్యలైన 15, 24, 33, 42, 51, 60 సంఖ్యలలో పేర్లు అనుకూలం.

## రాణించే రంగాలు

రవాణా, సరుకు బదిలీ, రాళ్ళు, ఖనిజాలు, రత్నాలు, స్టీలు, విలాసవస్తువు, ద్రవ పదార్థాల వ్యాపారాలు లాభసాటి.

## వ్యాధులు

అధిక ఉష్ణ సంబంధిత వ్యాధులు, పైల్స్, ఉదర సమస్యలు, వెన్నునొప్పి, జలుబులకు లోనవుతారు. సరియైన చికిత్స తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది.

## సూచనలు

| | | |
|---|---|---|
| లక్కీ నంబర్లు | - | 1, 6 |
| అన్‌లక్కీ నంబర్లు | - | 9 |
| లక్కీ తేదీలు | - | 1, 6, 10, 15, 19, 24, 28 |
| అన్‌లక్కీ డేట్స్ | - | 9, 18, 27 |
| లక్కీ కలర్స్ | - | పసుపు, లేతనీలం, గంధపు రంగు, లేత పచ్చ, గులాబీ, ఆరెంజ్ |
| అన్‌లక్కీ కలర్స్ | - | నలుపు, ఎరుపు |
| అదృష్ట దినాలు | - | ఆది, సోమ, శుక్రవారాలు |
| లక్కీ వివాహ తేదీలు | - | 1, 3, 6, 10, 12, 15, 19, 21, 24, 28 |
| రెమిడీస్ | - | సుబ్రహ్మణ్య స్వామి, అమ్మవారి ఆరాధన, |

అనాథ స్త్రీలకు తగిన సహాయం చేయడం
తల్లిని కానీ, తల్లి సమానురాలను కానీ ఆదరించటం

| | | | |
|---|---|---|---|
| ఉదా | - | దాదాభాయ్ నౌరోజీ | 04-09-1825 |
| | | పండిత్ భీమ్‌సేన్ జోషి | 04-02-1922 |

## జన్మ సంఖ్య - 4, డెస్టినీ నంబరు - 3 గల వ్యక్తులు

**4/3 వ్యక్తులు మంచి మేధస్సు కలిగి ఉంటారు. వీరికి మంచి కుటుంబం, సిరి సంపదలు ఉంటాయి. వీరికి మంచి పలువరుస ఉంటుంది.**

ఎవరు 4, 13, 22, 31 తేదీలలో జన్మించి, వారి డెస్టినీ నెంబరు 3 అవుతుందో వారు ఈ వర్గంలోకి వస్తారు. వీరు రాహువు, గురుగ్రహ ప్రభావంలో ఉంటారు. ప్రజల మనుషులు. వీరి మేధస్సుతో, గొప్ప విజయాలతో అత్యున్నత స్థానానికి చేరుకుంటారు. ఇచ్చిన మాటని నిలబెట్టుకుంటారు. సంఘటనలు, ప్రకృతి దృశ్యాలు వివరించటంలో నేర్పరులు. సాధ్యమైనంత సహాయం చేస్తారు. స్నేహితులు తప్పులు చేస్తే ఖండిస్తారు. వీరి ప్రారంభ జీవితం కష్టాలమయం. అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతారు. ఉద్యోగ, వాహన సౌఖ్యాలు పొందుతారు. మంచి కుటుంబం, సంపద లభిస్తుంది. అనుకూల నామసంఖ్యతో క్రమాభివృద్ధి, జీవితంలోను, వ్యాపారంలోను ఉంటుంది. వీరు ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ రంగాలపై ఆసక్తి చూపుతారు. దైవచింతన ఎక్కువగా ఉండటం వలన ఆధ్యాత్మిక పుస్తకాలు, వాటిపై ప్రవచనాలు ఇస్తుంటారు. వీరిలో కొందరు పూజారులు, మఠాధిపతులు, ఆచార్యులు, అధ్యాపకులుగా ఉంటారు. డాక్టర్స్‌గా ముఖ్యంగా సర్జన్లుగా ఉంటే మంచి కీర్తి గడిస్తారు.

వీరికి బోధన, సలహాలిచ్చే సామర్థ్యం ఎక్కువ. ఏదో ఒక పనిలో నిమగ్నమై ఉంటారు. ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకుంటారు. వీరికి పొడవైన, అందమైన కనుబొమ్మలు, మంచి పలు వరుస ఉంటాయి. నవ్వినప్పుడు ముందు రెండు పళ్ళు కనిపిస్తాయి. చక్కటి శరీర సౌష్టవం ఉంటుంది. ఆలోచించి పనిచేస్తారు. ప్రశాంతమైన జీవితాన్ని కోరుకుంటారు.

ప్రభుత్వోద్యోగంలో ఉన్నప్పుడు అధికారులను గౌరవిస్తారు. అధికారులను సంతృప్తిపరిచే విధంగా పనిచేస్తారు. ఉన్నత స్థానాలకు త్వరగా చేరుకుంటారు. కృషి వలన ఉన్నతంగా ఎదుగుతారు. ఇతరులు అభివృద్ధికి ప్రోత్సహిస్తారు. కొందరు రాజకీయాలలో ఉన్నా చాలా మంది వ్యాపారాల్లో ఉంటారు. పరోపకార బుద్ధి ఎక్కువ. వీరు దేశ భక్తులు. దేశాభివృద్ధి, సమాజ అభివృద్ధికై కృషి చేస్తారు. వ్యాపార, పరిశ్రమల వలన అనుకూలం.

## పేరు పెట్టే విధానం

వీరికి రవి సంఖ్యలైన 19, 37, 46, 55, గురు సంఖ్యలైన 3, 21, 30, 39, కుజ సంఖ్యలైన 9, 27, 45, 54 సంఖ్యలలో పేర్లు అనుకూలం.

## రాణించే రంగాలు

మెడికల్ షాపులు, కిరాణా షాపులు, ఫర్నిచర్, స్టీలు, రవాణా వ్యాపారాలు లాభసాటి.

## వ్యాధులు

చర్మ వ్యాధులు, అధిక ఉష్ణ సంబంధిత వ్యాధులు, కీళ్ళ నొప్పులు, గ్యాస్ట్రిక్ ట్రబుల్స్‌కి లోనవుతారు. సరియైన చికిత్స తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది.

## సూచనలు

| | | |
|---|---|---|
| లక్కీ నంబర్లు | - | 1, 3, 9 |
| అన్‌లక్కీ నంబర్లు | - | 2, 7 |
| లక్కీ తేదీలు | - | 1, 3, 10, 12, 19, 21, 28, 30 |
| అన్‌లక్కీ డేట్స్ | - | 2, 7, 11, 16, 20, 25, 29 |
| లక్కీ కలర్స్ | - | పసుపు, లేతనీలం, ఊదా, గులాబి, బూడిదరంగు, వయోలెట్, సిల్వర్ |
| అన్‌లక్కీ కలర్స్ | - | నలుపు, ఎరుపు |
| అదృష్ట దినాలు | - | ఆదివారం, గురువారం, మంగళవారం |
| లక్కీ వివాహ తేదీలు | - | 1, 3, 9, 10, 12, 18, 19, 21, 27, 28 |

రెమిడీస్ - గురుచరిత్ర పారాయణం, సుబ్రహ్మణ్య ఆరాధన, దుర్గామాత ఆరాధన, అనాథలకి, పండితులకు తగిన సహాయం చేయటం

ఉదా - అక్షయ్ ఖన్నా 04-04-1975
రుషీకపూర్ 04-09-1952

## జన్మసంఖ్య - 4, డెస్టినీ నంబరు - 4 గల వ్యక్తులు

**4/4 వ్యక్తులపై రాహు గ్రహ ప్రభావం పూర్తిగా ఉంటుంది. ఇతరులకు సాయం చేస్తుంటారు. రచనలు చేస్తారు.**

ఎవరు 4, 13, 22, 31 తేదీలలో జన్మించి, వారి డెస్టినీ నెంబరు 4 అవుతుందో వారు ఈ వర్గంలోకి వస్తారు. వీరు రాహు గ్రహ ప్రభావంలో ఉంటారు. డబ్బు కన్నా అనుభవాన్ని సంపాదిస్తారు. బలమైన శరీర నిర్మాణం గలవారు. వీరికి నరాల సత్తువ ఎక్కువ. అనుకూల నామ సంఖ్య ఉంటే జీవితంలో అన్ని సౌకర్యాలు ఉంటాయి. లేకపోతే సమస్యలు ఎదుర్కోవలసి వస్తుంది. వీరు జన్మించిన తరువాత తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితి మెరుగవుతుంది. యవ్వనంలోనే అన్ని భౌతిక విషయాల్లో జ్ఞానాన్ని సంపాదిస్తారు. వారి ఆలోచనలను, మాటల ద్వారా, రచనల ద్వారా కఠినమైన శాస్త్రాన్ని కూడా సరళంగా తెలియచేస్తారు. సొంత లాభానికి తక్కువ ఇతరుల కోసం ఎక్కువగా శ్రమిస్తారు. వీరి ఆలోచనలు స్పష్టంగా ఉంటాయి. ఎక్కువ మందికి ప్రయోజనకారులు. ప్రజా సేవచేస్తారు. ఉద్యోగంలో కూడా ఇతరులకు సాయంచేస్తారు. వీరు కొత్త టెక్నాలజీపై ఆసక్తి చూపుతారు. స్పేస్ రీసెర్చ్, కొత్త కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ కనిపెట్టడం వంటి వాటి మీద ఎక్కువగా రీసెర్చ్ చేస్తారు. వీరు డాక్టర్ విద్యను కూడా చదివే అవకాశం ఉంది. మేనేజ్‌మెంట్ కోర్సులపై ఆసక్తి ఉంటుంది.

డబ్బులున్నంత వరకూ వారి ఆలోచనలను ఆచరిస్తారు. లేనప్పుడు కొత్త పథకాన్ని వేస్తారు. వీరికి నమ్మకస్తులైన మిత్రులు ఉంటారు. ఎటువంటి పరిస్థితుల్లోనూ వీరి మిత్రులు వీరిని వదలరు. ప్రకృతి సౌందర్యాన్ని చూసి ఆనందిస్తారు. ఉపన్యాస, రచన, ఇతరులకు సాయం అందించటం ద్వారా పేరు పొందుతారు. అనుకూల నామసంఖ్య ఉంటే సంతోషకరమైన జీవితంతో పాటు గృహ, భూ, వాహన సౌఖ్యాలను పొందుతారు.

వీరిని వారి సలహాలకై ఎందరో సంప్రదిస్తారు. వీరు ఎప్పుడూ మాట్లాడుతూనే ఉంటారు. అందరికీ మంచి చెబుతూ ఇతరులకు ఆనందాన్ని కల్గిస్తారు. డబ్బు సంపాదనలో కష్టాన్ని ఎదుర్కొంటారు. వయసు పెరిగే కొద్ది రచయితలు, కవులు, వక్తలు, నాయకులుగా ఎదుగుతారు.

అనుకూల నామం ఉంటే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారు. తమ ప్రత్యేకతను ప్రపంచానికి తెలియజేస్తారు. వీరికి రచనలు, జ్యోతిష్యం, వేదాంతం, వైద్య శాస్త్రాలందు ప్రవేశం ఉంటుంది. దేవునిపై నమ్మకం ఉంటుంది.

## పేరు పెట్టే విధానం

వీరికి రవి సంఖ్యలైన 19, 37, 46, 55, బుధ సంఖ్యలైన 5, 14, 23, 32, 41, 50, 59, శుక్ర సంఖ్యలైన 6, 15, 24, 33, 42, 51, 60, 69 లు పేర్లకు అనుకూలం.

## రాణించే రంగాలు

వీరికి ఉపన్యాస, రచన, బేరసారాలు, ఖనిజ, రత్న, స్టీలు, రవాణా వ్యాపారాలు, వైద్యం, ఫార్మసీ, మేనేజ్‌మెంట్ రంగాలు లాభసాటిగా ఉంటాయి.

## వ్యాధులు

కీళ్ళనొప్పులు, ఉదరకోశ సమస్యలు, అధిక ఉష్ణ సంబంధ వ్యాధులు, మూత్ర సంబంధిత వ్యాధులు రావొచ్చు. సరియైన చికిత్స తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది.

## సూచనలు

| | | |
|---|---|---|
| లక్కీ నంబర్లు | - | 1, 5, 6, 9 |
| అన్‌లక్కీ నంబర్లు | - | 2, 7 |
| లక్కీ తేదీలు | - | 1, 10, 19, 28, 6, 15, 24 |
| అన్‌లక్కీ డేట్స్ | - | 2, 7, 11, 16, 20, 25, 29 |
| లక్కీ కలర్స్ | - | పసుపు, లేతనీలం, గంధం రంగు, బూడిదరంగు, గోల్డెన్ |
| అన్‌లక్కీ కలర్స్ | - | నలుపు, ఎరుపు, కాఫీ |
| అదృష్ట దినాలు | - | ఆదివారం, మంగళవారం, బుధవారం, శుక్రవారం |
| లక్కీ వివాహ తేదీలు | - | 1, 6, 9, 10, 15, 18, 19, 24, 27, 28 |

| | | |
|---|---|---|
| రెమిడీస్ | – | సుబ్రహ్మణ్య స్వామి ఆరాధన, వికలాంగులకు, అనాథలకు, రోగులకు ఆహారాన్ని ఇవ్వటం. |
| ఉదా | – | సరోజినినాయుడు 13-02-1879 |
| | | శ్రీనివాస రామానుజమ్ 22-12-1887 |

## జన్మసంఖ్య-4, డెస్టినీ నంబరు - 5 గల వ్యక్తులు

**4/5 వ్యక్తులు ధనం బాగా సంపాదిస్తారు. దాని తరువాత స్థూలకాయం వస్తుంది. వీరికి ధైర్యం ఎక్కువ. నచ్చని దాన్ని ధైర్యంగా ఎదుర్కొంటారు.**

ఎవరు 4, 13, 22, 31 తేదీలలో జన్మించి, వారి డెస్టినీ నెంబరు 5 అవుతుందో వారు ఈ వర్గంలోకి వస్తారు. వీరు రాహువు, బుధ గ్రహ ప్రభావితులు. గంభీరంగా కనిపిస్తారు. వీరు ధనవంతులైతే తొందరగా స్థూలకాయం వస్తుంది. వీరు ఏ పనినైనా వేగంగా చేస్తారు. నెమ్మదస్తులను ఇష్టపడరు. వీరికి జ్ఞాపకశక్తి ఎక్కువ. ఇతరులు చెప్పేది అలాగే మైండ్‌లో ఫిక్స్ అయిపోతుంది. తాము చెప్పేది అర్థం చేసుకోలేకపోతే వీరికి కోపం వస్తుంది. వీరు విజయాన్ని సాధించటానికి, వారి మేధస్సును పూర్తి స్థాయిలో ఉపయోగించుకొని, మెరుపు వేగంతో పనిచేస్తారు. విశాల హృదయులు. డబ్బు విచ్చలవిడిగా ఖర్చు చేస్తారు. ఎక్కువ డబ్బు వచ్చే పెద్ద ప్రాజెక్టులనే చేపడతారు. లక్ష్య సాధనకు శ్రమిస్తారు. అందరితో స్నేహంగా ఉంటారు. కొత్త వాళ్లు, అపరిచితులు వీరిని అహంభావులుగా అపార్థం చేసుకుంటారు. కొన్నిసార్లు పెద్ద ప్రాజెక్టులు చేపట్టి సమస్యల్లో చిక్కుకుంటారు. కానీ చివరికి విజయం సాధిస్తారు. ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ మరియు మేనేజ్‌మెంట్ కోర్సులపై ఎక్కువ ఆసక్తి చూపుతారు. రియల్‌ఎస్టేట్, బ్రోకరేజ్, పీఆర్‌ఓ, ఎగుమతులు, దిగుమతులు వంటి వ్యాపారాలు ఎక్కువగా కలిసివస్తాయి.

కొందరు అనైతికంగా వ్యాపారం చేసి తర్వాత పశ్చాత్తాపపడతారు. సంభాషణా చాతుర్యంతో ఎన్నో పనులను సాధిస్తారు. ఎక్కువ ప్రయాణాలు చేస్తారు. అధికఉష్ణంతో బాధపడతారు. మంచి వేషధారణ, హావభావాలతో అందరిని ఆకర్షిస్తారు. తమకు తోచినది ధైర్యంగా చెప్తారు. దీని వలన శత్రువులు ఉంటారు. వీరు ఒంటరిగా ఉండరు.

అనుకూల నామం ఉంటే వాహన, భూ, గృహ, సంపదలు లభిస్తాయి. ప్రతికూల పేరుంటే ఆందోళనలకు లోనవుతారు. ధైర్యంగా వీరికి నచ్చనది దేనినైనా వ్యతిరేకిస్తారు. పని పూర్తి చేయుటలో దిట్టలు. పర్యవసానం ఆలోచించకుండా ఇతరులకు సాయం చేస్తారు. ఉపన్యాసాల ద్వారా రచనల ద్వారా మార్పు తేవడానికి ప్రయత్నిస్తారు.

భగవద్ధ్యానం ద్వారా ప్రశాంతత పొందుతారు. రచనలు, మతం, జ్యోతిష్యంపై అభిరుచి ఉంటుంది. పెద్దగా తెలియని విషయాలను కూడా ఎంతో తెలిసినట్లు మాట్లాడతారు. శారీరక సౌఖ్యాన్ని ఇష్టపడతారు. అన్ని రకాల అలవాట్లను, వ్యాపకాలను ఆనందిస్తారు. డబ్బున్నప్పుడు ఆనందంగా, లేనప్పుడు కోపంగా ఉంటారు.

## పేరు పెట్టే విధానం

వీరికి సూర్య సంఖ్యలైన 19, 37, 46, 55, బుధ సంఖ్యలైన 5, 14, 23, 32, 41, 50, శుక్ర సంఖ్యలైన 6, 15, 24, 33, 42, 51, 60 లలో పేర్లు అనుకూలం.

## రాణించే రంగాలు

కమీషన్ వ్యాపారం, ఏజెన్సీలు, రవాణా, స్టీలువ్యాపారాలు లాభసాటిగా ఉంటాయి.

## వ్యాధులు

అధికఉష్ణ సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. వీరు ఉప్పు, చక్కెర తక్కువగా వాడాలి.

## సూచనలు

| | | |
|---|---|---|
| లక్కీ నంబర్లు | - | 1, 6, 5 |
| అన్‌లక్కీ నంబర్లు | - | --- |
| లక్కీ తేదీలు | - | 1, 5, 6, 10, 14, 15, 19, 23, 24, 28 |
| అన్‌లక్కీ డేట్స్ | - | --- |
| లక్కీ కలర్స్ | - | పసుపు, లేతనీలం, గంధం, బూడిద రంగు, ఆకుపచ్చ |
| అన్‌లక్కీ కలర్స్ | - | నలుపు, ఎరుపు, కాఫీ |
| అదృష్ట దినాలు | - | ఆదివారం, బుధవారం, శుక్రవారం |
| లక్కీ వివాహ తేదీలు | - | 1, 3, 6, 10, 12, 15, 19, 21, 24, 28, 30 |
| రెమిడీస్ | - | సుబ్రహ్మణ్య స్వామి ఆరాధన, విష్ణుమూర్తి ఆరాధన మరియు |

అనాథలు, బీద అమ్మాయిల పెండ్లి ఖర్చులలో
పాలుపంచుకోవటం చెప్పదగ్గ రెమెడీస్

| | | | |
|---|---|---|---|
| ఉదా | - | చిరంజీవి | 22-08-1955 |
| | | వెంకటేష్ | 13-12-1960 |
| | | నీలం సంజీవరెడ్డి | 13-05-1913 |

## జన్మసంఖ్య-4, డెస్టినీ నంబరు - 6 గల వ్యక్తులు

**4/6 వ్యక్తులు కళల ద్వారా ధన సంపాదన చేస్తారు. ఏ పనైనా పూర్తిగా చేయరు. వీరికి పరిశుభ్రత ఎక్కువ.**

ఎవరు 4, 13, 22, 31 తేదీలలో జన్మించి, వారి డెస్టినీ నెంబరు 6 అవుతుందో వారు ఈ వర్గంలోకి వస్తారు. వీరు రాహువు, శుక్ర గ్రహ ప్రభావంలో ఉంటారు. ధైర్యవంతులు. వీరికి ఆకర్షణ శక్తి ఉంటుంది. తమ ప్రసంగాలతో ఇతరులను ఆకట్టుకుంటారు. అందమైన వస్తువులను ఇష్టపడతారు. అందంగా ఉంటారు. ఇతరులను వినోదపరిచి డబ్బును సంపాదిస్తారు. వినోద కళల ద్వారా జీవితంలో రాణిస్తారు. అనుకూలమైన పేరు ఉంటే విలాసాలన్నింటిని అనుభవిస్తారు. వీరి జీవితం వడ్డించిన విస్తరిలా ఉంటుంది. ప్రజల మనిషిగా ఉంటారు. మంచి మనసు ఉన్నవారు. స్నేహితులు ఉన్నత స్థానానికి ఎదగటానికి సాయపడతారు. పని పూర్తి చేసేంత వరకు ఓపిక ఉండదు. మధ్యలో వదిలేసి మరొకటి ప్రారంభిస్తారు. వీరికి ఇంజినీరింగ్ మరియు మేనేజ్‌మెంట్ కోర్సులతో పాటు మ్యూజిక్, లలితకళల వంటి వాటిపై ఆసక్తి ఉంటుంది. ఫ్యాషన్ టెక్నాలజీ మరియు టీవీ, సినిమా వంటి రంగాల్లో బాగా రాణిస్తారు. వీరిని చాలా మంది గుర్తిస్తారు.

తొలినాళ్ళలో కష్టాలెదురైనా చివరికి సౌఖ్యవంతమైన జీవితాన్ని అనుభవిస్తారు. ముఖ్యంగా వివాహ అనంతరం చాలా ఉన్నత స్థితికి వస్తారు. కొందరు ప్రతికూల నామ ప్రభావంతో సామర్థ్యమున్ననూ రాణించరు. మంచి ఇల్లు, కారు, అందమైన వస్తువులను కల్గి ఉండి వాటిని ప్రదర్శిస్తారు. మంచి అభిరుచి ఉంటుంది. సంగీతం, నాట్యం క్రీడలను ఆనందిస్తారు. పదిమందిలో శుభ్రంగా కనిపిస్తారు. పాత వాహనాలను కొన్నా కొత్తవాటిగా

తీర్చిదిద్దుతారు. వీరికి మంచి కుటుంబ జీవితం ఉంటుంది. వీరి భాష స్పష్టమైనది. వీరు ఒక వస్తువు గురించి వివరిస్తే, దాన్ని కొనాలనే కోరిక పుడుతుంది. వీరు వ్యాపారులైతే తమ మాటతీరుతో వ్యాపారం బాగా చేస్తారు. చాలా మంది పరిశ్రమలు స్థాపించి పెద్ద ఎత్తున ధనసంపాదన చేస్తారు.

## పేరు పెట్టే విధానం

వీరికి సూర్య సంఖ్యలైన 19, 37, 46, 55, శుక్ర సంఖ్యలైన 6, 15, 24, 33, 42, 51, బుధ సంఖ్యలైన 5, 14, 23, 32, 41 లలో పేర్లు అనుకూలం.

## రాణించే రంగాలు

కళలు, విలాస వస్తువు అమ్మకాలు, స్టీలు, రవాణా వ్యాపారాలు, మందుల వ్యాపారాలు, టీవీ, సినిమా రంగాలు అనుకూలం.

## వ్యాధులు

చర్మ వ్యాధులు, అధిక ఉష్ణ సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుంది. సరియైన చికిత్స తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది.

## సూచనలు

| | | |
|---|---|---|
| లక్కీ నంబర్లు | - | 1, 6, 9, 5 |
| అన్‌లక్కీ నంబర్లు | - | 3 |
| లక్కీ తేదీలు | - | 1, 5, 6, 9, 10, 14, 15, 18, 19, 23, 24, 27, 28 |
| అన్‌లక్కీ డేట్స్ | - | 3, 12, 21, 30 |
| లక్కీ కలర్స్ | - | పసుపు, లేతనీలం, లేత ఆకుపచ్చ, తెలుపు, క్రీమ్, ఎరుపు, ఆరెంజ్ |
| అన్‌లక్కీ కలర్స్ | - | నలుపు, ఊదా |
| అదృష్ట దినాలు | - | ఆదివారం, మంగళవారం, బుధవారం, శుక్రవారం |
| లక్కీ వివాహ తేదీలు | - | 1, 6, 9, 10, 15, 18, 19, 24, 27, 28 |
| రెమిడీస్ | - | సుబ్రహ్మణ్య స్వామి ఆరాధన, శుక్రజపం, అన్నదానం చేయడం. |
| ఉదా | - | కిశోర్ కుమార్ 04-08-1929 |

# జన్మసంఖ్య - 4, డెస్టినీ నంబరు - 7 గల వ్యక్తులు

**4/7 వ్యక్తులు నీతి, నిజాయితీ కలిగి వేదాంత ధోరణిలో ఉంటారు. వీరికి జ్ఞాపక శక్తి ఎక్కువ. వీరు ధనవంతులైతే లావెక్కుతారు.**

ఎవరు 4, 13, 22, 31 తేదీలలో జన్మించి వారి డెస్టినీ నెంబరు 7 అవుతుందో వారు ఈ వర్గంలోకి వస్తారు. వీరు రాహువు, కేతు గ్రహ ప్రభావంలో ఉంటారు. వీరికి అధిక మేథస్సు, తెలివితేటలు, ఆత్మ జ్ఞానం, దైవంపై విశ్వాసం ఉంటాయి. ఒంటరితనాన్ని కోరుకుంటారు. ఆలోచనల్లో మునిగిపోతారు. వింత కలలు వస్తాయి. దైవబలం చేత వేదాంతులుగా ప్రవర్తిస్తారు. అన్ని సౌఖ్యాలు ఉన్నా వాటిని కోల్పోతామని ఆందోళన చెందుతారు. అనుకూలమైన పేరు ఉంటే గృహ, వాహన, భూ, కళా ప్రదర్శనశాలలు, కర్మాగారాలు ఉంటాయి. సంగీతం, చిత్రలేఖనం, హస్తకళలు నేర్చుకుంటారు. వీరిని చూడగానే నమస్కరించాలని అనిపిస్తుంది. వీరికి జ్యోతిష్యపరంగా కాలసర్ప దోషం ఉండే అవకాశం ఉంది. సివిల్, మెకానికల్, కంప్యూటర్ ఇంజినీరింగ్ కోర్సులపై ఆసక్తి ఉంటుంది. కొందరు డాక్టర్లుగా, సర్జన్లుగా చాలా మంచి పేరుతో రాణిస్తారు.

కల్పనలో నిమగ్నమై ఉంటారు. దీని వలన నూతన వస్తు ఆవిష్కరణలు, ఉపన్యాస ప్రసంగం, రచనా, వ్యాసంగాలపై దృష్టి ఉంటుంది. ప్రతికూలమైన పేరు ఉంటే ఎంత ప్రతిభ ఉన్నా జీవితంలో రాణించలేరు. వీరు నీతి, నిజాయితీలతో చురుకైన మాటతీరును కనబరుస్తారు. జగమే మాయ అని బాధపడతారు. పనిని స్పష్టమైన వైఖరితో పూర్తి చేస్తారు. మంచిపేరు పొందుతారు. వీరికి మంచి జ్ఞాపకశక్తి ఉంటుంది.

ఒకసారి సంకల్పిస్తే, మార్పుకి అంగీకరించరు. తమకు నచ్చని పని చేయరు. ఇతరులు కూడా చేయకూడదని ఆశిస్తారు. కళలలో ప్రముఖులుగా ఉంటారు. ధ్యానం చేస్తారు. ప్రార్థన ద్వారా వ్యాధి నివారణ చేస్తారు. ఆలోచనలను స్పష్టంగా తెలియచేస్తారు. ఎవరైనా కఠినంగా మాట్లాడితే గుర్తుకు తెచ్చుకుని మరీ బాధపడతారు. వీరు అతి సున్నితమనస్కులు, ఏదైనా పని ప్రారంభించే ముందు ఎంతో ఆలోచిస్తారు. స్నేహితులతో సరదాగా ఉంటారు.

జీవితంలో కష్టాల్లేకుండా ఎలా పైకి రావాలో సాధ్యాసాధ్యాల గూర్చి ఆలోచిస్తారు.

ధైర్యం చేయక ఒక్కోసారి వెనుకంజ వేస్తారు. కుటుంబ జీవితంపై కొందరికి ఆసక్తి ఉండదు. అరుదైన వస్తు సేకరణ చేస్తారు. రుచి గల ఆహారాన్ని ఇష్టపడతారు. వీరు ధనవంతులైతే స్థూలకాయం వస్తుంది. ఆహారనియమాలు పాటించాలి. వ్యాయామం తప్పనిసరి. అనుకూలమైన పేరుతో సంతోషకర జీవితాన్ని పొందుతారు.

## పేరు పెట్టే విధానం

వీరికి సూర్య సంఖ్యలైన 19, 37, 46, 55, బుధ సంఖ్యలైన 5, 14, 23, 32, 41, 50, శుక్ర సంఖ్యలైన 6, 15, 24, 33, 42, 51 లలో పేర్లు అనుకూలం.

## రాణించే రంగాలు

కళా సంబంధిత, రచనా, ఉపన్యాస వ్యాసంగాల ద్వారా రాబడి ఉంటుంది. కమీషన్ వ్యాపారం, ఏజెన్సీ, విలాస వస్తువులు, రవాణా వ్యాపారాలు లాభసాటిగా ఉంటుంది.

## వ్యాధులు

తలనొప్పి, ఉదర సమస్యలు, పంటినొప్పి, వెన్నునొప్పులకు లోనవుతారు. అధిక ఉష్ణ సంబంధిత వ్యాధులకు లోనవుతారు. సరియైన చికిత్స తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది.

## సూచనలు

| | | |
|---|---|---|
| లక్కీ నంబర్లు | - | 1, 4, 5, 6, 7 |
| అన్‌లక్కీ నంబర్లు | - | 9 |
| లక్కీ తేదీలు | - | 5, 6, 7, 10, 11, 14, 15, 16, 19, 23, 24, 25, 28 |
| అన్‌లక్కీ డేట్స్ | - | 9, 18, 27 |
| లక్కీ కలర్స్ | - | పసుపు, లేతనీలం, లేత ఆకుపచ్చ, సిల్వర్, తెలుపు |
| అన్‌లక్కీ కలర్స్ | - | నలుపు, ఎరుపు |
| అదృష్ట దినాలు | - | ఆది, బుధ, సోమవారాలు |
| లక్కీ వివాహ తేదీలు | - | 1, 6, 10, 15, 19, 24, 28 |
| రెమిడీస్ | - | సుబ్రహ్మణ్య స్వామి ఆరాధన, రాహు మరియు కేతు పూజ, శివ అభిషేకము, పార్వతి అమ్మవారి ఆరాధన. |

## జన్మసంఖ్య - 4, డెస్టినీ నంబరు - 8 గల వ్యక్తులు

**4/8 వ్యక్తులు స్వేచ్ఛా జీవితం కోరుకుంటారు. వీరిని జ్ఞానులుగా అందరూ గుర్తిస్తారు. మంచి వాక్పటిమ ఉంటుంది. రచనలు, మతం, జ్యోతిష్యంలో అభిరుచి ఉంటుంది.**

ఎవరు 4, 13, 22, 31 తేదీలలో జన్మించి, వారి డెస్టినీ నెంబరు 8 అవుతుందో వారు ఈ వర్గంలోకి వస్తారు. వీరు రాహువు, శనిగ్రహ ప్రభావంలో ఉంటారు. స్వేచ్ఛా జీవితాన్ని కోరుకుంటారు. అన్ని ముఖ్య ప్రదేశాలను దర్శించాలని కోరుకుంటారు. వీరికి జీవితానుభవం ఎక్కువ. వీరిని జ్ఞానులుగా స్నేహితులు గుర్తిస్తారు. వినేవాళ్ళు ఆశ్చర్యానికి లోనయ్యే విధంగా, తాము చూసిన ప్రదేశాలను, ఘటనలను మనోరంజకంగా వివరిస్తారు. గంభీరంగా, అప్రమత్తంగా ఉంటారు. కళ్ళు ఉబ్బినట్లు ఉంటాయి. ముందు రెండు దంతాలు పెద్దవిగా ఉంటాయి. కొందరికి ఎగుడుదిగుడు పలు వరుస ఉంటుంది. వీరికి మేనేజ్‌మెంట్ స్కిల్స్ ఉంటాయి. ఎలాంటి వారితో అయినా పని చేయించ గల సామర్థ్యం ఉంటుంది. వీరు హార్డ్‌వర్క్‌కి మారుపేరు. కృషితో జీవితంలో ఉన్నత స్థానానికి వస్తారు. మెకానికల్, సివిల్ మరియు కంప్యూటర్ ఇంజినీరింగ్ లేక ఐసిడబ్ల్యూ, సీఏ కోర్సులు చేస్తారు. తర్వాత తప్పక మేనేజ్‌మెంట్ కోర్సులు అంటే ఎంబీఏ వంటి కోర్సులు చేసి బ్యాంకులు, ఇన్సూరెన్స్, అకౌంటింగ్ రంగాల్లో రాణిస్తారు.

వీరు ధైర్యంగా, నిక్కచ్చిగా తమ అభిప్రాయాలు వెల్లడించడంతో కొందరు అపార్థం చేసుకుంటారు. తమకు కలిగే అనుభవాల ద్వారా తమ ప్రవర్తనను మార్చుకుని, ఇతరులతో సర్దుకుపోతారు. కొందరు ఇతరుల అభిప్రాయాలని వ్యతిరేకించి వీరి ఉద్దేశాలను సమర్థించుకొంటారు. మంచి వాక్పటిమ ఉంటుంది. వీరిని మంచివారిగా అందరూ గుర్తిస్తారు. ద్వంద్వవైఖరి అవలంభించరు. పిల్లలంటే ఇష్టం కలిగి ఉంటారు.

అనుకూలమైన పేరు ఉంటే అన్నింటా విజయాన్ని పొంది, ఆర్థిక సౌఖ్యం, భద్రతను పొందుతారు. లేకపోతే కుటుంబ జీవితంలో కల్లోలం, విద్యా విఘ్నాలు ఉంటాయి. పేరు అనుకూలంగా ఉంటే విద్యలో విజయం, అనుకూల జీవిత భాగస్వామి, మంచి సంతానం, భూమి, ఇల్లు, వాహన సౌఖ్యం కలుగుతాయి.

వ్యాపార రంగంలో రాణిస్తారు. వీరు ఏ కోర్సు చేసినా చివరికి ఎం.బి.ఎ చేయాలనే కోరిక ఉంటుంది. అకౌంటింగ్, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ రంగాలలో ఎక్కువ ఉద్యోగాలు చేస్తుంటారు. చాలా ఉదార స్వభావులు. చాలా మంది వ్యాపార పరిశ్రమలలోను లేదా పెద్ద హోదాలో ఉద్యోగాలు చేస్తారు. సంపాదించాలన్న కాంక్షతో పలు రకాల ఆదాయాలను కల్గి ఉంటారు. మంచి జీవిత భాగస్వామి లభిస్తారు. తల్లిదండ్రులను ఆదరిస్తారు. చివరి వరకు తల్లిదండ్రులకు సహాయ, సహకారాలు అందిస్తారు. అందరికి నచ్చే విధంగా ఉంటారు. సమయస్ఫూర్తి అవసరం. ఆలోచనా రహితంగా అహంభావ పూరితంగా మాట్లాడరాదు. అనవసర విషయాలకు ఆందోళన చెందుతారు. వీరిని చాలా మంది అపార్థం చేసుకుంటారు.

రచనలు, మతం, వైద్యం, జ్యోతిష్యం, హస్తకళల యందు అభిరుచి ఉంటుంది. ప్రగతి సాధించేందుకు శ్రమిస్తారు. వీరు అప్రమత్తంగా ఉంటే అదే పనిగా పనిచేస్తారు.. అనుకూలమైన పేరుతో జీవితంలో అభివృద్ధి సాధించవచ్చు.

## పేరు పెట్టే విధానం

వీరికి సూర్య సంఖ్యలైన 19, 37, 46, 55, బుధ సంఖ్యలైన 5, 14, 23, 32, 41, 50, శుక్ర సంఖ్యలైన 6, 15, 24, 33, 42 లలో పేర్లు అనుకూలం.

## రాణించే రంగాలు

హస్తకళలు స్టీలు, రవాణా, వ్యాపార చర్చలు, కమీషన్ వ్యాపారాలు, ఏజెన్సీలు లాభదాయకంగా ఉంటాయి.

## వ్యాధులు

అధిక ఉష్ణ సంబంధిత వ్యాధులు, కీళ్ళ నొప్పులు, ఉదర సమస్యలు, వెన్నునొప్పిలకు లోనవుతారు. సరియైన చికిత్స తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది.

## సూచనలు

| | | |
|---|---|---|
| లక్కీ నంబర్లు | - | 1, 5, 6 |
| అన్‌లక్కీ నంబర్లు | - | 9 |
| లక్కీ తేదీలు | - | 1, 5, 6, 10, 14, 15, 19, 23, 24, 28 |
| అన్‌లక్కీ డేట్స్ | - | 9, 18, 27 |

| | | |
|---|---|---|
| లక్కీ కలర్స్ | - | పసుపు, లేతనీలం, నీలం, గోల్డెన్, సిల్వర్, బ్లూ |
| అన్‌లక్కీ కలర్స్ | - | నలుపు, ఎరుపు |
| అదృష్ట దినాలు | - | ఆది, బుధ, శుక్ర, శనివారాలు |
| లక్కీ వివాహ తేదీలు | - | 1, 3, 6, 10, 12, 15, 21, 24, 28 |
| రెమిడీస్ | - | సుబ్రహ్మణ్య స్వామి ఆరాధన, శివ ఆరాధన, శనికి తైలాభిషేకం, అనాథలకు అన్నదానం, కాకులకు స్వీట్ పెట్టడం. |
| ఉదా | - | సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ 31-10-1875 |

## జన్మసంఖ్య - 4, డెస్టినీ నంబరు - 9 గల వ్యక్తులు

**4/9 వ్యక్తులు ఎర్రని కళ్ళు కలిగి ఉంటారు. మాటలతో పనులు చేయిస్తారు. తమను నమ్ముకున్న వారికి సాయం చేస్తారు. పొగడ్తలకు లొంగిపోతారు.**

ఎవరు 4, 13, 22, 31 తేదీలలో జన్మించి వారి డెస్టినీ నెంబరు 9 అవుతుందో వారు ఈ వర్గంలోకి వస్తారు. వీరు రాహువు, కుజ గ్రహ ప్రభావంలో ఉంటారు. మంచి శరీర దారుఢ్యంతో బలంగా కనిపిస్తారు. ఎరుపు కళ్ళతో అందంగా ఉంటారు. ధైర్యంగా మాట్లాడుతూ ఆత్మవిశ్వాసంగా కనిపిస్తారు. మిత్రులకు విశ్వాసపాత్రులుగా, శత్రువులకు అపకారిగా ఉంటారు. వీరు ధనం కంటే మంచి మద్దతుదారులను, అధికారాన్ని పొందుతారు. కరకు గొంతు ఉండొచ్చు. మాటలతో పనులను సాధిస్తారు. వీరిపై ఆధారపడిన వారికి సాయం చేస్తారు. గౌరవించాల్సిన చోట గౌరవిస్తారు. బెదిరించాల్సిన చోట బెదిరిస్తారు. వీరు సివిల్ కాని మెకానికల్ ఇంజినీరింగ్ కాని చేస్తారు. వీరిలో చాలా మంది డాక్టర్లుగా, సర్జన్లుగా ఉంటారు. వీరిలో కొందరు సంఘ విద్రోహులు కూడా కన్పిస్తారు.

అనుకూలమైన పేరు ఉంటే అన్ని రకాల వ్యాపారాల్లో లాభాలు ఉంటాయి. లేకపోతే అభివృద్ధికి శ్రమించాల్సి వస్తుంది. అనుకూలనామంతో ఉన్నత స్థానాన్ని పొందవచ్చు. 4వ నంబరు వ్యక్తులలో కొంచెం దుడుకు స్వభావం వీరికే ఉంటుంది.

పేరు మార్పుతో లక్ష్యాలను సాధించగలరు. లాభ, నష్టాలకు చలించరు. ఎటువంటి దురలవాట్లు ఉండవు. వాహనాలు నడుపుతారు. ఎవరి వలన మోసపోరు, ఎవరినీ మోసపుచ్చరు. తమకు తోచిన విధంగా ప్రవర్తిస్తారు. అనుకూల నామంతో, మంచి జీవితం, మంచి జీవిత భాగస్వామి, మంచి సంతానం, మంచి అలవాట్లు, పద్ధతులు, గొప్ప ఉద్యోగాలు, వాహనం, గృహం లభిస్తాయి. పేదవారి నుంచి, రాజు వరకు అందరితో కలిసిమెలిసి ఉంటారు. ఉద్యోగులయితే పోటీని ఎదుర్కొంటారు. అనుకూల నామంతో ఉన్నత స్థానాన్ని సులభంగా చేరవచ్చు. వీరు కంప్యూటర్, సివిల్, మెకానికల్ ఇంజనీరింగ్ రంగాలలో రాణిస్తారు. భూ సంబంధమైన వ్యాపారాలలో అభివృద్ధి ఉంటుంది. వీరికి కోపం త్వరగా వస్తుంది. దానిని అదుపులో ఉంచుకుంటే అభివృద్ధి ఉంటుంది.

పుస్తక జ్ఞానంతో కన్న ఇంగిత జ్ఞానంతో దేన్నైనా సాధించవచ్చని నమ్ముతారు. సామ, దాన, భేద, దండోపాయాలతో కార్యసాధన చేస్తారు. అంచెలంచెలుగా ఉన్నత శిఖరాలను చేరుకుంటారు. పొగడ్తలకు లొంగుతారు. కఠినంగా మాట్లాడినా మిత్రులతో సఖ్యతగా ఉంటారు. జ్యోతిష్య, న్యాయ, మత, కళలందు అభిరుచి ఉంటుంది. ఇతరులతో పనిచేయించడంలో దిట్ట. చాలా మంది ఉద్యోగాలు, రాజకీయాల్లో వుంటారు. రాజకీయ సలహాదారులుగా రాణిస్తారు.

## పేరు పెట్టే విధానం

వీరికి సూర్య సంఖ్యలైన 19, 37, 46, 55, బుధ సంఖ్యలైన 5, 14, 23, 32, 41, శుక్ర సంఖ్యలైన 6, 15, 24, 33, 42, కుజ సంఖ్యలైన 9, 27, 45, 54 లలో పేర్లు అనుకూలం.

## రాణించే రంగాలు

వీరికి కమీషన్ వ్యాపారం, కాంట్రాక్టులు, భూ, స్టీలు, మధ్యవర్తిత్వం ద్వారా సంపాదన వస్తుంది.

## వ్యాధులు

నరాల సమస్యలు, అధిక ఉష్ణోగ్రత సంబంధిత జబ్బులు, రక్తపోటు, మధుమేహం, వెన్నునొప్పి, కీళ్ళనొప్పులు వచ్చే అవకాశం ఉంది. సరియైన చికిత్స తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది.

**సూచనలు**

| | | |
|---|---|---|
| లక్కీ నంబర్లు | - | 6, 1, 5, 9 |
| అన్‌లక్కీ నంబర్లు | - | |
| లక్కీ తేదీలు | - | 6, 15, 24, 1, 10, 19, 28, 5, 14, 23, 9, 18, 27 |
| అన్‌లక్కీ డేట్స్ | - | 8, 17, 26, 2, 11, 20, 29, 7, 16, 25 |
| లక్కీ కలర్స్ | - | పసుపు, నీలం, ఎరుపు |
| అన్‌లక్కీ కలర్స్ | - | నలుపు, కాఫీరంగు |
| అదృష్ట దినాలు | - | - - - - |
| లక్కీ వివాహ తేదీలు | - | 1, 3, 6, 9, 10, 12, 15, 18, 19, 21, 24, 27, 28 |
| రెమిడీస్ | - | సుబ్రహ్మణ్య స్వామి ఆరాధన, దుర్గామాత ఆరాధన, రక్తదానం చేయటం, అనాథలకు అన్నదానం చేయటం వంటివి చెప్పుకోదగ్గ రెమిడీస్ |
| ఉదా | - | దావుద్ ఇబ్రహీం 31-12-1955 |
| | | ఆర్.వెంకట్రామన్ 04-12-1910 (మాజీ రాష్ట్రపతి) |

# జన్మ సంఖ్య - 5 (బుధుని సంఖ్య)

**5వ సంఖ్య బుధ గ్రహానికి చిహ్నం. 5వ సంఖ్య కలవారు ఉద్యోగమైనా, వ్యాపారమైనా బాగా చేస్తారు. స్వేచ్ఛాప్రియులు. చిన్న పిల్లల మనస్తత్వం కలిగి ఉంటారు. యవ్వనంగా కనిపించాలనుకుంటారు. అలంకార ప్రియులు. వీరికి స్థిరత్వం కొంచెం తక్కువ. కొత్తదనాన్ని ఇష్టపడతారు. వీరు పనిచేసే సంస్థ వీరి వలన వృద్ధిలోకి వస్తుంది.**

ఏ నెలలోనైనా 5, 14, 23 తేదీల్లో జన్మిస్తే వారు 5వ నెంబరు వ్యక్తులవుతారు. వీరిపై బుధ గ్రహ ప్రభావం ఉంటుంది.

## 5వ నంబరు వ్యక్తుల పాజిటివ్ లక్షణాలు

శక్తి, బహుముఖప్రజ్ఞ, సర్వసమృద్ధి, క్రియాశీలత, స్వేచ్ఛా ప్రియత్వం, మార్పు, వినోదం, ఉల్లాసం, శృంగారం, వేగవంతమైన ఆలోచన, తెలివితేటలు, కార్యనిర్వహణ.

## అవకాశాలు, వృత్తి

5వ నెంబరు వ్యక్తులు సాధారణంగా గొప్ప ప్రారంభకులు కానప్పటికీ చురుకుతనం, ఏ పనినైనా చేసే సామర్థ్యం వీరిని విజేతలుగా నిలబెడుతుంది. వీరు సహజంగా మంచి స్థాయిలో ఉంటారు. ఏదైనా కొత్తది, ఇంతవరకూ ఎవరూ చేయనిది, ప్రజాసంబంధమైన కార్యాలలో విజయం సాధిస్తారు. అందరితో ఎలా మసలుకోవాలో, పనులు ఎలా చక్కబెట్టుకోవాలో తెలిసినవారు. స్వేచ్ఛని కోరుకుంటారు. ఇతరుల జోక్యాన్ని సహించరు.

ప్రజాప్రయోజనకరమైన, ప్రజా సంబంధమైన ఏ పనినైనా, ఉద్యోగాన్నైనా, వ్యాపారాన్నైనా అద్భుతంగా విజయవంతంగా నిర్వహిస్తారు. పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, ఎంతో మందికి ఉపాధి కల్పించే పారిశ్రామికవేత్తలుగా, రవాణా సంస్థలలో, పర్యాటక సంస్థలలో మేనేజరుగా రాణిస్తారు. క్రీడలు, ఆటల నిర్వాహకులుగా, ప్రజారంజకమైన వినోద కార్యక్రమాలు, వినోద సాధనా రంగాలు, న్యాయ సంబంధ వృత్తుల్లోనైనా, చిన్న స్థాయి నుంచి ఉన్నత స్థాయికి చేరుకుంటారు. నటన, నాటకం, సినిమాలలో బహుముఖ ప్రజ్ఞ ప్రదర్శిస్తారు. న్యూస్‌పేపర్ రిపోర్టర్స్, కార్యనిర్వాహకులుగా రాణిస్తారు. జూదం, రేసులు, షేర్‌ల ద్వారా డబ్బును త్వరితంగా సంపాదిస్తారు. వీరు

జ్యోతిష్య, మానసిక, మార్మిక శాస్త్రాలలో, వేదాంతంలో ప్రతిభను కనబరుస్తారు.

## నెగెటివ్ లక్షణాలు

వీరు జాగ్రత్తగా ఉండకపోతే ఏకాగ్రత కుదరక, అన్నీ తెలుసుకున్నా ఏ ఒక్కదానిలో నిష్ణాతులు కాలేకపోతారు. అలసట, నరాల బలహీనత, అసంతృప్తి మొదలైన గుణాలు వీరు ఖచ్చితత్వాన్ని సాధించడంలో అవరోధాలవుతాయి. మార్పు, విభిన్నత వీరి కాలాన్ని వృథా చేస్తాయి. ప్రేమ, పెళ్ళిలో విశ్వసనీయత లేకపోవడం ఉండవచ్చు. వ్యంగ్యధోరణి, తీవ్ర స్వభావం వలన ఇతరుల ముందు నమ్మకాన్ని కోల్పోయి, అపఖ్యాతి పాలవుతారు.

## వ్యక్తిగతం

నిరంతర ఆలోచనలు, స్వేచ్ఛా ప్రియత్వం వలన వీరికి అనేక మంచి, చెడు అనుభవాలు ఎదురవుతాయి. వీరు సంప్రదాయేతర వైఖరిని అవలంబిస్తారు. ఎన్నో విషయాలపై దృష్టిపెట్టడం వలన కొన్ని సమయాల్లో సమస్యలని ఎదుర్కొంటారు. బహుముఖ ప్రజ్ఞావంతులు. అందరితో కలివిడిగా ఉండుట వలన వీరు వాతావరణాన్ని సందడిగా చేస్తారు. వీరితో పనిచేయడం ఆసక్తిగా ఉంటుంది. వీరు లోతైన ప్రేమను కోరుకుంటారు. 5వ నంబరు వ్యక్తులను వివాహమాడే విషయంలో ఈ విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి. వీరితో జీవించాలంటే సర్దుకుపోయే గుణం కలిగి ఉండాలి.

## 5వ నంబరు వ్యక్తుల మరికొన్ని పాజిటివ్ లక్షణాలు

- శారీరక, మానసిక స్వేచ్ఛ కోరుకోవటం
- కొత్తదనాన్ని, మార్పుని కోరుకోవటం
- అనేక విషయాలపై అవగాహన కలిగి ఉండటం
- అవకాశాలను సద్వినియోగం చేసుకోవటం
- సాహసయాత్రలు చేయటం
- పరిశోధనలో ఆసక్తి కలిగి ఉండటం
- అందరితో కలుపుగోలుగా ఉండటం
- అందరితో మంచి సంబంధాలు కలిగి ఉండటం
- అనుభవం ద్వారా జీవిత పాఠాలు నేర్చుకోవటం
- స్పెక్యులేషన్ వ్యాపారం చేయగల శక్తి

- ప్రచారం, ప్రకటనలు బాగా చేయగలగటం

## నెగిటివ్ లక్షణాలు :

- ప్రాపంచిక విషయాలపై, సుఖాలపై ఆసక్తి
- సంబంధాలు, వ్యాపారాల్లో ఊహించని మార్పులు చేయటం
- ఆలోచించకుండా పనులు చేయటం
- దూరదృష్టి లేకపోవటం
- అసంతృప్తి, అలసట కలగటం
- నిలకడ లేకపోవటం

5వ నంబరు వ్యక్తుల గ్రహం బుధుడు. బుధగ్రహం, పాదరసం ఒకే రకం లక్షణాలు కలిగి ఉంటాయి. వీరు "ఎప్పటికెయ్యది ప్రస్తుతమో, అప్పటికా మాటలాడి..." అన్న సుమతీశతక పద్యంలో నీతిలా అందరితో కలిసిపోయి వారి పనులు సాధించుకుంటారు. వీరికి స్థిరత్వం ఉండదు. ఇతరులతో పని చేయించటంలో నేర్పరులు. ఉత్పాదక సామర్థ్యం అధికంగా ఉన్న వారితో వీరు కలిసి పనిచేస్తే అధిక లాభం ఉంటుంది.

బుధగ్రహం గ్రహాలన్నింటిలో చిన్నది. చిన్నపిల్లవాని స్వభావం 5వ నంబరు వ్యక్తులది. వీరు స్వేచ్ఛాప్రియులు, రూల్స్‌కి వ్యతిరేకం, తమకిష్టమైన రీతిలో ఉండటానికి ఇష్టపడతారు. విభిన్నత, ఆనందాన్ని కోరుకుంటారు. మార్పు కావాలనుకుంటారు. వీరు అలంకరణ ప్రియులు. యవ్వనంగా కనిపించాలనే తపన ఉంటుంది. అనర్గళంగా మాట్లాడతారు. ఇంట్లో ఉండటాన్ని, ఎక్కువ వినోదాన్ని ఇష్టపడతారు.

శక్తివంతంగా, ఆరోగ్యంగా ఉంటారు. ఒకే రకమైన పనులు వీరికి నచ్చవు. మేధోపరమైన పనులను ఇష్టపడతారు. శారీరక శ్రమను నచ్చరు. 5వ నంబరు సింహం లాంటి గంభీరత, ధైర్యం కలిగిస్తుంది. ఎక్కువ ఆలోచనల వలన నరాల బలహీనత రావొచ్చు. 5వ నంబరు భావోద్రేకం గల నంబరు. వీరికి ఊపిరితిత్తులకు సంబంధించిన అనారోగ్యం రావొచ్చు.

వీరు మంచి తెలివితేటలు కలిగి చురుకుగా ఉంటారు. చక్కని పథకాలు వేస్తుంటారు. ఎదుటివారి మనసులో ఏముందో ఇట్టే తెలుసుకోగలరు. వీరికి శాస్త్రజ్ఞానం అబ్బుతుంది. నిలకడ కొంచెం తక్కువ. విఫలం చెందినా పెద్దగా బాధపడరు. అనేక విషయాలపై దృష్టిపెట్టడం వలన ఏ పనీ పూర్తిగా చేయకపోవడం అనేది ఉండొచ్చు.

బుధుని ప్రభావం వలన వ్యాపారంపై ఆసక్తి ఉంటుంది. వీరికి రవాణా, యాత్రలు అనుకూలం. దగ్గరదారుల ద్వారా డబ్బు సంపాదించాలని కోరుకుంటారు. వీరు ఇంటిని ఇష్టపడతారు. కొత్త, కొత్త విషయాలను కనిపెట్టడంలో సమర్థులు. అమెరికన్ ప్రెసిడెంట్ రూజ్‌వెల్డ్, షేక్‌స్పియర్, అబ్రహం లింకన్, హిట్లర్, నెహ్రూ వంటి ప్రముఖులు ఐదో నంబరు వ్యక్తులు.

ఈ నంబరు వ్యక్తులు అందరితో స్నేహంగా ఉంటారు. వీరికి పట్టువిడుపు తెలుసు. ప్రజాకర్షణ శక్తి కలిగి, పేరు ప్రతిష్ఠలు, ధనం ఉండి ఆత్మవిశ్వాసంతో, వాస్తవిక దృక్పథం కలిగి కొత్తదనాన్ని కోరుకుంటారు. విదేశీ ప్రయాణాలు, పుణ్యక్షేత్రాల దర్శనం చేస్తారు. సమాజంలో మార్పుని కోరుకుంటారు. వీరు పొగడ్తలకి లొంగిపోతారు. కళలు, రాజకీయాలు, సినిమారంగం, రచనలు మొదలైన వాటిలో రాణిస్తారు.

పెట్టుబడి లేకుండా చేసే కమీషన్ వ్యాపారం, కాంట్రాక్ట్ వృత్తులు కలసివస్తాయి. కళలు, కవితలు, చిత్రలేఖనం, సంగీతం, గణితం, విజ్ఞానశాస్త్రం, ఆధ్యాత్మిక, జ్యోతిష్య రంగాలలో ఎక్కువ ఆసక్తి, పరిజ్ఞానం కలిగి ఉంటారు. మాటల ద్వారా రచనల ద్వారా ఇతరులను ఆకర్షిస్తారు. హఠాత్తుగా డబ్బు వీరి వద్దకు చేరుతుంది. ఉన్నత ఆదర్శాలతో చేపట్టే సమస్త కార్యక్రమాలు విజయవంతమవుతాయి.

ఈ అంకె గలవారు ఏదైనా సంస్థలో ఉద్యోగం చేస్తుంటే వీరి అదృష్టం ఆ సంస్థకు కూడా కలుగుతుంది. ప్రాపంచిక సుఖాలు అనుభవించడంలో ఎక్కువ సంతోషం పొందుతారు. పని పూర్తి చేసేంత వరకు నిద్రపోరు బుధాధిక్యత తగ్గినవారు ఇతరుల కింద పనిచేస్తారు. నమ్మకద్రోహం, స్మగ్లింగ్ లాంటి అవాంఛనీయమైన లక్షణాలు వస్తాయి.

బుద్ధుడు, డాక్టర్ అంబేద్కర్, సుభాష్ చంద్రబోస్, బాలగంగాధర్ తిలక్, షేక్‌స్పియర్, ఐన్‌స్టిన్, బిర్లా, రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ, శ్రీపాదసుబ్రహ్మణ్య శాస్త్రి, వేదాంతం రాఘవయ్య, సంజయ్ గాంధీ 5వ నంబరు వ్యక్తులు.

జన్మ సంఖ్య యొక్క ప్రభావం వ్యక్తులపై ఏ విధంగా ఉంటుందో, డెస్టినీ నంబరు ప్రభావం కూడా వ్యక్తులపై ఉంటుంది. దాని వలన 5 జన్మ సంఖ్య ఉన్న వ్యక్తులందరి గుణగణాలు ఒకేలా ఉండవు. కారణం డెస్టినీ నంబరు మారటమే. కాబట్టి ప్రస్తుత 5 జన్మసంఖ్య కలవారి గుణగణాలు కూడా డెస్టినీ నంబరు బట్టి మారుతూ ఉంటాయి. పాఠకులు ఈ విషయం గమనించగలరని మనవి.

# జన్మసంఖ్య - 5, డెస్టినీ నంబరు - 1 గల వ్యక్తులు

**5/1 వ్యక్తులు మంచి మేధస్సు కలిగి కొత్త కొత్త పథకాలు వేస్తుంటారు. చేయదలచుకున్నది బయటకు చెప్పరు. స్వయంకృషితో అభివృద్ధి సాధిస్తారు.**

ఎవరు 5, 14, 23 తేదీలలో జన్మించి, వారి డెస్టినీ నెంబరు 1 అవుతుందో వారు ఈ వర్గంలోకి వస్తారు. వీరిపై బుధ, సూర్యుల ప్రభావం ఉంటుంది. వీరు ఎప్పుడూ ఏదో ఒక పనిలో ఉంటారు. పనులను వేగంగా పూర్తి చేయటానికి ప్రయత్నిస్తారు. కొత్త పథకాలను తయారుచేసి అమలు చేయటానికి కృషి చేస్తారు. మెరుపువేగంతో వీరి మేథస్సు పనిచేస్తుంది. వీరిలో చాలా మంది పి.జి. చదివే అవకాశం ఉంది. జడ్జిలుగా, న్యాయవాదులుగా, పారిశ్రామికులుగా అభివృద్ధి చెందుతారు.పని ఆలస్యమైతే ఇతరులను నిందిస్తారు. వీరికి అనుకూల నామసంఖ్య ఉంటే, ఉద్యోగ, పరిశ్రమ, గృహ, భూ, వాహన సౌకర్యాలు ఉంటాయి. కొందరు ఉద్యోగులుగాను, ఎక్కువ మంది స్వతంత్ర్య వ్యాపారాల్లో ఉంటారు. ఒకమోస్తరు పొడవు. ఆకర్షణీయమైన రూపం ఉంటాయి. ఇంజినీరింగ్, సీఏ వంటి కోర్సులపై ఆసక్తి చూపుతారు. సివిల్ సర్వీసెస్ వంటి వాటిపై ప్రయత్నిస్తే తప్పక ఉన్నత పదవులు వర్తిస్తాయి. వీరు చాలా తెలివి గలవారు అందువలన తల్లిదండ్రులు వీరి శక్తిని గుర్తించి చిన్నప్పటి నుంచి ప్రోత్సాహాన్ని ఇస్తే మంచి భవిష్యత్తు ఉంటుంది.

తమ కార్యాచరణను బయటకు చెప్పరు. ముందు పని జరగటానికి ప్రాధాన్యం ఇస్తారు. ఆత్మ విశ్వాసం, కృషితో విజయాన్ని సాధిస్తారు. ఒక పని మొదలెడితే పూర్తి అయ్యేంత వరకు విశ్రమించరు. తాము ఎక్కడికి వెళ్తున్నారో ఎవరికీ చెప్పరు. ఒక ఖచ్చితమైన ప్రయోజనకరమైన లక్ష్యంతో ప్రయాణించి విజయాన్ని పొందుతారు. అనుకూల నామం లేకపోతే, సంపాదించిన డబ్బుని దుర్వినియోగం చేస్తారు. డబ్బు సంపాదించినా ఏదో విధంగా నష్టపోతుంటారు. అనుకూల నామం ఉంటే మంచి పరిశ్రమ, ఉద్యోగం, జీవితభాగస్వామి, మంచి సంతానం, అధిక సంపద లభిస్తాయి.

కొంతమంది ఉద్యోగులుగా ఉన్నా, ఏదో ఒక వ్యాపారం చేసి డబ్బు సంపాదిస్తారు. దేవుణ్ణి పూజించే విధానం వింతగా ఉంటుంది. విజయం పొందకపోతే దైవాన్ని ఇష్టపడరు.

స్వయంకృషి ద్వారా ఉన్నత స్థానాన్ని పొందుతారు. వీరు ఎక్కువగా బయట తిరిగే ఉద్యోగాలపై ఉత్సాహం చూపుతారు. వీరికి దానగుణం ఉంటుంది. పేదరిక నిర్మూలనకు కృషిచేసి పేదపిల్లలను ఆదుకుంటారు. ప్రకృతి ఆరాధన ద్వారా వీరికి మానసిక ప్రశాంతత వస్తుంది. అనుకూల నామం ఉంటే సంతోషకరమైన జీవితం, అన్ని సౌఖ్యాలు పొందుతారు.

## పేరు పెట్టే విధానం

వీరికి సూర్యసంఖ్యలైన 19, 37, 46, 55, బుధ సంఖ్యలైన 14, 23, 32, 41, 50, కుజ సంఖ్యలైన 9, 27, 45, 54 లు పేర్లకు అనుకూలం.

## రాణించే రంగాలు

కమీషన్ వ్యాపారం, కాంట్రాక్ట్ వర్క్, ఏజన్సీలు, స్టీలు వ్యాపారాలు లాభసాటి.

## వ్యాధులు

అధిక ఉష్ణసంబంధిత వ్యాధులు, రక్తపోటు, మధుమేహం, నరాల బలహీనతకు అవకాశం ఉంది. సరియైన చికిత్స తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది.

## సూచనలు

| | | |
|---|---|---|
| లక్కీ నంబర్లు | - | 1, 5 |
| అన్‌లక్కీ నంబర్లు | - | --- |
| లక్కీ తేదీలు | - | 1, 5, 10, 14, 19, 23, 28 |
| అన్‌లక్కీ డేట్స్ | - | --- |
| లక్కీ కలర్స్ | - | బూడిద, పసుపు, లేతనీలం, ఆకుపచ్చ, రోజ్, ఆరెంజి |
| అన్‌లక్కీ కలర్స్ | - | నలుపు |
| అదృష్ట దినాలు | - | ఆది, బుధ, గురువారాలు |
| లక్కీ వివాహ తేదీలు | - | 1, 6, 9, 10, 15, 19, 24, 27, 28 |
| రెమిడీస్ | - | సూర్యున్ని ఆరాధించడం, విష్ణుమూర్తిని కొలవడం, బీద విద్యార్థుల చదువు కొరకు ఆర్థిక సహాయం చేయటం. బీదలకు కళ్ళజోళ్ళు ఇవ్వటం మంచిది. |
| ఉదా | - | డా॥ బి.ఆర్.అంబేద్కర్ 14-04-1891 |
| | | చంద్రశేఖర్ ఆజాద్ 23-07-1906 |

# జన్మసంఖ్య - 5, డెస్టినీ నంబరు - 2 గల వ్యక్తులు

**5/2 వ్యక్తులు పొట్టిగా, అందంగా ఉంటారు. వీరికి జాగ్రత్త ఎక్కువ. కోర్టు వ్యవహారాల్లో సమర్థులు. ఉపన్యాసాలు, రచనలు చేస్తారు.**

ఎవరు 5, 14, 23 తేదీలలో జన్మించి, వారి విధి సంఖ్య 2 అవుతుందో వారు ఈ వర్గంలోకి వస్తారు. వీరిపై బుధ, చంద్రుల ప్రభావం అధికం. వీరు పొట్టిగా, అందంగా వుంటారు. మెరిసే పలువరుస ఉంటుంది. ఆలోచనాపరులు, ఉత్సాహవంతులు. అకస్మాత్తుగా బద్ధకస్తులవుతారు. ప్రతికూల నామసంఖ్యలు ఉంటే, అంతా సరిగా చేసినా అయోమయానికి గురవుతారు. అయోమయం తొందరలోనే పోతుంది. అనుకూల నామసంఖ్యలు ఉంటే వ్యాపార, ఉద్యోగాదులలో ఉన్నత స్థానాన్ని అందుకుంటారు. వీరు ప్రతి విషయంలో జాగ్రత్తగా ఉంటారు. ప్రతిదీ స్వయంగా చేస్తారు. పనులను తొందరగా పూరిచేయడానికి శ్రమిస్తారు. శారీరకంగా బలమైనవారు. మానసికంగా బలహీనులు. వీరు పాదరసం వలె చాలా తెలివి గలవారు. మంచి కల్పనాచాతుర్యం ఉంటుంది. మంచి రచనలు చేయగలరు. కంప్యూటర్ విద్యలో బాగా రాణిస్తారు. మీడియా రంగంలో కొత్త వైవిధ్యమైన ప్రోగ్రామ్స్ చేస్తారు. పీఆర్ఓ, హెచ్ఆర్‌లుగా బాగా రాణిస్తారు.

వీరిలో కొందరికి త్వరగా కోపం వస్తుంది. బయటవారి వలన వైఫల్యం వస్తే ఇంట్లోవారిని నిందిస్తారు. అనుకూల నామసంఖ్య ఉంటే ఆరోగ్య, గృహ, భూ, వాహన, వ్యాపార, ఉద్యోగాలు, మంచి జీవిత భాగస్వామి లభిస్తాయి. న్యాయస్థానంలో కేసులు వేయటంలో, వాదనలు చేయటంలో గట్టివారు. ప్రకృతి-ప్రదేశాలు, చల్లని పర్వత ప్రాంతాలను సందర్శిస్తుంటారు. ఇంటిని అలంకరించి, విలాస వస్తువులు సేకరించటంలో ముందుంటారు. ఏదైనా ఒక విషయాన్ని చూస్తే దాని గురించి లోతుగా ఆలోచిస్తారు. కొందరు ఉపన్యాస, రచనల ద్వారా పేరు పొందుతారు. కొత్త వస్తువులను అన్వేషిస్తారు. ఇతరులకు సలహాలిచ్చుట ద్వారా వారిని ఆకర్షిస్తారు. జీవితాన్ని పాత కొత్తల మేలు కలయికగా జీవిస్తారు. వీరు గొప్ప వక్తలు. న్యాయం, మతం, వైద్యం, వేదాంతాలలో అభిరుచి ఉంటుంది.

## పేరు పెట్టే విధానం

వీరికి సూర్య సంఖ్యలైన 19, 37, 46, 55, బుధ సంఖ్యలైన 5, 14, 23, 32, 41, 50, శుక్ర సంఖ్యలైన 6, 15, 24, 33, 42 లు పేర్లకు అనుకూలం.

## రాణించే రంగాలు

కమీషన్ వ్యాపారం, కాంట్రాక్ట్ జాబులు, సౌందర్య వస్తువుల విక్రయం, సౌందర్య సాధనాలు, విలాస వస్తువులు, ఎలక్ట్రిక్ సామానులు, స్టీలు తదితర వ్యాపారాలు అనుకూలం.

## వ్యాధులు

జలుబు, ఉదర సమస్యలు, ఆస్తమా, రక్తపోటు, పైల్స్ వచ్చే అవకాశముంది. సరియైన చికిత్స తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది.

## సూచనలు

| | | |
|---|---|---|
| లక్కీ నంబర్లు | - | 1, 5, 7, 6 |
| అన్‌లక్కీ నంబర్లు | - | 8, 9 |
| లక్కీ తేదీలు | - | 1, 5, 6, 7, 10, 14, 15, 16, 19, 23, 24, 25, 28 |
| అన్‌లక్కీ డేట్స్ | - | 8, 9, 17, 18, 26, 27 |
| లక్కీ కలర్స్ | - | బూడిద రంగు, లేత ఆకుపచ్చ, లేత నీలం, సిల్వర్, వైట్, క్రీమ్ |
| అన్‌లక్కీ కలర్స్ | - | ఎరుపు |
| అదృష్ట దినాలు | - | సోమ, మంగళ, బుధ, శుక్రవారాలు |
| లక్కీ వివాహ తేదీలు | - | 1, 6, 10, 15, 19, 24, 28 |
| రెమిడీస్ | - | అమ్మవారిని ఆరాధించటం, తల్లిని కానీ, తల్లి సమానులైన స్త్రీలను గాని ఆదరించటం, వీలైనంత వరకు చంద్రకాంతిలో 30 నుండి 40 నిమిషాలు గడపటం. |
| ఉదా | - | అమీర్‌ఖాన్ 14-03-1965 (హిందీ నటుడు) |

# జన్మసంఖ్య - 5, డెస్టినీ నంబరు - 3 గల వ్యక్తులు

**5/3 వ్యక్తులు మధ్యస్థమైన పొడవు కలిగి ఉంటారు. ముందు రెండు పళ్ళు పెద్దవిగా ఉంటాయి. పెద్ద పెద్ద పరిశ్రమలు, వ్యాపారాలు నడుపుతారు. మోసంచేయరు. రెండు నాల్కల ధోరణిలో మాట్లాడరు. కష్టపడి పనిచేస్తారు.**

ఎవరు 5, 14, 23 తేదీలలో జన్మించి, వారి డెస్టినీ నెంబరు 3 అవుతుందో వారు ఈ వర్గంలోకి వస్తారు. వీరిపై బుధ, గురుల ప్రభావముంటుంది. ఒక మోస్తరు పొడవుగా, అందంగా ఉంటారు. ముత్యాల్లాంటి పళ్ళుండి, ముందు రెండు పళ్ళు పెద్దవిగా ఉంటాయి. యవ్వనంలో కొందరికి జుత్తు రాలుతుంది. ఎప్పుడూ ఏదో పనిచేస్తూ కార్యాచరణకి పథకాన్ని సిద్ధం చేస్తారు. నీతికి, నిజాయితీకి పెట్టింది పేరు. వీరు చాలా తియ్యగా ఎవరిని నొప్పించకుండా మాట్లాడతారు. అనుకూలమైన పేరు ఉంటే ఉద్యోగ వ్యాపారాదులలో రాణిస్తారు. ధన, గృహ, వాహన సౌకర్యాలు ఉంటాయి. పేర్లు అనుకూలంగా లేకపోతే వీరి ప్రయత్నాలు విఫలమవుతాయి. కాని పనులు చేసి చెడ్డ పేరును తెచ్చుకొంటారు. వీరికి మంచి తెలివితేటలతో పాటు దైవబలంపై నమ్మకం ఉంటుంది. వేద విద్య, ఆధ్యాత్మిక రచనలు అంటే ఇష్టపడతారు. వీరు ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్, కంప్యూటర్ ఇంజినీరింగ్ రంగాల్లో రాణిస్తారు. వీరు ఎంతటి పదవుల్లో ఉన్నా దైవానికి సంబంధించిన కార్యక్రమంలో పాల్గొంటారు. బోధనా వృత్తి వంటి అధ్యాపక, పురోహిత వృత్తుల్లో రాణిస్తారు.

ఉద్యోగులు అంకితభావంతో పనిచేసి ఉన్నత స్థానాలు పొందుతారు. ప్రతికూలనామం ఉంటే సమస్యలు ఎదుర్కొంటారు. జ్ఞానవృద్ధి, విద్యావృద్ధి ఉంటుంది. వీరికున్న ప్రత్యేక సామర్థ్యంతో జీవితంలో పైకి వస్తారు. వీరు అత్యంత మేధావులు, మితభాషులు. అవసరమైతేనే మాట్లాడతారు. ఆచితూచి మాట్లాడతారు. ఇతరులు వీరిని తెలివైన వారుగాను, ఆలోచన పరులుగాను చూస్తారు. పేర్లు అనుకూలిస్తే వ్యాపారంలో అత్యధిక లాభాలు పొందుతారు. అందరిచే గౌరవింపబడతారు. ఎంతోమందికి ఉపాధి కల్పిస్తారు. తరగని సంపద ఉంటుంది.

పరిశోధన, ఆవిష్కరణల చుట్టూ వీరి ఆలోచనలు ఉంటాయి. మోసం చెయ్యరు.

ద్వంద్వ వైఖరి ఉండదు. నచ్చని విషయాన్ని ముఖంపైనే చెప్తారు. మతం, న్యాయం, సంగీతం, కళలలో ప్రవేశం ఉంటుంది. పరిశ్రమలను సందర్శించి, వివిధ వ్యాపార విషయాలలో జ్ఞానాన్ని సంపాదించాలని ఆశిస్తారు. వీరి పనులు ఇతరులకు ఉపయోగకరంగా ఉంటాయి. ఆలోచించకుండా ఏ పనికీ ఒప్పుకోరు. వీరి స్థాయి పెరుగుతూనే ఉంటుంది. సామర్థ్యంతో విజయం సాధిస్తారు. మర్యాద, సంకల్పం వీరి ప్రగతికి మూలస్తంభాలు.

## పేరు పెట్టే విధానం

వీరికి సూర్య సంఖ్యలైన 19, 37, 46, 55, గురు సంఖ్యలైన 3, 21, 30, 39, బుధ సంఖ్యలైన 5, 14, 23, 32, 41, కుజ సంఖ్యలైన 9, 27, 45, 54లు పేర్లకు అనుకూలం.

## రాణించే రంగాలు

కమీషన్ వ్యాపారం, కాంట్రాక్టులు, ఏజెన్సీలు అనుకూలం. రవాణా, వాణిజ్యం ద్వారా కూడా సంపాదన కలుగుతుంది.

## వ్యాధులు

వీరికి రక్తపోటు, థైరాయిడ్, కీళ్ళనొప్పులు, అధిక ఉష్ణ సంబంధిత వ్యాధులు కలిగే అవకాశాలున్నాయి. అనుకూల నామసంఖ్య ఉండి, సరియైన చికిత్స తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది.

## సూచనలు

| | | |
|---|---|---|
| లక్కీ నంబర్లు | - | 5, 3, 9 |
| అన్‌లక్కీ నంబర్లు | - | 8 |
| లక్కీ తేదీలు | - | 3, 5, 9, 12, 14, 18, 21, 27, 23, 30 |
| అన్‌లక్కీ డేట్స్ | - | 8, 17, 26 |
| లక్కీ కలర్స్ | - | లేత నీలం, బూడిదరంగు, గులాబీ, నారింజ, ఊదా రంగు |
| అన్‌లక్కీ కలర్స్ | - | నలుపు |
| అదృష్ట దినాలు | - | ఆది, మంగళ, బుధ, గురువారాలు |
| లక్కీ వివాహ తేదీలు | - | 1, 3, 9, 10, 12, 18, 19, 21, 27, 28 |

| | | |
|---|---|---|
| రెమిడీస్ | - | దక్షిణామూర్తిని ఆరాధించటం, గురువుని, గురు సమానులను ఆదరించటం, గౌరవించటం, పండితులకు, పురోహితులకు పసుపు రంగు పండ్లు కాని వస్త్రాలు కాని తమ శక్తి కొలది బహుకరించటం. |
| ఉదా | - | అభిషేక్ బచ్చన్ 05-02-1976 |
| | | సర్వేపల్లి రాధాకృష్ణన్ 05-09-1888 |

## జన్మ సంఖ్య - 5, డెస్టినీ నంబరు - 4 గల వ్యక్తులు

**5/4 వ్యక్తులు అందంగా, ఆరోగ్యంగా ఉంటారు. ముక్కుసూటిగా ఉంటారు. వీరికి లోకజ్ఞానం ఎక్కువ. స్వేచ్ఛాప్రియులు. ఇతరుల పెత్తనం నచ్చరు.**

ఎవరు 5, 14, 23 తేదీలలో జన్మించి, వారి డెస్టినీ నెంబరు 4 అవుతుందో వారు ఈ వర్గంలోకి వస్తారు. వీరు బుధుడు, రాహు గ్రహ ప్రభావంలో ఉంటారు. ఒక మోస్తరు పొడవు కలిగి అందంగా ఉంటారు. అలల్లాంటి జుత్తు ఉంటుంది. నరాల శక్తి, ఆరోగ్యం, దృఢత్వం ఉంటుంది. చురుకుగా ఉండి నిత్యం ఏదో ఒకపనిలో నిమగ్నమై ఉంటారు. ద్వంద్వ వైఖరి ఉండదు. ముక్కుసూటిగా వీరి ఆలోచనలను తెలియచేస్తారు. ఇతరులు కష్టాల్లో ఉంటే ఆదుకుంటారు. వారి బాధలను తీర్చడానికి ప్రయత్నిస్తారు. వీరికి మేనేజ్‌మెంట్ మరియు న్యాయశాస్త్రాలపై అభిరుచి ఉంటుంది. ఆ రంగాలలో చాలా ఉన్నత స్థితికి వస్తారు. కంప్యూటర్, కమ్యూనికేషన్ రంగాలలో రాణిస్తారు. వీరు జర్నలిస్ట్‌లుగా సాహసోపేతమైన కథనాలు వ్రాయగలరు. ఇంజినీరింగ్, సీఏ వంటి కోర్సులు చేసిన తదుపరి ఎంబీఏ, న్యాయశాస్త్ర కోర్సులు చేస్తారు. వీరు దేశంలోని ఉన్నత విద్యాలయాలైన ఐఐటీ, ఐఐఎం కాలేజీల్లో చదివే అవకాశం ఉంది. అనుకున్నది ఎంత కష్టమైనా సాధించే వరకు విశ్రమించరు. వీరికి మంచి జీవితభాగస్వామి, మంచి సంతానం, మంచి ఆరోగ్యం, సంపద, గౌరవం కలుగుతాయి. ప్రతికూల నామం ఉంటే అనవసర వివాదాల్లో చిక్కుకుంటారు.

వీరికి పుస్తకజ్ఞానమే కాక లోకజ్ఞానం కూడా ఉంటుంది. భవిష్య సంఘటనలను ఊహించే సామర్థ్యం ఉంటుంది. ఎవరికీ హాని తలపెట్టరు. ఎవరైనా వీరిని వ్యతిరేకిస్తే,

వారిని తెలివిగా నిలువరిస్తారు. వీరు పేదరికం నుంచి ధనవంతులు అవుతారు. పెట్టుబడి లేకుండా వ్యాపారం చేసి, ఆదాయపన్ను కట్టే స్థాయికి చేరుకుంటారు. అనుకూల నామం ఉంటే దైవబలం తోడవుతుంది. ప్రతికూలమైన పేరు ఉంటే ప్రగతి ఉండదు.

వీరు నిత్యం ఏదో పథకం గురించి ఆలోచిస్తారు. వ్యాపారం అంటే ఇష్టం ఉంటుంది. చాలా మంది వర్తక, వ్యాపార, పరిశ్రమలందు ఉంటారు. కొందరు ప్రభుత్వ సేవలో ఉంటారు. వీరు స్వేచ్ఛా ప్రియులు. ఇతరుల ఆధిపత్యాన్ని సమ్మతించరు. తమ మనస్సాక్షినే అనుసరిస్తారు.

వీరు ఎప్పుడు శుచిగా, శుభ్రంగా కనిపిస్తారు, సుగంధ, పరిమళ ద్రవ్యాలంటే యిష్టం. వీరెప్పుడూ తమ నుంచి లాభం పొందిన స్నేహితులతో గుమికూడి ఉంటారు. అనుకూల నామం ఉంటే అద్భుతమైన రీతిలో ఫ్యాక్టరీలు, వాహన, గృహ, ధనాదాయాలు కల్గి ఉంటారు. లేకపోతే గాలిలో మేడలు కడుతూ, సమయాన్ని వృథా చేస్తారు. పనులలో ఆటంకాలు వస్తాయి. అందమైన ప్రదేశాలను చూడటం వీరికి ఇష్టం. ప్రకృతి దృశ్యాలను వర్ణించడంలో నేర్పరులు. వాహనాలను అలంకరించడంలో, నడుపుటంలోనూ ఆసక్తి. న్యాయ, మత, జ్యోతిష్యాది శాస్త్రాలలో లోతైన జ్ఞానం ఉంటుంది.

## పేరు పెట్టే విధానం

వీరికి సూర్య సంఖ్యలైన 19, 37, 46, 55, బుధ సంఖ్యలైన 5, 14, 23, 32, 41లు పేర్లకు అనుకూలం.

## రాణించే రంగాలు

వాక్చాతుర్యంతో కూడిన పనులలో ఆదాయం ఉంటుంది. కాంట్రాక్టులు. కమీషన్ వ్యాపారం, ఏజన్సీలు, ఫర్నిచర్, వాహన, స్టీలు పరిశ్రమలలో, న్యాయ వ్యవస్థ, కంప్యూటర్ రంగాలలో అత్యున్నత స్థానాన్ని చేరుకుంటారు.

## వ్యాధులు

గుండె వ్యాధులు, రక్తపోటు అధిక ఉష్ణ సంబంధిత, మూత్ర సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. సరియైన చికిత్స తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది.

## సూచనలు

లక్కీ నంబర్లు - 1, 5

| | | |
|---|---|---|
| అన్‌లక్కీ నంబర్లు | - | --- |
| లక్కీ తేదీలు | - | 1, 5, 6, 10, 14, 15, 19, 23, 24, 28 |
| అన్‌లక్కీ డేట్స్ | - | - |
| లక్కీ కలర్స్ | - | లేత పసుపు, లేతనీలం, బూడిద రంగు, రోజ్ |
| అన్‌లక్కీ కలర్స్ | - | నలుపు |
| అదృష్ట దినాలు | - | ఆదివారం, బుధవారం, గురువారం |
| లక్కీ వివాహ తేదీలు | - | 1, 6, 9, 10, 15, 18, 19, 24, 27, 28 |
| రెమిడీస్ | - | సుబ్రహ్మణ్య స్వామికి అభిషేకం, అనాథలకు అన్నదానం, పుణ్యక్షేత్రాలలోని కోనేరులలో ఉన్న చేపల లాంటి జీవులకు గోధుమ పిండి వేయడం. |
| ఉదా | - | సుభాష్ చంద్రబోస్ 23-01-1897 |

## జన్మసంఖ్య - 5, డెస్టినీ నంబరు - 5 గల వ్యక్తులు

**5/5 వ్యక్తులపై బుధుడి ప్రభావం సంపూర్ణంగా ఉంటుంది. ఇతరులకు సాయం చేస్తుంటారు. సమాజంలో పేరు ప్రఖ్యాతులు ఉంటాయి. ఎదుటి వారి మనసులో ఏముందో కనిపెట్టగలరు. ఇతరులు చేయలేని పని వీరు చేయగలుగుతారు.**

ఎవరు 5, 14, 23 తేదీలలో జన్మించి వారి డెస్టినీ సంఖ్య 5 అవుతుందో వారు ఈ వర్గంలోకి వస్తారు. వీరిపై బుధుడి ప్రభావం ఉంటుంది. మధ్యరకం పొడవు, ఆకర్షణీయమైన రూపు కలిగి ఉంటారు. గొప్ప జ్ఞానంతో పాటు మంచి సమయస్ఫూర్తి మరియు అపారమైన సంపద ఉండే అదృష్టవంతులు. సహచరులు కొద్దిగా నిర్లక్ష్యంగా ఉంటే తీవ్రంగా విమర్శిస్తారు. వీరెప్పుడూ ఇతరులకు సాయం చేస్తారు. అందుకే వీరికి అధిక సంఖ్యలో మద్దతుదారులు ఉంటారు. అందరిచే గౌరవింపబడతారు. మంచి కళాభిరుచి ప్రదర్శిస్తారు. ఎక్కడికెళ్ళినా వీరికి సాదర స్వాగతం ఉంటుంది. అనుకూలమైన పేర్లుంటే సమాజంలో ప్రముఖులవుతారు. లేకపోతే రాణించరు. ఎన్నో అడ్డంకులు ఎదురవుతాయి. మెరుపు వేగంతో ఆలోచన చేస్తారు. వేగవంతంగా పనిని ముగిస్తారు. లేదా కోపం

వస్తుంది. ఇతరుల ఉద్దేశ్యాలను చిటికెలో గ్రహిస్తారు. ఇతరులు తమ విధులను నిర్వర్తించాలని ఆశిస్తారు. లేదా వారితో గొడవపడతారు. వీరికి కొత్త కోర్సులు చేయాలనే తపన, కొత్త విషయాలను కనిపెట్టడం, సరికొత్త టెక్నాలజీని ప్రజలకు అందించాలనే ఆశయం ఉంటుంది.

వీరి మీద ఆధారపడిన వాళ్ళను కూడా తమ లాగే చురుకుగా ఉండాలని ఆశిస్తారు. ఇతరులకు సమయం ఎక్కువ పట్టే సమస్యలను చిటికలో పరిష్కరిస్తారు. ఏమి చేసినా గౌరవాన్ని పొందుతారు. వీరు కోపాన్ని అదుపులో ఉంచుకోవాలి. కొన్నిసార్లు వీరు పిల్లల్లా ప్రవర్తిస్తారు. నిస్సంకోచంగా తమ ఆలోచనలను తెలియచేస్తారు. తమకు నచ్చని వారిని పరోక్షంగా దెబ్బతీస్తారు. కృషి ద్వారా ఏదైనా సాధ్యం అని నమ్ముతారు. ఇతరులకు అసాధ్యమని వదిలేసిన పనులను చేపట్టి విజయవంతంగా ముగిస్తారు. కొత్త వస్తువులను కొత్త ఐడియాలను స్వాగతిస్తారు. కొత్త పనులు చేయటానికి ఇష్టపడతారు. వీరు ఎప్పుడు బయట తిరిగే వృత్తులపై ఆసక్తి చూపుతారు.

కొందరు తమకు వచ్చే నూతన ఆలోచనలను ప్రజాక్షేమం కొరకు అమలు చేస్తారు. కొందరు కొత్త మందులను, కొత్త విలాస వస్తువులను కనుగొంటారు. వీరికి అనుకూల నామం లేకపోతే ఇతరులని మోసం చేసి జీవిస్తారు. ఆనందమైనా, బాధైనా ఎక్కువ భరించలేరు. సమస్యలు ఎదురైనప్పుడు అప్‌సెట్ అవుతారు. వీరు ఎవరినైనా వారి మాటల చాతుర్యంతో తమ వైపు తిప్పుకోగలరు. అనుకూల నామం ఉంటే ఎప్పుడూ అదృష్టవంతులే. దైవకృప ఉంటుంది. వీరి తెలివితేటల వలన దేన్నైనా అర్థం చేసుకొని చేస్తారు. విదేశీయానం చేస్తారు. సైన్స్, గణితం, వైద్యంపై అభిరుచి ఉంటుంది. నిరాటంకంగా డబ్బు సంపాదించాలని కోరుకుంటారు.

## పేరు పెట్టే విధానం

వీరికి సూర్య సంఖ్యలైన 19, 37, 46, 55, బుధ సంఖ్యలైన 5, 14, 23, 32, 41, 55, శని సంఖ్యలైన 26, 35 లు పేర్లకు అనుకూలం.

## రాణించే రంగాలు

వీరికి కమీషన్ వర్క్, కాంట్రాక్టులు, ఏజెన్సీలు, రవాణా, లోహపు వ్యాపారం, ఔషధ షాపులు, రచనా రంగాలు కలిసివస్తాయి.

## వ్యాధులు

వీరికి రక్తపోటు, కీళ్ళనొప్పి, వెన్నునొప్పి, పంటినొప్పి వస్తాయి. సరియైన చికిత్స తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది.

## సూచనలు

| | | |
|---|---|---|
| లక్కీ నంబర్లు | - | 1, 5, 8 |
| అన్‌లక్కీ నంబర్లు | - | --- |
| లక్కీ తేదీలు | - | 1, 3, 5, 9, 10, 12, 14,<br>18, 19, 21, 23, 27, 28, 30 |
| అన్‌లక్కీ డేట్స్ | - | --- |
| లక్కీ కలర్స్ | - | బూడిదరంగు, నీలం, ఆకుపచ్చ, పసుపు |
| అన్‌లక్కీ కలర్స్ | - | నలుపు |
| అదృష్ట దినాలు | - | ఆదివారం, బుధవారం, మంగళవారం |
| లక్కీ వివాహ తేదీలు | - | 1, 6, 9, 10, 15, 18, 19, 24, 27, 28 |
| రెమిడీస్ | - | బుధ జపం చేయించుకోవటం, బీదలకు,<br>అనాథలకు అన్నదానం చేయటం,<br>అక్క చెల్లెళ్ళను ఆదరించి వారి అభిమానాన్ని చూరగొనాలి.<br>విష్ణు సహస్రనామ పారాయణం చేయాలి. |
| ఉదా | - | హిమేష్ రేష్మియా 23-07-1973<br>ప్రభాస్ 23-10-1979<br>శ్రీకాంత్ 23-03-1968<br>బాలగంగాధర్ తిలక్ 23-07-1856<br>బాబర్ 14-02-1483 (చక్రవర్తి) |

# జన్మసంఖ్య - 5, డెస్టినీ నంబరు - 6 గల వ్యక్తులు

**5/6 వ్యక్తులు ఆకర్షణీయంగా ఉంటారు. పని ముగిసే వరకు నిద్రపోరు. వీరికి దైవ బలం, స్నేహితుల సహకారం ఉంటుంది.**

ఎవరు 5, 14, 23 తేదీలలో జన్మించి, వారి డెస్టినీ నెంబరు 6 అవుతుందో వారు ఈ వర్గంలోకి వస్తారు. వీరిపై బుధ,శుక్రుల ప్రభావం ఎక్కువ. ఆకర్షణీయమైన రూపు ఉంటుంది. వేషభాషలు, హావభావాలు ఇతరులని ఆకర్షిస్తాయి. వీరు ఎప్పుడూ ఉత్తేజంగానే ఉంటారు. అనుకూల నామం లేకపోతే ప్రగతి ఉండదు. వృథా కాలయాపన, వృథా ఖర్చు చేస్తారు. అనుకూల నామం ఉంటే వారి సమయాన్నంతా డబ్బు సంపాదన, ఉన్నత స్థానానికి చేరటంపై దృష్టి నిలిపి సాధిస్తారు. వీరిపేరు, స్థాయి దినదినాభివృద్ధి చెందుతుంది. విశ్రాంతి తీసుకోవాలి అని అనుకున్నారంటే, నిద్రలోకి జారుకుంటారు. పని మొదలెట్టారంటే అది అయ్యేంతవరకు కష్టించి పనిచేస్తారు. వీరు కొత్త కొత్త ఫ్యాషన్ టెక్నాలజీ, ఇంటీరియర్ డెకోరేషన్, టీవీ, సినిమా రంగాల్లో వినూత్న ప్రయోగాలు చేసి చాలా మందికి రోల్ మోడల్‌గా ఉంటారు. మంచి తెలివితేటలతో పాటు అందంగా ఉండటం వలన వీరు ఎవరినైనా ఒప్పించి తమ కార్యాలను సాధిస్తారు.

వివిధ వృత్తుల వారితో వీరికి పరిచయం ఉండి స్నేహాన్ని ఏర్పరచుకుంటారు. వీరెప్పుడు స్నేహితులతో చుట్టుముట్టబడి ఉంటారు. ఇతరులను ప్రభావితం చేస్తూ, ఎక్కువ శ్రమ లేకుండా డబ్బు, జీవితంలో సౌఖ్యాలన్నింటినీ పొందుతారు. ఇతరులతో ప్రేమపూర్వకంగా కలిసిపోతారు. తమకు నచ్చని వారికి వీరు ప్రమాదకర శత్రువులు. వీరికి నచ్చని వారు వీరితో లౌక్యంగా పనులను చేసుకోవాలి. యవ్వనంలోనే వీరు జీవితాన్ని ఎలా ఆనందించాలో తెల్సుకుంటారు. ఇతరులను వినోదపరచటం ద్వారా డబ్బు సంపాదిస్తారు.

వీరు సౌందర్య ఆరాధకులు, సౌందర్య వస్తువులను సేకరిస్తారు. సంగీత, నాట్యాది కళలను ఆరాధిస్తారు. ప్రపంచంలోని సౌఖ్యాలు అనుభవించటానికే పుట్టామని భావిస్తారు. చిన్నతనం నుంచే ఇతరుల భావాలను అర్థం చేసుకుంటారు. కొందరు విద్యలో రాణించి జీవితంలో వెలుగుతారు. చాలా మంది పరిశ్రమల స్థాపన ద్వారా వెలుగులోకి వస్తారు.

ఎంతోమంది స్నేహితులు వీరికి సహాయం చేస్తారు. కాబట్టి వీరు ధైర్యంగా ఉంటారు. దైవబలంతో కష్ట పరిస్థితులను అధిగమిస్తారు. మతం, న్యాయం, వైద్యంలో పరిజ్ఞానం ఉంటుంది. కొందరు పోటీలలో, గుర్రపు రేసుల్లో, జూదంలో రాణిస్తారు. వాహనాలని అలంకరిస్తారు. ఖాళీగా ఉన్న సమయంలో పనులు పూర్తి చేయటం వలన వీరు పేరు పొందుతారు. ద్వంద్వ వైఖరి అవలంబించరు. ఇతరులు వీరిని అమాయకులు అనుకుంటారు. ప్రతి పనిని వీరికి, మిగతా వారికి లాభం తెచ్చే విధంగా ప్రణాళికలు వేస్తారు. అనుకూలమైన పేరు ఉంటే సంపద, పేరుప్రఖ్యాతులు, ప్రజా మద్దతు లభిస్తాయి.

## పేరు పెట్టే విధానం

వీరికి బుధ సంఖ్యలైన 5, 14, 15, 23, శుక్ర సంఖ్యలైన 6, 15, 24, 33, కుజ సంఖ్యలైన 9, 27, 45, 54 లు పేర్లకు అనుకూలం.

## రాణించే రంగాలు

వీరికి విలాస వస్తువుల సంబంధిత వృత్తులు, కమీషన్ వర్క్, కాంట్రాక్టులు, ఏజెన్సీలు, స్టీలు, రవాణా వ్యాపారాల్లో లాభం వస్తుంది.

## వ్యాధులు

వీరికి చర్మ వ్యాధులు, నీటి సంబంధ వ్యాధులు వస్తాయి. సాల్ట్, షుగర్ తక్కువగా తీసుకోవాలి. తగిన చికిత్స తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది.

## సూచనలు

| | | |
|---|---|---|
| లక్కీ నంబర్లు | - | 5, 6, 9 |
| అన్‌లక్కీ నంబర్లు | - | 3 |
| లక్కీ తేదీలు | - | 5, 14, 23, 6, 15, 24, 9, 18,27 |
| అన్‌లక్కీ డేట్స్ | - | 3, 12, 21, 30 |
| లక్కీ కలర్స్ | - | బూడిదరంగు, లేతపచ్చ, లేతనీలం, ఎరుపు, సిల్వర్, తెలుపు |
| అన్‌లక్కీ కలర్స్ | - | గులాబి, ఊదా, నారింజ |
| అదృష్ట దినాలు | - | మంగళవారం, బుధవారం, శుక్రవారం |
| లక్కీ వివాహ తేదీలు | - | 6, 9, 15, 18, 24, 27 |

| | | |
|---|---|---|
| రెమిడీస్ | - | విష్ణుమూర్తిని ఆరాధించటం,<br>శుక్రజపం, భృగుపాశుపత హోమం చేయించటం,<br>బీద అమ్మాయిల పెండ్లి ఖర్చులలో భాగం పంచుకోవడం. |
| ఉదా | - | జవహర్‌లాల్ నెహ్రూ 14-11-1889<br>రాజ్‌కపూర్ 14-12-1924 |

## జన్మసంఖ్య - 5, డెస్టినీ నంబరు - 7 గల వ్యక్తులు

**5/7 వ్యక్తులు పరిశుభ్రంగా ఉండి మంచి ఆలోచనా శక్తి కలిగి ఉంటారు. దైవభక్తి ఎక్కువ. వీరికి అందమైన ఇల్లు, తోట ఉంటాయి. సంఘంలో మంచి గౌరవం కలిగి ఉంటారు.**

ఎవరు 5, 14, 23 తేదీలలో జన్మించి, వారి డెస్టినీ నెంబరు 7 అవుతుందో వారు ఈ వర్గంలోకి వస్తారు. వీరు బుధుడు, కేతు గ్రహ ప్రభావంలో ఉంటారు. ఒక మోస్తరు పొడవు, హుందాగా కనిపిస్తారు. సాధారణ వస్త్రాలలో సైతం శుచిగా శుభ్రంగా కనిపిస్తారు. వీరికి మంచి ఆలోచనాశక్తి, కల్పనాశక్తి ఉంటాయి. ఎప్పుడూ తీరికలేకుండా ఉంటారు. కొన్నిసార్లు ఒంటరిగా కూర్చొని ఆలోచిస్తారు. ఆధ్యాత్మిక జ్ఞానం, విద్యలలో రాణిస్తారు. వీరు జ్యోతిష్యం, న్యూమారాలజీ లాంటి అతీంద్రియ శక్తులతో ప్రాక్టీస్ చేస్తే తెలివిగా డబ్బు సంపాదిస్తారు. వైద్యవిద్య చదివితే వీరి చేతితో మందు ఇస్తే జబ్బు త్వరగా తగ్గుతుంది. డాక్టర్‌గా బాగా రాణిస్తారు. అనుకూలనామం ఉంటే ఉన్నత స్థానాలను పొందుతారు. లేకపోతే ఎన్నో సమస్యలతో అయోమయానికి గురవుతారు. అనైతిక ప్రవర్తనను సమర్థించరు.

దైవభక్తి వలన పుణ్యక్షేత్రాలను దర్శిస్తారు. చిన్న తప్పు చేసినా బాధపడతారు. వీరికి ఎంతోమందితో స్నేహం ఉన్నా అందరితో శాశ్వత స్నేహం ఉండదు. వీరు దెబ్బతింటే కోపం వస్తుంది. అంతా దైవేచ్ఛ అని, దైవ నిర్ణయం వలన జరుగుతాయి అని కొన్నిసార్లు వేదాంత ధోరణిలో మాట్లాడతారు. ఎవరికీ హాని చేయరు. సందర్భోచితంగా మాట్లాడడం వీరికి రాదు.

అనుకూల నామం ఉంటే అంతులేని సంపదను సంపాదించి, తమ అనుచరులకు కూడా సహాయం చేస్తారు. మతం, న్యాయం, సాహిత్యం, భాష, సంగీతం, నాట్యం, లలితకళలలో అభిరుచి ఉంటుంది. వీరికి అందమైన ఇల్లు ఉంటుంది. తోటపని అంటే ఇష్టం. ఇతరులకు సాధ్యమైనంత సహాయం చేస్తారు. అనుకూలమైన పేరు ఉంటే, కష్టాలు తగ్గి సాహసోపేతమైన పనులను చేస్తారు. సమాజంలో గౌరవనీయులుగా పేరు తెచ్చుకుంటారు. అనుకూల మైన పేరు లేకపోతే తమరి ప్రగతి వీరికి మనశ్శాంతిని ఇవ్వదు.

## పేరు పెట్టే విధానం

వీరికి సూర్య సంఖ్యలైన 19, 37, 46, 55, బుధ సంఖ్యలైన 5, 14, 23, 32, 41, శుక్ర సంఖ్యలైన 6, 15, 24, 33, 62, కేతు సంఖ్యలైన 25, 34లు పేర్లకు అనుకూలం.

## రాణించే రంగాలు

ఉపన్యాస, రచనా, వ్యాసంగాల నుంచి ఉంటుంది. కమీషన్ వ్యాపారం, కాంట్రాక్టులు, ప్రవచనాలు చెప్పటం, ఏజెన్సీలు, రవాణా, లోహ, స్టీలు, పరిశ్రమల ద్వారా ఎదగటానికి అవకాశం ఉంది. పచ్చరంగు వస్తువుల విక్రయాల ద్వారా లాభం వస్తుంది.

## వ్యాధులు

వీరికి మానసిక జబ్బులు, గ్యాస్ట్రిక్ ట్రబుల్, కంటి సమస్యలు, చెవి, వెన్నునొప్పి, ఆస్తమా వచ్చే అవకాశం ఉంది. సరియైన చికిత్స తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది.

## సూచనలు

| | | |
|---|---|---|
| లక్కీ నంబర్లు | - | 2, 5, 6, 7 |
| అన్‌లక్కీ నంబర్లు | - | 9 |
| లక్కీ తేదీలు | - | 2, 5, 6, 7, 11, 14, 15, 16, 20, 23, 24, 25, 29 |
| అన్‌లక్కీ డేట్స్ | - | 9, 18, 27 |
| లక్కీ కలర్స్ | - | బూడిదరంగు, ఆకుపచ్చ గోధుమ రంగు, నీలం, పసుపు |
| అన్‌లక్కీ కలర్స్ | - | ఎరుపు |
| అదృష్ట దినాలు | - | బుధవారం, సోమవారం, శుక్రవారం |

| | | |
|---|---|---|
| లక్కీ వివాహ తేదీలు | - | 1, 3, 6, 10, 12, 15, 19, 21, 24, 28 |
| రెమిడీస్ | - | పార్వతి అమ్మవారిని, వేంకటేశ్వర స్వామిని ఆరాధించటం, రోగులకు, అనాథలకు అన్నదానం చేయటం. |
| ఉదా | - | గౌతమ్ గంభీర్ 14-10-1981<br>సత్య సాయిబాబా 23-11-1926 |

## జన్మసంఖ్య - 5, డెస్టినీ నంబరు - 8 గల వ్యక్తులు

**5/8 వ్యక్తుల కళ్ళు ఎరుపు రంగులో ఉంటాయి. కష్టపడి జీవితంలో పైకి వస్తారు. అందరిచేత గౌరవించబడతారు. తమ పనులు చేసేటప్పుడు కొంచెం అయోమయానికి గురవుతారు. ఉద్యోగం చేసినా, వ్యాపారం కూడా చేస్తారు.**

ఎవరు 5, 14, 23 తేదీలలో జన్మించి, వారి డెస్టినీ నెంబరు 8 అవుతుందో వారు ఈ వర్గంలోకి వస్తారు. వీరిపై బుధ, శని గ్రహాల ప్రభావమధికం. ఒక మోస్తరు పొడవు, ఎర్రని కళ్ళుంటాయి. ధృడసంకల్పం ధైర్యం ఉంటాయి. కొందరికి సౌఖ్యవంతమైన జీవితం చిన్నతనం నుంచే ఉంటుంది. కొందరు యవ్వనంలో శ్రమిస్తారు. వీరికున్న ప్రత్యేక సామర్థ్యంతో జీవితంలో ఎదుగుతారు. ఉద్యోగులైన వ్యక్తులు కూడా అదనపు ఆదాయానికి పథకాలు, ప్రణాళికలు వేస్తారు. అనుకూలమైన పేరు ఉన్నవారు పరిశ్రమలు, ఉద్యోగంలో ఉన్నత స్థానాల్ని పొందుతారు. గృహ, వాహన, భూ సౌఖ్యాలుంటాయి. ప్రతికూలమైన పేరు ఉన్నవారు జీవితంలో ఒడిదుడుకులు ఎదుర్కొంటారు. ప్రకృతి సుందర దృశ్యాలను, నూతన పరిశ్రమలను చూసి ఆనందిస్తారు.

ఇంజినీరింగ్ గాని కామర్స్ సబ్జెక్టులు గాని చదివి తరువాత ఎం.బి.ఎ, ఎల్.ఎల్.బీ. లాంటి కోర్సులు చేస్తారు. ప్రభుత్వ ఉద్యోగులుగా రాణిస్తారు. కొత్తవాటిని చూసినప్పుడు వాటి గురించి పరిశోధిస్తారు. ఇనుప వస్తువులపై ఆసక్తి ఎక్కువ. వీరికి స్థిర లక్ష్యం, విజయవంతమైన జీవితం ఉంటుంది. దీని కోసం కష్టించి పనిచేస్తారు. ఉన్నత స్థితికి చేరుకుంటారు. వీరిది మెకానికల్ మైండ్, ఇతరులకు సులభంగా అర్థం కారు. సహజంగా వీరు సహాయకారులు. తమ శక్తిని మించి సాయం అందించాల్సి వచ్చినప్పుడు, చెయ్యలేనని

నిక్కచ్చిగా చెబుతారు. ఇతరులు వీరిని సమర్థులుగా గుర్తిస్తారు. పేరొందిన కంపెనీలకు సీఈఓలుగా, అంతర్జాతీయ సంస్థల్లో ఉన్నత పదవుల్లో ఉంటారు. మనీ మేనేజ్‌మెంట్ తెలుసు. అందువల్ల బ్యాంకులు, ఇన్సూరెన్స్ వంటి ఆర్థిక సంస్థల్లో ఉద్యోగాలు చేస్తారు.

సామాన్య వ్యక్తులుగా ఉన్నప్పటికీ గౌరవింపబడతారు. ప్రతికూలమైన పేరు ఉంటే వీరి ఆలోచనలు కలిసిరావు. ఇతరుల కోసం ఏదైనా పనిని చేపట్టినప్పుడు ధైర్యంగా చేసి విజయం సాధిస్తారు. కానీ తమ సొంత పనులు చేసేటప్పుడు అయోమయానికి గురవుతారు. అనుకూలమైన పేరు ఉంటే ఎన్నో సంస్థలలో విజయాన్నందుకుంటారు. వీరికి వ్యాపారంపై మక్కువ ఉంటుంది. వీరు ఎంతో కష్టించి పెద్ద కర్మాగారాల్ని ఏర్పాటుచేసి పెద్ద ఎత్తున సంపాదించాలని కోరుకుంటారు.

ఉద్యోగాల్లో ఉన్న వారు కూడా ఏదో ఒక వ్యాపారం నిర్వహించి అదనపు ఆదాయానికి మార్గాలు వేసుకుంటారు. న్యాయం, మతం, గణితం, జ్యోతిష్యం, కళల్లో లోతైన పరిజ్ఞానం ఉంటుంది. విదేశీయానం చేస్తారు. ఎక్కడైనా వింత వస్తువులు కనిపిస్తే, వాటి వివ రాలు సేకరిస్తారు. దానితో వ్యాపారం చేసి డబ్బు సంపాదించటానికి, పథకాలు వేస్తారు. విశ్రాంతి తీసుకోవాలని కోరుకుంటే బద్ధకస్తులుగా మారుతారు. దైవకృప ఉంటుంది. జీవితంలో అన్నీ లభించినా, ఒకదాని తర్వాత మరొకదానిని త్యజిస్తారు. అనుకూలమైన పేరుంటే జీవితం అన్ని రకాల సౌఖ్యాలతో సంతోషదాయకంగా ఉంటుంది.

## పేరు పెట్టే విధానం

వీరికి 6, 15, 24, 33, 42, 60, 69, 14, 23, 32, 41, 50, 59, 77 సంఖ్యలు పేర్లకు అనుకూలం.

## రాణించే రంగాలు

వీరికి స్టీలు, బంగారం, వెండి వృత్తులు అనుకూలం. కమీషన్ వర్క్, కాంట్రాక్టులు, ఎలక్ట్రికల్ వర్క్, రవాణా వ్యాపారం కలిసివస్తాయి.

## వ్యాధులు

వీరు ఉదర సమస్య, వెన్నునొప్పి, కీళ్ళనొప్పి, కంటినొప్పి, చెవినొప్పి, రక్తపోటు, మూలశంకలకు లోనవుతారు. తగిన చికిత్స తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది.

**సూచనలు**

| | | |
|---|---|---|
| లక్కీ నంబర్లు | - | 5, 6 |
| అన్‌లక్కీ నంబర్లు | - | 9 |
| లక్కీ తేదీలు | - | 1, 5, 6, 10, 14, 15, 19, 23, 24, 28 |
| అన్‌లక్కీ డేట్స్ | - | 9, 18, 27 |
| లక్కీ కలర్స్ | - | నీలం, బూడిదరంగు, పసుపు, క్రీమ్, గోల్డెన్ |
| అన్‌లక్కీ కలర్స్ | - | ఎరుపు |
| అదృష్ట దినాలు | - | బుధవారం, శుక్రవారం, ఆదివారం |
| లక్కీ వివాహ తేదీలు | - | 1, 3, 6, 10, 12, 15, 19, 21, 24, 28 |
| రెమిడీస్ | - | నవగ్రహ అభిషేకం, శనికి తైలాభిషేకం, కాకులకు స్వీట్స్, నల్లకుక్కలకు ఆహారం పెట్టడం. |
| ఉదా | - | శోభన్‌బాబు 14-01-1937 |
| | | కె.రాఘవేంద్రరావు 23-05-1942 |
| | | విజయ్ అమృత్‌రాజ్ 14-12-1953 (టెన్నీస్) |

## జన్మసంఖ్య - 5, డెస్టినీ నంబరు - 9 గల వ్యక్తులు

**5/9 వ్యక్తులు నాయకత్వ లక్షణాలు కలిగిఉంటారు. కోర్టు వ్యవహారాలలో సమర్థులు వయసు పెరిగే కొద్ది అభివృద్ధి సాధిస్తారు.**

ఎవరు 5, 14, 23 తేదీలలో జన్మించి, వారి డెస్టినీ నెంబరు 9 అవుతుందో వారు ఈ వర్గంలోకి వస్తారు. వీరు బుధ, కుజగ్రహాల ప్రభావంలో ఉంటారు. గంభీరంగా ఉంటారు. వీరిని చూడగానే సింహంలా కనిపిస్తారు. వీరికి శారీరక, మానసిక బలం ఉంటాయి. వీరు చెయ్యదలచుకుంది ఏదైనా స్థిరంగా చేస్తారు. తమపై ఆధారపడిన వారికి నాయకులుగా, శత్రువులకి బలమైన వైరిపక్షంగా ఉంటారు. తమకు అన్ని సాధ్యమేనని ఎలుగెత్తి చాటుతారు. అందరూ వీరిని ఉక్కుమనిషిగా భావిస్తారు. వీరికి అనుకూలమైన పేరు ఉంటే జీవితంలో అన్ని రకాల అభివృద్ధి ఉంటుంది. ఇతరులకి సహాయం అందించడం

ద్వారా గొప్పవారిగా ఉంటారు. అదనపు సంపాదన ఉంటుంది. వీరికి సివిల్, మెకానికల్, సైన్స్ గ్రూపులు చదవాలనే కోరిక ఉంటుంది. సివిల్ సర్వీసెస్, పోలీస్, మిలటరీ వంటి యూనిఫామ్ వేసుకునే ఉద్యోగాలను ఇష్టపడతారు.

ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపిస్తారు. ప్రశ్నలు వేయటం, కోర్టులో కేసులు వేయటంలో సమర్థులు. వీరి తెలివితేటలు కొన్నిసార్లు జిత్తులమారిగా పేరు తెస్తాయి. కొందరు ప్రజాసేవకులుగా గుర్తింపు పొందుతారు. వీరి జీవితం పోరాటాల మధ్య ముందుకెళ్తుంది. ఎన్నో అపాయాల్నించి తప్పించుకుంటారు. జీవితంలో ఎంతో అనుభవాన్ని సంపాదిస్తారు. సమాజానికి వీరు చేసిన సేవల వలన అందరూ వీరిని గొప్ప వ్యక్తులుగా గుర్తిస్తారు.

వీరి చుట్టూ ఎప్పుడూ మనుషులు గుమికూడి ఉంటారు. పెద్ద పెద్ద పారిశ్రామిక వేత్తలు వీరి సహచర్యాన్ని కోరుకుంటారు. అనుకూలమైన పేరు ఉంటే దినదినాభివృద్ధి సాధిస్తారు. రాజులా జీవిస్తారు. గృహ, వాహన, భూ సౌకర్యాలు ఉంటాయి. ప్రతికూలమైన పేరు ఉంటే అనేక సమస్యలు వస్తాయి. వయసు పెరిగే కొద్దీ జీవితానుభవం పెరిగి ప్రగతిని సాధిస్తారు. రియల్ఎస్టేట్ రంగంలో బాగా రాణిస్తారు.

వీరెప్పుడూ చురుకుగా ఉంటారు. కొన్నిసార్లు మాత్రం బద్ధకస్తులుగా వుంటారు. ఇతరులను ప్రోత్సహించడంలో నేర్పరులు. తమ సమస్యలు, కష్టాలు ఇతరులకు తెలియనివ్వరు. వారంతట వారే ధైర్యాన్ని కూడగట్టుకుంటారు. కమీషన్ వర్క్స్ ద్వారా డబ్బు సంపాదిస్తారు. డబ్బుని మంచినీళ్ళలా ఖర్చు చేసి ఒంటరిగా ఉన్నప్పుడు, డబ్బు కావాల్సినపుడు, అంతకు ముందు చేసిన అతి ఆడంబరపు ఖర్చులకు చింతిస్తారు. అనుకూలమైన పేరుంటే వీరికి అన్ని సౌఖ్యాలుండి, దైవకృప లభిస్తుంది.

## పేరు పెట్టే విధానం

వీరికి సూర్య సంఖ్యలైన 19, 37, 46, 55, బుధ సంఖ్యలైన 5, 14, 23, 32, 41, కుజ సంఖ్యలైన 9, 27, 45, 54లు పేర్లకు అనుకూలం.

## రాణించే రంగాలు

వీరికి కమీషన్ వ్యాపారం, కాంట్రాక్టులు, ఏజెన్సీలు, న్యాయ మధ్యవర్తిత్వం, స్టీలు, లోహ పరిశ్రమల ద్వారా అభివృద్ధి సాధ్యం.

## వ్యాధులు

వీరికి రక్తపోటు, గుండె వ్యాధులు, మధుమేహం, కీళ్ళనొప్పులు, వెన్నునొప్పి వచ్చే అవకాశం ఉంది. సరియైన చికిత్స తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది.

## సూచనలు

| | | |
|---|---|---|
| లక్కీ నంబర్లు | - | 1, 5, 9 |
| అన్‌లక్కీ నంబర్లు | - | 2, 7 |
| లక్కీ తేదీలు | - | 1, 3, 5, 6, 9, 10,<br>12, 14, 15, 18, 19, 21, 23, 24, 27, 28, 30 |
| అన్‌లక్కీ డేట్స్ | - | 2, 11, 20, 29, 7, 16, 25 |
| లక్కీ కలర్స్ | - | ఎరుపు, బూడిదరంగు, ఆకుపచ్చ, పసుపు |
| అన్‌లక్కీ కలర్స్ | - | నలుపు |
| అదృష్ట దినాలు | - | ఆదివారం, బుధవారం, మంగళవారం |
| లక్కీ వివాహ తేదీలు | - | 1, 6, 9, 10, 15, 18, 19, 24, 27, 28 |
| రెమిడీస్ | - | సుబ్రహ్మణ్య స్వామి అభిషేకం,<br>సోదరులతో సత్సంబంధాలు పెంపొందించుకోవాలి<br>అప్పుడప్పుడు రక్తదానం చేయాలి. |
| ఉదా | - | ప్రజ్ఞాన్ ఓజా 05-09-1986<br>బాబు జగ్జీవన్‌రామ్ 05-04-1908<br>జయిల్‌సింగ్ 05-05-1916<br>(మాజీ రాష్ట్రపతి) |

## జన్మ సంఖ్య - 6 (శుక్రుని సంఖ్య)

**ఈ సంఖ్య శుక్ర గ్రహానికి చిహ్నం. ఈ సంఖ్య కలవారు బాధ్యతాయుతంగా ఉంటారు. ఎక్కువ మంది ఉపాధ్యాయులు, వేదాంతులు, విద్యావేత్తలు, మత ప్రబోధకులు, శాస్త్రవేత్తలు ఈ సంఖ్య కలవారు. ప్రేమ, వాత్సల్యం, న్యాయం, ధర్మం మొదలైన వాటికి విలువ ఇస్తారు. వీరికి మానవత్వం, దయ, జాలి గుణాలు ఉంటాయి. వీరు పొగడ్తలకి లొంగిపోతారు. రహస్యాలు దాచలేరు.**

ఏ నెలలో అయినను 6, 15, 24వ తేదీలలో జన్మించిన వ్యక్తులు 6వ నంబరుకు సంబంధించిన వ్యక్తులవుతారు. వీరిపై శుక్ర గ్రహ ప్రభావం అధికంగా ఉంటుంది.

### 6వ నంబరు అనుకూల లక్షణాలు

కళాభిరుచి, సృజనాత్మకత, బాధ్యత, మానవసేవ, విశ్వాసపాత్రత, ఆధారపడతగిన వ్యక్తులు, నిస్వార్థపరులు, కుటుంబం పట్ల శ్రద్ధ, దయ, పరుల క్షేమం, స్థిర దృష్టి.

### అవకాశాలు - వృత్తులు

1+2+3=6, కాబట్టి 1, 2, 3 నంబరు వ్యక్తుల సుగుణాలన్నీ కలగలిసిన వ్యక్తులు. 1వ నంబరు వ్యక్తుల చొరవ, 2వ నంబరు వ్యక్తుల సహకారం, 3వ నంబరు వ్యక్తుల సృజనాత్మకతను కలగలిపి, 6వ నంబరు వ్యక్తులకి ఉంటాయి. దైవకృప అపారంగా ఉంటుంది. బాధ్యత, ప్రేమ, సౌఖ్యం, ఆదరణ, సంతోషాలని అందరికీ పంచి ఇచ్చే గుణముంటుంది. తెలివితేటలు, శక్తి సామర్థ్యాలతో ఇతరులకు త్యాగబుద్ధితో సేవ చేస్తారు. వీరెక్కడుంటే అక్కడ సంతోషం, ప్రేమ ఉంటుంది. ఇతరుల బాధ్యతలను భుజాలనెత్తుకుంటారు. జీవితం చివరి వరకు బాధ్యతాయుతంగా వుంటారు. వినోదం, ఓదార్పు, ఆనందాలను వారు అనుభవిస్తూ ఇతరులకీ పంచిపెడతారు.

శారీరకంగా దృఢంగా వుండి కూడా శారీరక శ్రమ చేయరు. ఎందుకంటే వీరి సృజనాత్మకత, మేధస్సు వీరికి అధికారాన్నిచ్చి అందలం ఎక్కిస్తుంది. ఉపాధ్యాయులు, వేదాంతులు, విద్యావేత్తలు, మత ప్రబోధకులు, శాస్త్రవేత్తలు, మంత్రులు, సలహాదారులు, రచయితలు 6వ నంబరు వ్యక్తులలో ఉంటారు. ఇతరులకు సాయం చేయడం వలన వీరికి అనేక వ్యాపార అవకాశాలు వస్తాయి. సౌందర్య, విలాస వస్తువుల క్రయ విక్రయాలు,

హోటల్స్, క్లబ్స్, విలాసవంతమైన అపార్టుమెంట్‌ల నిర్వహణ వీరికి ఇష్టమైన వృత్తులు. నీటి పారుదల, గనుల తవ్వకం, ఉద్యానవనాలు, జంతుశాస్త్రం, నౌకాయానం లాంటి విభాగాలలో పనిచేస్తుంటారు. వివాహం, కుటుంబం ద్వారా వారసత్వ సంపద లభిస్తుంది. వీరు ఫ్యాషన్ టెక్నాలజీ సంబంధిత వృత్తులు, నటన, చిత్రాలు తీయటం మొదలగు వృత్తులలో స్థిరపడతారు.

## 6వ నంబరు వ్యక్తుల నెగిటివ్ లక్షణాలు

అతి బాధ్యతలు, అతి త్యాగబుద్ధి వ్యక్తిగత జీవితంలో అసంతృప్తిని ఇస్తుంది. కారణం లేకుండా అతిగా బాధ్యతలు తీసుకోరాదు. త్యాగం, కుటుంబ బాధ్యతలు, ఇతరుల సమస్యలు వీరి జీవితాన్ని దుర్భరంగా చేయవచ్చు. ఆనందం, ఆహ్లాదం కోసం అతి తాపత్రయం వలన చులకన అవుతారు. స్వార్థపరులుగా భావించబడతారు. ముక్కుసూటితనం వలన సమస్యలు వస్తాయి. అహం వలన గుర్తింపు దెబ్బతింటుంది.

## వ్యక్తిగతం

ఆప్యాయత, సంతోషం, న్యాయం వీరి ప్రాథమిక అవసరాలు. ఇవి లేకుండా జీవితంలో అభివృద్ధి సాధించలేరు. అవసరానికి మించి అందరినీ ఆదరించి, వారి నుండీ అంతే కోరుకుంటారు. బంధుమిత్రులు వీరిని నమ్మకస్తులుగా భావిస్తారు. ఎందుకంటే వీరు కుటుంబం, తల్లిదండ్రుల పట్ల చూపించే బాధ్యత దానికి కారణం. వీరికి సంతోషకర వాతావరణం లేనిదే ప్రతిభకు తగ్గట్లు రాణించి, ఉన్నత విజయాలను సాధించలేరు. వీరు డబ్బు విషయంలో నిజాయితీపరులు. 6 వ నంబరు వ్యక్తులు త్యాగబుద్ధికి, మానవసేవకు, ఆధ్యాత్మిక ఉన్నతి కోసం జన్మిస్తారు.

## 6వ నంబరు వ్యక్తుల మరికొన్ని పాజిటివ్ లక్షణాలు:

- అందరితో బాధ్యతాయుతంగా ప్రవర్తించటం
- సమాజసేవ చేయటం
- సర్దుకుపోయే గుణం కలిగి ఉండటం
- ఇతరుల కష్టాలలో పాలుపంచుకోవటం
- కుటుంబం పట్ల బాధ్యతగా ఉండటం
- అందరినీ సంతోషపెట్టే గుణం
- విద్యాబోధన బాగా చేయగలగటం

- సత్యం, ధర్మం, న్యాయం కలిగి ఉండటం
- వంట బాగా చేయగలగటం
- బట్టలు, అలంకార వస్తువులు కొత్తవి తయారుచేయటం
- పద్ధతిగా పని పూర్తి చేయగలగటం

## నెగిటివ్ లక్షణాలు

- సమాజం పట్ల బాధ్యత లేకపోవటం
- ఇతరుల వ్యవహారాల్లో అనవసరంగా జోక్యం చేసుకోవటం
- అందరి సమస్యల పట్ల ఎక్కువగా ఆందోళన చెందటం
- ఇంటిలో అతి పెత్తనం
- స్వార్థం కలిగి ఉండటం
- మూర్ఖంగా వాదించటం

పైథాగరస్, అతని శిష్యులు, 2, 4, 6, 8 సంఖ్యలను స్త్రీ సంఖ్యలుగా పరిగణించారు. 2 చంద్రుడు, 6 శుక్రుడుని సూచిస్తూ, స్త్రీ గ్రహాలు కావడం వలన, 2వ నంబరు స్వయం ప్రకాశితం కాదు. స్ఫూర్తి, ధైర్యం, ఆత్మవిశ్వాసం ఇతరుల నుంచి గ్రహించాలి. కాని 6వ నంబరు వ్యక్తులకు ఆ అవసరం లేదు. 6వ నంబరు హుందాతనానికి, బాధ్యతకు కూడా పెట్టింది పేరు. వీరిలో భావోద్రేకాలు, మేధస్సు, విచక్షణ సమతుల్యంగా ఉంటాయి.

వీరు భావయుక్తంగా, ప్రేమపూరితంగా, సహనంతో, త్యాగబుద్ధితో, బాధ్యతతో, సమయస్ఫూర్తితో వుంటారు. రక్షించే, అభ్యర్థించే, ఆకర్షించే, ఆతిథ్యమిచ్చే, గర్వించే విధంగా ఉంటారు. అందరినీ ఆదరిస్తారు. కుటుంబ వాతావరణాన్ని ఇష్టపడతారు. ఇతరులకు రక్షణ, సహాయం నిస్సంకోచంగా అందిస్తారు. ఇతరులకు సౌకర్యవంతంగా వుండటం కోసం వీరు సుఖాన్ని వదులుకుంటారు.

మానవత్వం, దయ, అంకితభావం, భక్తి, సౌభ్రాతృత్వం, సహనం, అర్థం చేసుకునే గుణం కలవారు. ఎమర్సన్ మాటల్లో సమస్త మానవులు వీరిని ప్రేమిస్తారు. విశాల హృదయం కలవారై, సున్నిత మనస్కులై నొప్పించక, తానొవ్వక, తమ మాటలతో, చేతలతో ఇతరులకు సంతోషాన్ని చేకూరుస్తారు. ఎవరైనా సరే వీరి సాహచర్యం కోరుకుంటారు.

వీరు గొప్ప ఐశ్వరాన్ని కలిగి వుండరు, దానికై ప్రయత్నించరు. వీరు చేసిన సాయం, వీరికి అవసరం అయినపుడు ఆదుకుంటుంది. అందంగా వున్న ప్రతీదాన్ని అభినందిస్తారు. కొందరు కళా సంబంధిత వృత్తులను చేపడతారు. కళల పట్ల అభిరుచి ఉంటుంది. ఈ నెంబరు గల వ్యక్తులు ప్రస్తుతం సినిమా, టీవీ, మీడియా రంగాల్లో రాణిస్తున్నారు.

ఆకర్షణీయమైన దుస్తులు, మంచి రంగులు, సుగంధ, పరిమళ ద్రవ్యాలు, పువ్వులు, ఆహ్లాదకరమైన ఇల్లు, వాతావరణం ఇష్టపడతారు. మన ఆనందం ఇతరుల ఆనందం మీద ఆధారపడి ఉంటుందని నమ్ముతారు. ఇతరులకు సాయం అందించే అవకాశాల కోసం ఎదురుచూస్తారు. వీరి వేషధారణ ఆకర్షణీయంగా ఉంటుంది. వీరు మేధావులు, సంప్రదాయవాదుల స్నేహం లభిస్తుంది. విశ్వాసవంతులైన మిత్రులను కల్గి ఉంటారు.

పెద్దవారిని వీరి విధేయతతో, సామాన్యులను తమ ఆకర్షణతో కట్టిపడేస్తారు. ఎప్పుడూ అనైతికమైన మార్గాల జోలికి వెళ్లరు. తమను తాము తక్కువ చేసుకోరు. ఆత్మన్యూనతాభావం ఉండదు. తాము చేసే పనులకు గుర్తింపుని, కృతజ్ఞతను కోరుకుంటారు. పొగడ్తలకు పొంగిపోతారు.

వీరికి వేదాంత ధోరణి ఎక్కువ. సుఖాలను, రుచికరమైన ఆహారాన్ని ఇష్టపడతారు. మేధావి వర్గానికి చెంది, ఆదర్శవంతమైన జీవితాన్ని కోరుకుంటారు.

సాంస్కృతిక కార్యక్రమాలు అంటే ఇష్టం. శాంతి, సామరస్యం కోరుకుంటారు. ప్రభుత్వ సత్కారాలు వీరికి లభిస్తాయి. ఉన్నత అధికారులుగా ఎన్నికవుతారు. వీరికి ఇంగిత జ్ఞానం, తర్కం, దృఢసంకల్పం, పట్టుదల ఉంటాయి. మానసిక శాస్త్రాన్ని అభ్యసించడం, ఇతరుల ఆలోచనలను చదవడం వీరికి సులభం. రహస్యాన్ని దాచలేని వారై ఉంటారు. నిరంతరం అప్రమత్తంగా వుండి, భద్రతను కోరుకుంటారు. డబ్బులేమి వీరిని విచారగ్రస్తులుగా చేస్తుంది. రిస్కు వ్యాపారాలు చేయరు. సంప్రదాయ మార్గాన్ని అనుసరిస్తారు. శాంతియుతమైన జీవితాన్ని కోరుకుంటారు.

కొత్తవారితో ముభావంగా ఉంటారు. పాత స్నేహితులతో విశ్వాసపాత్రంగా వుంటారు. క్రూరత్వం, హింస, అసభ్యతకు వ్యతిరేకులు. కోపం వస్తే చివరి వరకు పోరాడతారు. 15, 24, 42, 51 సంవత్సరాలలో ముఖ్యమైన మార్పులుంటాయి.

6వ నంబరు వ్యక్తులు ఆకర్షణీయంగా, సుకుమారంగా ఉండి చక్కగా మాట్లాడేవారుగా, కళాభిరుచి కలిగిన వారుగా ఉంటారు. అందరితో గౌరవింపబడతారు. స్వేచ్ఛగా కలివిడిగా ఉంటారు. ప్రయాణాలు, విదేశీ యాత్రలను ఇష్టపడతారు. వీరెప్పుడూ తీరికగా వుండరు. మంచి దుస్తులు ధరిస్తారు. అలంకారం చేసుకుంటారు. అంద వికారాన్ని, అ శుభ్రతను, చిందరవందరతనాన్ని ఇష్టపడరు. ఇంటిని శుభ్రంగా వుంచి, అందంగా అలంకరించుకుంటారు.

ఆందోళనపూరిత వాతావరణానికి, అనవసర వాదనలకు దూరంగా ఉంటారు. వీరితో గొడవ పెట్టుకున్న వారికి దూరంగా ఉంటారు. ఇతరుల రహస్యాలను సులువుగా గ్రహిస్తారు. ఆలోచించి పనిచేస్తారు. నిదానమే ప్రధానం అని నమ్మి విజయాన్ని సాధిస్తారు. వీరికి సొంత ఇల్లు, భూములు, వాహనాలు ఉంటాయి.

జన్మ సంఖ్య యొక్క ప్రభావం వ్యక్తులపై ఏ విధంగా ఉంటుందో, డెస్టినీ నంబరు ప్రభావం కూడా వ్యక్తులపై ఉంటుంది. దాని వలన 6 జన్మ సంఖ్య ఉన్న వ్యక్తులందరి గుణగణాలు ఒకేలా ఉండవు. కారణం డెస్టినీ నంబరు మరియు నామ సంఖ్య మారటమే. కాబట్టి ప్రస్తుత 6 జన్మసంఖ్య కలవారి గుణగణాలు కూడా డెస్టినీ నంబరు, నామ సంఖ్యను బట్టి మారుతూ ఉంటాయి. పాఠకులు ఈ విషయం గమనించగలరని మనవి.

## జన్మసంఖ్య – 6, డెస్టినీ నంబరు – 1 గల వ్యక్తులు

**6/1 వ్యక్తులు పొడుగ్గా ఉంటారు. వాహనాలంటే ఇష్టం. ఎక్కువ కష్టపడకుండా సంపాదన చేస్తారు. వయసు పైబడినా ఆకర్షణీయంగా ఉంటారు.**

ఎవరు 6, 15, 24 తేదీల్లో జన్మించి వారి డెస్టినీ నెంబరు 1 అవుతుందో వారు ఈ వర్గంలోకి వస్తారు. వీరిపై రవి, శుక్రుల ప్రభావం ఉంటుంది. వీరు పొడుగ్గా, అందంగా ఉండి చక్కగా మాట్లాడతారు. అనుకూలమైన పేరుంటే గృహ, భూ, వాహన సౌఖ్యాలుంటాయి. లేకపోతే అవకాశాలున్నా అవాంతరాలు తప్పవు. వీరికి వాహనాలు ఇష్టం. ప్రకృతి సౌందర్యాన్ని ఆరాధిస్తారు. కొందరు విదేశీయాత్రలు చేస్తారు. పరిశుభ్రంగా కనిపిస్తారు. సమస్యలను సమర్థంగా ఎదుర్కొంటారు. సూటిగా, సుందరంగా మాట్లాడతారు.

ఎక్కువ శ్రమ లేకుండానే డబ్బుని ఆర్జిస్తారు.

ఉద్యోగులుగా ఉన్నా భాగస్వామి వ్యాపారాలు చేస్తారు. విలాస వస్తువుల వ్యాపారంలో అవకాశాలు వస్తాయి. ఏ వస్త్రధారణ చేసినా అందంగా వుంటారు. అనుకూల నామం ఉంటే అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతారు. అందరితో కలివిడిగా ఉండరు. కొంతమందే స్నేహితులు వుంటారు. లాభం రాని పనులలో కాలాన్ని వృథా చేయరు. డబ్బు వచ్చే పనులే చేపడతారు.

వీరు ఏ ఉద్యోగంలో చేరిన అనతి కాలంలోనే ఉన్నత స్థితికి వస్తారు. ఒకరి కింద పనిచేయడం కన్నా, ఒకరిపై అజమాయిషీ చేసే వారుగా రాణిస్తారు. వయసు పెరుగుతున్నా ఆకర్షణీయంగా ఉంటారు. ఆనందకరమైన జీవితానికి ప్రాధాన్యత ఇస్తారు. అందమైన వస్తువులను ఎన్నుకుంటారు. గృహాలంకరణ పట్ల ఆసక్తి చూపిస్తారు. న్యాయం, గణితం, జ్యోతిష్యం, హస్తకళలలో అభిరుచి ఉంటుంది. అనుకూలమైన పేరు లేకపోతే ఉన్నత స్థానంలో ఉన్నా బాధలు తప్పవు. అనుకూలమైన పేరు ఉంటే జీవితం సౌఖ్యవంతంగాను, సంతోషదాయకంగాను ఉంటుంది. దేవునిపై విశ్వాసం ఉంటుంది. కష్టేఫలి అని నమ్ముతారు.

## పేరు పెట్టే విధానం

వీరికి సూర్య సంఖ్యలైన 19, 37, 46, 55, శుక్ర సంఖ్యలైన 6, 15, 24, 33, 42, కుజ సంఖ్యలైన 9, 27, 45, 54లు పేర్లకు అనుకూలం.

## రాణించే రంగాలు

విలాసవస్తు వ్యాపారాలు, కాంట్రాక్టులు, ఏజెన్సీలు, స్టీలు పరిశ్రమలు, రవాణా వ్యాపారాలు లాభసాటిగా ఉంటాయి.

## వ్యాధులు

అధిక ఉష్ణ సంబంధ వ్యాధులు, నీటి సంబంధ వ్యాధులు, గ్యాస్ట్రిక్ ట్రబుల్, పైల్స్, రక్తపోటు వచ్చే అవకాశం ఉంది. సరైన చికిత్స తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది.

## సూచనలు

| | | |
|---|---|---|
| లక్కీ నంబర్లు | - | 1, 6, 9 |
| అన్‌లక్కీ నంబర్లు | - | 3 |

| | | |
|---|---|---|
| లక్కీ తేదీలు | - | 1, 6, 9, 10, 18, 19, 15, 24, 27, 28 |
| అన్‌లక్కీ డేట్స్ | - | 3, 12, 21 |
| లక్కీ కలర్స్ | - | పసుపు, పచ్చ, రోజ్, తెలుపు, క్రీమ్, గోల్డెన్, తెలుపు, నీలం |
| అన్‌లక్కీ కలర్స్ | - | నారింజ, ఊదా, నలుపు |
| అదృష్ట దినాలు | - | ఆది, మంగళ, శుక్రవారాలు |
| లక్కీ వివాహ తేదీలు | - | 1, 6, 9, 10, 15, 18, 19, 24, 27, 28 |
| రెమిడీస్ | - | శుక్రజపం, ఆదిత్య హృదయ పారాయణం, అనాథలకు, పేద వారి వివాహ ఖర్చులలో పాలుపంచుకోవడం |
| ఉదా | - | సుఖ్‌దేవ్ 15-05-1907 స్వాతంత్ర్య సమరయోధుడు<br>దేవేంద్రనాథ్ ఠాగూర్ 15-05-1817 సంఘసంస్కర్త |

## జన్మ సంఖ్య - 6, డెస్టినీ నంబరు - 2 గల వ్యక్తులు

**6/2 వ్యక్తులు వయసు పెరిగే కొద్దీ లావవుతారు. న్యాయవాద వృత్తి, మధ్యవర్తిత్వం చేస్తారు. పొగడ్తలకు లొంగిపోతారు. వీరికి దేవుని కృప ఉంటుంది.**

ఎవరు 6, 15, 24 తేదీలలో జన్మించి వారి డెస్టినీ నెంబరు 2 అవుతుందో వారు ఈ వర్గంలోకి వస్తారు. వీరిపై శుక్ర, చంద్ర గ్రహాల ప్రభావం ఉంటుంది. ఒక మోస్తరు పొడవుగా, బలంగా ఉంటారు. వయసు పెరిగే కొద్ది లావుగా అవుతారు. వీరు అందంగా ఉంటారు. శుభ్రమైన దుస్తులు వేసుకొంటారు. చక్కటి కేశాలంకరణను ఇష్టపడతారు. సుఖ జీవితాన్నే సదా కోరుకుంటారు. చంద్రుని ప్రభావం చేత, అయోమయం, మానసిక చంచలత్వాలకు గురవుతారు. వీరి ప్రత్యేక సామర్థ్యం చేత రాణిస్తారు. వాద ప్రతివాదనలు, న్యాయ మధ్యవర్తిత్వం, పరిశీలనలందు దిట్ట. వీరికి అందంతో పాటు మంచి తెలివితేటలు ఉంటాయి. అందువలన వీరికి మంచి పేరు వస్తుంది. వీరి చుట్టూ జనం ఉంటారు. సినిమా రంగంలో రాణిస్తారు. మంచి కవులు, రచయితలుగా పేరు ప్రఖ్యాతులు వస్తాయి. వీరు సైన్స్ గ్రూప్, ఎం.బి.ఏ, బి.సి.ఎ, కంప్యూటర్స్, ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్ వంటి రంగాల్లో విద్యనభ్యసిస్తారు. అనుకూల నామం ఉంటే భూ, గృహ, వాహన సౌఖ్యాలు

ఉంటాయి. కొందరికి రచనా, న్యాయవాద వృత్తులు, మధ్యవర్తిత్వం, ఔషధ సంబంధ పనుల ద్వారా రాబడి ఉంటుంది. ప్రతికూల నామం ఉంటే, దురలవాట్లకు లోనవుతారు. అయోమయానికి గురై తప్పుడు నిర్ణయాలు తీసుకొంటారు. పొగడ్తలకు లొంగుతారు. వీరు తమను తప్పు పట్టే వారిని నచ్చరు. కాబట్టి తమ లోపాలను తామే సరిదిద్దుకోవాలి. బయటికి కఠినంగా కనిపించినా మంచి మనసున్న వారు.

వీరు తమ మీద ఆధారపడిన వాళ్ళకు సాధ్యమైనంత సాయం అందిస్తారు. దైవకృప ఉంటుంది. ప్రకృతి సౌందర్యం అంటే ఇష్టం. న్యాయం, మత గ్రంథాలు, జ్యోతిష్యంపై అభిరుచి ఉంటుంది. ఒంటరిగా వున్నప్పుడు వారిలో వారే మాట్లాడుకుంటారు. అనుకూల నామం ఉంటే మంచి ఆరోగ్యం, అంకితభావంతో కూడిన జీవిత భాగస్వామి, తెలివైన సంతానం, మంచి సంపద లభిస్తాయి.

## పేరు పెట్టే విధానం

వీరికి సూర్య సంఖ్యలైన 19, 37, 46, 55, శుక్ర సంఖ్యలైన 6, 15, 24, 33, 42, కేతు సంఖ్యలైన 25, 34 లు పేర్లకు అనుకూలం.

## రాణించే రంగాలు

పచ్చని వస్తువులకి సంబంధించిన వ్యాపారం, విలాస వస్తువులు, ఆభరణాలు, కమీషన్ వ్యాపారం, కాంట్రాక్టులు, ఏజెన్సీలు, రవాణా వ్యాపారాలలో వీరు రాణిస్తారు.

## వ్యాధులు

మానసిక జబ్బులు, నీటి సంబంధిత వ్యాధులు, చర్మ వ్యాధులు, కీళ్ళ నొప్పులు, కంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది. తగిన చికిత్స తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది.

## సూచనలు

| | | |
|---|---|---|
| లక్కీ నంబర్లు | - | 2, 6, 7 |
| అన్‌లక్కీ నంబర్లు | - | 3 |
| లక్కీ తేదీలు | - | 1, 2, 6, 7, 10, 11, 15, 16, 19, 20, 24, 25, 28, 29 |
| అన్‌లక్కీ డేట్స్ | - | 3, 12, 21, 30 |
| లక్కీ కలర్స్ | - | తెలుపు, లేతనీలం, పసుపు, గోల్డెన్, క్రీమ్ |

| | | |
|---|---|---|
| అన్‌లక్కీ కలర్స్ | - | ఎరుపు |
| అదృష్ట దినాలు | - | ఆది, సోమ, శుక్రవారాలు |
| లక్కీ వివాహ తేదీలు | - | 1, 6, 10, 15, 19, 24, 28 |
| రెమిడీస్ | - | శుక్రజపం చేయించటం, రాత్రిపూట వెన్నెలలో 30-40 నిమిషాలు గడపటం. తల్లిని కాని, తల్లితో సమానురాలైన వారిని కానీ ఆదరించటం. |

| | | |
|---|---|---|
| ఉదా : | ఎ.ఆర్.రహమాన్ | 06-01-1966 |
| | జయలలిత | 24-02-1948 |
| | శ్రీశాంత్ | 06-02-1983 |

## జన్మ సంఖ్య - 6, డెస్టినీ నంబరు - 3 గల వ్యక్తులు

**6/3 వ్యక్తులు గురువు, శుక్రుడు ప్రభావం వలన కొంత వ్యతిరేకత ఎదుర్కొంటారు. ఇతరులకు సాయం చేస్తారు. విదేశీయాత్రలు చేస్తారు.**

ఎవరు 6,15, 24 తేదీలలో జన్మించి వారి డెస్టినీ నెంబరు 3 అవుతుందో వారు ఈ వర్గంలోకి వస్తారు. వీరిపై శుక్ర, గురు గ్రహాల ప్రభావం ఉంటుంది. శుక్రుడు రాక్షస గురువు, గురువు దేవతల ఆచార్యుడు. వీరు పరస్పర వ్యతిరేకులు. అందువలన వీరిలో మానసిక సంఘర్షణ ఉంటుంది. శుక్ర, గురువులు ఒకరికి ఒకరు వ్యతిరేకులైనా గానీ ఇద్దరు గురువులైనందున వీరికి మంచి ప్రవర్తన, ఇతరులకు సహాయపడాలనే కోరిక ఉంటాయి. మంచి జ్ఞానం, మర్యాద, ఇతరులను ఆప్యాయయంగా చూడటం వీరి లక్షణాలు. వీరు ఎక్కువగా సైన్స్ గ్రూపు అంటే డాక్టర్స్, ఎం.సి.ఎ, కంప్యూటర్స్, ఎలక్ట్రానిక్స్ రంగాలలో రాణిస్తారు. అనుకూల నామం ఉంటే చెడు ప్రభావం తగ్గి, ప్రగతి సాధిస్తారు. వీరు మంచి కుటుంబం నుంచి వచ్చిన వారై వుంటారు. అనుకూల నామం లేకపోతే సమస్యలు వస్తాయి. వీరి పనులు అపార్థాలకు దారి తీస్తుంటాయి. నిరాశ నిస్పృహలకు లోనవుతారు. అనుకూల నామం ఉంటే, ఈ వ్యతిరేక ప్రభావాన్ని నివారించి, విజయాన్ని సాధించవచ్చు. అనుకూల నామంతో వృత్తిలో ఉన్నత స్థానం పొందుతారు.

వీరికి ఇతరులకు సహాయం చేసే గుణం ఉంటుంది. విదేశీ యాత్రలు చారిత్రక ప్రదేశాల సందర్శన. ప్రకృతి సుందర దృశ్యాల సందర్శనలను ఇష్టపడతారు. అనుకూల నామం లేకపోతే, కుటుంబ జీవితంలో సమస్యలు వస్తాయి. అసంతృప్తికర జీవితాన్ని గడుపుతారు. అనుకూల నామం ఉంటే పై చెడు ప్రభావాల నుంచి బయటపడతారు. జీవితంలో అన్ని సౌఖ్యాలతో ఆనందకర జీవితం లభిస్తుంది. న్యాయశాస్త్రం, గణితం, వేదాంతం, జ్యోతిష్యం, టీచింగ్, వైద్యం వంటి రంగాల్లో అభిరుచి ఉంటుంది. అనుకూల నామం అదృష్టాన్ని, ఆరోగ్యాన్ని, సంపదని, జీవిత భాగస్వామిని, సంతానాన్ని ఇస్తుంది.

## పేరు పెట్టే విధానం

వీరికి శుక్ర సంఖ్యలైన 6, 15, 24, 33, 42, 51, కుజ సంఖ్యలైన 9, 27, 45లు పేర్లకు అనుకూలం.

## రాణించే రంగాలు

విలాస వస్తు, వ్యాపార, వస్త్ర దుకాణాలు, ఫ్యాక్టరీలు, కమీషన్ వ్యాపారం, ఏజెన్సీలు, కళా సంబంధిత వ్యాపారాలు, స్కూలు, కాలేజీలు, హాస్పిటల్స్ మొదలగు వ్యాపారాలు లాభసాటిగా ఉంటాయి.

## వ్యాధులు

మానసిక జబ్బులు, గుండెనొప్పి, కీళ్ళనొప్పి, పంటినొప్పి, కంటి జబ్బులు ఉండవచ్చు. సరియైన చికిత్స తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది.

## సూచనలు

| | | |
|---|---|---|
| లక్కీ నంబర్లు | - | 1, 9 |
| అన్‌లక్కీ నంబర్లు | - | 3 |
| లక్కీ తేదీలు | - | 1, 10, 19, 28, 9, 18, 27 |
| అన్‌లక్కీ డేట్స్ | - | ఏమీ లేవు |
| లక్కీ కలర్స్ | - | పసుపు, ఆకుపచ్చ, క్రీమ్, తెలుపు |
| అన్‌లక్కీ కలర్స్ | - | నలుపు |
| అదృష్ట దినాలు | - | ఆదివారం, శుక్రవారం, గురువారం |
| లక్కీ వివాహ తేదీలు | - | 1, 9, 10, 18, 19, 27, 28 |

| | | | |
|---|---|---|---|
| రెమిడీస్ | - | శుక్ర, గురుల జపం చేయించటం. | |
| | | గురువులను సత్కరించటం. | |
| | | దక్షిణామూర్తిని ఆరాధించటం. | |
| ఉదా | - | మీరా జాస్మిన్ | 15-02-1984 |
| | | ఏపీజే అబ్దుల్‌కలాం | 15-10-1931 |
| | | మోక్షగుండం విశ్వేశ్వరయ్య | 15-09-1860 |
| | | సచిన్ టెండుల్కర్ | 24-04-1973 |

## జన్మ సంఖ్య - 6, డెస్టినీ నంబరు - 4 గల వ్యక్తులు

**6/4 వ్యక్తులు స్వేచ్ఛాప్రియులు. వాక్చాతుర్యం కలవారు. అందమైన వస్తువులు వీరికి ఇష్టం. అందరిచేత గౌరవింపబడతారు.**

ఎవరు 6, 15, 24 తేదీలలో జన్మించి, వారి డెస్టినీ నెంబరు 4 అవుతుందో వారు ఈ వర్గంలోకి వస్తారు. వీరిపై శుక్ర, రాహు గ్రహ ప్రభావం ఉంటుంది. వీరు మంచి వాక్చాతుర్యం కలవారు. స్వేచ్ఛాప్రియులు, ధైర్యవంతులు. ప్రజాసేవ, జీవన ప్రమాణాల స్థాయిని పెంచుకోవడం, అందమైన వస్తువుల సేకరణ వీరికి ఇష్టం. వీరు ఒక మోస్తరు పొడగరులు. అలల్లాంటి జుత్తుతో బలంగా ఉంటారు. వినోదాన్ని, డబ్బుని ఇచ్చే పనులు చేస్తారు. అనుకూలమైన పేర్లు లేనిచో, గాలి వార్తలు వ్యాపింపజేసి వృథా కాలయాపన, వ్యర్థ సంభాషణలు చేస్తారు. వీరి ప్రతిభను ఇతరులు వాడుకుంటారు. అనుకూల నామం ఉంటే గృహ, భూ, రవాణా, సౌఖ్యాలతో అన్ని భౌతిక సుఖాలుంటాయి. ఆనందకర జీవితం గురించే ఎప్పుడూ ఆలోచిస్తారు. అందరికీ సాయం చేస్తారు. సమాజం వీరిని గౌరవిస్తుంది. ఇతరుల సంక్షేమం కోసం పాటుపడతారు. దైవకృప ఉంటుంది.

కొన్నిసార్లు వీరు చేస్తున్న పనిని మధ్యలో ఆపి వేరే పనిని చేపడతారు. అనుకూల నామం లేకపోతే అనవసర సమస్యలు ఎదురవుతాయి. ఇతరులకు గ్యారంటీ, షూరిటీలిచ్చి ఇబ్బందులపాలవుతారు. అందమైన ఇల్లు, వాహనాలంకరణ, ఇంటి అలంకరణ వీరికిష్టం. సంగీత, నృత్య, క్రీడ, న్యాయ, మత విషయాలందాసక్తి ఉంటుంది. తరచూ వాహనాలు

మార్చటం ద్వారా అదృష్టం లభిస్తుంది. గుడికి వెళ్లకపోయినా దేవునిపై నమ్మకం ఉంటుంది. మనసులో ఏ విషయాన్ని ఉంచుకోరు, అందరూ వీరిని బోళాశంకరులని అంటారు. వికలాంగులకు దానం చేస్తారు. బద్ధకస్తులను ఇష్టపడరు. భోజన ప్రియులు. తింటున్నప్పుడు ఆసక్తిగా మాట్లాడతారు. వారసత్వ సంపద లభిస్తుంది.

వీరికి సైన్స్ గ్రూపుల మీద ఇష్టముంటుంది. వీరికి కొత్త టెక్నాలజీ మీద అమితమైన ఇష్టం ఉంటుంది. కొత్త విషయాలను కనిపెడుతుంటారు. కంప్యూటర్స్, ఎలక్ట్రానిక్స్ రంగాలలో వీరు కొత్త పద్ధతులను కనిపెట్టి ప్రపంచానికి సేవ చేస్తారు. పెండ్లి అయిన తరువాత వీరి జీవితంలో చాలా ఉన్నతిని పొందుతారు.

## పేరు పెట్టే విధానం

వీరు శుక్ర సంఖ్యలైన 6, 15, 24, 33, 42 లు పేర్లు అనుకూలం.

## రాణించే రంగాలు

వీరికి బేరసారాలు, సరుకుల రవాణా, విలాస వస్తువులు, రవాణా, కాంట్రాక్టులు, ఏజెన్సీలు, సౌందర్య సాధనాలు, ఫ్యాక్టరీలు, కంప్యూటర్స్ కంపెనీలు, ఎలక్ట్రానిక్స్ కంపెనీలు కలిసివస్తాయి.

## వ్యాధులు

వీరికి చర్మ వ్యాధులు, అధిక ఉష్ణ సంబంధ వ్యాధులు, ఉదర సమస్యలు, గ్యాస్ట్రిక్ ట్రబుల్స్, కీళ్ళ జబ్బులుంటాయి. సరియైన చికిత్స తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది.

## సూచనలు

| | | |
|---|---|---|
| లక్కీ నంబర్లు | - | 6, 1, 9 |
| అన్‌లక్కీ నంబర్లు | - | 3 |
| లక్కీ తేదీలు | - | 6, 15, 24, 1, 10, 19, 28, 9, 18, 27 |
| అన్‌లక్కీ డేట్స్ | - | 3, 12, 21, 30 |
| లక్కీ కలర్స్ | - | పచ్చ లేతనీలం, పసుపు, రోజ్, గోల్డెన్, తెలుపు |
| అన్‌లక్కీ కలర్స్ | - | గులాబీ, నారింజ, ఊదా, నలుపు, ఎరుపు |
| అదృష్ట దినాలు | - | ఆదివారం, శుక్రవారం, మంగళవారం |
| లక్కీ వివాహ తేదీలు | - | 1, 6, 9, 10, 15, 18, 19, 24, 27, 28 |

రెమిడీస్ – శుక్ర జపం, సుబ్రహ్మణ్య స్వామి అభిషేకం, బీదలకు అనాథలకు అన్నదానం చేయటం, బీద ఆడపిల్లలకు చదువుకొనుటకు కాని, పెండ్లి కొరకు కాని సహాయం చేయటం.

ఉదా –

## జన్మ సంఖ్య - 6, డెస్టినీ నంబరు - 5 గల వ్యక్తులు

**6/5 వ్యక్తులు కొన్నిసార్లు మర్యాదగా, కొన్నిసార్లు దుడుకుగా ఉంటారు. వీరిని మోసం చేయటం కష్టం. శ్రమ, దేవుని కృప వలన విజయం సాధిస్తారు.**

ఎవరు 6, 15, 24 తేదీలలో జన్మించి వారి డెస్టినీ నెంబరు 5 అవుతుందో వారు ఈ వర్గంలోకి వస్తారు. వీరిపై శుక్ర, బుధ గ్రహాల ప్రభావం ఉంటుంది. వీరికి అందంతో పాటు మంచి తెలివితేటలు ఉంటాయి. బలంగా, ఒక మోస్తరు పొడవుగా ఉంటారు. వీరు వేగంగా పనులను పూర్తి చేయాలని కోరుకుంటారు. ఇతరులను ప్రభావితం చేయటంలో నేర్పరులు. ఇతరులకు సులభంగా అర్థంకారు. కొన్నిసార్లు మర్యాదగాను కొన్నిసార్లు దుందుడుకుగాను వ్యవహరిస్తారు. ఇతరులకు సాయం చేస్తారు. ఎవరైనా వీరిని మోసం చేస్తే, సమయం కోసం ఎదురుచూసి తెలివిగా ప్రతీకారం తీర్చుకుంటారు. ఇతరులు వీరికి భయపడతారు. అనుకూలమైన పేరు ఉంటే వివిధ మార్గాల ద్వారా సంపాదన ఉంటుంది.

వీరు లా, మేనేజ్‌మెంట్, కంప్యూటర్స్, ఎలక్ట్రానిక్స్ రంగాలలో రాణిస్తారు. అపారమైన తెలివితేటలతో పాటు అందంగా ఉండటం వలన ఏ రంగంలో అయినా వీరు పడిన కష్టానికి 10 రెట్లు లాభం పొందుతారు. వీరు సైన్స్, లా, ఎం.బి.ఎ లాంటి కోర్సులు చేస్తారు. ఇతరులకు సాయం చేసి వారి స్థాయిని పెంచుకుంటారు. పరిశ్రమలు, అధికార హోదాలతో స్థాయిని పెంచుకుంటారు. స్నేహితులు వుంటారు. వీరి సలహాలను అందరూ కోరుకుంటారు. వీరిని మోసం చేయటం కష్టం.

నృత్య, సంగీత, న్యాయ, మత, వేదాంత, వాణిజ్యాలందు అభిరుచి ఉంటుంది. కళలందు వీరి పరిజ్ఞానానికి వీరికి గౌరవం లభిస్తుంది. అనుకూల నామం ఉంటే దినదినాభివృద్ధి చెందుతారు. ప్రతికూల నామం ఉంటే అన్ని అవకాశాలు పోగొట్టుకుంటారు. అనుకూల నామం ఉంటే గృహ, భూ, వాహన సౌఖ్యాలుంటాయి. ఉద్యోగంలో ఉన్నా వ్యాపారం చేస్తారు. దైవంపై అపారమైన విశ్వాసం ఉంటుంది. శ్రమ, దేవుని కృప వలన వీరు జీవితంలో విజయం సాధిస్తారని నమ్ముతారు.

## పేరు పెట్టే విధానం

వీరికి బుధ సంఖ్యలైన 5, 14, 23, 32, 41, శుక్ర సంఖ్యలైన 6, 15, 24, 33, 42లు పేర్లకు అనుకూలం.

## రాణించే రంగాలు

సౌందర్య సాధనాలు, కమీషన్ వ్యాపారం, కాంట్రాక్టులు, ఏజెన్సీలు, స్టీలు, రవాణా వ్యాపారాలు లాభసాటిగా ఉంటాయి.

## వ్యాధులు

వీరికి రక్తపోటు, పక్షవాతం, నీటి కాలుష్యం వలన వ్యాధులు, కళ్ళ జబ్బులు, నరాల బలహీనతలు రావొచ్చు. సరియైన చికిత్స తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది.

## సూచనలు

| | | |
|---|---|---|
| లక్కీ నంబర్లు | - | 1, 5, 6 |
| అన్‌లక్కీ నంబర్లు | - | 2, 3 |
| లక్కీ తేదీలు | - | 1, 5, 6, 10, 14, 15, 19, 23, 24, 28 |
| అన్‌లక్కీ డేట్స్ | - | 3, 12, 21, 30 |
| లక్కీ కలర్స్ | - | పచ్చ, నీలం, బూడిదరంగు, సిల్వర్, గోల్డెన్ |
| అన్‌లక్కీ కలర్స్ | - | గులాబీ, నలుపు, ఊదా |
| అదృష్ట దినాలు | - | ఆదివారం, బుధవారం, శుక్రవారం |
| లక్కీ వివాహ తేదీలు | - | 1, 6, 10, 15, 19, 24, 28 |
| రెమిడీస్ | - | శుక్రజపం, బుధజపం చేయడం, బీదవారిని, సోదరులను ఆదరించడం. విష్ణు సహస్రనామ పారాయణం. |

| | | | |
|---|---|---|---|
| ఉదా | - | సానియా మీర్జా | 15-11-1986 |
| | | అజీమ్ ప్రేమ్‌జీ | 24-05-1945 |
| | | పియూష్ చావ్లా | 24-12-1988 |

## జన్మ సంఖ్య - 6, డెస్టినీ నంబరు - 6 గల వ్యక్తులు

**6/6 వ్యక్తులు వ్యక్తిగత అభివృద్ధి, దేశాభివృద్ధికి మూలం అని భావిస్తారు. దానగుణం ఉంటుంది. వీళ్ళలో మేధావులు, సలహాదారులు ఉంటారు.**

ఎవరు 6, 15, 24 తేదీలలో జన్మించి వారి డెస్టినీ నెంబరు 6 అవుతుందో వారు ఈ వర్గంలోకి వస్తారు. వీరిపై శుక్రుడి ప్రభావం ఉంటుంది. శాంతంగా, అందంగా కనిపిస్తారు. ఆలోచించి పనిచేస్తారు. స్పష్టంగా తమ అభిప్రాయాలను తెలియచేస్తారు. అందరూ బాగుండాలని కోరుకుంటారు. వ్యక్తిగత అభివృద్ధిపై దృష్టి పెడతారు. ప్రతీ వ్యక్తి అభివృద్ధి చెందితేనే దేశాభివృద్ధి సాధ్యమని నమ్ముతారు. వీరికి అనుకూలమైన పేరు ఉంటే జీవితంలో ఉన్నత స్థానాన్ని చేరుకుంటారు. వీళ్ళలో మేధావులు, సలహాదారులుంటారు. వీరు చాలా ధనవంతులుగా దానశీలురుగా ఉంటారు. ప్రతికూల నామం ఉంటే అభివృద్ధి అంతంత మాత్రం ఉంటుంది. ఎక్కడికెళ్ళినా అసూయ, వ్యతిరేకతను ఎదుర్కొంటారు.

అందరికీ సాయం చేసి సామాజిక సేవ చేస్తారు. దానివలన ప్రజలు గౌరవిస్తారు. కొందరు ముందు నుంచి మంచి స్థితిలో ఉంటారు. సమస్య ఏదైనా పరిష్కారం చెప్పగలరు. మెరుపు వేగంతో ఆలోచిస్తారు. వేదాంతం, మతం, న్యాయం, గణితం, మత గ్రంథాలపై పరిశోధన చేస్తారు. ప్రకృతి సందర్శనను ఇష్టపడతారు. అనుకూల నామం ఉంటే అన్ని భౌతిక సుఖాలను అనుభవిస్తారు.

నృత్య, సంగీతాది కళలలో పరిజ్ఞానం ఉంటుంది. మంచి పనులు చేసి ప్రముఖులవుతారు. మనోనిగ్రహంతో మార్మిక శక్తులను పొందుతారు. దైవభక్తి ఉంటుంది. అందమైన ఇల్లు, తోట, కొత్త ఆభరణాలను ఇష్టపడతారు. సుగంధ పరిమళ ద్రవ్యాలపై ప్రీతి. అనుకూల నామము ఉంటే అన్నింటా విజయం. జీవిత భాగస్వామి, సంతానం,

ఆరోగ్యం, సంపదలు కల్గి ఉంటారు.

వీరు సైన్స్ గ్రూపులపై మక్కువ చూపిస్తారు. డాక్టర్స్‌గా, ఫైన్‌ఆర్ట్స్, ఫ్యాషన్ టెక్నాలజీ లాంటి రంగాలలో, కంప్యూటర్, ఎలక్ట్రానిక్స్ రంగాలలో ఇలా ఏ రంగంలోనైనా రాణిస్తారు. వీరికి విశేషమైన పేరు ప్రఖ్యాతులు వస్తాయి.

జీవితంలో అన్ని సౌఖ్యాలు, విలాసాలు, అదృష్టం వలన కలుగుతాయి. వీరు కోరుకున్నవన్ని దొరుకుతాయి. కాని సరియైన జీవిత భాగస్వామిని పొందలేరు ఒక వేళ తొందరగా వివాహం కాకపోతే మిత్రులకు, బంధువులకు ఎంతో శ్రమకు ఓర్చి సేవచేస్తారు.

వీరు అందరితో కలివిడిగా ఉంటారు. మంచి సంభాషణా చాతుర్యం కలవారు, ప్రయాణాలు అధికంగా చేసి ఆనందిస్తారు. మంచి, రుచిగల ఆహారాన్ని యిష్టపడతారు. వెట్టి చాకిరీని అంగీకరించరు, చట్టాన్ని వ్యతిరేకించి, సంప్రదాయ మతాలను అనుసరించరు. ధార్మిక శాస్త్రాలు, తంత్ర, చేతబడులను నమ్ముతారు.

వీరు శాంతికాముకులు, ఆధారపడ తగ్గవాళ్ళు, పద్ధతి గలవారు, మంచి రాయబారులుగా ఉంటారు. వీరి అనుచరులను జాగ్రత్తగా చూసుకుంటారు.

వీరికి ఖర్చు ఎక్కువ. బంధుమిత్రుల వినోదార్థం ఖర్చు చేస్తారు. అందమైన వస్తువులను సేకరిస్తారు. వృద్ధాప్యంలో కూడా ఆకర్షణీయంగా ఉంటారు.

## పేరు పెట్టే విధానం

వీరికి శుక్ర సంఖ్యలైన 6, 15, 24, 33, 42, 51, కుజ సంఖ్యలైన 9, 27, 54లు పేర్లకు అనుకూలం.

## రాణించే రంగాలు

విలాస వస్తువుల వ్యాపారం, ఆభరణాలు, సౌందర్య సామాగ్రి, స్టీల్‌వర్క్స్, వస్త్రాలు, ఔషధాలు, పచ్చటి వస్తువుల వ్యాపారాలు లాభసాటిగా ఉంటాయి.

## వ్యాధులు

అధిక ఉష్ణ సంబంధిత వ్యాధులు, మూత్ర సంబంధిత వ్యాధులు, పంటినొప్పి, వెన్నునొప్పి రావొచ్చు. సరియైన చికిత్స తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది.

## సూచనలు

లక్కీ నంబర్లు - 1, 6

| | | |
|---|---|---|
| అన్‌లక్కీ నంబర్లు | - | 2, 3 |
| లక్కీ తేదీలు | - | 1, 6, 9, 10, 15, 18, 19, 24, 27, 28 |
| అన్‌లక్కీ డేట్స్ | - | 3, 12, 21, 30 |
| లక్కీ కలర్స్ | - | పచ్చ, లేతనీలం, తెలుపు, సిల్వర్, గోల్డెన్ |
| అన్‌లక్కీ కలర్స్ | - | గులాబి, నారింజ, ఊదా |
| అదృష్ట దినాలు | - | ఆదివారం, శుక్రవారం, బుధవారం |
| లక్కీ వివాహ తేదీలు | - | 1, 6, 9, 10, 15, 18, 19, 24, 27, 28 |
| రెమిడీస్ | - | భృగుపాశుపత హోమం చేయించడం, శుక్రజపం చేయించడం, అనాథ బాలలకు అన్నదానం కాని, వారి పెండ్లి ఖర్చుల కొరకు కొంత సహాయం చేయడం మంచిది. |
| ఉదా | - | అనీల్‌కపూర్ 24-12-1959 |
| | | సునీల్‌దత్ 06-06-1929 |
| | | ఆర్పీ సింగ్ 06-12-1985 |
| | | అంజలిదేవి 24-08-1927 |

## జన్మసంఖ్య - 6, డెస్టినీ నంబరు - 7 గల వ్యక్తులు

**6/7 వ్యక్తులు ఉన్నతంగా, నిరాడంబరంగా ఉంటారు. ఆచితూచి మాట్లాడతారు. ఏ విషయాన్ని సులభంగా బయటపెట్టరు.**

ఎవరు 6, 15, 24 తేదీలలో జన్మించి వారి డెస్టినీ నెంబరు 7 అవుతుందో వారు ఈ వర్గంలోకి వస్తారు. వీరిపై శుక్ర, కేతు గ్రహాల ప్రభావం ఉంటుంది. వీరు ఒక మోస్తరు పొడవుగా, హుందాగా కనిపిస్తారు. 6, 7 వ్యక్తులు మిగతా 6వ నంబరు వ్యక్తులకు భిన్నంగా ఉంటారు. వీరు ఉన్నతంగాను, నిరాడంబరంగాను ఉంటారు. అందరితో సులభంగా కలవరు. ఆచితూచి మాట్లాడతారు. సంగీత, వేదాంతాలందు ఆసక్తి కలిగి ఉంటారు. జనసమ్మర్ధం లేని పర్వత ప్రాంతాలను, సరస్సులను ఇష్టపడతారు. నిస్వార్థంగా

సాయం అందిస్తారు. అసాధ్యమైన పనులను ముట్టుకోరు. అనుకూల నామం ఉంటే గృహ, వాహన, భూ సౌఖ్యాలను పొందుతారు. వీరిని చూడగానే ఆధ్యాత్మిక భావం కలుగుతుంది. వీరిలో దైవత్వం ఉట్టిపడుతుంది. వీరు సైన్స్ సబ్జెక్ట్ గాని లేక మెడికల్ రంగంలో ఎంబీబీఎస్, ఫార్మసీ, ఫిజియోథెరపీ వంటి లేక ఎంసీఏ వంటి చదువులపై ఆసక్తి ఉంటుంది. కొందరికి థియోలజీ సబ్జెక్ట్‌పై కూడా ఆసక్తి ఉంటుంది. కొందరు వేదం, పురాణాలు వంటి సబ్జెక్ట్‌పై గట్టి పట్టు సాధిస్తారు.

వీరి మనస్సును అర్థం చేసుకోవడం కష్టం. ఏ విషయాన్ని సులభంగా చెప్పరు. కొన్నిసార్లు సర్వం కోల్పోయినట్లు విచారగ్రస్తులుగా కనపడతారు. అనుకూల నామం ఉంటే ఆరోగ్యం, సంపద, జీవిత భాగస్వామి, సంతానంను పొందుతారు. రచన, విలాస వస్తువుల క్రయవిక్రయాలందు అదృష్టం కలిసివస్తుంది. న్యాయం, మతం, వేదాంతం, గణితం, జ్యోతిష్యంలో అభిరుచి ఉంటుంది.

వీరికి చేతిలో సంజీవని యోగం ఉంటుంది. మెడిసిన్ చదివితే మంచి ఫిజిషియన్లుగా పేరు పొందుతారు లేక జ్యోతిష్యం లాంటి వృత్తి స్వీకరిస్తే చాలా మంచి పేరు ప్రఖ్యాతులు పొందుతారు. వీరి వాక్కు ఫలిస్తుంది. అందువలన ఎపుడు పాజిటివ్‌గానే మాట్లాడితే మంచిది. ఎప్పుడూ ఆలోచిస్తూ ఉంటారు. ఒంటరిగా ఉన్నప్పుడు మంచి ఆలోచనలు వస్తాయి. ఆనందంగా ఉన్నప్పుడు మంచిగా, ఆందోళనలో ఉన్నప్పుడు దుడుకుగా ప్రవర్తిస్తారు. వీరి జీవితం ఆధునికత, సంప్రదాయాల మేలుకలయిగా ఉంటుంది. పూలతోటలో ఉన్న అందమైన ఇంటిని కోరుకుంటారు. దైవంపై పూర్తి నమ్మకం ఉంటుంది. పరిశోధనాత్మక దృష్టి ఉంటుంది. అనుకూల నామంతో సుఖ సంతోషాలను పొందవచ్చు.

## పేరు పెట్టే విధానం

వీరికి శుక్ర సంఖ్యలైన 6, 15, 24, 33, 42, 51, కేతు సంఖ్యలైన 25, 34 లు పేర్లకు అనుకూలం.

## రాణించే రంగాలు

ఉపన్యాస, రచనా వ్యాసంగాలు రాబడినిస్తాయి. విలాస వస్తువులు, రవాణా, ఆహార పదార్థాలు, వస్త్ర వ్యాపారాలు లాభసాటిగా ఉంటాయి.

**సూచనలు**

| | | |
|---|---|---|
| లక్కీ నంబర్లు | - | 2, 6, 7 |
| అన్‌లక్కీ నంబర్లు | - | 3, 9 |
| లక్కీ తేదీలు | - | 2, 6, 7, 11, 15, 16, 20, 24, 25, 29 |
| అన్‌లక్కీ డేట్స్ | - | 3, 9, 12, 18, 21, 27, 30 |
| లక్కీ కలర్స్ | - | పచ్చ, లేతనీలం, లేత పసుపు, తెలుపు, క్రీమ్, గోల్డెన్ |
| అన్‌లక్కీ కలర్స్ | - | గులాబీ, నారింజ, ఊదా, ఎరుపు, నలుపు |
| అదృష్ట దినాలు | - | ఆదివారం, సోమవారం, శుక్రవారం |
| లక్కీ వివాహ తేదీలు | - | 1, 6, 10, 15, 19, 24, 28 |
| రెమిడీస్ | - | కేతు జపం,<br>శుక్రజపం చేయించడం,<br>ఉలవలు, బొబ్బర్లు దానం చేయటం.<br>సాధువులకు, పండితులకు తగినంత సహాయం చేయటం. పార్వతిదేవి అమ్మవారిని ఆరాధించడం. |
| ఉదా | - | మాధురీ దీక్షిత్ 15-05-1967<br>మాయావతి 15-01-1956 |

## జన్మ సంఖ్య - 6, డెస్టినీ నంబరు - 8 గల వ్యక్తులు

**6/8 వ్యక్తులకు ఎర్రని కళ్ళు ఉంటాయి. శ్రమని, దైవాన్ని నమ్ముతారు. అన్ని విషయాలలో అవగాహన ఉంటుంది. ప్రశాంతంగా పనిచేస్తూ ఇతరుల సమస్యలు పరిష్కరిస్తారు.**

ఎవరు 6,15, 24 తేదీలలో జన్మించి వారి డెస్టినీ నెంబరు 8 అవుతుందో వారు ఈ వర్గంలోకి వస్తారు. వీరిపై శుక్ర, శని గ్రహాల ప్రభావం ఉంటుంది. ఒక మోస్తరు పొడవుగా, ఎర్రని కళ్లు కలిగి ఉంటారు. కష్టించి అభివృద్ధి సాధించాలన్న ఏకైక లక్ష్యాన్ని కలిగి ఉంటారు. భౌతిక సుఖాలను కోరుకుంటారు. చెడుకు దూరంగా ఉంటారు. శ్రమను, దైవాన్ని నమ్ముకుంటారు. వీరు ముందు సైన్స్ గ్రూపును ఎంచుకుంటారు. తరువాత

వీరు మేనేజ్‌మెంట్, అకౌంట్స్ లాంటి వృత్తుల్లో సెటిల్ అవుతారు. వీరికి మంచి ముఖవర్చసు ఉంటుంది. కాబట్టి సినిమా, మీడియా, టి.వి రంగాల్లో కూడా రాణిస్తారు. కార్లు, ఎలక్ట్రిక్ సామాన్లు, కవిత్వం, కథలు, విలాస వస్తువులపై ఆసక్తి ఉంటుంది. అనుకూల నామం ఉంటే ప్రత్యేక సామర్థ్యంతో రాణిస్తారు. లేకపోతే తరచూ వైఫల్యాలని చవిచూస్తారు. వీరు ఫ్యాషన్ టెక్నాలజీ, ఎంబీఏ, ఎల్ఎల్‌బీ, ఇంజినీరింగ్ రంగాల్లో ఉన్నతిని సాధిస్తారు.

వీరు తెలివైనవారు. ప్రతిదాని గురించి ఎంతో కొంత తెలిసి ఉంటారు. ఉత్సాహవంతులు. అనుకూల నామంతో వృత్తివ్యాపారాలలో ఉన్నత స్థానాన్ని అందుకుంటారు. వీరు భావాలను దాచక బహిర్గతం చేస్తారు. ప్రఖ్యాత, చారిత్రాత్మక స్థల సందర్శన, పెద్ద పరిశ్రమల సందర్శన చేస్తారు. అనుకూల నామంతో ఆరోగ్యం, సంపద, జీవిత భాగస్వామి, సంతానాదులను పొందుతారు.

ఇతరుల సమస్యలను పరిష్కరించటంలో ధైర్యాన్ని, సాహసాన్ని ప్రదర్శిస్తారు. ప్రశాంతంగా పని చేస్తారు. ఎంతో మంది వీరి సలహాలను స్వీకరిస్తారు. వీరికి మత, న్యాయ, ఔషధ, గణిత శాస్త్రాలందు తగిన పరిజ్ఞానం ఉంటుంది. వీరు ఏ రంగంలోనైనా అభివృద్ధి సాధిస్తారు. కొందరు ఉద్యోగంలో, కొందరు వ్యాపారంలో, కొందరు పరిశ్రమలలో ఉంటారు. వాహనలు నడపటం అంటే ఇష్టం. విదేశీయానంలో రాబడి ఉంటే ఆసక్తి చూపిస్తారు.

## పేరు పెట్టే విధానం

వీరికి 14, 15, 19, 23, 24, 32, 33, 37, 41, 42, 46, 50, 51, 59, 60, 69 సంఖ్యలు పేర్లకు అనుకూలం.

## రాణించే రంగాలు

స్టీలు, పరిశ్రమలు, విలాస వస్తువుల విక్రయం, కమీషన్ వ్యాపారం, కాంట్రాక్టులు, ఏజెన్సీలందు లాభం చేకూరుతుంది.

## వ్యాధులు

ఉదర సమస్యలు, మలబద్ధకం, అధిక ఉష్ణ సంబంధిత వ్యాధులు, కీళ్ళ నొప్పులు, రక్తపోటు రావొచ్చు. సరియైన చికిత్స తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది.

**సూచనలు**

| | | |
|---|---|---|
| లక్కీ నంబర్లు | - | 1, 5, 6 |
| అన్‌లక్కీ నంబర్లు | - | 3 |
| లక్కీ తేదీలు | - | 6, 12, 24, 5, 14, 23, 1, 10, 19, 28 |
| అన్‌లక్కీ డేట్స్ | - | 3, 12, 21, 30 |
| లక్కీ కలర్స్ | - | నీలం, ఆకుపచ్చ, పసుపు, గోల్డెన్, సిల్వర్ |
| అన్‌లక్కీ కలర్స్ | - | గులాబీ, నారింజ, ఊదా, ఎరుపు, నలుపు |
| అదృష్ట దినాలు | - | ఆదివారం, బుధవారం, శుక్రవారం |
| లక్కీ వివాహ తేదీలు | - | 1, 6, 9, 10, 15, 18, 19, 24, 27, 28 |
| రెమిడీస్ | - | శుక్రజపం, శనిజపం, శివ ఆరాధన, శని ఆరాధన మంచిది. ముసలివారికి, అనాథలకి, వికలాంగులకు అన్నదానం లాంటివి చేయాలి. కాకులకు స్వీట్స్ పంచితే మంచిది. |
| ఉదా | - | ఇమ్రాన్ హష్మీ 24-03-1979 |
| | | కాన్షీరాం 15-03-1934 |
| | | మహమ్మద్ రఫీ 24-12-1925 |
| | | రవీంద్ర జడేజా 06-12-1988 |

## జన్మసంఖ్య - 6, డెస్టినీ నంబరు - 9 గల వ్యక్తులు

**6/9 వ్యక్తులు గంభీరంగా ఉంటారు. తెలివితేటలు ఎక్కువ. ఒకరోజు సామాన్యంగా, ఒకరోజు విలాసంగా గడుపుతారు. దేవాలయాలు సందర్శిస్తారు.**

ఎవరు 6, 15, 24 తేదీలో జన్మించి వారి డెస్టినీ నెంబరు 9 అవుతుందో వారు ఈ వర్గంలోకి వస్తారు. వీరిపై శుక్ర, కుజ గ్రహాల ప్రభావం ఉంటుంది. వీరు గంభీరంగా, తీరిక లేకుండా సందడిగా ఉంటారు. 9 డెస్టినీ నంబరు గల వ్యక్తులు ధైర్యవంతులు. ధైర్యంగా ఏ పనినైనా చేస్తారు. కష్టపడితే తరువాతే విజయం సాధిస్తాం. అని నమ్ముతారు.

వీరికి అధిక మేధస్సు, తెలివితేటలు ఉంటాయి. అందమైన కళ్ళు ఉంటాయి. తదేక దృష్టితో వస్తువులను పరిశీలిస్తారు. ఉన్నత స్థానంపైనే దృష్టి సారిస్తారు. అన్ని రకాల సౌఖ్యాలను కోరుకుంటారు. స్నేహితులతో కూడి వుంటారు. వీరి జీవితం వింతగా ఉంటుంది.

ఒకరోజు సామాన్యంగాను, మరో రోజు విలాసవంతంగాను గడుపుతారు. అనుకూల నామంతో క్రమక్రమంగా అభివృద్ధి సాధిస్తారు. సామాజిక సేవ చేస్తూ ఎదుగుతారు. మన స్థాయిని అభివృద్ధి చేసుకోకుండా ఇతరులను అభివృద్ధి చెయ్యలేమని అంటుంటారు. జీవితం ఆనందించటానికేనని, అందుకే పుట్టామని నమ్ముతారు. దైవంపై విశ్వాసం ఉంటుంది. దేవాలయ సందర్శన చేస్తారు. సమస్య ఏదైనా ధైర్యంగా ఎదుర్కొంటారు. డబ్బు సంపాదనకు అవకాశాలను వెదుకుతారు. ఏదైనా అనుకూలంగా ఉంది అంటే దానికై పథకరచన చేస్తారు. ఇతరులు లాభాలని ఆర్జించడంలో సాయం చేస్తారు. అనుకూల నామంతో ఉన్నత స్థానాన్ని చేరుకుంటారు. ఆరోగ్యం, సంపద, జీవిత భాగస్వామి, సంతానం పొందుతారు.

## పేరు పెట్టే విధానం

వీరికి శుక్ర సంఖ్యలైన 6, 15, 24, 33, 42, 51, కుజ సంఖ్యలైన 9, 27, 45, 54 లు పేర్లకు అనుకూలం.

## రాణించే రంగాలు

వీరు సైన్స్ గ్రూపుల్లో కంప్యూటర్స్, మెకానికల్, సివిల్ రంగాల్లో బాగా రాణిస్తారు. భూ సంబంధిత వ్యాపారాలలో ఎక్కువ లాభపడతారు. వీరికి యూనిఫార్మ్ వేసుకొనే ఉద్యోగాలు లాంటి ఐ.పి.ఎస్, మిలటరీ, పైలేట్ లాంటి వాటిపై ఆసక్తి ఎక్కువ ఉంటుంది. ఆయుధాన్ని ధరించాలనే కోరిక ఉంటుంది.

కాంట్రాక్టులు, కమీషన్ వ్యాపారం, ఏజెన్సీలు, సౌందర్య సాధనాలు, విలాస వస్తువులు, రవాణా, భూ సంబంధిత వ్యాపారాలు లాభసాటిగా ఉంటాయి.

## వ్యాధులు

వీరికి రక్తపోటు, పైల్స్, కీళ్ళనొప్పులు, అధిక ఉష్ణ సంబంధిత రోగాలు వచ్చే అవకాశం ఉంటుంది. సరియైన చికిత్స తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది.

## సూచనలు

| | | |
|---|---|---|
| లక్కీ నంబర్లు | - | 1, 6, 9 |
| అన్‌లక్కీ నంబర్లు | - | 3 |
| లక్కీ తేదీలు | - | 1, 5, 6, 9, 10, 14, 15, 18, 19, 23, 24, 27, 28 |
| అన్‌లక్కీ డేట్స్ | - | 3, 12, 21, 30 |
| లక్కీ కలర్స్ | - | ఆకుపచ్చ, ఎరుపు, నీలం, పసుపు, సిల్వర్ |
| అన్‌లక్కీ కలర్స్ | - | ఎరుపు, నారింజ, ఊదా |
| అదృష్ట దినాలు | - | ఆదివారం, మంగళవారం, శుక్రవారం |
| లక్కీ వివాహ తేదీలు | - | 1, 6, 9, 10, 15, 18, 19, 24, 27, 28 |
| రెమిడీస్ | - | నవగ్రహ అభిషేకం,<br>శుక్ర కుజులకు జపం చేయించటం.<br>వికలాంగులకు, అనాథలకు అన్నదానం చేయటం,<br>వీలైనంత రక్తదానం చేయటం. |

| | | |
|---|---|---|
| ఉదా : | మల్లికా శెరావత్ | 24-10-1981 |
| | లక్ష్మి మిట్టల్ | 15-06-1950 |
| | వినోద్ ఖన్నా | 06-10-1946 |

# జన్మ సంఖ్య - 7 (కేతువు సంఖ్య)

**7వ నంబరు కేతుగ్రహానికి చిహ్నం. ఈ సంఖ్య కలవారు అతీంద్రియ శక్తుల శాస్త్రాలలో ప్రావీణ్యం కలవారుగా ఉంటారు. వీరికి ఆధ్మాత్మికత, తాత్విక ధోరణి ఉంటుంది. వీరికి మానసిక శక్తులు ఉంటాయి.**

7, 16, 25 తేదీలలో, ఏ నెలలో అయినా పుట్టిన వారు 7వ నంబరు వ్యక్తులవుతారు.

వీరు ప్రధానంగా మార్మిక శాస్త్రాలందు, అతీంద్రియ శాస్త్రాలందు సిద్ధహస్తులు. నిరంతరం ఆలోచనలతో తత్వ విచారణ చేస్తూ ఉంటారు. మానవతాతీత శక్తులు, అతీంద్రియ శక్తులు వీరికి పుట్టుకతో వస్తాయి. ఏడు దైవ సంబంధిత సంఖ్య. ఇహపరమైన బంధాల నుంచి, కష్టాల నుంచి విముక్తి చేసేదే ఈ సంఖ్య. ఆధ్యాత్మిక, అలౌకిక ఆనందం ఈ సంఖ్య వలన కలుగుతుంది. ఏడవ నంబరు సప్తవర్ణాలు, సప్తస్వరాలు, సప్తగిరులను, సప్తరుషులను, సప్త మాతృకలను తెలియచేస్తుంది.

7వ నంబరు వ్యక్తులు సంపదను వృద్ధి చేసుకోవటానికి ఆసక్తి చూపించరు. వీరు ఇతరుల నుంచి తీసుకున్న దాని కన్నా ఎక్కువ ఇస్తారు. వీరు ఖరీదైన దుస్తులు, ఫ్యాషనబుల్ డ్రస్సులు, కాస్మోటిక్స్, సుగంధ ద్రవ్యాలను ధారాళంగా వాడతారు. వీరు, కుటుంబానికి ఎంతో విలువ ఇస్తారు. ఇతరుల జోక్యాన్ని సహించరు. వీరు మంచి విశ్లేషణ, విమర్శన చెయ్యగలరు.

వీరికి ఆత్మజ్ఞానం అధికం. మానసిక శక్తులు ఉంటాయి. భవిష్యత్తుని ఊహించే శక్తి కలిగి ఉంటారు. సాధారణంగా వీరికి జరగబోయే విషయాలు కలల రూపంలో ముందే తెలుస్తుంటాయి.

7వ నంబరు కేతుగ్రహం ప్రభావం కలిగి ఉంటుంది. నావికాదళం, ఓవర్‌సీస్, ట్రేడ్, ఇరిగేషన్, వ్యవసాయ వృత్తులలో ఉంటారు. వీరిలో మంచి నర్సులు, డాక్టర్‌లు, డ్రగ్గిస్ట్లు, కెమిస్ట్లు, పురోహితులు, జ్యోతిష్యులు ఉంటారు.

సృజనాత్మక నవలలు చదువుతారు. ఈ నంబరు వ్యక్తులు దేవుడికి, మానవుడికి ఉన్న సంబంధాన్ని విశ్లేషించగలరు.

## 7వ నంబరు అనుకూల అంశాలు

- ఆత్మజ్ఞానం కలిగి ఉండటం
- తాత్వికజ్ఞానం కలిగి ఉండటం
- అతీంద్రియ శాస్త్రాలలో పట్టు కలిగి ఉండటం
- పరిశీలన, పరిశోధనా బాగా చేయగలగటం
- ఏకాంతానికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వటం
- నమ్మింది ఆచరించటం
- మంచి ఆలోచనా విధానం, ఆత్మపరిశీలన
- విజ్ఞానదాయకమైన రచనలు చేయగలగటం
- ఆత్మాభిమానం కలిగి ఉండటం
- ఉన్నత స్థానంలో ఉండగలగటం

## ప్రతికూల అంశాలు

- చుట్టుపక్కల ఏం జరుగుతుందో తెలుసుకోకపోవటం
- అమాయకత్వం
- నిరాశ, నిస్పృహ
- విమర్శలు చేయటం
- భయం, ఆందోళన కలిగి ఉండటం

జన్మసంఖ్య యొక్క ప్రభావం వ్యక్తులపై ఏ విధంగా ఉంటుందో డెస్టినీ నెంబరు ప్రభావం కూడా వ్యక్తులపై ఉంటుంది. దాని వలన 7 జన్మసంఖ్య ఉన్న వ్యక్తులందరి గుణగణాలు ఒకేలా ఉండవు. కారణం డెస్టినీ నెంబరు మారటమే. కాబట్టి ప్రస్తుత 7 జన్మసంఖ్య కలవారి గుణగణాలు కూడా డెస్టినీ నెంబరు బట్టి మారుతూ ఉంటాయి. పాఠకులు ఈ విషయం గమనించగలరని ప్రార్థన.

## జన్మసంఖ్య - 7, డెస్టినీ నంబరు - 1 గల వ్యక్తులు

**7/1 వ్యక్తులు మంచి వ్యక్తిత్వం, జ్ఞానం, ఆలోచనా శక్తి కలిగి ఉంటారు. వీరికి దయాగుణం, సానుభూతి ఎక్కువ. వీరు తాత్వికులుగా రాణిస్తారు.**

ఎవరు 7, 16, 25 తేదీలలో జన్మించి వారి డెస్టినీ నెంబరు 1 అవుతుందో వారు ఈ వర్గంలోకి వస్తారు. వీరు కేతు, రవి గ్రహ ప్రభావంలో ఉంటారు.

7వ అంకె కేతు గ్రహ సంబంధమైనది. ఇది వీరికి మంచి వ్యక్తిత్వాన్ని, జ్ఞానాన్ని, ఆలోచనా శక్తిని కలిగిస్తుంది. వీరికి కవిత్వం, కథారచన, కళలు, సంస్కృతి మీద అభిరుచి ఉంటుంది. ఉన్నతమైన ఆలోచనలు చేసి వారికి, వారి కుటుంబానికి, దేశానికి మంచి పేరును తెస్తారు. వీరు సైన్స్ సబ్జెక్ట్ మీద ఆసక్తి చూపుతారు. ఎంబీబీఎస్, మెడికల్ రంగంలో సంబంధిత కోర్సులు చేస్తే మంచి పేరు ప్రఖ్యాతులు పొందుతారు. ఎంసీఏ వంటి కోర్సులు కాని ఎంఏ (జ్యోతిష్యం) వంటి కోర్సుల్లో రాణిస్తారు.

వీరి నామ సంఖ్య జన్మ సంఖ్యకు, విధి సంఖ్యకు అనుకూలంగా ఉంటే జీవితంలో విజయాన్ని సాధిస్తారు. లేకపోతే సమస్యలు తప్పవు. సరైన నామ సంఖ్యతో అభివృద్ధి సాధించవచ్చు.

వీరికి దయాగుణం, సానుభూతి ఎక్కువ. ఇతరుల బాధలను తమ బాధలుగా తలుస్తారు. మతంపై ఆసక్తి కలిగి, ఫిలాసఫర్స్(తాత్వికులు)గా రాణిస్తారు. ఒంటరిగా ఉన్నప్పుడు విచారవదనంతో ఉంటారు. కొందరు కుటుంబ జీవితంలో అయోమయానికి గురై రెండవ వివాహానికి సిద్ధమవుతారు. సరైన నామ సంఖ్య ఉంటే మంచి కుటుంబ జీవితం, సంపద, ఆరోగ్యం లభిస్తాయి. అన్నీ ఉన్నా ఏదో ఒక అసంతృప్తి ఉన్నట్టుగా ఉంటారు.

కొన్నిసార్లు వీరు మంచిగాను, ఇంకొన్ని సార్లు మౌనంగాను ఉంటారు. సమయం వచ్చినపుడు తమ ఆలోచనలను తెలియజేస్తారు. వీరు సత్య శోధకులు, మోసాన్ని ఇష్టపడరు.

### పేరు పెట్టే విధానం

వీరి పేరు శుక్రుడు, రవికి అనుకూలంగా 6, 15, 24, 33, 42, 51, 60, 69, 19, 37, 46 లో పెట్టుకుంటే జీవితం సంతృప్తికరంగా ఉంటుంది.

## రాణించే రంగాలు

విలాస వస్తువుల వ్యాపారం, వస్త్ర, అగ్ని, లోహ, రవాణా, రత్న, ఖనిజ, రాతి సంబంధ వ్యాపారాలు, మెడికల్, కమీషన్ ఏజెన్సీలు కలిసివస్తాయి.

## వ్యాధులు

మానసిక సమస్యలు, మనోవ్యాకులత, పంటినొప్పులకు గురవుతారు. సరియైన చికిత్స తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది.

## సూచనలు

| | | |
|---|---|---|
| లక్కీ నంబర్లు | - | 1, 2, 6, 7 |
| అన్‌లక్కీ నంబర్లు | - | 8, 9 |
| లక్కీ తేదీలు | - | 1, 2, 6, 10, 11, 15, 19, 20, 24, 28, 29 |
| అన్‌లక్కీ డేట్స్ | - | 8, 9, 17, 18, 26, 27 |
| లక్కీ కలర్స్ | - | ఆకుపచ్చ, పసుపు, నీలిరంగు, గంధం, రోజ్, ఆరెంజి |
| అన్‌లక్కీ కలర్స్ | - | నలుపు, ఎరుపు |
| అదృష్ట దినాలు | - | ఆది, సోమ, శుక్రవారాలు |
| లక్కీ వివాహ తేదీలు | - | 1, 6, 9, 10, 15, 19, 24, 27, 28 |
| రెమిడీస్ | - | సూర్య ఆరాధన, కేతు గ్రహ జపం చేయించడం, పార్వతి అమ్మవారిని ఆరాధించడం. పండితులకు, పురోహితులకు తగిన సహాయం చేయటం. బీదలకు అన్నదానం చేయటం. |

| | | |
|---|---|---|
| ఉదా : | కమల్‌హాసన్ | 07-11-1954 |
| | షహీద్ కపూర్ | 25-02-1981 |
| | రవీంద్రనాథ్ ఠాగూర్ | 07-05-1861 |

## జన్మసంఖ్య - 7, డెస్టినీ నంబరు - 2 గల వ్యక్తులు

**7/2 వ్యక్తులు పరిశుభ్రంగా ఉండి, మంచి వస్త్రధారణ కలిగి ఉంటారు. ఇతరుల బాధలకు చలిస్తారు. దైవకృపతో ఉన్నత స్థానం పొందుతారు.**

ఎవరు 7, 16, 25 తేదీలలో జన్మించి, వారి డెస్టినీ నెంబరు 2 అవుతుందో వారు ఈ వర్గంలోకి వస్తారు. వీరు కేతు, చంద్ర గ్రహాల ప్రభావంలో ఉంటారు.

7వ నంబరు వ్యక్తులలో వీరు సంతోషదాయకమైన జీవితాన్ని గడుపుతారు. వీరు ఎప్పుడూ పరిశుభ్రంగా ఉంటారు. మంచి వస్త్రధారణ చేస్తారు. ఎప్పుడూ ఏదో ఒక ఆలోచనలలో మునిగి ఉంటారు. వీరికి మంచి విద్య, ఆర్థిక వనరులుంటాయి. వీరు సైన్స్ కి సంబంధించిన మెడికల్ కోర్సు కాని ఫార్మసి కాని నర్స్ కోర్సు చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ రంగాలలో వీరు చాలా మంచి పేరు తెచ్చుకుంటారు. వేదాలలో కూడా రాణిస్తారు.

వీరికి అనుకూల నామ సంఖ్యలు ఉంటే మంచి భాగస్వామి, కుటుంబ శాంతి కలుగుతాయి.

వీరు మంచి మనసు కలవారు. ఇతరుల బాధలకు చలిస్తారు. వారికి సహాయపడతారు. మంచి లక్ష్యాలతో, మంచి ఉద్దేశ్యాలతో దేవునిపై నమ్మకంతో, జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదుగుతారు. ప్రతికూల నామ సంఖ్యలు ఉంటే అవకాశాలను కోల్పోతారు. భవిష్యత్ ప్రణాళికలను రచించడంలో దిట్ట. మాటలు కన్న రచనలో నైపుణ్యం ఉంటుంది. వాదనలో అందెవేసిన చెయ్యి. న్యాయం చెప్పటంలో ముందుంటారు. మానసిక శాంతి కరువైనపుడు, ప్రకృతి ఆరాధన ద్వారా ఉపశమనాన్ని పొందుతారు.

### పేరు పెట్టే విధానం

వీరికి చంద్రుని సంఖ్యలైన 20, 38, 47, శుక్ర సంఖ్యలైన 6, 15, 24, 33, 42, 51, కేతు సంఖ్యలైన 25, 31 లు పెట్టుకుంటే వీరికి జీవితం అనుకూలంగా ఉంటుంది.

### రాణించే రంగాలు

విలాసవస్తు విక్రయం, వాణిజ్య, వర్తక, వ్యాపారాలన్నీ కలిసివస్తాయి. అధ్యాపక,

రచన, పచ్చని వస్తువుల అమ్మకం, కళా సంబంధ వస్తువులు, వస్త్ర వ్యాపారం, కాంట్రాక్టు వర్క్సు కలిసివస్తాయి.

**వ్యాధులు**

మానసిక ఆందోళన, గ్యాస్ట్రబుల్, కీళ్ళనొప్పులు, రక్తపోటు వచ్చే అవకాశం ఉంటుంది. అనుకూల నామ సంఖ్యలతో వ్యాధులు నివారించవచ్చు.

**సూచనలు**

| | | |
|---|---|---|
| లక్కీ నంబర్లు | - | 2, 6, 7 |
| అన్‌లక్కీ నంబర్లు | - | 8, 9 |
| లక్కీ తేదీలు | - | 2, 6, 7, 11, 15, 16, 20, 24, 25, 29 |
| అన్‌లక్కీ డేట్స్ | - | 8, 9, 17, 18, 26, 27 |
| లక్కీ కలర్స్ | - | పచ్చ, నీలం, పసుపు, సిల్వర్, తెలుపు, క్రీమ్, బూడిదరంగు |
| అన్‌లక్కీ కలర్స్ | - | ఎరుపు |
| అదృష్ట దినాలు | - | ఆదివారం, సోమవారం, శుక్రవారం |
| లక్కీ వివాహ తేదీలు | - | 1, 6, 10, 15, 19, 24, 28 |
| రెమిడీస్ | - | కేతుజపం చేయించడం, ఉలవలు దానం చేయడం, రోజూ వెన్నెల్లో 30 నుండి 40 నిమిషాలు గడపడం. పార్వతి అమ్మవారిని కొలవటం, చిత్రగుప్తుని దేవాలయ సందర్శనం. |
| ఉదా | - | |

## జన్మసంఖ్య - 7, డెస్టినీ నంబరు - 3

**7/3 వ్యక్తులు సాంప్రదాయ, ఆధునిక భావాలు రెండూ కలిగి ఉంటారు. వీరికి స్నేహితులు తక్కువ. రచనలు చేస్తారు. కొత్త వస్తువులు కనుగొనే శక్తి ఉంటుంది.**

ఎవరు 7, 16, 25 తేదీలలో జన్మించి వారి డెస్టినీ నెంబరు 3 అవుతుందో వారు ఈ వర్గంలోకి వస్తారు. వీరు కేతు, గురు గ్రహాల ప్రభావంలో ఉంటారు.

వీరు సంప్రదాయ, ఆధునికతల మేలు కలయికతో తమ ఆలోచనలను అందంగా తెలియచేస్తారు. ముక్కుసూటిగా మాట్లాడి విజయం సాధిస్తారు. మంచి ఆలోచనపరులై సమాజంపై మంచి ప్రభావం చూపుతారు. వీరికి అతి తక్కువ మిత్రులుంటారు. వీరు సైన్స్ సబ్జెక్ట్స్ అనగా కంప్యూటర్, ఎలక్ట్రానిక్స్‌లలో ఆసక్తి చూపుతారు. వీరు ఎంసీఏ, ఇంజినీరింగ్‌లో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెడికల్ కోర్సులు, సైన్స్ సబ్జెక్ట్‌లలో రాణిస్తారు. వీరిలో కొందరికి మెడికల్ దుకాణాలు ఉంటాయి. వేద పండితులుగా, పురోహితులుగా రాణిస్తారు. దేవాలయ నిర్మాణం మొదలగు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. సంగీతం, నాట్యం వంటి కళలలో ఆసక్తి ఉంటుంది. తల్లిదండ్రులు ఈ బర్త్ డేట్‌లో పుట్టిన వారి పిల్లలను చదువుతో పాటు ఇతర రంగాల్లో వారి అభిరుచికి తగ్గట్టు శిక్షణ ఇప్పిస్తే ఆ రంగాల్లో బాగా రాణిస్తారు.

వీరికి అనుకూలమైన పేర్లు ఉంటే మంచి గణిత శాస్త్రజ్ఞులు, వైద్యులు, ఇంజనీర్లు, పారిశ్రామిక వేత్తలవుతారు. వీరికి కోపమెక్కువ. ఇతరుల తప్పులను ఇట్టే కనిపెడతారు. విద్య, కళలు, పరిశోధనలందు రాణిస్తారు. కార్యనిర్వాహణాధికారులుగా పేరు పొందుతారు. రచనలోనూ, కవిత్వంలోనూ రచయితలుగా ముందంజలో ఉంటారు. ఏదైనా సమస్య ఎదురైతే అది తీరేంతవరకు నిద్రపట్టదు. నూతన వస్తువులు కనుగొనే శక్తి సామర్థ్యాలుండి, గణితం, జ్యోతిష్యం, అతీంద్రియ శక్తులు వశమవుతాయి. చరిత్ర, రాజకీయాల్లో రాణిస్తారు.

వీరి దేశభక్తి, ఆధ్యాత్మిక శక్తి దేశానికి, మతానికి ఎంతో ఉపకారం చేస్తుంది. న్యాయరక్షణలో వీరు ఎంతటి వారినైనా ఎదిరిస్తారు. వీరు మంచి పరిశోధకులు. ముభావంగా ఉండటం వలన వ్యాపారంలో రాణించడం కష్టం. అనుకూల నామ సంఖ్యలు విజయాన్ని కలిగిస్తాయి.

అనుకూలమైన పేరు లేకపోతే స్నేహితులతో జీవిత భాగస్వామితో గొడవలొచ్చే ప్రమాదం ఉంది. అనుకూల నామంతో దీన్ని ఎదుర్కోవచ్చు. ఒక్కొక్కప్పుడు ఆడంబరంగానూ, ఇంకోసారి సాధారణంగానూ కనిపిస్తారు.

## పేరు పెట్టే విధానం

వీరికి సూర్య సంఖ్యలైన 19, 37, 46, 55, చంద్రుని సంఖ్యలైన 1, 20, 38, 47, గురు సంఖ్యలైన 3, 21, 30, 39, కేతు సంఖ్యలైన 25, 34లు పేర్లకు అనుకూలం.

## రాణించే రంగాలు

చాలా మంది ఉద్యోగులుగాను, మిగతా వారు వ్యాపారంలో ఉంటారు. ద్రవ పదార్థాలు, రత్న, ఖనిజ, వైద్య పరికరాల వ్యాపారం, కళాత్మక వస్తువులు, కాంట్రాక్టులు, ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్స్, మెడికల్ ఏజెన్సీలు అనుకూలంగా ఉంటాయి.

## వ్యాధులు

వీళ్ళు గ్యాస్ట్రబుల్, అధిక ఉష్ణం, నరాల వ్యాధులు, ఛాతీనొప్పి, మానసిక ఒత్తిడికి గురయ్యే అవకాశం ఉంది. తగిన చికిత్స తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది.

## సూచనలు

| | | |
|---|---|---|
| లక్కీ నంబర్లు | - | 2, 3, 5, 7 |
| అన్‌లక్కీ నంబర్లు | - | 9 |
| లక్కీ తేదీలు | - | 2, 3, 5, 11, 12, 14, 20, 21, 23, 29, 30 |
| అన్‌లక్కీ డేట్స్ | - | 9, 18, 27 |
| లక్కీ కలర్స్ | - | లేతనీలం, లేతపసుపు, సాండల్, తెలుపు, క్రీమ్ |
| అన్‌లక్కీ కలర్స్ | - | ఎరుపు |
| అదృష్ట దినాలు | - | సోమవారం, బుధవారం, గురువారం |
| లక్కీ వివాహ తేదీలు | - | 1, 3, 6, 10, 12, 15, 19, 24, 28 |
| రెమిడీస్ | - | దక్షిణామూర్తిని, పార్వతి అమ్మవారిని ఆరాధించడం,<br>గురువులను, పండితులను సత్కరించటం.<br>బీదలకు, అనాథలకు అన్నదానం,<br>పేద విద్యార్థులకు చదువు కొరకు సహాయపడటం. |
| ఉదా | - | హేమమాలిని 16-10-1948 |

# జన్మసంఖ్య - 7, డెస్టినీ నంబరు - 4 గల వ్యక్తులు

**7/4 వ్యక్తులు విలాసవంతంగా జీవించాలనుకుంటారు. భవిష్యత్తు ఊహించే శక్తి కలిగి ఉంటారు. వీరికి జనాకర్షణ శక్తి, ఆధ్యాత్మిక శక్తి ఉంటాయి.**

ఎవరు 7, 16, 25వ తేదీల్లో జన్మించి, వారి డెస్టినీ నెంబరు 4 అవుతుందో వారు ఈ వర్గంలోకి వస్తారు. వీరు కేతు, రాహు గ్రహాల ప్రభావంలో ఉంటారు.

విలాసవంతంగా జీవించాలనే అభిలాష కల్గి ఉంటారు. అనుకూల నామ సంఖ్య ఉంటే మంచి ఉద్యోగం, ఆరోగ్యం, సంపద, జీవిత భాగస్వామిని పొందుతారు. లేకపోతే వీరి కుటుంబ జీవితం సమస్యల పాలవుతుంది. వీరు సైన్స్ సబ్జెక్ట్ మీద మరియు ఎల్ఎల్బీ, ఎంబీఏ వంటి కోర్సుల్లో ఆసక్తి చూపిస్తారు. ప్రస్తుత కాలంలో కంప్యూటర్, నూతన టెక్నాలజీకి సంబంధించిన సబ్జెక్ట్ మీద ఆసక్తి ఉంటుంది.

వీరికి అతీంద్రియ శక్తులతో పాటు, మోడ్రన్ టెక్నాలజీ అయిన కంప్యూటర్, ఎలక్ట్రానిక్స్ రంగాలలో మంచి జ్ఞానం ఉంటుంది. వీటిలో చాలా ప్రతిభ కనబరుస్తారు.

సంగీతం, చిత్రలేఖనం, నృత్యం, జ్యోతిష్యం, వైద్యం, హస్తకళలు, భవిష్యత్తు సంఘటనలు ఊహించే సామర్థ్యం ఉంటాయి. అందరితో కలిసి తిరిగినా, స్నేహితులు కొంతమందే ఉంటారు. అనుకూల నామసంఖ్య ఉంటే గృహ, వాహన, కళా, పరిశ్రమ సౌఖ్యాలని కలిగి ప్రభుత్వ ఉన్నత పదవులను చేపడతారు. వీరెప్పుడూ నిజాయితీగాను, న్యాయబుద్ధితో ఉంటారు. జనాకర్షణ శక్తి, ఆధ్యాత్మిక శక్తి ఉంటాయి. అకస్మాత్తుగా ఆలోచనలలో మునిగిపోతారు.

## పేరు పెట్టే విధానం

వీరికి సూర్య సంఖ్యలైన 1, 19, 37, 46, 55, శుక్ర సంఖ్యలైన 6, 15, 24, కేతు సంఖ్యలైన 25, 34లు పేర్లకు అనుకూలం.

## రాణించే రంగాలు

కళాత్మక వృత్తులు, రచన, అధ్యాపక వృత్తులు, పురోహితులు, వేదపండితులు, డాక్టర్స్, ఫార్మసీ, నర్సు ఉద్యోగాలు కలిసివస్తాయి. ఏజెన్సీలు, రవాణా, విలాస వస్తువులు, పుస్తక విక్రయం లాభాలు తెస్తాయి.

### వ్యాధులు

కడుపునొప్పి, పొత్తి కడుపునొప్పి, వెన్నునొప్పి, పంటినొప్పి, రక్తపోటు, చక్కెర వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నాయి. తక్కువ ఉప్పు, పంచదార, కొవ్వు పదార్థాలు తక్కువ తీసుకోవడం మంచిది. సరియైన చికిత్స తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది.

### సూచనలు

| | | |
|---|---|---|
| లక్కీ నంబర్లు | - | 1, 2, 6 |
| అన్‌లక్కీ నంబర్లు | - | 9 |
| లక్కీ తేదీలు | - | 1, 2, 6, 10, 11, 15, 19, 20, 24, 28, 29 |
| అన్‌లక్కీ డేట్స్ | - | 9, 18, 27 |
| లక్కీ కలర్స్ | - | పచ్చ, పసుపు, నీలిరంగు, ఆరెంజి, రోజ్, గోల్డెన్, సిల్వర్ |
| అన్‌లక్కీ కలర్స్ | - | ఎరుపు, నలుపు |
| అదృష్ట దినాలు | - | ఆదివారం, సోమవారం, గురువారం |
| లక్కీ వివాహ తేదీలు | - | 1, 6, 10, 15, 19, 24, 28 |
| రెమిడీస్ | - | రాహుకేతు జపం చేయించటం, సుబ్రహ్మణ్య స్వామి, పార్వతీదేవి ఆరాధన, చిత్రగుప్తుని దేవాలయ దర్శనం, అనాథలకు అన్నదానం చేయటం. |
| ఉదా | - | బిపిన్ చంద్రపాల్ 07-11-1858 |
| | | మెహర్ బాబా 25-02-1894 |

## జన్మసంఖ్య - 7, డెస్టినీ నంబరు - 5 గల వ్యక్తులు

**7/5 వ్యక్తులు వ్యాపారం, పరిశ్రమల ద్వారా గొప్పవారవుతారు. వీరికి అనేక ఆదాయ మార్గాలు ఉంటాయి. ఎంత ఎత్తుకు ఎదిగినా సుఖం తక్కువగా ఉంటుంది. నిజాయితీపరులు.**

ఎవరు 7, 16, 25 తేదీలలో జన్మించి వారి డెస్టినీ నెంబరు 5 అవుతుందో వారు ఈ వర్గంలోకి వస్తారు. వీరు కేతువు, బుధ గ్రహ ప్రభావంలో ఉంటారు.

వీరు మంచి ఆలోచనా శక్తి, నిజాయితీ, సహకార గుణం కలిగి ఉంటారు. ఏ పనైనా తొందగా జరగాలని అనుకుంటారు. బద్ధకాన్ని నచ్చరు. వీరికి దైవభక్తి ఎక్కువ. ఆధ్యాత్మిక భావం, తత్వవిచారణ కలిగి ఉంటారు. పొరపాటున ఏదైనా తప్పు చేస్తే బాధ పడతారు. ఒక్కొక్కసారి వీరికి తొందరగా కోపం వస్తుంది. తీర్థ యాత్రలు చేస్తారు. సైన్స్ కోర్సులు చదువుతారు. కొందరు ఎంబీబీఎస్, ఫార్మసీ రంగాల్లో ఉంటారు. ఏ వృత్తి చేసినా ఆ వృత్తిని పెద్దదిగా కార్పొరేట్ రంగంలో చేయాలనే కోరిక ఉంటుంది. మెడిసిన్ చదివితే ఖచ్చితంగా కార్పొరేట్ హాస్పిటల్ పెడతారు. వీరికి మంచి వాక్చాతుర్యం ఉంటుంది. జనాకర్షణ శక్తి ఉంటుంది. చాలా మంది వీరి స్నేహాన్ని కోరుకుంటారు.

వీరికి వ్యాపారం, పరిశ్రమలు అనుకూలం. కొంతమంది ఉద్యోగులుగా, కొందరు వ్యాపారులుగా ఉంటారు. అనేక ఆదాయ మార్గాల కోసం ప్రణాళికలు వేస్తారు. మంచి పరిశీలన, పరిశోధనా శక్తి కలిగి ఉంటారు. వీరి పేరు, జన్మదిన సంఖ్యకు అనుకూలంగా ఉంటే అన్నింటా అభివృద్ధి సాధించి, ఆధ్యాత్మికంగా కూడా ఉన్నతిని సాధిస్తారు.

న్యాయశాస్త్రం, మతం, కళలు, సాహిత్యం, సంగీతం, జ్యోతిష్యం, వైద్య రంగాలలో అభిరుచి కలిగి ఉంటారు.

## పేరు పెట్టే విధానం

వీరికి సూర్య సంఖ్యలైన 1, 19, 37, 46, 55, బుధ సంఖ్యలైన 5, 14, 23, 32, 41, 50, శుక్ర సంఖ్యలైన 6, 15, 24, 33, 42లు పేర్లకు అనుకూలం.

## రాణించే రంగాలు

వీరికి ప్రధానంగా అధ్యాపక, రచనా, కమీషన్ వృత్తులు, మందులు, రవాణా, లోహాలు, పచ్చని వస్తువుల వ్యాపారాలు కలిసివస్తాయి.

## సూచనలు

| | | |
|---|---|---|
| లక్కీ నంబర్లు | – | 2, 5, 6, 7 |
| అన్‌లక్కీ నంబర్లు | – | 9 |
| లక్కీ తేదీలు | – | 2, 5, 6, 7, 11, 14, 15, 16, 20, 23, 24, 25, 29 |
| అన్‌లక్కీ డేట్స్ | – | 9, 18, 27 |

| | | |
|---|---|---|
| లక్కీ కలర్స్ | - | ఆకుపచ్చ, పసుపు, బూడిదరంగు, లేత నీలిరంగు, గోధుమ రంగు, గోల్డెన్ |
| అన్‌లక్కీ కలర్స్ | - | ఎరుపు |
| అదృష్ట దినాలు | - | సోమవారం, బుధవారం |
| లక్కీ వివాహ తేదీలు | - | 1, 6, 10, 15, 19, 24, 28 |
| రెమిడీస్ | - | పండితులకు, బీద విద్యార్థులకు, వికలాంగులకు తగిన విధంగా సహాయం చేయడం పార్వతి అమ్మవారి దర్శనం చేయటం, శివునికి అభిషేకం చేయించడం మంచిది. |
| ఉదా | - | సైఫ్ అలీఖాన్ 16-08-1970 |
| | | కందుకూరి వీరేశలింగం 16-04-1848 |
| | | ఎం.ఎస్.స్వామినాథన్ 07-08-1925 |

## జన్మసంఖ్య - 7, డెస్టినీ నంబరు - 6 గల వ్యక్తులు

**7/6 వ్యక్తులు విలాస జీవితం కోరుకుంటారు. లలితకళలు, జ్యోతిషం పట్ల ఆసక్తి ఉంటుంది. రచనలు చేస్తారు. ఆధ్యాత్మికత, దైవభక్తి కలవారుగా ఉంటారు.**

ఎవరు 7, 16, 25 తేదీలలో జన్మించి, వారి డెస్టినీ నెంబరు 6 అవుతుందో వారు ఈ వర్గంలోకి వస్తారు. వీరు కేతు, శుక్ర గ్రహాల ప్రభావంలో ఉంటారు.

విలాసవంతమైన జీవితాన్ని కోరుకుంటారు. ఒక మోస్తరు పొడగరులు. చాలా అందంగా ఉంటారు. వీరి ముఖంలో ఆకర్షణ ఉంటుంది. మంచి వాక్పటిమ ఉంటుంది. చర్చల్లో ఘనాపాటీలు. ఏ పనైనా సాధ్యాసాధ్యాలు తెలుసుకొని అమలు చేస్తారు. ఎంబీబీఎస్, ఫార్మసీ, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ఫ్యాషన్ టెక్నాలజీ, కాస్ట్యూమ్ డిజైనింగ్, సినిమాటోగ్రఫీ, ఫైన్ ఆర్ట్స్ వంటి రంగాల్లో రాణిస్తారు.

సంగీత, నృత్య, వైద్యాలకు, వేదాంతాలకు, జ్యోతిష్యానికి ఆకర్షితులవుతారు. ప్రకృతి ఆరాధన ఇష్టం. శాంత స్వభావులు. అనుకూల నామ సంఖ్యలున్నచో వీరికి ఆయురారోగ్యాలు, జీవిత భాగస్వామి, సంపద కలుగుతాయి. వీరికి ఇల్లు, వాహనం,

ఉద్యోగం, పరిశ్రమలు సౌకర్యాలు ఉంటాయి.

ప్రతికూల నామ సంఖ్య ఉంటే కుటుంబ తగాదాలు, పిల్లల వలన సమస్యలు రావొచ్చు.

రచన, అధ్యాపక వృత్తులు, విలాస వస్తు విక్రయాలు అనుకూలం. ఒంటరిగా ఉన్నప్పుడు గొప్ప ఆలోచనలు చేస్తారు. దేవునిపై పరిపూర్ణ విశ్వాసం ఉంటుంది. దేవునికి, మతానికి మధ్యనున్న సంబంధాలను పరిశీలిస్తారు. అనుకూలమైన పేరు ఉంటే సమస్యలు రావు.

## పేరు పెట్టే విధానం

వీరికి సూర్య సంఖ్యలైన 19, 37, 46, 55, చంద్రుని సంఖ్యలైన 20, 38, 47, శుక్ర సంఖ్యలైన 6, 15, 24, 33, 42, 51, కేతు సంఖ్యలైన 25, 34లు పేర్లకు అనుకూలం.

## రాణించే రంగాలు

కాంట్రాక్టులు, ఏజెన్సీలు, విలాసవస్తు వ్యాపారాలు, పచ్చరంగు వస్తువులు, డాక్టర్లు, ఫార్మసి, నర్సులు, ఫిజియోథెరఫి వస్త్ర, మందుల వ్యాపారాల ద్వారా సంపాదన కలుగుతుంది.

## వ్యాధులు

వీరికి కీళ్ళనొప్పులు, కంటినొప్పి, వెన్నునొప్పి వ్యాధులు రావచ్చు. సరియైన చికిత్స తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది.

## సూచనలు

| | | |
|---|---|---|
| లక్కీ నంబర్లు | – | 1, 2, 6, 7 |
| అన్‌లక్కీ నంబర్లు | – | 3, 9 |
| లక్కీ తేదీలు | – | 1, 2, 6, 10, 11, 15, 19, 20, 24, 28, 29 |
| అన్‌లక్కీ డేట్స్ | – | 3, 9, 12, 18, 21, 27, 30 |
| లక్కీ కలర్స్ | – | ఆకుపచ్చ, లేత నీలిరంగు, లేత పసుపు, తెలుపు, గోధుమ రంగు |
| అన్‌లక్కీ కలర్స్ | – | ఎరుపు, ఊదా రంగు |

| | | |
|---|---|---|
| అదృష్ట దినాలు | - | ఆది, సోమ, శుక్రవారాలు |
| లక్కీ వివాహ తేదీలు | - | 1, 16, 10, 15, 19, 24, 28 |
| రెమిడీస్ | - | పార్వతి అమ్మవారిని ఆరాధించటం, భృగుపాశుపత హోమం చేయించటం. పండితులకు, సాధువులకు, సహాయం చేయటం, వికలాంగులకు, అనాథలకు అన్నదానం చేయటం. |
| ఉదా | - | మహేంద్రసింగ్ ధోని 07-07-1981 |

## జన్మసంఖ్య - 7, డెస్టినీ నంబరు - 7 గల వ్యక్తులు

**7/7 వ్యక్తులపై కేతు గ్రహ ప్రభావం సంపూర్ణంగా ఉంటుంది. వీరు జ్ఞాన సంపన్నులు. ఇతరులకు హాని చేయరు. వీరికి పెళ్ళి ఆలస్యంగా అవుతుంది. మానవతీత శక్తులపై నమ్మకం కలిగి ఉంటారు.**

ఎవరు 7, 16, 25 తేదీలలో జన్మించి, వారి డెస్టినీ నెంబరు 7 అవుతుందో వారు ఈ వర్గంలోకి వస్తారు. వీరిపై కేతు గ్రహ ప్రభావం సంపూర్ణంగా ఉంటుంది.

వీరు ఆలోచనలలో మునిగి తేలుతుంటారు. వీరు తమ సమస్యలను ఎవరికీ చెప్పక లోలోపలే ఆందోళన చెందుతారు. వీరి ఆలోచనలు ఉన్నతమైనవి. శుచి, శుభ్రత కలిగివుంటారు. వీరి వాక్కు ఫలిస్తుంది. చేతిలో సంజీవిని యోగం ఉంటుంది. వీరి చేత్తో మందు ఇస్తే ఎలాంటి రుగ్మతకైనా త్వరగా ఉపశమనం కలుగుతుంది. వీరికి జరుగబోయే సంఘటనలు కలల రూపంలో ముందే తెలుస్తాయి. సైన్స్ గ్రూప్ మీద ఆసక్తి ఉంటుంది. దేవునికి సంబంధించిన గ్రంథాలను విశ్లేషించి దానిలో దాగి ఉన్న సూక్ష్మాలను ప్రజలకు వివరించగలుగుతారు. వీరిని చూడగానే ఎవరికైనా నమస్కరించాలనే భావన కలుగుతుంది. కుటుంబ విషయాలపై ఆసక్తి చూపరు అందువలన వీరి కుటుంబ జీవితంలో కొంత సమస్యలు ఉంటాయి.

ఇతరులు చెప్పేది వినడం ద్వారా జ్ఞానాన్ని సంపాదిస్తారు. వీరి జీవితంలో ఎన్నో బాధలు, కష్టనష్టాలున్నా ఇతరులకు మాత్రం హాని చేయరు. అనుకూల నామ సంఖ్య ఉంటే వీరికి జీవితంలో అన్నీ దొరుకుతాయి. లేకపోతే కుటుంబంలో అశాంతి, వైవాహిక

సమస్యలు, వ్యాధులతో బాధపడతారు. వీరు పేరులో సరియైన మార్పు చేసుకోవటం వలన మంచి ఫలితాలు పొందుతారు.

దీర్ఘాలోచనలో ఉండి ధ్యానం చేస్తుంటారు. కవితలు, రచనల పట్ల ఆసక్తి ఉంటుంది.

వీరిలో కొందరు ఒక్కొక్కసారి వేదాంత ధోరణిలో ఆలోచిస్తుంటారు. జగమే మాయ అనుకుంటూ ఉంటారు. సమస్యలు ఎదురైనపుడే ఈ విధంగా ఉంటారు. కానీ అనుకూలమైన పేరు పెట్టుకుంటే, మంచి ఫలితాలు వస్తాయి. దైవ ప్రార్థన వలన కూడా మంచి ఫలితం వస్తుంది. శివారాధన, లలితా సహస్రనామ పారాయణం మొదలైనవి చేస్తే మంచిది.

ప్రయత్నిస్తే వీరికి మానవాతీత శక్తులు, అతీంద్రియ శక్తులు చాలా తొందరగా సిద్ధిస్తాయి.

## పేరు పెట్టే విధానం

వీరికి సూర్య సంఖ్యలైన 19, 37, 46, 55, చంద్ర సంఖ్యలైన 20, 38, 47, శుక్ర సంఖ్యలైన 6, 15, 24, 33, 42, కేతు సంఖ్యలైన 25, 34లు పేర్లకు అనుకూలం.

## రాణించే రంగాలు

వీరి చేతిలో సంజీవినీ యోగం ఉంటుంది. అందువలన వీరు డాక్టర్లుగా రాణించగలరు. ఫార్మసీ, ఫిజియోథెరపీ, వీరికి అతీంద్రీయ శక్తులు ఉంటాయి. కాబట్టి జ్యోతిష్యం, న్యూమరాలజీ కూడా అనుకూలం. జరగబోయేది ముందుగానే ఉహించగలుగుతారు. కమ్యూనికేషన్ రంగంలో బాగా రాణించగలుగుతారు.

## వ్యాధులు

మానసిక వ్యాధులు, మనోవేదన, నరాల బలహీనత, కీళ్ళనొప్పులు, రక్తపోటు, కంటినొప్పి, గ్యాస్ట్రబుల్ వచ్చే అవకాశం ఉంటుంది. కాబట్టి పేరు 42 వచ్చునట్లు మార్చితే మంచి ఫలితం ఉంటుంది.

## సూచనలు

| | | |
|---|---|---|
| లక్కీ నంబర్లు | - | 2, 5, 6, 7 |
| అన్‌లక్కీ నంబర్లు | - | 9 |
| లక్కీ తేదీలు | - | 2, 5, 6, 7, 11, 14, 15, 16, 20, 23, 24, 25, 29 |

| | | |
|---|---|---|
| అన్‌లక్కీ డేట్స్ | - | 9, 18, 27 |
| లక్కీ కలర్స్ | - | ఆకుపచ్చ, లేతనీలం, లేత పసుపు, గోధుమ, సిల్వర్ |
| అన్‌లక్కీ కలర్స్ | - | ఎరుపు |
| అదృష్ట దినాలు | - | సోమవారం, బుధవారం, శుక్రవారం |
| లక్కీ వివాహ తేదీలు | - | 1, 6, 10, 15, 19, 24, 28 |
| రెమిడీస్ | - | పార్వతి అమ్మవారిని ఆరాధించటం.<br>శివ అభిషేకం, కేతు జపం చేయటం.<br>సాధువులకు, పండితులకు, పూజారులకు తగిన సహాయం చేయటం,<br>మానసిక వికలాంగులకు ఆహారపదార్థాలను ఇవ్వటం. |
| ఉదా | - | జహీర్‌ఖాన్ 07-10-1978<br>సి.వి.రామన్ 07-11-1888<br>ఎం.ఎస్.సుబ్బలక్ష్మి 16-09-1916 |

## జన్మసంఖ్య - 7, డెస్టినీ నంబరు - 8 గల వ్యక్తులు

**7/8 వ్యక్తులు బాధలను వారిలోనే దాచుకుంటారు. దైవప్రార్థన ద్వారా మానసిక ప్రశాంతత పొందుతారు.**

ఎవరు 7, 16, 25 తేదీలలో జన్మించి వారి డెస్టినీ నెంబరు 8 అవుతుందో వారు ఈ వర్గంలోకి వస్తారు. వీరు కేతు, శని గ్రహాల ప్రభావంలో ఉంటారు.

ఈ నెంబరు కలవారు, ఎంతటి కష్టాన్నైనా మనసులోనే దాచుకుంటారు. గొప్ప పోరాట పటిమ ఉంటుంది. ఎన్ని కష్టాలొచ్చినా ఏటికి ఎదురీది, విజయం సాధిస్తారు. దైవప్రార్థన చేయటం వలన ప్రశాంతత పొందుతారు. వీరి ఆలోచనలు, మంచి, చెడుల మధ్య ఊగిసలాడుతూ ఉంటాయి. పాజిటివ్ ఆలోచనలు పెంపొందించుకుంటే ఉన్నతిని సాధిస్తారు. కొందరికి పెళ్ళి ఆలస్యమవుతుంది. అలాంటి వారు సుబ్రహ్మణ్య స్వామి ఆరాధన చేస్తే మంచిది. కోపం అదుపులో ఉంచుకుంటే మంచిది. వీరికి ఎంబీబీఎస్, ఇంజినీరింగ్‌లో ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ రంగాల్లో ఆసక్తి ఉంటుంది. తర్వాత మేనేజ్‌మెంట్,

న్యాయ రంగం వైపు ఆసక్తి చూపుతారు. ఎంబీబీఎస్ చదివిన వారు హాస్పిటల్ మేనేజ్‌మెంట్ వంటి కోర్సులు, చాలా మంది ఎంబీఏ, ఎల్‌ఎల్‌బీ వంటి కోర్సులు చేసి ఆ రంగాల్లో స్థిరపడతారు. వీరు న్యాయమూర్తి అయితే సాక్షాత్తూ ఆ న్యాయదేవత న్యాయం చెప్పినట్లు ఉంటుంది. ధర్మానికి మారుపేరుగా ఉంటారు. కుటుంబాన్ని నిర్లక్ష్యం చేయటం వలన కొంత అశాంతి ఉంటుంది.

అనుకూలమైన పేరుంటే, అన్ని సమస్యలు తొలగిపోయి, మంచి ఆదాయం, ఆరోగ్యం లభిస్తాయి.

## పేరు పెట్టే విధానం

వీరు బుధ, శుక్ర సంఖ్యలైన 15, 24, 33, 42, 51, 60, 69, 14, 23, 32, 41, 50, 59, 77 లు వచ్చేటట్టుగా పేరు పెట్టుకుంటే మంచి ఫలితాలు పొందుతారు.

## రాణించే రంగాలు

వీరికి కాంట్రాక్టులు, ఏజెన్సీలు, రచన, అధ్యాపక, పరిశ్రమ, లోహ, రవాణాది వ్యాపారాలు లాభసాటిగా ఉంటాయి.

## వ్యాధులు

పంటినొప్పి, ఛాతీనొప్పి, వెన్నునొప్పి, కీళ్ళనొప్పులు, చక్కెర వ్యాధులతో బాధపడుతున్నప్పుడు నామసంఖ్య 42కు మార్చడం వలన ఉపశమనం లభిస్తుంది.

## సూచనలు

| | | |
|---|---|---|
| లక్కీ నంబర్లు | - | 2, 5, 6, 7 |
| అన్‌లక్కీ నంబర్లు | - | 9 |
| లక్కీ తేదీలు | - | 2, 5, 6, 7, 11, 14, 15, 16, 20, 23, 24, 25, 29 |
| అన్‌లక్కీ డేట్స్ | - | 9, 18, 27 |
| లక్కీ కలర్స్ | - | పచ్చ, నీలం, పసుపు, గోధుమరంగు, సిల్వర్, తెలుపు |
| అన్‌లక్కీ కలర్స్ | - | నలుపు, ఎరుపు |
| అదృష్ట దినాలు | - | సోమవారం, బుధవారం, శుక్రవారం |
| లక్కీ వివాహ తేదీలు | - | 1, 6, 10, 15, 19, 24, 28 |
| రెమిడీస్ | - | శివ అభిషేకం, పార్వతి అమ్మవారిని కొలవటం, |

| | | | |
|---|---|---|---|
| | | వికలాంగులకు, అనాథలకు అన్నదానం చేయటం. | |
| ఉదా | - | పండిత్ మదన్‌మోహన్ మాలవ్య | 25-12-1861 |
| | | సోమనాథ్ ఛటర్జీ | 25-07-1929 |

## జన్మసంఖ్య - 7, డెస్టినీ నంబరు - 9 గల వ్యక్తులు

**7/9 వ్యక్తులకు సుఖ దుఃఖాలు రెండూ ఉంటాయి. పెళ్ళి ఆలస్యంగా జరుగుతుంది. జ్యోతిషం, న్యాయశాస్త్రంలో అభిరుచి ఉంటుంది.**

ఎవరు 7, 16, 25 తేదీలలో జన్మించి, వారి డెస్టినీ నెంబరు 9 అవుతుందో వారు ఈ వర్గంలోకి వస్తారు. వీరు కేతు, కుజ గ్రహాల ప్రభావంలో ఉంటారు.

కేతు ప్రభావం వలన వీరికి ఆధ్యాత్మిక చింతన ఉంటుంది. కుజగ్రహ ప్రభావం వలన ఆయుధాలు, ఆయుధ పనిముట్లకు సంబంధించిన పనులు చేస్తారు. సంజీవని యోగం ఉండటం వలన ప్రపంచ ప్రఖ్యాత సర్జన్లుగా రాణిస్తారు. విశ్లేషణాత్మక పరిశోధనాశక్తి ఉండటం వలన సైన్స్, రీసెర్చ్, ఆటమిక్ ఎనర్జీ, కంప్యూటర్స్ రంగాలలో వీరు బాగా రాణించగలరు. వీరు సివిల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్ మరియు ఎంసీఏ వంటి కోర్సుల వైపు ఆసక్తి చూపుతారు. కాంపిటీటివ్ పరీక్షలు రాసి ఉన్నత పదవులు అధిరోహించాలనే గట్టి పట్టుదల ఉంటుంది. దానికి తగిన కృషి కూడా చేస్తారు. ఐపీఎస్, మిలటరీ సర్వీసు వంటి ఉద్యోగాలు వీరికి బాగా కలిసివస్తాయి. భూమికి సంబంధించిన రంగాల్లో బాగా రాణిస్తారు.

వీరి డెస్టినీ నెంబరు 9 అవ్వటం వలన ధైర్యసాహసాలు, చొరవ ఉంటాయి. దాని వలన జీవితంలో పురోగతి చాలా తొందరగా వస్తుంది. జీవిత ప్రథమంలో, 7 సంఖ్య వలన సమస్యలు వచ్చినా, 35 సంవత్సరాలు దాటిన తరువాత అభివృద్ధి ఉంటుంది. దైవభక్తి ఎక్కువ. ఒక్కొక్కసారి తొందరగా కోపం వస్తుంది. దాని వలన సమస్యలు రావొచ్చు. ఆకర్షణీయంగా ఉంటారు. వీరు జన్మతేదీకి అనుకూలమైన పేరు పెట్టుకుంటే, చెడుప్రభావాలు తొలగిపోయి, సంపద, మంచి జీవిత భాగస్వామి, మంచి సంతానం కలుగుతాయి. వీరికి సంగీతం, నాట్యం, చిత్రలేఖనం లాంటి కళలందు అభిరుచి ఉంటుంది.

పురాణాలు, ఇతిహాసాల పట్ల ఆసక్తి ఉండి, ప్రవచనాలు ఇచ్చే శక్తి కలిగి ఉంటారు.

## పేరు పెట్టే విధానం

వీరికి సూర్య సంఖ్యలైన 19, 37, 46, 55, గురు సంఖ్యలైన 3, 21, 30, 39, శుక్ర సంఖ్యలైన 6, 15, 24, 33, 42, 51, కేతు సంఖ్యలైన 25, 34లు పేర్లకు అనుకూలం.

## రాణించే రంగాలు

న్యాయ వివాద పరిష్కారం, రచన, వైద్యవృత్తి, కాంట్రాక్టులు, ఏజెన్సీలు కలిసివస్తాయి.

## వ్యాధులు

గుండెనొప్పి, కడుపునొప్పి, వెన్నునొప్పి, కీళ్ళనొప్పి, మలబద్ధకం రావొచ్చు. సరియైన చికిత్స తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది.

## సూచనలు

| | | | |
|---|---|---|---|
| లక్కీ నంబర్లు | - | 3, 5, 6, 7 | |
| అన్‌లక్కీ నంబర్లు | - | --- | |
| లక్కీ తేదీలు | - | 6, 15, 24, 5, 14, 23, 3, 12, 21, 30 | |
| అన్‌లక్కీ డేట్స్ | - | లేవు | |
| లక్కీ కలర్స్ | - | లేతనీలం, ఎరుపు, గులాబీ, ఆరెంజ్, పసుపు | |
| అన్‌లక్కీ కలర్స్ | - | లేవు | |
| అదృష్ట దినాలు | - | మంగళవారం, బుధవారం, గురువారం, శుక్రవారం | |
| లక్కీ వివాహ తేదీలు | - | 3, 6, 9, 10, 12, 15, 18, 21, 24, 27 | |
| రెమిడీస్ | - | సుబ్రహ్మణ్యస్వామి ఆరాధన, శివ ఆరాధన, వికలాంగులకు, అనాథలకు అన్నదానం, రక్తదానం చేయటం. | |
| ఉదా | - | జితేంద్ర | 07-04-1942 |
| | | కత్రినాకైఫ్ | 16-07-1984 |
| | | రంగనాథ్ మిశ్రా | 25-11-1926 (జస్టిస్) |

# జన్మ సంఖ్య - 8 (శని గ్రహ సంఖ్య)

**ఈ సంఖ్య శనిగ్రహానికి చిహ్నం. ఈ సంఖ్య గలవారు నాయకులుగా ఎదుగుతారు. నమ్మింది నిర్భయంగా చేస్తారు. వీరు బుధుడి సంఖ్యతో పేరు పెట్టుకుంటే అభివృద్ధి సాధిస్తారు.**

8 సంఖ్య శని గ్రహానికి సూచిక. వ్యక్తుల యొక్క ప్రగతి లేదా పతనం ఈ సంఖ్య ప్రభావం వలన జరుగుతుంది. ఈ సంఖ్య గల వ్యక్తులు జాతీయ నాయకులుగా గాని, ప్రాంతీయ నాయకులుగా గాని ఎదుగుతారు. కొంతమంది ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో ఉన్నత పదవులు పొందుతారు. ఇతరులకు సహాయపడటంలో, అన్యాయాన్ని ఎదిరించటంలో పేరు పొందుతారు.

మంచైనా, చెడైనా వారికి నచ్చింది, నమ్మింది, నిర్భయంగా చేస్తారు. నమ్మిన వారికి వీరు చాలా మంచివారుగా వుంటారు. మోసం, నమ్మకద్రోహం చేసిన వాళ్ళని వదలరు. 8 సంఖ్య శనికి సంబంధించింది కాబట్టి చాలా మంది భయపడుతుంటారు కాని అలా భయపడడం కేవలం అపోహ మాత్రమే.

ఎలక్ట్రానిక్ గడియారం, కాలిక్యులేటర్ మొదలైనవి. 8 సంఖ్య ఆధారంగానే పనిచేస్తాయి. ఆంగ్ల భాషలో వర్ణమాల సంఖ్య 8 (26, 2+6=8). అలాగే 8 సంఖ్య విధ్వంసక కార్యకలాపాలకి కూడా కారకమవుతుంది. విజ్ఞానశాస్త్రం ఏ విధంగా, ప్రగతికి, విధ్వంసానికి, రెంటికీ కారణం అవుతుందో, అదే విధంగా శని(8) కూడా వ్యక్తుల ప్రగతికి, అధోగతికి కారణభూతుడౌతాడు.

ఎవరెవరిపై శని అనుకూల, ప్రతికూల ప్రభావాలు చూపుతాడో నిశితంగా పరిశీలించి తెలుసుకోవాలి. శని ప్రభావాన్ని తగ్గించే శక్తి "బుధుని"కి ఉంది. బుధుడి సంఖ్య 5. శని ప్రభావం ఉన్న వాళ్ళు బుధుడి సంఖ్యతో పేరు పెట్టుకున్నట్లయితే మంచి ఫలితాలు సాధించగలుగుతారు. 8, 17, 26 తేదీలలో పుట్టిన వారు శనివర్గం కింద వస్తారు. జీవిత ప్రథమంలో వారి జీవితం, కష్టనష్టాలతో కూడుకొని ఉండి, చివరికి విజయం సాధిస్తారు.

శని కష్టకారకుడని, ఆటంకాలు కలిగిస్తాడని అందరూ అనుకోవటం పరిపాటి.

కానీ "శని" దుష్టగ్రహం కాదు. జీవుల గత జన్మల కర్మ ఫలితాన్ని, వారి వారి పాపపుణ్యాలకు అనుగుణంగా ప్రతిఫలం పొందేటట్లు 'శని' మాత్రమే చేస్తాడు. మనుషులు వారు చేసిన తప్పులకు ప్రతిఫలంగా లభించిన చెడు ఫలితానికి శనిని నిందిస్తారు. కానీ ఇది తప్పు. శని మనుషులు చేసే పాపాలకు తగిన శిక్ష విధించి, ఆ పాప భారాన్ని తగ్గిస్తాడు. ఆ విధంగా శని మనకి ఎంతో మంచి చేస్తున్నాడు.

ఎనిమిది సంఖ్య మనిషిలో గోప్యంగా దాగివున్న మానసిక విజ్ఞానం, దూరదృష్టి, విజ్ఞత, ప్రేమ, త్యాగబుద్ధి మొదలైన వాటికి చిహ్నం. శని నల్లని రంగుతో, కుంటివానిగా, చూడటానికి భయపడే విధంగా ఉంటాడని వర్ణిస్తారు. శని మందగమనంతో సంచరిస్తాడు. విఘ్నాలు కలిగిస్తాడు. కాని అలా చేయటం వలన మనుషులు కష్టాల ప్రభావం, అవి ఇచ్చే అనుభవం వలన రాటుదేలుతారు. ఓటమి, విజయానికి తొలిమెట్టు అని సకారాత్మక దృష్టితో చూస్తే, శని 'దుష్టగ్రహం' కాదు "ఇష్టగ్రహం" అని తెలుసుకోగలుగుతారు.

8, 17, 26 తేదీల్లో పుట్టినవారు తమ చిన్నతనంలో తల్లిదండ్రులకు దూరంగా ఉండే అవకాశం ఉంది.

8, 17, 26 తేదీల్లో పుట్టినవారి పురోగతి 17 సంవత్సరాల నుండి మొదలవుతుంది. 26వ సంవత్సరంలో జీవితంలో స్థిరపడతారు. 35 సంవత్సరాల నుండి జీవితంలో అభివృద్ధి ఉంటుంది. 49వ సంవత్సరం నుండి చాలా ధనవంతులవుతారు. వీరి పేరు బర్త్‌డేట్‌కి సఖ్యతగా ఉంటే అష్టఐశ్వర్యాలు పొందుతారు. వీరికి మనీ మేనేజ్‌మెంట్ బాగా తెలుసు. కొందరు వీరిని పిసినారులు అంటారు కాని వీరు అందరి కన్నా గొప్ప దానకర్ణులు. తాము చేసే దానాలు గోప్యంగా ఉంచుతారు. వీరు మంచి మానవతావాదులు. కష్టాల్లో ఉన్నవారిని ఆదరిస్తారు. వీరు డాక్టర్లు అయితే ఫీజు తీసుకోకుండా వైద్యం చేస్తారు.

కాని అష్టమ సంఖ్య ఉన్న వారు జీవితంలో అంతులేని కష్టాలు, ఇబ్బందులు, నిరాశ, నిస్పృహలకు లోనవుతారన్నది నిజం. వీరు కష్టపడినా తగిన గుర్తింపు లభించదు. కానీ శని ప్రభావం లేకపోతే ఒక్కొక్కసారి గొప్ప వ్యక్తుల వ్యక్తిత్వం బయటపడదు. జార్జ్ బెర్నార్డ్‌షా లాంటి గొప్ప మేధావి, రచయిత 8 సంఖ్య ఉండటం వలన ఎన్నో కష్టనష్టాలకి ఓర్చి, ప్రపంచం గర్వించేటంత గొప్ప రచయితగా ఎదిగాడు. రాక్‌ఫెల్లర్ లాంటి గొప్పవాళ్ళు ఎనిమిది సంఖ్య కలిగినవారే. అయినా వాళ్ళు ఎంతో శ్రమించి గొప్ప వాళ్ళయ్యారు. శని

కష్టానికి, శ్రమకి, పాపానికి, పుణ్యానికి అన్నింటికి తగిన ఫలితాన్ని ఇస్తాడు. దీని నుంచి ఎవరూ తప్పించుకోలేరు. వీరి పేరు సరిచేయటం సంఖ్యాశాస్త్రవేత్తలకు కూడా కొంచెం కష్టంగా ఉంటుంది.

**అనుకూల లక్షణాలు:**

- ప్రాపంచిక విషయాలపై అదుపు కలిగి ఉండటం
- పెద్ద వ్యాపారం చేసి ధన సంపాదన చేయగలగటం
- మంచి ఆర్థిక వనరులు కలిగి ఉండటం
- అన్నింటా నియంత్రణ కలిగి ఉండటం
- విజయం సాధించి మంచి గుర్తింపు పొందటం
- మంచి పరిపాలనా సామర్థ్యం కలిగి ఉండటం
- విచక్షణా జ్ఞానం కలిగి మంచి జడ్జిమెంట్ ఇవ్వగలగటం
- నీతిగా, న్యాయంగా వ్యాపారం చేయటం
- పనివారి పట్ల, వారి సంక్షేమం పట్ల బాధ్యతగా ఉండటం
- ఆర్థికంగా, అధికారపరంగా మంచి గుర్తింపు

**ప్రతికూల లక్షణాలు**

- అత్యాశ కలిగి ఉండటం
- ప్రాపంచిక విషయాలపై అధికంగా ఆసక్తి కలిగి ఉండటం
- లాభాల కోసం తాపత్రయం
- అధికార దాహం కలిగి ఉండటం, అధికారం దుర్వినియోగం చేయటం
- మొరటుతనం, జాలి, దయ లేకపోవటం
- ఆత్మస్తుతి చేసుకోవటం
- పగ, ప్రతీకారం కలిగి ఉండటం

జన్మ సంఖ్య యొక్క ప్రభావం వ్యక్తులపై ఏ విధంగా ఉంటుందో అలాగే డెస్టినీ నంబరు ప్రభావం కూడా ఉంటుంది. దానివలన 8 జన్మసంఖ్య ఉన్న అందరి గుణగణాలు ఒకేలా ఉండవు. కారణం డెస్టినీ నంబరు మారటమే. ప్రస్తుత 8 జన్మ సంఖ్య ఉన్న వారి గుణగణాలు కూడా వారి డెస్టినీ నంబరు బట్టి మారుతుంటాయి.

# జన్మ సంఖ్య - 8, డెస్టినీ నంబరు - 1

**8/1 వ్యక్తులు మంచి ఆలోచనా శక్తి కలవారు. ముందు రెండు పళ్ళు పెద్దవిగా ఉంటాయి. వీరి ముఖం చూడగానే జ్ఞానులు అని తెలుసుకోవచ్చు. ఇతరులకు సాయం చేస్తుంటారు, కానీ ఇతరులకు అపకారం చెయ్యరు.**

ఎవరు 8, 17, 26 తేదీల్లో పుట్టి వారి డెస్టిని సంఖ్య 1 అవుతుందో వారు ఈ వర్గం కిందకి వస్తారు. వీరిపై శని, సూర్యుల ప్రభావం ఉంటుంది.

ఈ సంఖ్య కలవారు చురుకైన ముఖ కవళికలు కలిగి ఉంటారు. మంచి ఆలోచనా శక్తి కలిగి ఉంటారు. ముందరి రెండు పళ్ళు కొంచెం పెద్దవిగా ఉండవచ్చు. మధ్యస్థమైన పొడవు కలిగి ఉంటారు. కొంతమంది సన్నగాను, కొందరు లావుగాను ఉండవచ్చు. ముఖం చూసిన వెంటనే వీరు జ్ఞానవంతులు అని గుర్తుపట్టవచ్చు. వీరి విద్య మధ్యస్తంగా ఉన్నా తెలివితేటలు కలిగి ఉంటారు. పుస్తక పరిజ్ఞానం కంటే ఇంగిత జ్ఞానం కలిగి ఉంటారు. వీరు ప్రేమ వివాహం చేసుకొనే అవకాశాలు ఎక్కువ. వీరు కామర్స్, అనగా, బి.కాం, సి.ఎ., ఎల్.ఎల్.బి, లాంటి కోర్సులలో రాణిస్తారు. అకౌంటెంట్స్‌గా కాని, ఇన్సూరెన్స్, బ్యాంకింగ్ రంగాలలో కానీ రాణిస్తారు. వీరు ఎం.బి.ఎ చేస్తే మంచి మేనేజర్స్‌గా పేరు పొందుతారు.

ఇతరులకు సహాయపడుతూ మంచివారుగా పేరు తెచ్చుకుంటారు. ఇతరులు చెప్పింది ఓపిగ్గా విన్నా, నిర్ణయం మాత్రం వారి సొంతంగానే తీసుకోవాలి. ఒక్కొక్కసారి అలసటకు గురవుతారు. ఉదర సంబంధ వ్యాధులకు లోనవుతారు. సంఖ్యాశాస్త్రం ప్రకారం వీరికి సరైన పేరు పెడితే వీరి జీవితం సుఖసంతోషాలతో ఉంటుంది. గృహ, వాహన యోగం ఉంది. గతాన్ని ఎపుడూ మరిచిపోరు. పని విషయంలో నిబద్ధత కలిగి ఉంటారు. శృంగార విషయాలలో ఆసక్తి కనబరచటం వలన కొంత అపఖ్యాతి కలుగుతుంది. ఆపోజిట్ సెక్స్‌తో జాగ్రత్తగా ఉండాలి.

వీరు సున్నిత మనస్కులు. ఇతరులకు సహాయం చేసినపుడు తన సొంత కుటుంబం గురించి కూడా పట్టించుకోరు. దాని వలన కుటుంబ సంబంధిత సమస్యలు వస్తాయి. కృతజ్ఞతా భావం కలిగి ఉంటారు. ఇతరులకి ఎన్నడూ హాని తలపెట్టరు. వాళ్ళు చెప్పిందే

నిజమని నమ్ముతారు. సంఘంలో ఉన్నత స్థానం పొందటానికి ప్రయత్నిస్తుంటారు. శక్తికి మించిన పనులు చేపడతారు. దాని వలన ఒక్కొక్కసారి అపజయం పొందుతారు. కాని వీరు నిరంతర పోరాటంతో విజయం సాధిస్తారు.

ధనం ఎక్కువగా సంపాదించినా సంతృప్తి ఉండదు. మరింత సంపాదనపై దృష్టి పెడతారు. సరైన పేరు పెట్టకపోతే జీవితంలో ఒడిదుడుకులు ఎదుర్కొంటారు. సరైన పేరు పెట్టినట్లయితే డాక్టర్లుగా, ఇంజనీర్లుగా, ఉపాధ్యాయులుగా, రచయితలుగా, వృత్తి, కళారంగాలలో నిపుణులుగా స్థిరపడి ధన సంపాదన చేస్తారు. జ్యోతిషం, న్యాయశాస్త్రం, వైద్యం, రాజకీయాలలో ఆసక్తి కలిగి ఉంటారు. దేశ, విదేశ ప్రయాణాలు చేస్తారు. వీరు 26 సం॥ తర్వాత జీవితంలో స్థిరపడతారు. 35 సం॥ల తర్వాత, బాగా రాణిస్తారు. 49 సం॥ల నుండి గొప్ప ఉన్నతిని సాధిస్తారు.

## పేరు పెట్టే విధానం

వీరి పేరును బుధుడు, శుక్రుడు, సూర్యుడు సంఖ్యలకు అనుగుణంగా పెట్టుకోవాలి.

**బుధుడి సంఖ్యలు :** 5, 14, 23,32, 41, 50, 59, 77 మొదలైనవి.

**శుక్రుడి సంఖ్యలు :** 6, 15, 24, 33, 42, 51, 60 మొదలైనవి.

**సూర్యుడి సంఖ్యలు :** 19, 37, 46, 73 మొదలైనవి.

వీరు సంఖ్యాశాస్త్ర నిపుణుడిని సంప్రదించి పేరు పెట్టుకోవడం మంచిది.

## రాణించే రంగాలు

కాంట్రాక్టు పని, ఏజెన్సీలు, ఎడ్వర్టైజింగ్, పబ్లిసిటీ, ప్రచురణ, స్టీలు పరిశ్రమ రంగం లాంటివి వీరికి ఉపయుక్తంగా ఉంటుంది. ట్రాన్స్‌పోర్ట్ వ్యాపారం, ముద్రణా వ్యాపారం కూడా వీరికి అనుకూలం.

## వ్యాధులు

ఉదర సంబంధిత వ్యాధులు, నడుమునొప్పి, మానసిక అశాంతత, రక్తపోటు, అస్థమా, కంటి వ్యాధులు వీరిని బాధిస్తాయి. సరైన చికిత్స తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది. సంఖ్యాశాస్త్ర నిపుణుడి సూచన ప్రకారం పేరు మార్చుకుంటే మంచి ఫలితాలు పొందుతారు.

**సూచనలు**

| | | |
|---|---|---|
| లక్కీ నంబర్లు | - | 1, 5, 6 |
| అన్‌లక్కీ నంబర్లు | - | 9 |
| లక్కీ తేదీలు | - | 1, 5, 6, 10, 14, 15, 19, 23, 24, 28 |
| అన్‌లక్కీ డేట్స్ | - | 9, 18, 27 |
| లక్కీ కలర్స్ | - | నీలం, పసుపు, గోధుమరంగు, గులాబీ, ఆరెంజ్ |
| అన్‌లక్కీ కలర్స్ | - | నలుపు, ఎరుపు |
| అదృష్ట దినాలు | - | ఆదివారం, బుధవారం, శుక్రవారం |
| లక్కీ వివాహ తేదీలు | - | 1, 6, 10, 15, 19, 24, 28 |
| రెమిడీస్ | - | శివున్ని ఆరాధించడం,<br>కాకులకు స్వీట్స్ పెట్టడం,<br>నల్ల కుక్కలకు ఆహారం పెట్టడం. |
| ఉదా | - | మహమ్మద్ దావూద్ 08-07-1957 (ఈ గ్రంథ రచయిత) |

## జన్మ సంఖ్య - 8, డెస్టినీ నంబరు - 2

**8/2 వ్యక్తులు పొడుగ్గా ఉంటారు. వీరు మొండివారు. అందరితో కలుపుగోలుగా ఉంటారు. వీరికి జ్ఞాపకశక్తి తక్కువ. దేవుణ్ణి మనసులోనే పూజిస్తారు. వీరు డాక్టర్లుగా, ఇంజినీర్లుగా రాణిస్తారు.**

ఎవరు 8, 17, 26 తేదీల్లో పుట్టి, డెస్టినీ నంబరు 2 అవుతుందో వారు ఈ వర్గం క్రిందికి వస్తారు. వీరిపై శని, చంద్రుడు ప్రభావం ఉంటుంది.

ఈ సంఖ్య కలవారు, ఎక్కువ మంది పొడగరులు, కొద్ది మంది మాత్రం పొట్టిగా వుంటారు. ఆకర్షణీయమైన ముఖ వర్ఛస్సు కలిగి ఉంటారు. కొంచెం మొండివారు, శారీరకంగా దృఢంగా వున్నా మానసికంగా మాత్రం చంచలంగా ఉంటారు. ఒక్కొక్కసారి ఆత్మవిశ్వాసం కోల్పోతుంటారు. అందరితో కలుపుగోలుగా ఉండి, ధనం ఎక్కువగా ఖర్చు చేస్తుంటారు. డబ్బు ఖర్చైపోగానే అప్‌సెట్ అవుతుంటారు. ఇతరులను అంతగా

నమ్మరు. వీరికి అనుకూలమైన పేరు పెడితే వృత్తి, ఉద్యోగాలలో రాణిస్తారు.

మామూలుగా విద్యాభ్యాసం చేసి డిగ్రీ సంపాదిస్తారు. జ్ఞాపకశక్తి తక్కువ. వీరికి వాదనా పటిమ ఉండటం వలన లాయర్లుగా రాణిస్తారు. దేవుణ్ణి నమ్ముతారు. గుడిలో కంటే మనసులోనే దైవాన్ని పూజించటానికి ఇష్టపడతారు. పెద్దల మాటలు విని గుడికి వెళ్తారు. వీరి సంఖ్యకు అనుకూలమైన పేరు పెడితే, వీరు జీవితంలో ఆరోగ్యం, ధనం, మంచి జీవిత భాగస్వామి, మంచి పిల్లలను పొందగలుగుతారు. వీరిలో చాలామంది సైన్స్ సబ్జెక్ట్స్ తీసుకొని తరువాత కామర్స్‌లో ఉద్యోగం చేస్తారు. వీరు బీకాం, సీఏ, ఐసీడబ్ల్యూఏ, ఎల్‌ఎల్‌బీ వంటి కోర్సులపై ఆసక్తి చూపుతారు.

ఆత్మవిశ్వాసం కోల్పోవటం, చిత్త చాంచల్యం మొదలైనవి మంచిపేరు పెట్టుకోవటం వలన అధిగమించగలరు. ఇతరులతో మాట్లాడుతున్నపుడు పరధ్యానంగా ఉంటారు. కళలు, సంస్కృతి పట్ల ఆసక్తి కలిగి ఉంటారు. వీరు సాధారణంగా వాత్సల్యపూరితంగా ఉంటారు కాని ఒక్కొక్కసారి కఠినంగా మారి సమస్యలు తెచ్చుకుంటారు. వీరు డాక్టర్లుగా, ఇంజనీర్లుగా, అధ్యాపకులుగా, పారిశ్రామికవేత్తలుగా రాణిస్తారు. సరియైన పేరు పెట్టకపోతే వీరి గృహస్త జీవితం సవ్యంగా ఉండదు. అనారోగ్యం, నిద్రలేమి, పిల్లల వలన సమస్యలు వస్తాయి.

## పేరుపెట్టే విధానం

వీరు శని, చంద్రుల ప్రభావంలో ఉంటారు. బుధ, శుక్ర సంఖ్యలకి అనుకూలమైన పేరు పెట్టుకుంటే మంచిది. **బుధుడి సంఖ్యలు:–** 14,23,32,41,50,59,77 మొదలైనవి. **శుక్రుడి సంఖ్యలు:–** 15,24,33,42,51,60 మొదలైనవి. సంఖ్యా శాస్త్ర నిపుణుడుని సంప్రదించి సరియైన పేరు మార్పు చేసుకోవాలి

## రాణించే రంగాలు

స్టీల్ (ఉక్కు)కి సంబంధించి అన్ని వృత్తులు సరిపోతాయి. కాంట్రాక్టు పని, ఏజెన్సీ, విలాస వస్తువులు, రవాణా, యంత్ర సామాగ్రి, కళాత్మకరంగ పనులు వీరికి అనుకూలం.

## వ్యాధులు

వీపు నొప్పి, కడుపు నొప్పి, తల నొప్పి, మానసిక వ్యాధులు, అస్థమా, రక్తపోటు, మధుమేహం, మొదలైనవి సరియైన చికిత్స తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది.

**సూచనలు**

| | | |
|---|---|---|
| లక్కీ నంబర్లు | - | 5, 6 |
| అన్‌లక్కీ నంబర్లు | - | 9 |
| లక్కీ తేదీలు | - | 5, 6, 7, 14, 15, 16, 23, 24, 25 |
| అన్‌లక్కీ డేట్స్ | - | 9, 18, 27 |
| లక్కీ కలర్స్ | - | నీలం, ఆకుపచ్చ, పసుపు, గోధుమరంగు, తెలుపు |
| అన్‌లక్కీ కలర్స్ | - | నలుపు, ఎరుపు |
| అదృష్ట దినాలు | - | సోమవారం, బుధవారం, శుక్రవారం, శనివారం |
| లక్కీ వివాహ తేదీలు | - | 1, 6, 10, 15, 19, 24, 28 |
| రెమిడీస్ | - | శివ ఆరాధన, అమ్మవారి ఆరాధన, కాకులకు స్వీట్స్ పెట్టడం, నల్లకుక్కలకు ఆహారం పెట్టడం. |
| ఉదా | - | ధర్మేంద్ర 08-12-1935 |
| | | సిద్ధార్థ 17-04-1979 |

## జన్మ సంఖ్య - 8, డెస్టినీ నంబరు - 3

**8/3 వ్యక్తుల ముఖంలో కళ ఉంటుంది. మొదట్లో ఒడిదుడుకులున్నా తరువాత అభివృద్ధి సాధిస్తారు. నిజాయితీ, న్యాయం పట్ల నమ్మకం కలిగి ఉంటారు. ధనం ఉన్నా మానసిక ప్రశాంతత తక్కువ.**

ఎవరు 8, 17, 26 తేదీలలో పుట్టి, వారి విధి సంఖ్య 3 అవుతుందో వారు ఈ వర్గం క్రింద వస్తారు. వీరు శని, గురు గ్రహ ప్రభావంలో ఉంటారు.

వీరు మధ్యస్థమైన పొడవు కలిగి ఉంటారు. కొందరు పొట్టిగా కూడా ఉండవచ్చు. ముందరి రెండు పళ్ళు పెద్దవిగా ఉండవచ్చు. వీరి ముఖం వీరి కళాత్మకతను తెలియచేస్తుంది. జీవిత ప్రథమంలో ఒడిదుడుకులు ఎదుర్కోవటం వలన వీరు ఎంతో పరిణితి కలిగి ఉంటారు. నిజాయితీ, న్యాయం పై విశ్వాసం కలిగి ఉంటారు. కష్టాలకు ఎదురొడ్డి ఉన్నత స్థానం సాధిస్తారు. కుటుంబ జీవితం గురించి కలత చెందుతుంటారు.

తమ వర్గానికి, దేశానికి మంచి చేయాలనుకుంటారు. ఆలోచనలను స్పష్టంగా వ్యక్తీకరిస్తారు. అందువల్ల శత్రువులు ఉండవచ్చు. దైవకృప ఉంటుంది.

ధన సంపాదన చేస్తారు గాని మానసిక ప్రశాంతత ఉంటుందన్న గ్యారంటీ లేదు. చేసే పనిని, విజయం, అపజయం గురించి ఆలోచించకుండా, కష్టపడి, నిబద్ధతతో చేస్తారు. చాలా కష్టమైన పనులు చేయటానికి ప్రయత్నించటం వలన వీరి శత్రువులు కూడా వీరిని గౌరవిస్తారు. భరించరాని కష్టం వచ్చినపుడు, ఆర్ధ్రతతో భగవంతుని ప్రార్థిస్తారు. వారి కష్ట నష్టాల గురించి అందరికి చెపుతుంటారు. కష్టాలు అనుభవించటానికే ఈ భూమి మీద పుట్టాం అనుకుంటారు. వీరిలో పురుషులు స్త్రీల వలన, స్త్రీలు పురుషుల వలన కష్టాలు పడతారు. వీరు ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్, సివిల్ ఇంజినీరింగ్ కోర్సుల్లో ఆసక్తి చూపుతారు. ఎల్ఎల్‌బీ చదివితే న్యాయవాదులుగా మంచిపేరు, ప్రఖ్యాతులు పొందుతారు. వీరు జీవితంలో కొంత ఆలస్యంగా స్థిరపడతారు.

కళలు, సంస్కృతి, నాగరికత, మతం, న్యాయం, వైద్యం, జ్యోతిషం, ఇంజనీరింగ్, న్యాయశాస్త్రాలలోను సునిశిత పరిశీలన చేస్తారు. సరియైన పేరుపెట్టుకోవటం వలన మొదట కష్టాలు పడ్డా, తర్వాత విజయం సాధిస్తారు. దాని వలన, ఆరోగ్యం, సంపద, మంచి భాగస్వామి, పిల్లలను పొందగలుగుతారు. సరైన పేరు లేకపోతే జీవితం నరకప్రాయంగా మారుతుంది. అందమైన చిత్రాలు, పచ్చని పైర్లు, కొండలు, పురాతన ఆలయాలు, అక్కడి శిల్ప సంపద లాంటివి చూసినపుడు వీరు మానసిక ప్రశాంతత పొందుతారు. చేసిన అప్పు ఖచ్చితంగా తీర్చేస్తారు.

పరిపాలనాదక్షత, దైవభక్తి కలిగి ఉంటారు. శీఘ్ర కోపం ప్రగతికి అవరోధంగా ఉంటుంది. సాంకేతిక విద్య ద్వారా అభివృద్ధి సాధించగలుగుతారు. సృజనాత్మక రచనలు, ఉపన్యాసాల ద్వారా కొంతమంది విజయం సాధిస్తారు. వీరు చాలా పొదుపరులు, సరియైన పేరు లేకపోతే, అనవసరమైన ఖర్చు చేస్తారు. కోర్టు కేసులు ఎదుర్కొనే పరిస్థితి కలగవచ్చు. మంచి పేరు మార్పుతో విజయం సాధించగలుగుతారు.

## పేరు పెట్టే విధానం

వీరు బుధ, గురు, సూర్యులకు అనుకూలమైన సంఖ్యతో పేరు పెట్టుకుంటే మంచిది. ముఖ్యంగా బుధుడి సంఖ్యలు, గురుడి సంఖ్యలు వీరికి చాలా అనుకూలమైనది.

అవి : 14, 21, 23, 30, 32, 39, 41, 50, 59, 77 మొదలైనవి. సంఖ్య శాస్త్ర నిపుణుడిని సంప్రదించి పేరు మార్పు చేయించుకోవాలి.

## రాణించే రంగాలు

స్టీలు (ఉక్కు) రంగానికి చెందిన అన్నీ వృత్తులు వీరికి అనుకూలం. రవాణా, కాంట్రాక్టు పని, కమీషన్ ఏజెన్సీ, చేతి వృత్తులు, సరుకు రవాణా, ప్రింటింగ్ ప్రెస్, ప్రచురణ, న్యాయశాస్త్రం మొదలైనవి అనుకూలం.

## వ్యాధులు

ఆస్మా, ఉదర సమస్యలు, హెర్నియా, కీళ్ళ నొప్పులు, వెన్ను నొప్పి, చర్మ వ్యాధులు, నరాల వ్యాధులు వీరిని బాధించవచ్చు. సరియైన చికిత్స తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది.

## సూచనలు

| | | | |
|---|---|---|---|
| లక్కీ నంబర్లు | - | 1, 3, 5 | |
| అన్‌లక్కీ నంబర్లు | - | 4 | |
| లక్కీ తేదీలు | - | 1, 3, 5, 10, 12, 14, 19, 21, 23, 28, 30 | |
| అన్‌లక్కీ డేట్స్ | - | 4, 13, 22, 31 | |
| లక్కీ కలర్స్ | - | నీలం, పసుపు, ఊదా, సిల్వర్, గోధుమరంగు, ఆరెంజ్ | |
| అన్‌లక్కీ కలర్స్ | - | నలుపు, ఎరుపు | |
| అదృష్ట దినాలు | - | ఆదివారం, బుధవారం, గురువారం, శనివారం | |
| లక్కీ వివాహ తేదీలు | - | 1, 3, 9, 10, 12, 18, 19, 21, 27, 28 | |
| రెమిడీస్ | - | దక్షిణామూర్తిని ఆరాధించటం,<br>గురువులను పండితులను సత్కరించటం,<br>వృద్ధాశ్రమంలో అన్నదానం చేయడం. | |
| ఉదా | - | జాన్ అబ్రహం | 17-12-1972 |
| | | జ్యోతిబసు | 08-07-1914 |
| | | సైనా నెహ్వాల్ | 17-03-1990 |

## జన్మసంఖ్య - 8, డెస్టినీ నంబరు - 4

**8/4 వ్యక్తులు హుందాగా ఉంటారు. వీరికి పిప్పి పళ్ళు ఉండే అవకాశం ఉంది. స్వేచ్ఛాప్రియులు. మంచి భావవ్యక్తీకరణ కలిగి ఉంటారు. అందరూ వీరిని మొండివారుగా అనుకుంటారు. పిల్లలు, జంతువుల పట్ల ప్రేమ కలిగి ఉంటారు.**

ఎవరు 8, 17, 26 తేదీలలో పుట్టి, వారి విధి సంఖ్య 4, అవుతుందో వారు ఈ వర్గం క్రిందకి వస్తారు. జనన తేదీ, నెల, సంవత్సరం మొత్తం కలిపితే వచ్చే సంఖ్య, డెస్టీనీ సంఖ్య. వీళ్ళు శని, రాహువు ప్రభావంలో ఉంటారు.

వీరు పొడుగ్గా, హుందాగా ఉంటారు. కొంత మంది పొట్టిగా కూడా ఉండవచ్చు. పిప్పి పళ్ళు ఉండే అవకాశం ఉంది. ముందరి రెండుపళ్ళు పెద్దగా వుంటాయి. వీరికి తొందరగా జుత్తు రాలిపోతుంది. వీరు ఇతరుల ఆధీనంలో ఉండడానికి ఇష్టపడరు. స్వతంత్రేచ్ఛ ఉన్న వారుగా ఉంటారు. అనుభవ శాలురుగా ఉంటారు. స్నేహితులచే గౌరవింపబడతారు. మంచి భావ వ్యక్తీకరణ కలిగి ఉంటారు. వాదనా పటిమ కలిగి ఉంటారు. అందరూ వీరిని మొండి వారుగా తలుస్తారు. వీరికి పిల్లలు, జంతువుల పట్ల వాత్సల్యం ఉంటుంది.

యవ్వనంలో ప్రేమలో పడి తరవాత బాధపడతారు. వీరి సంఖ్యకి సరిపోయే పేరు పెట్టినట్లయితే, ఆరోగ్యం, సంపద, మంచి జీవిత భాగస్వామి, పిల్లలు, ఇల్లు, వాహనం సంప్రాప్తం అవుతాయి. వీరికి జ్ఞాపక శక్తి తక్కువ. శీఘ్ర కోపం ఉంటుంది. ఉద్యోగస్తులయితే, తమ సంపాదన తక్కువగా భావిస్తారు. అందువలన ఇతర వ్యాపారాల వైపు దృష్టి సారిస్తారు. ప్రారంభంలో ఒడిదుడుకులు ఎదురైనా, అంచెలంచెలుగా ఉన్నత స్థానాన్ని చేరుకుంటారు. వ్యాపారస్తులు తమ సంస్థలకు సరియైన పేరు పెట్టుకుంటే గొప్ప సంపదని ఆర్జిస్తారు.

వీరు పరోపకారులు. ఆకలి బాధలో ఉన్న వారిని ఆదరిస్తారు. తల్లిదండ్రుల పట్ల విధేయత కలిగి వారికి సేవ చేస్తారు. వీరు దైవాన్ని నమ్ముతారు. దైవం, మతం మధ్య గల సంబంధాన్ని విశ్లేషించగలుగుతారు. వీరికి సరియైన జీవిత భాగస్వామి లభించినట్లయితే ఆర్థికంగా చాలా పుంజుకుంటారు. వాదులాట, మొండితనం, ఈ

రెండు గుణాల్ని అదుపులో ఉంచుకుంటే, అందరూ వీరిని గౌరవిస్తారు. వీరు కామర్స్, సి.ఎ., రంగాలలో మరల సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్, ఎలక్ట్రానిక్స్ చదివిన తరువాత ఎం.బి.ఎ లాంటి కోర్సులు చేస్తారు. డాక్టర్లు, ఇంజనీర్లు, కళాకారులు, ప్రభుత్వ అధికారులు, కంపెనీ మేనేజర్లు ఈ వర్గం క్రిందికి వస్తారు.

తమ విధుల పట్ల అంకిత భావం కలిగి, గౌరవ ప్రదమైన జీవితం గడుపుతారు. మతగ్రంథాలు, మతం, న్యాయశాస్త్రం, వైద్యం, జ్యోతిష్యం, ఇంజనీరింగ్ మొదలైనవాటిపై ఆసక్తి కలిగి ఉంటారు. ఏ ఒక్క రంగం పైన స్థిరమైన శ్రద్ధ కనపరచరు. ప్రకృతిని, కొండలు, జలపాతాలు, జంతుప్రదర్శన శాలలు, సముద్ర తీరాలు, లాంటివి చూసినపుడు మానసిక ప్రశాంతతను పొందుతారు. వీరికి సరియైన పేరు పెట్టకపోతే జీవితం అంతా శూన్యంగా కనబడుతుంది. సరియైన పేరు మార్పు చేస్తే, సంతోషకరమైన జీవితం గడుపుతారు.

## పేరు పెట్టే విధానం

బుధుడికి సంబంధించిన సంఖ్యతో పేరు పెట్టుకుంటే మంచిది.

**బుధుడి సంఖ్యలు :** 14, 23, 32, 41, 50, 59, 77 మొదలైనవి లేదా **శుక్రుడికి సంబంధించి సంఖ్యలు** 15, 24, 33, 42, 51, 60, 69లతో గాని, **సూర్యుడి సంఖ్యలు** 19, 37, 46, 73లతో గాని పేరు పెట్టినట్లయితే మంచిది. సంఖ్యాశాస్త్రవేత్తని సంప్రదించి తగు పేరుమార్పు చేసుకోగలరు.

## రాణించే రంగాలు

స్టీలు (ఉక్కు) రంగానికి సంబంధించిన అన్నీ వృత్తులు అనుకూలం. రచన, బోధన, జర్నలిజం, రవాణా, కాంట్రాక్టులు, ఏజన్సీ రంగాలు బాగుంటాయి.

## వ్యాధులు

చిత్త చాంచల్యం, గుండె నొప్పి, వేడి వలన వ్యాధులు, కీళ్ళ నొప్పులు, ఉదర వ్యాధులు, వెన్ను నొప్పి, రక్తపోటు. సరియైన చికిత్స తీసుకొని ఉపశమనం పొందవచ్చు.

## సూచనలు

| | | |
|---|---|---|
| లక్కీ నంబర్లు | - | 1, 5, 6 |
| అన్‌లక్కీ నంబర్లు | - | 4 |

| | | |
|---|---|---|
| లక్కీ తేదీలు | - | 1, 5, 6, 10, 14, 15, 19, 23, 24, 28 |
| అన్‌లక్కీ డేట్స్ | - | 4, 13, 22, 31 |
| లక్కీ కలర్స్ | - | నీలం, పసుపు, గోధుమరంగు, ఉదారంగు |
| అన్‌లక్కీ కలర్స్ | - | నలుపు, ఎరుపు |
| అదృష్ట దినాలు | - | ఆదివారం, బుధవారం, శుక్రవారం |
| లక్కీ వివాహ తేదీలు | - | 1, 6, 10, 15, 19, 24, 28 |
| రెమిడీస్ | - | శివ ఆరాధన, సుబ్రహ్మణ్య స్వామి ఆరాధన, వృద్ధాశ్రమాలలో అన్నదానం, కాకులకు, కుక్కలకు ఆహారం పెట్టడం మంచిది. |

| | | | |
|---|---|---|---|
| ఉదా | - | హారిస్ జైరాజ్ | 08-01-1975 |
| | | షర్మిలా ఠాగూర్ | 08-12-1946 |
| | | సి.కె.ప్రహ్లాద్ | 08-08-1941 |

## జన్మ సంఖ్య - 8, డెస్టినీ నంబరు - 5

**8/5 వ్యక్తులు మధ్యస్తమైన పొడవు కలిగి ఉంటారు. వీరి కళ్ళు ఉబ్బెత్తుగా ఉంటాయి. గుండెనిబ్బరం కలవారు. ధన సంపాదనకు కొత్త కొత్త ప్రణాళికలు వేస్తారు.**

ఎవరు 8, 17, 26 తేదీలో పుట్టి, వారి విధి సంఖ్య 5 అవుతుందో వారు ఈ వర్గం క్రిందకి వస్తారు. జనన తేదీ, నెల, సంవత్సరం మొత్తం కలపగా వచ్చిన సంఖ్య డెస్టినీ సంఖ్య. వీరు, శని, బుధుడు ప్రభావంలో ఉంటారు. వీరు మధ్యస్థమైన పొడవు కలిగి ఉంటారు. కళ్ళు కొంచెం ఉబ్బెత్తుగా ఉంటాయి. వీరు జీవితంలో కష్టపడి పైకి వస్తారు. అందువల్ల ఎప్పుడూ అప్రమత్తంగా ఉంటారు. వీరు గొప్ప గుండె నిబ్బరం కలవారైనా అప్పుడప్పుడు ఆందోళన చెందుతుంటారు. జీవిత ప్రథమంలో కొందరు సుఖజీవితం, కొందరు కష్టాల జీవితం కలిగి ఉంటారు. సరియైన పేరు లేకపోతే జీవితాంతం కష్టపడుతునే ఉంటారు. ఆర్థికంగా ఒడిదుడుకులు ఉంటాయి. అదే, సరియైన పేరు

ఉన్నట్లయితే, ఉద్యోగ, వ్యాపారాల్లో ఉన్నత స్థితిని పొందుతారు. గృహం, భూమి, వాహనం సంపాదిస్తారు. వీరు కామర్స్ కాని ఇంజినీరింగ్ కాని చదువుతారు. ఎంబీఏ, ఎల్.ఎల్.బి లాంటి కోర్సులపై అభిలాష ఎక్కువగా ఉంటుంది.

ఎలక్ట్రానిక్ వస్తువులు, కర్మాగారాలు, మంచి వాహనాలు, శిఖర ప్రాంతాలు, సముద్ర తీరాలు చూసినపుడు ఎంతో ఆనందాన్ని పొందుతారు. ఉన్నత స్థాన ప్రాప్తి కొరకు నిరంతరం శ్రమిస్తుంటారు. తమ క్రింది ఉద్యోగులు కూడా అదే విధంగా ఉండాలని కోరుకుంటారు. ధన సంపాదనకు కొత్త కొత్త ప్రణాళికలు వేస్తుంటారు. ప్రముఖ వ్యాపారవేత్తలు, ఇంజినీర్లు, డాక్టర్లు, లాయర్లు ప్రభుత్వ అధికారులు, ఈ వర్గంలోకి వస్తారు. సరియైన పేరు ఉన్నట్లయితే, అంచెలంచెలుగా ఎదుగుతారు. ఆరోగ్యం, సంపద, వీరికి మంచి జీవిత భాగస్వామి, సంతానం లభిస్తాయి. సరియైన పేరు లేకపోతే, శత్రువులు, కుటుంబ సమస్యలు చుట్టుముడతాయి.

స్త్రీలయితే పురుషుల వలన, పురుషులయితే స్త్రీల వలన సమస్యలు వస్తాయి. ఏదైన కొత్తది కనిపిస్తే దానిని పరిశీలించి, మెచ్చుకుంటారు. ఇంజనీరింగ్ వస్తువులపై ఎక్కువ ఆసక్తి చూపుతారు. పరోపకారులుగా ఉంటారు. మంచి ఆలోచనా పరులు, జ్యోతిషం, మతం, న్యాయశాస్త్రం, సంగీతశాస్త్రం, కళల యందు ఆసక్తి కలిగి ఉంటారు. సరియైన పేరు ఉన్నట్లయితే అన్నీ రంగాల్లో విజయం సాధిస్తారు. విదేశీయానం చేస్తారు., దాని వలన ఏయే ఉత్పత్తులకి ఎక్కడ డిమాండ్ ఉందో, ఎక్కడ ఎక్కువ దొరుకుతుందో తెలుసుకొని, దాని వలన లాభం సంపాదిస్తారు. వీరిపై దైవకృప ఉంటుంది. దుర్వ్యసనాలని చవిచూసినా వాటికి బానిస కారు. పేరు సరిగా లేక పోతే దుర్వ్యసనాలకి బానిస అవుతారు.

## పేరు పెట్టే విధానం

వీరు, శని, బుధుల ప్రభావం వలన జన్మించిన వారు కావటం వలన, వీరి పేరు శుక్రుడు, బుధుడు, సంఖ్యలకి సంబంధించి పెట్టుకోవాలి. బుధుడి సంఖ్యలు 5,14,23,32,41,50,59,77 మొదలైనవి. శుక్ర సంఖ్యలు : 15,24,33,42,51,60,69 మొదలైనవి. సంఖ్యాశాస్త్ర వేత్తని సంప్రదించి సరియైన పేరు మార్పు తీసుకోగలరు.

## రాణించే రంగాలు

లోహాలకి సంబంధించిన వృత్తులలో రాణిస్తారు. విద్యుత్తు, రవాణా, కమీషన్

ఏజెన్సీ, కాంట్రాక్టుపని, వైద్యం, ఇంజనీరింగ్, సరుకు రవాణా రంగాలలో కూడా రాణిస్తారు.

### వ్యాధులు

చిత్త చాంచల్యం, కీళ్ళ నొప్పులు, వెన్ను నొప్పి, కంటి సమస్యలు, రక్తపోటు, మధుమేహం, మూలశంక, నరాల వ్యాధులు, సరియైన చికిత్సతో ఉపశమనం పొందవచ్చు.

### సూచనలు

| | | |
|---|---|---|
| లక్కీ నంబర్లు | - | 1, 5, 6 |
| అన్‌లక్కీ నంబర్లు | - | 9 |
| లక్కీ తేదీలు | - | 1, 5, 6, 10, 14, 15, 19, 23, 24, 28 |
| అన్‌లక్కీ డేట్స్ | - | 9, 18, 27 |
| లక్కీ కలర్స్ | - | నీలం, పసుపు, బూడిదరంగు |
| అన్‌లక్కీ కలర్స్ | - | నలుపు, ఎరుపు |
| అదృష్ట దినాలు | - | ఆదివారం, బుధవారం, శుక్రవారం, శనివారం |
| లక్కీ వివాహ తేదీలు | - | 1, 6, 3, 10, 12, 15, 19, 21, 24, 28 |
| రెమిడీస్ | - | శివ ఆరాధన, వృద్ధాశ్రమంలో ఆహారం ఇవ్వటం, బీద విద్యార్థులకు సహాయం చేయడం. |
| ఉదా | - | ఫర్దీన్ ఖాన్ 08-03-1974 |
| | | ఉదయ్‌కిరణ్ 26-06-1980 |
| | | నరేంద్రమోడీ 17-09-1950 |
| | | దేవానంద్ 26-09-1923 |

## జన్మ సంఖ్య - 8, డెస్టినీ నంబరు - 6

**8/6 వ్యక్తులు ఆకర్షణీయంగా ఉంటారు. ఎర్రని ఉబ్బిన కళ్ళు ఉంటాయి. దేవునిపై నమ్మకం ఉంటుంది. వీరు పుట్టుకతోనే ధనవంతులుగా ఉంటారు.**

ఎవరు 8, 17, 26 తేదీలలో పుట్టి వారి విధి సంఖ్య 6 అవుతుందో వారు ఈ వర్గం క్రింద వస్తారు. జనన తేదీ, నెల, సంవత్సరం, అంకెలు మొత్తం కలపగా వచ్చే

సంఖ్య డెస్టినీ సంఖ్య. వీరు శని, శుక్ర గ్రహాల ప్రభావంలో ఉంటారు.

వీరు మధ్యస్తమైన పొడవు కలిగి ఉండి ఆకర్షణీయంగా ఉంటారు. కొందరికి ఎర్రని ఉబ్బిన కళ్ళు ఉండవచ్చు. వీరికి భౌతిక సుఖాలపై ఆసక్తి ఎక్కువ. దాని వలన విలాస వస్తువులు సేకరిస్తారు. దేవుడిపై నమ్మకం కలిగి ఉంటారు. కష్టపడి పనిచేస్తే విజయం సాధించవచ్చు అని నమ్ముతారు. వీరి సంఖ్యకి అనుకూలమైన పేరు పెట్టినట్లయితే, అంచెలంచెలుగా ఉన్నత స్థాయికి చేరుకుంటారు. కొందరు పుట్టుకతోనే సంపన్నులుగా ఉంటారు. వీరి సంఖ్యకి అనుకూలమైన పేరు లేకపోతే కష్టాలకు, లేమి, మానసిక అశాంతతకు గురవుతారు. వీరు సైన్స్, కామర్స్ గ్రూపులపై ఆసక్తి ఉంటుంది. ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్స్ రంగాలలో రాణిస్తారు. మేనేజ్‌మెంట్ రంగంలో వీరు మేనేజర్స్‌గా రాణిస్తారు. కొందరు న్యాయశాస్త్రాన్ని కూడా అభ్యసిస్తారు.

వీరికి కార్లు, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ వస్తువులు, విలాసవస్తువులు, కవిత్వం, కాల్పనిక, సాహిత్యం పట్ల మక్కువ ఎక్కువ. పరోపకారులుగా ఉంటారు. చాలా మంది వ్యాపారం, పరిశ్రమల రంగంలో ఉంటారు. మరి కొందరు ఉద్యోగస్తులుగా ఉంటారు. వీరికి సరియైన పేరు పెడితే, ఉద్యోగ, వ్యాపారాలలో ఉన్నత స్థితిని పొందుతారు. ప్రకృతి దృశ్యాలు, కర్మాగారాలు, సముద్రతీరాలు, జలపాతాలు లాంటివి చూసి మానసిక ప్రశాంతతను పొందుతారు. సరియైన పేరు ఉన్నట్లయితే ఆరోగ్యం, సంపద, మంచి జీవిత భాగస్వామి, సంతానం లభిస్తాయి. లేకపోతే కష్టనష్టాలకు గురవుతారు.

ఇతరులకు సాయం ధైర్యంగా చేస్తారు కాని తమ సొంత పని విషయంలో కొంచెం తికమకపడతారు. మంచి జ్ఞానం కలిగి ఇతరులకి సరియైన సలహాలు ఇస్తుంటారు. విదేశీయానంపై ఆసక్తి చూపుతారు. వీరికి జ్యోతిష్యం, న్యాయశాస్త్రం, మతం, వైద్యం, గణితశాస్త్రం, ఇంజనీరింగ్ లందు మంచి విషయ పరిజ్ఞానం ఉంటుంది. సరియైన పేరు ఉన్నట్లయితే వీరు ఈ రంగాలలో బాగా రాణిస్తారు. వీరికి వాహనాలు నడపడం అంటే చాలా ఇష్టం. కాని అవి ప్రమాదకరం అని తెలిస్తే వెంటనే వాటిని వదులుకోగలుగుతారు. భౌతిక విషయాలపై చాలా పరిజ్ఞానం ఉంటుంది. ఒంటరిగా ఉన్నప్పుడు భవిష్యత్ ప్రణాళికలు గురించి ఆలోచిస్తుంటారు. ఇంజనీర్లు, డాక్టర్లు, లాయర్లు, పారిశ్రామికవేత్తలు, ప్రభుత్వ అధికారులు ఈ వర్గంలోకి వస్తారు.

వీరికి సరియైన పేరు లేకపోతే అవకాశాలు జారవిడుచుకుంటారు. అభివృద్ధి లేదని బాధపడుతుంటారు. కుటుంబ జీవితం సవ్యంగా నడవదు. సరియైన పేరు మార్పుతో వీటిని అధిగమించవచ్చు.

## పేరు పెట్టే విధానం

బుధుడు, శుక్రుడు, సూర్యుడు సంఖ్యలతో వీరి పేరు పెట్టవచ్చు

బుధుడి సంఖ్యలు : 5, 14, 23, 32, 41, 50, 59, 77 మొ॥నవి

శుక్రుడి సంఖ్యలు : 6, 15, 24, 33, 42, 51, 60, 69 మొ॥నవి

సూర్యుడి సంఖ్యలు: 19, 37, 46, 55, 73 మొ॥నవి

మంచి సంఖ్యాశాస్త్రవేత్తని సంప్రదించి సరియైన పేరు మార్పు చేసుకోగలరు.

## రాణించే రంగాలు

స్టీలు, అగ్నికి సంబంధించిన వృత్తులు అనుకూలం. విలాసవస్తువులు, కమీషన్ వ్యాపారం, కాంట్రాక్టులు, కంప్యూటర్, రవాణా, సినిమా, టీవీ, ఏజెన్సీ పనులు కూడా అనుకూలం.

## వ్యాధులు

ఉదర సంబంధ వ్యాధులు, కీళ్ళ నొప్పులు, రక్త పోటు, అధిక ఉష్ణం వలన వ్యాధులు, చర్మ వ్యాధులు, సరియైన చికిత్స చేసి తగ్గించవచ్చు.

## సూచనలు

| | | |
|---|---|---|
| లక్కీ నంబర్లు | - | 1, 5, 6 |
| అన్‌లక్కీ నంబర్లు | - | 3 |
| లక్కీ తేదీలు | - | 1, 5, 6, 10, 14, 15, 19, 23, 24, 28 |
| అన్‌లక్కీ డేట్స్ | - | 3, 12, 21, 30 |
| లక్కీ కలర్స్ | - | నీలం, పసుపు, ఆకుపచ్చ, ఊదారంగు, ఆరెంజ్ |
| అన్‌లక్కీ కలర్స్ | - | నలుపు, ఎరుపు |
| అదృష్ట దినాలు | - | బుధవారం, శుక్రవారం, శనివారం |
| లక్కీ వివాహ తేదీలు | - | 1, 6, 9, 10, 15, 18, 19, 24, 27, 28 |
| రెమిడీస్ | - | శివ ఆరాధన, వృద్ధులకు, |

అనాథ శరణాలయాలలో అన్నదానం,
కాకులకు, కుక్కలకు ఆహారం పెట్టడం.

| | | | |
|---|---|---|---|
| ఉదా | - | అల్లు అర్జున్ | 08-04-1983 |
| | | రవితేజ | 26-01-1968 |
| | | శంకర్ | 17-08-1963 |
| | | ఆశా భోంస్లే | 08-09-1933 |

## జన్మ సంఖ్య - 8, డెస్టినీ నంబరు - 7

**8/7 వ్యక్తులు ఆకర్షణీయంగా ఉంటారు. ముందరి రెండు పళ్ళు పెద్దవిగా ఉంటాయి. ఎప్పుడూ ఏదో ఆలోచిస్తున్నట్లుగా ఉంటారు. కోర్టు కేసులు ఎదుర్కోవచ్చు. వీరికి కోపం ఎక్కువ.**

ఎవరు 8,17,26 తేదీలలో పుట్టి వారి విధి సంఖ్య 7 అవుతుందో వారు ఈ వర్గం కింద వస్తారు. వీరు శని, కేతు గ్రహ ప్రభావంలో ఉంటారు.

వీరు మధ్యస్థమైన పొడవు కలిగి ఉండి ఆకర్షణీయంగా ఉంటారు. కొందరు పొట్టిగా కూడా ఉండవచ్చు. ముందరి పళ్ళు కొంచెం పెద్దవిగా ఉండవచ్చు. ఎప్పుడూ ఏదో ఆలోచిస్తున్నట్లుగా కనిపిస్తుంటారు. వీరి మనసు సందిగ్ధంలో ఉండి తర్వాత తేలిక పడుతుంటారు. అకస్మాత్తుగా మానసిక చాంచల్యం రావచ్చు. కష్టాలు మనసులోనే ఉంచుకుంటారు. ఎవరికీ చెప్పరు. ఉదారులుగా ఉంటారు. కోర్టుకేసులు ఎదుర్కోవచ్చు. సరియైన పేరు మార్పు చేసినట్లయితే, జీవితంలో విజయం సాధిస్తారు. వీరిలో కొందరు డాక్టర్స్, ఫార్మసిస్టులు, నర్సులుగా మరికొందరు హాస్పిటల్ యజమానులుగా ఉంటారు. వీరికి పనిచేయటం కన్నా అజమాయిషి చేసే రంగంలో ప్రావీణ్యం ఉంటుంది. వీరు మెడిసిన్ చదివితే సమాజానికి సేవచేస్తారు.

కొండలు, పచ్చని పొలాలు, జంతువులు, జలపాతాలు చూసినపుడు మానసికోల్లాసం పొందుతారు. ఎపుడు అబద్ధం చెప్పరు. ఒక్కొక్కొసారి ఏకాంతంగా జీవితం గురించి ఆలోచిస్తుంటారు. కళలు, సంస్కృతి, మతం పట్ల మంచి దృక్పథం

కలిగి ఉంటారు. వీరి ఆలోచనలు స్పష్టంగా ఉంటాయి. కొందరు రచన, ఉపన్యాసాల ద్వారా పేరు పొందుతారు. శీఘ్ర కోపం, తికమక పడటం వీరి లోపాలు. చక్కగా మాట్లాడుతుంటారు. కాని ఒక్కొక్కసారి మౌనంగా ఉంటారు. వీరు సైన్స్, కామర్స్ సబ్జెక్ట్‌లు చదువుతారు. వీరికి సైకాలజీ మీద ఆసక్తి ఉంటుంది.

వీరికి సరియైన పేరు మార్పు చేస్తే, ఆరోగ్యం, సంపద, మంచి జీవిత భాగస్వామి, సంతానం లభిస్తాయి. సరియైన పేరు లేకపోతే, కుటుంబ జీవితం అస్తవ్యస్తం. ధన సంపాదన కష్టం, అనారోగ్యం మొదలైనవాటితో బాధపడతారు. సరియైన పేరు మార్పు చేస్తే, చెడు ప్రభావాలు తొలగిపోయి జీవితం ఆనందంగా సాగిపోతుంది. వీరు డాక్టర్లుగా, లాయర్లుగా, ఇంజనీర్లుగా, అధ్యాపకులుగా, ప్రభుత్వ అధికారులుగా, పారిశ్రామిక వేత్తలుగా రాణిస్తారు.

## పేరుపెట్టే విధానం

శని, కేతు ప్రభావంతో జన్మించటం వలన వీరు బుధుడు, శుక్రుడి సంఖ్యలకు అనుగుణంగా పేరు పెట్టుకోవాలి. బుధుడి సంఖ్యలు 14,23,32,41,50,59,77 మొIIనవి శుక్రుడి సంఖ్యలు 15,24,33,42,51,60,69 మొIIనవి.

మంచి సంఖ్యా శాస్త్రవేత్తని కలిసి సరియైన పేరు మార్పు చేసుకోగలరు.

## రాణించే రంగాలు

స్టీలు, కాంట్రాక్టులు, ఏజెన్సీలు, ప్రచురణలు, రచన, బోధన, వైద్య, రంగాలు అనుకూలం. రవాణా రంగం కూడా అనుకూలం.

## వ్యాధులు

చిత్త చాంచల్యం, మూలశంక, రక్తపోటు, మధుమేహం, పంటినొప్పి, కడుపునొప్పి రావొచ్చు. సరైన చికిత్సతో ఉపశమనం లభిస్తుంది.

## సూచనలు

| | | |
|---|---|---|
| లక్కీ నంబర్లు | - | 5, 6 |
| అన్‌లక్కీ నంబర్లు | - | 9 |
| లక్కీ తేదీలు | - | 5, 6, 14, 15, 23, 24 |
| అన్‌లక్కీ డేట్స్ | - | 9, 18, 27 |

| | | |
|---|---|---|
| లక్కీ కలర్స్ | - | నీలం, పసుపు, ఆకుపచ్చ, ఉదారంగు, గోధుమరంగు |
| అన్‌లక్కీ కలర్స్ | - | నలుపు, ఎరుపు |
| అదృష్ట దినాలు | - | ఆదివారం, సోమవారం, బుధవారం, శుక్రవారం |
| లక్కీ వివాహ తేదీలు | - | 1, 6, 10, 15, 19, 24, 28 |
| రెమిడీస్ | - | శివ ఆరాధన, పార్వతి అమ్మవారి ఆరాధన, వృద్ధులకు, పండితులకు, పురోహితులకు తగిన సహాయం చేయటం. |
| ఉదా | - | లియాండర్ పేస్ 17-06-1973 |
| | | సౌరవ్ గంగూలీ 08-07-1972 |

## జన్మ సంఖ్య - 8, డెస్టినీ నంబరు - 8

**8/8 వ్యక్తులపై శనిగ్రహ ప్రభావం సంపూర్ణంగా ఉంటుంది. లావుగా, ఉబ్బిన కళ్ళు, ముందరి రెండు పళ్ళు పెద్దవిగా ఉంటాయి. వీరు శ్రమజీవులు, తరచూ ప్రయాణాలు చేస్తారు. పసిపిల్లల్లా సున్నితమైన మనసున్న వారు.**

ఎవరు 8, 17, 26వ తేదీలలో జన్మించి వారి విధి సంఖ్య కూడా 8 అవుతుందో వారు ఈ వర్గంలోకి వస్తారు. వీరిపై శని గ్రహ ప్రభావం సంపూర్ణంగా ఉంటుంది.

వీరిలో చాలా మంది పొడుగ్గా, లావుగా, ఉబ్బిన కళ్ళు, ముందరి రెండు పళ్ళు పెద్దవిగా ఉండి ఉంటారు. కొంతమంది, పొట్టిగా, సన్నగా కూడా ఉండవచ్చు. విజయ సాధన కోసం చాలా కష్టించి పనిచేస్తారు. వీరికి మానసిక శక్తి అధికం. శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటారు. ఒక్కొక్కసారి ఏ పనైనా చేయటానికి సందిగ్ధానికి లోనవుతారు. కష్టాలను దృఢంగా ఎదుర్కొని చివరికి విజయం సాధిస్తారు. బంధువులకు సహాయం చేస్తుంటారు. అందువల్ల గౌరవింపబడతారు. కొంత మంది యవ్వనంలో పేదరికం అనుభవించవచ్చు. సరియైన పేరు మార్పు వలన దీనిని అధిగమించవచ్చు. వాహనం, గృహం, ఇతర సౌఖ్యాలు పొందవచ్చు.

వీరిలో చాలా మంది వీరి భావాలను, రచనా వ్యాసంగాలలో తెలియచేస్తుంటారు. ఏ పని ప్రారంభించినా దానిని సమర్ధవంతంగా ముగిస్తారు. సరియైన పేరు లేకపోతే

అపజయం ఎదుర్కొంటారు. వీరు శ్రమజీవులు, దాని వలన ఉన్నత స్థితిని పొందుతారు. అందరికీ సాయం చేయటం వలన వీరి చుట్టూ ఎపుడూ స్నేహితులు ఉంటారు. సరియైన పేరు లేకపోతే, స్నేహితుల వలనే ఇక్కట్లు వస్తాయి. మంచి భావ వ్యక్తీకరణ కలవారు. వీరు తరచూ ప్రయాణాలు చేస్తుంటారు. కొండలు, ప్రకృతి దృశ్యాలు, రకరకాల జంతువులు, పక్షులు, సముద్రతీరాలు లాంటివి చూసినపుడు మానసిక ప్రశాంతత పొందుతారు.

వీరు కామర్స్ గ్రూపు చదువుతారు. కొందరు సైన్స్, కంప్యూటర్స్, ఎలక్ట్రానిక్స్ రంగాలలో రాణిస్తారు. వీరు ఎం.బి.ఎ, ఎల్.ఎల్.బి కూడా చదువుతారు. న్యాయ వ్యవస్థలో రాణిస్తారు. పెద్ద పదవులు అనుభవిస్తారు.

వీరి ఆకర్షణీయ వ్యక్తిత్వంతో ఇతరులను సులభంగా ఆకట్టుకుంటారు. పసిపిల్లల లాంటి సున్నిత మనస్కులు. ఇతరులకు హాని తలపెట్టరు. కానీ ఎవరైన వీరిని ఎదిరిస్తే, అత్యంత శక్తి సాహసాలతో, ఒంటరిగా ఎదుర్కొని విజయం సాధిస్తారు. వీరికి దైవభక్తి ఎక్కువ, మెరుపు వేగంతో ఆలోచిస్తారు. ఇతరులను మాటలతో తొందరగా ఆకట్టుకొని, వారి పని సాధించగలుగుతారు.

వీరిలో చాలా మంది డాక్టర్లుగా, రచయితలుగా, ఇంజనీర్లుగా, లాయర్లుగా, అధికారులుగా, పారిశ్రామికవేత్తలుగా, వ్యాపారవేత్తలుగా రాణిస్తారు. కాని వీరికి సరియైన పేరు లేకపోతే జీవితాంతం కష్టాలు పడుతూనే ఉంటారు. కుటుంబ పరంగా, ఆర్థికంగా ఇబ్బందులు వస్తాయి. వీరు సాధారణంగా శాంత స్వభావులు, కానీ ఏదైనా సమస్య వచ్చినపుడు చాలా దృఢంగా, గట్టిగా మాట్లాడి చివరికి విజయం సాధిస్తారు. వీరికి సరియైన పేరు లేకపోతే అనవసర ప్రసంగాలు చేస్తుంటారు. ఉన్నత స్థితికి చేరుకోలేరు. సున్నిత మనస్కులు కాబట్టి ఇతరులకు సాయం చేస్తుంటారు. మోసగాళ్ళను గుర్తించలేరు.

## పేరు పెట్టే విధానం

వీరు శని ప్రభావంలో ఉన్నవారు కాబట్టి, వీరికి బుధుడి, శుక్ర సంఖ్యలతో పేరు పెడితే మంచిది. బుధుడి సంఖ్యలు 5, 6, 14, 15, 23, 24, 32, 41, 42, 50, 51, 59, 60, 69, 77 మొదలైనవి

మంచి సంఖ్యా శాస్త్రవేత్తని కలిసి సరియైన పేరు మార్పు చేసుకోగలరు.

### రాణించే రంగాలు

స్టీలు, కాంట్రాక్టులు, కమీషన్ వ్యాపారం, ఏజెన్సీలు, రచన, బోధన, న్యాయవ్యవస్థ, ప్రచురణ రంగాలలో రాణిస్తారు.

### వ్యాధులు

ఉదర సంబంధిత వ్యాధులు, గ్యాస్, కడుపునొప్పి, కీళ్ళ నొప్పులు, పంటి నొప్పి, తల నొప్పి, రక్తపోటు, మూత్రకోశ వ్యాధులు రావొచ్చు. సరియైన చికిత్సతో ఉపశమనం పొందవచ్చు.

### సూచనలు

| | | |
|---|---|---|
| లక్కీ నంబర్లు | - | 1, 5, 6 |
| అన్‌లక్కీ నంబర్లు | - | 9 |
| లక్కీ తేదీలు | - | 1, 5, 6, 10, 14, 15, 19, 23, 24, 28 |
| అన్‌లక్కీ డేట్స్ | - | 9, 18, 27 |
| లక్కీ కలర్స్ | - | నీలం, పసుపు, ఆకుపచ్చ, తెలుపు |
| అన్‌లక్కీ కలర్స్ | - | నలుపు, ఎరుపు |
| అదృష్ట దినాలు | - | బుధవారం, శుక్రవారం, శనివారం |
| లక్కీ వివాహ తేదీలు | - | 1, 3, 6, 10, 12, 15, 19, 21, 24, 28, 30 |
| రెమిడీస్ | - | శివ ఆరాధన, వృద్ధులకు, వికలాంగులకు అన్నదానం, కాకులకు, కుక్కలకు ఆహారం పెట్టడం. శని తైలాభిషేకం. |
| ఉదా | - | అనీల్ కుంబ్లే 17-10-1970 |

## జన్మ సంఖ్య - 8, డెస్టినీ నంబరు - 9

**8/9 వ్యక్తులు జీవితంలో అంచెలంచెలుగా ఎదుగుతారు. శత్రువులను ధైర్యంగా ఎదుర్కొంటారు. ఇతరులకు సాయం చేస్తూనే, తమను సొంత అభివృద్ధిని సాధిస్తారు.**

ఎవరు, 8,17,26 తేదీలలో పుట్టి, వారి విధి సంఖ్య 9 అవుతుందో వారు ఈ వర్గంలోకి వస్తారు. వీరు శని, అంగారక గ్రహ ప్రభావంలో ఉంటారు.

వీరు మధ్యస్థమైన పొడవు కలిగి హుందాగా ఉంటారు. ఉబ్బిన కళ్ళు కలిగి ఉంటారు. కొంత మంది 30 సంవత్సరాల తర్వాత లావయ్యే అవకాశం ఉంది. పళ్ళు పెద్దవిగా ఉంటాయి. కష్టాలను సులభంగా మరిచిపోగలుగుతారు. అందుకే ఎపుడూ సంతోషంగా కనపడుతుంటారు. పరోపకారం చేస్తుంటారు. అందువలన ఇతరులను ఆకర్షిస్తారు. వారి ఆలోచనలను ధైర్యంగా తెలియచేస్తారు. సుఖజీవితం గడపాలనుకుంటారు. సమస్యలకు తక్షణ పరిష్కారం కోసం ప్రయత్నిస్తుంటారు. ఏ పని ప్రారంభించినా అది పూర్తయ్యే వరకు వదలరు. వీరికి సివిల్, మెకానికల్, ఎంఎస్(సర్జన్) వంటి సబ్జెక్టులపై ఆసక్తి ఉంటుంది. కొందరు బీఏ వంటి కోర్సులు చేసి కాంపిటీటివ్ పరీక్షలపై ఆసక్తి చూపుతారు. వీరు ఉన్నత పదవులలో మంచి మేనేజ్‌మెంట్ స్కిల్స్ చూపి చాలా కాలం ప్రజలకు గుర్తుండిపోయే విధంగా వ్యవహరిస్తారు. ఎంబీఏ, ఎల్ఎల్‌బీ వంటి కోర్సులపై కూడా కొందరు ఆసక్తి చూపుతారు.

జీవిత ప్రథమంలో కష్టాలు పడినా, అంచెలంచెలుగా ఎదుగుతారు. కష్టాలలో ఉన్నవారి పట్ల సానుభూతి చూపి, సహాయం చేయటానికి ప్రయత్నిస్తారు. అందువల్ల మంచి పేరు సంపాదిస్తారు. కొందరు ఒంటరి జీవితం గడుపుతారు. మంచి మానసిక, శారీరక దృఢత్వం కలవారు. వీరికి సరియైన పేరు ఉన్నట్లయితే, ఆరోగ్యం, సంపద, మంచి జీవిత భాగస్వామి, సంతానం పొందుతారు. సరియైన పేరు లేకపోతే కుటుంబ సమస్యలు, అనారోగ్యం, ప్రమాదాలు, ధనలేమి మొ॥ వాటితో బాధపడతారు. అందువల్ల సరియైన పేరు మార్పు చేసుకోవాలి.

దైవాన్ని నమ్ముతారు. గుడికి వెళ్ళే కంటే ఇంట్లోనే దైవధ్యానం చేయటానికి ఇష్టపడతారు. శృంగార సంబంధ విషయాలపై ఆసక్తి చూపుతారు. అలాగే ఆధ్యాత్మిక

విషయాలపై కూడా ఆసక్తి చూపుతారు. ప్రకృతి దృశ్యాలు, కొండలు, జలపాతాలు లాంటివి చూసినపుడు మానసిక ప్రశాంతత పొందుతారు. మంచి ఇల్లు, వాహనం సంపాదించటానికి ఆత్రుత పడుతుంటారు. వీరికి సహనం ఎక్కువ. ఒక్కొక్క సారి మాత్రం దురుసుగా ఉంటారు. వీరి కళ్ళు ఆకర్షించే గుణం కలిగి ఉంటాయి. శత్రువులను ధైర్యంగా ఎదుర్కొంటారు. ప్రేమించే వారి పట్ల ఎంతో వాత్సల్యం చూపుతారు. వీరి చుట్టూ స్నేహితులు ఉంటారు.

మంచి భవిష్యత్తు వీరి సొంతం. మనం ఇతరులకు సహాయం చేస్తూనే, వారి సొంత ఉన్నతికి కూడా ప్రయత్నిస్తారు. ఉన్నతిని పొందినపుడే ఇతరులకు సాయం చేయగలం అని నమ్ముతారు. ఏకాంతంగా ఉన్నపుడు వారితో వారే మాట్లాడుకుంటారు. జ్యోతిష్యం, న్యాయశాస్త్రం, మతం మొదలైన వాటిని సునిశితంగా పరిశోధన చేస్తారు. వ్యాపారవేత్తలుగా, పారిశ్రామిక వేత్తలుగా, ఇంజనీర్లుగా, డాక్టర్లుగా, లాయర్లుగా, టీచర్లుగా రాణిస్తారు. వీరికి సరియైన పేరు లేకపోతే, అనారోగ్యం, కుటుంబ సమస్యలు, జీవితంలో అభివృద్ధి లేకపోవటం లాంటి వాటితో బాధపడతారు.

## పేరు పెట్టే విధానం

బుధుడు, శుక్రుడి సంఖ్యలకి అనుగుణంగా వీరు పేరు పెట్టుకోవాలి. బుధుడి సంఖ్యలు : 5,14,23,32,41,50,59,77 మొ॥నవి శుక్రుడి సంఖ్యలు : 15,24,33,42,51,60,69 మొ॥నవి

మంచి సంఖ్యా శాస్త్రవేత్తని సంప్రదించి సరియైన పేరు మార్పు చేసుకోగలరు.

## రాణించే రంగాలు

అనేక రకాల ఉత్పత్తుల విక్రయం, ఉక్కు రంగానికి సంబంధించిన వృత్తులు, పోలీసు, మిలటరీ ఉద్యోగాలు, కాంట్రాక్టులు, కమీషన్ పనులు, ఏజెన్సీలు, సౌందర్య సాధనాలు మొదలైనవి వీరికి అనుకూలమైనవి.

## వ్యాధులు

ఉదరకోశ వ్యాధులు, వెన్నునొప్పి, పంటి నొప్పి, గ్యాస్, కీళ్ళ నొప్పులు, కంటి సమస్యలు, రక్తపోటు రావొచ్చు. సరియైన చికిత్స తీసుకొని ఉపశమనం పొందవచ్చు.

**సూచనలు**

| | | |
|---|---|---|
| లక్కీ నంబర్లు | - | 5, 6 |
| అన్‌లక్కీ నంబర్లు | - | 2, 7 |
| లక్కీ తేదీలు | - | 1, 5, 6, 9, 10, 14, 15, 18, 19, 23, 24, 27, 28 |
| అన్‌లక్కీ డేట్స్ | - | 2, 7, 11, 16, 25, 20, 29 |
| లక్కీ కలర్స్ | - | నీలం, పసుపు, ఎరుపు, గులాబీ, సాండల్ |
| అన్‌లక్కీ కలర్స్ | - | నలుపు |
| అదృష్ట దినాలు | - | మంగళవారం, శుక్రవారం, శనివారం |
| లక్కీ వివాహ తేదీలు | - | 1, 3, 6, 9, 10, 12, 15, 18, 19, 21, 24, 27 |
| రెమిడీస్ | - | రుద్రాభిషేకం,<br>సుబ్రహ్మణ్య స్వామి ఆరాధన, శనికి తైలాభిషేకం.<br>శివుడిని ఆరాధించడం, అనాథలకు అన్నదానం,<br>కుక్కలకు, కాకులకు ఆహారం పెట్టడం,<br>రక్తదానం చేయడం |
| ఉదా | - | యూసఫ్ పఠాన్ 17-09-1982 |

## జన్మసంఖ్య - 9 (అంగారకుని సంఖ్య)

**ఈ సంఖ్య అంగారక (కుజ) గ్రహానికి చిహ్నం. ఈ సంఖ్య కలవారు శారీరక, మానసిక పటుత్వం కలిగి ఉంటారు. భౌతిక సుఖాలపై ఆసక్తి చూపుతారు. విలాస వస్తువులు సేకరిస్తారు.**

సంఖ్యాశాస్త్రంలో 9 సంఖ్య అంగారక గ్రహాన్ని సూచిస్తుంది. అంగారక ప్రభావం ఉన్న వారు ధైర్య సాహసాలు కలిగి ఉంటారు. వీరు పోలీసు శాఖ, రక్షణ శాఖ, సమాజ సేవ రంగాలలో ఉండి దేశ సేవ చేస్తారు.

9,18,27 తేదీలలో (ఏ నెల అయిన సరే) జన్మించిన వారు అంగారక ప్రభావంలో ఉంటారు. శారీరక, మానసిక దృఢత్వం కలిగి ఉంటారు. ఏ పని ప్రారంభించినా కష్టనష్టాలు ఎదురైనా దానిని పూర్తి చేస్తారు. అలుపెరగక పనిచేస్తారు. భౌతిక సుఖాలపై ఆసక్తి చూపుతారు. ఇతరులను గాయపరచకుండా జాగ్రత్తపడతారు. కొంతమంది ముభావంగా ఉన్నా మరికొందరు మెరుపు వేగంతో ఆలోచిస్తారు. కొంచెం దురుసు స్వభావం ఉంటుంది. అనవసర సమస్యలలో చిక్కుకుంటారు. అన్ని సుఖాల వైపు వీరి మనసు కేంద్రీకృతమై ఉంటుంది. విలాస వస్తువులు సేకరించటానికి ఆసక్తి కనబరుస్తారు. యంత్ర సామాగ్రి, వాహనాలు, భవనాల యందు కూడా ఆసక్తి కలిగి ఉంటారు. ప్రకృతి దృశ్యాలు, కొండలు, చూసినపుడు మానసిక ప్రశాంతత పొందుతారు.

9 సంఖ్య, అంగారకుడు లేదా కుజ గ్రహానికి సంకేతం. ఈ సంఖ్య పరిపూర్ణతకు చిహ్నం. వీరు పోరాటపటిమ కలిగి ఉంటారు. నాయకత్వ లక్షణాలు మెండుగా ఉంటాయి. 9 సంఖ్య కలిగిన వారు శ్రమజీవులు, ఎంతో కష్టించి పోరాడి, జీవితంలో పైకి వస్తారు. వీరికి శత్రువులు ఎక్కువ. అగ్ని ప్రమాదానికి లోనయ్యే అవకాశం ఉంది. కొందరు తగువులమారిగా, కఠినంగా, నిర్లక్ష్యంగా ఉంటారు. అందువలన సమస్యలు వస్తాయి. వీరికి శారీరక, మానసిక దృఢత్వం ఎక్కువ. ఎన్నో సమస్యలు, కోర్టు సమస్యలు లాంటివి వచ్చినా వీరు చెక్కుచెదరరు. ధైర్యంగా ముందుకు సాగిపోతారు. 9 సంఖ్య మిలటరీ సంఖ్య కావున చాలా మంది సైనికులుగా, నాయకులుగా ఎదుగుతారు. సినీ పరిశ్రమ,

ఎలక్ట్రికల్ రంగం, ఫొటోగ్రఫీ లాంటి వాటిలో రాణిస్తారు. ఉపాధ్యాయులు, వక్తలు, వైద్యులు, లాయర్లు, న్యాయమూర్తులు లాంటివారు 9 సంఖ్యలో ఉంటారు.

కుజగ్రహానికి సుబ్రహ్మణస్వామి అధిదేవత. సుబ్రహ్మణ్యుడు చాలా శక్తిమంతుడు. దేవతల సైన్యానికి నాయకుడు. అందువలన 9 సంఖ్య కలవారు కూడా నాయకత్వ లక్షణాలు కలిగి ఉంటారు. వీరు ఎప్పుడూ తమదే పైచేయిగా ఉండాలని కోరుకుంటారు. వీరికి అతీతజ్ఞానం (సిక్స్త్ సెన్స్) ఎక్కువగా ఉంటుంది. ధైర్యం, ఉత్సాహం, శక్తి, ముందుకు దూసుకుపోయే గుణం ఎక్కువగా ఉంటుంది. ప్రేమాభిమానాల కోసం ఎంతకైనా తెగిస్తారు. మంచి రాజకీయ నాయకులుగా రాణిస్తారు.

## అనుకూల లక్షణాలు

- స్వార్థం లేకుండా ఉండటం
- త్యాగబుద్ధి కలిగి ఉండటం
- పరిపూర్ణత కలిగి ఉండటం
- విశాలమైన ఆలోచనలు కలిగి ఉండటం
- అందరినీ అర్థం చేసుకునే శక్తి
- ద్వేషం, భేషజం లేకుండా ఉండగలగటం
- తోటివారితో మంచి సంబంధాలు కలిగి ఉండటం
- తోటివారిపై వాత్సల్యం, ప్రేమ కలిగి ఉండటం
- సోదరభావంతో అందరిలో మెలగటం
- సహనం, క్షమాగుణం కలిగి ఉండటం
- మానవత్వం, జాలి, కరుణ, దయ కలిగి ఉండటం
- దానగుణం కలిగి ఉండటం

## వ్యతిరేక లక్షణాలు

- స్వార్థం, సంకుచితత్వం కలిగి ఉండటం
- సామాజిక పరిస్థితులపై ఎటువంటి బాధ్యత లేకపోవటం
- ఆవేశంలో అతిగి ప్రవర్తించటం
- కాలం, శక్తి, ధనం విచ్చలవిడిగా ఖర్చు చేయటం

- ప్రమాదకరమైన ఆలోచనలు కలగటం
- అనవసరంగా ఇతరులను నిందించటం
- ఆప్యాయత నిలకడగా లేకపోవటం
- అతిగా భావోద్వేగం కలిగి ఉండటం
- అధికారం దుర్వినియోగం చేయటం

అంగారక గ్రహ ప్రభావంలో ఉన్న 9 రకాల గురించి ఇపుడు తెలుసుకుందాం.

జన్మ సంఖ్య యొక్క ప్రభావం వ్యక్తులపై ఏ విధంగా ఉంటుందో, అలాగే డెస్టినీ నంబరు ప్రభావం కూడా ఉంటుంది. దాని వలన 9 జన్మసంఖ్య ఉన్న అందరి గుణగణాలు ఒకేలా ఉండవు. కారణం డెస్టినీ నంబరు మారటమే. ప్రస్తుత 9 జన్మ సంఖ్య ఉన్నవారి గుణగణాలు కూడా డెస్టినీ నంబరు బట్టి మారుతూ ఉంటాయి.

## జన్మసంఖ్య - 9, డెస్టినీ నంబరు - 1

**9/1 వ్యక్తులు ఆకర్షణీయంగా, చురుకుగా ఉంటారు. ఆలోచించకుండా పని ప్రారంభిస్తారు. విద్యాభ్యాసంలో ఆటంకాలు వస్తాయి. వీరికి స్నేహితులు ఎక్కువ.**

ఎవరు, 9,18,27 తేదీలలో జన్మించి, వారి విధి సంఖ్య 1 అవుతుందో వారు ఈ వర్గంలోకి వస్తారు. వీరు అంగారకుడు, సూర్యుడు ప్రభావంలో ఉంటారు. వీరు తెలివైన వారు, చురుకైన వారు. ఆకర్షణీయంగా ఉంటారు. పరిపాలనా దక్షతను కలిగి ఉంటారు. వీరి ముఖంలో సంతృప్తి కనిపిస్తూ ఉంటుంది. ఏ పనైనా ధైర్యంగా ప్రారంభిస్తారు. కాని ఒక్కొక్కసారి ముందు ఆలోచించకుండా పని ప్రారంభిస్తారు. తర్వాత బాధపడతారు. పురుషులైతే స్త్రీల వలన, స్త్రీలు అయితే పురుషుల వలన ఆర్థికంగా లబ్ధి పొందుతారు. వీరికి సరైన పేరు లేకపోతే సమస్యలు వస్తాయి.

వీరు మెకానికల్, ఇంజనీరింగ్, మైన్స్, కెమికల్, ఇంజనీరింగ్ లాంటి కోర్సులు ఇష్టపడతారు. తరువాత ఎం.బి.ఎ లాంటి కోర్సులు చేసి పెద్ద కంపెనీస్‌కి మేనేజర్స్‌గా పనిచేస్తారు. జీవిత ప్రథమంలో ఒడిదుడుకులు ఉన్నా, తర్వాత విజయం సాధిస్తారు. అందువల్ల అనుభవజ్ఞులుగా ఉంటారు. వీరి విద్యాభ్యాసంలో ఆటంకాలు ఉన్నా జీవితంలో

విజయం సాధిస్తారు. యవ్వనంలో సాహసోపేతంగా ఉంటారు. వారికి నచ్చింది చేస్తారు. జలపాతాలు, కొండలు, సముద్ర తీరాలు లాంటివి చూసినపుడు మానసిక ప్రశాంతత పొందుతారు. ఇతరుల అధీనంలో జీవించటానికి ఇష్టపడరు. రాజకీయాలు, సాహిత్యం పట్ల ఆసక్తి కలిగి ఉంటారు. తమ భావాలను చాలా శక్తివంతంగా తెలియచేస్తారు. కొందరు రాజకీయ నాయకులుగా రాణిస్తారు.

వీరికి స్నేహితులు ఎక్కువ కావటం వలన వారి గురించి ఎక్కువ ఖర్చు చేస్తారు. స్నేహితుల వలన వీరి పనులు జరిగిపోతాయి. వీరి సంఖ్యలకి అనుకూలంగా పేరు ఉన్నట్లయితే ఆరోగ్యం, సంపద, మంచి జీవిత భాగస్వామి, సంతానం లభిస్తాయి. లేకపోతే స్త్రీల వలన సమస్యలు, కోర్టు కేసులు ఎదుర్కొంటారు. అందువలన సరియైన పేరు మార్పు చేసుకుంటే మంచిది.

న్యాయశాస్త్రం, జ్యోతిష్యం, మతం, తత్వశాస్త్రం, వైద్యం, సర్జరి మొదలైన వాటిలో పరిశోధన చేస్తారు. వీరి శత్రువులు వీరికంటే పెద్దవారు, బలవంతులు అయినా వారిని ఎదిరించటానికి వెనుకాడరు. మనిషి జీవితం దుర్లభం కాబట్టి దానిని సార్థకం చేసుకోవాలి అని భావిస్తారు. సరియైన పేరు ఉన్నట్లయితే శీఘ్రంగా అభివృద్ధి సాధిస్తారు. స్నేహితులను కష్ట కాలంలో ఆదుకుంటారు. వారి తృప్తి కోసం ధనవ్యయం చేస్తారు. ధనం లేనపుడు నిరాశ చెందుతారు. వారి స్వస్థలం వదిలి వేరేచోట మంచి జీవితం కోసం స్థిరపడతారు. లాయర్లు, డాక్టర్లు, ఇంజనీర్లు, పారిశ్రామిక వేత్తలు, ప్రభుత్వ అధికారులుగా రాణిస్తారు. ఇవన్నీ వారి సంఖ్యలకు అనుకూలమైన పేరు ఉన్నపుడు మాత్రమే జరుగుతాయి.

## పేరు పేట్టే విధానం

వీరి పేరు, అంగారకుడు, సూర్యుడు, శుక్రుడు, బుధుడి సంఖ్యలకి అణుగుణంగా పెట్టుకోవాలి. అంగారకుడి సంఖ్యలు 9,18,27,45 మొ॥నవి. సూర్యుడి సంఖ్యలు 19,37,46,64 మొ॥నవి శుక్రుడి సంఖ్యలు 15,24,33,42,60,69 మొ॥నవి బుధుడి సంఖ్యలు 14,23,32,41,50,59,77 మొ॥నవి.

మంచి సంఖ్యా శాస్త్రవేత్తని సంప్రదించి సరియైన పేరు మార్పు చేసుకోగలరు.

## రాణించే రంగాలు

వీరు ఉద్యోగ వ్యాపారాలలో రాణిస్తారు. కాంట్రాక్టు పనులు, ఏజెన్సీలు, అగ్ని, సివిల్, మెకానికల్ ఇంజనీరింగ్, లోహాలకు సంబంధించిన పనులు, రచనలు, పేపరు

వ్యాపారం మొదలైనవి అనుకూలం

### వ్యాధులు

అధిక ఉష్ణం వలన వ్యాధులు, వెన్నునొప్పి, కంటి వ్యాధులు, రక్తపోటు, కడుపునొప్పి, కీళ్ళ నొప్పులు, నరాల బలహీనత, కిడ్నీ సమస్యలు రావొచ్చు. సరియైన చికిత్స తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది.

### సూచనలు

| | | |
|---|---|---|
| లక్కీ నంబర్లు | - | 1, 5, 6, 9 |
| అన్‌లక్కీ నంబర్లు | - | 2, 7, 8 |
| లక్కీ తేదీలు | - | 1, 5, 6, 9, 10, 14, 15, 18, 19, 23, 24, 27, 28 |
| అన్‌లక్కీ డేట్స్ | - | 2, 7, 8, 11, 16, 17, 20, 25, 26, 29 |
| లక్కీ కలర్స్ | - | లేతనీలం, పసుపు, ఎరుపు, గులాబీ, ఆరెంజ్ |
| అన్‌లక్కీ కలర్స్ | - | నలుపు |
| అదృష్ట దినాలు | - | ఆదివారం, మంగళవారం, శుక్రవారం |
| లక్కీ వివాహ తేదీలు | - | 1, 6, 9, 10, 15, 18, 19, 24, 27, 28 |
| రెమిడీస్ | - | సుబ్రహ్మణ్య స్వామిని ఆరాధించడం,<br>శివ ఆరాధన, రక్తదానం చేయటం. |
| ఉదా | - | ఆర్.డి.బర్మన్ 27-06-1939 |

## జన్మ సంఖ్య - 9, డెస్టినీ నంబరు - 2

**9/2 వ్యక్తులు శత్రుగ్రహాలైన కుజ, చంద్ర గ్రహ ప్రభావం ఉండటం వలన సరైన సఖ్యత కల పేరు పెట్టుకోవాలి. వీరికి తెలివితేటలు ఎక్కువ. మొండివారు. ఉద్యోగులైతే ఆఫీసులో సమస్యలుంటాయి. పరోపకర బుద్ధి ఉన్నా ఒక్కొక్కసారి దురుసుగా ఉంటారు.**

ఎవరు 9, 18, 27 తేదీలలో జన్మించి, వారి విధి సంఖ్య 2 అవుతుందో వారు ఈ వర్గంలోకి వస్తారు. జనన తేదీ, నెల, సంవత్సరం, అంకెల మొత్తం కలపగా వచ్చే

సంఖ్య విధి సంఖ్య. వీరు అంగారకుడు, చంద్రుడి ప్రభావంలో ఉంటారు. అంగారకుడి సంఖ్య అయిన 9, చంద్రుడు సంఖ్య అయిన 2 కి శత్రువు. అందువలన జన్మ సంఖ్య, విధి సంఖ్య, పరస్పర శత్రువులు. అందువలన సరియైన పేరు లేని వారికి హాని కలుగుతుంది. పురుషులైతే స్త్రీల వలన, స్త్రీలయితే పురుషుల వలన సమస్యలు వస్తాయి. దీర్ఘకాలిక వ్యాధులు కలుగుతాయి. సంపన్న కుటుంబంలో పుట్టినా, సమస్యల వలయంలో చిక్కుకుంటారు. వీరు సైన్స్ గ్రూపు చదువుతారు. సివిల్, మెకానికల్ కాని కంప్యూటర్ సైన్స్, డాక్టర్స్ మంచి సర్జన్లుగా ఉండే విభాగంలో పనిచేస్తారు. వీరికి తెలివితేటలతో పాటు ధైర్యసాహసాలు ఉంటాయి. అందువలన సమాజంలో మంచి పేరు తెచ్చుకుంటారు.

వీరిలో కొందరు చాలా అందంగా, ఆకర్షణీయంగా ఉంటారు. తెలివితేటలు కలిగి ఉంటారు. వీరు మొండి స్వభావం కలిగి ఉంటారు. ఎవరేం చెప్పినా వారికి తోచిందే చేస్తారు. తమ భావాలను కరకుగా చెప్తారు. అందువలన ఇతరులు అపార్థం చేసుకుంటారు. వీరు వాదనా పటిమ కలగి ఉంటారు. ధైర్యంగా ముందుకు దూకి మధ్యలో తికమక పడతారు. భగవంతుడి పట్ల, తమ మతం పట్ల భక్తి, విశ్వాసాలు కలిగిఉంటారు. వారి మత విషయాలపై లోతైన పరిశోధన చేస్తారు. ఇరు వర్గాల మధ్య వివాదాలు పరిష్కరించటంలో సిద్ధ హస్తులు. ఉద్యోగస్తులయితే, ఆఫీసులో ప్రతిబంధకాలు ఎదుర్కొవలసి వస్తుంది.

ఇతరులకు సహాయపడుతూ, వారి కష్ట సుఖాలు పంచుకుంటారు. అందువల్ల వీరికి మంచి స్నేహితులు ఉంటారు. అనేక విషయాలపై అవగాహన ఉంటుంది. వారి మాటలు, రచనలు, పనుల ద్వారా ఇతరులను ప్రభావితం చేస్తారు. వీరి శత్రువులు వీరిని చూసి భయపడతారు. పరోపకారి బుద్ధి వలన మంచి పేరు వచ్చినా, ఒక్కొక్కసారి దురుసుగా ఉంటారు. దాని వలన కొంత అపఖ్యాతి రావొచ్చు. ఒక్కొక్కసారి ఏకాంతంగా ఉండి వారి జీవితం గురించి కలతచెందుతుంటారు.

ప్రకృతి దృశ్యాలు, కళాఖండాల ప్రదర్శనలు, జలపాతాలు, అందమైన భవనాలు, సముద్ర తీరాలు లాంటివి చూసినపుడు మానసిక ప్రశాంతత పొందుతారు. వీరికి సరియైన పేరు లేకపోతే, వైవాహిక జీవితంలో కలతలు వంటివి ఎదుర్కోవలసి వస్తుంది. న్యాయశాస్త్రం, మతం, గణితం, జ్యోతిష్యం, తత్వశాస్త్రం, వైద్యం, మొదలైన వాటిలో మంచి పరిజ్ఞానం ఉంటుంది. చాలా మంది, డాక్టర్లు, వ్యాపారవేత్తలు, పారిశ్రామిక

వేత్తలు, అధికారులుగా రాణిస్తారు. సరియైన పేరు లేకపోతే మానసిక సమస్యలు వస్తాయి.

## పేరు పెట్టే విధానం

వీరు, శుక్రుడు, బుధుడు, సంఖ్యలకు అనుగుణంగా పెట్టుకోవాలి. శుక్ర సంఖ్యలు: 6, 13, 15, 33, 42, 60, 69 మొ॥నవి. సూర్య సంఖ్యలు : 1, 19, 37, 46, 55

మంచి సంఖ్యాశాస్త్రవేత్తని సంప్రదించి సరియైన పేరు మార్పు చేసుకోగలరు.

## రాణించే రంగాలు

కాంట్రాక్టులు, కమీషన్ పని, ఏజెన్సీలు, వ్యవసాయం, ఆహార ఉత్పత్తులు, రచనలు, పేపరు, విలాసవస్తువులు, రియల్ ఎస్టేట్స్, మొదలైనవి అనుకూలం.

## వ్యాధులు

మూలశంక, ఉదరవ్యాధులు, మూత్రకోశ వ్యాధులు, అధికఉష్ణం వలన వ్యాధులు, మధుమేహం, గుండెజబ్బు, రక్తపోటు మొదలైన వ్యాధుల బారినపడే అవకాశం ఉంది. అయితే సరియైన చికిత్స తీసుకొని ఉపశమనం పొందవచ్చు.

## సూచనలు

| | | | |
|---|---|---|---|
| లక్కీ నంబర్లు | - | 5, 6 | |
| అన్‌లక్కీ నంబర్లు | - | 8 | |
| లక్కీ తేదీలు | - | 5, 6, 14, 15, 23, 24 | |
| అన్‌లక్కీ డేట్స్ | - | 8, 17, 26 | |
| లక్కీ కలర్స్ | - | లేతనీలం, పసుపు, నీలం, గోధుమరంగు | |
| అన్‌లక్కీ కలర్స్ | - | లేవు | |
| అదృష్ట దినాలు | - | ఆదివారం, సోమవారం, మంగళవారం | |
| లక్కీ వివాహ తేదీలు | - | 1, 9, 6, 10, 15, 18, 19, 24, 27 | |
| రెమిడీస్ | - | అమ్మవారిని ఆరాధించడం, సుబ్రహ్మణ్య స్వామిని ఆరాధించటం, వృద్ధాశ్రమంలో అన్నదానం చేయడం, రక్తదానం చేయటం. | |
| ఉదా | - | ప్రిన్స్ మహేష్‌బాబు | 09-08-1974 |
| | | రామకృష్ణ పరమహంస | 18-02-1836 |

# జన్మ సంఖ్య - 9, డెస్టినీ నంబరు - 3

**9/3 వ్యక్తులకు ముత్యాల్లాంటి పలువరుస ఉంటుంది. బాగా మాట్లాడతారు. సమాజం, దేశం కోసం పాటుపడతారు. అంచెలంచెలుగా జీవితంలో ఎదుగుతారు. నిరంతరం శ్రమిస్తూ ఉంటారు.**

ఎవరు 9, 18, 27 తేదీలలో జన్మించి, వారి విధి సంఖ్య 3 అవుతుందో వారు ఈ వర్గంలోకి వస్తారు. జనన తేదీ, నెల, సంవత్సరం, అంకెలు మొత్తం కలపగా వచ్చే సంఖ్య విధి సంఖ్య. వీరు అంగారకుడు, గురుగ్రహాల ప్రభావంలోకి వస్తారు.

వీరు ముత్యాల వంటి పలు వరస కలిగి, హుందాగా కనిపిస్తారు. మంచి ఆలోచనలు ఉండి, వాటిని కరుకుగా తెలియచేస్తారు. ఇతరులు చెప్పే దానిని విని మంచి విషయ పరిజ్ఞానం పెంపొందించుకుంటారు. ఇతరులకు ప్రశ్నలు వేయడం, ఇతరులు వీరి కోసం పని చేయించటం, చతుర సంభాషణ లాంటి వాటిలో ప్రావీణ్యం కలిగి ఉంటారు. శారీరక మానసిక దృఢత్వం కలిగి ఉంటారు. సరియైన పేరు ఉన్నట్లయితే అన్ని భోగాలూ అనుభవిస్తారు. వీరు ఎలక్ట్రికల్, మెకానికల్, సివిల్ ఇంజనీరింగ్ చదివే అవకాశం ఉంది. కొందరు టీచర్, లెక్చరర్లుగా కూడా స్థిరపడతారు. కొందరు కళాశాలలను నిర్వహిస్తారు. వీరికి నాట్యం, సంగీతం, క్రీడలు వంటి వాటిపై ఆసక్తి ఉంటుంది. తల్లిదండ్రులు వీరి అభిరుచికి తగినట్లుగా చదువుతో పాటు వేరే వ్యాపకంలో పెడితే ఆయా రంగాల్లో మంచి గుర్తింపు పొందుతారు.

సైనిక, పోలీసు రంగాలలో బాగా సేవ చేయగలరు. అబద్ధం చెప్పరు. వారి ఆలోచనలు దాపరికం లేకుండా స్పష్టంగా తెలియచేస్తారు. కర్మాగారాలు, నిర్మాణ సంస్థలు, కాంట్రాక్టులు లాంటివి చేపట్టగలరు. దీని వలన చాలమందికి జీవనోపాధి కల్పిస్తూ వారూ అభివృద్ధి చెందుతారు. నీతి, నిజాయితీ కలిగి ఉంటారు. ఒక్కొక్కసారి శీఘ్ర కోపానికి గురవుతుంటారు. తరువాత బాధపడతారు. వీరికి తమ దేశం, మతం పట్ల విశ్వాసం ఉంటుంది. దేశం, మతం, సమాజ సంక్షేమం కోసం పాటుపడతారు.

కష్టించి పని చేసే గుణం కలిగి ఉంటారు. చాలా అరుదుగా నవ్వుతారు. మంచి క్రమశిక్షణ కలిగి ఉన్నట్లు ప్రవర్తిస్తారు. తమపై ఆధారపడిన వారికి సరైన సమయంలో

సహాయం చేస్తారు. పెద్దలను, మేధావులను గౌరవిస్తారు. ప్రతిగా ఎంత గొప్ప వారైనా సరియైన మర్యాద ఇవ్వకపోతే వారిని పట్టించుకోరు. ప్రతిబంధకం ఎదురైనపుడు సరైన అవకాశం కోసం ఎదురు చూసి, శత్రువులపై విజయం సాధిస్తారు. శాస్త్రవేత్తలు, లాయర్లు, డాక్టర్లు, ఉన్నత అధికారులు ఈ కోవలోకి వస్తారు. వీరికి సరియైన పేరు లేకపోతే విద్యాభ్యాసంలో ఒడిదుడుకులు, అభివృద్ధి కుంటుపడటం, అస్తవ్యస్త కుటుంబ జీవితం లాంటివి బాధిస్తాయి. కర్మాగారాలు, శాస్త్రీయ ఆవిష్కరణలు, పురాతన చరిత్ర పఠనం లాంటివి వీరికి మానసిక ప్రశాంతత కలుగచేస్తాయి.

జీవిత ప్రథమంలో ఒడిదుడుకులు ఉన్నా సరైన పేరు ఉన్నట్లయితే, అంచెలంచెలుగా ఎదుగుతారు. హోదా పెంపు కోసం నిరంతరం శ్రమిస్తుంటారు. శృంగార సంబంధ విషయాలలో నియంత్రణ కలిగి ఉంటే మంచిది. సుదూర ప్రయాణాలు, విదేశీ ప్రయాణాలు చేసి పరిజ్ఞానం పెంచుకుంటారు. నూతన వ్యాపార పద్ధతులు తెలుసుకుంటారు. సరైన పేరు ఉంటే ఆరోగ్యం, సంపద, మంచి జీవిత భాగస్వామి, సంతానం పొందుతారు. అదే సరైన పేరు లేకపోతే, జీవితంలో అన్ని అవకాశాలు కోల్పోతారు. తమ సమర్థతకు తగు జీవితం లభించలేదని బాధపడుతూ మానసిక అశాంతికి లోనవుతారు.

## పేరు పెట్టే విధానం

అంగారకుడు, గురుడు, బుధుడికి సంబంధించిన సంఖ్యలతో పేరు పెట్టుకోవాలి. **అంగారకుడి సంఖ్యలు :** 27, 36, 54 మొ॥నవి. **గురుడి సంఖ్యలు :** 21, 39, 42, 51 మొ॥నవి. మంచి సంఖ్యాశాస్త్ర నిపుణుడిని సంప్రదించి, పేరు మార్పు చేసుకోగలరు.

## రాణించే రంగాలు

కాంట్రాక్టులు, ఏజెన్సీలు, నిర్మాణ రంగం, లోహ సంబంధ పనులు, రచనలు, బోధన, కర్మాగారాలు, నూనె వ్యాపారం, రవాణా వ్యాపారం మొదలగునవి అనుకూలం.

## వ్యాధులు

నరాల వ్యాధులు, గ్యాస్, కడుపు నొప్పి, మధుమేహం, అధిక ఉష్ణం వలన వ్యాధులు, ఉదర సమస్యలు, అలెర్జీ, చర్మవ్యాధులు. సరియైన చికిత్సతో ఉపశమనం లభిస్తుంది.

**సూచనలు**

| | | |
|---|---|---|
| లక్కీ నంబర్లు | - | 1, 3, 5, 9 |
| అన్‌లక్కీ నంబర్లు | - | 2, 7, 8 |
| లక్కీ తేదీలు | - | 3, 5, 9, 12, 14, 18, 21, 23, 27, 30 |
| అన్‌లక్కీ డేట్స్ | - | 2, 7, 8, 11, 16, 17, 20, 25, 26, 29 |
| లక్కీ కలర్స్ | - | లేతనీలం, పసుపు, ఎరుపు, ఊదా, గులాబి, ఆరెంజ్ |
| అన్‌లక్కీ కలర్స్ | - | నలుపు |
| అదృష్ట దినాలు | - | మంగళవారం, గురువారం, ఆదివారం |
| లక్కీ వివాహ తేదీలు | - | 1, 3, 9, 10, 12, 18, 19, 21, 27, 28 |
| రెమిడీస్ | - | దక్షిణామూర్తిని కొలవటం, పండితులు, పురోహితులకు సహాయం చేయటం, రక్తదానం చేయటం. |

## జన్మ సంఖ్య - 9, డెస్టినీ నంబరు - 4

**9/4 వ్యక్తులు ఆకర్షణీయంగా ఉంటారు. ఇతరులకు సాయం చేస్తుంటారు. వీరు రాజకీయ నాయకులుగా, వక్తలుగా రాణిస్తారు. జీవితంలో అన్ని భోగాలు అనుభవిస్తారు. వీరిని మోసం చేయటం కష్టం.**

ఎవరు 9, 18, 27 తేదీలలో జన్మించి, వారి విధి సంఖ్య 4 అవుతుందో వారు ఈ వర్గంలోకి వస్తారు. వీరు అంగారకుడు, రాహువు ప్రభావం కింద ఉంటారు.

వీరు ఆకర్షణీయమైన రూపం, మధ్యస్థమైన పొడవు కలిగి ఉంటారు. కొందరి కళ్ళు ఎరుపు రంగులో ఉంటాయి. ఇతరులకు సహాయపడుతూ వారి సహకారం పొందుతారు. కేవలం మాటల ద్వారా వారి పనులు సాధించుకోగలుగుతారు. వీరిలో చాలా మంది రాజకీయ నాయకులుగా, మంచి వక్తలుగా రాణిస్తారు. కఠినంగా ఉండాల్సిన దగ్గర కఠినంగా ఉంటారు. శాంతియుత సంభాషణలప్పుడు సహనం కలిగి ఉంటారు. మర్యాద ఇవ్వాల్సి వస్తే ఇచ్చినట్లుగా నటిస్తారు. ఈ విధంగా తెలివిగా పనులు సాధిస్తారు.

మెరుపు వేగంతో ఆలోచిస్తారు. కొత్త వ్యక్తి వస్తే మొదటి చూపులోనే వారి ఉద్దేశాన్ని గ్రహించగలుగుతారు. దైవకృప వీరిపై ఉంటుంది. మతపరమైన విషయాల పట్ల ఆసక్తి ఉండి, మతాభివృద్ధికి కృషి చేస్తారు. పెద్ద కంఠస్వరం ఉన్నా సున్నిత మనస్కులుగా ఉంటారు. పరోపకార బుద్ధి కలిగి ఉంటారు. అందువల్ల అందరూ ప్రశంసిస్తుంటారు. వీరు పుట్టిన తర్వాత వీరి తల్లిదండ్రుల హోదాలో, ఆర్థిక పరిస్థితుల్లో మంచి మార్పులు వచ్చి ఉన్నతంగా జీవితం గడుపుతారు.

వీరు సైన్స్ గ్రూపులో ఇంజనీరింగ్ చదివిన తరువాత ఎల్.ఎల్.బి, ఎం.బి.ఎ లాంటి కోర్సులు చేస్తారు. కొందరు డాక్టర్స్‌గా, ప్రఖ్యాతి చెందిన సర్జన్లుగా పేరు తెచ్చుకుంటారు. వీరి సంఖ్యకి సరియైన పేరు ఉంటే, ఆరోగ్యం, సంపద, మంచి జీవిత భాగస్వామి, సంతానం పొందుతారు. పుట్టినపుడే సరియైన పేరు ఉన్నట్లయితే, జీవిత ప్రథమంలోనే అన్ని భోగాలు అనుభవిస్తారు. అలా లేకపోతే మొదట్లో ఒడిదుడుకులు ఎదుర్కొని, ఉన్నతి కోసం శ్రమించాల్సి ఉంటుంది. కాని తర్వాత పతనం కావాల్సి వస్తుంది. కొందరికి జూదం, రేసులు, తాగుడు వంటి దుర్వ్యసనాలు ఉండవచ్చు. కానీ వాటికి బానిస కారు. ఒకరిని మోసం చెయ్యరు, ఇంకొకరిచే మోసపోరు. ప్రాపంచిక విషయాలలో పరిజ్ఞానం ఎక్కువ ఉంటుంది. ఎమోషనల్ గా ఉంటారు. అందువలన ముసలితనంలో నరాల బలహీనత వస్తుంది.

జ్యోతిష్యం, న్యాయశాస్త్రం, మతం, వైద్యం, తత్వశాస్త్రం, కళల పట్ల ఆసక్తి కనబరుస్తారు. కొండలు, కర్మాగారాలు, అందమైన వాహనాలు, పక్షులు, వృక్షాలు చూసినపుడు మానసిక ప్రశాంతత పొందుతారు. ఇంజనీర్లు, డాక్టర్లు, లాయర్లు, పారిశ్రామిక వేత్తలు, వ్యాపార వేత్తలు, రాజకీయ నాయకులు, అధికారులు ఈ వర్గంలోకి వస్తారు. సరియైన పేరు లేకపోతే కుటుంబ జీవితం అస్తవ్యస్తంగా ఉండి అభివృద్ధి కుంటుపడుతుంది. కోర్టు వ్యవహారాలు వేధిస్తాయి. సరియైన పేరు మార్పు చేస్తే మంచి ఫలితాలు పొందుతారు.

## పేరు పెట్టే విధానం

అంగారకుడు, శుక్రుడు, బుధుడు, సూర్యుడికి సంబంధించిన సంఖ్యలతో పేరు పెట్టుకోవాలి. అంగారకుడి సంఖ్యలు : 27, 36, 54 మొ॥నవి. శుక్రుడి సంఖ్యలు : 15, 24, 33, 42, 51, 60, 69 మొ॥నవి. బుధుడి సంఖ్యలు : 14, 23, 32, 41, 50, 59,

77 మొ॥నవి. సూర్యుడి సంఖ్యలు : 19, 37, 46, 64 మొ॥నవి. మంచి సంఖ్యా శాస్త్రవేత్తని సంప్రదించి పేరు మార్పు చేసుకోగలరు.

## రాణించే రంగాలు

కాంట్రాక్టులు, లోహపరిశ్రమలు, రచనలు, బోధన రంగాలు అనుకూలం

## వ్యాధులు

రక్తపోటు, మధుమేహం, వెన్నునొప్పి, కీళ్ళ నొప్పులు, నరాల వ్యాధులు, అధికఉష్ణం వలన వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. సరియైన చికిత్సతో ఉపశమనం పొందవచ్చు.

## సూచనలు

| | | |
|---|---|---|
| లక్కీ నంబర్లు | - | 1, 5, 6, 9 |
| అన్‌లక్కీ నంబర్లు | - | 2, 7 |
| లక్కీ తేదీలు | - | 1, 5, 6, 9, 10, 14, 15, 18, 19, 23, 24, 27, 28 |
| అన్‌లక్కీ డేట్స్ | - | 2, 7, 8, 11, 16, 17, 20, 25, 26, 29 |
| లక్కీ కలర్స్ | - | లేతనీలం, ఎరుపు, లేతపసుపు |
| అన్‌లక్కీ కలర్స్ | - | ఆకుపచ్చ, నలుపు |
| అదృష్ట దినాలు | - | ఆదివారం, మంగళవారం, శుక్రవారం |
| లక్కీ వివాహ తేదీలు | - | 1, 6, 9, 10, 15, 18, 19, 24, 27, 28 |
| రెమిడీస్ | - | దుర్గామాత ఆరాధన, సుబ్రహ్మణ్య స్వామి ఆరాధన, అనాథలకు, పేదవారికి అన్నదానం చేయాలి. |
| ఉదా | - | ఆర్.కే.నారాయణన్ 27-10-1920 (మాజీ రాష్ట్రపతి) |

## జన్మ సంఖ్య - 9, డెస్టినీ నంబరు - 5

**9/5 వ్యక్తులు శారీరక, మానసిక బలం కలిగి ఉంటారు. స్నేహితులతో ప్రేమగా, శత్రువులతో కరుకుగా ఉంటారు. కాలం వృథా చేయరు. వీరి చుట్టూ ఎప్పుడూ మనుషులు ఉంటారు. పారిశ్రామిక వేత్తలు, ఉన్నత ఉద్యోగులుగా ఉంటారు.**

ఏ నెలలోలైనా 9, 18, 27 తేదీలలో పుట్టిన వారి విధి సంఖ్య 5 అయితే వారు ఈ వర్గంలోకి వస్తారు. వీరిపై అంగారకుడు, బుధుల ప్రభావం ఉంటుంది.

వీరు అందంగా చురుకుగా ఉండి, మంచి శారీరక, మానసిక దారుఢ్యం కలిగి ఉంటారు. స్నేహితుల పట్ల వాత్సల్యంగా, శత్రువుల పట్ల కరకుగా ఉంటారు. అందరిచే గౌరవింపబడి అభివృద్ధి కోసం కృషి చేస్తుంటారు. బద్ధకస్తులని మెచ్చుకోరు. ఎందుకంటే వీరు పనిని తొందరగా చేస్తారు కాబట్టి. కాలం వృథా చేయకుండా చేసే పనిని నిబద్ధతతో చేస్తూ తగిన ప్రతిఫలం పొందుతారు. ఈ లక్షణాలన్నీ వీరి సంఖ్యకి సరియైన పేరు ఉన్నపుడు మాత్రమే సంభవం. సరియైన పేరులేకపోతే కష్టాల కడలిలో మునిగిపోతారు. వీరికి ధైర్యంతో పాటు అమోఘమైన తెలివితేటలు ఉంటాయి. వీరు ఇంజనీరింగ్ లాంటి సబ్జెక్ట్స్ చదివి, ఐ.పి.ఎస్, ఐ.ఎ.ఎస్ లాంటి ఉన్నతమైన ఉద్యోగాల కొరకు ప్రయత్నించి సాధిస్తారు. వీరికి ఎక్కువగా యూనిఫార్మ్ వేసుకునే ఉద్యోగాలు అంటే చాలా ఇష్టం. వీరిలో చాలామంది డాక్టర్లు, సర్జన్లు ఉంటారు.

మతం, న్యాయశాస్త్రం, సంగీతం, వైద్యం, రసాయన శాస్త్రం పట్ల ఆసక్తి కలిగి ఉంటారు. వీరు ప్రమాదాలు, కుట్రలు మొదలైన వాటి నుంచి సులభంగా తప్పించుకోగలుగుతారు. వీరి చుట్టూ ఎప్పుడూ చాలా మంది మనుషులు ఉంటారు. ప్రకృతి దృశ్యాలు, కొత్త వస్తువులు, పశుపక్ష్యాదులను చూసినపుడు ఆహ్లాదం పొందుతారు. ఈ వర్గంలోకి పారిశ్రామిక వేత్తలు, వృత్తి నిపుణులు, ప్రభుత్వ ఉన్నత ఉద్యోగులు వస్తారు.

### పేరు పెట్టే విధానం

వీరు అంగారక, బుధుల ప్రభావంలో ఉంటారు కాబట్టి వాటికి సంబంధించిన సంఖ్యలకు అనుగుణంగా పేరు పెట్టుకోవాలి. **అంగారకుడి సంఖ్యలు :** 27, 36, 54

మొ॥నవి. సరియైన సంఖ్యాశాస్త్రవేత్తని సంప్రదించి పేరు మార్పు చేసుకోగలరు. బుధుడి సంఖ్యలు 14, 23, 32, 41 మొదలైనవి.

## రాణించే రంగాలు

నిర్మాణ రంగం, సరకు రవాణా, వ్యవసాయిక పనులు, కాంట్రాక్టులు, పీఆర్ఓలుగా, పరిశ్రమలు మొ॥నవి అనుకూలం

## వ్యాధులు

ఉదర సమస్యలు, కీళ్ళ వ్యాధులు, రక్తపోటు, గ్యాస్ట్రబుల్ మొ॥నవి వచ్చే అవకాశం ఉంది. సరైన చికిత్స తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది.

## సూచనలు

| | | | |
|---|---|---|---|
| లక్కీ నంబర్లు | - | 1, 5, 9 | |
| అన్‌లక్కీ నంబర్లు | - | 2, 7 | |
| లక్కీ తేదీలు | - | 1, 5, 6, 9, 10, 14, 15, 18, 19, 23, 24, 27, 28 | |
| అన్‌లక్కీ డేట్స్ | - | 2, 11, 20, 29, 7, 16, 25 | |
| లక్కీ కలర్స్ | - | లేతనీలం, ఎరుపు, బూడిద రంగు | |
| అన్‌లక్కీ కలర్స్ | - | ఆకుపచ్చ | |
| అదృష్ట దినాలు | - | ఆది, మంగళ, బుధవారాలు | |
| లక్కీ వివాహ తేదీలు | - | 1, 3, 6, 9, 10, 12, 18, 19, 21, 24, 27, 28 | |
| రెమిడీస్ | - | శివ ఆరాధన, సుబ్రహ్మణ్య స్వామి ఆరాధన,<br>వృద్ధాశ్రమాలలో అన్నదానం,<br>బీద విద్యార్థుల చదువు కోసం సహాయం చేయటం. | |
| ఉదా | - | అక్షయ్ కుమార్ | 09-09-1967 |
| | | సోనియా గాంధీ | 09-12-1946 |
| | | శత్రఘ్న సిన్హా | 09-12-1946 |

## జన్మ సంఖ్య - 9, డెస్టినీ నంబరు - 6

**9/6 వ్యక్తులు అందంగా, దర్జాగా ఉంటారు. ఆలోచించి ఏ పనైనా చేస్తారు. సామాజిక సేవ చేస్తారు. అన్ని భోగాలు అనుభవిస్తారు.**

ఏ నెలలోనైనా 9,18,27 తేదీలలో జన్మించిన వారి విధి సంఖ్య 6 అవుతుందో వారు ఈ వర్గంలోకి వస్తారు. వీరు అంగారకుడు శుక్రగ్రహాల ప్రభావంలో ఉంటారు.

వీరు చాలా అందంగా దర్జాగా, హుందాగా ఉంటారు. వీరి వేషధారణ, ప్రవర్తన, మాటలు ఎంతో ఆకర్షణీయంగా ఉండటం వలన ఇతరులను ఆకట్టుకొనగలుగుతారు. వీరు చాలా తెలివితేటలు కలిగి ఆలోచించి ఏ పనైనా చేస్తారు. ఇతరులు వీరి వద్ద ఎలా ప్రవర్తిసారో వీరు అలాగే ప్రవర్తిస్తారు. దెబ్బకు దెబ్బలా ఉంటుంది వీరి ప్రవర్తన. కాలయాపన చేసే వారు, మెట్ట వేదాంతం చెప్పేవారంటే వీరికి గిట్టదు. ఉన్నత స్థాయికి ఎదగడానికి బాగా కృషి చేసి, అన్ని భోగాలు అనుభవిస్తారు. ఇవన్ని వీరి సంఖ్యకి అనుకూలమైన పేరు ఉన్నపుడు మాత్రమే సంభవం. వీరు ఏ రంగంలోనైనా రాణించగలరు. వీరికి మంచి శరీర దారుఢ్యము, ముఖవర్ఛస్సు ఉంటుంది. డాక్టర్లుగా, సర్జన్లుగా, రియల్ ఏస్టేట్స్ వ్యాపారస్తులుగా జీవితంలో బాగా రాణిస్తారు. వీరికి వివాహ అనంతరం జీవితంలో మంచి ఉన్నతి ఉంటుంది.

వీరికి దైవభక్తి ఎక్కువ. సామాజిక సేవా కార్యక్రమాలలో కూడా పాలు పంచుకొంటారు. దైవధ్యానం, ప్రయాణాలు, ప్రకృతి దృశ్యాలు, విలాసవస్తువుల వలన మానసిక ప్రశాంతత పొందుతారు. వీరి సంఖ్యకి అనుకూలమైన పేరు లేకపోతే కష్టనష్టాలు తప్పవు. వృత్తి నిపుణులు, ఉన్నత ఉద్యోగులు, పారిశ్రామిక వేత్తలు ఈ వర్గంలోకి వస్తారు. విజ్ఞాన శాస్త్రం, జ్యోతిషం, వైద్యం, నటన, కళల పట్ల ఆసక్తి కలిగి ఉంటారు. అపుడపుడు వీరి భావాలను రచనా వ్యాసంగాల ద్వారా తెలియచేస్తుంటారు.

### పేరు పెట్టే విధానం

అంగారకుడు, శుక్రుడి సంఖ్యలకు అనుగుణంగా వీరు పేరు పెట్టుకోవాలి. అంగారకుడి సంఖ్యలు : 27, 36, 54 మొ॥నవి. శుక్రుడి సంఖ్యలు : 24, 33, 42, 51, 60, 69 మొ॥నవి

## రాణించే రంగాలు

నిర్మాణ సంస్థలు, వ్యవసాయం, రవాణా, వ్యాపారం, పరిశ్రమలు, సినిమా, రచన, మీడియా వీరికి అనుకూలం

## వ్యాధులు

వెన్ను నొప్పి, రక్తపోటు, మధుమేహం లాంటివి బాధిస్తాయి. సరైన చికిత్స తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది.

## సూచనలు

| | | |
|---|---|---|
| లక్కీ నంబర్లు | - | 6, 9 |
| అన్‌లక్కీ నంబర్లు | - | 2, 3 |
| లక్కీ తేదీలు | - | 1, 6, 9, 10, 15, 18, 19, 24, 27, 28 |
| అన్‌లక్కీ డేట్స్ | - | 2, 3, 11, 12, 20, 21, 29, 30 |
| లక్కీ కలర్స్ | - | లేతనీలం, లేతపసుపు, ఎరుపు |
| అన్‌లక్కీ కలర్స్ | - | ఊదా, గులాబీ |
| అదృష్ట దినాలు | - | ఆదివారం, మంగళవారం, శుక్రవారం |
| లక్కీ వివాహ తేదీలు | - | 1, 6, 9, 10, 15, 18, 19, 24, 27, 28 |
| రెమిడీస్ | - | శివ, సుబ్రహ్మణ్య స్వామి ఆరాధన, వృద్ధులకు, అనాథలకు అన్నదానం చేయటం, రక్తదానం చేయటం మంచిది. |

| | | | |
|---|---|---|---|
| ఉదా | - | బాబీడియోల్ | 27-01-1967 |
| | | సల్మాన్‌ఖాన్ | 27-12-1965 |
| | | హరగోబింద్ ఖురానా (నోబుల్ గ్రహీత) | 09-01-1922 |
| | | శశికపూర్ | 18-03-1938 |

## జన్మ సంఖ్య - 9, డెస్టినీ నంబరు - 7

**9/7 వ్యక్తులు పైకి ధైర్యంగా కనిపించినా పిరికివారు. జీవితంలో అన్ని భోగాలు అనుభవిస్తారు. ధనవంతులుగా ఉన్నప్పటికీ సమస్యలు ఉంటాయి. వీరు తమ కష్టాలు ఎవరికీ చెప్పరు.**

ఏ నెలలోనైనా 9, 18, 27 తేదీలలో జన్మించిన వారి విధి సంఖ్య 7 అవుతుందో వారు ఈవర్గంలోకి వస్తారు. జనన తేదీ, నెల, సంవత్సరం అంకెల మొత్తం కలుపగా వచ్చే సంఖ్య విధి సంఖ్య. వీరు అంగారకుడు, కేతు గ్రహ ప్రభావంలోకి వస్తారు. అంగారక, కేతు గ్రహాల సంఖ్యలకు అనుగుణంగా వీరి పేరు ఉన్నట్లయితే, వీరు జీవితంలో అన్ని సుఖభోగాలు అనుభవిస్తారు. పైకి ధైర్యంగా కనిపించినప్పటికీ వీరు చాలా పిరికి వారు. సరియైన పేరు లేకపోతే ఒడిదుడుకులు ఎదుర్కొంటారు. చిత్త చాంచల్యం, అనారోగ్యంతో బాధపడవలసి వస్తుంది. మానసిక వ్యధకి లోనవుతారు.

ప్రకృతి దృశ్యాలు, పశుపక్ష్యాదులు లాంటివి చూసినపుడు మానసిక ప్రశాంతత పొందుతారు. వీరు అందంగా ఉండి చూపరులను ఆకట్టుకొంటారు. సంపన్నులుగా ఉన్నా సమస్యలు ఉంటాయి. మంచి విషయ పరిజ్ఞానం కలిగి ఉంటారు. దైవ భక్తి పరాయణులు. భౌతిక సుఖాలు, శృంగారం లాంటి వాటిపై ఆసక్తి ఎక్కువ చూపుతారు. వీరు మంచి పనిమంతులు, కష్టించి పని చేస్తారు, అపజయం ఎదురైనపుడు ఒంటరిగా ఉంటారు. తమ కష్టాల గురించి ఎవరికీ చెప్పరు. మనసులోనే బాధపడుతుంటారు. కష్ట సమయంలో తాత్విక ధోరణితో మాట్లాడుతుంటారు. వృత్తి నిపుణులు, రచయితలు, ఉన్నతోద్యోగులు, వ్యాపారస్తులు ఈ వర్గంలోకి వస్తారు. వీరికి దైవభక్తి ఎక్కువ, మరియు వైద్యం, ఫార్మసీ, నర్సింగ్ లాంటి జాబ్‌లు చేస్తే వారి దగ్గరకు వచ్చే వారు చాలా ప్రయోజనం పొందుతారు.

### పేరు పెట్టే విధానం

శుక్రుడు, బుధుడికి సంబంధించిన సంఖ్యలలో వీరు పెట్టుకుంటే మంచిది. శుక్రుడి సంఖ్యలు 15, 24, 33, 42 మొ॥నవి. బుధుడి సంఖ్యలు : 23, 32, 41, 50, 59 మొ॥నవి.

## రాణించే రంగాలు

స్టీలు వ్యాపారం, వ్యవసాయం, కాంట్రాక్టు పనులు, రవాణారంగం వీరికి అనుకూలం

## వ్యాధులు

కీళ్ళ నొప్పులు, వెన్ను నొప్పి, నరాల వ్యాధులు, మానసిక సమస్యలు, రక్తపోటు లాంటివి బాధిస్తాయి.

## సూచనలు

| | | |
|---|---|---|
| లక్కీ నంబర్లు | - | 5, 6 |
| అన్‌లక్కీ నంబర్లు | - | 8 |
| లక్కీ తేదీలు | - | 5, 6, 14, 15, 23, 24 |
| అన్‌లక్కీ డేట్స్ | - | 8, 17, 26 |
| లక్కీ కలర్స్ | - | పసుపు, లేతనీలం |
| అన్‌లక్కీ కలర్స్ | - | లేవు |
| అదృష్ట దినాలు | - | ఆదివారం, సోమవారం, మంగళవారం |
| లక్కీ వివాహ తేదీలు | - | 1, 6, 9, 10, 15, 18, 19, 24, 27, 28 |
| రెమిడీస్ | - | శివ ఆరాధన, పార్వతిదేవిని ఆరాధించటం, అనాథలకు, వృద్ధాశ్రమాలలో అన్నదానం, రక్తదానం చేయటం. |
| ఉదా | - | స్వరాజ్‌పాల్ 18-02-1931 (పారిశ్రామిక వేత్త) |

మంచి సంఖ్యా శాస్త్ర నిపుణుడిని సంప్రదించి, వీరు తగు పేరు మార్పు చేసుకుంటే జీవితం సాఫీగా ఉంటుంది. లేకపోతే మానసిక అశాంతి తప్పదు.

## జన్మ సంఖ్య - 9, డెస్టినీ నంబరు - 8

**9/8 వ్యక్తులు దృఢకాయులు. వీరికి లోకజ్ఞానం ఎక్కువ. ప్రయాణాలు చేస్తుంటారు. రాజకీయ నాయకులుగా, ఇంజినీర్లుగా రాణిస్తారు.**

ఏ నెలలోనైనా 9, 18, 27 తేదీలలో జన్మించిన వారి విధి సంఖ్య 8 అవుతుందో వారు ఈ వర్గంలోకి వస్తారు. వీరు అంగారకుడు, శని గ్రహాల ప్రభావంలో ఉంటారు. వీరు దృఢకాయులు. మానసిక స్థైర్యం కలిగి స్పష్టమైన ఆలోచనా విధానం కలిగి ఉంటారు. లోకజ్ఞానం ఎక్కువ. కష్టించి పనిచేసే గుణం కలవారు. ఏ పనైనా చాలా చక్కగా, పొందికగా చేస్తారు. దైవ భక్తి కూడా వీరికి ఎక్కువ. వీరు చేసే వృత్తిలో ఉన్నతస్థితిని పొందుతారు. చక్కగా మాట్లాడి అందరినీ ఆకట్టుకుంటారు. సరియైన పేరు ఉన్నట్లయితే అన్ని సంపదలు, భోగాలు అనుభవిస్తారు.

వీరు ఇంజనీరింగ్‌తో పాటు ఎం.బి.ఎ, ఎల్.ఎల్.బి. లాంటి సబ్జెక్ట్స్ చదువుతారు. వీరికి చక్కటి వాక్పటిమ ఉంటుంది. న్యాయాధిపతులుగా మంచి పేరు సంపాదిస్తారు. ప్రయాణాలు చేస్తూ ఉంటారు. అదే విధంగా సరియైన పేరు లేకపోతే, అన్ని రకాల ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఆర్థిక పరంగా, ఆరోగ్య పరంగా ఇబ్బందులు వస్తాయి. వీరు ఇంజినీర్లుగా, రాజకీయ నాయకులుగా, అధికారులుగా ఉన్నతస్థాయికి చేరుకోగలుగుతారు. సరియైన పేరు ఉన్నట్లయితే వీరు పరిశ్రమలు, వ్యాపారం చేసి సంపద గడిస్తారు.

### పేరు పెట్టే విధానం

బుధుడు, శుక్రుడు, అంగారకుడి సంఖ్యలకు అనుగుణంగా వీరు పేరు పెట్టుకోవాలి. **అంగారకుడి సంఖ్యలు :** 18, 27, 36, 54 మొ॥నవి. **శుక్రుడి సంఖ్యలు :** 24, 33, 42, 51 మొదలైనవి. **బుధుడి సంఖ్యలు :** 23, 32, 41, 50 మొదలగునవి.

### రాణించే రంగాలు

ఉక్కు రంగం, వ్యవసాయం, నిర్మాణ రంగం, రవాణా, వ్యాపారాలు, న్యాయవాదులు అనుకూలం

**వ్యాధులు**

వెన్నునొప్పి, కీళ్ళనొప్పులు, రక్తపోటు, శ్వాసకోశ వ్యాధులు, నరాల బలహీనత, ఉదర సమస్యలతో బాధపడతారు. సరైన చికిత్స తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది.

**సూచనలు**

| | | |
|---|---|---|
| లక్కీ నంబర్లు | - | 5, 6, 9 |
| అన్‌లక్కీ నంబర్లు | - | 2, 7 |
| లక్కీ తేదీలు | - | 5, 6, 9, 14, 15, 18, 23, 24, 27 |
| అన్‌లక్కీ డేట్స్ | - | 2, 7, 11, 16, 20, 25, 29 |
| లక్కీ కలర్స్ | - | పసుపు, ఎరుపు, నీలం |
| అన్‌లక్కీ కలర్స్ | - | కాఫీ రంగు, నలుపు |
| అదృష్ట దినాలు | - | మంగళవారం, బుధవారం, శనివారం |
| లక్కీ వివాహ తేదీలు | - | 1, 6, 9, 10, 15, 18, 19, 24, 27, 28 |
| రెమిడీస్ | - | సుబ్రహ్మణ్య స్వామి ఆరాధన, శనికి తైలాభిషేకం, తండ్రివర్గం వారికి విరివిగా సహాయం చేయడం. |
| ఉదా | - | రామ్‌చరణ్ తేజ 27-03-1985 |
| | | గోపాలకృష్ణ గోఖలే 09-05-1866 |

## <u>జన్మ సంఖ్య - 9, డెస్టినీ నంబరు - 9</u>

**9/9 వ్యక్తులపై అంగారక(కుజ) గ్రహ ప్రభావం సంపూర్ణంగా ఉంటుంది. మంచి అందం కలిగి ఉంటారు. పరోపకారం చేస్తారు. ప్రయాణాలు చేస్తుంటారు. రచయితలుగా, కళాకారులుగా, వృత్తి నిపుణులుగా రాణిస్తారు.**

ఏ నెలలోనైనా 9, 18, 27 తేదీలలో జన్మించి, వారి విధి సంఖ్య 9 అవుతుందో వారు ఈ వర్గంలోకి వస్తారు. వీరు అంగారక గ్రహ ప్రభావంలో ఉంటారు. వీరు చాలా చురుకైన వారు. స్ఫురద్రూపం కలిగి అందరినీ ఆకర్షిస్తారు. కష్టించి పని చేసే స్వభావం,

పరోపకారం కలిగి ఉంటారు. స్నేహితులను ఆదుకొంటారు. స్పష్టమైన ఆలోచనా విధానం కలిగి ఉంటారు. ఆలోచనలలో స్పష్టత ఉంటుంది. కొత్త కొత్త విషయాలు, కొత్త పద్ధతులు తెలుసుకుంటూ ఉంటారు. ప్రయాణాలు చేస్తుంటారు. దాని వలన మరింత అనుభవం, లోకజ్ఞానం సంపాదిస్తారు. వీరు చాలా ధైర్యవంతులు, ఇంజనీరింగ్ ముఖ్యంగా సివిల్, మెకానికల్ రంగాలలో రాణిస్తారు. భూములు, మైన్స్ రంగాలలో బాగా రాణిస్తారు.

వీరు కళాత్మక హృదయం కలిగి ఉంటారు. వీరి పరోపకార బుద్ధి వలన అందరూ గౌరవిస్తుంటారు. ప్రకృతి దృశ్యాలు, అందమైన కళాత్మక వస్తువులు, విలాస వస్తువులు లాంటివి చూసి ఆనందిస్తారు. రచయితలు, వృత్తి నిపుణులు, కళాకారులు, వ్యాపారవేత్తలుగా రాణిస్తారు. ఎంతో శ్రమకు ఓర్చి ఉన్నత స్థితి చేరుకుంటారు. కళలు, రచనా వ్యాసంగాల వల్ల ఖ్యాతిని పొందుతారు. ఇవన్నీ వీరి సంఖ్యకి అనుగుణమైన పేరు ఉన్నపుడు మాత్రమే జరుగుతాయి. అలా లేనిచో కష్టానికి తగ్గ ఫలితం లభించదు. కుటుంబ జీవితం, ఆరోగ్యం దెబ్బతింటాయి.

## పేరు పెట్టే విధానం

అంగారకుడు, బుధుడు, శుక్రుడి సంఖ్యలకు అనుగుణంగా పేరు పెట్టుకోవాలి. **అంగారకుడి సంఖ్యలు :** 27, 36, 54 మొ॥నవి. **బుధుడి సంఖ్యలు :** 23, 32, 41, 50, 59 మొ॥నవి. **శుక్రుడి సంఖ్యలు:** 24, 33, 42, 51, 60, 69 మొ॥నవి.

## రాణించే రంగాలు

కాంట్రాక్టు పనులు, నిర్మాణరంగం, ఫ్యాన్సీ వస్తు విక్రయం లాంటివి అనుకూలం.

## వ్యాధులు

కీళ్ళనొప్పులు, ఉదర సంబంధిత వ్యాధులు, రక్తపోటు, కంటి సమస్యలు, హృదయ సంబంధిత వ్యాధులు బాధిస్తాయి. సరైన చికిత్స తీసుకుంటే ఉపశమనం లభిస్తుంది.

## సూచనలు

లక్కీ నంబర్లు - 5, 6, 9
అన్‌లక్కీ నంబర్లు - 2, 7

| | | |
|---|---|---|
| లక్కీ తేదీలు | - | 3, 5, 6, 9, 12, 14, 15, 18, 21, 23, 24, 27, 30 |
| అన్‌లక్కీ డేట్స్ | - | 2, 7, 11, 16, 20, 25, 29 |
| లక్కీ కలర్స్ | - | నీలం, పసుపు, ఎరుపు, బ్లూ, సాండల్ |
| అన్‌లక్కీ కలర్స్ | - | ఆకుపచ్చ |
| అదృష్ట దినాలు | - | మంగళవారం, బుధవారం, శుక్రవారం |
| లక్కీ వివాహ తేదీలు | - | 1, 3, 6, 9, 10, 12, 15, 18, 19, 21, 24, 27, 28 |
| రెమిడీస్ | - | సుబ్రహ్మణ్య స్వామి, దుర్గామాతను ఆరాధించడం, రక్తదానం చేయటం. |
| ఉదా | - | మాతా అమృతానందమయి 27-09-1953 |

# 3వ భాగం
# అక్షరాలతో అనుబంధం

# నామసంఖ్య తెలుసుకునే విధానం మరియు పేరుమార్పు

**ఉదాహరణ : 1)** ఒక వ్యక్తి పేరు గణేష్. ఈ పేరును ఇంగ్లీషులో రాస్తే GANESH అవుతుంది. 272 పేజీలో పట్టిక A ప్రకారం ప్రతీ ఆంగ్ల అక్షరానికి పట్టిక A లో సూచించిన విధంగా అంకెలని అమర్చి, అన్ని అంకెలను కూడగా 'నామసంఖ్య' లేదా నేమ్ నంబర్ వస్తుంది.

G+A+N+E+S+H నామవిలువ..

3+1+5+5+3+5 = 22. ఇతని నామ సంఖ్య '22' అవుతుంది.

**ఉదాహరణ : 2)** కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు శ్రీమతి సోనియా గాంధీ గారి జన్మసంఖ్య, విధిసంఖ్య, నామ సంఖ్యని తెలుసుకుందాం. సోనియాగాంధీ గారి జన్మ తేదీ 9-12-1946

ఈవిడ జన్మ సంఖ్య లేదా బర్త్ నంబర్ = '9' అవుతుంది.

ఈవిడ విధి సంఖ్య లేదా డెస్టినీ నంబర్ = '5' అవుతుంది.

9+1+2+1+9+4+6 = 32 = 3+2 = 5

**SONIA GANDHI**

S+O+N+I+A+G+A+N+D+H+I =

3+7+ 5+ 1+1+3+ 1+ 5+ 4+ 5+1 = 36

ఈవిడ నామసంఖ్య 36 అవుతుంది.

**ఉదాహరణ : 3)** ప్రముఖ సినిమా నటుడు రజనీకాంత్ జన్మసంఖ్య, విధిసంఖ్య, నామ సంఖ్యని తెలుసుకుందాం. ఈయన జన్మ తేదీ 12-12-1950

ఈయన బర్త్ నంబర్ లేదా జన్మ సంఖ్య 12=1+2=3 = '3' అయింది.

విధి సంఖ్య '3' అయింది

1+2+1+2+1+9+5+0=21=2+1=3

నామ సంఖ్య '23' అది ఎలా అంటే

RAJANI KANT

R+A+J+A+N+I+K+A+N+T =

2+ 1+1+1+ 5+1+2+ 1+ 5+ 4 = 23

**జన్మసంఖ్యను, విధి సంఖ్యను మనం మార్చలేం కాని జన్మసంఖ్యకు, విధిసంఖ్యకు అనుగుణమైన వైబ్రేషన్స్ వచ్చేలా నామసంఖ్యను మార్చుకోవచ్చు. ఇది మన చేతుల్లో ఉంది. నామ సంఖ్యను మార్చుకోవడం ద్వారా అదృష్టాన్ని, విజయావకాశాలను పెంచుకోవచ్చు.**

పాఠకులకు ఒక సందేహం కలుగుతుంది. నామ సంఖ్య అంటే ఏమిటీ అని. పేరును 3 విధాలుగా చెప్పవచ్చు.

1. పూర్తిపేరు, అంటే ఇంటిపేరుతో సహా (బర్త్ సర్టిఫికేట్‌లో ఉన్నపేరు)
   ఉదా : మహమ్మద్ దావూద్ MOHAMED DAWOOD.
   (కొంతమంది వ్యక్తులు వారి ఇంటిపేరుతో అందరిచేత పిలువబడతారు. ఉదాహరణకు గుమ్మడి, రాళ్ళపల్లి, వేటూరి ... ఈ విధంగా ఇంటి పేరుతో పిలవబడటం వలన వారి పూర్వీకులు చేసిన పుణ్యఫలం వీరికి దక్కి పేరు ప్రఖ్యాతులు పొందుతారు.)
2. ఇనీషియల్స్‌తో ఎక్కడైనా సంతకం చేసినపుడు పూర్తిపేరుతో ఇలా చేస్తారు.MD. DAWOOD
3. మహమ్మద్ దావూద్ అనే నన్ను అందరూ “దావూద్” అని పిలుస్తారు.

ఇపుడు ఈ పై మూడింటిలో నామసంఖ్యను లెక్కించటానికి ఏది తీసుకోవాలి అనే సందేహం వస్తుంది. నా అనుభవం ప్రకారం ముందుగా, అందరూ నన్ను పిలిచే పేరు “దావూద్” నా జన్మదినం ప్రకారం సరిచేసుకోవాలి. ఆ తరువాత సంతకం చేసే పేరు, ఇంటిపేరుతో సహా, అంటే MD. DAWOOD ను జన్మదినానికి అనుగుణంగా సరిచేసుకోవాలి. అలా కుదరకపోతే వేరే ఇనీషియల్స్ కానీ, తండ్రి లేదా తాత పేరులోని అక్షరాలు గానీ, లేదా వేరే ఏదైనా పదాన్ని గానీ కలిపి పేరు సరిచేసుకోవాలి. ఆ తరువాత బర్త్ సర్టిఫికేటులో ఉన్న పేరు అంటే MOHAMED DAWOOD ను జన్మదినానికి అనుగుణంగా సరిచేయటానికి ప్రయత్నించాలి. పేరు ఎలా మార్చుకున్నారో, అలాగే వ్రాస్తూ, అలాగే పిలిపించుకోవాలి.

ఎవరి పైరేనా పేరు వారి జన్మదినసంఖ్యతో ఏ విధంగానైనా సఖ్యత లేకపోతే పేరులో కొత్తగా పదాలు చేర్చవచ్చు.

**ఉదా :** SUBBA RAO ఇతని పేరు ఇతని జన్మదిన సంఖ్యతో కుదరకపోతే, అపుడు VENKATA SUBBA RAO గా మార్చుకొని జన్మదిన సంఖ్యతో సఖ్యత ఉన్నట్లుగా చూసుకోవాలి. ఆ తరువాత ఆ పేరును Gazette లో Notification చేయించుకొని ఆ పేరును వాడితే స్వల్పకాలంలోనే జీవితంలో ఉన్నతస్థితిని పొందుతారు.

ఒక్కొక్కసారి ఇంటిపేరుతో సహా, పేరు జన్మదిన సంఖ్యకు అనుకూలంగా లేకపోతే, అందరూ పిలిచే పేరును జన్మదిన సంఖ్యకు అనుకూలంగా మార్పుచేసుకొని, ఇంటిపేరు లేకుండా, అలాగే పేరు వ్రాస్తూ, పిలిపించుకుంటే, ఆ పేరులోని ప్రకంపనలు మీ మీద పనిచేసి మెదడు ఏక్టివేట్ అవ్వటం, మంచివైపు మరియు జీవితంలో ఉన్నత స్థానం పొందాలనే ఆలోచనలు కలగటం జరుగుతుంది.

మంచి నామప్రకంపనలు ఉండటం వలన మీ పేరులో పాజిటివ్ వైబ్రేషన్స్, మీ ప్రక్కవారిపై కూడా పనిచేసి, వారికి మీ యందు పాజిటివ్ ధృక్పథం కలిగి, ఆశించిన దాని కంటే ఎక్కువగా వారు మీకు సహాయసహకారాలు అందిస్తారు. అందువలన పాఠకులకు నా మనవి – ఏ పేరైనా ముందుగా అందరూ పిలిచే పేరును న్యూమరాలజీ ప్రకారం మార్పు చేయించుకోవాలి. ఆ మార్పు చెందిన పేరును అందరూ ఉచ్చరిస్తే మంచిది. కానీ మంచి నామ సంఖ్యకోసం పేరును ముక్కలు ముక్కలుగా చేయటం, అర్థం లేని అక్షరాలు కలపటం లాంటివి చేయవద్దు.

ముందుగా పేరులోని Phonetics అంటే పిలిచే పద్ధతి కూడా ముఖ్యం. జన్మదిన సంఖ్యతో నామసంఖ్య కుదరకపోతే, వేరే చిన్న పేరును కలపటం లేదా పేరులో కొంతభాగం తీసివేయటం లాంటివి చేసి, పేరును జన్మతేదికి అనుగుణంగా పెట్టుకొని, అలాగే పిలిపించుకుంటూ, అలాగే సంతకం చేస్తూ ఉంటే మంచిది. అన్నింటికన్నా ముఖ్యం పిలిపించుకునే పేరు యొక్క వైబ్రేషన్ బాగా ఉంటే మనిషి జీవితంలో అన్ని సవ్యంగా జరుగుతాయి.

# నేమాలజీ - నామ సంఖ్యలు

మానవ జీవితం సంఖ్యలతో ముడిపడి ఉంటుంది. వ్యక్తుల యొక్క వ్యక్తిత్వం, అస్థిత్వం, విధి విధానం, దశ, దిశానిర్దేశం మొదలైనవి ఆ వ్యక్తికి సంబంధించిన సంఖ్యలతో ముడిపడి ఉంది. పుట్టినరోజు, పెళ్లిరోజు, ఉద్యోగం వచ్చిన రోజు, పిల్లలు పుట్టిన రోజులు.. ఇలా చాలా.. అయితే ఇంకో ముఖ్యమైన సంఖ్య కూడా వ్యక్తుల జీవిత గమనాన్ని ప్రభావితం చేస్తుంది. అదే నామ సంఖ్య!

జన్మించిన సమయంలో మీకు పెట్టిన పేరు మీ వ్యక్తిత్వాన్ని, మీలో ఉన్న శక్తి సామర్థ్యాలను తెలియజేస్తుంది. నామ సంఖ్య వ్యక్తులు వారి జీవితంలో ఎన్నుకునే దిశను, మార్గాన్ని, గమ్యాన్ని సూచిస్తుంది. ఆ మార్గంలో ఎదురయ్యే అవకాశాలు, అవరోధాలు కూడా నామసంఖ్య చూసి తెలుసుకోవచ్చు. జీవిత గమనాన్ని తెలియజేసేది నామసంఖ్య. యంత్రానికి మంత్రం లాగా వ్యక్తులకు వారి పేర్లతో సరిగా అనుసంధానం జరగాలి.

పేరు అక్షరాల సమాహారం. వర్ణమాలలో ప్రతి అక్షరానికి ఒక సంఖ్య ఉంటుంది. పేరులో ఉన్న ఈ అక్షరాల "సంఖ్యలను" కలుపగా వచ్చే సంఖ్య నామసంఖ్య. ఈ అక్షరాల ప్రకంపనలు వ్యక్తులపై మంత్రంలా పనిచేస్తాయి.

ఆంగ్ల వర్ణమాలను అనుసరించి చాల్దియన్, పైథాగరస్ పద్ధతులలో అక్షర సంఖ్యలు ఈ కింది విధంగా ఉంటాయి.

**పట్టిక: A (చాల్దియన్)**

| | | | | | |
|---|---|---|---|---|---|
| A, I, J, Q, Y | = | 1 | E, H, N, X | = | 5 |
| B, K, R | = | 2 | U, V, W | = | 6 |
| C, G, L, S | = | 3 | O, Z | = | 7 |
| D, M, T | = | 4 | F, P | = | 8 |

ఇందులో ఏ అక్షరానికి 9 సంఖ్య ఇవ్వలేదు. కారణం, ఏ సంఖ్యకైనా 9 సంఖ్యను కలిపితే వచ్చే చివరి మొత్తం ఆ సంఖ్యయే అవుతుంది. ఉదా: 5+9=1+4=5. ఇప్పుడు వ్యక్తుల యొక్క పేరులో ఉన్న అక్షరాల సంఖ్యలను పై పద్ధతి ప్రకారం కలుపగా వచ్చేదే "నామ సంఖ్య". పైథాగరస్ అక్షర సంఖ్యలు ఈ కింది విధంగా ఉంటాయి.

**పట్టిక: B (పైథాగరస్)**

| | | | | | |
|---|---|---|---|---|---|
| A, J, S | = | 1 | F, O, X | = | 6 |
| B, K, T | = | 2 | G, P, Y | = | 7 |
| C, L, U | = | 3 | H, Q, Z | = | 8 |
| D, M, V | = | 4 | I, R | = | 9 |
| E, N, W | = | 5 | | | |

సాధారణంగా ఈ నామ సంఖ్యలు 1 నుండి 108 వరకు ఉంటాయి. ఇప్పుడు నామ సంఖ్యలు 1 నుండి 108 వరకు ఉన్న వ్యక్తుల లక్షణాలు తెలుసుకుందాం.

## నామ సంఖ్య-1

**ఈ నామ సంఖ్య చాలా అరుదు.**
**మొదట అభివృద్ధి ఉన్నా తరువాత సమస్యలు ఉంటాయి**

సాధారణంగా నామసంఖ్య 1 ఉండడం అనేది అరుదు. ఈ వ్యక్తులు మొదట్లో అభివృద్ధి సాధించినా తరువాత సమస్యల పాలవుతారు. ఇతర అంకెలతో కలిసినప్పుడే ఈ సంఖ్య ప్రభావవంతంగా ఉంటుంది. కాబట్టి ఈ నామసంఖ్యను మార్చుకుంటేనే మంచిది. వ్యక్తుల కంటే వాహనాలకు, గృహాలకు, ఆఫీసులకి ఈ సంఖ్య మంచిది.

## నామ సంఖ్య-2

**ఇది దిగులు, భయం, మానసిక వ్యాకులత కలిగిస్తుంది**

ఈ సంఖ్య అంతగా అభివృద్ధిని కలిగించదు. మానసిక వ్యాకులత, భయం, దిగులు కలిగిస్తుంది. ఆత్మన్యూనతాభావం కలిగిస్తుంది. ఈ వ్యక్తులకు ఊహాశక్తి, ఆదర్శభావాలు ఉంటాయి. విలాస వస్తువులు, ఆకుపచ్చని వస్తువుల వ్యాపారం లాభాన్ని కలిగిస్తాయి.

## నామ సంఖ్య-3

**ఇది ఆలోచనా శక్తిని పెంచి అభివృద్ధి కలిగిస్తుంది**

ఈ సంఖ్యకు గురు గ్రహానుగ్రహం ఉంటుంది. ఆలోచనా శక్తిని పెంపొందింపజేసి స్వశక్తితో అభివృద్ధి చెందునట్లు చేస్తుంది. ఉన్నత విద్య అభ్యాసం చేసి జ్ఞానాన్ని, వివేకాన్ని గడిస్తారు. సుఖమయ కుటుంబ జీవితం ఉంటుంది. గురుగ్రహ ప్రభావం వలన అభివృద్ధి స్థిరంగా ఉంటుంది. చదువులో రాణిస్తారు. సంఘంలో గౌరవ మర్యాదలు లభిస్తాయి.

## నామ సంఖ్య-4

**ఇది మంచి సంఖ్య కాదు. శ్రమకు ఫలితం దక్కదు.**

ఇది అంత మంచి సంఖ్య కాదు. వీరి జ్ఞానాన్ని ప్రతిభను ఇతరులు వాడుకుంటారు గానీ వీరికి పనికి రాదు. శ్రమకు తగ్గ ఫలితం లభించదు. అనారోగ్య సమస్య ఉంటుంది. అతిగా మాట్లాడటం వలన చెడ్డపేరు వస్తుంది. మానసిక వ్యాకులత ఉంటుంది. వీరికి తొందరగా కోపం వస్తుంది. 4 అక్షరాల పేరు కూడా అంత మంచిది కాదు.

## నామ సంఖ్య-5

**ఇది జీవితంలో ఉన్నత స్థాయికి తీసుకెళ్తుంది**

ఈ సంఖ్య "బుధుడి" ప్రభావంలో ఉంటుంది. ఈ సంఖ్య ఉన్న వారు జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకుంటారు. వీరికి గల నిజాయితీ, పనియందు నిబద్ధత, వినయ విధేయతలు, పెద్దల పట్ల గౌరవ భావం, వీరికి మంచి పేరు ప్రతిష్ఠలను తెచ్చిపెడతాయి. ధన సంపాదన బాగా చేస్తారు.

ఆధునిక భావాలు, కళాత్మక హృదయం కలిగిన వారై ఉంటారు. ఆకర్షణ శక్తి కలిగి సంఘంలో ఉన్నత స్థానంలో ఉంటారు. వీరికి అవకాశాలు అప్రయత్నంగా వస్తాయి. వీరు ధనాన్ని బాగా సంపాదిస్తారు. జీవితంలో బాగా రాణిస్తారు.

## నామ సంఖ్య-6

**ఇది కలవారు శాంతి కాముకులు**

ఈ సంఖ్య శుక్రుడి ప్రభావంలో ఉంటుంది. చాలా ఆకర్షణగా ఉండి సుఖ సంతోషాలతో సంతృప్తికరమైన జీవితం ఉంటుంది. వీరు శాంతికాముకులు. స్నేహితులు ఎక్కువగా ఉంటారు. వారి వలన ప్రయోజనం కూడా పొందగలుగుతారు. పెద్ద పెద్ద ప్రణాళికలు వేస్తారు. పేద కుటుంబంలో పుట్టినా మంచి భవిష్యత్ ఉంటుంది. వీరికి పెండ్లి అయిన తరువాత జీవితంలో అభివృద్ధి ఉంటుంది.

## నామ సంఖ్య-7

**ఇది ఆధ్యాత్మిక శక్తిని కలిగిస్తుంది**

ఈ సంఖ్య కేతు ప్రభావంలో ఉంటుంది. ఈ సంఖ్య గొప్ప ఆధ్యాత్మిక శక్తిని కలిగిస్తుంది. వీరి శ్రమ, వివేకం ఇతరులకు ఉపయోగకరంగా ఉంటుంది. సముచిత సలహాలు ఇవ్వటంలో వీరు నిపుణులు. కానీ వీరి జీవితం మాత్రం స్థిరంగా ఉండదు. కుటుంబ సౌఖ్యం అంతగా ఉండదు. ఆటంకాలు కలుగుతుంటాయి. ఆధ్యాత్మిక పరులుగా ఉంటారు. జీవితంలో ఎత్తు పల్లాలు ఎక్కువగా ఉంటాయి. ముఖ్యంగా కంపెనీలకు ఈ పేరు పెట్టకూడదు.

## నామ సంఖ్య-8

**ఇది న్యాయబుద్ధిని, ఆధ్యాత్మికతను కలిగిస్తుంది**

ఈ సంఖ్య 'శని' ప్రభావంలో ఉంటుంది. ఈ సంఖ్య కల వారు ఎన్నో ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొని వారి గమ్యాన్ని చేరుకుంటారు. ఆకస్మిక ప్రమాదాలు కలుగవచ్చు. ఆధ్యాత్మిక భావనలు ఎక్కువగా ఉంటాయి. శని న్యాయనిర్ణేత కాబట్టి, వీరికి న్యాయబుద్ధి ఉంటుంది. ఆధ్యాత్మిక గురువులకు పీఠాధిపతులకు ఈ సంఖ్య అనుకూలమైనది. వీరు చేసిన మేలును ఇతరులు గుర్తించరు. 50 సంవత్సరాలు దాటిన తరువాత అభివృద్ధి ఉంటుంది. చిన్నతనంలో చాలా కష్టాలు, అపనిందలు పడవలసి వస్తుంది. ఇది మంచి నామసంఖ్య కాదు.

## నామ సంఖ్య-9

**ఇది వాక్పటిమను కలిగిస్తుంది**

ఈ సంఖ్య కుజుని ప్రభాంలో ఉంటుంది. వీరు ఏటికి ఎదురీది, లక్ష్యసాధన చేస్తారు. వీరికి ధైర్యసాహసాలు ఉంటాయి. దీని వలన వీరు ఎంతో అనుభవం గడిస్తారు. విదేశీ ప్రయాణాలు చేస్తారు. వ్యతిరేకతను ఎదుర్కొంటారు. వీరికి మనోబలం ఎక్కువ, మంచి వాక్పటిమ కలిగి అభిమానులను సంపాదిస్తారు. మధ్య వయస్సు తర్వాత జీవితంలో సుఖాలు అనుభవిస్తారు. కానీ స్త్రీల వలన అపఖ్యాతి కలుగుతుంది.

## నామ సంఖ్య-10

**ఇది జీవితంలో ఆటుపోట్లను కలిగిస్తుంది.**

ఈ సంఖ్య గల వారు తమ చర్యలకు అనుగుణంగా, మంచి పేరు లేదా చెడ్డ పేరు సంపాదిస్తారు. నిజాయితీ కలిగి ఉంటే, చాలా ప్రాముఖ్యత పొందుతారు. వీరి జీవితంలో ఆటుపోట్లు ఉంటాయి. ఒకటి, పక్కనే సున్నా ఉండటం వలన ఇలా జరుగుతుంది. ఇతరులు కష్టపడి సంపాదించినది, వీరు సులభంగా సంపాదించగలుగుతారు. ధనం లభించిన వెంటనే బద్ధకస్తులుగా మారిపోతారు. వీరికి ఎప్పుడూ ఆర్థిక ఇబ్బందులు ఉండవు. జీవితంలో ఎత్తుపల్లాలు ఎక్కువగా ఉంటాయి. ఈ నామ సంఖ్య అంత మంచిది కాదు.

## నామ సంఖ్య-11

**ఇది కష్టాలు, సమస్యలు కలిగిస్తుంది**

వీరికి కష్టాలు, సమస్యలు ఎదురవుతుంటాయి. దైవభక్తి, ప్రార్థనలతో స్వాంతన పొంది కొంత విజయం సాధిస్తారు. మనసు నిలకడగా ఉండకపోవడం వలన అయోమయానికి గురవుతారు. కానీ దైవకృప లభిస్తే మాత్రం చక్కగా రాణిస్తారు. 7,16,25 తేదీలలో జన్మించిన వారికి ఈ సంఖ్య అనుకూలం. వీరి ఆప్త మిత్రులు అవసరాలలో అక్కరకు రారు.

## నామ సంఖ్య-12

**ఈ సంఖ్య కలవారు అంతగా రాణించరు**

సూర్యుని సంఖ్య-1, చంద్రుని సంఖ్య-2, మొత్తం సంఖ్య 1+2=3, గురుడు కలిసి ఉన్న నామసంఖ్య ఇది. సూర్యచంద్రులు ఒకే సారి ఎలా ఉదయించరో, వీరు కూడా అంతగా రాణించరు. ఇతరుల కోసం పాటు పడుతుంటారు. మంచి వక్తలుగా ఉంటారు. సంభాషణా చాతుర్యం కలిగి ఉంటారు. ఇతరుల కష్టాలలో పాలు పంచుకొని వారి సంక్షేమానికి కృషి చేస్తారు. వీరు చాలా మధన పడుతుంటారు. ఇతరులకు చెప్పకోలేని మానసిక అసంతృప్తితో ఉంటారు. ఈ సంఖ్యలో పేరు పెట్టుకోవడం మంచిది కాదు.

## నామ సంఖ్య-13

**ఇది మంచి సంఖ్య కాదు**

ఈ సంఖ్యను పాశ్చాత్య దేశాలలో చాలా దురదృష్ట సంఖ్యగా భావిస్తారు. దుర్ఘటనలకు, ప్రమాదాలకు, విపత్తులకు ఈ సంఖ్య సంకేతంగా భావిస్తారు. ఈ సంఖ్యగల వారు Opposite Sex వలన అపఖ్యాతి పొందుతారు. అనారోగ్యం కూడా పీడిస్తుంది. కొందరికి ఉన్నత స్థితి సంపద కలిగినా, ఈ సంఖ్య ప్రభావం వలన క్రూరంగా ప్రవర్తించే అవకాశం ఉంది. 1,10,19,28,6,15,24 తేదీలలో జన్మించిన వారికి ఈ నామసంఖ్య పెద్ద దుష్ప్రభావం చూపదు. వీరికి విజయం తరువాత అపజయం ఉంటుంది. ఇది మంచి సంఖ్య కాదు.

## నామ సంఖ్య-14

**ఇది మంచి సంఖ్య - వీరి సంపాదన వీరిపై ఆధారపడిన వారు అనుభవిస్తారు**

వీరు వృత్తి వ్యాపారాలలో విజయం సాధించి, సంపద గడిస్తారు. వీరి చుట్టూ స్నేహితులు ఎల్లపుడూ ఉంటారు. ఒక్కొక్క సారి అత్యాశకు లోనై ధనం పోగుట్టుకుంటారు. ప్రేమ, పెళ్ళి విషయాలలో జాగ్రత్త వహించాలి. ప్రకృతి శక్తులైన, గాలి, నీరు, అగ్ని మొదలైన వాటి వలన ప్రమాదం పొంచి ఉంటుంది. వీరు వాహనాలను వేగంగా

నడపకుండా ఉంటే మంచిది. మొత్తానికి ఇది చాలా మంచి సంఖ్య. కాని వీరు సంపాదించిన సొమ్ము వారి మీద ఆధారపడిన వారు అనుభవిస్తారు.

## నామ సంఖ్య-15

**ఇది ప్రాపంచిక భోగాలను కలిగిస్తుంది**

ఈ నామసంఖ్య ఉన్న వారు, ప్రాపంచిక భోగాలు అనుభవిస్తారు. వీరు ఆకర్షణీయంగా ఉండి మంచి వాక్చాతుర్యం కలిగి అందరినీ ఆకర్షిస్తారు. వీరికి నిరంతర, ఆదాయ వనరులు ఉంటాయి. లలితకళల పట్ల అభిరుచి కలిగి ఉంటారు. వీరి చుట్టూ ఉన్న వారు ఎప్పుడూ వీరి సహచర్యం కోరుకుంటారు. గొప్ప సంపద కలిగి సుఖ సంతోషాలతో ఉంటారు. కానీ జన్మతేదీ 3,12,21,30 ఉన్న వారు ధనం, చెడు మార్గాలలో సంపాదించి చెడు పనులకు వినియోగిస్తారు. క్షుద్రశక్తుల సాధన చేయటానికి కూడా వెనుకాడరు. వీరిలో కొంత పిసినారితనం ఉంటుంది.

## నామ సంఖ్య-16

**ఇది దైవకృపను కలిగిస్తుంది**

ఈ సంఖ్య గల వారికి దైవకృప ఉంటుంది. అయితే వీరు శీఘ్రంగా ఉన్నతిని సంపాదించి, అంతే శీఘ్రంగా పతనం చెందుతారు. మళ్ళీ దైవకృపతో పుంజుకుంటారు. వీరి జీవిత చక్రం ఇలా ఆటుపోటులతో ఉంటుంది. దీనికి మంచి ఉదాహరణ జపాన్ దేశం నామసంఖ్య 16 వలన ఉన్నతిని పొంది, అణుబాంబు వలన అణగదొక్కబడి మళ్ళీ ఉన్నతిని సాధించింది.

కానీ, ప్రకృతి వైపరీత్యాలు, అగ్నిపర్వతాలు, సునామీలు లాంటివి ఈ దేశాన్ని, మరల మరల వెనకకు తోస్తున్నాయి. ఈ నామసంఖ్య గలవారు దైవభక్తి కలిగి ఉంటే మంచిది. 2,11,20,29 తేదీలలో జన్మించిన వారికి ఈ నామసంఖ్య అనుకూలం. ఈ సంఖ్యతో పేరు పెట్టకుండా ఉంటే మంచిది. ముఖ్యంగా కంపెనీ పేర్లు ఈ సంఖ్యలో పెట్టకూడదు.

## నామ సంఖ్య-17

**ఇది ఇబ్బందులు, కష్టాలు కలిగిస్తుంది**

ఇందులో 1 సూర్యుని సంఖ్య, 7 కేతు సంఖ్య రెండూ కలిపితే 8, శని సంఖ్య. ఈ నామ సంఖ్య కలవారు చాలా ఇబ్బందులు. కష్టాలు ఎదుర్కొనవలసి వస్తుంది. ఈ కష్టాల వలన వీరు రాటుదేలి చాలా అనుభవం సంపాదిస్తారు. కష్టపడి చాలా సంపాదన చేస్తారు. సాహసకృత్యాలు కూడా చేస్తుంటారు. వీరు శ్రమ జీవులు కనుక చివరకు వీరిని విజయం వరిస్తుంది. అపనిందలు వచ్చినా క్రమశిక్షణతో జీవితంలో పైకి వస్తారు. వీరు మరణించిన తరువాత వీరిని కొనియాడతారు.

## నామ సంఖ్య-18

**ఇది మంచి సంఖ్య కాదు**

సూర్యుని సంఖ్య 1, శని సంఖ్య 8, మొత్తం కలిపి 9 కుజుడి సంఖ్య వస్తుంది. సూర్యునికి, శనికి ఉన్న విరోధం మూలంగా ఈ సంఖ్య అంత మంచిది కాదు. స్వార్థం, సంకుచితత్వం, కుట్ర, మోసం లాంటి గుణాలు వస్తాయి. జూదం, వ్యభిచారం, త్రాగుడు లాంటి దుర్వ్యసనాలకి లోనవుతారు.

కోర్టుకేసులు ఎదుర్కోవలసి వస్తుంది. ఆత్మ రక్షణ కోసం ఆయుధాలు ధరించే పరిస్థితి వస్తుంది. విద్యను, ఉద్యోగాన్ని వదులుకొని విదేశాలకు వెళ్ళాల్సిన పరిస్థితి వస్తుంది. కానీ ఈ సంఖ్య కొంతవరకు క్రీడాకారులకు ఉపయోగకరంగా ఉండవచ్చు. వీరు మానసిక ఆందోళనలతో వారిలో వారు మదన పడుతుంటారు. ఈ సంఖ్య నామసంఖ్యగా పెట్టకుండా ఉంటే మంచిది.

## నామ సంఖ్య-19

**ఇది చాలా మంచి సంఖ్య. అభివృద్ధి కలిగిస్తుంది**

ఇది చాలా మంచి సంఖ్య. 1,9 సంఖ్యలు (సూర్యుడు,కుజుడు) ఉండటం వలన 1 ప్రారంభానికి, 9 శిఖరానికి చిహ్నం అవటం వలన వీరి అభివృద్ధి క్రమంగా ఉండి

ఉన్నతస్థితికి చేరుతుంది. ఆరోగ్యం, ఐశ్వర్యం, మంచి కుటుంబ జీవితం వీరికి లభిస్తాయి. వయసు పెరుగుతున్నా యవ్వనంగా కనిపిస్తారు. మంచి ఉద్యోగం చేస్తూ, గౌరవాన్ని ఆర్జిస్తారు. నాయకులుగా ఎదుగుతారు. ఇతరులకు హాని చెయ్యటం, చెడు మార్గాల జోలికి వెళ్ళడం వీరికి నచ్చదు. అందువలన వీరిపై దైవ కృప ఉంటుంది. అప్రయత్నంగానే అవకాశాలు వస్తాయి. గాంధీ, లెనిన్, గవాస్కర్, వి.వి.గిరి ఈ నామసంఖ్య కలిగిన వారే.

## నామ సంఖ్య-20

**ఇది శాంతిని, సహకారాన్ని కలిగిస్తుంది**

ఈ సంఖ్య గల వారు శాంతి కాముకులుగా ఉంటారు. కష్టాలలో ఉన్న వారిని ఆదుకునే మనస్తత్వం వీరికి ఉంటుంది. ఎందరో వీరి వద్దకు వచ్చి సలహాలు తీసుకుంటుంటారు.

ఈ సంఖ్య ఆధ్యాత్మిక సంబంధమైనది. ఆధ్యాత్మిక గురువులకి ఉపయోగకరంగా ఉంటుంది. వీరు కోపం తగ్గించుకుంటే చాలా మంచిది. స్వార్థం ఉంటే మాత్రం అపజయం తప్పదు. ఇది మంచి సంఖ్య కాని వీరి జీవితం పున్నమి చంద్రుడు, అమవాస్య చంద్రుడిలాగా ఎత్తు పల్లాల్లో ఉంటుంది.

## నామ సంఖ్య-21

**ఇది జీవిత ద్వితీయార్థంలో అభివృద్ధిని కలిగిస్తుంది**

చంద్రుడి సంఖ్య-2, సూర్యుడి సంఖ్య-1, మొత్తం కలిపి, గురుడి సంఖ్య-3, ఈ నామ సంఖ్యలో ఉంది. చంద్రుడి వృద్ధి, క్షయాల్లా వీరి జీవిత ప్రథమార్థంలో ఒడిదుడుకులు చూస్తారు.

తరువాత భాగం సూర్య సంఖ్య - 1 కాబట్టి, జీవిత ద్వితీయార్థంలో గొప్ప అభివృద్ధి సాధిస్తారు. వీరికి మంచి గౌరవ మర్యాదలు లభిస్తాయి. గొప్ప పేరు, ఐశ్వర్యం అనుభవిస్తారు. వీరి సలహాల వలన వీరిని గురువుగా చాలా మంది భావిస్తారు. గౌరవంలో మంచి పేరు ఉంటుంది.

## నామ సంఖ్య-22

**ఇది చాలా చెడ్డ సంఖ్య**

ఈ సంఖ్య చెడు ఆలోచనలను ప్రేరేపిస్తుంది. అందువలన చెడు మార్గాల వైపు వెళ్తారు. తెలివితేటలుండటం వలన తెలివిగా తప్పించుకుంటారు. దుర్వ్యసనాల వైపు మనసు మళ్ళుతుంది. చెడు మార్గాలు అవలంబించి ధన సంపాదన చేస్తారు. ఆ మార్గాన్ని వీడాలనుకున్నా, స్నేహితులు ప్రోత్సహిస్తారు. అయితే ధన సంపాదన చేసి ఆడంబరంగా జీవిస్తారు. ఈ సంఖ్యతో పేరు ఉన్న వారు ఉజ్వలంగా వెలుగు వెలిగి తరువాత కాలంలో మొత్తం పోగొట్టుకుంటారు. దీనిని నామసంఖ్యగా పెట్టడం మంచిది కాదు.

## నామ సంఖ్య-23

**ఇది చాలా గొప్ప సంఖ్య. సుఖ జీవితం, భోగభాగ్యాలు కలిగిస్తుంది.**

చంద్రుడి సంఖ్య-2, గురుడి సంఖ్య-3, ఉన్న నామసంఖ్య ఇది. వీరికి రాజయోగం ఉంటుంది. వీరి ఆలోచనలు, పథకాలు సఫలం అవుతాయి. ఇది చాలా మంచి సంఖ్య. నాయకులుగా ఎదుగుతారు. ఇది అదృష్ట సంఖ్య కావటం వలన, కొంచెం ప్రయత్నం చేసినా ఎక్కువ ఫలితం పొందుతారు. ఆకర్షణీయంగా, అందంగా ఉంటారు. వీరి చుట్టూ ఎప్పుడూ స్నేహితులతో గుమికూడి ఉంటారు. సుఖజీవితం, భోగభాగ్యాలు అనుభవిస్తారు. సమాజంలో గొప్పవారిగా పేరుపొందుతారు. 8,17,26,5,14,23 తేదీలలో జన్మించిన వారికి ఈ సంఖ్య అభివృద్ధిని తెస్తుంది. నెహ్రూ, జిన్నా, నిక్సన్, జయలలిత, రజనీకాంత్, ఎల్.కె. అద్వానీ ఈ సంఖ్య కలవారే. న్యూమరాలజీలో అత్యంత మంచి నెంబర్లలో ఇది ఒకటి. ఈ నామసంఖ్య ఉన్నవారు జీవితంలో ఉన్నతికి చేరుకుంటారు.

## నామ సంఖ్య-24

**ఇది దినదినాభివృద్ధిని కలిగిస్తుంది.**

ఈ నామసంఖ్య కలవారు దినదినాభివృద్ధి చెందుతారు. అధికారం సంపాదిస్తారు. జీవిత భాగస్వామి వలన సంపద కలుగుతుంది. ఆకర్షణీయమైన జీవితభాగస్వామి

లభిస్తారు. వ్యాపారంలో గొప్ప లాభాలు గడిస్తారు. మిలటరీ, పోలీసు లాంటి యూనిఫాం ఉన్న ఉద్యోగం చేస్తే, ఉన్నత పదవి పొందుతారు. ప్రభుత్వ అధికారుల మన్ననకు పాత్రులవుతారు. ప్రయాణాలు చేయడమంటే మక్కువ చూపుతారు. స్నేహితులతో గడపటానికి ఎక్కువగా ఇష్టపడతారు. వీరు జీవితాన్ని చక్కగా అనుభవించగలరు.

## నామ సంఖ్య-25

**ఇది ఆధ్యాత్మిక ఉన్నతిని కలిగిస్తుంది**

ఈ నామసంఖ్య గల వారు, జీవిత ప్రథమార్ధంలో ఎన్నో ఒడిదుడుకులు, కష్టనష్టాలు చవిచూస్తారు. వీరు చాలా సహనం, శాంతి, దయ కలవారుగా ఉంటారు. గొప్ప నాయకులుగా ఎదుగుతారు. అంతర్జాతీయ గుర్తింపు కూడా లభిస్తుంది. నీతి, నిజాయితీ, న్యాయబుద్ధి కలిగి ఉండి, మంచి క్రమశిక్షణ కలిగి ఉంటారు. వీరు రచయితలుగా, వక్తలుగా, మత పెద్దలుగా ఉంటారు.

ఇతరుల కోసం ఎంతో చేస్తారు గానీ వీరి వ్యక్తిగత జీవితం అంత సంతృప్తికరంగా ఉండదు. కానీ, 2,11,20,29 తేదీలలో జన్మించిన వారికి ఈ నామసంఖ్య అన్ని సౌఖ్యాలను కలిగిస్తుంది. వీరు ఆధ్యాత్మికంగా చాలా ఉన్నత స్థితికి వస్తారు. వీరికి జరగబోయే విషయాలు కలల రూపంలో ముందే తెలుస్తాయి.

## నామ సంఖ్య-26

**ఇది ఉంటే అవకాశాలు చేజారిపోతాయి**

చంద్రుని సంఖ్య-2, శుక్రుని సంఖ్య-6 కలిపి, శని సంఖ్య-8, ఈ నామ సంఖ్యలో ఉంది. వీరు, ధనాన్ని సుఖభోగాల కోసం విపరీతంగా ఖర్చు చేస్తారు. చివరలో అవకాశాలన్నీ జారవిడుచుకున్నామని చింతిస్తారు. శక్తికి మించిన పనులు తలపెట్టి నష్టపోతారు. వ్యర్థ ప్రయత్నాలు, అయోమయం, అపజయం, శత్రువులు, ఈ సంఖ్య వలన వస్తాయి. వీరికి అపనిందలు, అపజయాలు ఉంటాయి. 49 సంవత్సరాల వయసు దాటనంతవరకు జీవితంలో అభివృద్ధి సాధిస్తారు. 5, 14, 23 తేదీలలో పుట్టిన వారికి ఈ నామసంఖ్య బాగా లాభిస్తుంది.

## నామ సంఖ్య–27

**ఇది పేరు, హోదా, ఐశ్వర్యం, అధికారం కలిగిస్తుంది**

చంద్రుని సంఖ్య–2, కేతు సంఖ్య–7, కలిసిన నామసంఖ్య. ఈ నామసంఖ్య గలవారు, పేరు, హోదా, ఐశ్వర్యం, అధికారం పొందుతారు. కష్టపడి వీటన్నింటినీ సంపాదిస్తారు. ఏ ఉద్యోగం చేసినా అందులో ఉన్నత స్థితికి చేరుకుంటారు. దేశ సంక్షేమం కోసం, తన మీద ఆధారపడిన వారి సంక్షేమం కోసం పాటుపడతారు. దైవకృప వలన అభివృద్ధి సాధిస్తారు. ఆధ్యాత్మిక చింతన వుంటుంది. కొందరికి అతీంద్రియ శక్తులు కూడా కలుగుతాయి. 2,11,20,29,7,16,25 తేదీలలో జన్మించిన వారికి ఈ నామసంఖ్య పనికి రాదు. తక్కిన వారికి ఇది చాలా మంచి సంఖ్య.

## నామ సంఖ్య–28

**ఇది మంచి సంఖ్య కాదు. అపజయాలు కలిగిస్తుంది.**

ఈ నామసంఖ్య వ్యక్తులకు గాని, సంస్థలకు గాని ఉన్నట్లయితే, ప్రారంభంలో అభివృద్ధి కనిపించినా, తరువాత పతనం అవుతారు. ఏ పని ప్రారంభించినా, చివరలో అపజయం కలుగుతుంది. స్నేహితులు, బంధువుల చేతిలో మోసపోయి, ఆస్తులు కూడా పోగొట్టుకుంటారు. కోర్టు వ్యవహారాల్లో అపజయం. జీవితంపై విరక్తి కలుగుతుంది. ఇది చాలా చెడు సంఖ్య. ఈ నామసంఖ్య ఉన్నవారు, వారి పేరును మార్చుకోవటం అన్ని విధాల శ్రేయస్కరం.

## నామ సంఖ్య–29

**ఇది మంచి సంఖ్య కాదు. వివాదాలు ఉంటాయి.**

ఈ నామసంఖ్య కలవారు, ఎల్లపుడూ వివాదాలలో ఉంటారు. ఇతరులను నమ్మరు. కుటుంబ జీవితం సమస్యాత్మకంగా ఉంటుంది. వీరు వేలికేస్తే కాలికి, కాలికేస్తే వేలికి అన్నట్టుగా, అందితే జుట్టు అందకపోతే కాళ్ళు, అన్నట్టుగా ఉంటారు. వీరి ప్రవర్తన వలన వీరికి శత్రువులు ఎక్కువగా ఉంటారు. ఇది అంత మంచి సంఖ్య కాదు. కాని

7,16,25 తేదీలలో జన్మించిన వారికి చెడు ప్రభావం కొంచెం తక్కువగా ఉండవచ్చు. 9,18,27 తేదీలలో జన్మించిన వారికి మంచిది కాదు. ఆత్మహత్యా ప్రయత్నాలు చేస్తారు. కానీ, కళాకారులకు, వృత్తి నిపుణులకు ఈ సంఖ్య కొంత మేలు కలిగించవచ్చు.

## నామ సంఖ్య–30

**ఇది ఆధ్యాత్మికతను కలిగిస్తుంది.**

ఈ నామ సంఖ్య మేధో వర్గానికి చెందినది. వీరికి భౌతిక విషయాల కంటే, ఆధ్యాత్మికత పట్ల ఆసక్తి వుంటుంది. ధనం పట్ల వ్యామోహం ఉండదు. ఎప్పుడూ ఇతరులకు మంచి చేయాలనే ఆలోచిస్తుంటారు. వీరి ఆత్మతృప్తి కోసం వీరు ఇతరులకు సాధ్యంకాని పనులు చేస్తుంటారు.

మేధాశక్తి, ఆధ్యాత్మిక శక్తి లభించే అవకాశం ఉన్నందున, శాస్త్ర పరిశోధకులకు, మత గురువులకు ఈ సంఖ్య అనుకూలం. వీరికి అభివృద్ధి ఆలస్యంగా జరుగుతుంది. 6, 15, 24 తేదీల్లో పుట్టినవారు ఈ నామసంఖ్య వచ్చే విధంగా పేరు పెట్టుకోకూడదు.

## నామ సంఖ్య–31

**ఇది ఆధ్యాత్మికత, అతీంద్రియ శక్తులు కలిగిస్తుంది.**

ఈ నామ సంఖ్య ఉన్నవారు కూడా, మేధా శక్తి, ఆధ్యాత్మికత కలవారై వుంటారు. ధనం పట్ల, ప్రాపంచిక విషయాల పట్ల వ్యామోహం ఉంటుంది. ఏకాంతంగా ఉండటానికి ఇష్టపడతారు. ధనం లభించినా అది నిలవదు.

ఆధ్యాత్మిక, అతీంద్రీయ శాస్త్రాలైన, వేదాంతం, జ్యోతిష్యం, హస్త సాముద్రికం, సంఖ్యాశాస్త్రం పట్ల అభిరుచి కలిగి ఉంటారు. 1, 10, 19, 28 తేదీలలో జన్మించిన వారికి ఈ సంఖ్య అనుకూలం ఉన్నత స్థితిని పొందగలుగుతారు. ఈ నామ సంఖ్య ఉన్నవారు చరమ జీవితం కష్టాలతో అంతమవుతుంది. ఈ నామసంఖ్యను మార్చుకుంటే మంచిది.

## నామ సంఖ్య–32

**ఇది వాక్చాతుర్యం, కీర్తిని కలిగిస్తుంది.**

గురుడి సంఖ్య–3, చంద్రుడి సంఖ్య–2 ఉండటం వలన ఈ నామ సంఖ్య అదృష్టాన్ని తీసుకొస్తుంది. కీర్తి ప్రతిష్టలు, సంపద లభిస్తాయి. మంచి వాక్చాతుర్యం, వాక్సుద్ధి కలిగి ఉంటారు. వీరి ముఖంలో ఎప్పుడూ చిరునవ్వు కనిపిస్తుంటుంది. ప్రజాపయోగమైన పనులు చేస్తూ మంచి కీర్తిని గడిస్తారు. ఇతరులు చెప్పిన మాటలు వినకుండా వీరి బుద్ధికి తోచింది చేస్తే సఫలం అవుతారు. ఒడిదుడుకులు ఉన్నా చివరికి విజయం వీరిదే. వీరు అసాధారణ స్ఫురణ (ఇంట్యూషన్), సమయస్ఫూర్తి కలిగి ఉంటారు. ప్రేమ వ్యవహారాలకు దూరంగా ఉంటే మంచిది. మొరార్జీదేశాయ్, దిలీప్‌కుమార్, విక్రం సారాభాయ్, మైక్‌టైసన్, జేమ్స్‌బాండ్, మొదలగువారు ఈ నామసంఖ్య కలవారే.

## నామ సంఖ్య–33

**ఇది ఐశ్వర్యం, గౌరవం కలిగిస్తుంది**

గురుడి సంఖ్య–3. మూడు సంఖ్య రెండుసార్లు ఉండటం వలన వీరికి భగవదనుగ్రహం లభిస్తుంది. చాలా విలాసవంతమైన జీవితం గడుపుతారు. ఐశ్వర్యవంతులుగా ఉండి, అందరిచేత గౌరవించబడతారు. వీరికి ధన, కనక, వస్తు వాహన యోగం ఉంది. విదేశీ ప్రయాణాలు చేస్తారు. గొప్ప వ్యక్తుల పరిచయం వలన వీరు గొప్పతనాన్ని పొందుతారు. మాట మంచితో పనులు సాధిస్తారు. అన్ని సుఖభోగాలు అనుభవిస్తూ, మంచి జీవితం గడుపుతారు. ఇందిరా గాంధీ, జాన్ మేజర్, వాల్ట్ డిస్నీ, అశోక్ కుమార్ ఈ నామ సంఖ్య కలిగిన వారే. కొందరు దీనిని మంచి సంఖ్యగా పరిగణించటం లేదు. ఈ రచయిత అనుభవం ప్రకారం ఇది మంచి సంఖ్య.

## నామ సంఖ్య–34

**ఇది ఉన్నత స్థితిని కలిగిస్తుంది**

7 సంఖ్య లన్నింటిలోను ఇది మంచి సంఖ్య. ఈ నామ సంఖ్య గల వారు,

పండితులుగా, వేదాంతులుగా పేరు పొందుతారు. వీరికి ధనాన్ని సంపాదించాలనే కోరిక ఎక్కువగా ఉంటుంది. జన్మతేదీ సంఖ్య అనుకూలంగా వుంటే వీరు మంచి స్థితిని పొందుతారు.

ఈ సంఖ్య గల వారికి, మంచి గుణాలన్నీ బహిర్గతం అయ్యి, చెడు గుణాలు మరుగున పడి ఎవరికీ తెలియవు. స్త్రీ వ్యామోహం, త్రాగుడు లాంటి వాటి దరి చేరకుండా ఉంటే మంచిది. జ్యోతిష్యము, న్యూమరాలజీ లాంటి అతీంద్రీయ శక్తులను Practice చేసేవారు ఈ నామసంఖ్యతో ఉంటే మంచి పేరు ప్రతిష్టలు సంపాదిస్తారు.

## నామ సంఖ్య-35

**ఇది ఉంటే మానసిక ప్రశాంతత ఉండదు**

ఈ నామసంఖ్య కలవారికి మానసిక ప్రశాంతత కొంత లోపిస్తుంది. అక్రమ మార్గాల ద్వారా ధన సంపాదన చేస్తారు. పెద్ద వ్యాపారవేత్తలైతే, స్నేహితులు, భాగస్వాములు కారణంగా నష్టాలు చవిచూస్తారు. పంటినొప్పి, వెన్నునొప్పి, కడుపునొప్పి లాంటి రుగ్మతలు కలుగుతాయి. ఈ సంఖ్య గల వారు, శిఖరం పైన లేదా పాతాళం లోన ఉంటారు. జీవితం ప్రథమార్థంలో మంచి జీవితం ఉంటుంది. జీవిత చరమాంకంలో కీర్తి, ధనం పోగుట్టుకుంటారు. వీరికి రెండు వివాహాలు అయ్యే అవకాశం ఉంది.

## నామ సంఖ్య-36

**ఇది ఉంటే వైవాహిక జీవితం సక్రమంగా ఉండదు.**

గురుని సంఖ్య-3, శుక్రుని సంఖ్య-6 కల నామసంఖ్య. వీరికి opposite sex మూలంగా సమస్యలు వస్తాయి. వీరు, తమ స్వస్థలాన్ని వదిలి దూరంగా వెళ్తే, బాగా వృద్ధిలోకి వస్తారు. తరచుగా ప్రయాణాలు చేస్తుంటారు. వీరి చుట్టూ విశ్వాసఘాతకులు చేరి ఉంటారు. వైవాహిక జీవితం సక్రమంగా ఉండదు. 9, 18, 27 తేదీలలో జన్మించిన వారికి ఈ సంఖ్య మంచి చేస్తుంది. 2, 7, 11, 16, 20, 25, 29 తేదీలలో జన్మించిన వారికి ఈ సంఖ్య మంచిది కాదు. ఈ నామసంఖ్యతో పేరు ఉన్నవారు దాన్ని మార్చటం మంచిది.

## నామ సంఖ్య-37

**ఇది మంచి సంఖ్య. అభివృద్ధిని కలిగిస్తుంది.**

ఈ నామసంఖ్య కలవారు జీవిత ప్రథమార్థంలో కష్టపడినా, తరువాత ఉన్నత స్థితికి చేరుకుంటారు. మంచి వస్త్రాలు ధరించి ఆకర్షణీయంగా ఉండి, చక్కగా మాట్లాడతారు. ఒక్కొక్క సారి శక్తికి మించిన ప్రణాళికలు వేస్తారు. ఎంతో ఉత్సాహంగా, స్నేహితులతో కలిసి భాగస్వామ్య వ్యాపారం చేసి ధన సంపాదన చేస్తారు. కళల పట్ల అభిరుచి కలిగి ఉంటారు. ఈ సంఖ్యకు ఉన్న శక్తి వలన అనతి కాలంలోనే వీరు ఉన్నత స్థానానికి చేరుకుంటారు. అవరోధాలు ఎదుర్కొన్నా మళ్ళీ పట్టుదలతో ప్రయత్నించి విజయం సాధిస్తారు. ఈ నామ సంఖ్య చాలా మంచిది.

## నామ సంఖ్య-38

**ఇది శాంతి, నిజాయితీ, గౌరవం కలిగిస్తుంది.**

ఈ నామ సంఖ్య కలవారు, సౌమ్యంగా, శాంతి కాముకులుగా, నిజాయితీగా ఉంటారు. అందరి చేతా గౌరవింపబడతారు. వీరికి ఆధ్యాత్మికత కూడా ఉంటుంది. కొందరు వీరిపట్ల ఈర్ష్య కలిగి వీరిని వేధిస్తుంటారు. మంచిగుణాల వలన కీర్తి ప్రతిష్టలు కలుగుతాయి. కానీ తమ అమాయకత్వం వలన పొంచి ఉన్న ప్రమాదాలను తెలుసుకోలేరు. 9,18,27 తేదీలలో జన్మించిన వారికి ఈ నామసంఖ్య వలన ఆకస్మాత్తు ప్రమాదాలు జరుగవచ్చు.

## నామ సంఖ్య-39

**ఇది పరోపకార బుద్ధిని కలిగిస్తుంది.**

ఈ నామ సంఖ్య కలవారు పరోపకార బుద్ధి కలిగి ఉంటారు. వీరి కష్టార్జితాన్ని ఇతరులు కూడా పొందుతారు. ఇతరుల కోసం జీవితాంతం శ్రమిస్తూ ఉంటారు. వీరికి చర్మ వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. విలాస వస్తువుల వ్యాపారం చేసి చాలా ధనం సంపాదిస్తారు. 3,12,21,30 తేదీలలో జన్మించిన వారు, ఇల్లు, భూములు, వాహనాలు

సంపాదిస్తారు. విదేశీ ప్రయాణాలు కూడా చేస్తారు. 6,15,24 తేదీలలో జన్మించిన వారికి ఈ నామసంఖ్య మంచిది కాదు.

## నామ సంఖ్య-40

**దీని వలన ధనం, కీర్తి, స్నేహితులు కలుగుతారు.**

ఈ నామ సంఖ్య కలవారు మంచి ప్రతిభాపాటవాలు కలిగి ఉంటారు. కానీ 4 సంఖ్య వలన, వీరి మంచి గుణాల కంటే, చెడు గుణాలనే అందరూ చూస్తుంటారు. రచనలు, బోధన వృత్తుల వలన పేరు పొందుతారు.

బంగారం, రత్నాలు సంపాదిస్తారు. ధనం, కీర్తి, స్నేహితులను సంపాదిస్తారు. వీరికి స్వార్థం ఉంటుంది. జీవిత చరమాంకంలో కీర్తి ప్రతిష్టలు కోల్పోతారు. తనవారికి దూరంగా జీవించవలసి వస్తుంది.

## నామ సంఖ్య-41

**ఇది విజయాన్ని, పేరు ప్రఖ్యాతులను కలిగిస్తుంది.**

ఈ నామసంఖ్య కల వారు ఆణిముత్యంలా ఉంటారు. ఇతరులకి సాధ్యం కాని పనులు చేస్తుంటారు. జనాకర్షణ శక్తి కలిగి ఉంటారు. ఏ విధంగానైనా ఉన్నత శిఖరాలు చేరుకుంటారు. విజయాల వలన వచ్చిన అహంభావంతో ఒక్కొక్కసారి శక్తికి మించిన పనులు తలపెట్టి నష్టం పొందినా, తెలివిగా ఆ నష్టాన్ని ఎవరికీ తెలియనీయరు. 8,17,26,5,14,23,9,18,27 తేదీల్లో జన్మించిన వారు గొప్ప పేరు ప్రఖ్యాతులు, సంపద ఆర్జిస్తారు. యం.జి.రామచంద్రన్, జయప్రకాశ్ నారాయణ, జార్జి బుష్, ధీరూభాయి అంబానీ, ఫిడెల్ కాస్ట్రో, న్యూటన్, నెపోలియన్ ఈ నామసంఖ్య కలిగిన వారే.

## నామ సంఖ్య-42

**ఇది మానసిక, ఆధ్యాత్మిక, ధనబలం కలిగిస్తుంది.**

ఈ నామ సంఖ్య కల వారికి దైవకృప ఉంటుంది. స్థిర చిత్తం మంచి ఆర్థిక స్థితి కలిగి ఉంటారు. మధ్యతరగతి నుండి వచ్చిన వారు కూడా ఈ నామసంఖ్య ప్రభావం

వలన ఉన్నత స్థితిని పొందుతారు. వీరు మంచి పొదుపరులు. వీరికి వ్యాధులు తొందరగా నయం అవుతాయి. వీరు మానసిక బలం, ఆధ్యాత్మిక బలం, ధనబలం సంపాదిస్తారు. కానీ 3,12,21,30 తేదీలలో జన్మించిన వారికి ఇది మంచి సంఖ్య కాదు. బాలగంగాధర తిలక్, మార్టిన్ లూథర్, అమర్త్యసేన్, మార్కోపోలో, రూజ్‌వెల్ట్, భీంసేన్ జోషీ, షారూఖ్‌ఖాన్, సీన్ కానరీ (జేమ్స్ బాండ్) ఈ నామ సంఖ్య కలిగిన వారే!

## నామ సంఖ్య-43

**ఈ సంఖ్య విప్లవకారులకు అనుకూలం.**

ఈ నామ సంఖ్య కలవారు పరుల సంక్షేమం కోసం పాటుపడతారు. తమ భావాలను నిర్భయంగా ప్రకటిస్తారు. అందువలన వీరికి వ్యతిరేకులు ఉంటారు. రచనలు, ఉపన్యాసాల ద్వారా తమ భావాలను తెలియజేస్తుంటారు. కానీ దాని వలన పెద్దగా లాభపడరు. వీరి శక్తి సామర్థ్యాలు, తెలివితేటలు వీరికి ఉపయోగపడవు. 2,11,20,29 తేదీలలో జన్మించిన వారికి ఈ సంఖ్య ఉపయోగకరంగా ఉంటుంది. ఈ నామ సంఖ్య విప్లవకారులకు సంఘ సంస్కర్తలకు అనుకూలం. అబ్రహం లింకన్, హిట్లర్, అమితాబ్ బచ్చన్, ఈ నామసంఖ్య కలిగిన వారు.

## నామ సంఖ్య-44

**ఇది అభివృద్ధి కలిగించినా తరువాత ఆటంకాలు కలిగిస్తుంది.**

ఈ నామ సంఖ్యలో రాహు సంఖ్య 4 రెండుసార్లు వచ్చి మొత్తం శని సంఖ్య-8 అవుతుంది. వీరి ఆలోచనలు ఎప్పుడూ ధన సంపాదన గురించే ఉంటాయి. ట్రాన్స్‌పోర్టు వ్యాపారం, స్టీలు, కాంట్రాక్టు పనులు, ఎంటర్‌టైన్‌మెంటు వ్యాపారం లాంటి వాటిలో లాభం గడిస్తారు. కొందరు ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలలో పాలు పంచుకొని కారాగారవాసం చేసే అవకాశం ఉంది. వ్యాధులు, అగ్ని ప్రమాదాలు లాంటివి పొంచి ఉన్న ముప్పులు. 5,14,23 తేదీలలో జన్మించిన వారికి ఈ సంఖ్య అనుకూలం. ఇతరులకు ఈ సంఖ్య వలన పనులు మధ్యలో ఆగిపోవటం, ఆస్తినష్టం, ప్రమాదాలు, రోగాలు లాంటివి కలిగిస్తుంది. మైకేల్ జాక్సన్, పీట్ సంప్రాస్, ఎడ్మండ్ హిల్లరీ, స్టీవ్ వా, మొదలైన వారు ఈ నామ సంఖ్య కలవారు.

## నామ సంఖ్య-45

**ఇది ఉన్నవారు గొప్ప నాయకులుగా ఎదుగుతారు.**

రాహు సంఖ్య-4, బుధుడి సంఖ్య-5 కలిసి ఉన్న సంఖ్య ఇది ఈ నామ సంఖ్యగల వారు మంచి వక్తలుగా పేరు పొందుతారు. ఉన్నత స్థితిని అధికారాన్ని, కలిగిస్తుంది. తీవ్రంగా శ్రమించి తమ తమ వృత్తుల్లో బాగా రాణించి ధనం సంపాదిస్తారు. ఎంత కష్టంలో ఉన్నా దాన్ని బయటకు కనిపించనీయక పోవటం వలన, ఇతరులు వీరి కష్టాన్ని తెలుసుకోలేరు.

9,18,27 తేదీలలో జన్మించిన వారు గొప్ప నాయకులుగా ఎదుగుతారు. 42 సంఖ్యలాగా ఈ సంఖ్య కూడా రోగ నివారణ శక్తి కలిగి ఉంటుంది. శంకర్‌దయాళ్ శర్మ, రోనాల్డ్ రీగన్, ప్రణయ్ రాయ్, బెన్ జాన్సన్, సద్దాం హుస్సేన్, ఆల్ఫ్రెడ్ నోబెల్, మొదలగు వారు ఈ నామ సంఖ్య కలిగిన వారు.

## నామ సంఖ్య-46

**ఇది అంతర్జాతీయ ఖ్యాతిని కలిగిస్తుంది.**

రాహువు సంఖ్య-4, శుక్రుడి సంఖ్య-6, కలిసిన సంఖ్య. ఈ సంఖ్య కలవారికి జ్ఞానం, సంపద, హోదా, దినదినాభివృద్ధి చెందుతాయి. వీరు తమ లక్ష్యాన్ని తెలుసుకొని శ్రమించి దాన్ని సాధిస్తారు.

సాధారణ కుటుంబంలో పుట్టినవారు కూడా ఈ నామ సంఖ్య వలన రాజభోగం పొందుతారు. అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జిస్తారు. వీరి వయసుతో పాటుగా వీరి అదృష్టం, ఘనత వృద్ధి చెందుతాయి. వీరు మంచి ఆకర్షణీయమైన వ్యక్తిత్వం కలిగి ఉంటారు. నీతి, నిజాయితీ కలిగి ఉంటారు. దేశభక్తి, దైవభక్తి, ఆధ్యాత్మిక దృక్పథం, తత్వవిచారణ కలిగి ఉంటారు. జీవితంలో అన్ని భోగ భాగ్యాలు అనుభవిస్తారు. డా॥ రాజేంద్రప్రసాద్, డా॥రాధాకృష్ణన్, స్టాలిన్, పుతిన్, ఐన్‌స్టిన్, లాంటి వారు ఈ నామసంఖ్య కలిగిన వారు.

## నామ సంఖ్య-47

**ఇది జ్ఞానాన్ని, ముక్తిని ప్రసాదిస్తుంది.**

రాహు సంఖ్య-4, జ్ఞానాన్ని ముక్తిని ప్రసాదించే, కేతు సంఖ్య-7, కలిసి ఉన్న నామ సంఖ్య. ఈ నామసంఖ్య కల వారికి పరిశోధనా రంగంలో అభిరుచి ఉంటుంది. ఇతరులకు సలహాలు చక్కగా ఇవ్వగలరు. ఆర్థిక స్థితి బాగుంటుంది. ఇది దైవిక సంబంధిత సంఖ్య కాబట్టి, ఈ సంఖ్య కలవారు ఆధ్యాత్మిక భావం పెంచుకొని, తగని పనులు మానుకొని, పవిత్రంగా వుంటే మంచి ఫలితం కలుగుతుంది. 7,16,25 తేదీలలో జన్మించిన వారికి ఇది మంచి సంఖ్య. 9,18,27 తేదీలలో జన్మించిన వారికి ఇది మంచి సంఖ్య కాదు.

## నామ సంఖ్య-48

**ఇది మంచి సంఖ్య కాదు. అభివృద్ధి ఉండదు.**

ఈ నామ సంఖ్య కలవారి జీవితంలో పెద్దగా అభివృద్ధి ఉండదు. అపజయాలు ఎదుర్కొంటారు. ఆధ్యాత్మిక, మత, సామాజిక విషయాల పట్ల ఆసక్తి కలిగి ఉంటారు. శక్తికి మించిన పనులు తలపెట్టి ఇక్కట్లు తెచ్చుకుంటారు. వీరికి రావాల్సిన గుర్తింపు వేరొకరికి వెళ్తుంది. చివరకు ధనలేమితో బాధపడతారు. 3,12,21,30 తేదీలలో జన్మించిన వారికి మాత్రం ఈ సంఖ్య కొంచెం ఫరవాలేదు

## నామ సంఖ్య-49

**ఇది ఉన్నవారు నాయకులుగా ఉంటారు.**

ఈ నామ సంఖ్య కలిగిన వారు నాయకులుగా ఎదుగుతారు. చాలా మందికి మార్గదర్శకులుగా ఉంటారు. ఏ పనైనా ధైర్యంగా ప్రారంభించి విజయం సాధిస్తారు. సాహసకృత్యాలు చేస్తూ అంతటా ప్రసిద్ధి పొందుతారు. అనేక మార్గాల ద్వారా ధన సంపాదన చేస్తారు. ఇతరుల కష్టాలను తీర్చటానికి ప్రయత్నిస్తారు. అందువల్ల వీరు ఒక్కొక్క సారి కష్టాల్లో చిక్కుకుంటారు. వీరి చరమ జీవితం దు:ఖాంతం అవుతుంది.

## నామ సంఖ్య-50

**ఇది ఉన్నతస్థితిని కలిగిస్తుంది. జీవిత ద్వితీయార్ధంలో విజయం లభిస్తుంది.**

ఈ నామ సంఖ్య కలవారు సాధారణ మధ్య తరగతి కుటుంబీకులైనా తరువాత వీరి తెలివి తేటలు, సామర్థ్యం వలన ఉన్నత స్థితిని పొందుతారు. జ్ఞానం, తార్కిక బుద్ధి కలిగి, స్పష్టంగా సూటిగా మాట్లాడతారు. భావావేశం కంటే హేతువునే నమ్ముతారు. బోధన, ఎలక్ట్రానిక్, యంత్ర సామాగ్రి రంగాలలో ధన సంపాదన చేస్తారు. భార్య వలన కూడా ఆదాయం ఉంటుంది. మంచి వారుగా పేరుగడిస్తారు. ప్రయాణాలు ఇష్టపడతారు. జీవిత ద్వితీయార్థంలో విజయాలు సాధిస్తారు. దేవగౌడ, దాదా సాహెబ్ ఫాల్కె, థామస్ అల్వా ఎడిసన్, సచిన్ టెండూల్కర్, ఈ నామసంఖ్య కలవారు.

## నామ సంఖ్య-51

**ఇది శక్తివంతమైన సంఖ్య - అకస్మాత్తుగా అభివృద్ధిని కలిగిస్తుంది.**

బుధుని సంఖ్య-5, సూర్యుని సంఖ్య-1, ఉన్న నామ సంఖ్య. ఇది చాలా శక్తివంతమైన సంఖ్య. ఈ నామసంఖ్య కలవారు ఆకస్మాత్తుగా అభివృద్ధిని సాధిస్తారు. సూర్యకాంతి వలె వీరి పేరు ప్రఖ్యాతులు నలు దిశలా వ్యాపిస్తుంది. వృత్తి వ్యాపారాలలో ధనం సంపాదిస్తారు. ఎప్పుడూ ధన సంపాదన కోసం ప్రణాళికలు వేస్తుంటారు. శారీరక, మానసిక ఆరోగ్యం బాగుంటుంది. కానీ వీరు ఇతరులను నొప్పించకుండా ప్రవర్తించటం నేర్చుకోవాలి. లేకపోతే శత్రుభయం కలుగుతుంది. ఇచ్చిపుచ్చుకునే ధోరణి అవలంబిస్తే మంచిది. వీరికి శత్రువుల వలన ప్రమాదాలు కలుగుతాయి. 3,12,21,30 తేదీలలో జన్మించిన వారికి ఈ సంఖ్య మంచిది కాదు. నెల్సన్ మండేలా, మార్గరెట్ థాచర్, బేనజీర్ భుట్టో, సిగ్మండ్ ఫ్రాయిడ్ మొదలైన వారు ఈ నామసంఖ్య కలవారు.

## నామ సంఖ్య-52

**ఇది అభివృద్ధిని, సమస్యలు రెంటినీ కలిగిస్తుంది.**

బుధుడి సంఖ్య-5, చంద్రుడి సంఖ్య-2 కలిసి ఉన్న సంఖ్య. వీరి జీవితం

ప్రారంభంలో బాగుంటుంది వయసుతోపాటు అభివృద్ధి కూడా పెరుగుతుంది. కానీ సమస్యలు కూడా వస్తాయి. సమస్యలున్న వారు వీరి వద్దకు సలహాల కోసం వస్తారు. దాని వలన వీరి ప్రతిష్ట పెరుగుతుంది. దాంపత్య జీవితంలో కలతలు వస్తాయి. 2,11,20,29 తేదీలలో జన్మించిన వారికి ఈ సంఖ్య వలన ఐశ్వర్యం లభిస్తుంది. జీవితాంతం వరకు సుఖజీవితం ఉంటుంది.

## నామ సంఖ్య-53

**ఇది ఉంటే జీవితంలో ప్రశాంతత లోపిస్తుంది.**

ఈ నామ సంఖ్య కలవారు చిన్న వయస్సులోనే అనుభవజ్ఞులుగా ఉంటారు. అన్ని విషయాలలో తలదూర్చుతుంటారు. వీళ్ళు జయాపజయాలు రెంటినీ చూస్తారు. తెలివైన వారయినప్పటికీ శక్తికి మించిన వ్యాపారం చేసి సమస్యలు తెచ్చుకుంటారు. అందువలన జీవితంలో ప్రశాంతత లోపిస్తుంది. ఇతరులకు సాధ్యం కాని ప్రజా సంక్షేమ కార్యాలు వీరు చేస్తారు. కుటుంబ జీవితం సవ్యంగా ఉండదు. పెద్ద వయసు వచ్చాక నిలకడ వస్తుంది. కానీ ఈ సంఖ్యను పూర్తిగా నమ్మలేం. 5,14,23 తేదీలలో జన్మించిన వారికి ఈ సంఖ్య కొంత వరకు అనుకూలం.

## నామ సంఖ్య-54

**మొదట అపజయం కలిగినా తరువాత విజయాన్ని, కీర్తిని కలిగిస్తుంది.**

బుధుడి సంఖ్య-5, రాహుసంఖ్య-4, కలిసి ఉన్న సంఖ్య. ఈ నామ సంఖ్య కలవారు, చురుకుగా ఉండి మంచి మాటకారులుగా ఉంటారు. ప్రారంభంలో అపజయాలు ఉన్నా, తరువాత విజయాలు సాధిస్తారు. కీర్తి, సంపద పొందుతారు. ఇతరులకు మంచి సలహాలు ఇచ్చే వివేకం కలిగి ఉంటారు.

జీవిత ద్వితీయార్థంలో, అత్యాశ, నిర్లక్ష్యం, మొండితనం వలన నష్టపోతారు. కానీ తరువాత మళ్ళీ పుంజుకుంటారు. 9,8,27 తేదీలలో జన్మించిన వారికి జీవితం విజయవంతంగా ఉంటుంది. 2,11,20,29,7,16,25 తేదీలలో జన్మించిన వారికి ఇది మంచి సంఖ్య కాదు.

## నామ సంఖ్య–55

**ఈ సంఖ్య కలవారు గొప్ప వివేకం, మేధస్సు కలిగి ఉంటారు.**

బుధుడి సంఖ్య–5, జంటగా ఉన్న నామ సంఖ్య. ఈ సంఖ్య కలవారు, గొప్ప వివేకం, తెలివితేటలు కలిగి, అందరిచే మేధావులుగా గుర్తింపబడతారు. వీరికి సంకల్ప బలం, శారీరక బలం ఉంటుంది. కానీ వీరు కొంచెం అసహనంగా ఉంటారు. దాని వలన వివాదాలు వస్తాయి.

వీరి మేధస్సును సక్రమంగా వినియోగించకపోతే వికటిస్తుంది. భాగస్వామ్య వ్యాపారం చేసేవారికి ఈ నామ సంఖ్య పనికి రాదు. వీరికి జీవితంలో అప్పుడప్పుడు అపజయాలు వస్తుంటాయి. లియోనార్డ్లో డావెన్సీ, రవీంద్రనాథ్ ఠాగూర్, సిరిమావో బండారు నాయకె, రాం మనోహార్ లోహియా, మొదలైన వారు ఈ నామ సంఖ్య కలవారు.

## నామ సంఖ్య–56

**ఈ సంఖ్య మ్యాజిక్ నేర్చుకునే వారికి అనుకూలం.**

బుధుడి సంఖ్య–5, శుక్రుడి సంఖ్య–6, కలిసి ఉన్న నామ సంఖ్య ఇది. ఈ నామ సంఖ్య కలవారూ ఎప్పుడు బిజీగా ఉంటారు. ఇంద్రజాల విద్య మరియు మ్యాజిక్ లాంటివి నేర్చుకొనే వారికి ఈ సంఖ్య అనుకూలం. పేరు, ధనం సంపాదిస్తారు. 2,7,11,16,20,25,29, తేదీలలో జన్మించిన వారికి ఈ సంఖ్య చాలా మంచిది. ఇతరులకు సాధ్యం కాని పనులు చేయగలుగుతారు. వీరు సంపాదించిన ధనం, కీర్తి, ఒక్కసారిగా పోగొట్టుకొనే అవకాశం ఉంది. జన్మతేదీకి, ఈ సంఖ్యకు సరిపోక పోతే, వీరు ఇతరులను మోసం చేసి జీవనం గడిపేవారుగా అవుతారు.

## నామ సంఖ్య–57

**ఈ సంఖ్య కలవారు ఆధ్యాత్మికత కలిగి వేదాంతులుగా ఉంటారు.**

ఈ నామ సంఖ్య కలవారు ఆధ్యాత్మిక ఆనందం కోరుకుంటారు. వేదాంతులుగా

ఉంటారు. జీవితంలో ఉన్నత స్థానం చేరుకున్న తరువాత వీరు అధోగతి పాలవుతారు. వేదాంతులు కాబట్టి ప్రస్తుత సమాజంలో వ్యాపారం లాంటి లౌకిక విషయాలలో వీరు విజయం సాధించలేరు. కనుక ఈ నామ సంఖ్యతో పేరుపెట్టడం అంతగా మంచిది కాదు. మంచి వ్యక్తులుగా పేరు తెచ్చుకుంటారు.

## నామ సంఖ్య-58

**ఈ సంఖ్య కలవారు ఉన్నత స్థితిని పొంది నాయకులుగా ఎదుగుతారు.**

బుధుడి సంఖ్య-5, శనిసంఖ్య-8, కలిసిన నామ సంఖ్య. ఈ సంఖ్య కలవారు మంచి ఆకర్షణ శక్తి కలిగి, ప్రాచుర్యం పొందుతారు. మంచి ఉన్నతస్థితిని పొందుతారు. గొప్ప నాయకులుగా ఎదుగుతారు.

ఉన్నత పదవులు వీరిని వరిస్తాయి. వీరికి మత విశ్వాసాలు, ధార్మికత ఉంటాయి. సంఘ సంస్కరణలు చేయ ప్రయత్నిస్తారు. ఇవన్నీ 1,10,19,28 తేదీలలో జన్మించిన వారికి జరుగుతాయి. జన్మతేదీ వేరుగా ఉంటే మాత్రం స్వార్థపరులుగా ఉండి అకృత్యాలు చేస్తారు. జీవితంలో, కష్టాలు, ఒడిదుడుకులు, ఆటుపోట్లు, కోర్టు కేసులతో తన వారికి దూరంగా ఉండవలసి వస్తుంది.

## నామ సంఖ్య-59

**ఈ సంఖ్య కలవారికి ప్రజాదరణ, పేరు ప్రఖ్యాతులు, ధనం లభిస్తాయి.**

బుధుడి సంఖ్య-5, ధైర్యానికి సంకేతమైన కుజుడి సంఖ్య-9, కలిసిన నామసంఖ్య. ఈ నామ సంఖ్య కలవారికి ప్రజాదరణ వుంటుంది. జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకుంటారు. కొందరికి ధనాశ ఉంటుంది.

రచనా వ్యాసంగం, ఉపన్యాసాల ద్వారా పేరు ప్రఖ్యాతులు, ధనం సంపాదిస్తారు. అనారోగ్యం వచ్చే అవకాశం ఉంది. ఆహారనియమాలు పాటించాలి. ఈ సంఖ్యతో వ్యాపారసంస్థలకు పేరు పెడితే అత్యంత అభివృద్ధిని సాధిస్తాయి. ఇది చాలా మంచి సంఖ్య.

## నామ సంఖ్య-60

**ఈ సంఖ్య కలవారు ఆకర్షణీయంగా ఉండి, ఉపన్యాసాలు, రచనలు ద్వారా ధనం సంపాదిస్తారు.**

ఈ నామ సంఖ్యపై శుక్రుడి ప్రభావం ఉంటుంది. వీరు ఆకర్షణీయంగా ఉండి మంచి వస్త్రధారణ చేస్తారు. ఆనందం, సంతృప్తి వీరికి సొంతం. ఉపన్యాసాలు, రచనల ద్వారా ధన సంపాదన చేస్తారు. వీరు తమ అభివృద్ధి గురించే కాకుండా సన్నిహితుల అభివృద్ధి కోసం కూడా పాటుపడతారు. వీరి సంసార జీవితం సుఖమయంగా ఉంటుంది. కాని 3,12,21,30 తేదీలలో జన్మించిన వారికి ఈ నామసంఖ్య మంచి ఫలితాన్ని ఇవ్వదు.

## నామ సంఖ్య-61

**ఈ సంఖ్య కలవారు కుటుంబ జీవితం తప్ప అన్ని సుఖాలు అనుభవిస్తారు.**

శుక్రుని సంఖ్య-6, సూర్యుని సంఖ్య-1, కలిసిన నామసంఖ్య. ఈ నామసంఖ్య కలవారు జీవితంలో అన్ని సుఖాలు అనుభవిస్తారు. కానీ కుటుంబ జీవితం అంత సంతృప్తికరంగా ఉండదు. అనారోగ్యం రాకుండా జాగ్రత్త పడితే ఎన్నో విజయాలు సాధిస్తారు. భోగాలు అనుభవించిన తరువాత, జీవిత ద్వితీయార్ధంలో తాత్విక భావం అలవాటు చేసుకుంటారు. 2, 11, 20, 29 తేదీలలో జన్మించిన వారు మంచి కుటుంబ జీవితం, సంపద పొందుతారు. ఈ నామ సంఖ్యలో పేరు పెట్టకుండా ఉండటం మంచిది.

## నామ సంఖ్య-62

**ఈ సంఖ్య కలవారికి తెలివితేటలు, ఆకర్షణ శక్తి ఎక్కువ.<br>బంధు విరోధం ఉంటుంది.**

ఈ నామ సంఖ్య కలవారు, ప్రాపంచిక సుఖాలు అనుభవించటానికి ఇష్టపడతారు. దాని కోసం నీతిమాలిన పనులు చేయటానికి కూడా వెనుకాడరు. వీరికి తెలివితేటలు, ఆకర్షణ శక్తి ఎక్కువగా ఉంటాయి. కుటుంబ జీవితంలో కలతలు, బంధు విరోధం

ఉంటుంది. 5,14,23 తేదీలలో జన్మించిన వారికి ఈ నామ సంఖ్య కొంచెం ఫరవాలేదు. ఎవరికైనా ఈ సంఖ్యతో పేరు పెడితే అపనిందలు, అవమానాలు కలిగిస్తుంది.

## నామ సంఖ్య-63

**ఈ సంఖ్య కలవారికి అభివృద్ధి, అవరోధం రెండూ ఉంటాయి.**

రాక్షస గురువైన శుక్రుడి సంఖ్య-6, దేవతల గురువైన బృహస్పతి సంఖ్య-3, కలిసి ఉన్న నామ సంఖ్య. అందువలన అభివృద్ధి, అవరోధాలు రెండూ ఉంటాయి. ఏ పని ప్రారంభించినా వెంటనే ప్రతిఘటన ఎదురవుతుంది. ఒంటరి, అనుమానాస్పద జీవితం గడుపుతారు. వీరు లక్ష్యాన్ని పొందుట కోసం అక్రమ మార్గాలు కూడా అవలంబిస్తారు. 2,11,20,29,7,16,25 తేదీలలో జన్మించిన వారికి అనవసరమైన చిక్కులు తొలగిపోతాయి. కాబట్టి ఈ నామసంఖ్య అంత మంచిది కాదు.

## నామ సంఖ్య-64

**ఈ సంఖ్య కలవారు కీర్తి ప్రతిష్టలు, అధికారం, సంపద పొందుతారు.**

శుక్రుడి సంఖ్య-6, రాహుసంఖ్య-4 కలిసి ఉన్న నామ సంఖ్య. ఈ నామసంఖ్య కలవారు, కీర్తి, ప్రతిష్టలు, అధికారం, సంపద పొందుతారు. వీరి ఆదాయం, ఒకటి కంటే ఎక్కువ మార్గాల ద్వారా వస్తుంది.

కొందరు, పెద్ద ప్రభుత్వ అధికారులుగా ఉండి, అధికారం, దర్పం ప్రదర్శిస్తారు. స్నేహితులు, బంధువులచే గౌరవింపబడతారు. కుటుంబ జీవితంలో కొంత చికాకులు ఉండవచ్చు. వీరికి జీవితం మీద అసంతృప్తి ఉంటుంది. అసహనంగా ప్రవర్తిస్తుంటారు.

## నామ సంఖ్య-65

**ఈ సంఖ్య కలవారికి ఆధ్మాత్మికత, శాంతి, క్షమా గుణాలు ఉంటాయి.**

ఈ నామసంఖ్య కలవారు దివ్య ఆధ్యాత్మిక అనుభూతులకు లోనవుతుంటారు. వివాదాలు, పేచీల జోలికి వెళ్ళరు. సహాయ సహకారాలు, శాంతి, క్షమ, సర్దుకుపోయే

గుణం లాంటి మంచి లక్షణాలు కలిగి ఉంటారు. గొప్పవారి సహకారంతో అభివృద్ధి సాధిస్తారు. కుటుంబ జీవితం హాయిగా ఉంటుంది. మంచి జీవిత భాగస్వామి లభిస్తారు.

## నామ సంఖ్య-66

**ఈ సంఖ్య కలవారు అన్ని ప్రాపంచిక భోగాలు అనుభవిస్తారు.**

శుక్రుడి సంఖ్య-6, రెండుసార్లు ఉన్న నామ సంఖ్య. ఈ సంఖ్య కలవారు, అన్ని ప్రాపంచిక భోగాలు అనుభవిస్తారు. విలాస వస్తువుల వ్యాపారంలో లాభాలు ఆర్జిస్తారు. వీరి జీవితం, సంతృప్తి, పరిపూర్ణత, భౌతిక సుఖాలతో నిండి ఉంటుంది. మంచి వాక్పటిమ, కళాత్మకత ఉండి, వీరు ఏది కోరుకుంటే అది లభిస్తుంది. జీవితం ద్వితీయార్ధంలో ప్రాపంచిక భోగాల పట్ల వీరికి విరక్తి కలుగుతుంది.

## నామ సంఖ్య-67

**ఈ సంఖ్య కలవారు పేరుప్రతిష్టలు, సంపద పొందుతారు.**
**కళాకారులకు అనుకూలం.**

ఈ నామ సంఖ్య కలవారు పేరు ప్రతిష్టలు, సంపద కలిగి ఉంటారు. కళాకారులకి ఈ నామసంఖ్య అనుకూలం. వ్యాపారం, పరిశ్రమల ద్వారా ధన సంపాదన చేస్తారు. సినిమా రంగం వీరికి చాలా అనుకూలమైన సంఖ్య. మన్మథ సంఖ్య కాబట్టి కామభావనలు ఉంటాయి. అదుపు చేయకపోతే నష్టపడాల్సి ఉంటుంది. దైవకృప వలన వీరికి విజయం ప్రాప్తం అవుతుంది. కాని, 2, 11, 20, 29, 8, 17, 26 తేదీలలో జన్మించిన వారికి ఇది మంచి సంఖ్య కాదు.

## నామ సంఖ్య-68

**ఈ సంఖ్య కలవారు తొందరగా అభివృద్ధి సాధించి,**
**తొందరగానే అసంతృప్తికి లోనవుతారు.**

శుక్రుడి సంఖ్య-6, శని సంఖ్య-8, కలిసి ఉన్న నామసంఖ్య. ఈ సంఖ్యగల వారు

చాలా తొందరగా అభివృద్ధి సాధించి, అంతే తొందరగా విఘ్నాలు, ఆటంకాలు ఎదుర్కొని, అసంతృప్తికి లోనవుతారు. మళ్ళీ శ్రమించి ఉన్నత స్థితిని పొందుతారు.

కమీషన్ పనులు, స్టీలు, రవాణా వ్యాపారాలు వీరికి లాభదాయకం. శక్తికి మించిన పనులు చేయడానికి ప్రయత్నిస్తారు. సంయమనం పాటించాలి. ఇతరులు ప్రోత్సాహిస్తే పనులు చేస్తారు.

## నామ సంఖ్య-69

**ఈ సంఖ్య కలవారు పెద్ద పరిశ్రమలు నడుపుతారు.**

శుక్రుడి సంఖ్య-6, కుజుడి సంఖ్య-9, కలిసి ఉన్న నామసంఖ్య. ఈ సంఖ్య కలవారు, గొప్పపేరు, సంపద కలిగి ఉండి పెద్ద పరిశ్రమలు నడుపుతారు. వీరి వృత్తిలో వీరు మకుటం లేని మహారాజులా వెలుగొందుతారు. గొప్ప సంపద వలన హుందాతనం, హోదా కలిగి ఉంటారు.

వీరికంటే గొప్పవారు వీరికి మిత్రులుగా ఉంటారు. తనపై ఆధారపడిన వారిని ఆదుకుంటారు. ఎంతోమంది అనుచరులను కలిగి ఉంటారు. ఈ సంఖ్యతో వ్యాపార సంస్థలకు పేరు పెడితే చాలా అభివృద్ధిలోకి వస్తాయి.

## నామ సంఖ్య-70

**ఈ సంఖ్య కలవారికి ఆత్మజ్ఞానం, ఆధ్యాత్మికత ఉంటుంది.**

ఈ నామ సంఖ్య కేతువుకు గుర్తు. వీరికి ఆత్మజ్ఞానం ఉంటుంది. ఆధ్యాత్మిక భావనలు ఉంటాయి. కష్టపడి ప్రయత్నాలు చేసినా అపజయం వస్తుంది. అందరిచేత దగా చేయబడి బలిపశువునయ్యాననే భావం ఉంటుంది. జీవిత ద్వితీయార్థంలో అదృష్టం ప్రాప్తించినా, అనుభవించే ప్రాప్తం ఉండదు. 2, 11, 20, 29 తేదీలలో జన్మించిన వారు మానసిక శక్తులు పొందగలరు. డాక్టర్లు, జ్యోతిష్కులు ఈ సంఖ్యతో పేరు పెడితే మంచి ఖ్యాతి గడిస్తారు.

## నామ సంఖ్య-71

**ఈ సంఖ్య కలవారు ఆధ్యాత్మిక గురువులుగా ఉంటారు.**

ఈ నామసంఖ్య ఉన్నవారు గొప్ప ఆధ్యాత్మిక భావం కలిగి ఉంటారు. వీరి జీవితం సమస్యలతోను కష్టాలతోను నిండి ఉంటుంది. ఆధ్యాత్మిక గురువులుగా అందరికీ బోధనలు చేసేవారుగా ఉంటారు.

వీరు గొప్ప విద్వాంసులుగా ఉంటారు. అయితే 5,14,23 తేదీలలో జన్మించిన వారు మేధాశక్తితో సంపదను పొందగలరు. మిగతా తేదీలలో జన్మించిన వారికి అంత మంచి ప్రభావం ఉండదు.

## నామ సంఖ్య-72

**ఈ సంఖ్య కలవారు అన్ని ప్రాపంచిక భోగాలు అనుభవిస్తారు.**

కేతు సంఖ్య-7, చంద్రుని సంఖ్య-2, కలిసిన నామసంఖ్య. ఈ నామసంఖ్య కలవారు అన్ని ప్రాపంచిక భోగాలు, సుఖాలు అనుభవిస్తారు. ధన కనక వస్తు వాహనాలు సంపాదిస్తారు. జీవిత ప్రారంభంలో కష్టపడినా తరువాత సర్వసుఖాలు అనుభవిస్తారు. వ్యాపారస్తులకు ఈ నామసంఖ్య చాలా అనుకూలం.

## నామ సంఖ్య-73

**ఈ సంఖ్య కలవారు నీతి, దైవభక్తి పెంచుకుంటే కీర్తి, ధనం లభిస్తాయి.**

ఈ నామ సంఖ్య కలవారు నిజాయితీ, దైవభక్తి అలవరచుకుంటే పేరు ప్రతిష్టలు, సంపద లభిస్తాయి. ప్రభుత్వాధికారుల అండదండలు లభిస్తాయి. స్థిరాస్తులు సంపాదిస్తారు. జీవితం సుఖమయం కావటానికి ప్రణాళికలు వేసి విజయం సాధిస్తారు. కానీ వీరు చెడు మార్గాల వైపు పోతే, దుష్ప్రభావం ఉంటుంది. కాబట్టి, నిజాయితీ, దైవభక్తి కలిగి ఉండాలి.

## నామ సంఖ్య-74

**ఈ సంఖ్య కలవారు మతవిశ్వాసం, ఆధ్యాత్మికత, మానవత కలిగి ఉంటారు.**

ఈ నామసంఖ్య కలిగిన వారు మత విశ్వాసాలు, ఆధ్యాత్మిక భావనలు, మానవతా విలువలు కలిగి ఉంటారు. సమాజ శ్రేయస్సు కోసం పాటు పడుతుంటారు. జీవితంలో అనేక సమస్యలు, ఆర్థిక సమస్యలు ఉంటాయి. కంటికి కనిపించే మనుషుల కంటే, మనసులో కనిపించే దైవాన్ని నమ్ముకోవాలి అని చివరకు భావిస్తారు. ఈ నామసంఖ్య ఆధ్యాత్మిక గురువులకు అనుకూలం.

## నామ సంఖ్య-75

**ఈ సంఖ్య కలవారు కవులు, రచయితలు, కళాకారులుగా రాణిస్తారు.**

కేతు సంఖ్య-7, బుధుడి సంఖ్య-5 కలిసి ఉన్న నామసంఖ్య. ఈ నామసంఖ్య ఉన్న వారు. రచయితలుగా, కవులుగా, కళాకారులుగా రాణిస్తారు. సాయం చేసే మిత్రులు ఉంటారు. మెల్లగా జీవితంలో పేరు ప్రతిష్టలు సంపాదిస్తారు. కానీ 6, 15, 24, తేదీలలో జన్మించిన వారికి ఈ నామసంఖ్య మంచిది కాదు.

## నామ సంఖ్య-76

**ఈ సంఖ్య కలవారు పరోపకారులుగా ఉంటారు.**

ఈ నామ సంఖ్య కలవారు పరోపకారులుగా ఉంటారు. వినూత్న విధానాలు, పద్ధతుల వలన సంపద పొందుతారు. సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తారు. ఇతరులకు తెలియకుండా కూడా ధనసంపాదన చేస్తారు. చివరలో సంపదను పోగొట్టుకుంటారు. ఏ తేదీలో జన్మించిన వారికీ ఈ సంఖ్య అనుకూలం కాదు.

## నామ సంఖ్య–77

**ఈ సంఖ్య కలవారు నిజాయితీ, దైవభక్తి కలిగి ఇతరులపై ఆధారపడకుండా ఉంటారు.**

కేతు సంఖ్య–7, రెండు ఉన్న నామసంఖ్య న్యాయం, నిజాయితీ కలిగి ఉంటారు. దైవభక్తి పరాయణులు. ఇతరులపై ఆధారపడకుండా స్వయం కృషితో ఉన్నత స్థితిని సాధిస్తారు. గొప్ప సంకల్ప బలం వీరికి సొంతం.

విదేశీ ప్రయాణాలు చేస్తుంటారు. వీరు మతాభివృద్ధికి కృషి చేస్తారు. భోగ భాగ్యాలతో సుఖజీవితం గడుపుతారు. వ్యాపారసంస్థలకు ఈ నామసంఖ్యతో పేరు పెడితే త్వరగా అభివృద్ధి సాధిస్తారు.

## నామ సంఖ్య–78

**ఈ సంఖ్య కలవారు సమాజసేవ పట్ల ఆసక్తి కలిగి ఉంటారు.**

ఈ నామసంఖ్య కలవారు అందరిచేత గౌరవింపబడే వారుగా ఉంటారు. ఆధ్యాత్మిక, మత విశ్వాసాలు ఉంటాయి. సమాజ సేవ పట్ల ఆసక్తి కలిగి ఉంటారు. సాధుజీవనం గడుపుతారు. ధనం దానంతట అదే వీరి వద్ద చేరుతుంది. వీరికి భవిష్యత్తు చెప్పగలిగే శక్తి ఉంటుంది. ప్రశాంతత, వాత్సల్యం వీరి ముఖంలో కనిపిస్తూ ఉంటుంది.

## నామ సంఖ్య–79

**ఈ సంఖ్య కలవారు శక్తియుక్తులతో గొప్పవారుగా పేరు పొందుతారు.**

ఈ నామసంఖ్య కలవారి ప్రారంభ జీవితం సమస్యాత్మకంగా ఉంటుంది. తరువాత కష్టించి అభివృద్ధి సాధిస్తారు. తమ శక్తియుక్తులు, నైపుణ్యంతో ప్రగతి సాధిస్తారు. సమాజంలో గొప్ప వ్యక్తులుగా పేరు పొందుతారు.

అందరూ వీరి సలహాలు తీసుకుంటారు. కానీ వీరి కుటుంబ జీవితం సంతృప్తికరంగా ఉండదు. ఆర్థికంగా అభివృద్ధి సాధించలేరు.

## నామ సంఖ్య-80

**ఈ సంఖ్య కలవారు తత్వజ్ఞానం కలిగి ఉంటారు.**

ఈ నామసంఖ్యతో జన్మసంఖ్యకు సఖ్యత ఉంటే, అభివృద్ధి సాధించగలుగుతారు. వీరు తత్వజ్ఞానాన్ని కలిగి ఉంటారు. ప్రకృతి కూడా వీరికి సహాయకారిగా ఉంటుంది. కానీ వీరిచుట్టూ ఎప్పుడు ప్రమాదాలు పొంచి ఉంటాయి. 5,14,23,6,15,24 తేదీలలో జన్మించిన వారికి ఈ నామసంఖ్య అనుకూలం. ఇతరులకు అంత మంచిది కాదు.

## నామ సంఖ్య-81

**ఈ సంఖ్య కలవారు జ్ఞానులుగా ప్రజాసేవకులుగా ఉంటారు.**

ఈ నామసంఖ్య కలవారు జ్ఞానులుగా ప్రజా సేవకులుగా ఉంటారు. ఇతరులకు సన్మార్గం, దిశానిర్దేశం చేయగల శక్తి కలిగి ఉంటారు. జీవితంలో అభివృద్ధి సాధించాలనే వాంఛ కలిగి ఉంటారు. వీరు జాగ్రత్త కలిగి ఉంటే అభివృద్ధి సాధించగలరు. ఈ నామసంఖ్య కలవారు సాధారణంగా సుఖజీవితం గడుపుతారు. గొప్ప గురువులుగా రాణించగలుగుతారు. వీరికి మానసిక ఆందోళన ఉంటుంది. దాని వల్ల వారి భావాలను ఎవరితోనూ పంచుకోలేక మధనపడుతుంటారు.

## నామ సంఖ్య-82

**ఈ సంఖ్య కలవారు క్రమశిక్షణ కలిగి నాయకులుగా ఉంటారు.**

ఈ నామసంఖ్య కలవారు క్రమశిక్షణ కలిగి బాధ్యతాయుతంగా ఉంటారు. వీరు నాయకులుగా, నేతలుగా ఎదిగి ఇతరులకు మార్గదర్శకులవుతారు. మధ్యతరగతిలో జన్మించినా, కృషి చేసి ఉన్నతస్థితికి చేరుకుంటారు.

వాహనాలపై ఆసక్తి ఉంటుంది. కొత్త రకాల వాహనాలు కొంటారు. మంచి వ్యక్తిత్వంతో అందరినీ ఆకర్షిస్తారు. కానీ శృంగారం, భౌతిక సుఖాలపై ఆసక్తి తగ్గించుకుంటే మంచిది. గౌరవప్రదమైన పదవులు లభిస్తాయి.

## నామ సంఖ్య-83

**ఈ సంఖ్య కలవారు ఉన్నతస్థితి, సామాజిక హోదా పొందుతారు.**

ఈ నామసంఖ్య కలవారు తమ చుట్టూ ఉన్న వారిని, గౌరవిస్తూ, ఆదరాభిమానాలతో చూస్తారు. అందువలన వీరికి మంచి గౌరవం లభిస్తుంది. గొప్ప ఉన్నత స్థితి, సామాజిక హోదాను పొందుతారు. సంతోషకరమైన జీవితం గడుపుతారు. పెద్ద పదవులు వీరిని అయాచితంగా వరిస్తాయి. సంఘంలో నాయకులుగా కీర్తించబడతారు. వీరి సలహాల వలన చాలా మంది ప్రయోజనం పొందుతారు.

## నామ సంఖ్య-84

**ఈ సంఖ్య భక్తిమార్గంలో వెళ్ళేవారికి అనుకూలం.**

ఈ నామసంఖ్య ఆధ్యాత్మికత కోసం ప్రయత్నించే వారికి అనుకూలం. ఈ సంఖ్య వలన భౌతిక సుఖాలు లభించవు. ఎంత శ్రమించి పనిచేసినా ఫలితం లభించదు. అందువలన విరక్తి చెంది భక్తిమార్గంలోకి వెళ్తారు. కొందరు తీవ్రవాదులుగా మారే అవకాశం కూడా ఉంది. వీరికి అభివృద్ధి కొంత ఆలస్యంగా వస్తుంది. 3,12,21,30 తేదీలలో జన్మించిన వారికి ఈ నామసంఖ్య అనుకూలం.

## నామ సంఖ్య-85

**ఈ సంఖ్య కలవారు పరిశోధన, రచనల పట్ల ఆసక్తి కలిగి ఉంటారు.**

ఈ నామసంఖ్య కలవారు పరిశోధనా రంగంపై ఆసక్తి కలిగి ఉంటారు. వీరికి సమాజంలో గౌరవం ఉంటుంది.

రచనా వ్యాసంగంపై ఆసక్తి కలిగి ఉంటారు. ఇతరుల సమస్యలు కేవలం వినటం మాత్రమే కాక, పరిష్కరించటానికి ప్రయత్నిస్తారు. వైద్యులుగా రాణించగలరు. సంప్రదాయల విలువలు గూర్చి వివరిస్తూ, మనిషి ఎలా జీవించాలో అందరికీ తెలియచేస్తారు.

## నామ సంఖ్య-86

**ఈ సంఖ్య కలవారు ముందు కష్టపడి తరువాత అభివృద్ధి సాధిస్తారు.**

ఈ నామసంఖ్య కలవారు జీవిత ప్రథమంలో ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొంటారు. ఎంతో శ్రమించటం వలన, వయసుతో పాటుగా వీరి ప్రగతి కూడా పెరుగుతుంది. ప్రభుత్వాధికారులు, సంపన్నుల అండదండలతో వృద్ధిలోకి వస్తారు. పెట్టుబడి లేకుండా వ్యాపారం చేసి లాభం గడిస్తారు. చివరకు సుఖజీవితం గడుపుతారు.

## నామ సంఖ్య-87

**ఈ సంఖ్య కలవారు క్రూరులుగా ఉంటారు.**

ఈ నామసంఖ్య కలవారు క్రూర ప్రవృత్తి కలవారై ఉంటారు. అడవులు, కొండకోనల్లో తిరుగుతుంటారు. పాములు, అడవి జంతువులను వేటాడి పట్టుకుంటారు. ధన సంపాదనకు చెడు మార్గాలు అవలంభిస్తారు. ఈ సంఖ్య ఏ మాత్రం మంచిది కాదు.

## నామ సంఖ్య-88

**ఈ సంఖ్య కలవారు శాంతి, ఓర్పు, ఆధ్యాత్మికత కలవారుగా ఉంటారు.**

ఈ నామసంఖ్య కలవారు శాంతి, సహనం, ఆధ్యాత్మికత, సమభావం, ప్రేమ, కరుణ కలిగి ఉంటారు. ఉన్నత స్థితిలో ఉన్నా తమ కింది వారిని తమతో సమానంగా ఆదరిస్తారు. కులమతాలకు అతీతంగా అందరూ దేవుని బిడ్డలే అని ప్రకటిస్తారు. వీరు గొప్ప ఆధ్యాత్మికత కలిగి, మత గురువులుగా ఉంటారు. 2, 11, 20, 29 తేదీలలో జన్మించిన వారు ప్రాపంచిక సుఖాలు అనుభవిస్తారు.

## నామ సంఖ్య-89

**ఈ సంఖ్య కలవారు స్వయంకృషితో ఉన్నతస్థితి సాధిస్తారు.**

ఈ నామసంఖ్య కలవారు చాలా అందంగా ఉండి, పురుషులైతే స్త్రీలను, స్త్రీలయితే పురుషులను ఆకర్షిస్తారు. జీవిత ప్రారంభంలో కష్టాలు కలిగినా, స్వయంకృషితో ఉన్నతస్థితిని

సాధిస్తారు. భూ, ధన, కనక, వస్తు, వాహనాలు సంపాదిస్తారు. వీరి కంఠస్వరం గంభీరంగా ఉంటుంది. ఆకర్షణీయంగా ఉంటారు. 5, 14, 23 తేదీలలో జన్మించిన వారికి స్త్రీ మూలంగా ఆస్తి ప్రాప్తిస్తుంది. ఈ నామసంఖ్య గల వారికి 'శని' యొక్క పూర్తి అనుగ్రహం లభిస్తుంది. వీరు శని జపం చేయించుకోవటం మంచిది.

## నామ సంఖ్య-90

**ఈ సంఖ్య కలవారి ప్రయత్నాలు ఫలించి, కీర్తి ప్రతిష్టలు, సంపద కలుగుతాయి.**

ఈ నామసంఖ్య కలవారికి కుజుడి యొక్క సంపూర్ణ అనుగ్రహం లభిస్తుంది. వీరి ప్రయత్నాలు సిద్ధిస్తాయి. స్పష్టమైన ఆలోచనలు కలిగి ఉంటారు. కీర్తి ప్రతిష్టలు సంపద లభిస్తాయి. ఏ పని చేసినా వీరికి విజయం ప్రాప్తిస్తుంది. ఆధ్యాత్మిక ఉన్నతికోసం ప్రయత్నించే వారికి ఈ సంఖ్య పనికి రాదు. ప్రాపంచిక సుఖాలు కోరుకున్న వారికి అనుకూలం.

## నామ సంఖ్య-91

**ఈ సంఖ్య కలవారికి ధృడ సంకల్పం ఉంటుంది.**

ఈ నామ సంఖ్య కలవారికి ధృడ సంకల్పం ఉంటుంది. తీవ్రమైన, శక్తివంతమైన స్వభావం కలిగి ఉంటారు. వీరు ఎక్కువగా ప్రయాణాలు చేస్తుంటారు. విదేశీ ప్రయాణాలు కూడా చేస్తారు. ఎగుమతి, దిగుమతి వ్యాపారంలో ధనం సంపాదిస్తారు. యోగాభ్యాసం చేస్తే వీరి మానసిక శక్తి పెరుగుతుంది. గొప్ప పదవులు వరిస్తాయి.

## నామ సంఖ్య-92

**ఈ సంఖ్య కలవారు ప్రాపంచిక, ఆధ్యాత్మిక విషయాలు రెంటిలోనూ ప్రగతి సాధిస్తారు.**

ఈ నామ సంఖ్య కలవారు ప్రాపంచిక, ఆధ్యాత్మిక విషయాలలో ప్రగతి సాధిస్తారు. అనేక మార్గాల ద్వారా ఆదాయం ఉంటుంది. అనారోగ్య, కుటుంబ సమస్యలు ఉంటాయి.

భూమి, బంగారం సంపాదిస్తారు. అస్తమా వంటి వ్యాధులు రావచ్చు. ఆధ్యాత్మికతను పెంచుకొని యోగాభ్యాసం వంటివి చేస్తే, అతీంద్రియ శక్తులు సంప్రాప్తిస్తాయి.

## నామ సంఖ్య-93

**ఈ సంఖ్య కలవారు లోకజ్ఞానం, ఊహాశక్తి కలిగి ఉంటారు.**

కుజుడి సంఖ్య-9, గురుడి సంఖ్య-3, కలిసి ఉన్న సంఖ్య. ఈ నామసంఖ్య కలవారు ప్రాపంచిక జ్ఞానం లోక జ్ఞానం కలిగి ఉంటారు. గొప్ప ఊహాశక్తి కలిగి ఉంటారు. ఇతరులకు సాధ్యం కాని పనులు చేయగలుగుతారు. నాటకాలు, ఇతిహాసాలు, కథలు వ్రాస్తారు. సినీ రచయితలుగా వెలుగొందుతారు. పారిశ్రామికవేత్తలయితే అనేక పరిశ్రమలు నడుపుతారు. కానీ 6,15,24 తేదీలలో జన్మించిన వారికి ఈసంఖ్య మంచిది కాదు.

## నామ సంఖ్య-94

**ఈ సంఖ్య కలవారికి మానవత ఉండి ధనవ్యామోహం ఉండదు.**

ఈ నామసంఖ్యపై రాహువు యొక్క సంపూర్ణ ప్రభావం ఉంటుంది. వీరికి లోకజ్ఞానం అధికంగా ఉంటుంది. ధన వ్యామోహం ఉండదు. మానవతా విలువలు కలిగి ఉంటారు. సమాజసేవ పట్ల ఆసక్తి కలిగి ఉంటారు. సంఘ సంస్కరణలు చేస్తే వెలుగులోకి వస్తారు. జీవితంలో ఒడిదుడుకులు ఉంటాయి. ప్రజాశ్రేయస్సు కోసం పాటుపడతారు.

## నామ సంఖ్య-95

**ఈ సంఖ్య కలవారు క్రమశిక్షణ కలిగి పేరు ప్రఖ్యాతులు పొందుతారు.**

ఈ నామసంఖ్య కలవారు, క్రమశిక్షణ కలిగి పేరు ప్రఖ్యాతులు పొందుతారు. గొప్ప సమస్యలు, విపత్తులు ఎదురయినా, వాటి నుండి తప్పించుకోగలుగుతారు. ఇతరులను అబ్బుర పరిచే విధంగా సాహసకృత్యాలు చేస్తారు.

ఆధునిక వస్తువులు, పరికరాలు, విదేశీ వస్తువుల విక్రయం ద్వారా ధనం ఆర్జిస్తారు. వీరు మంచి వక్తలుగా ఉంటారు.

## నామ సంఖ్య-96

**ఈ సంఖ్య కలవారిపై సరస్వతీ, లక్ష్మీ కటాక్షం ఉంటుంది.**

కుజుడి సంఖ్య-9, శుక్రుడి సంఖ్య-6, కలిసిన నామసంఖ్య. ఈ సంఖ్య కలవారికి, సరస్వతీ, లక్ష్మీ కటాక్షం ఉంటుంది. వీరు చాలా ఆకర్షణీయంగా ఉండి, పురుషులైతే స్త్రీలను, స్త్రీలయితే పురుషులను ఆకర్షిస్తారు. వీరి ఆకర్షణ శక్తి చేత ఏ పనైనా సాధించగలుగుతారు. ఈ సంఖ్య కామవాంఛను ప్రేరేపిస్తుంది. వృత్తి కళలు, కళల జ్ఞానాన్ని సులభంగా పొందగలుగుతారు. అదృష్టాన్ని తెస్తుంది కాబట్టి ఈ నామసంఖ్యతో ఎవరైనా పేరు పెట్టుకోవచ్చు.

## నామ సంఖ్య-97

**ఈ సంఖ్య కలవారికి ఆధ్యాత్మిక భావం, సంపద రెండూ ఉంటాయి.**

ఈ నామసంఖ్య కలవారు ఆధ్యాత్మిక భావం, సంపద రెండూ కలిగి ఉంటారు. వీరికి పురాణ, ఇతిహాసాలు, లలితకళలలో మంచి ప్రావీణ్యం ఉంటుంది. ఇతరులకు కష్టసాధ్యమైన పనులు వీరు చేయగలుగుతారు. అందువలన అందరి మన్ననలు, పేరు, సంపద పొందుతారు. 2, 11, 20, 29 తేదీలలో జన్మించిన వారు సంపద, కీర్తి పొందుతారు.

## నామ సంఖ్య-98

**ఈ సంఖ్య కలవారికి తెలివి, జ్ఞానం ఉన్నప్పటికీ తగిన గుర్తింపు లభించదు.**

ఈ నామసంఖ్య కలవారికి మంచి తెలివితేటలు, వివేకం, జ్ఞానం ఉన్నప్పటికీ, ఈ సంఖ్యపై శని యొక్క సంపూర్ణ వ్యతిరేక ప్రభావం ఉండటం వలన, తగిన గుర్తింపు, సంపద పొందలేరు.

జీవితం కష్టమయంగా ఉంటుంది. కుటుంబ సమస్యలు, ఆరోగ్య సమస్యలు వస్తాయి. ఈ నామసంఖ్య కల వ్యాపార సంస్థలు అప్పులు ఇవ్వకుండా ఉంటే మంచిది. రానిబాకీలు ఉంటాయి.

## నామ సంఖ్య-99

**ఈ సంఖ్య కలవారికి పగ తీర్చుకునే గుణం ఉంటుంది.**

ఈ నామసంఖ్య కలవారిపై కుజుని సంపూర్ణ ప్రభావం ఉంటుంది. వీరు మంచి దేహదారుఢ్యం కలిగి ఉంటారు. తగువుల మారిగా ఉంటారు. పగ తీర్చుకునే స్వభావం ఉంటుంది. మంచి విద్య, విజయాలు, సుఖాలు అన్నీ లభిస్తాయి. కానీ శత్రువులు అధికం. 5, 14, 23 తేదీల్లో జన్మించిన వారికి కొంత ఫరవాలేకపోయినా మిగతా వారికి ఈ సంఖ్య మంచిది కాదు.

## నామ సంఖ్య-100

**ఈ సంఖ్య కలవారికి డబ్బుకు కొరత లేకుండా జీవితం హాయిగా సాగిపోతుంది.**

ఈ నామసంఖ్య కలవారి జీవితం నెమ్మదిగా, సాఫీగా సాగిపోతుంది. ధనానికి కొరత ఉండదు. గొప్ప అదృష్టవంతులు కారుగానీ, సంతృప్తకరమైన జీవితం ఉంటుంది. పెద్దలు సంపాదించిన ఆస్తిపాస్తుల వలన హాయిగా గడిచిపోతుంది.

చిన్న చిన్న వ్యాపారాలు చేస్తే లాభదాయకంగా ఉంటుంది. జీవితంలో అధిక సమస్యలు లేకుండా పరిమితంగా వుండి ఎటువంటి పెద్ద మార్పులు లేకుండా గడిచిపోతుంది.

## నామ సంఖ్య-101

**ఈ సంఖ్య కలవారు పెట్టుబడి లేకుండా ధనసంపాదన చేస్తారు.**

ఈ నామసంఖ్య కలవారు ఎటువంటి పెట్టుబడి లేకుండా ధన సంపాదన చేస్తారు. కానీ చంద్ర ప్రభావం వలన వ్యాపారంలో ఆటుపోట్లు ఉంటాయి. అధికారంలో ఉన్న వారి అండదండలు లభిస్తాయి.

వీరికి ఒక్కొక్కసారి బుద్ధి మందగిస్తుంది. 7, 16, 25 తేదీల్లో జన్మించిన వారికి మాత్రమే ఈ సంఖ్య కొంతవరకు అనుకూలం.

## నామ సంఖ్య-102

**ఈ సంఖ్య కలవారి జీవితం కష్టాలమయం.**

ఈ నామసంఖ్య కలవారు జీవిత ప్రథమార్ధంలో విజయాలు సాధించి, మధ్య వయస్సులో విఘ్నాలు, నష్టాలు చవిచూచి, చివరకు కష్టాలమయ జీవితం పొందుతారు. అనవసర విషయాలలో తలదూర్చి అభాసుపాలవుతారు. 3, 12, 21, 30 తేదీల్లో జన్మించిన వారికి మాత్రం కొంతమేరకు ఈ నామసంఖ్య ఫరవాలేదు.

## నామ సంఖ్య-103

**ఈ సంఖ్య కలవారు ధనవంతులైనా, జీవిత ద్వితీయార్థంలో కష్టాలు కలుగుతాయి.**

ఈ నామసంఖ్య కలవారు స్థితిమంతులైన తల్లిదండ్రులను కలిగి ఉంటారు. పోటీ ఉన్నప్పటికీ వీరికి విజయం లభిస్తుంది. వ్యాపార సంస్థలు స్థాపించి మంచి, నిలకడ గల ఆదాయం పొందుతారు. కాబట్టి ఈ సంఖ్యను అదృష్ట సంఖ్యగా చెప్పవచ్చు. 1, 10, 19, 28 తేదీల్లో జన్మించిన వారు ఈ సంఖ్యలో వారి పేరుగాని, సంస్థ పేరుగాని పెట్టుకుంటే ప్రథమార్ధంలో మంచి ప్రగతి ఉంటుంది, ద్వితీయార్ధంలో నష్టాలు, కష్టాలు ఎదుర్కోవలసి వస్తుంది.

## నామ సంఖ్య-104

**ఈ సంఖ్య కలవారు పేరు పొందుతారు కాని సంపద పొందలేరు.**

ఈ నామసంఖ్య కలవారి ప్రారంభ జీవితం బాగున్నా ఆ తరువాత పెద్దగా ప్రయోజనం లేదు. పెద్ద పెద్ద కార్యాలు చేసి అందరి మన్ననలు పొందుతారు.

కానీ సంపదను పొందలేరు. పొగడ్తలకు లొంగిపోతారు. వీరు ఎంతో పేరు ప్రఖ్యాతులు పొందుతారు. అందరూ వీరి చుట్టూ చేరతారు. కానీ ధనం మాత్రం వీరి దగ్గర ఆశించినంతగా ఉండదు.

## నామ సంఖ్య–105

**ఈ సంఖ్య కలవారు విలాసవంతమైన జీవితం గడుపుతారు.**

ఈ నామసంఖ్య కలవారు అదృష్టం, తృప్తి, సంపద, కీర్తి కలిగిన వారై ఉంటారు. వీరి వ్యాపారం దినదినాభివృద్ధిగా జరుగుతుంది. విలాసవంతమైన జీవితం గడుపుతారు. వీరికి మంచి సంతానం కలుగుతుంది. 3, 12, 21, 30 తేదీల్లో జన్మించిన వారు ఈ సంఖ్యతో తమ పేరుగాని, వ్యాపార సంస్థ పేరుగాని పెట్టరాదు.

## నామ సంఖ్య–106

**ఈ సంఖ్య కలవారు సమస్యలతో సతమతమవుతారు.**

ఈ నామ సంఖ్య కలవారు ప్రారంభంలో విజయాలు సాధించినా తరువాత కష్టాలపాలవుతారు. కేతువు యొక్క సంపూర్ణ వ్యతిరేక ప్రభావం ఈ సంఖ్యపై ఉంటుంది. కుటుంబం, వ్యాపారంలోని సమస్యలతో సతమతమవుతారు. జీవిత ద్వితీయార్థంలో ఆధ్యాత్మిక భావం విడిచి, భౌతిక విషయాలపై దృష్టిసారిస్తారు. 2, 11, 20, 29 తేదీల్లో జన్మించిన వారికి ఈ సంఖ్య కొంత ఫరవాలేదు.

## నామ సంఖ్య–107

**ఈ సంఖ్య కలవారికి జీవితంలో ప్రశాంతత ఉండదు.**

ఈ నామసంఖ్య కలవారికి శని ప్రభావం వలన కీర్తి, సంపద, విజయాలు కలుగుతున్నా సంతృప్తి ఉండదు.

కుటుంబ జీవితంలో ప్రశాంతత ఉండదు. స్త్రీలకు పురుషుల వలన, పురుషులకు స్త్రీల వలన సమస్యలు వస్తాయి. అన్ని సంపదలు ఉన్నా ఆనందం ఉండదు. జీవిత చరమాంకంలో తన వారికి దూరంగా కాలం గడుపుతారు.

## నామ సంఖ్య–108

**ఈ సంఖ్య కలవారికి విజయం, ఉన్నత స్థితి, అంతర్జాతీయ ఖ్యాతి లభిస్తాయి.**

ఈ నామసంఖ్య కలవారికి ప్రయత్న సిద్ధి కలిగి విజయం వరిస్తుంది. వీరు మంచి శరీర దారుఢ్యం కలిగి ఉంటారు. ఆత్మవిశ్వాసంతో సాహస కృత్యాలు చేస్తారు. ఉన్నత స్థితిని పొందుతారు. దూర ప్రయాణాలు చేస్తారు. అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జిస్తారు. నాయకులుగా ఎదుగుతారు. ఇతరులకు సాధ్యం కాని పనులు చేస్తారు. కానీ 2, 11, 20, 29, 7, 16, 26 తేదీల్లో జన్మించిన వారికి ఈ నామసంఖ్య అంత మంచిది కాదు.

# నామ విశ్లేషణ

మీ పేరు, మీ వ్యక్తిత్వానికి, వ్యక్తిగత ప్రకంపనలకు సంకేతం. పేరును వీనులవిందైన, రాగయుక్తమైన ఓ సంగీత కృతిలా భావించవచ్చు. దాని రాగప్రకంపనలు మీ గురించే వర్ణిస్తాయి. పేరు మీరు జన్మించిన వరకు మీకు గల సంచిత వారసత్వ లక్షణాలను తెలియచేస్తుంది. ఒక రకంగా దీనిని మీరు జన్మించిన వరకు గల మీ "జీవిత చరిత్ర" గా అభివర్ణించవచ్చు.

మీరు ఎటువంటి వారు అనేది మీ పేరును చూసి చెప్పవచ్చు. గత జన్మ, పునర్జన్మల గురించి చాలా వాదోపవాదాలు ఉన్నాయి. ఆ వాదాలు అనవసరం కానీ, పేరు అనేది ఒక పరిణామక్రమంలో సంచిత వారసత్వంగానే మనల్ని చేరుతుందనేది నిజం.

కొందరు వారి తల్లిదండ్రులను నిందిస్తూ ఉంటారు, పేరు సరిగా పెట్టలేదని కానీ అలా అనటం సరి కాదు, ఎందుకంటే తల్లిదండ్రులు, బిడ్డల పేర్లు, తలవని తలంపుగా, బిడ్డ పూర్వజన్మలో చేసిన పాపపుణ్యాల ప్రకారం వాటి ప్రకంపనలకు అనుగుణంగా, అసంకల్పితంగా పెడతారు. ఆ పేరు వారికి రాసిపెట్టి ఉంటుంది. ఇందులో తల్లిదండ్రుల పాత్ర పెద్దగా ఉండదు. మీ కర్మానుసారంగానే మీ పేరు పెట్టబడుతుంది. చివరి నిమిషంలో పేరు మార్చటం లాంటివి దీనికి ఉదాహరణ.

పేరు మీ ఆత్మసంగీత ప్రకంపనలు మాత్రమే కాకుండా, మీ గత జన్మల సంచిత జ్ఞానం, అనుభవం, కర్మసారాలను వారసత్వ పరిణామ క్రమంగా మార్చి, ఇపుడు మీ యొక్క వ్యక్తిత్వాన్ని తెలియచేస్తాయి.

నామసంఖ్యను 3 భాగాలుగా విభజించవచ్చు. ఆ 3 భాగాలకు 3 నెంబర్లు ఉంటాయి. ఈ 3 సంఖ్యలే మీ యొక్క వ్యక్తిత్వాన్ని, దశ, దిశానిర్దేశం లాంటి వాటిని తెలియచేస్తాయి. అవి

1) మోటివేషన్ నెంబర్ (ప్రోత్సాహక సంఖ్య)

2) ఇంప్రెషన్ నెంబర్ (భావ సంఖ్య)

3) ఎక్స్‌ప్రెషన్ నెంబర్ (వ్యక్తీకరణ సంఖ్య)

**1. మోటివేషన్ నెంబరు (ప్రోత్సాహక సంఖ్య)**

**మీ పేరులో ఉన్న అచ్చుల యొక్క అక్షర సంఖ్యలు కలుపగా వచ్చేది మోటివేషన్ నెంబరు.**

పేరు అక్షరాల సమాహారం. అందులోని అచ్చుల సంఖ్యలను కలుపగా వచ్చే సంఖ్య, మోటివేషన్ నెంబరు. ఇది మీ జీవిత గమ్యాన్ని, గమ్యసాధనకు మీలో ఉన్న ప్రోత్సాహకశక్తిని తెలియచేస్తుంది.

**2. ఇంప్రెషన్ నెంబరు (భావ సంఖ్య)**

**మీ పేరులో ఉన్న హల్లుల యొక్క అక్షర సంఖ్యలు కలుపగా వచ్చేది ఇంప్రెషన్ నంబరు.**

పేరులో ఉన్న హల్లుల యొక్క సంఖ్యలను కలుపగా వచ్చే మొత్తమే, ఇంప్రెషన్ నెంబరు. ఇది మీ కలలు సాకారమయ్యే సూచనలను, మీ మనసులో భావ ప్రకంపనలను, ఊహాలలో మీరు అనుకుంటున్న మీ ప్రపంచాన్ని, ఇలాంటి వాటిని తెలియచేస్తుంది. ప్రయత్న సిద్ధి ఉంటే నేటి కలలే రేపు సాకారమవుతాయి.

**3. ఎక్స్‌ప్రెషన్ నెంబరు (వ్యక్తీకరణ సంఖ్య)**

**మీ పేరులో ఉన్న మొత్తం అక్షరాల అక్షర సంఖ్యలు కలుపగా వచ్చేది ఎక్స్‌ప్రెషన్ నెంబరు. అదే మీ నామసంఖ్య.**

ఇది పేరులో ఉన్న అక్షరాలు, అచ్చులు, హల్లులు సంఖ్యల మొత్తాన్ని తెలియచేస్తుంది. ఈ నెంబర్, మీ శక్తి సామర్థ్యాలను, మీ భావ వ్యక్తీకరణ తెలియచేస్తుంది.

పై వాటిలో, మోటివేషన్ నెంబరు, ఎక్స్‌ప్రెషన్ నెంబరు (1 మరియు 3) చాలా ముఖ్యమైనవి, ప్రభావవంతమైనవి. శక్తి సామర్థ్యాలు ఉన్నా సరియైన ప్రోత్సాహం లేకపోతే నిరర్థకం అవుతుంది. ఇంప్రెషన్ నెంబరు అనేది కార్యరంగానికి సంబంధించినది కాదు. అది మీలో ఉన్న ఊహాలకు, మీ వ్యక్తిత్వానికి సంబంధించినది. అంత మాత్రాన దీన్ని

తక్కువ చేయకూడదు. పై 3 నెంబర్లు తీసుకుంటేనే ఒక వ్యక్తి యొక్క పరిపూర్ణ వ్యక్తిత్వాన్ని నిర్ధారించటం జరుగుతుంది.

ఇపుడు మోటివేషన్ నెంబరు 1 నుండి 9 వరకు గల వ్యక్తుల గురించి తెలుసుకుందాం.

**మోటివేషన్ నెంబరు – 1**

వీరు సంఘంలో గుర్తింపు పొందాలని భావిస్తారు. నాయకులుగా, నిర్దేశకులుగా వ్యవహరించటానికి ఆసక్తి చూపుతారు. వీరి ఆలోచనలు, భావాలు సరియైనవి, సృజనాత్మకమైనవని. అన్ని సమస్యలకు తమ వద్ద పరిష్కారం ఉంటుందని భావిస్తుంటారు. స్వేచ్ఛా ప్రియులు. స్వాతంత్రేచ్ఛ కలిగినవారుగా ఉంటారు. వీరి భావాలు, ఆలోచనలకు ఆకర్షితులయిన వారిని చాలా ముఖ్యులుగా భావించి ఆదరిస్తారు.

**మోటివేషన్ నెంబరు – 2**

ప్రశాంత జీవనం, ప్రేమించే వ్యక్తులతో సహజీవనం, ఎటువంటి అంతరాయాలు లేని, హఠాత్తు మార్పులు లేని, సుఖజీవనం కోరుకుంటారు. పనులు పూర్తి చేయటంలో సహాయ సహకారాలు అందిస్తుంటారు. తాము సహాయం చేసిన వారి విజయాలను చూసి ఆనందిస్తారు. వీరు చేసిన సాయం చిన్నదైనా, అది ఎంతో ప్రేమతో కూడి చాలా విలువైనదిగా ఉంటుంది. సహకారం, శాంతి వీరికి ప్రధానం. సమస్యా పరిష్కారంలో దౌర్జన్యం, బలం కంటే సహనం, ఓర్పు, నేర్పు, లౌక్యం లాంటి వాటిని నమ్ముతారు.

**మోటివేషన్ నెంబరు – 3**

జీవితం అందంగా, ఆనందంగా, సుఖంగా, విలాసవంతంగా ఉండాలని కోరుకుంటారు. జీవితాన్ని కళాత్మకంగా, అందంగా గడపాలనుకుంటారు. సామాజికమైన గుర్తింపుకు అధిక ప్రాధాన్యత ఇస్తారు.

అందరినీ రంజింపచేస్తూ తాము ఆనందించాలని భావిస్తారు. చక్కగా, ఆకర్షణీయంగా వస్త్రధారణ చేస్తారు. శృంగారప్రియులు. వీరు శృంగార విషయంలో జీవిత భాగస్వామికి అన్యాయం చేయకపోయినా, ఆకర్షణీయమైన వారిని చూస్తుంటారు. ఒక్కొక్కసారి కాలుజారవచ్చు. మంచి చతురత కలిగి ఉంటారు.

**మోటివేషన్ నెంబరు – 4**

వీరు ప్రతీ విషయాన్ని ప్రాక్టికల్‌గా చూస్తారు. జీవితాన్ని, జాగ్రత్తగా, సరియైన అంచనాలు వేస్తూ, క్రమశిక్షణతో గడుపుతూ విజయాలు సాధిస్తారు. ప్రతి విషయం సవ్యంగా ఉండాలని కోరుకుంటారు. ఉద్యోగం, వృత్తి, కుటుంబం, దేశం, ఏ విషయంలోనైనా బాధ్యతాయుతంగా ప్రవర్తిస్తారు. నూతన మార్గాలు, పద్ధతుల కంటే, సాంప్రదాయబద్ధమైన పద్ధతులు అవలంబిస్తారు. గౌరవప్రదమైన స్థానం, మంచి ఆర్థిక స్థితిని కోరుకుంటారు.

**మోటివేషన్ నెంబరు – 5**

వ్యక్తి స్వాతంత్ర్యానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. సుఖభోగాలు, కొత్తదనం, కొత్త అనుభవాలు కోరుకుంటారు. తమకు ఇష్టమైన వాటిని ఎన్నుకోవడానికి తగిన స్వేచ్ఛను ఆశిస్తారు. ఇతరుల ప్రభావం, ఆధిపత్యంలో ఎక్కువ కాలం ఉండటానికి ఇష్టపడరు. శృంగారం, రుచికరమైన భోజనంపై మక్కువ ఎక్కువ. వీరికి ఆకలి కూడా ఎక్కువే. కొత్త కొత్త పరిచయాలను, స్నేహితులను కోరుకుంటారు.

**మోటివేషన్ నెంబరు – 6**

వీరు కళాత్మక, సామాజిక సమతుల్యతని కోరుకుంటారు. గొప్ప న్యాయబుద్ధి కలిగి అందరూ సమానం అనే ధృక్పథం కలిగి ఉంటారు. అన్ని పరిస్థితులకు అనుగుణంగా నడుచుకోవడానికి ప్రయత్నిస్తారు. ఇతరుల విషయంలో బాధ్యతాయుతంగా ఉంటారు. ఇతరులకు సహాయం చేయాలనే వీరి కోరిక, ఒక్కొక్కసారి, తమకు నష్టం కలిగించినా వెనుకాడరు. కుటుంబ బాధ్యతలు చక్కగా నిర్వర్తిస్తారు. రంగులు, వస్త్రాల పట్ల మక్కువ కలిగి ఫ్యాషన్ డిజైనింగ్‌లో అభిరుచి కలిగి ఉంటారు.

**మోటివేషన్ నెంబరు – 7**

వీరు వ్యక్తిగత ఏకాంతం కోరుకుంటారు. ఒంటరిగా ఉండి ఆలోచిస్తుంటారు. పాల్గొనటం కంటే పరిశీలనకు ప్రాధాన్యత ఇస్తారు. తమ తెలివితేటల్ని, సామర్థ్యాన్ని గుర్తించిన వారినే ఇష్టపడతారు. భావాలను భౌతికంగా కాకుండా మానసికంగా తెలియచేస్తుంటారు. వివేకం, జ్ఞానం పట్ల ఆకర్షితులై విజ్ఞానశాస్త్రం, నిగూఢ గుప్త

శాస్త్రాలు నేర్చుకోవాలనుకుంటారు. వీరి సిద్ధాంత సాధనకై సాంప్రదాయ పద్ధతులను అధిగమించడానికి కూడా వెనుకాడరు.

**మోటివేషన్ నెంబరు - 8**

వీరికి అధికారం, ఇతరులపై ఆధిపత్యం సాగించటం అంటే ఆసక్తి. పెత్తనం, ఉన్నతస్థితి, భౌతిక విజయాలపై అభిలాష కలిగి ఉంటారు. ధనం పై కూడా ప్రీతి ఎక్కువ. అధిక ధనం, దాని వలన ప్రాప్తమయ్యే లాభాలను కోరుకుంటారు. ఏదైనా లాభదాయకమనిపిస్తే, ఎలాగైనా దానిని పొందటానికి ప్రయత్నిస్తారు. ఉన్నతస్థితిని, గొప్ప జీవితాన్ని కోరుకుంటారు. ఖరీదైన భోజనం చేస్తూ, సుఖభోగాలు అనుభవించటానికి ఆసక్తిగా ఉంటారు. దీని కోసం చాలా శ్రమించి పనిచేస్తారు. తమ చుట్టూ ఉన్న వారి పట్ల బాధ్యతాయుతంగా ప్రవర్తిస్తారు.

**మోటివేషన్ నెంబరు - 9**

వీరు గొప్ప మానవతా దృక్పథం కలిగి ఉండి సమాజాన్ని బాగుచేయాలనే సదుద్దేశం కలిగి ఉంటారు. తమ చుట్టూ ఉన్న వారిపై సానుభూతి కలిగి, స్నేహ సౌభ్రాతృత్వం, కలిగి ఉంటారు. మనుషుల్లో ఉన్న డాంబికత, ఈర్ష్య, ద్వేషాలను అసహ్యించుకుంటారు. వీరు తమ గురించి కాకుండా ఇతరుల గురించి ఎక్కువ ఆలోచిస్తుంటారు. ఒక్కసారే ఎన్నో పనులు చేసి అందరికి లాభం కలిగించాలనుకుంటారు. ఒక్కొక్కసారి భావోద్వేగానికి లోనయ్యి శ్రమించి చేసిన పనులు ఫలితాలని ఇవ్వకుండా ఉండే అవకాశం కూడా ఉంది.

**గమనిక : పేర్ల వైబ్రేషన్స్‌లో మోటివేషన్, ఇంప్రెషన్ నంబర్లు 10, 12, 13, 16, 18 లేకుండా చూసుకోవడం మంచిది.**

# ఇంప్రెషన్ నెంబరు (భావసంఖ్య)

**ఇంప్రెషన్ నెంబరు**

పేరులో ఉన్న హల్లుల యొక్క సంఖ్యల మొత్తం, ఇంప్రెషన్ నెంబరు అవుతుంది. న్యూమరాలజీలో అచ్చులకి, హల్లులకి, వేరు వేరు సంఖ్యలు నిర్ధారించబడి ఉంటాయి. ఇది వ్యక్తుల కలల సామ్రాజ్యాన్ని తెలియచేస్తుంది. ఊహల్లో ఎవరికి వారు, ఊహించుకొనే, కలలుగనే ప్రపంచాన్ని గురించి ఇది తెలియచేస్తుంది. కలలు వాస్తవం కాదు. కానీ వాటి స్ఫూర్తితో శ్రమించి భవిష్యత్తులో కొంతవరకైనా విజయం సాధించవచ్చు.

**ఇంప్రెషన్ నెంబరు – 1**

ఈ ప్రపంచం కొత్త దిశానిర్దేశం కోసం వేచి చూస్తుంది. వీరు ఆ దిశానిర్దేశం చేయగలిగే భావుకత కలిగి ఉంటారు. కొత్త పద్ధతులు, కొత్త రంగాలకి మార్గదర్శకత్వం వహించి, తమ ఆలోచనలను సత్వరంగా సాకారం చేస్తారు. ఇతరులకు సాధ్యం కానిది వీరు చేయగలుగుతారు.

**ఇంప్రెషన్ నెంబరు – 2**

వీరు, తమ ఆదరణకు నోచుకున్న వారితో చుట్టుముట్టబడి వుంటారు. మానసిక ప్రశాంతత, జీవితానికి కావాల్సిన మౌలిక సౌకర్యాలు వీరికి అందుబాటులో ఉంటాయి. వీరు ఎంతో సానుభూతి కలిగి తమపై ఆధారపడిన వారిని ఆదరంగా, ప్రేమగా చూస్తారు.

**ఇంప్రెషన్ నెంబరు – 3**

వీరు ఆకర్షణీయంగా ఉండి, తెలివితేటలు, మంచి చతురత కలిగి, చుట్టూ ఉన్న పరిస్థితులకు అనుగుణంగా నడుచుకుంటారు. ఎపుడూ విందు వినోదాలలో పాల్గొంటూ, చుట్టూ అభిమానులతో కళకళలాడుతూ ఉంటారు. పెద్ద నగరాలలో మంచి ఉన్నతమైన జీవితం గడుపుతారు. అన్ని సుఖభోగాలు అనుభవిస్తారు.

**ఇంప్రెషన్ నెంబరు – 4**

వీరు చాల శక్తివంతులు, నమ్మకస్తులుగా ఉంటారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు, సన్నిహితులు, తమపై ఆధారపడిన వారికి వీరు అండగా ఉంటారు. కుటుంబం పట్ల, దేశం పట్ల తమ బాధ్యతలు సక్రమంగా నిర్వర్తిస్తూ, ఎలాంటి ఒడిదుడుకులు లేని

ప్రశాంత జీవనం సాగిస్తారు. తమచుట్టూ సక్రమమైన వ్యవస్థను ఒకటి ఏర్పాటు చేసుకుంటారు.

**ఇంప్రెషన్ నెంబరు – 5**

వీరు స్వేచ్ఛగా, బాధ్యతా రహితంగా ఉంటారు. శారీరక సుఖాలకు ప్రాధాన్యత ఇస్తూ ఎపుడూ ఒక దగ్గర స్థిమితంగా ఉండరు. శృంగారం, మంచి భోజనం, డ్రింక్స్ లాంటివి వీరికి కొరత ఉండదు. వీరు ఇంటిలోనే అన్ని భోగాలు అనుభవిస్తారు.

**ఇంప్రెషన్ నెంబరు – 6**

కళాత్మక, సామాజిక సమతుల్యతను సాధిస్తారు. సామాజిక రుగ్మతలను సరిదిద్దుతారు. వీరు న్యాయబుద్ధి కలిగి విద్యకు, సమాజానికి సంబంధించిన సంస్కరణలకు బీజం వేసి అందరి చేత గౌరవింపబడతారు. ఇంటిని రంగురంగులతో కళాత్మకంగా అలంకరించుకుంటారు.

**ఇంప్రెషన్ నెంబరు – 7**

వీరు ఏకాంతంగా, ప్రశాంతంగా, ఉన్నతస్థాయిలో ఉండి సామాన్య ప్రజల సాధక బాధకాలు పరిశీలన చేస్తుంటారు. విజ్ఞానం, వివేకం కలిగి పరిపూర్ణతత్వ భావం కలిగి ఉంటారు. వీరు తమ మతంలో మతపెద్దగా ఉంటారు. చక్కటి ఆలోచనలు కలిగిన వీరి చుట్టూ ఎప్పుడూ పరిపూర్ణత ప్రశాంతత ఉంటుంది.

**ఇంప్రెషన్ నెంబరు – 8**

ధనం, అధికారంతో వచ్చేవన్నీ వీరి వద్ద ఉంటాయి. అంతర్జాతీయ కళాత్మక సంస్థలకు అధిపతిగా, కళాపోషకులుగా ఉంటారు. అందరి చేత గౌరవింపబడి, తమ వద్ద పనిచేసే ఉద్యోగుల సంక్షేమంతో పాటు దేశ ఆర్థికాభివృద్ధికి కూడా ఇతోధికంగా కృషి చేస్తారు.

**ఇంప్రెషన్ నెంబరు – 9**

మానవ స్థితిగతులను అర్థం చేసుకుని, కళాత్మక ఉన్నతిని సాధించి, విశ్వవ్యాప్తంగా గుర్తింపు పొందగలుగుతారు. వీరికి ప్రజల యందు గల మక్కువ వలన వీరి సామర్థ్యాన్ని మానవత్వ, కళాత్మక రంగాలలో వినియోగించి అందరిచే ప్రేమించబడతారు.

**ఎక్స్‌ప్రెషన్ నెంబరు నామసంఖ్య ఒక్కటే కాబట్టి దాని గురించి మరలా రాయలేదు.**

# 4వ భాగం

## అక్షరాల ప్రభావం

# అచ్చుల ప్రాముఖ్యత

**పేరులోని అచ్చులు మీ ఆత్మ ప్రకంపనలను, వైబ్రేషన్‌ను తెలియజేస్తాయి. భాషకు ప్రాణం అచ్చులు. అలాగే పేరుకి మీ ఆత్మ ప్రకంపనకు ప్రాణం మీ పేరులోని అచ్చులు.**

భాషకు ప్రాణం అచ్చులు. అలాగే వ్యక్తి పేరులోని అచ్చులు ఆ వ్యక్తి ఆత్మ ప్రకంపనలను తెలియజేస్తాయి. పేరులోని మొదటి అచ్చు ఇందులో ప్రధాన భూమిక వహిస్తుంది. అచ్చులు వ్యక్తుల ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తాయి. వాటికి సంబంధించిన గ్రహాలతో అనుసంధానం కలిగి ఉంటాయి. న్యూమరాలజీ, జ్యోతిషం, నిగూఢ శాస్త్ర లక్షణాలు కలిగి వుంటాయి కాబట్టి అవి వ్యక్తుల యొక్క వ్యక్తిత్వాన్ని, వృత్తిని, ప్రవృత్తిని తెలియజేస్తాయి.

శబ్దాన్ని అనుసరించి అచ్చులు 3 రకాలు. అవి పొడుగైనవి, పొట్టివి, మౌనంగా ఉండేవి. అక్షరం యొక్క పాజిటివ్ గుణాలు విశదీకరించినపుడు పొడుగైనవి పూర్తి శక్తి వినియోగం చేస్తాయి. పొట్టివిగా ఉన్నప్పుడు అవి తక్కువ శక్తిని వెదజల్లుతాయి. అది మౌనంగా ఉన్నదైతే దాని శక్తి తరువాత అచ్చుతో కలిసి పనిచేస్తుంది. ఇప్పుడు అచ్చులు A, E, I, O, U గురించి తెలుసుకుందాం.

**A :** ఇది సృజనాత్మకత, స్వతంత్రత, స్వచ్ఛతకు గుర్తు. ఈ అచ్చు మానసిక సంబంధమైనది. మనసులోని సృజనాత్మకతను వెలికితీస్తుంది. పేరులో ఈ అక్షరం మొదట ఉన్నవారు సాహసోపేతంగా, అభివృద్ధి పథంలో ఉంటారు. కాని ఎవరి పేరులోనైనా ఈ అక్షరం ఎక్కువసార్లు వస్తే వారు విమర్శనాత్మకంగా, నర్మగర్భంగా, కొంచెం వెటకారంగా వుంటారు. ఈ అక్షరానికి సూర్యుడు అధిష్ఠానగ్రహం. కాబట్టి ఆరోగ్యానికి సంబంధించినది. తలనొప్పి, మెదడువ్యాధులు రాకుండా చూసుకోవాలి.

**E :** ఈ అక్షరం క్రియాశీలత్వం, సంబంధాలు, ప్రయాణాలు, అవకాశాలు, మార్పులు, ఆత్మసంచలనం మొదలగు వాటిని కలిగిస్తుంది. శాస్త్రీయ స్పందనలు కలిగిస్తుంది. అలాగే ఆధ్యాత్మిక స్పందన కూడా కలిగిస్తుంది. ముఖ్యంగా ఇది భౌతిక సంబంధిత అక్షరం కాబట్టి ఎక్కువగా భౌతిక విషయాల పట్ల ఆసక్తి కలిగిస్తూ ఆవిష్కరణలు చేయడానికి ప్రోత్సహిస్తుంది.

ఈ అక్షరం శక్తికి, సందడికి ప్రతీక. పేరులో ఈ అక్షరం ఎక్కువసార్లు వస్తే అలసట, అస్థిరత్వం, మార్పులను కలిగిస్తాయి. ఈ అక్షరానికి బుధుడు అధిష్ఠానగ్రహం. దీని వలన ఉదరకోశ వ్యాధులు, అజీర్ణం, గుండెమంట కలుగవచ్చు.

**I** : భావావేశం కలిగిస్తుంది. ఈ అక్షరం సాంద్రత, సమృద్ధిని సూచిస్తుంది. ఈ అక్షరం గొప్పతనాన్ని లేదా నేరప్రవృత్తిని కలిగిస్తుంది. ఈ అక్షరం పేరులో ఎక్కువసార్లు వస్తే సున్నిత మనస్తత్వం, సానుభూతి కలిగి ఉంటారు. పేరులో ఈ అక్షరం మొదటిగా వస్తే ఆలస్యం, ఆటంకాలు, ముందుకుపోలేని స్థితి కలుగుతుంది. ఈ అక్షరం మెదడు, గుండెలపై ప్రభావం చూపుతుంది.

**O** : ఏకాగ్రతను, విశ్రాంతిని సూచిస్తుంది. అంతర్గత శక్తిని, అందాన్ని సూచిస్తుంది. అధికార వ్యామోహం వలన ఈ గుణాలు మరుగునపడవచ్చు. దైవభక్తి కలిగిస్తుంది. పేరులో ఈ అక్షరం మొదట వస్తే ఆలస్యాన్ని, ఆటంకాలను, నిర్ణయాలు తీసుకోవటంలో జాప్యం కలుగుతాయి. రక్తప్రసరణపై దీని ప్రభావం ఉంటుంది.

**U** : విచిత్ర, అసాధారణ శక్తులను ఆకర్షిస్తుంది. సాంప్రదాయకంగా ఉండి, చొరవను తక్కువ చేస్తుంది. అసాధారణ స్ఫురణను కలిగించి ఇతరుల ఆలోచనలు పసిగట్టి, వారికి సరైన సమాధానాలు ఇచ్చేట్లు చేస్తుంది. ప్రశాంత జీవనం కోరుకున్నట్లు చేస్తుంది. బాగా చదువుకుంటే బోధన, రచనా వ్యాసంగాలు చేస్తారు. దీని ప్రభావం నరాలు, ప్లీహగ్రంథిపై ప్రభావం చూపుతుంది.

## K మరియు V అక్షరాల ప్రాముఖ్యత

వర్ణమాలలో K అక్షరం యొక్క సంఖ్య 11, దీని ఏక సంఖ్య 2 (1+1), V అక్షరం యొక్క సంఖ్య 22, దీని ఏక సంఖ్య 4 (2+2). పేరులో K, V రెండు అక్షరాలు ఉన్నట్లయితే గతజన్మ అనుభవాల ప్రకంపనలు వీరిపై అధికంగా ఉంటాయి. వీరి జ్ఞానాన్ని, ఆధునిక భావాలని వ్యక్తపరచటానికి మరలా వచ్చినట్టుగా భావించాలి. మానవాభివృద్ధికి కృషిచేసే విధంగా ప్రోత్సహిస్తుంది.

పేరులో అన్ని అక్షరాలు, వాటి వాటి ప్రాముఖ్యతను కలిగి ఉంటాయి. పేరులో లేని అక్షరాలు వ్యక్తులపై ఏ విధమైన ప్రభావం చూపుతాయో, పేరులో ఉన్న అక్షరాలు కూడా అలాగే ప్రభావాన్ని చూపుతాయి. లక్ష్యం మాత్రం ఈ సంఖ్యల సమతుల్యత పాటించటమే అది ఈ జన్మలోనైనా, మరు జన్మలోనైనా!

# అక్షర సమృద్ధి

**పేరు అక్షరాల సమూహం. ఒక్కొక్క అక్షరానికి ఒక్కొక్క ప్రకంపన ఉంటుంది. ఏదైనా ఒక అక్షరం మీ పేరులో ఎక్కువ సార్లు వస్తే దానిని అక్షర సమృద్ధి అంటారు.**

పేరు అక్షరాల సమూహం. ప్రతి అక్షరానికి ఒక సంఖ్య ఉంటుంది. ఒక వ్యక్తి లేదా సంస్థ యొక్క పేరులో ఒకే అక్షరం ఎక్కువ సార్లు వస్తే, దానిని అక్షర సమృద్ధి అంటారు. ఈ విధంగా పేరులో ఎక్కువ ఉన్న అక్షరాలు, ఆ వ్యక్తి యొక్క గత జీవితాన్ని, గత అనుభవాలని సూచిస్తాయి. గత అనుభవాలు మళ్ళా ఎదురైనపుడు వాటిని తేలికగా తీసుకుంటారు. ఎందుకంటే వాటిని ఇంతకుముందే రుచి చూశారు కాబట్టి. కానీ ఈ అక్షర సమృద్ధి ఒక్కొక్కసారి ప్రమాద హేతువు కూడా అవుతుంది. అధిక విశ్వాసం వలన, నిర్లక్ష్యం ఏర్పడి ఈ అనుభవాలను పట్టించుకోక పోతే అనర్థం జరగవచ్చు. పేరులో ఎక్కువగా ఉన్న అక్షరాల సంఖ్య, దాని సమృద్ధి వలన ఎటువంటి ప్రభావం చూపుతుందో తెలుసుకుందాం.

వర్ణమాలలోని A నుంచి Z వరకు గల అక్షరాల యొక్క సంఖ్యలను "నామసంఖ్యలు" అనే అధ్యాయంలో తెలుసుకున్నాం కదా. ఇపుడు 1 నుండి 9 వరకు సంఖ్యలు గల అక్షరాల సమృద్ధి తెలుసుకుందాం.

**అక్షర సంఖ్య - 1 (1 అక్షర సంఖ్యగల అక్షరం ఎక్కువగా ఉంటే)**

నిర్ణయాలు సులభంగా తీసుకుంటారు. సొంత ఆలోచనలు కలిగి, ఎవరిపై ఆధారపడకుండా పని చేస్తారు. ఉద్వేగంగా, పొగరుగా, మొండిగా ఉండే అవకాశం ఉంది. స్థిరమైన అభిప్రాయాలు, ఆధిపత్యం ప్రకటిస్తారు.

**అక్షర సంఖ్య - 2 (2 అక్షర సంఖ్యగల అక్షరం ఎక్కువగా ఉంటే)**

సహకార భావం కలిగి ఉంటారు. మధ్యవర్తిత్వం చేస్తారు. కానీ, భావోద్వేగాలు, ఇతరులపై ఆధారపడటం, అకారణంగా ఇతరుల మాట వినడం లాంటివి జరుగవచ్చు.

**అక్షర సంఖ్య - 3 (3 అక్షర సంఖ్యగల అక్షరం ఎక్కువగా ఉంటే)**

చక్కగా కనిపిస్తారు. భావవ్యక్తీకరణ బాగా చేయగలుగుతారు. అందరితో కలుపుగోలుగా ఉంటారు. కానీ, అతిశయోక్తి, శక్తికి మించిన ఖర్చులు లాంటివి ఉండవచ్చు.

**అక్షర సంఖ్య – 4 (4 అక్షర సంఖ్యగల అక్షరం ఎక్కువగా ఉంటే)**

మంచి క్రమశిక్షణ కలిగి అన్నీ సవ్యంగా ఉంచుకుంటారు. కానీ అతిజాగ్రత్త, అతి చొరవ, మొండి దృక్పథం కలిగే అవకాశాలు ఉన్నాయి.

**అక్షర సంఖ్య – 5 (5 అక్షర సంఖ్యగల అక్షరం ఎక్కువగా ఉంటే)**

జీవితానికి కావాల్సిన సుఖ సంతోషాలు పొందటానికి, ఎలాంటి పరిస్థితులకైనా అనుగుణంగా నడుచుకునే శక్తి, కలిగి ఉంటారు. కాని ఒక్కొక్క సారి బాధ్యతారాహిత్యం, సుఖలాలస వంటివి ఉండవచ్చు. సామాజిక అవసరాలు, గుర్తింపు కోసం తపన, సుఖ లాలస, అన్ని విషయాల పట్ల ఆసక్తి, కొత్త వాటికోసం పరుగులెత్తడం లాంటివి ఉంటాయి.

**అక్షర సంఖ్య – 6 (6 అక్షర సంఖ్యగల అక్షరం ఎక్కువగా ఉంటే)**

ఇతరుల పట్ల బాధ్యతాయుతంగా ఉంటారు. పరిస్థితులకు అనుగుణంగా ఉంటారు. ఆత్మాభిమానం కలవారై ఉంటారు. సహాయం కోరుకునే వారి పట్ల సహృదయత కలిగి సహాయం చేయటం అలవరచుకోవాలి. ఈ సంఖ్య తల్లి, తండ్రి, దైవానికి సంబంధించినది కాబట్టి బాధ్యతలు స్వీకరించటం మంచిది. మొండితనం, ఫలించని ప్రణాళికలు, ఆలోచనలు లాంటివి వదులుకోవాలి.

**అక్షర సంఖ్య – 7 (7 అక్షర సంఖ్యగల అక్షరం ఎక్కువగా ఉంటే)**

ఒంటరిగా ఉండి, దీర్ఘాలోచనలు చేస్తూ పరిశీలన, పఠనం లాంటివి చేస్తారు కానీ, అహంభావం, భయం, వ్యాకులత లాంటివి పీడించే అవకాశం ఉంది. మానసిక ప్రశాంతతను అలవరచుకునే దిశగా ప్రయత్నం చేయాలి ఎందుకంటే 7 సంఖ్య వ్యతిరేక ప్రభావం వలన త్రాగుడు లాంటి వ్యసనాలకు లోను కావచ్చు.

**అక్షర సంఖ్య – 8 (8 అక్షర సంఖ్యగల అక్షరం ఎక్కువగా ఉంటే)**

మంచి బుద్ధి కుశలత కలిగి ఉండి ప్రజలను సమీకృతం చేయగలిగి, ఆర్థిక లాభాలు పొందగలుగుతారు. కానీ అత్యాశ, కరకుదనం, అధికార దుర్వినియోగం లాంటివి చేయటానికి అవకాశం ఉంది. దేనినైనా పొందటానికి అత్యుత్సాహం, విజయం పొందే సామర్థ్యం, ఆర్థికంగా లాభం పొందటం, లాంటివి వీరి ప్రత్యేకత.

**అక్షర సంఖ్య – 9 (పైథాగరస్ పద్ధతిలో I, R అక్షరాలకు 9 సంఖ్య ఇవ్వబడింది.)**

మనుషుల స్థితిగతులను అర్థం చేసుకొని వాత్సల్యం కలిగి ఉంటారు. భావోద్వేగం, అనవసరంగా ధనం ఖర్చు చేయటం, శక్తిని వృథా చేయటం లాంటి వాటికి అవకాశం ఉంది. దానగుణం, మానవత్వం, కళాత్మకత లాంటివి చూపండి.

## లోపించిన అక్షరాలు లేదా కర్మ

**మీ పేరులో లేని అక్షరాలు మీ కర్మను సూచిస్తాయి. గతంలో మీరు పొందని అనుభవాలను, ఈ అక్షరాలు సూచిస్తాయి.**

పేరులో వర్ణమాలలో ఉన్న అన్ని అక్షరాలు ఉండవు. పేరులో లేని అక్షరాలను, ఆ అక్షరాల యొక్క సంఖ్యలను కర్మ అని పిలుస్తారు. ఈ కర్మ అనేది గత జన్మలలో మీరు పొందని, అనుభవాలను సూచిస్తాయి. ఆ అనుభవాలను ఈ జన్మలో కలిగించటానికి ఈ అక్షర సంఖ్యలు ఉద్దేశించబడ్డాయి. గతంలో పొందని అనుభవాలను, ఈ జన్మలో పొందేటపుడు ఎదురయ్యే ఇబ్బందులను ఈ కర్మ సంఖ్య తెలియజేస్తుంది. ఇప్పుడు 1 నుండి 9 వరకు లోపించిన అక్షర సంఖ్యలు లేదా కర్మ గురించి తెలుసుకుందాం.

### 1 – ఒకటో సంఖ్య లోపిస్తే: (1 అక్షర సంఖ్యగల అక్షరం ఎక్కువగా లోపిస్తే)

నిర్ణయాలు తీసుకోవటం కష్టతరం అవుతుంది. స్వతంత్రంగా ఉండలేరు. కాబట్టి ఆశయ సాధనకు గట్టి కృషి చేయాలి. గట్టిగా నిలుచుని, వీరి నాయకత్వాన్ని రుజువు చేసుకోవాలని ప్రేరేపించబడతారు. గట్టి నిర్ణయాలు తీసుకోవటంలో సాహసం చేయాల్సిన స్థితిలో వీరు ఉంటారు. బాధ్యతలు స్వీకరించి, స్వతంత్రంగా వ్యవహరించటం నేర్చుకోవాలి. కానీ ఈ వ్యక్తులకు ఆశయాలు, దూసుకుపోయే గుణం లోపించవచ్చు.

### 2 – రెండవ సంఖ్య లోపిస్తే: (2 అక్షర సంఖ్యగల అక్షరం ఎక్కువగా లోపిస్తే)

ఓర్పు, సహనం, శ్రద్ధ లోపిస్తాయి. అకారణమైన భావోద్వేగం కలిగి ఇతరులతో సత్సంబంధాలు కలిగి ఉండరు. ఈ విధమైన వ్యతిరేక లక్షణాలను అధిగమించటానికి ప్రయత్నించాలి. స్వతంత్రంగా ఉండాలని కోరుకున్నా, సహకారం అలవరచుకోవాలి. పరిస్థితులకు అనుగుణంగా ఉండలేకపోవడం, నిర్లక్ష్యం, సహాయ నిరాకరణ, ఇతరులను పట్టించుకోకపోవడం లాంటివి ప్రధాన లక్షణాలు.

### 3 – మూడవ సంఖ్య లోపిస్తే: (3 అక్షర సంఖ్యగల అక్షరం ఎక్కువగా లోపిస్తే)

సామాజిక సంబంధాలు లోపించి, శక్తియుక్తులను ఒకచోట కేంద్రీకరించలేరు.

ప్రాధాన్యతా విషయాలను జాగ్రత్తగా ఎంపిక చేసుకోవాలి. భావోద్వేగం, ధారాళంగా మాట్లాడలేకపోవటం, ఆత్మన్యూనతాభావం ప్రధాన లక్షణాలు.

**4 – నాలుగవ సంఖ్య లోపిస్తే: (4 అక్షర సంఖ్యగల అక్షరం ఎక్కువగా లోపిస్తే)**

శ్రద్ధ లోపిస్తుంది. మొండితనం, బద్ధకం ఉంటాయి. క్రమశిక్షణా రాహిత్యాన్ని గుడ్డిగా సమర్ధించుకోవటం లాంటివి వదిలించుకోవాలి. సోమరితనం, అసహనం, సంప్రదాయాలను నచ్చకపోవటం లాంటివి ప్రధాన లక్షణాలు.

**5 – ఐదవ సంఖ్య లోపిస్తే: (5 అక్షర సంఖ్యగల అక్షరం ఎక్కువగా లోపిస్తే)**

కొత్త అనుభవాలు అవకాశాలను అంగీకరించి, కొత్త పరిస్థితులకు అనుగుణంగా నడుచుకోవటానికి అలవాటు చేసుకోవాలి. శారీరక వాంఛలను అదుపు చేసుకోకపోతే శృంగార భావాలు ఆటంకపరుస్తాయి. నిర్మాణాత్మక ఉత్సుకత, త్యాగభావం లేకపోవటం, అర్థం చేసుకోలేకపోవటం, పరిమిత జీవితానుభవం ప్రధాన లక్షణాలు.

**6 – ఆరవ సంఖ్య లోపిస్తే: (6 అక్షర సంఖ్యగల అక్షరం ఎక్కువగా లోపిస్తే)**

బాధ్యతారాహిత్యం, కుటుంబం, స్నేహితుల పట్ల శ్రద్ధ లేకపోవటం ఉంటాయి. వ్యక్తిగత సంబంధాలు బాధ్యతలను పెంచుతాయన్న నిజం తెలుసుకోవాలి. ఇతరులతో సర్దుకుపోయే గుణం పెంపొందించుకొని, వారు అడిగినపుడు మాత్రమే సలహాలు ఇవ్వాలని తెలుసుకోండి. బాధ్యతారాహిత్యం, విధుల పట్ల శ్రద్ధ లేకపోవటం ప్రధాన లక్షణాలు.

**7 – ఏడవ సంఖ్య లోపిస్తే: (7 అక్షర సంఖ్యగల అక్షరం ఎక్కువగా లోపిస్తే)**

ఒంటరిగా ఉండటానికి భయం, ఆత్మవిశ్వాసం లేకపోవటం, ఆత్మప్రబోధాన్ని అంగీకరించపోవటం లాంటివి ఉంటాయి. తెలియని భయాందోళనలు తొలగించుకుని, జీవిత పరమార్థం తెలుసుకోడానికి ప్రయత్నించాలి. అహంభావం, ఒంటరితనం వదిలించుకుని స్నేహితులను పెంచుకోవాలి. డాంబికత్వానికి లొంగిపోవటం, హేతువును నమ్మకపోవటం, ఆధ్యాత్మిక జ్ఞానం లేకపోవటం ప్రధాన లక్షణాలు.

**8 – ఎనిమిదవ సంఖ్య లోపిస్తే: (8 అక్షర సంఖ్యగల అక్షరం ఎక్కువగా లోపిస్తే)**

అన్ని విషయాలలో ముఖ్యంగా ఆర్థిక విషయాలలో విజ్ఞతను అలవరచుకోవాలి.

ధనాన్ని వృథాగా ఖర్చు చేస్తారు. ధనం విలువ తెలుసుకొని, పొదుపుగా వాడటం అలవాటు చేసుకోవాలి. హక్కులు, అధికారాల గురించి విపరీత భావం కలిగి ఉంటారు. దానిని వదిలించుకొని సౌమ్యత, హద్దులెరిగి ప్రవర్తించటం నేర్చుకోవాలి.

**9 – తొమ్మిదవ సంఖ్య లోపిస్తే: (9 అక్షర సంఖ్యగల అక్షరం ఎక్కువగా లోపిస్తే) (పైథాగరస్ పద్ధతిలో I, R అక్షరాలకు 9 సంఖ్య ఇవ్వబడింది.)**

ఈర్ష్య, ద్వేషాలు, కోపం మొదలైనవి ఎక్కువగా ఉంటాయి. భావోద్రేకాన్ని అదుపు చేసుకుని, పరిమితులలో అభివృద్ధి సాధనకు ప్రయత్నించాలి. విశ్వజనీన ప్రేమను అర్థం చేసుకొని, సాయం చేసిన వారి దగ్గర నుండి అతిగా ఆశించటం మానుకోవాలి.

# అక్షర లక్షణాలు

**ఈ ప్రపంచంలో అందరికీ పేరు ఉంటుంది. పేరు అక్షరాల కలయిక.**
**ప్రతి అక్షరానికి కొన్ని లక్షణాలు ఉంటాయి.**
**ఆ లక్షణాలు అక్షరాలతో పేరు పెట్టుకున్న వారిపై ప్రభావం చూపిస్తాయి.**

ఈ విశ్వంలో ప్రతి ఒక్కరికీ పేరు అనేది ఉంటుంది. మనుషులు, జంతువులు, పక్షులు, చెట్లు, కొండలు, కోనలు, క్రిములు, కీటకాలు, ఇలా సర్వస్వం పేర్లతోనే పిలువబడతాయి. మనుషులు, సంస్థల యొక్క పేర్లు వారిపై ఎలాంటి ప్రభావం చూపిస్తాయో, నామసంఖ్య అనే అధ్యాయంలో చర్చించటం జరిగింది. ఇపుడు పేరులోని అక్షరాల గురించి తెలుసుకుందాం.

పేరు అనేది అక్షరాల సమూహం. ప్రతి అక్షరానికి కొన్ని ప్రత్యేక లక్షణాలు ఉంటాయి. పేరులో ఉన్న అక్షరమాల మొత్తం కొన్ని లక్షణాలు కలిగి వుండి వాటి ప్రభావాన్ని పేరు పెట్టుకున్న వ్యక్తి / సంస్థపై చూపిస్తాయి. పేరు ప్రారంభంలో ఉన్న మొదటి అక్షరం యొక్క ప్రభావం, వ్యక్తులపైనా, సంస్థలపైనా అధికంగా ఉంటుంది.

జ్యోతిషంలో కూడా వ్యక్తులు జన్మించినపుడు, నక్షత్ర పాదాలు, ఆ పాదాల యొక్క అక్షరాలననుసరించి పేరు పెట్టడం జరుగుతుంది. దీని వలన ఆ జాతకుడు ఆ నక్షత్రం యొక్క పాజిటివ్ శక్తులను, మంచి లక్షణాలను పుణికి పుచ్చుకుంటాడు.

న్యూమరాలజీలో అందరూ ఆమోదించిన వర్ణమాల ఆంగ్ల వర్ణమాల. ఈ ఇంగ్లీషు వర్ణమాలలో 26 అక్షరాలు ఉన్నాయి. ఏ నుండి జెడ్ వరకు. ఇపుడు మనం విడివిడిగా ఈ అక్షరాల యొక్క లక్షణాలు, అవి పేరులో వున్న వారిపై ఏ విధమైన ప్రభావం చూపుతాయి అనే అంశం తెలుసుకుందాం.

## "A"

**అక్షరం సూర్యునిలా చాలా గొప్పది.**
**సామాన్యులను కూడా గొప్ప వారిని చేస్తుంది.**

వర్ణమాలలో ఇది మొదటి అక్షరం. ఈ అక్షరం చాలా శక్తివంతమైనది. దీని సంఖ్య కూడా 1 కాబట్టి, ఈ అక్షరం సూర్యుని వంటిది (సూర్యుని సంఖ్య కూడా 1) అంధకారాన్ని తొలగించి వేస్తుంది.

ఈ అక్షరం తక్కువ స్థాయి నుండి, ఉన్నత స్థాయిని చేరుకోవటాన్ని సూచిస్తుంది. కింది నుండి రెండు సరళరేఖలు పైకి వెళ్లి ఒకటిగా కలవటం అనేది భౌతిక విషయాల తరువాత ఆధ్యాత్మికతను సూచిస్తుంది.

ఈ అక్షరం మంచి ప్రకాశవంతమైనదిగా ఉండి మనల్ని ఉన్నత మార్గం వైపు నడిపిస్తుంది. నాయకత్వ లక్షణాలు కలిగిస్తుంది. సామాన్యులను గొప్పవారిగా చేస్తుంది. కీర్తిని, సంపదను కలిగిస్తుంది.

పేరులో ఈ అక్షరం ఎన్నిసార్లు వచ్చినా మంచిదే. ఆత్మాభిమానం, దానగుణం, పరిపాలనా సామర్థ్యం, సృజనాత్మకత, ప్రాణశక్తి, మానసిక శక్తిని కలిగిస్తుంది. ఈ అక్షరం ప్రారంభంలో ఉన్నవారు గొప్ప నాయకులుగా కీర్తిగాంచుతారు. ఉదా: అక్బర్, అశోకుడు, అలెగ్జాండర్.

## "B"

**అక్షరం శాంతిని కలిగిస్తుంది. ఆధ్యాత్మిక చింతన, దైవభక్తి కలిగిస్తుంది.**

ఈ అక్షరం వర్ణమాలలో రెండవది. హిబ్రూ భాషలో 'B' అనేది జన్మ స్థలం, ఇల్లు, నివాస స్థలం, తల్లి గర్భం మొదలైన వాటిని సూచిస్తుంది. ఈ అక్షరం గత స్మృతులను తెలియజేస్తుంది.

ఈ అక్షరం కల్పనా శక్తిని కలిగిస్తుంది. తెలివితేటల్ని ద్విగుణీకృతం చేస్తుంది. శాంతి కాముకత, ఆధ్మాత్మిక చింతన, నిజాయితీ, గోపనీయత లాంటి లక్షణాలు కలిగిస్తుంది. ప్రతిభను, కార్యనిర్వహణా సామర్థ్యాన్ని కలిగిస్తుంది. ఈ సంఖ్య మంచి

ఆలోచనా దృక్పథం కలిగిస్తుంది. భోగభాగ్యాలను కలిగిస్తుంది. నీతి, నిజాయితీలతో సన్మార్గంలో నడిచేటట్లు చేస్తుంది.

ఈ అక్షరం కలవారు సులభంగా భవనాలు కట్టగలుగుతారు. వీరికి కొంచెం సిగ్గెక్కువ, శాంతి, సహజీవన భావాలు కలిగి ఉంటారు. కాలానుగుణంగా మారటం అలవాటు చేసుకుంటే మంచిది.

ఈ అక్షరం నత్తగుల్ల వలె ముడుచుకొని వుండటం వలన ఈ అక్షరంతో పేరు ప్రారంభం అయిన వారు అన్ని విషయాలు తమలోనే దాచుకుని ఉంటారు. వారి సిద్ధాంతాలు వారివే, భావాలను బయటకు ప్రకటించరు. నెమ్మదిగా, నర్మగర్భంగా ఉంటారు.

## "C"

**ఈ అక్షరం బుద్ధిని, తేజాన్ని, గొప్ప పేరు ప్రతిష్ఠలను కలిగిస్తుంది.**

ఈ అక్షరం వర్ణమాలలో 3వది. ఈ అక్షరం సృజనాత్మకతా శక్తిని కలిగిస్తుంది. కానీ శక్తిని అనవసరంగా వినియోగించేటట్లు కూడా చేస్తుంది. బుద్ధి బలాన్ని, తేజాన్ని, కీర్తి కాంక్షను కలిగిస్తుంది.

ఈ అక్షరం పేరులో మొదటగా ఉన్నట్లయితే, ప్రకృతి, పురాణాలు, మతగ్రంథాలు, నీతి శాస్త్ర గ్రంధాలపై ఆసక్తిని కలిగిస్తుంది. ఈ అక్షరం పేరులో మొదట వస్తే, వ్యక్తులు, సంస్థలు, భవనాలు మొదలైన వారి పేరు చరిత్రలో చిరకాలం నిలుస్తాయి. ఉదా :- చిరంజీవి, చార్మినార్, సినిమా, కార్.

అధికారం, పరిపాలనా చేయటానికి కావలిసిన సామర్థ్యం కలిగిస్తుంది. కళల పట్ల ఆసక్తి కలిగిస్తుంది. రాజకీయాలు, సినిమారంగం లాంటి ప్రజాసంబంధ రంగాలలో ప్రసిద్ధిని కలిగిస్తుంది. దీని వలన అనితర సాధ్యమైన పనులు కూడా సాధ్యం చేయవచ్చు.

కానీ ఈ అక్షరం మానసికంగా, మౌఖికంగా, శారీరకంగా శక్తి ఖర్చు అయేటట్లు చేస్తుంది. ఏ పనినైనా పద్ధతిగా అనుకున్న సమయంలో చేయగల శక్తినిస్తుంది. ఈ అక్షరం కలవారు సంయమనం వహించి ప్రవర్తించాలి లేకపోతే వీరిని దురహంకారులుగా, దుర్మార్గులుగా అందరూ అనుకునే అవకాశం ఉంది. అసాధారణ స్ఫురణ కలిగి, భావాలను బయటకు ప్రకటిస్తారు.

## "D"

**ఈ అక్షరం ఆత్మవిశ్వాసం, సంపూర్ణతను, నర్మగర్భతను కలిగిస్తుంది.**

ఇది వర్ణమాలలో 4వ అక్షరం. ఈ అక్షరం పేరు మొదటలో ఉంటే ఆ వ్యక్తులు, నర్మగర్భంగా, గోపనీయంగా ఉంటారు. ఎందుకంటే ఈ అక్షరం పూర్తిగా మూసివేయబడి ఉంది. స్వంత నిర్ణయాలపై నమ్మకం కలిగి ఉంటారు. ఆత్మవిశ్వాసం, సంకల్ప బలం కలిగి ఉంటారు. సంపూర్ణతత్వం కలిగి ఉంటారు. ముక్కుసూటిగా, నిజాయితీగా ఉండి ఎదుటి వారి నుంచి కూడా అదే కోరుకుంటారు.

కష్టపడి పనిచేసే గుణం కలిగి ఉంటారు. ధైర్యంగా ఉండి అపజయాలకి కుంగిపోకుండా, ధైర్యంతో మరలా ప్రయత్నించి విజయం సాధిస్తారు. పని రాక్షసులుగా ఉంటారు. శారీరక దారుఢ్యం మానసిక బలం కలిగి ఉంటారు.

ఆధునిక భావాలు కలిగిఉండి వైవిధ్యతను కోరుకుంటారు. గంభీరంగా కనిపించి అందరి చేత గౌరవింపబడతారు. స్నేహితులు తక్కువ గానీ అందరికీ సాయం చేయాలనుకుంటారు. ఎంత వ్యతిరేకత ఎదురయినా విజయం సాధిస్తారు. ఈ అక్షరంతో పేరు ప్రారంభం అయిన వారికి అభివృద్ధి ఆలస్యంగా వస్తుంది. వీరిపై అనవసరమైన, అపనిందలు వస్తాయి.

## "E"

**ఈ అక్షరం ప్రగతికి చిహ్నం. ముందుచూపును, విశాల దృక్పథం కలిగిస్తుంది.**

ఇది వర్ణమాలలో 5 వ అక్షరం. ఈ అక్షరం ప్రగతికి, స్వేచ్ఛకు చిహ్నం. కుడివైపు అంటే భవిష్యత్తు వైపు ఇది తెరవబడి ఉంది. ఈ అక్షరంతో పేరు ప్రారంభమయ్యే వారు ఎపుడూ ముందుచూపు కలిగి, కొత్త అనుభవాల కోసం, భవిష్యత్తు కోసం ఎదురు చూస్తుంటారు. ఏదో ఒకటి సాధించాలనే తపన కలిగిస్తుంది.

ఈ అక్షరం కలవారు మెరుపు వేగంతో ఆలోచించి, కార్యం నిర్వహిస్తారు. సమతుల్యత గల ఆలోచనా విధానం కలిగి ఉంటారు. విశాలమైన దృక్పథం కలిగి ఉంటారు. ఈ అక్షరంలో పై భాగం ఆధ్యాత్మికం, కింది భాగం ప్రాపంచిక విషయాలకు సూచిక. కొందరు ద్వితీయ వివాహం చేసుకునేవారు ఉంటారు.

ఈ అక్షరం కలవారు సహృదయత, సర్దుకుపోయే గుణం. మానవత్వం కలిగి ఉంటారు. ఎదుటి వారి యొక్క మానసిక పరిస్థితిని బట్టి వారిని ప్రోత్సహించటమో, నిరుత్సాహపరచటమో చేస్తారు.

ఈ అక్షరం ఎడమవైపు మూసి ఉంటుంది. ఇది జ్ఞాన సంపదకు, గోపనీయతకు చిహ్నం. ఈ అక్షరం స్థిరంగా పీఠంపై ఉంటుంది కాబట్టి ఇది స్థిరత్వానికి చిహ్నం. వీరిని ఎవరూ తొందరగా మోసం చేయలేరు.

## "F"

**ఈ అక్షరం ఆధ్యాత్మిక భావం కలుగజేస్తుంది. దీర్ఘాయుష్షుని ఇస్తుంది. రచనలు చేసే శక్తిని కలిగిస్తుంది.**

ఈ అక్షరం వర్ణమాలలో 6వ అక్షరం. ఈ అక్షరం ప్రాపంచిక విషయాలపై వ్యతిరేక ప్రభావం, ఆధ్యాత్మిక విషయాలపై అనుకూల ప్రభావం చూపుతుంది. ఈ అక్షరంతో పేరు ప్రారంభం అయ్యేవారు, తమ సిద్ధాంతమే కరెక్టు అన్నట్టుగా ఉంటారు. పేరులో ఈ అక్షరం ఉన్నవారు ఈ కింది లక్షణాలు కలిగి ఉంటారు.

వీరు మంచి వాక్పటిమ కలిగి ఉంటారు. తమ మాటలతో పనులు జరిగేటట్లు చేయగలరు. మంచి పరిపాలనా సామర్థ్యం కలిగి ఉంటారు. వీరికి దీర్ఘాయుష్షు, మానసిక, శారీరక బలం ఉంటుంది. గెలుపుపై విశ్వాసం కలిగి బెదరక ముందుకు సాగి విజయం సాధిస్తారు. దైవభక్తి, దానగుణం కలిగి ఉంటారు. మంచి ఊహా శక్తి, సృజనాత్మకత కలిగి, రచనలు, కవిత్వం రాయగలరు. ఏకాంతంగా ఉండటానికి ఇష్టపడతారు. ఆధ్మాతిక చింతన ఉంటుంది.

వీరు ఓటమిని పొందినా దానిని ఓటమిగా అంగీకరించరు. అధిక ప్రసంగం చేయకుండా పనిపై దృష్టిసారిస్తారు. స్నేహితుల పట్ల కృతజ్ఞత, ఆదరణ కలిగి ఉంటారు. త్యాగం, ప్రేమ, ఆదరణ, స్నేహభావం కలిగి ఉంటారు. ఇతరుల బాధలను అర్థం చేసుకుంటారు. ఈ అక్షరంతో పేరు ప్రారంభం అయ్యే వ్యక్తులకు, జీవులకు, గొప్ప దైవ సంబంధ వాత్సల్యం ఉంటుంది. ప్రేమ, ఆదరణ వీరిలో ఉంటాయి.

## "G"

**ఈ అక్షరం జాలి, కరుణ, ప్రేమను కలిగిస్తుంది. ఆత్మవిశ్వాసం, త్యాగబుద్ధి, మానవత్వంలను కలిగిస్తుంది.**

ఈ అక్షరం ఆంగ్ల వర్ణమాలలో 7వ అక్షరం. ఈ అక్షరం ఆశీర్వదించే చేయి, బొటనవేలు మడిచిపెట్టి ఉన్నట్లుగా ఉంటుంది. కాబట్టి పేదలు, అనాథల పట్ల జాలి, ప్రేమ, కరుణ కలిగిస్తుంది. పేరు ఈ అక్షరంతో ప్రారంభం అయితే ఆ వ్యక్తులకు ఆత్మవిశ్వాసం, దూరదృష్టి, ప్రణాళికబద్ధత, సత్యం, ప్రేమ, సునిశిత బుద్ధి కలుగుతాయి.

పేరులో ఈ అక్షరం ఉన్నట్లయితే మానవత్వం, ప్రేమాభిమానాలు, త్యాగబుద్ధి, సమాజం పట్ల అంకితభావం కలిగిస్తుంది. ఈ వ్యక్తులు ఊరికే ఇతరులపై ఆధిక్యత ప్రదర్శించకుండా తాము కూడా పనులలో చొరవచూపి, వారి ఉదారతను, ఉదాత్తతను ప్రదర్శిస్తారు. గొప్ప ఆలోచనాపరులుగా ఉంటారు. గొప్ప సంకల్పబలం కలిగి ఉంటారు.

వీరి దృష్టి, ఊహాశక్తి వలన సంపన్నులవుతారు. పద్ధతిగా క్రమశిక్షణ కలిగి ఉంటారు. వీరికి జరుగబోయేది ముందుగానే తెలిసిపోతుంది. ఈ అక్షరంతో పేరు ప్రారంభమైన వ్యక్తులకు దివ్య ఆకర్షణ శక్తి ఉంటుంది.

## "H"

**ఈ అక్షరం స్థిరత్వం కలిగిస్తుంది. అతీంద్రియ శక్తులను కలిగిస్తుంది. సుఖభోగాలు కలిగేటట్లు చేస్తుంది.**

ఆంగ్ల వర్ణమాలలో 8వ అక్షరం, ఈ అక్షరం నిచ్చెనను పోలి ఉంటుంది. కాబట్టి అవకాశాలు, నైపుణ్యం, అభివృద్ధి స్థిరంగా వృద్ధి చెందుతాయి. ప్రారంభంలో ఈ అక్షరంను ఒక్కొక్కసారి పలుకరు. ఉదా: Honest. అందువలన తరువాత వచ్చే అక్షరం యొక్క లక్షణాలను కలుగజేస్తుంది.

ఈ అక్షరం భూమిపై స్థిరంగా పటిష్ఠంగా ఉన్నట్లుగా ఉంటుంది కాబట్టి ఇది స్థిరత్వాన్ని, వృద్ధిని కలుగజేస్తుంది. సౌకర్యవంతమైన గృహం, రక్షణ ఉంటాయి. ప్రమాదాల నుంచి భద్రత కలిగిస్తుంది. పేరులో ఈ అక్షరం ఉన్నవారు సుఖభోగాలు అనుభవిస్తారు.

ఈ అక్షరం ఆనందానికి చిహ్నం. మంత్ర, తంత్ర శక్తులను కూడా కలిగిస్తుంది. కుటుంబ జీవితం ఆనందంగా ఉంటుంది. కళల పట్ల మంచి అభిరుచి కలవారై, సమాజంలో గౌరవప్రదమైన హోదా కలిగి గౌరవంగా జీవిస్తారు. వీరు కపటం లేనివారై ఉంటారు. అనేక మార్గాల ద్వారా ఆదాయం ఉంటుంది. భవిష్యద్దర్శనం చేయగలుగుతారు.

అక్షరంపైన ఓపెన్‌గా ఉండటం వలన ధనం, శక్తి వృథా చేస్తారు. ఏ నిర్ణయమైనా స్వంతంగా తీసుకుంటారు. ఏకాంతం, నిరాశావాదం, ఆత్మవిశ్వాసం లేకపోవటం లాంటివి విడిచిపెట్టాలి. ఈ అక్షరం గేటులాగా ఉండటం వలన అవకాశాలు ఆలస్యంగా వచ్చినా అకస్మాత్తుగా గొప్పవారుగా, సంపన్నులుగా అవుతారు. అందువలన వీరు రియల్‌ఎస్టేట్, ఫైనాన్స్, బంగారం వ్యాపారాల్లాంటివి చేస్తే మంచిది.

**"I"**

**ఈ అక్షరం పరబ్రహ్మకు గుర్తు. ఇది గొప్ప పేరు ప్రఖ్యాతులు కలిగిస్తుంది.**
**ఈ అక్షరం కలవారు అందంగా, ఆకర్షణీయంగా ఉంటారు.**

ఈ అక్షరం ఆంగ్ల వర్ణమాలలో 9వ అక్షరం. హిబ్రూ జాతీయుల నమ్మకం ప్రకారం ఈ అక్షరం పరబ్రహ్మానికి చిహ్నం. మానవుడిలో ఉన్న పరబ్రహ్మ స్వరూపమే ఈ అక్షరం.

ఈ అక్షరంతో పేరు ప్రారంభం అయితే అకస్మాత్తుగా పేరు ప్రఖ్యాతులు, ఉద్విగ్న భావప్రకటన, మంచి నిర్మాణాత్మక శక్తి, తొందరగా పనిచేయగల సామర్థ్యం వస్తాయి. ఈ అక్షరం పేరు చివరన వస్తే ఆ వ్యక్తులు, ధనవ్యామోహం కలవారుగా ఉంటారు. పేరులో ఈ అక్షరం కలవారు ఆకర్షణీయంగా ఉంటారు. అత్యవసర సమయాల్లో ఇతరులకు సాయం చేస్తుంటారు. మంచి కార్య నిర్వహణాదక్షత కలిగి ఉంటారు. ఇతరులను ఆధీనంలో ఉంచగలుగుతారు. దృఢ సంకల్పం కలిగి ఉంటారు. ఆత్మవిశ్వాసం కలిగి ఏ పనైనా చేయగలననే భావం కలిగి ఉంటారు.

స్థిరంగా నిలుచుని పైకి చూస్తున్నట్లు ఉండటం వలన విశాల హృదయం కలిగి సమాజంలో మూలస్తంభంలా కనిపిస్తారు. వీరు కళాత్మక హృదయం కలిగి ఉంటారు. మంచి అభిరుచులు కలిగి ఉంటారు. వీరు అన్నింటా సమతుల్యత పాటించాలి.

## "J"

**ఈ అక్షరం న్యాయానికి, ధర్మానికి ప్రతీక. ఈ సంఖ్య కలవారిని నాయకులుగా చేస్తుంది.**

ఈ అక్షరం ఆంగ్ల వర్ణమాలలో 10వ అక్షరం. ఈ అక్షరం చూపుడు వ్రేలు ఆకాశం వైపు చూపుతున్నట్లుగా ఉంటుంది. అందువలన ఈ అక్షరం దివ్యశక్తిని కలిగిస్తుంది. ఈ అక్షరంతో పేరు ప్రారంభం అయ్యేవారు అనుచరులుగా కాకుండా నాయకులుగా ఉంటారు. వీరు కార్య నిర్వహణా సామర్థ్యం కలిగి ఉంటారు.

**"J"** అంటే జస్టిస్ కాబట్టి వీరు న్యాయం, ధర్మం తప్పని వారై ఉంటారు. వీరికి గొప్ప ఆత్మవిశ్వాసం ఉండి, ఇతరుల సలహాలు తీసుకోరు. ఏం చెయ్యాలో నాకు తెలుసు ఇతరులు అనవసరంగా మధ్యలో దూరొద్దు అన్నట్టుగా ఉంటారు. ఉన్నత ఆశయాల సాధనకోసం తమంతట తాముగా ముందుకు వచ్చి, ఎన్ని కష్టాలు ఎదురైనా వాటిని సాధిస్తారు. ప్రకృతి పై పూర్తి అవగాహన కలిగి, స్త్రీ, పురుషులు ఇరువురి అభిరుచులు తెలుసుకొని ఉంటారు.

ఈ అక్షరం "గాలం" లా ఉంటుంది. ఎడమవైపుకి వంగి ఉంటుంది. ఇది గతాన్ని సూచిస్తుంది. ఈ అక్షరం మొదట ఉన్నవారు గొప్ప రచయితలు, రాజకీయ నాయకులు, సినీ కళాకారులుగా రాణిస్తారు. **"J"** అక్షరం పేరులో ఉంటే తక్కువ స్థాయి నుండి ఉన్నత స్థాయికి చేరుకుంటారు. ఉదా : చిరంజీవి, అంజయ్య, జనార్ధన్ రెడ్డి, రాజీవ్‌గాంధీ కాని తరువాత వీరి అనుచరులే వీరికి వ్యతిరేకులుగా మారతారు. అందువలన అనుచరులను ఎన్నుకునేప్పుడు జాగ్రత్త వహించాలి.

## "K"

**ఈ అక్షరం దైవిక, మానవ ప్రేమను సూచిస్తుంది. ప్రేమ, అభిమానం, నిస్వార్థాన్ని కలిగిస్తుంది.**

ఈ అక్షరం ఆంగ్ల వర్ణమాలలో 11వ అక్షరం. హిబ్రూ జాతీయులు, ఈ అక్షరానికి దైవిక ప్రేమ, మానవ ప్రేమ, రెంటినీ ఆపాదిస్తారు. ఈ అక్షరంతో పేరు ప్రారంభం అయ్యేవారు ప్రాపంచిక భౌతిక విషయాల పట్ల ఆసక్తి, కళలపై అభిరుచి కలిగి ఉంటారు.

తల్లిలా రెండు చేతులు చాచినట్లు ఈ అక్షరం కనిపిస్తుంది. కాబట్టి ఈ అక్షరం, ప్రేమను, అభిమానాన్ని, నిస్వార్థాన్ని ఇస్తుంది. సమాజం, వర్గం, దేశం, వీటి శ్రేయస్సుకు పాటు పడేటట్లు చేస్తుంది. ఈ అక్షరం పేరులో ఉంటే, ఆ వ్యక్తులు గొప్ప కళాకారులుగా కీర్తి, సంపద గడిస్తారు. అయితే వీరికి టెన్షన్, భయం ఉంటుంది. సంకోచం వంటివి వచ్చే అవకాశం ఉంది. ఈ అక్షరం మంచి శక్తి కలిగి ఆదర్శప్రాయమైనది. ఈ అక్షరంతో పేరు ప్రారంభమయిన వారు జీవితంలో ఉన్నత స్థితిని పొందుతారు.

**"L"**

**ఈ అక్షరం ఇతరులతో పనిచేయించే శక్తిని కలిగిస్తుంది.
నీతి, నిజాయితీని కలిగిస్తుంది.**

ఈ అక్షరం ఆంగ్ల వర్ణమాలలో 12వ అక్షరం. ఈ అక్షరం తిరగేసిన కొరడా వలె ఉంటుంది. కాబట్టి ఇతరులను పనిచేయించగల శక్తి కలిగి ఉంటుంది. ఈ అక్షరంతో పేరు ప్రారంభం అయ్యే వారు ఇతరులను పనిచేయటానికి ఎప్పుడూ ప్రోత్సహిస్తుంటారు.

పేరులో ఈ అక్షరం ఉన్నవారు, తెలివితేటలు కలిగి ఉన్నా, వీరి ప్రతిస్పందన, నిర్ణయాలు తీసుకోవటం కొంచెం ఆలస్యంగా ఉంటుంది. వీరు నీతి నిజాయితీ కలిగి ఉంటారు. ప్రయాణాలు ఇష్టపడతారు. ఉద్వేగంగా ఉన్నపుడు చిన్న చిన్న ప్రమాదాలకు లోనవుతారు. సమస్యలను విశ్లేషణాత్మకంగా పరిశీలించి పరిష్కారం కనుగొంటారు.

ఈ అక్షరం కలవారు జీవితంలో సమతుల్యత పాటించాలి. అందరితో కలుపుగోలుగా ఉండి, చక్కగా మాట్లాడుతూ, పనులు చేయించుకోగలుగుతారు. శత్రువులు కూడా వీరిని చూసి ముచ్చట పడతారు.

**"M"**

**ఈ అక్షరం మంచి వ్యక్తిత్వాన్ని కలిగిస్తుంది. ఒడిదుడుకులు ఉన్నా,
నియమబద్ధ జీవితం గడిపేట్లు చేస్తుంది.**

ఈ అక్షరం ఆంగ్ల వర్ణమాలలో 13వ అక్షరం. ఇది తన కాళ్ళపై స్థిరంగా నిలుచున్నట్లు ఉంటుంది. కాబట్టి శక్తివంతమైన వ్యక్తిత్వాన్ని కలిగిస్తుంది. ఈ అక్షరంతో పేరు ప్రారంభం

అయిన వారు స్థిర అభిప్రాయాలు కలిగి, మొండివారుగా ఉంటారు.

ఈ అక్షరంలో ఎత్తు పల్లాలు కూడా కనిపిస్తున్నాయి. కాబట్టి ఈ అక్షరం పేరులో ఉన్న వారు జీవితంలో ఒడిదుడుకులు ఉంటాయి. పేరులో ఈ అక్షరం ఉన్నవారు ఈ క్రింది లక్షణాలు కూడా కలిగి ఉంటారు.

ఉత్సాహవంతంగా, కష్టించి పని చేసే గుణం, సమర్థత మంచి శారీరక దారుఢ్యం, సూక్ష్మబుద్ధి, హేతుబద్ధమైన ఆలోచనావిధానం, దూరదృష్టి కలిగి ఉంటారు. కష్టాలు కలిగినపుడు ఎదుర్కొని, విజయం సాధిస్తారు. కళల పట్ల ఆసక్తి, అభిరుచి కలిగి ఉంటారు. నియమబద్ధమైన జీవితాన్ని గడుపుతారు. కుటుంబం పట్ల బాధ్యత కలిగి ఆర్థిక భద్రత కోరుకుంటారు.

వీరు మరింత ఓర్పుని, సహనాన్ని అలవరచుకుంటే మంచిది. ఈ అక్షరంతో పేరు ప్రారంభం అయినవారు వివాదాస్పదంగా ఉన్నా, గొప్ప పేరు ప్రఖ్యాతులు గడించి ఉన్నత స్థానాన్ని చేరుకుంటారు. ఉదా : మన్మోహన్ సింగ్, మమతా బెనర్జీ, మాయావతి.

**"N"**

**ఈ అక్షరం మన ఎమోషన్స్‌లో ఉన్న మార్పులను సూచిస్తుంది.**
**భౌతిక సుఖాల పట్ల ఆసక్తి కలిగిస్తుంది.**

ఈ అక్షరం ఆంగ్ల వర్ణమాలలో 14వ అక్షరం. ఈ అక్షరంలో రేఖలు మీదకి వెళ్ళి మళ్ళీ కిందికి దిగినట్లుగా ఉంటాయి. దాని వలన ఇది ఎమోషన్స్‌లో మార్పులను తెలియచేస్తుంది. ఈ అక్షరం ఎడమవైపు తిరగేసిన **"V"** కుడివైపు మరొక **"V"** రెండూ కలిసి ఉన్నట్లుగా ఉంటుంది. ఎడమవైపు తిరగబడిన**"V"** ప్రాపంచిక, భౌతిక సుఖాలను తెలియచేస్తుంది.

ఈ అక్షరం పేరు ప్రారంభంలో ఉన్న కొందరు ప్రాపంచిక, భౌతిక సుఖాల పట్ల ఆసక్తి కలిగి ఉంటారు. శృంగారం, ప్రేమ, విలాసాల పట్ల ఆసక్తి కనబరుస్తారు. వీరు స్థిర అభిప్రాయాలు కలిగి ఉంటారు. అంత సులభంగా మనసు మార్చుకోరు.

వీరిలో కొందరికి రోజూ డైరీ వ్రాసే అలవాటు ఉంటుంది. భావోద్వేగం కలిగి ఉంటారు. స్నేహితులు ఎక్కువ. అందరినీ వశపరచుకొనే శక్తి కలిగి ఉంటారు. మంచి బుద్ధికుశలత, పరిశీలనా జ్ఞానం, తార్కిక జ్ఞానం కలిగి ఉంటారు.

## "O"

**ఈ అక్షరం జ్ఞాననేత్రానికి చిహ్నం. ఇది దివ్యదృష్టి లాంటి అతీంద్రియ శక్తులను కలిగిస్తుంది.**

ఈ అక్షరం ఆంగ్ల వర్ణమాలలో 15వ అక్షరం. ఇది జ్ఞాన నేత్రానికి సంకేతం. ఈ అక్షరం సమస్తాన్ని తనలో ఇముడ్చుకున్న విశ్వాంతరాళానికి గుర్తు. ప్రణవనాదమైన 'ఓం' లో ఇది మొదటి అక్షరం (ఆంగ్లంలో). పేరు ముందుగాని, చివర్లో గాని ఈ అక్షరం ఉన్న వ్యక్తులకు దివ్యదృష్టి, దూరశ్రవణం, భవిష్యద్దర్శనం లాంటి దివ్యశక్తులు లభించే అవకాశం ఉంది. ఆ వ్యక్తులు, దివ్యశక్తులు కలిగి జీవితాంతం దివ్యానుభూతులు పొందుతారు.

ఈ అక్షరం పేరులో ఉన్నవారు, దృఢ సంకల్పం, మత విశ్వాసాలు, నైతిక విలువలు కలిగి ఉంటారు. సహనం, ఓర్పు కలిగి ఉంటారు. నియమాలను పాటిస్తారు. వీరు ఏకాంతాన్ని కోరుకుంటారు. మానవ కళ్యాణం కోసం, వినూత్న పథకాలు వేసి, విమర్శలను ఎదుర్కొంటారు. వీరి మాటలు మంత్రంలా పనిచేస్తాయి. వీరి ఆధ్యాత్మిక దివ్య శక్తులు రాత్రి వేళలో జాగృతం అవుతాయి.

## "P"

**ఈ అక్షరం వాక్కుకు చిహ్నం. ఇది వాక్పటిమను, తెలివితేటలు, ఆత్మవిశ్వాసం కలిగిస్తుంది.**

ఈ అక్షరం ఆంగ్ల వర్ణమాలలో 16వ అక్షరం. హిబ్రూ భాషలో ఈ అక్షరం వాక్కుకు చిహ్నం. కాబట్టి ఈ అక్షరం పేరు ప్రారంభంలో ఉన్నవారు మంచి వాక్పటిమ కలిగి ఉంటారు. భావాలను శక్తివంతంగా మాటల ద్వారా తెలియచేయగలరు.

పేరులో ఈ అక్షరం ఉన్న వారు, తెలివితేటలు, జ్ఞానం కలిగి ఉంటారు. ఏకాంతంగా, గోపనీయంగా దూరంగా ఉంటారు. ఆత్మవిశ్వాసం కలిగి కళల యందు ఆసక్తి, దైవభక్తి కలిగి ఉంటారు. ఇంగిత జ్ఞానం, సమబుద్ధి కలిగి ఉంటారు. కానీ ఒక్కొక్కసారి అసహనానికి గురవుతారు. కార్యనిర్వహణ శక్తి కలిగి ఉంటారు.

ఈ అక్షరంలో తల స్పష్టంగా కనిపిస్తుంది. కాబట్టి, వీరు మంచి ఊహాశక్తి, సృజనాత్మకత, తెలివితేటలు కలిగి ఉంటారు. అధిక శారీరక, మానసిక శ్రమ వలన అనారోగ్యం వచ్చే అవకాశం ఉంది. ఈ అక్షరం శనికి సంబంధించినది కాబట్టి ఈ అక్షరం పేరు ప్రారంభంలో ఉండకుండా చూసుకోవాలి.

## "Q"

**ఈ అక్షరం ప్రాపంచిక, ఆధ్యాత్మిక సమతుల్యతను సూచిస్తుంది.**

ఈ అక్షరం ఆంగ్ల వర్ణమాలలో 17వ అక్షరం. ఈ అక్షర ధ్వని భౌతిక, ఆధ్యాత్మిక శక్తుల సమతుల్యతను సూచిస్తుంది. ఈ అక్షరం పేరు ప్రారంభంలో వస్తే, ఆధ్యాత్మిక ఉన్నతిని కలిగిస్తుంది. ఈ అక్షరం పేరులో ఉండటం అనేది హిందువులలో తక్కువ. మధ్య ప్రాచ్యదేశస్తులకు పేర్లలో ఈ అక్షరం కనిపిస్తుంది.

ఈ అక్షరం ప్రక్కనే, ఏదైనా 'అచ్చు' వస్తే మంచి ఫలితం ఉంటుంది. పేరులో ఈ అక్షరం కలవారు, ఎవరికీ అర్థం కాని విధంగా ఉంటారు. ధారాళంగా మాట్లాడగలుగుతారు. వ్యతిరేక ప్రభావం ఉన్నపుడు, అందరూ వీరి మాటలను ఊకదంపుడుగా భావిస్తారు.

## "R"

**ఈ అక్షరం ప్రగతికి చిహ్నం. మంచి ఆలోచనా శక్తి, బుద్ధిబలాన్ని కలిగిస్తుంది. ఈ అక్షరం ఆడవారి పేరు ప్రారంభంలో ఉంటే మంచిది.**

ఈ అక్షరం ఆంగ్ల వర్ణమాలలో 18వ అక్షరం. ఈ అక్షరం నిలుచునివున్న మనిషిని ప్రక్కనుంచి చూస్తే ఎలా ఉంటుందో అలా ఉంటుంది. తల భాగం స్పష్టంగా కనిపిస్తుంది కాబట్టి మంచి ఆలోచనా శక్తి, బుద్ధి బలం కలిగిస్తుంది. కుడివైపు ఉన్న గీత ముందుకు వెళుతూ ఉన్నట్లు ఉంటుంది. కాబట్టి ఇది ప్రగతికి చిహ్నం. క్రియాశీలత్వానికి సూచిక. కాబట్టి ఈ అక్షరంతో పేరు ప్రారంభం అయినవారికి ఎటువంటి ప్రోత్సాహం లేకపోయినా ముందుకు సాగుతారు.

పేరులో ఈ అక్షరం కలవారు సౌమ్యత, సహాయత, దయ కలిగి ఉంటారు.

అంతర్గత శక్తి కలిగి ఉంటారు. పేరులో ఈ అక్షరం కలవారు స్వయంకృషితో అభివృద్ధి సాధిస్తారు. వీరు విమర్శనాత్మకత విడిచిపెట్టి సహనం అలవరచుకుంటే మంచిది. ఈ పేరుతో వ్యక్తులు సంస్థలను ప్రారంభిస్తే, వారు చాలా ప్రాముఖ్యతను పొందుతారు. వీరికి సిగ్గు, బిడియం ఎక్కువ.

స్త్రీలకు ఈ అక్షరం పేరులో ఉంటే మంచిది. ఈ అక్షరంతో పేరు ప్రారంభం అయిన వారు చాలా గొప్పవారుగా ఉంటారు. ఉదా :- రోనాల్డ్‌రీగన్, రామోజీరావు, రెహమాన్, రాజీవ్‌గాంధీ.

## "S"

**ఈ అక్షరం పూర్తి వ్యతిరేక గుణాలు కలుగజేస్తుంది.**
**పాములా ఉండటం వలన ఆధ్యాత్మిక జ్ఞానం కలుగుతుంది.**

ఈ అక్షరం ఆంగ్లవర్ణమాలలో 19వ అక్షరం. ఈ అక్షరం సర్పం వలె మెలికలు తిరిగి తల మీదకి, తోక క్రిందకి ఉంటాయి. అందువలన ఈ అక్షరం పూర్తి విరుద్ధ గుణాలను కలుగచేస్తుంది. అందువలన పేరులో ఈ అక్షరం ప్రథమంగా ఉన్నవారు, ఎవరినైనా ఉత్సాహపరుస్తారు లేదా గాయపరచి నిరుత్సాహపరుస్తారు. శాంతిని లేదా సమస్యలను సృష్టిస్తారు. బాధను తగ్గిస్తారు లేదా బాధను కలిగిస్తారు. సర్ప ఆకారం ఉండటం వలన వీరికి ఆధ్యాత్మిక జ్ఞానం ఉంటుంది.

పేరులో ఈ అక్షరం కలవారు, ఆకర్షణీయంగా ఉండి, భక్తి భావం కలిగి ఉంటారు. బాల్యంలో విచారకర సంఘటనలు ఉంటాయి. సున్నిత స్వభావం కలిగి, నైతిక విలువలు కలిగి ఉంటారు. మేలు చేసిన వారిని మరచిపోరు. నదిలా వంపులు తిరిగిన అక్షరం కనుక జీవితం కూడా ఒడిదుడుకులు, ఆటుపోట్లు, ఎత్తు పల్లాలతో సాగిపోతుంది. వీరు అంతరంగంలో ఏదో తెలియని వేదన పడుతుంటారు. అందువలన దీనిని వదిలించుకుంటే మంచిది.

## "T"

**ఈ అక్షరం చాలా శక్తివంతమైంది. కానీ స్త్రీలకు 'త' అక్షరంతో పేరు పెట్టకుండా ఉంటే మంచిది.**

ఇది ఆంగ్ల వర్ణమాలలో 20వ అక్షరం. ఇది ఆంగ్ల వర్ణమాలలో అన్నిటికంటే శక్తివంతమైన అక్షరం. టాటా, టిటో, టైటానిక్, టి.ఎన్.టిలో వలె ఈ అక్షరం విస్ఫోటన శక్తి కలిగి చాలా శక్తి వంతమైనది. ఈ అక్షరం వర్ణమాలలో ఉండటం వలన ఆంగ్లేయులు ప్రపంచాన్ని పరిపాలించగలిగారని నమ్మకం. పేరులో ఈ అక్షరం ఎక్కడ ఉన్నా ఆ వ్యక్తులు ప్రపంచం గుర్తించదగ్గవారు అవుతారు. ఉదా : (ఎన్.టి.రామరావు)

ఈ అక్షరం, మంచి వివేకాన్ని, తిరుగులేని నిర్ణయాలను తీసుకునే శక్తిని, హఠాన్ని కలుగచేస్తుంది. మన భారతీయ భాషలలో 'త' అనే అక్షరం స్త్రీలకు పేరులో ఉంచటం అంత మంచిది కాదు. ఆర్థికంగా బాగున్నా సంసార జీవితంలో ఒడిదుడుకులు ఉంటాయి.

పేరులో ఈ అక్షరం కలవారు తమవారిని జాగ్రత్తగా కాపాడుకుంటారు. సున్నితమైన మనసు కలిగి ఉంటారు. వీరికి దివ్యశక్తులు లభిస్తాయి. ఎదుటివారిలోని భావాలను గ్రహించగలుగుతారు. మంత్ర, తంత్ర, యోగ విద్యలలో ప్రావీణ్యం ఉంటుంది. మానవాతీత శక్తి కలిగి ఉంటారు. మనోబలం కలిగి, ఎలాంటివారినైనా ఆకర్షిస్తారు.

## "U"

**ఈ అక్షరం సంపదను ఇస్తుంది. ప్రాపంచిక, ఆధ్యాత్మిక భావాలు రెంటినీ కలుగజేస్తుంది.**

ఇది ఆంగ్లవర్ణమాలలో 21 వ అక్షరం. ఈ అక్షరం 'కప్పు' వలె ఉంటుంది. కాబట్టి పేరులో ఈ అక్షరం ప్రథమంగా ఉన్నవారు, ధన సంపదను కలిగి ఉంటారు. వీరి వద్ద తమ సంపద, ఇతరుల సంపద కూడా ఉంటుంది. కష్టించి జ్ఞానాన్ని కూడా సంపాదిస్తారు. తెలియకపోతే తెలియదు అని చెప్తారు. ఈ అక్షరం పైకి తెరచి ఉండటం వలన వీరికి ఆధ్యాత్మిక భావం ఉంటుంది. కింద అర్ధవలయంగా ఉండి రెండు రేఖలు పైకి వెళ్తున్నట్లుగా ఉండటం వలన వీరికి ప్రాపంచిక, ఆధ్యాత్మిక ధోరణులు రెండూ

ఉంటాయి. ఇంద్రియాలతో అన్ని సుఖాలు అనుభవిస్తారు. క్రింది భాగం సమతుల్యంగా లేకపోవటం వలన వీరు సమతుల్యత పాటించటానికి ప్రయత్నించాలి. ధనం సంపాదిస్తారు. పోగొట్టుకుంటారు.

సృజనాత్మకత, తెలివితేటలు, అసాధారణ స్ఫురణ (ఇంట్యూషన్) కలిగి ఉంటారు. అందంగా ఆకర్షణీయంగా, గ్లామర్‌గా ఉంటారు. కళాదృష్టి కలిగి ఉంటారు. ఈ అక్షరంతో పేరు ప్రారంభం అయినవారికి, ఆత్మన్యూనతా భావం, స్వార్థం, బిడియం లాంటి కొన్ని వ్యతిరేక లక్షణాలు ఉంటాయి.

**"V"**

**ఈ అక్షరం వలన ఆధ్యాత్మిక భావం కలుగుతుంది.**
**మేధాశక్తిని, భక్తిని కలుగజేస్తుంది.**

ఇది ఆంగ్లవర్ణమాలలో 22వ అక్షరం. రెండు చేతులు పైకి చాచినట్లుగా ఈ అక్షరం కనిపిస్తుంది. దాని వలన ఆధ్యాత్మిక భావం కలుగుతుంది. ఈ అక్షరం క్రింది భాగం మొనతేలినట్లుగా ఉంటుంది. ఇది మేధస్సుని తెలియచేస్తుంది. అందువలన పేరు ప్రారంభంలో ఈ అక్షరం ఉన్న వ్యక్తి, మంచి మేధాశక్తి కలిగి, విశ్లేషణాత్మకత కలిగి, గొప్ప ఆధ్యాత్మిక భావాలు కలిగిఉంటారు. సిద్ధాంతాలకు కట్టుబడి, స్నేహభావం కలిగి నమ్మకంతో, ఉత్సాహంగా పనిచేసే వారై ఉంటారు.

వీరికి అసాధారణ స్ఫురణ (ఇంట్యూషన్) ఉంటుంది. ఉన్నత భావాలు, ఆశయాలు కలిగి వాటిని సాకారం చేయగల శక్తి కలిగి ఉంటారు. కొందరు అస్థిరంగా ఉండవచ్చు. నిజాయితీ, విశ్వసనీయత కలిగి ఉంటారు.

వీరిని అంచనా వేయటం కొంచెం కష్టం. స్త్రీలు పురుషుల దగ్గర, పురుషులు స్త్రీల దగ్గర నర్మగర్భంగా ఉంటారు. తమ భావాలు బయట పడనీయరు. ఏమీ ఆశించకుండా ఇతరులకు సాయంచేస్తారు. సామాజిక సేవా, కళారంగాలలో ప్రాముఖ్యత సంతరించుకుంటారు. ఈ అక్షరంతో పేరు ప్రారంభమయ్యే స్త్రీలు జీవితంలో ఉన్నత స్థితిని చేరుకుంటారు.

## "W"

**ఈ అక్షరం వివేకాన్ని కలిగిస్తుంది. దృఢ సంకల్పం, స్థిరమైన అభిప్రాయాలను కలిగేట్లు చేస్తుంది.**

ఇది ఆంగ్లవర్ణమాలలో 23 వ అక్షరం. పేరు ప్రారంభంలో ఈ అక్షరం ఉన్న వ్యక్తులు వివేకం, ప్రేమ కలిగి ఉంటారు. శత్రువులను సైతం ప్రేమిస్తారు. వీరు జీవితంలో ప్రాపంచిక, ఆధ్యాత్మిక రంగాలలో ఉన్నతిని కోరుకుంటారు. మంచి వాదనా పటిమ కలిగి ఉంటారు.

పేరులో ఈ అక్షరం కలవారు, అసాధారణ స్ఫురణ, దృఢ సంకల్పం, శక్తివంతమైన అభిప్రాయాలు కలిగిఉంటారు. మార్పును కోరుకుంటారు. కొత్త వ్యక్తులను కలవటానికి ఇష్టపడతారు. ఆకర్షక శక్తి కలిగి ఉంటారు. మంచి భావ వ్యక్తీకరణ కలిగి, సృజనాత్మకంగా ఉంటారు. కాని పనులు ఆలస్యంగా చేయటం, వాయిదా వేసే గుణం కలిగి ఉంటారు.

వీరు వ్యాపారం, పారిశ్రామిక రంగాలలో అభివృద్ధి సాధించగలరు. పేరులో ఈ అక్షరం ఉన్నవారు గొప్పవారుగా చలామణి అవుతారు. ఉదా : విన్స్టన్ చర్చిల్, విలియం షేక్స్పియర్, బ్రూస్ విల్లిస్.

## "X"

**ఈ అక్షరం సమస్త జ్ఞానాన్ని కలిగిస్తుంది. ఇది బహుముఖ ప్రజ్ఞ కలిగేట్లు చేస్తుంది.**

ఇది ఆంగ్ల వర్ణమాలలో 24వ అక్షరం. ఈ అక్షరం అన్నివైపులా తెరచుకుని ఉంటుంది. అందువలన ప్రాపంచిక విషయాలు, ఆధ్యాత్మిక భావనలు, భూత, భవిష్యత్ కాలాలు, జ్ఞానం, అన్ని రకాల విషయ పరిజ్ఞానం అందుకోవటానికి అనుకూలంగా ఉంటుంది. అందువలన ఈ అక్షరంతో పేరు ప్రారంభం అయ్యే వ్యక్తి, బహుముఖ ప్రజ్ఞావంతులుగా ఉండి ఎవరు అంచనా వేయలేని విధంగా ఉంటారు.

ఈ అక్షరం అంతులేని, తెలియని పరిమాణాన్ని సూచిస్తుంది. కాబట్టి పేరులో ఈ అక్షరం ఉన్న వ్యక్తులు, రహస్యాలను ఛేదించగల శక్తి, అలుపెరగని ఉత్సాహం, ప్రేమ,

ధైర్యం, శాస్త్రీయాత్మక పరిశోధనా శక్తి కలిగి ఉంటారు.

ఒక చోట కూర్చునే అన్ని పొందగల శక్తి ఈ అక్షరం అందిస్తుంది. మంచి కళాత్మక హృదయం కలిగి ఉంటారు. ఏ విషయాన్నైనా తొందరగా నేర్చుకుంటారు. శృంగారాన్ని అదుపు చేసుకోవాలి. ఏ అలవాటుకైనా బానిసలయ్యే బలహీనత ఉంటుంది. ఈ విషయంలో జాగ్రత్త వహించాలి.

**"Y"**

**ఈ అక్షరం హుందాతనం, సున్నితత్వం కలుగజేస్తుంది.**
**స్వేచ్ఛ కోరుకునేట్లుగా చేస్తుంది.**

ఇది ఆంగ్లవర్ణమాలలో 25 వ అక్షరం. ఈ అక్షరం పేరులో వస్తే, ముఖ్యంగా పేరు చివరన ఉంటే, ఆ వ్యక్తులకు హుందాతనం, ఆధారపడే గుణం. స్త్రీల వంటి సున్నితత్వం ఉంటాయి. పేరులో ఈ అక్షరం కలవారు స్వేచ్ఛా ప్రియులు. నిబంధనలు, కట్టుబాట్లు వీరికి నచ్చవు.

అభివృద్ధి చెందాలనే కోరిక కలిగి ఉంటారు. ఆకర్షణీయమైన వ్యక్తిత్వం కలిగి ఉంటారు. ఒక్కొక్కసారి ఊగిసలాడుతుంటారు. నిర్ణయాలు తొందరగా తీసుకోలేరు. అసాధారణ స్ఫురణ కలిగి ఉండి, అర్థం చేసుకునే తత్వం కలిగి ఉంటారు. ఆధారపడే గుణం ఉండటం వలన భాగస్వామ్య వ్యాపారాలు వీరికి అనుకూలం. ఏకాంతాన్ని కోరుకుంటారు.

ఈ అక్షరానికి ఇతర అక్షరాల శక్తి తోడైతే మంచి ఫలితాలు ఉంటాయి. ఈ అక్షరం పేరులో ఉన్నవారు, ప్రతి విషయానికి ఇతరులపై ఆధారపడతారు.

**"Z"**

**ఈ అక్షరం మాటలను అదుపులో ఉంచి శక్తిని ఇస్తుంది.**
**చురుకైన బుద్ధిని కలిగిస్తుంది.**

ఈ అక్షరం ఆంగ్ల వర్ణమాలలో 26వది, చివరిది. ఈ అక్షరం వాక్కును అదుపులో

ఉంచే శక్తిని ఇస్తుంది. ఈ అక్షరంతో పేరు ప్రారంభం అయ్యే వ్యక్తులు, మెలకువగా, మెత్తగా, తెలివిగా, నమ్మించి మాట్లాడే శక్తి కలిగి ఉంటారు.

వీరు తెలివితేటలతో, వాక్చాతుర్యంతో, తమ పనులు సాధించుకోగలుగుతారు. ఈ అక్షరం స్వార్థాన్ని సూచిస్తుంది. విజయం కలిగిస్తుంది. పేరులో ఈ అక్షరం కలవారు, ఆశావాదులు. చురుకైనవారు. జీవితాన్ని ఎపుడూ ఆశావాద దృక్పథంతోనే చూస్తారు.

చురుకైన బుద్ధి కలిగి, వెంటనే దేనికైనా ప్రతిస్పందించగలుగుతారు. రెండు వర్గాల మధ్య, మధ్యవర్తిత్వం నెరపగలుగుతారు. ఈ అక్షరం పేరులో ఎక్కువగా వస్తే నిద్రలేమి ఉంటుంది. మంత్ర, తంత్ర శాస్త్రాలు, అతీంద్రియ శక్తుల పట్ల ఆసక్తి కలిగి ఉంటారు.

# 5వ భాగం

# సంఖ్యా జ్యోతిషం

# సంఖ్యాసమృద్ధి

**జన్మదినంలో ఏ సంఖ్య అయినా ఎక్కువసార్లు వస్తే దాన్ని సంఖ్యా సమృద్ధి అంటారు. ఎక్కువసార్లు వచ్చిన ఆ సంఖ్య, ఆ వ్యక్తిపై ఏ విధమైన ప్రభావం చూపుతుందో దీని వలన తెలుసుకోవచ్చు.**

ఈ విశ్వంలో సృష్టి దైవ సంకల్పం వలన జరిగింది. నక్షత్రాలు, గ్రహాలు, ప్రకృతి, జీవరాశులు, సర్వం దైవసృష్టి. ఈ విశ్వమంతా కాలానికి అధీనం. మనుషులు కూడా కాలానికి అధీనులే! కాలం మాత్రం దైవాధీనం. విష్ణువు శయనించే సర్పం, శివుని కంఠంలో సర్పం కాలానికి సంకేతం. ఈ కాల స్వరూపాన్ని మనం కొలవటం జరుగుతుంది. (కొలవటం అంటే లెక్కించటం, పూజించటం అనే రెండు అర్థాలు ఉన్నాయి). మనం కాలాన్ని కొలిచేటపుడు, అదే లెక్కించేటపుడు, సెకండ్ల నుండి శతాబ్దాల వరకు గణిస్తాం. సెకెండ్లు, నిముషాలు, గంటలు, రోజులు, వారాలు, పక్షాలు, మాసాలు, సంవత్సరాలు... ఇలా ఇపుడు మనం రోజు అంటే దినాలు విషయానికి వస్తే, దినాన్ని మనం తెలియజేసేటపుడు, దినం, నెల, సంవత్సరం మొత్తం చెప్తాం. భగవంతుని సృష్టిలో అన్ని దినాలు ప్రత్యేకమైనవే. అయితే కొన్ని దినాలు చూడగానే దృష్టిని ఆకర్షించే విధంగా కొంత విశిష్టతను కలిగి ఉంటాయి. ఉదాహరణకు 9-9-1999, 10-10-2010, 1-1-2011, 2-2-2022. ఇలా కొన్ని తేదీలు వాటి సంఖ్యననుసరించి కొంత ప్రత్యేకతను సంతరించుకొంటాయి. ఈ ప్రత్యేకత అనేది ఆ దినంలో ఒక సంఖ్య పలుమార్లు రావటం వలన కలిగింది. ప్రతీ వ్యక్తి, తన జీవితంలో ఇటువంటి సంఖ్యలు గల దినాలు చూస్తూ ఉంటడం, వారి జీవితంలో ఎదురవ్వటం జరుగుతుంది. ఇపుడు మనం అటువంటి విశిష్టత కలిగిన దినాలు జన్మదినాలుగా ఉంటే, వాటిలో ఉన్న సంఖ్య సమృద్ధి ప్రభావం వ్యక్తిపై ఎలా ఉంటుంది అనే దాని గురించి తెలుసుకుందాం.

ఉదాహరణకు ఒక వ్యక్తి 11-02-1961 న జన్మించారనుకుందాం. ఈ సంఖ్యను చూడగానే మనకు '1' సంఖ్య ఎక్కువ సార్లు వచ్చినట్లుగా తెలుస్తుంది. ఈ జన్మదినంలో 1, నాలుగు సార్లు వచ్చింది. ఇలా జన్మదినంలో ఒక సంఖ్య అధికంగా, పలుమార్లు వచ్చినప్పుడు, ఆ సంఖ్య యొక్క ప్రభావం ఆ వ్యక్తిపై ఎక్కువగా ఉంటుంది. ఇపుడు

మనం 1 నుండి 9 వరకు సంఖ్యలు, జన్మదినంలో ఎక్కువ సార్లు వస్తే ఏ విధమైన ప్రభావం చూపుతాయన్న విషయం తెలుసుకుందాం.

## సంఖ్య - 1

**1 – ఒక్కసారి**

జన్మదినంలో 1 కేవలం ఒక్కసారి వస్తే, ఆ వ్యక్తులు, తమ మనసులోని భావాలను ఇతరులకు చెప్పుకోలేరు. ఇతర విషయాలలో మంచి భావ వ్యక్తీకరణ వీరికి ఉన్నా వారి మనసులో ఉన్న భావాలు మాత్రం వ్యక్తం చేయరు. ఇతరుల యొక్క భావాలను కూడా సరిగా అర్థం చేసుకోలేరు.

**1 – రెండుసార్లు**

జన్మదినంలో 1 రెండు సార్లు వస్తే, ఆ వ్యక్తులు వారి భావాలను సులభంగా, యధేచ్ఛగా వ్యక్తం చేయగలుగుతారు. జీవితంపై వీరికి పూర్తి అవగాహన ఉంటుంది. పరిస్థితులను, ఎటువంటి పక్షపాతం లేకుండా చక్కగా అర్థం చేసుకోగలుగుతారు. ఇతరుల భావాలను అర్థం చేసుకోగలుగుతారు. కెన్నెడీది ఇటువంటి జన్మదిన సంఖ్య 29–5–1917.

**1 – మూడుసార్లు**

జన్మదినంలో 1 మూడు సార్లు వస్తే, అటువంటి వ్యక్తులు, అయితే పూర్తిగా వాగుడుకాయలు లేదా మౌనంగా ఉండే వారుగా ఉంటారు. కొందరికి అయితే ఈ రెండు లక్షణాలు ఉంటాయి. పరిస్థితులకు అనుగుణంగా వారు అలా ఉంటారు. ఈ వ్యక్తులు చాలా ఆనందంగా, ఎపుడూ బయట తిరుగుతూ, ఎంటర్‌టైనర్స్ గా ఉంటారు. ఉదా : క్లిఫ్ రిచర్డ్ 14–10–1940.

**1 – నాలుగుసార్లు :**

జన్మదినంలో 1 నాలుగుసార్లు వస్తే, ఆ వ్యక్తులు వారి గురించి చెప్పుకోవటానికి చాలా కష్టపడతారు. సున్నిత మనస్కులు. వాత్సల్యం కలవారుగా ఉండిన వీరిని కొందరు అపార్థం చేసుకుంటారు. వీరు విశ్రాంతిగా సౌకర్యంగా ఉండటానికి ఇబ్బందిపడతారు.

**1 – ఐదు అంతకంటే ఎక్కువ సార్లు :**

జన్మదినంలో 1, ఐదుసార్లు అంతకంటే ఎక్కువసార్లు వచ్చిన వ్యక్తులు అసాధారణంగా ఉన్నత స్థితికి వస్తారు. వీరిని కూడా కొందరు అపార్థం చేసుకుంటారు. భావాలను నోటిద్వారా కాకుండా రచనలు, చిత్రలేఖనం, నాట్యం లాంటి ఇతర పద్ధతుల ద్వారా తెలియచేస్తారు. కొందరు మత్తుపదార్థాలు, త్రాగుడు లాంటి వ్యసనాలకు లోనుకావచ్చు. కీ॥శే॥ శ్రీమతి ఇందిరాగాంధీ జన్మదినం ఇటువంటిదే 19–11–1917.

## సంఖ్య - 2

**2 – ఒక్కసారి**

జన్మదినంలో 2 ఒక్కసారి వస్తే, ఆ వ్యక్తులు, సున్నిత మనస్కులుగా ఉండి. అసాధారణ స్ఫురణ (ఇంట్యూషన్) కలిగి ఉంటారు. వీరి మనసు తొందరగా గాయపడుతుంది. వ్యక్తులను చూచిన వెంటనే వారి నిజాయితీ లేనితనాన్ని వెంటనే గుర్తించగలుగుతారు. ప్రఖ్యాత జ్యోతిష్కుడు, నోస్టర్‌డామస్ ఈ జన్మదినము కలవాడే 14–12–1503.

**2 – రెండుసార్లు**

జన్మదినంలో 2 రెండు సార్లు వస్తే, ఆ వ్యక్తులు చాలా తెలివైన వారు. సున్నిత మనస్కులు, అసాధారణ స్ఫురణ కలిగినవారుగా ఉంటారు. ఇతరుల మనోభావాలను, ఉద్దేశ్యాలను, ఒక్కచూపులోనే తెలుసుకోగలరు.

**2 – మూడుసార్లు**

జన్మదినంలో 2 మూడుసార్లు వస్తే, ఆ వ్యక్తులు అతి సున్నిత మనస్కులుగా వుంటారు. అసాధారణ స్ఫురణ కూడా వీరికి చాలా ఎక్కువ ఉంటుంది. మనసు తొందరగా గాయపడుతుంది. వీరు ఏకాంతంగా, వారి భావ ప్రపంచంలోనే ఉంటారు. ఎలిజబెత్ టేలర్ జన్మదినం 27–02–1932 దీనికి ఒక ఉదాహరణ

**2 – నాలుగు సార్లు**

జన్మదినంలో 2 నాలుగుసార్లు వస్తే, ఆ వ్యక్తులు సహనం, ఓర్పు లేని వారుగా ఉంటారు. చిన్న సమస్యలను పెద్దవిగా చూస్తారు. వీరు సున్నిత మనస్కులుగా ఉండి

ఏకాంతంగా ఉంటారు. లూయిస్ పాశ్చర్ (27-12-1822) ఒక ఉదాహరణ.

**2 - ఐదు సార్లు**

జన్మదినంలో 2 ఐదు సార్లు రావటం చాలా అరుదు. వీరి జీవితం కష్టాలు, సమస్యలతో నిండి ఉంటుంది. వీరు చాలా సున్నిత మనస్కులుగా ఉంటారు. ఆత్మవిశ్వాసం ఎక్కువగా ఉండి ఎవరినీ నమ్మరు.

## సంఖ్య - 3

**3 - ఒక్కసారి**

జన్మదినంలో 3 ఒకసారి వస్తే, ఆ వ్యక్తులు సృజనాత్మకత, మంచి జ్ఞాపకశక్తి కలిగి ఉంటారు. వీరు వీరి లక్ష్యాన్ని పాజిటివ్ దృక్పథంతో చూస్తూ, దాన్ని సాధించటానికి ప్రయత్నిస్తారు. నేలవిడిచి సాము చేయరు. వీరి నిజాయితీ, ఆశావాద దృక్పథం ఇతరులను ఉత్తేజితుల్ని చేస్తుంది.

**3 - రెండుసార్లు**

జన్మదినంలో 3 రెండుసార్లు వస్తే, ఆ వ్యక్తులు మంచి ఊహాశక్తి కలిగి ఉంటారు. సృజనాత్మకత కలిగి మానసికంగా హుషారుగా ఉంటారు. సంప్రదాయాలను వ్యతిరేకిస్తారు. చూడటానికి చంచలంగా కనిపిస్తారు. ఈ సంఖ్య కలిగిన వారు వారి భావాలను, ఊహలను, రచనల ద్వారా చక్కగా తెలియచేయగలుగుతారు.

**3 - మూడుసార్లు**

జన్మదినంలో 3 మూడుసార్లు వస్తే, ఆ వ్యక్తులు మంచి ఊహాశక్తి కలిగి ఉంటారు. కానీ వీరు ఇతరులతో సంబంధాలు కలిగి ఉండటంలో ఇబ్బందిపడతారు. ఏకాంతంగా ఉంటారు. మంచి మానసిక శక్తి కలిగి, ఊహా ప్రపంచంలో విహరిస్తారు. ఇతరులు చెప్పేది వినరు, వాదనకు దిగుతారు.

**3 - నాలుగుసార్లు :**

జన్మదినంలో 3 నాలుగుసార్లు వస్తే, ఆ వ్యక్తులు పూర్తిగా ఊహాలోకంలో ఉంటారు. వాస్తవికంగా ఆలోచించరు. భయస్తులుగా ఉంటారు. దీని వలన నిత్యజీవితంలో సమస్యలు

ఎదుర్కొంటారు. ఈ సంఖ్య గల జన్మదినం కూడా చాలా అరుదుగా వస్తుంది. ఉదా : 03-03-2033.

## సంఖ్య - 4

**4 - ఒక్కసారి**

జన్మదినంలో 4 ఒక్కసారి వస్తే ఆ వ్యక్తులు ప్రాక్టికల్‌గా ఉంటారు. వీరు క్రియాశీలత్వం కలిగి ఉంటారు. ఊహలను, కలల ప్రపంచాలను నచ్చరు. ఇతరులను ప్రోత్సహించి వీరి ప్రణాళికలను సాకారం చేసుకుంటారు. ఈ సంఖ్య సంగీతం, హస్తకళలను సూచిస్తుంది.

**4 - రెండుసార్లు**

జన్మదినంలో 4 రెండు సార్లు వస్తే, ఆ వ్యక్తులు ప్రాపంచిక, భౌతిక విషయాల పట్ల ఆసక్తి కలిగి మిగతా విషయాలను పట్టించుకోరు. వీరు మంచి నిర్వహణ సామర్థ్యం కలిగి, ఏ పని ప్రారంభించినా, అది విజయవంతంగా పూర్తి చేస్తారు. వీరు నిబద్ధత, ఖచ్చితత్వం కలిగి చాలా చక్కగా ఉంటారు. మంచి సృజనాత్మకత కలిగి అందమైన వస్తువులు తయారు చేయగలుగుతారు.

**4 - మూడుసార్లు**

జన్మదినంలో 4 మూడు సార్లు వస్తే ఆ వ్యక్తులు భౌతిక, ప్రాపంచిక విషయాల పట్ల మాత్రమే ఆసక్తి కలిగి ఉంటారు. మంచి క్రమబద్ధత, క్రమశిక్షణ, శ్రమించే గుణం కలిగి ఉంటారు. ఇతరులు వీరి శక్తిని గుర్తిస్తారు. కొందరు వారి సామర్థ్యాన్ని, శక్తిని మరిచిపోయి అనవసర రంగాల్లో వృథా చేస్తారు.

**4 - నాలుగుసార్లు**

జన్మదినంలో 4 నాలుగు సార్లు రావటం చాలా అరుదైన విషయం. 2044 వరకు ఈ దినం మళ్ళీ రాదు. ఈ వ్యక్తులు ప్రాపంచిక, భౌతిక విషయాల పట్ల ఆసక్తి కలిగి ఉండి మేధా సంబంధ, ఆధ్యాత్మిక సంబంధ విషయాల పట్ల విముఖత కలిగి ఉంటారు. గొప్ప సమర్థులుగా వుంటారు. వీరికి శరీరంలో కింది భాగంలో అవయవాలు దెబ్బతినే అవకాశం ఉంది.

## సంఖ్య - 5

### 5 – ఒక్కసారి

జన్మదినంలో 5 ఒక్కసారి వస్తే ఆ వ్యక్తులు భావావేశాలను అదుపు చేసే శక్తి కలిగి ఉంటారు. అర్థం చేసుకునేవారుగా, ప్రేమ, వాత్సల్యం కలిగిన వారుగా ఉంటారు. ఇతరులను ఉత్తేజపరిచి వారి చేత కష్టసాధ్యమైన పనులు చేయించగలుగుతారు.

### 5 – రెండుసార్లు

జన్మదినంలో 5 రెండు సార్లు వస్తే, ఆ వ్యక్తులు దృఢ సంకల్పం కలిగి ఉంటారు. మంచి ఉత్సాహం, సాహసం కలిగి ఉంటారు. ఎమోషన్‌కు సంబంధించి సమస్యలు రావటం వలన ఉద్విగ్నులై, తరువాత చింతిస్తారు. దీని వలన కుటుంబ సమస్యలు వస్తాయి.

### 5 – మూడుసార్లు

జన్మదినంలలో 5 మూడు సార్లు వస్తే, ఆ వ్యక్తులు వాక్కుపై నియంత్రణ లేక అనవసరమైన మాటలతో ఇతరులను నొప్పిస్తారు. వీరికి గొప్ప ఉత్సాహం, శక్తి ఉన్నా వాటిని జాగ్రత్తగా సరైన మార్గంలో పెట్టగలగాలి. వీరు మార్పును, సాహసకృత్యాలను, వినోదాన్ని కోరుకొని అనవసరమైన ఆపదలు కొనితెచ్చుకుంటారు.

### 5 – నాలుగుసార్లు

జన్మదినంలో 5 నాలుగుసార్లు రావటం చాలా అరుదు. ఇది వంద సంవత్సరాలలో 3 సార్లు మాత్రమే వస్తుంది. మరలా 5-5-2055లో ఇలా వస్తుంది. ఇది చాలా ప్రమాదకరమైన కూడిక. దీని వలన ప్రమాదాలు జరుగుతుంటాయి. ఈ వ్యక్తులు జోరు తగ్గించి ఏ పని చేయటానికైనా ముందు నిదానంగా ఆలోచించటం నేర్చుకోవాలి.

## సంఖ్య - 6

### 6 – ఒక్కసారి

జన్మదినంలో 6 ఒక్కసారి వస్తే ఆ వ్యక్తులు ఇల్లు, కుటుంబం, తనవారి పట్ల గొప్ప ప్రేమాభిమానాలు కలిగి ఉంటారు. కుటుంబ బాధ్యతలు ఆనందంగా స్వీకరిస్తారు.

సృజనాత్మక శక్తి కూడా ఉంటుంది. మంచి తల్లి / తండ్రిగా ఉండి, కుటుంబంలో ఏ సమస్య వచ్చినా ముందుకు వస్తారు. కొందరు అభద్రతాభావానికి గురవుతారు. జీవిత భాగస్వామిని పోగొట్టుకుంటామనే బెంగతో ఉంటారు.

**6 – రెండుసార్లు**

జన్మదింలో 6 రెండుసార్లు వస్తే, ఆ వ్యక్తులు వారి ఇంటి గురించి, కుటుంబం గురించి అనవసరంగా కలత చెందుతారు. ఈ ఒత్తిడి వలన వీరికి ఎక్కువ విశ్రాంతి అవసరం అవుతుంది. వీరు సృజనాత్మక కార్యాల పట్ల ఆసక్తి కలిగి, అందమైన వస్తువుల మధ్య ఆనందంగా ఉండగలుగుతారు. పిల్లల పట్ల విపరీతమైన ప్రేమానురాగాలతో వారిని వారి ఇష్టానికి వదలటానికి నచ్చరు.

**6 – మూడుసార్లు :**

జన్మదినంలో 6 మూడుసార్లు వస్తే, ఆ వ్యక్తులు తాము ప్రేమించే వారి పట్ల 'అతి' ఆదరణ, వాత్సల్యం కలిగి ఉంటారు. సృజనాత్మకత కలిగి, వారి భావావేశాన్ని సరైన మార్గంలో పెట్టగలుగుతారు. వీరు జీవితంలో వ్యతిరేక పార్శ్వాన్ని చూస్తుంటారు కాబట్టి వీరికి తగిన విధంగా ప్రోత్సహించి అనుకూల పార్శ్వం వైపు దృష్టి పెట్టేట్లు చూడాలి. దిగులు, ఒత్తిడి వీరి ప్రధాన సమస్యలు. ఉదాహరణ మైక్‌టైసన్ (30–6–1966)

**6 – నాలుగుసార్లు :**

జన్మదినంలో 6 నాలుగుసార్లు వస్తే, ఆ వ్యక్తులు గొప్ప సృజనాత్మకత కలిగి ఉంటారు. జీవిత ప్రారంభంలో సమస్యలు ఎదుర్కొంటారు. ప్రతీదానికి ఎమోషనల్‌గా ప్రతిస్పందిస్తారు. దాని వలన నిత్య జీవితంలో సమస్యలు వస్తాయి. ప్రతీ శతాబ్దంలో ఇలా నాలుగు 6లు ఉన్న జన్మదినం కేవలం మూడుసార్లు మాత్రమే వస్తుంది ఉదా: 26–6–1966.

## సంఖ్య - 7

**7 – ఒక్కసారి**

జన్మదినంలో 7 ఒక్కసారి వస్తే ఆ వ్యక్తులు, ప్రేమ, ఆస్తి, ఆరోగ్యం లాంటివి కోల్పోయిన తరువాత గుణపాఠం నేర్చుకుంటారు. ఈ చేదు అనుభవాల వలన వీరు

తాత్త్విక, ఆధ్యాత్మిక మార్గాల వైపు ఆకర్షితులవుతారు.

**7 – రెండుసార్లు**

జన్మదినంలో 7 రెండుసార్లు వస్తే, ఆ వ్యక్తులు విజ్ఞానం, వివేకం వంటివి, ప్రేమ, ధనం, ఆరోగ్యం లాంటివి పొందుతారు. దీని వలన వీరు ఆధ్యాత్మిక, మానసిక, అతీంద్రియ శక్తుల, ప్రపంచం వైపు ఆకర్షితులవుతారు. వీరు చాలా తార్కిక బుద్ధికలిగి ఎలాంటి సాంకేతిక సమస్యనైనా పరిష్కరించగలుగుతారు.

**7 – మూడుసార్లు**

జన్మదినంలో 7 మూడుసార్లు వస్తే, ఆ వ్యక్తులు ప్రేమ, ఆరోగ్యం, ధనం మొదలైన విషయాలలో నిరాశ, నిస్పృహ కలిగి విచారకరమైన జీవితం గడుపుతారు. దీని వలన వీరు రాటుదేలి దేన్నైనా తట్టుకొనే శక్తిని పెంపొందించుకుంటారు. ఉదా: విలియం వర్డ్స్ వర్త్ (7–4–1770)

**7 – నాలుగుసార్లు**

జన్మదినంలో 7 నాలుగుసార్లు వస్తే, ఆ వ్యక్తులు కూడా ప్రేమ, ఆస్తి, ఆరోగ్యం కోల్పోవటం ద్వారా జీవితంలో గుణపాఠం నేర్చుకుంటారు. ఇలా నాలుగు 7లు కల దినాలు శతాబ్దంలో మూడుసార్లు మాత్రమే వస్తాయి. ఉదా: 27–7–1977.

## సంఖ్య - 8

**8 – ఒక్కసారి**

జన్మదినంలో 8 ఒక్కసారి వస్తే ఆ వ్యక్తులు, పద్ధతిగా, నిబద్ధత కలిగి ఉంటారు. కానీ వీరు చేపట్టిన పనులు పూర్తి చేయటం కఠినతరం అవుతుంది. అవిశ్రాంతమైన, చురుకైన బుద్ధి కలిగి ఎలాంటి మానసిక సవాళ్ళనైనా ఎదుర్కోగలరు. నెపోలియన్ దీనికి ఉదాహరణ (15–8–1769).

**8 – రెండుసార్లు**

జన్మదినంలో 8 రెండుసార్లు వస్తే, ఆ వ్యక్తులు మంచి గ్రాహక బుద్ధి కలిగి ఉంటారు. ఏ విషయాన్నైనా గుడ్డిగా నమ్మేకంటే అనుభవం ద్వారా తెలుసుకోవాలను కుంటారు. కచ్చితమైన అభిప్రాయాలు, ఉద్దేశాలు కలిగి ఉండి, ఒకసారి నిర్ణయం తీసుకున్న

తరువాత అంత తొందరగా వాటిని మార్చలేరు. ఉదా: బెర్ట్రాండ్ రస్సెల్ (18–5–1872).

**8 – మూడుసార్లు**

జన్మదినంలో 8 మూడుసార్లు వస్తే ఆ వ్యక్తులు సూక్ష్మబుద్ధి కలిగి ఉంటారు. మొండివారు, విశ్రాంతి ఎరుగని వారుగా ఉంటారు. వీరు జీవిత ద్వితీయార్థంలో జీవిత లక్ష్యాన్ని తెలుసుకొని అభివృద్ధి సాధిస్తారు. ఆర్థిక రంగం, వ్యాపారాలలో బాగా రాణిస్తారు. వీరికి ప్రాపంచిక విషయాలపైనే ఆసక్తి కనుక సంపదలు శాశ్వతం కాదు అని తెలుసుకుంటే మంచిది. జూల్స్‌వెర్న్ జన్మదినం దీనికి ఒక ఉదాహరణ (8–2–1828).

**8 – నాలుగుసార్లు**

జన్మదినంలో 8 నాలుగుసార్లు వస్తే, ఆ వ్యక్తులు విశ్రాంతి లేకుండా ఉండి, జీవితంలో మార్పుని, వెరైటీని కోరుకుంటారు. వారు కోరుకున్నది సాధిస్తే అపరిమిత ఆనందం పొందుతారు. అంతవరకు వారు గమ్యం లేకుండా జీవితం గడుపుతారు. ఈ దినం కూడా శతాబ్ధంలో 3 సార్లు మాత్రమే వస్తుంది. ఉదా: 28–8–1988.

## సంఖ్య - 9

**9 – ఒక్కసారి**

జన్మదినంలో 9 ఒక్కసారి వస్తే, ఆ వ్యక్తులు ఆశావహులుగా ఉండి ఎల్లప్పుడు తమ అభివృద్ధిని బలంగా కోరుకుంటారు. 9 సంఖ్య మానసికం, కార్యరంగం రెండింటిపైనా పనిచేస్తుంది. అందువలన మానవజాతి 20వ శతాబ్దంలో ఇంత ప్రగతిని సాధించింది. అయినప్పటికీ మనలో ఇంకా చాలా మంది మానవత్వ విలువలు తెలుసుకోవాల్సి ఉంది. ఈ సంఖ్య మానవతకు మారుపేరు. దీనికి ఉదాహరణ మదర్ థెరిస్సా (27–8–1910).

**9 – రెండుసార్లు**

జన్మదినంలో 9 రెండుసార్లు వస్తే, ఆ వ్యక్తులు ఆదర్శభావాలు, తెలివితేటలు కలిగి ఇతరుల పట్ల విమర్శనాత్మకంగా ఉంటారు. వీరికి తెలివితేటలు అధికం కావటం వలన ఇతరులను చిన్నచూపు చూస్తుంటారు. అందువలన సమాజంలో అన్ని రకాల మనుషులతో కలిసి ఉండటం అలవరచుకోవాలి. ఉదా: మైకేల్ జాక్సన్ (29–8–1958)

**9 – మూడుసార్లు**

జన్మదినంలో 9 మూడుసార్లు వస్తే, ఆ వ్యక్తులు ఆదర్శప్రాయంగా, తెలివితేటలు కలిగి, వాత్సల్యపూరితంగా ఉంటారు. వీరు అతిశయోక్తి కలిగి ఉంటారు. గోరంతను కొండంత చేస్తారు. తమ మానసిక సామర్థ్యాన్ని ఉపయోగిస్తూ ఆనందిస్తుంటారు. కానీ ఏ విషయంలోనైనా అడ్డంగా దొరికిపోతే వీరు చాలా నిరాశ, నిస్పృహలకు లోనవుతారు.

**9 – నాలుగు లేదా ఐదుసార్లు**

జన్మదినంలో 9 నాలుగు లేదా అంతకంటే ఎక్కువసార్లు వస్తే, ఆ వ్యక్తులు చాలా తెలివితేటలు కలిగిన వారయినప్పటికీ, ప్రస్తుత ప్రపంచంలో జీవించటం కఠినతరంగా భావిస్తారు. వారి సొంత ఊహాలోకంలోకి వెళ్ళిపోతుంటారు. వీరు తమలోని శక్తి, సామర్థ్యాలను గుర్తించి సరైన మార్గంలో పెట్టగలిగితే ఈ ప్రపంచానికి మంచిని చేసే శక్తిగా మారగలుగుతారు. 9లు ఐదుసార్లు రావటం చాలా అరుదు. ఇది వేయి సంవత్సరాలకి మూడు సార్లు వస్తుంది. ఉదా: 9–9–1999, 19–9–1999, 29–9–1999 తరువాత 9–9–2999, 19–9–2999, 29–9–2999.

# బలాబలరేఖలు
# (NUMEROLOGY HOROSCOPE)

ప్రముఖ గ్రీకు సంఖ్యాశాస్త్రవేత్త పైథాగరస్ వ్యక్తుల యొక్క బలం, బలహీనతలకు సంబంధించి జన్మదిన పట్టిక తయారుచేసినట్లుగా తెలుస్తుంది. ఈ జన్మదిన పట్టికలో మొత్తం 15 రేఖలు ఉంటాయి. ఈ రేఖలని అడ్డంగా, నిలువుగా, ఐమూలగా, అన్ని విధాలుగా చూడాలి. జన్మదిన పట్టికను ఈ క్రింది విధంగా చేస్తారు.

| | | |
|---|---|---|
| 3 | 6 | 9 |
| 2 | 5 | 8 |
| 1 | 4 | 7 |

ఈ బలం, బలహీనత రేఖలు, సరళరేఖలో 3 గడుల గుండా వెళ్తాయి. అసలు కొందరికైతే, ఈ బలం, బలహీనతా రేఖలు ఉండవు. ఉదాహరణకు ఒక వ్యక్తి 13-4-1851 న జన్మించాడనుకుందాం. అపుడు ఆ వ్యక్తి జన్మదిన పట్టిక

| | | |
|---|---|---|
| 3 | | |
| | 5 | 8 |
| 111 | 4 | |

13-4-1851 న జన్మించిన వ్యక్తికి ఎటువంటి, బలరేఖలు, బలహీనత రేఖలు లేవు. నిండిన మూడు గడులు, బలాన్ని, ఖాళీగా ఉన్న 3 గడులు బలహీనతను తెలియచేస్తాయి. ఇవి సరళరేఖ రూపంలో ఉండాలి.

## బల రేఖలు

ఇపుడు మనం వ్యక్తుల యొక్క మానసిక బలానికి సంబంధించిన రేఖల గురించి తెలుసుకుందాం.

వ్యక్తుల జన్మదిన పట్టికలో బలరేఖలు ఉన్నంత మాత్రాన ఆ వ్యక్తి జీవితంలో ఖచ్చితంగా ఉన్నతిని సాధిస్తాడని చెప్పలేం. ఎందుకంటే ఇవి కేవలం ఆ వ్యక్తి యొక్క

స్వాభావిక నైపుణ్యాన్ని, బలాన్ని సూచిస్తాయి. ఇవి ఫలితం ఇవ్వాలంటే వ్యక్తులు తగిన మానవ ప్రయత్నం చేయాలి.

**1. దృఢ సంకల్ప రేఖ (Determination Line) :–** ఈ రేఖ పట్టికలో 1,5,9 సంఖ్యల గుండా వెళుతుంది. ఈ రేఖ కలవారు ధృడ సంకల్పం కలిగి ఉంటారు. వీరు మంచి ఉత్సాహవంతంగా, అభివృద్ధి పథంలో నడుస్తారు. ఓర్పు, సహనం కలిగి వారి సంకల్పం నెరవేరేంత వరకు వేచి ఉంటారు. ఉదాహరణకు మాజీ బ్రిటన్ ప్రధాని మార్గరెట్ థాచర్ జన్మదిన పట్టిక చూద్దాం. ఆవిడ జన్మదినం 13–10–1925

| | | |
|---|---|---|
| 3 | | 9 |
| 2 | 5 | |
| 111 | | |

1,5,9 గుండా వెళ్ళే సరళరేఖ, ధృడ సంకల్ప రేఖను తెలియచేస్తుంది. వీరు ఓర్పుగా ఉన్నా, ఎక్కువ సమయం వేచి ఉండాల్సి వస్తే కోపం అధికం కావచ్చు. దీనికి కారణం వీరి పట్టికలో 4 సంఖ్య లోపించడమే.

**2. దయార్ద్ర తాత్విక రేఖ (Philosophy Line) :–** ఈ రేఖ జన్మదిన పట్టికలో 3,5,7 సంఖ్యల గుండా వెళ్తుంది. ఈ రేఖ కల వ్యక్తులు జీవితంపై గొప్ప నమ్మకం కలిగి తాత్విక చింతన, ఆప్యాయత కలిగి ఉంటారు. వీరు జీవితం, అనుభవసారం వలన ఈ విధమైన తాత్విక చింతన కలిగి ఉంటారు. కొందరి జీవితం, విచారకరంగా కూడా ఉండవచ్చు. కానీ జీవితంలో పరిణితి పొందిన తరువాత వీరు, గొప్ప నమ్మకం, ప్రశాంతత పొందుతారు. ఈ రేఖ కలవారికి సంగీతం పట్ల మక్కువ ఉంటుంది. ప్రముఖ ఆంగ్ల తాత్వికుడు, సంగీతకారుడు ఎల్టన్ జాన్ (25–3–1947) ఇందుకు ఉదాహరణ

| | | |
|---|---|---|
| 3 | | 9 |
| 2 | 5 | |
| 1 | 4 | 7 |

జాన్ తాత్వికత, ఆయన సంగీత కృతులలో స్పష్టంగా కనిపిస్తుంది. ఈయనకు ప్రణాళికా రేఖ, వాస్తవికతా రేఖలు కూడా ఉండటం వలన కలిసి వచ్చింది.

**3. మేధా రేఖ (Intellectual Line) :–** ఈ రేఖ జన్మదిన పట్టికలో 3,6,9 సంఖ్యల గుండా వెళుతుంది. ఈ రేఖ కల వ్యక్తులు గొప్ప మేధస్సు, జ్ఞాపక శక్తి కలిగి ఉంటారు. వీరు గొప్ప మేధస్సు కలిగి, తమకంటే తక్కువ వారిని చులకనగా చూసే అవకాశం ఉంది. అది మినహాయిస్తే, వీరు సమతుల్యత కలిగి అందరికీ సహాయకారులుగా ఉంటారు. ఇల్లు, కుటుంబానికి ప్రాధాన్యత ఇస్తారు.

ఉదా : జార్జ్ ఆర్వెల్ (ఆంగ్ల రచయిత) 25–6–1903

| | | |
|---|---|---|
| 3 | 6 | 9 |
| 2 | 5 | |
| 1 | | |

జార్జ్ ఆర్వెల్ వ్యంగ్య రచనలతో ఎంతో పేరు పొందాడు. ఈయనకు ప్రణాళికా రేఖ కూడా ఉండటం వలన బాగా రాణించగలిగాడు.

**4. భావావేశ సమతుల్యతారేఖ (Emotional Balance Line) :–** ఈ రేఖ జన్మదిన పట్టికలో 2,5,8 సంఖ్యల గుండా వెళుతుంది. ఈ రేఖ కలవారు అర్థం చేసుకొనేవారుగా, వాత్సల్యం పూరితంగా, సమతుల్యత కలిగిన భావావేశం కలిగి ఉంటారు. ఇతరుల భావాలను తొందరగా అర్థం చేసుకుని వారి పట్ల ఆదరణ కలిగి ఉంటారు. వీరికి స్వస్తత చేకూర్చే శక్తి కూడా ఉంటుంది. 5 సంఖ్య కలిగి ఉండటం వలన ఈ రేఖ చాలా శక్తి వంతమైనది. ఈ వ్యక్తులు ఏ పని ప్రారంభించినా ఎట్టి పరిస్థితులలో మధ్యలో ఆపరు

ఉదాహరణ : షాన్ కానరీ (జేమ్స్‌బాండ్) 25–8–1930

| | | |
|---|---|---|
| 3 | | 9 |
| 2 | 5 | 8 |
| 1 | | |

ఇతనికి ప్రణాళికా రేఖ కూడా ఉంది.

**5. వాస్తవికతా రేఖ (Practicality Line) :** ఈ రేఖ జన్మదిన పట్టికలో 1,4,7 సంఖ్యల గుండా వెళుతుంది. ఈ రేఖ కలవారు హస్త నైపుణ్యం కలిగి ఉంటారు. వీరు బాగాశ్రమించే వారుగా ఉంటారు. అలాగే సృజనాత్మకత కలిగి ఉంటారు. నేల విడిచి

సాముచేయరు. వాస్తవికతతో ఆలోచిస్తారు. వీరికి, శారీరక, మానసిక, నైపుణ్యాలు రెండూ ఉంటాయి.

ఉదాహరణకు : విన్‌స్టన్ చర్చిల్ (30-11-1874), మాజీ బ్రిటన్ ప్రధాని

| | | |
|---|---|---|
| 3 | | |
| | | 8 |
| 111 | 4 | 7 |

చర్చిల్ గొప్ప రాజనీతిజ్ఞుడుగా, పెయింటర్‌గా, గొప్ప ప్రధానిగా పేరు పొందాడు.

## 6. ప్రణాళికా రేఖ (Planning Line) :

ఈ రేఖ జన్మదిన పట్టికలో 1,2,3 సంఖ్యల గుండా వెళుతుంది. ఈ రేఖ కలవారు, పద్ధతిగా ఉండి ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగుతూ వారి లక్ష్యాన్ని సాధిస్తారు. వీరు మంచి భావప్రకటన కలిగి, వారికి ఇష్టమైన విషయాలపై సుదీర్ఘ సంభాషణలు చేస్తారు. పుస్తక పఠనంలో ఎంతో అభిరుచి కలిగి, చదువుతున్నపుడు ఈ లోకాన్నే మరచిపోతారు.

ఉదాహరణ : బ్రిటిష్ సంగీతకారుడు, ఆంద్రూ వెబ్బర్ (22-3-1948)

| | | |
|---|---|---|
| 3 | | 9 |
| 22 | | 8 |
| 1 | 4 | |

## 7. సంకల్ప శక్తి రేఖ (Willpower Line) :

ఈ రేఖ జన్మదిన పట్టికలో 4,5,6 సంఖ్యల గుండా వెళుతుంది. ఇది చాలా అరుదైన రేఖ. ఈ రేఖ చాలా శక్తిని, సహనాన్ని ఇస్తుంది. ఈ రేఖ కలవారు ఆత్మాభిమానం కలిగి, ఉత్సాహవంతంగా తెగువ కలిగి ఉంటారు. ఇతరుల మనోభావాలు పట్టించుకోకుండా, తమ లక్ష్యసాధనలో వారిని గాయపరచటం జరుగుతుంది. కానీ వీరు చాలా మంచి స్నేహితులుగా ఉంటారు. జీవితంలో ఒడిదుడుకులు ఎదురైనా, పాజిటివ్‌గా, ఆశావహదృక్పథం, గొప్ప సంకల్ప శక్తి కలిగి ఉంటారు.

ఉదాహరణ : హాలీవుడ్ నటుడు

గ్రెగరీపెక్ (5-4-1916)

| | | |
|---|---|---|
| | 6 | 9 |
| | 5 | |
| 11 | 4 | |

**8. క్రియాశీలతా రేఖ (Activity Line) :**

ఈ రేఖ, జన్మదిన పట్టికలో 7,8,9 సంఖ్యల గుండా వెళుతుంది. ఈ రేఖ కలవారు గొప్ప క్రియాశీలత, కార్యదక్షత కలిగి ఉంటారు. శారీరకంగా, మానసికంగా ఎపుడూ బిజీగా ఉంటారు. ఒక చోట కాకుండా ఎపుడూ బయట ఉండటాన్ని ఇష్టపడతారు. కొంచెం ఉద్విగ్నంగా ఉంటారు. వీరి భావాలను రచనల ద్వారా బాగా తెలియచేయగలుగుతారు.

ఉదా : ఈ గ్రంథ రచయిత మహమ్మద్ దావూద్
(8–7–1957

| | | |
|---|---|---|
| | | 9 |
| | 5 | 8 |
| 1 | | 77 |

## బలహీనతా రేఖలు

జన్మదిన పట్టికలో బలహీనతా రేఖలు, అవి కలిగిన వ్యక్తులు ఏయే విషయాలలో గొప్ప ప్రయత్నం చేయాల్సి ఉంటుందో తెలుసుకోవడానికి వీలుపడతుంది.

**1. నిర్ణయలేమి రేఖ (Indecision Line) :**

జన్మదిన పట్టికలో ఈ రేఖ కలవారు గత వేయి సంవత్సరాల నుండి ఎవరూ లేరు. ఈ రేఖ, జన్మదిన పట్టికలో 1,5,9 సంఖ్యలు లోపించటం వలన వస్తుంది. 21 వ శతాబ్దంలో ఈ రేఖ కలవారు ఉండవచ్చు. ఈ రేఖ కలవారు. వాత్సల్యం కలిగి ఉంటారు. అందరినీ సంతోష పెట్టాలనుకుంటారు, అందువలన ఎటువంటి నిర్ణయం తీసుకోలేరు.

**2. అనుమానాస్పద రేఖ (Enquiry Line) :**

ఈ రేఖ జన్మదిన పట్టికలో 3,5,7 సంఖ్యలు లోపిస్తే కలుగుతుంది. ఈ రేఖ కలవారు ఏ విషయాన్నైనా, నిరూపణ జరిగితే కాని నమ్మరు. నమ్మకం మీద ఆధారపడే విషయాలను నమ్మరు. వీరు సాధారణంగా సంప్రదాయబద్ధంగా ఉండి, మతం పట్ల విశ్వాసం కలిగి, తల్లిదండ్రుల చెప్పిన వాటిని మాత్రమే నమ్ముతారు. వీరు ప్రేమ, నిజాయితీ, కలిగిఉన్నా, భావ

| | | |
|---|---|---|
| | | 9 |
| 22 | | 8 |
| 11 | | |

ప్రకటన సరిగా చేయలేరు. వీరు ఆదర్శభావాలు, అసాధారణ స్ఫురణ (ఇంట్యూషన్)

కలిగి ఉంటారు.

ఉదా :- అమెరికా మాజీ ప్రెసిడెంట్, అబ్రహం లింకన్ (12-2-1809)

### 3. మతిమరుపు రేఖ (Poor Memory Line) :

జన్మదిన పట్టికలో 3,6,9 సంఖ్యలు లోపిస్తే ఈ రేఖ కలుగుతుంది. కాబట్టి ఈ రేఖ కలవారు 20 వ శతాబ్ధంలో సాధారణంగా ఉండరు. 21 వ శతాబ్దంలో ఈ రేఖ కలవారు ఉంటారు. ఈ రేఖ కలవారికి మతిమరుపు ఉన్నా, తెలివితేటలు, మేథస్సు ఉండకూడదు అనే నియమం లేదు. చాలా మంది ఈ రేఖ కలవారు, చాలా వేగవంతులుగా, చతురత కలిగిన వారుగా ఉంటారు. ముసలితనంలో మాత్రం మతిమరుపు ఎక్కువయ్యే అవకాశం ఉంది. పరధ్యానంగా ఉండి, మతిమరుపుగా ఉంటారు. బాల్యంలో వీరు నెమ్మదిగా నేర్చుకొని, పెరిగే కొద్ది మంచి బుద్ధి కుశలత కలిగి ఉంటారు. ముసలితనంలో మతిమరుపు వలన విసుగుచెంది, కొత్త అభిరుచులు ప్రవృత్తులు పొందటానికి ప్రయత్నిస్తారు.

ఉదాహరణ: ప్రముఖ మేధావి బెర్ట్రాండ్ రసెల్ (18-5-1872)

| | | |
|---|---|---|
| | | |
| 2 | 5 | 88 |
| 11 | | 7 |

రసెల్ గొప్ప మేధావిగా పేరు పొందినా, చివరిలో మతిమరుపుకు గురయ్యాడు.

**ఉదా :** ప్రఖ్యాత ఆంగ్లరచయిత సొమర్‌సెట్ మామ్ (25-1-1874)

| | | |
|---|---|---|
| | | |
| 2 | 5 | 8 |
| 11 | 4 | 7 |

సొమర్‌సెట్ మామ్‌కు మతిమరుపు రేఖ ఉన్నా, భావావేశ సమతుల్యతారేఖ, వాస్తవికతారేఖ ఉన్నాయి. చివరి దశలో సోమర్‌సెట్ మామ్ కూడా సంపూర్ణ మతి మరుపుకు గురి అయ్యాడు, అయినా గొప్ప రచయితగా పేరు పొందాడు.

### 4. భావావేశ సున్నితత్వ రేఖ (Hypersensitivity Line) :

జన్మదిన పట్టికలో 2,5,8 సంఖ్యలు లోపించినపుడు ఈ రేఖ ఏర్పడుతుంది. జీవితంలో భావావేశాన్ని అదుపులో ఉంచే సంఖ్యలు లేకపోవటం వలన, ఈ విషయంలో సమతుల్యత లోపిస్తుంది. అందువలన ఈ రేఖ కలిగిన వ్యక్తులు అతి సున్నిత మనస్కులుగా ఉండి, తొందరగా గాయపడే మనసు కలిగి ఉంటారు. తరువాత వారి భావాలను ఎలా దాచాలో తెలుసుకుంటారు. వీరు చాల సహృదయత కలిగినవారై, అవసరంలో ఉన్న వారిని ఆదుకుంటారు. చిన్న పిల్లల్లా సిగ్గు కలిగి ఉంటారు. వయసు పెరిగే కొద్ది దీన్ని అదుపు చేయగలుగుతారు. కొందరికి జీవితాంతం ఆత్మన్యూనతా భావం ఉంటుంది.

**ఉదాహరణ :** దయానా యువరాణి (1-7-1961)

| | | |
|---|---|---|
| | 6 | 9 |
| | | |
| 111 | | 7 |

### 5. అవాస్తవికతా రేఖ (Impracticality Line)

జన్మదిన పట్టికలో 1,4,7 సంఖ్యలు లోపించటం వలన ఈ రేఖ ఏర్పడుతుంది. గత వేయి సంవత్సరాలుగా ఈ రేఖ కలవారు ఎవరూ లేరు. 21వ శతాబ్దంలో ఈ రేఖ కలవారు ఉంటారు. ఈ రేఖ కలవారికి, వాస్తవికతా సంఖ్యలు లోపించటం వలన వీరు ఎపుడూ ఊహాలోకంలో విహరిస్తుంటారు. వీరు అవాస్తవికత ఊహ ప్రపంచం కలిగి ఉండటం వలన నిత్యజీవితం గడవటం చాలా కష్టంగా ఉంటుంది. కానీ వీరు మంచి సిద్ధాంతకర్తలుగా పేరు పొందగలుగుతారు.

### 6. నిరాశా రేఖ (Frustration Line)

| | | |
|---|---|---|
| 3 | | 9 |
| 227 | | |
| 1 | | 7 |

జన్మదిన పట్టికలో, 4,5,6 సంఖ్యలు లోపించటం వలన ఈ రేఖ ఏర్పడుతుంది. ఈ రేఖ జన్మదిన పట్టికను రెండు భాగాలుగా విభజిస్తుంది. అటు, ఇటూ భాగాలలో కొన్ని సంఖ్యలు, మధ్యభాగంలో శూన్యం ఉంటుంది. ఈ రేఖ కలవారు, జీవితంలో వారి న్యాయమైన భాగం కంటే ఎక్కువ, అపజయాలు, నిరాశ, నిస్పృహలకు లోనవుతారు. ఇది, వారి స్వయంకృతం ఎందుకంటే, వీరు ఇతరుల నుంచి,

అర్హతకు మించి ఎక్కువ కోరుకుంటారు. అంత పొందలేరు.
ఉదా : హాలివుడ్ నటి, ఎలిజబెత్ టేలర్ (27-2-1932)

### 7. సంశయరేఖ (Doubtfulness Line)

జన్మదిన పట్టికలో 7,8,9 సంఖ్యలు లోపిస్తే ఈ రేఖ ఏర్పడుతుంది. ఈ రేఖ కలవారు చొరవలోపం, చిందరవందర ఆలోచనలు, కలిగి ఉంటారు. దాని వలన వీరి ప్రణాళికలు విఫలం అవుతాయి. క్రమశిక్షణ అలవరచుకొని, నిర్దిష్టమైన లక్ష్యాలను ఎంచుకొని ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్ళి విజయం సాధించటం అనేది వీరికి అరుదుగా జరుగుతుంది. దీనిని వీరు అధిగమించ గలిగితే, వీరు గొప్ప మార్గదర్శకులుగా ఉండగలుగుతారు. పాజిటివ్ ఆలోచనలు, క్రమశిక్షణ అలవాటు చేసుకుంటే, ఈ బలహీనతను జయించవచ్చు.
ఉదా : ఐజాక్ న్యూటన్ (25-12-1642)

| | | |
|---|---|---|
| | 6 | |
| 222 | 5 | |
| 11 | 4 | |

21 వ శతాబ్దిలో జన్మదిన సంఖ్యలలో 2 సంఖ్య చాలా ప్రాముఖ్యత కలిగి ఉంటుంది. 1 నుండి 9 వరకు ఉన్న మిగతా సంఖ్యలు చాలా మిస్ అవుతాయి. అటువంటప్పుడు వారి భవిష్యత్తు ఎలా ఉంటుంది అనే విషయం, వర్ధమాన న్యూమరాలజిస్టులు తగిన పరిశోధన, విశ్లేషణ చేయాల్సిన అవసరం ఉంది.
ఉదా : 2-2-2000 లో పుట్టిన వ్యక్తికి 2 సంఖ్య తప్ప మిగతా సంఖ్యలు లేవు. అంత మాత్రాన వాళ్ళు వృద్ధిలోకి రాలేరు అని అనుకోకూడదు.
కాబట్టి దీని గురించి న్యూమరాలజిస్టులు పరిశోధన చేయాల్సిన ఆవశ్యకత ఉంది.

# వ్యక్తిగత సంవత్సర సంఖ్య

**వ్యక్తిగత సంవత్సర సంఖ్య అనేది ప్రస్తుత సంవత్సరంలో, ఆ వ్యక్తి యొక్క సంవత్సర సంఖ్యను, అతని జన్మ సంవత్సరంను అనుసరించి తెలియజేస్తుంది. ఈ సంఖ్య బట్టి ప్రస్తుత సంవత్సరంలో వ్యక్తి యొక్క భవిష్యత్తు ఎలా ఉంటుందో తెలుసుకోవచ్చు.**

మన జీవితంలో జన్మదినం యొక్క విశిష్టతను, దాని ప్రభావం మన జీవితంపై ఎలా ఉంటుంది అన్నది న్యూమరాలజీ ప్రకారం ఇంతకు ముందు మనం తెలుసుకున్నాం. ఇపుడు వ్యక్తిగత సంవత్సర సంఖ్య గురించి తెలుసుకుందాం. ఒక వ్యక్తి యొక్క జన్మదినం 8–7–1957 అనుకుంటే అతని జన్మ సంఖ్య = 8. ఇపుడు 2012లో అతని వ్యక్తిగత సంవత్సరం తెలుసుకోవాలంటే అతని జన్మ సంఖ్య + అతని పుట్టిన నెల మరియు ఏ సంవత్సరమో ఆ సంవత్సర నెంబరును కలపాలి అంటే

ఉదా : అతని పుట్టిన తేది = 8

అతని పుట్టిన నెల = 7

అతను 2012 సంవత్సరంలో వ్యక్తిగత సంవత్సర సంఖ్య తెలుసుకోవాలంటే 8+7+2+0+1+2=20=2

ఇపుడు ఆ వ్యక్తి యొక్క వ్యక్తిగత సంవత్సర సంఖ్య 2 అవుతుంది. ఈ వ్యక్తిగత సంవత్సర సంఖ్య అనేది ప్రతీ వ్యక్తికి, ప్రతీ సంవత్సరం మారుతూ ఉంటుంది. ఆ మార్పులోనే, అతని జీవిత గమనంలో జరిగే మార్పులను ఈ సంఖ్య సాంకేతికంగా చూపిస్తుంది. ఈ వ్యక్తిగత సంవత్సర సంఖ్యలు 1 నుండి 9 వరకు వ్యక్తుల యొక్క జీవితంపై ఏ విధమైన ప్రభావం చూపుతాయన్నది ఇపుడు తెలుసుకుందాం.

## వ్యక్తిగత సంవత్సర సంఖ్య – 1

**ఈ సంవత్సరంలో నూతన అవకాశాలు వస్తాయి.**

1వ సంఖ్య సూర్యునికి సంకేతం. ఈ సంఖ్య గల సంవత్సరంలో వ్యక్తికి నూతన అవకాశాలు ఎక్కువగా వస్తుంటాయి. బాధ్యతలు పెరిగినా, దానికి అనుగుణంగా

ఆర్థికాభివృద్ధి, అదృష్టం కలిసి వస్తాయి. కొత్త వ్యాపారాలు, పథకాలు ఈ సంవత్సరంలో ప్రారంభించి దాని వలన ఎంతో లాభం పొందుతారు. ఈ సంవత్సరంలో పెట్టిన శ్రమ, పెట్టుబడి ముందు కాలంలో ఎంతో లాభాన్ని తెచ్చిపెడుతుంది. అయితే "అహంభావం" వృద్ధి చెందే అవకాశం ఉంది. దాని వలన సన్నిహితులను, స్నేహితులకు దూరం అయ్యే అవకాశం ఉంది.

అవసర సమయాలలో అహంభావం విడిచిపెట్టి గొప్పవారి సాయం తీసుకుంటే ఎంతో లాభదాయకంగా ఉంటుంది. వృత్తి ఉద్యోగాలలో ఉన్నతి ఈ సంవత్సరంలో ఉంటుంది. గత సంవత్సరాలలో పోలిస్తే, ఈ సంవత్సరంలో, సామాజికంగా ఎంతో పేరు ప్రఖ్యాతులు వస్తాయి. నాయకులుగా ఎదుగుతారు. ఈ వ్యక్తిగత సంఖ్య 1, రచయితలకు, పోటీదారులకు, నూతన వ్యాపారాలు ప్రారంభించేవారికి, సంగీతకారులకు, కళాకారులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తాయి. అమ్మాయిలకి పెండ్లి అవుతుంది. ట్రాన్స్‌ఫర్ లేదా కొత్త ఉద్యోగం కొరకు చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. కొత్త సంబంధాలు ఏర్పడతాయి. కొత్త ప్రదేశానికి మారే అవకాశం ఉంది. ఈ సంవత్సరంలో చాలా అవకాశాలు వస్తాయి. వాటిని సద్వినియోగం చేసుకుంటే రాబోయే కాలం చాలా చక్కగా ఉంటుంది.

## వ్యక్తిగత సంవత్సర సంఖ్య - 2

**ఈ సంవత్సరంలో భావోద్వేగం, సెంటిమెంటు ఎక్కువగా ఉంటాయి.**

2 వ సంఖ్య చంద్రునికి సంకేతం. ఈ సంవత్సరంలో భావోద్వేగాలు, సెంటిమెంటు ఎక్కువగా ఉంటాయి. ప్రేమలో పడే అవకాశం ఉంది. ఈ సంవత్సరంలో తెలుసుకున్నది, తరువాత సంవత్సరాలకి ప్రణాళికలు వేయటానికి ఉపయోగపడుతుంది. అభివృద్ధి కొంత నత్తనడకన సాగుతుంది. కాబట్టి కొత్త వ్యాపారాలు, ప్రాజెక్ట్‌లు ఈ సంవత్సరంలో ప్రారంభించరాదు. ఈ సంవత్సరంలో కేవలం ప్లానింగ్ చేసుకుంటే మంచిది.

తల్లిదండ్రులు, పెద్దలతో సంబంధాలు అంతంత మాత్రంగా ఉంటాయి. భాగస్వామ్యాలు కొంత వరకు లాభదాయకం. సంయమనం పాటిస్తూ, భవిష్యత్తు

ప్రణాళికలు ఈ సంవత్సరంలో వేసుకోవాలి. ఆవేశం ఎంతమాత్రం పనికిరాదు. ఈ సంవత్సరంలో మీరు కోరుకున్నంత గుర్తింపు లభించదు. మీ వ్యక్తిగత ఆకర్షణశక్తి వలన స్నేహితులు ఎక్కువ అవుతారు. గృహోపకరణాలు, విలాస వస్తువులు సమకూర్చుకొనడానికి అనుకూలం.

## వ్యక్తిగత సంవత్సర సంఖ్య - 3 :

**ఈ సంవత్సర సంఖ్య జ్ఞానానికి, విజయానికి సంకేతం.**

సంఖ్య 3 గురుగ్రహానికి గుర్తు. వీరు ఈ సంవత్సరంలో ఎంతో విషయ పరిజ్ఞానాన్ని, కార్య పరిజ్ఞానాన్ని పొందుతారు. ఈ సంవత్సరం, విజయానికి సంకేతం. కొత్త స్నేహితులు వస్తారు. పాత, పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తారు. ఈ సంవత్సరం అంతా సుఖం, ఆనందం, నూతన ఉత్సాహం, స్వయం వికాసంతో నిండి ఉంటుంది. మీ ఆలోచనలను, ఉత్సాహాన్ని, నిర్మాణాత్మకంగా ఉండేటట్లు చూసుకుంటే లాభదాయకం.

ఈ సంవత్సరం, స్నేహితులు, వినోదం, ప్రేమ, గుర్తింపు లభిస్తాయి. గత 7,8 సంవత్సరాలతో పోల్చితే ఈ సంవత్సరం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఆర్థిక అభివృద్ధి జరిగి కలలు సాకారమవుతాయి. రచయితలకు, వక్తలకు ఈ సంవత్సరం పేరు ప్రఖ్యాతులు, గుర్తింపు, సంపదను ఇస్తుంది. ఈ సంవత్సరం న్యాయపరమైన లావాదేవీలు, కోర్టుకేసులకు అనుకూలం కాదు. ఈ విషయంలో జాగ్రత్త పడితే మంచిది. ఈ సంవత్సరం మీకు కొత్త కొత్త కోర్సులు చేయాలని కోరిక కలిగి చదువును మొదలుపెడతారు. మధ్యలో చదువు ఆపిన మీరు మరల చదువు మొదలుపెట్టి వదిలిన కోర్సుని పూర్తి చేస్తారు. వీరికి ఈ సంవత్సరం గౌరవపట్టాలు దొరికే అవకాశం ఉంది. ఈ సంవత్సరం అందరి చేత గౌరవింపబడతారు.

## వ్యక్తిగత సంవత్సర సంఖ్య - 4 :

**ఈ సంవత్సరంలో ఆకస్మిక మార్పులు జరుగుతాయి.**

సంఖ్య 4 రాహువుకి చిహ్నం. అనుకోని హఠాత్తు మార్పులు చోటు చేసుకుంటాయి. ఈ సంవత్సరం గొప్ప అదృష్టాన్ని, ఆదాయాన్ని కలుగచేస్తుంది. ఈ సంవత్సరం ఎంతో

ప్రాముఖ్యతను సంతరించుకుంటుంది. నూతన అభివృద్ధి, లాభదాయక సంబంధాలు, ఒకదాని తరువాత ఒకటి అదృష్టం కలిగించే సంఘటనలు జరుగుతాయి. మీలో చెప్పలేనంత మార్పు, సన్నిహితులకి ఆశ్చర్యం కలిగిస్తుంది. నిర్ణయాలు వెంటవెంటనే మార్చేస్తుంటారు. హేతుబద్ధంగా ఆలోచిస్తూ తమ ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం పరిరక్షించుకోవాలి.

ఈ సంవత్సరం విజయాల్ని తీసుకొచ్చినా, కొంచెం శ్రమ పడాల్సి ఉంటుంది. ఆర్థిక లాభాలు, ఆదాయవృద్ధి, వ్యాపార వృద్ధి ఈ సంవత్సరంలో ఉంటుంది. దూర ప్రయాణాలు చేయాల్సి వస్తుంది. పెళ్ళికాని వారికి ఈ సంవత్సరం మంచి సహచరుడు / సహచరిణి దొరికే అవకాశం ఉంది. ప్రేమ వ్యవహారాలకి ఈ సంవత్సరం అనుకూలం కాదు. పెళ్ళికి  అనుకూలం. పిల్లలు లేని వారికి ఈ సంవత్సరంలో పిల్లలు కలిగే అవకాశం ఉంది. కోర్టు కేసులలో విజయం సాధిస్తారు. ఇల్లు కట్టుకోవాలనే కోరిక తీరుతుంది. కొత్త కొత్త ఆస్తులు సమకూరుతాయి. ప్రమోషన్స్ కొరకు ఎదురుచూసే వారికి ప్రమోషన్స్ వస్తాయి. రాజకీయ నాయకులకు పదవులు లభిస్తాయి. ఎంతటి క్లిష్టతరమైన ఎలక్షన్స్‌లో కూడా గెలుస్తారు. ఇది చాలా మంచి సంవత్సరం.

## వ్యక్తిగత సంవత్సర సంఖ్య - 5

**ఈ సంవత్సరంలో విఘ్నాలు తొలగి ఆనందం కలుగుతుంది.**

సంఖ్య 5 బుధగ్రహానికి గుర్తు మంచి సంతోషకరమైన సంవత్సరం. మంచి మార్పు, ఆనందం అనుకోని మంచి అవకాశాలు వచ్చి అన్ని విఘ్నాలు ఆటంకాలు తొలగిపోయి, వృత్తిపరంగా, కుటుంబ పరంగా ఎంతో ప్రోత్సాహంగా ఉంటుంది. ఈ సంవత్సరంలో జరిగే సంఘటనలు అన్నీ వీరి మంచికే జరుగుతాయి. వ్యాపార, విలాస ప్రయాణాలు చేస్తారు. ఆర్థిక భద్రత, స్నేహ సంబంధాలు పెరిగి కొత్త అవకాశాలు వచ్చి ఎంతో అభివృద్ధి సాధిస్తారు. వ్యాపార లావాదేవీలకు సంబంధించి డాక్యుమెంట్లపై సంతకాలు చేయవలసి వస్తుంది. విజ్ఞతతో ఈ పని చేస్తే లాభదాయకంగా ఉంటుంది. ఈ సంవత్సరం చదువులో మంచి ప్రగతి సాధిస్తారు. కాంపీటేటివ్ పరీక్షల్లో విజయం పొందుతారు.

ఈ సంవత్సరం, రచయితలకు, మీడియా వ్యక్తులకు, అధ్యాపకులకు, పాత్రికేయులకు, కంప్యూటర్ రంగ నిపుణులకు, సినీనటులకు అనుకూలం.

## వ్యక్తిగత సంవత్సర సంఖ్య - 6

**ఈ సంవత్సరంలో తల్లిదండ్రులు, పిల్లలను బాగా చూసుకుంటారు.**

సంఖ్య 6 శుక్రగ్రహానికి చిహ్నం. శుక్రుడు ప్రేమ, అందం అనే వాటికి అధిష్టానంగా ఉంటాయి. ఈ సంవత్సరంలో ఈ సంఖ్య గల వ్యక్తులు, విధి నిర్వహణలోను, కుటుంబ పరమైన బాధ్యతలలోనూ ఎంతో శ్రద్ధ తీసుకుని తల్లిదండ్రులను, పిల్లలను, కుటుంబాన్ని, బంధువులను ఆదరాభిమానాలతో చూస్తారు. ఇందులో ఎంతో ఆత్మ సంతృప్తిని పొందుతారు. గతంలో కంటే ఈ సంవత్సరం ఎంతో రిలాక్సుడుగా ఉంటారు. అందరి సహకారం ఉండటం వలన ఈ సంవత్సరం, వ్యాపార, స్థిరాస్థి వ్యవహారాలు చక్కదిద్దుకోడానికి అనుకూలం. దూరప్రయాణాలు చేసినా ధ్యాసంతా ఇంటి మీదనే ఉంటుంది. ఈ సంవత్సరం అవివాహితులకు వివాహం అవుతుంది. కాంపీటీటివ్ పరీక్షల్లో విజయం సాధిస్తారు. కొత్త స్నేహితులు ఏర్పడతారు.

ఈ సంవత్సరం పిల్లలు పుట్టే అవకాశం ఉంది. ఇంటికి విలాసవంతమైన వస్తువులు కొంటారు. నిరుద్యోగులకు ఉద్యోగ ప్రాప్తి ఉంటుంది. ఉద్యోగులకు జీతభత్యాలు పెరుగుతాయి. ఊహించని ఆస్తి సంప్రాప్తం అవుతుంది. సినీనటులకు, కళాకారులకు, సంగీతకారులకి, మీడియావాళ్ళకి, సినీ నిర్మాతలకు, నగల వ్యాపారులకి ఈ సంవత్సరం అనుకూలం.

## వ్యక్తిగత సంవత్సర సంఖ్య - 7

**ఈ సంవత్సరం శాంతికి చిహ్నం. ఆధ్యాత్మిక భావాలు కలుగుతాయి.**

సంఖ్య 7 కేతువుకి సంకేతం. 1 నుండి 9 వరకు సంఖ్యలన్నింటిలో 7 సంఖ్య ఎంతో ఆధ్యాత్మికమైనది. ఈ సంవత్సరం "శాంతి"కి చిహ్నం. ఆధ్యాత్మిక చింతన ఎక్కువగా ఉండటం వలన, భౌతిక అభివృద్ధిపై ఎక్కువ దృష్టి పెట్టరు. నలుగురికి దూరంగా వుంటూ ధ్యానం, ఆత్మ పరిశీలన మొదలగునవి చేస్తారు. అంతా స్తబ్దతతో నిండి ఉండి, పురోభివృద్ధి తక్కువగా ఉంటుంది. దీని గురించి ఎక్కువగా చింతించరాదు. కాని ప్రాపంచిక విషయాలపట్ల అంటే ఆస్తులు, వ్యవహారాల విషయంలో స్నేహితులతో చర్చించి వారి

సహకారం తీసుకోవటం మంచిది. ఒక్కొక్కసారి అపార్థాలకు దారి తీసే అవకాశం ఉంది. అందువలన వ్యాపారాలలో రిస్క్ తీసుకోవటం మంచిది కాదు. ప్రేమ వ్యవహారాలలో తలదూర్చకుండా ఉంటే మంచిది. కోర్టు వ్యవహారాలలో విజయం కలుగుతుంది. తీర్థయాత్రలు చేస్తారు. చాలా కాలంగా విదేశీ ప్రయాణాలకు చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. విద్యార్థులకు విదేశాలలో చదవాలనే కోరిక తీరుతుంది.

ఈ సంవత్సరం వీరు ఓర్పు, ఆశాదృక్పథం, నమ్మకం కలిగి ఉండటం మంచిది. ఈ సంవత్సరం ఆధ్యాత్మికత ఎక్కువ కాబట్టి, సంబంధిత శాస్త్రాలయిన జ్యోతిష్యం, న్యూమరాలజీ, తంత్ర శాస్త్రాలు, మ్యాజిక్, హిప్నాటిజం లాంటి వాటిని అవగాహన చేసుకునే ప్రయత్నం చేస్తే ఫలిస్తుంది. ఇటువంటి ఆధ్యాత్మిక చింతన మరల 8 సంవత్సరాల తరువాత గాని రాదు.

## వ్యక్తిగత సంవత్సర సంఖ్య - 8

**ఈ సంవత్సరంలో ఇంతవరకు పడిన శ్రమకు ఫలితం లభిస్తుంది.**

సంఖ్య 8 శనికి గుర్తు. శని అనగానే భయపడాల్సి పనిలేదు. గత 7 సంవత్సరాల నుండి మీరు పడుతున్న శ్రమకి ఈ సంవత్సరం ఫలితం లభిస్తుంది. ఈ సంవత్సరంలో భౌతిక సంపదలు, అభీష్ట సిద్ధి, విజయం ప్రాప్తం అవుతాయి. నూతన ఉత్సాహం, శక్తి, మంచి గుర్తింపు, సంపద, కీర్తి, ఉన్నత స్థితి ఎంతగా లభిస్తాయంటే, 8 సంఖ్య ఒక గరీబుని అమీరుగా మార్చగలదు అని నిరూపితమవుతుంది. పెద్దవారి నుండి, అధికారులనుండి ఎన్ని ఇబ్బందులు ఎదురైనా, పనులు ఆలస్యమైనా, నిరాశ ఎదురైనా మొక్కవోని ధైర్యంతో ముందుకు సాగుతూ, అవకాశాలు అందిపుచ్చుకుంటూ విజయాలు సొంతం చేసుకుంటారు. వీరు ఉన్నత స్థితికి చేరుకోవటమే కాకుండా, ఇతరులకి సహాయం చేసే స్థితిని పొందుతారు. విద్యార్థులు కాంపీటేటివ్ పరీక్షల్లో విజయం సాధిస్తారు. ఉద్యోగం కొరకు చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి.

ఈ సంవత్సరంలో వస్తువులు, ఆస్తులు కొనవచ్చు గాని అమ్మటానికి ప్రయత్నించవద్దు. రాజకీయ నాయకులు, స్టీలు పనివారికి, లోహ పరిశ్రమల వారికి, ఈ సంవత్సరం ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. కోర్టు వ్యవహారాలలో విజయం

లభిస్తుంది. ఒత్తిడి, ఆందోళన, కోపం మూలంగా వచ్చే రక్తపోటు, గుండె సంబంధిత వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి.

## వ్యక్తిగత సంవత్సరం సంఖ్య – 9

**ఈ సంవత్సరం సంపూర్ణతకు, సంతృప్తికి, కార్యసిద్ధికి చిహ్నం.**

సంఖ్య 9 కుజునికి సంకేతం 1 వ సంఖ్య ప్రారంభానికి, 9 సంఖ్య ముగింపుకి చిహ్నం. ఈ నవ వసంత చక్రం చివరిదశకి వచ్చింది కాబట్టి ఈ సంవత్సరం సంపూర్ణత, సంతృప్తి, కార్యసిద్ధికి సంకేతంగా ఉంటుంది. కొత్త ఆశలు, ఆశయాలు చిగురించటానికి అంటే నవవసంత చక్రం మళ్లీ ప్రారంభం కావటానికి, ఈ సంవత్సరం సోపానంగా ఉంటుంది. ప్రేమ వ్యవహారాలు, శృంగార వ్యవహారాలు చోటు చేసుకునే అవకాశం ఉంది కాబట్టి వీరి మానసిక స్థితికి అనుగుణంగా వీటిని సున్నితంగా పరిష్కరించుకోవాలి.

ఈ సంవత్సరం వీరు చాలా దూకుడుగా, అతిగా స్పందిస్తూ, స్పష్టంగా, నిర్మొహమాటంగా మాట్లడటం వలన వివాదాలు వచ్చే అవకాశం ఉంది. పై అధికారుల నుండి మీరు కోరినవి లభిస్తాయి. అనుకోని అదృష్టం, లాటరీ లాంటివి లభించి ఆర్థిక లాభం కలుగవచ్చు. ఆధ్యాత్మికత వైపు మనసు మళ్ళుతుంది.

# వ్యక్తిగత మాస సంఖ్య

**12 మాసాలలో ఏఏ మాసాలు అనుకూలమో తెలిపేదే వ్యక్తిగత మాస సంఖ్య.**

వ్యక్తిగత సంవత్సర సంఖ్య మన జీవిత గమనంపై ఎటువంటి ప్రభావం చూపిస్తుందో ఇంతకు ముందు తెలుసుకున్నాం. ఇపుడు మనం వ్యక్తిగత మాససంఖ్య గురించి తెలుసుకుందాం. వ్యక్తిగత మాససంఖ్యకు కూడా న్యూమరాలజీలో చాలా విశిష్టత ఉంది. 12 మాసాలలో ఏఏ మాసాలు మనకి అనుకూలమో ఈ వ్యక్తిగత మాససంఖ్య వలన తెలుస్తుంది. ఈ వ్యక్తిగత మాససంఖ్యను ఎలా తెలుసుకోవాలో ఇపుడు చూద్దాం.

వ్యక్తిగత సంవత్సరం ఎలా కనుక్కోవాలో తెలుసుకున్న ఒక వ్యక్తి 8.7.1957 లో పుడితే 2012లో అతని వ్యక్తిగత సంవత్సర సంఖ్య '2' వచ్చినది. ఆ వ్యక్తి జూలై 2012లో అతని వ్యక్తిగత మాససంఖ్యను ఈ విధంగా తెలుసుకోవచ్చు.

వ్యక్తిగత సంవత్సర సంఖ్య = 2
జూలై 2012 మాస సంఖ్య = 7 = 9

ఇపుడు 8-7-1957లో పుట్టిన వ్యక్తి 2012, జూలైలో అతని మాససంఖ్య 9 అవుతుంది. ఈ వ్యక్తిగత మాససంఖ్య 1 నుండి 9 వరకు, వారి యొక్క జన్మ తేదీ ప్రకారం ఎలా ఉంటాయో ఇప్పుడు తెలుసుకుందాం.

## మాససంఖ్య - 1

**ఈ మాసంలో నూతన అవకాశాలు వస్తాయి.**

ఈ నెల చాలా అదృష్టవంతమైనది. మాససంఖ్య 9 తో ముగిసిపోయేవి, ఈ మాసంలో ప్రారంభం అవుతాయి. మీ వ్యక్తిగత మాససంఖ్య 1 అయినట్లయితే, ఈ నెలలో నూతన అవకాశాలకు, కొత్త వ్యాపారాలు, కొత్త ఆలోచనలకు నాంది పలుకుతారు.

ఈ నెల కొత్తపనులు, వ్యాపారాలు ప్రారంభించటానికి చాలా అనుకూలం. ఇపుడు మీరు చేసిన ప్రయత్నాలకు, ముందు కాలంలో చక్కటి ప్రతిఫలాన్ని పొందుతారు. అధికలాభాలు, కొత్త స్నేహితులు, వ్యాపార భాగస్వాములు మొదలగు వాటితో ఎంతో ఉన్నతిని పొందుతారు.

## మాససంఖ్య - 2

**ఈ మాసంలో విశ్రాంతి లభిస్తుంది.**

ఈ మాససంఖ్య కలవారు క్రిందటి నెలలో ఎంతో శ్రమించి ప్రయత్నాలు చేసి ఉంటారు. అటువంటి వారికి ఈ నెల విరామాన్ని, విశ్రాంతిని ఇస్తుంది. ఈ నెలలో కుటుంబం, వ్యక్తిగత బాంధవ్యాలపై దృష్టి పెట్టడం మంచిది. కుటుంబ సభ్యులతో హాయిగా కాలం గడపటానికి అనుకూలం. ఈ సంఖ్యకు చంద్రుడు అధిపతి కావున, ముఖ్య నిర్ణయాలు తీసుకున్నపుడు మనసు చలించే అవకాశం ఉంది. భావోద్వేగానికి గురి అయ్యే అవకాశం ఉంది. మనసుని అదుపులో ఉంచుకోని ఆనందిస్తే మంచిది.

## మాససంఖ్య - 3 :

**ఈ మాసంలో తప్పుడు నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది.**

ఈ నెలలో ఆర్థిక వ్యవహారాలకు సంబంధించి తప్పుడు నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. జూదం జోలికి పోకూడదు. ధన నష్టం జరుగుతుంది. మిగతా విషయాలు ఫరవాలేదు. కళాఖండాల ప్రదర్శనలు, మ్యూజియాలు సందర్శిస్తారు. కోర్టు వ్యవహారాలలో విజయం లభిస్తుంది.

## మాససంఖ్య - 4 :

**ఈ మాసం భవిష్యత్తు ప్రణాళికలు వేయటానికి అనుకూలం.**

ఈ నెల భవిష్యత్తు ప్రణాళికలకు, నిర్మాణ పనులు చేయటానికి అనుకూలం. ఆర్థిక భద్రతపై దృష్టిని సారించండి.

ఈ నెల పనులకు సంబంధించి ప్రణాళికలు వేయటానికి అనుకూలం. కుటుంబంతో కలసి ఉంటూ, ప్రేమ వాత్సల్యాలు అభివృద్ధి చేసుకోవడానికి అనుకూలం. కోర్టు కేసులలో విజయం.

## మాససంఖ్య - 5 :

**ఈ మాసంలో నివాసంలో మార్పులు, ప్రయాణాలు ఉంటాయి.**

ఈ నెలలో నివాసంలో మార్పులు, పనిచేసే స్థలంలో మార్పు, అనుకోని ప్రయాణాలు ఉంటాయి. విలాసయాత్రలు చేస్తారు. ఈ నెలలో ఎంతో లౌక్యంగా వ్యవహారించాల్సి ఉంటుంది. ఆర్థిక లాభాలు, పదోన్నతులు కలుగుతాయి. నేల విడిచి సాము చేయకుండా, దూకుడు, తగ్గించుకుంటే మంచిది.

## మాససంఖ్య - 6 :

**ఈ మాసం చాలా దివ్యమైంది. ఆర్థిక లాభాలు, విద్యార్థులకు అనుకూలం.**

ఈ నెల చాలా దివ్యంగా వుంటుంది. ప్రేమ, ధనం, విలాసాలు, ఆర్థిక లాభాలు, వారసత్వ ఆస్తుల ప్రాప్తం. విద్యార్థులకు చాలా అనుకూలం. మంచి మార్కులు వస్తాయి. ఇంటిని చక్కగా అలంకరించుకోవడానికి, అందమైన వస్తువులతో తీర్చిదిద్దుకొనడానికి అనుకూలం. ప్రకృతి దృశ్యాలు చూస్తూ, ఆనందిస్తూ, మానసిక ప్రశాంతత పొందుతారు.

## మాససంఖ్య - 7 :

**ఈ మాసంలో ఆధ్యాత్మిక భావం ఉంటుంది.**

ఈ నెల దూకుడు తగ్గించుకొని, ఆత్మ పరిశీలన చేసుకునేందుకు అనువైనది. ఆధ్యాత్మికత వైపు మనసు మళ్ళుతుంది. శత్రువులు ఎవరు, నిజమైన మిత్రులు ఎవరు అనే విషయాలలో జ్ఞానోదయం అవుతుంది. ఈ మాసం మానసిక సంబంధ మాసం. గ్రంథ పఠనం, ప్రత్యేకంగా ఆధ్యాత్మికమైనవి చదువుతూ పరిజ్ఞానాన్ని పెంచుకునే కాలం.

## మాససంఖ్య - 8 :

**ఈ మాసంలో కార్యరంగంలోకి దూకే సమయం.**

ఆధ్యాత్మిక భావాలు, వదిలించుకొని, కార్యరంగంలోకి దూకే కాలం ఇది. గత 7

నెలలుగా మీ విజయాలు, అపజయాలు బేరీజు వేసుకుని మీ పనితనాన్ని అంచనా వేసుకుంటారు. విశ్రాంతి తీసుకునే సమయం కాదు. మీ లక్ష్యసాధనకు అనుకూలమైన కాలం. ధన సంపాదన బాగా చేస్తారు. ఇచ్చి పుచ్చుకునే ధోరణి అవలంభించటం మంచిది.

## మాససంఖ్య - 9

**ఈ మాసంలో గతాన్ని మరిచిపోయి కొత్త ప్రణాళికలు వేసుకోవాలి.**

9 సంఖ్య ముగింపుకు సూచన. ఇంతవరకు జరిగింది జరిగిపోనీ, గతం గతః అనుకుని, నూతన ఉత్సాహంతో కొత్త ప్రణాళికలు తీసుకోవాలి. మీ అభివృద్ధికి ఆటంకాలుగా ఉన్నా వాటికి తొలగించుకునే సమయం ఇది. సదవకాశాలు వస్తాయి. ఇతరుల సలహాలు వినకుండా, మీ విజ్ఞతను ఉపయోగించి నిర్ణయాలు తీసుకోవాలి.

# వ్యక్తిగత దిన సంఖ్య

**వ్యక్తిగత దిన సంఖ్య అనేది నెలలో ఏ ఏ తేదీలు మనకు అనుకూలమో తెలియజేస్తుంది.**

న్యూమరాలజీలో వ్యక్తిగత దిన సంఖ్యకు కూడా చాలా ప్రాధాన్యత ఉంది. నెలలో ఏఏ తేదీలు మనకు అనుకూలమో దీని వలన తెలుసుకొనవచ్చు. వ్యక్తిగత దినసంఖ్యను ఈ క్రింది విధంగా తెలుసుకొనవచ్చును. మాస సంఖ్యను తెలుసుకున్నాం.

8-7-1957లో పుట్టిన వ్యక్తికి 2012 లో జూలైలో అతని వ్యక్తిగత సంవత్సర సంఖ్య - 2, వ్యక్తిగత మాససంఖ్య - 9 అవుతుందని ఇంతకు ముందు తెలుసుకున్నాం. ఇపుడు ఈ వ్యక్తికి 2012 జూలై 30 దినం, ఎలా ఉంటుందో ఇపుడు తెలుసుకుందాం.

వ్యక్తిగత మాససంఖ్యకు ఏ దినం చూడాలనుకున్నామో ఆ దినసంఖ్య కలపాలి. అంటే 9+30 = 39 = 3+9 = 12, 1+2 = 3

కాబట్టి 08-07-1957లో పుట్టిన వ్యక్తికి 30-07-2012న వ్యక్తిగత దినసంఖ్య 3 అవుతుంది. ఇపుడు వివిధ వ్యక్తిగత దినసంఖ్యలు ఏవిధంగా ఉంటాయో తెలుసుకుందాం.

## దినసంఖ్య - 1

**ఈ దినం ప్రమోషన్ వస్తుంది. అధికారుల మన్ననలు పొందుతారు.**

దీనిపై సూర్యుని ప్రభావం ఉంటుంది. పై అధికారుల మన్ననలు పొంది పదోన్నతులు పొందుతారు. ఆర్థికంగా బాగుంటుంది. దూర ప్రయాణాలు చేస్తారు. కొత్త ప్రాజెక్టులు ప్రారంభిస్తారు. ముఖ్యమైన ఇంటర్వ్యూలకి వెళ్తారు. కర్మాగార సంబంధిత యంత్ర సామాగ్రిని కోనుగోలు చేస్తారు.

## దినసంఖ్య – 2

**ఈ దినం బ్యాంకు రుణాలు తీసుకోవటానికి అనుకూలం.**

ఈ సంఖ్య చంద్రుని ప్రభావంలో ఉంటుంది. మానసిక సంబంధితంగా ఉంటుంది. తమ ప్రేమ గురించి తాము ప్రేమించే వారికి చెబుతారు. భావోద్వేగంతో ప్రేమను తెలియచేస్తారు. గృహ సంబంధిత వ్యవహారాలు చూస్తారు. బ్యాంకు రుణాలు తీసుకోవటానికి ఈ రోజే అనుకూలంగా ఉంటుంది. ద్రవాలు, తెల్లని వస్తువులకు సంబంధించి ఏదైనా వ్యాపారం ఈ రోజు ప్రారంభించవచ్చు.

## దినసంఖ్య – 3

**ఈ దినం న్యాయవాదితో న్యాయపరమైన విషయం చర్చించవచ్చు.**

ఈ సంఖ్య గురుగ్రహ ప్రభావంలో ఉంటుంది. న్యాయపరమైనర విషయాలు న్యాయవాదితో ఈ దినం చర్చించవచ్చు. కోర్టు వ్యవహారాలలో విజయం లభిస్తుంది. పెట్టుబడులు పెట్టడానికి, ప్రణాళికలు వేయటానికి అనుకూలం. కొత్త విషయాలు తెలుసుకోవడానికి అనుకూలం. వృత్తి ఉద్యోగాలలో ఉన్నతికి ఇతరుల నుండి సహాయం అర్థించటానికి అనుకూలం.

## దినసంఖ్య – 4

**ఈ దినం పిల్లల విద్య గురించి నిర్ణయాలు తీసుకోవాలి.**

ఈ సంఖ్య రాహువు ప్రభావంలో ఉంటుంది. సూర్యుని ప్రభావం కూడా కొంత ఉంటుంది. విద్యాభివృద్ధికి అనుకూలం. పిల్లల విద్యాభివృద్ధి గురించి కూడా తగు నిర్ణయాలు తీసుకొనవచ్చు. కుటుంబ వ్యవహారాలు చక్కదిద్దుకోవటానికి మంచి సమయం. చిరకాలంగా వేధిస్తున్న ఆరోగ్య సమస్యలపై వైద్యుని సలహా తీసుకోవటానికి అనుకూలమైన దినం.

## దినసంఖ్య – 5

**ఈ దినం విందు, వినోదాలతో గడపటానికి అనుకూలం.**

ఈ సంఖ్య బుధుడి ప్రభావంలో ఉంటుంది. ఆనందంగా గడపటానికి అనుకూలమైన దినం. విహారయాత్రలకు మంచిది. విందు, వినోదాలలో పాల్గొంటారు. కుటుంబంతో కలిసి సరదాగా కాలం గడపవచ్చు. స్నేహితులతో సరదాగా కాలక్షేపం చేస్తారు. ఆర్థిక లాభాలు ఉంటాయి.

## దినసంఖ్య – 6

**ఈ దినం ఇంటిని అందంగా అలంకరించుకుంటే మంచిది.**

ఈ సంఖ్య శుక్రుడి ప్రభావంలో ఉంటుంది. ప్రేమ వ్యవహారాలు ఉంటాయి. ప్రేమించిన వ్యక్తితో వివాహం గురించి నిర్ణయం తీసుకుంటారు. సౌందర్య ఉపకరణాలు, దుస్తులు, నగలు విక్రయిస్తారు. ఇంటిని విలాసవంతంగా అలంకరించుకొంటారు. సదస్సులు, సమావేశాలలో పాల్గొనటానికి ఈ రోజు అనుకూలంగా ఉంటుంది.

## దినసంఖ్య – 7

**ఈ దినం రచనలు, ధ్యానం ప్రారంభించటానికి అనుకూలం.**

ఈ సంఖ్య కేతువు ప్రభావంలో ఉంటుంది. చంద్రుడి ప్రభావం కూడా ఉంటుంది. ధ్యానాదులతో మానసిక ప్రశాంతత కలుగుతుంది.

సృజనాత్మక రచనలు ప్రారంభించటానికి, ఆధ్యాత్మిక గురువులను కలిసి స్వాంతన పొందటానికి అనుకూలం. మీ కుటుంబ సభ్యులకు మీరు వారిని ఎంత ప్రేమిస్తున్నారో తెలియజేస్తారు. కుటుంబపరమైన నిర్ణయాలు తీసుకోనవచ్చు. దానధర్మాలు చేయటానికి, అనాథలను ఆదరించటానికి అనువైన దినం. వృథా ప్రసంగాలు చేయకుండా ఉంటే మంచిది.

## దినసంఖ్య - 8

**ఈ దినం దేవాలయాలు, పుణ్యక్షేత్రాలు సందర్శిస్తే మంచిది.**

ఈ సంఖ్య శని ప్రభావంలో ఉంటుంది. ఈ దినం దానధర్మాలు చేయటానికి, అనాథలను ఆదరించటానికి దేవాలయాలకు విరాళాలు ఇవ్వటానికి అనుకూలం. దేవాలయాలు, పుణ్యక్షేత్రాలు సందర్శించి, ఆధ్యాత్మిక శక్తి పెంపొందించుకుంటారు. లాటరీలు, రేసులు, షేర్ మార్కెట్ లో పెట్టుబడి లాభాన్ని తెచ్చిపెడుతుంది. ఇనుము, బొగ్గు, మైనింగ్, యంత్ర సామాగ్రి లాంటి నల్లని వస్తువుల వ్యాపారం ప్రారంభించటానికి అనుకూలమైనది. ఎన్నికలలో పాల్గొంటే విజయం తథ్యం.

## దినసంఖ్య - 9

**ఈ దినం ఎవరినైనా నొప్పిస్తే వారిని క్షమాయాచన చేయటానికి అనుకూలం.**

ఈ సంఖ్య కుజుని ప్రభావంలో ఉంటుంది. అసంపూర్ణ పనులు పూర్తి చేయటానికి అనుకూలమై దినం. ఎవరినైనా నొప్పించి ఉంటే వారిని క్షమా యాచన చేయాలి. మీ కలల సాకారానికి అనువైన ప్రాజెక్టుకు ప్రణాళికలు వేయాలి. ఈ రోజు గోప్యనీయత కలిగి ఉండాలి. గోప్యమైన, రహస్య సమాచారాలు ఈ దినం చూసుకోవచ్చు.

మీ జన్మసంఖ్య, మీ అనుకూల దినసంఖ్య ఒక్కటే అయితే, అది మీ అనుకూల వారం అయితే అదృష్టం మిమ్మల్ని వెదుకుతూ వస్తుంది.

# జన్మ మాసాలు

మనుషుల యొక్క గుణగణాలు, దశ, దిశా నిర్దేశం మొదలైన కీలక అంశాలు, వారు జన్మించిన సమయంపై ఆధారపడి ఉంటాయి. ఈ సమయంలో రకరకాల విభాగాలున్నాయి. తిథి, వారము, నెల, సంవత్సరము మొదలగునవి. ఇపుడు మనం ఏ నెలలో జన్మించిన వారికి ఏయే గుణగణాలు ఉంటాయి అన్న అంశాన్ని తెలుసుకుందాం. జనవరి నెల నుండి డిసెంబరు నెల వరకు జన్మించిన వారి గురించి తెలుసుకుందాం.

## 1. జనవరి

**ఈ నెలలో జన్మించిన వారు తెలివితేటలు, ధృఢ సంకల్పం కలిగి ఉంటారు. వీరికి మొండి పట్టుదల ఎక్కువ. ఎవరినీ నమ్మరు. వాస్తవికంగా ఆలోచిస్తారు. తెలివైన వారిని ఇష్టపడతారు. ప్రభుత్వ ఉద్యోగం చక్కగా చేయగలుగుతారు.**

జనవరి నెలలో జన్మించినవారు మంచి తెలివితేటలు, దృఢ సంకల్పం కలిగి ఉంటారు. వీరు తల్లిదండ్రుల పట్ల విధేయత కలిగి ఉంటారు. మంచి సంప్రదాయక, దైవభక్తి ఉన్న కుటుంబంలో జన్మిస్తారు. అభిరుచి ఉన్న ఏ విషయంలోనైనా మంచి పట్టు కలిగి ఉంటారు. అనకున్నది సాధించినంత వరకు పట్టు వదలరు(మొసలి పట్టు). వీరికి స్నేహితులు ఎక్కువైనా, ఎవర్నీ నమ్మరు.

ఏ విషయాన్నైనా వాస్తవికంగా ఆలోచిస్తారు. తొందర పడరు. నెమ్మదిగా సాగుతూ ముందుకు పోతూ విజయాన్ని సాధిస్తారు. నెగిటివ్ ఆలోచనలు ఉన్నట్లయితే, వీరు నాస్తికులు అయ్యే అవకాశం ఉంది. అపుడు క్రూరత్వం కూడా పెరుగుతుంది. అందువలన పాజిటివ్ ఆలోచనా విదానాన్ని పెంపొందించుకుంటే వీరికి మంచిది.

తెలివైన వారిని ఇష్టపడతారు, వారు తప్పు చేసినా సరే! కానీ వీరికి ధైర్యం తక్కువ. కష్టపడి పనిచేసే స్వభావం కలిగి ఉన్నా అతి జాగ్రత్త వలన అందరూ వీరిని అపార్థం చేసుకుంటారు. అనుమాన పక్షి అంటారు. వీరు సాధారణంగా సాంకేతిక విద్య చదువుకొని ప్రభుత్వ ఉద్యోగిగా ఉంటారు. పురపాలక సంఘాలు, దౌత్య కార్యాలయం, ప్రజా సంబంధాల సంస్థలలో ఎలాంటి పదవినైనా చక్కగా చేయగలుగుతారు.

వీరికి వివాహం ఆలస్యంగా అవుతుంది. అయితే భార్యా పిల్లలను బాగా ప్రేమిస్తారు. పిల్లలను జాగ్రత్తగా చూసుకుంటారు. వారు బాగా చదువుకుని పైకి వస్తారు. వీరు పురుషులైతే, భార్య కూడా ఉద్యోగినిగా ఉంటుంది. వీరి జీవిత భాగస్వామి కంటిసమస్య వలన కళ్ళద్దాలు పెట్టుకుంటారు. మూత్రకోశ వ్యాధులు, జలుబు, దగ్గు మొదలైన వ్యాధులు వీరిని వేధిస్తాయి.

బుధవారం, శుక్రవారం, శనివారం వీరికి అనుకూలం. నలుపురంగు అనుకూలం.

## 2. ఫిబ్రవరి

**ఈ నెలలో జన్మించిన వారు నిర్ధిష్ట అభిప్రాయాలు కలిగి ఉంటారు. తరచుగా ఇల్లు మారే కుటుంబంలో పుడతారు. తొందరగా ఉద్యోగ, వ్యాపారాల్లో స్థిరపడతారు. పనిలో కొత్తదనానికి ప్రయత్నిస్తారు. వీరు జ్యోతిష్యులుగా రాణించగలరు. అహంభావి అయిన జీవిత భాగస్వామి దొరికే అవకాశం ఉంది.**

ఫిబ్రవరి నెలలో జన్మించిన వారు చాలా ప్రత్యేకమైన స్వభావం కలిగి ఉంటారు. వీరు నిర్దిష్ట అభిప్రాయాలు, అసాధరాణ స్ఫురణ (ఇంట్యూషన్) కలిగి ఉంటారు. తరచుగా ఇళ్ళు మారే కుటుంబంలో వీరు జన్మిస్తారు. ఇద్దరు సంతానం ఉండే కుటుంబంలో జన్మిస్తారు. వీరు భయం, సందేహం, సందిగ్ధత లాంటివి వదులుకుంటే చక్కగా రాణించగలుగుతారు. మంచి దైవభక్తి, చక్కటి ఆలోచనాపరుల కుటుంబంలో జన్మిస్తారు.

వీరు తొందరగానే ఉద్యోగ వ్యాపారాల్లో స్థిరపడతారు. వీరు పేరు ప్రఖ్యాతులు, ధనం గురించి పెద్దగా ప్రాకులాడకపోయినా, వీరి చుట్టూ సమాజంలో ఉన్న సమస్యలు పరిష్కరించటానికి ప్రయత్నిస్తుంటారు. చాలా విషయాల్లో పరిజ్ఞానం పెంచుకుంటారు. ఒక విషయంలో అధిక ప్రావీణ్యం కలిగి ఉండి దాని వలన లాభం పొందుతారు. పనిలో నూతనత్వానికి ప్రయత్నిస్తుంటారు. వీరు తమ మనసులో ఉన్న ప్రేమ, వాత్సల్యం బయటకు కనిపించనీయరు – నిండుకుండ తొణకదు అన్నట్టుగా. అందువల్ల వీరు బంధువుల కంటే, స్నేహితులచే ఎక్కువ ప్రేమించబడతారు. కుటుంబ సభ్యులతో కలిసి చక్కగా ఎంజాయ్ చేస్తారు.

మధ్యతరగతి కుటుంబంలో జన్మిస్తారు. వీరికి ఉన్న అసాధారణ స్ఫురణ

(ఇంట్యూషన్) వలన, జ్యోతిష్యులుగా రాణించగలుగుతారు. పోలీసు, పోస్టల్, మిలటరీ, కమీషన్, స్టాక్ ఏక్స్‌ంజి లాంటివి కూడా అనుకూలం. వీరి వివాహం తొందరగానే అవుతుంది. అహంభావి అయిన జీవిత భాగస్వామి దొరికే అవకాశం ఉంది. వీరి సంతానం, తెలివైన వారుగా, బాగా చదువుకొని స్థిరపడే వారుగా ఉంటారు. వీరికి ఇంజనీరింగ్, మనోవికాస శాస్త్రం, సినిమాలు, మొదలైనవి కూడా అనుకూలం. వీరు తలనొప్పి, బి.పి., నరాల సమస్యలు, ఒత్తిడి మొదలైన వాటితో బాధపడతారు.

ఆదివారం, బుధవారం, గురువారం అనుకూలం, బూడిద రంగు అనుకూలమైనది.

## 3. మార్చి

**ఈ నెలలో జన్మించిన వారు సున్నిత మనస్కులు. విధేయత కలిగి ఉంటారు. వీరిని వీరి కంటే గొప్పవారు ఇష్టపడతారు. వీరికి ఏదో తెలియని అలౌకిక శక్తి ఉంటుంది. అన్నింటికీ సర్దుకుపోయే గుణం బలహీనతగా మారకుండా చూసుకోవాలి.**

మార్చి నెలలో జన్మించిన వారు చాలా సున్నిత మనస్కులు. ఎంతో విధేయత కలిగి ఉంటారు. వీరి కుటుంబసభ్యులు మాత్రం మొండివారు, కాని అన్ని సవ్యంగా పద్ధతి ప్రకారం చేసుకునే వారై ఉంటారు. వీరిని, వీరికంటె పై అధికారులు, గొప్పవారు ఇష్టపడతారు. శత్రువులు కూడా వీరిని హాని చేయటానికి సంకోచిస్తారు. వీరిలో ఉన్న ఏదో తెలియని అలౌకిక శక్తి వీరి చుట్టూ ఉన్న వారిని ప్రభావితం చేస్తుంటుంది. వీరి చూపు చాలా శక్తివంతమైనది. అందరితో కలసిపోయి వారి సాధక బాధకాలు అర్థం చేసుకుంటారు. అన్నిటికీ సర్దుకుపోయే గుణం బలహీనతగా మారకుండా జాగ్రత్తపడాలి. చుట్టుప్రక్కల వాతావరణం, వ్యక్తుల ప్రభావానికి లోనయ్యే అవకాశం ఉంది. అందువలన వీరు చెడు సావాసాలకు లోనవ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇతరులకు అకారణంగా హాని చేయటానికి నచ్చరు. వీరిలో అభద్రతా భావం కూడా ఉంటుంది. వీరు ఒక్కొక్కసారి అపాత్రదానం చేస్తుంటారు.

వీరికి తొందరగానే వివాహం అవుతుంది. క్రీడాకారుల కుటుంబంలోని వ్యక్తిని వివాహం చేసుకుంటారు. వీరి జీవితభాగస్వామి పొడుగ్గా లేకపోయినా తెలివితేటలు,

అందం కలిగి ఉంటారు. భూసంబంధిత ఆదాయం కలిగి ఉంటారు. వీరికి మంచి సంతానం కలుగుతుంది. ముసలితనంలో పిల్లల వలన సౌఖ్యం. ప్రజాపనులు, నిర్మాణ రంగం, పాఠశాలల నిర్వహణ, ఆహార పదార్థాల వ్యాపారం, నీరు ద్రావణాల వ్యాపారం, షేర్ మార్కెట్, ముద్రణ, ప్రచురణ, మొదలైనవి వీరికి అనుకూలం. అజీర్ణ సమస్యలు, మానసిక సమస్యలు, ఒత్తిడి, బి.పి., ఆస్తమా, మధుమేహం లాంటివి బాధిస్తాయి.

సోమవారం, గురువారం, శుక్రవారం అనుకూల దినాలు. తెలుపు, బంగారు రంగు, తేనే రంగు అనుకూల రంగులు.

## 4. ఏప్రిల్

**ఈ నెలలో జన్మించిన వారు ధృడకాయం కలిగి పోరాటపటిమ కలిగి ఉంటారు. స్వేచ్ఛాప్రియులు, కష్టపడి విజయం సాధిస్తారు. పొగడ్తలకు లొంగిపోతారు.**

ఏప్రిల్ నెలలో జన్మించిన వారు శారీరకంగా ధృడకాయులు, పోరాట పటిమ కలిగి ఉంటారు. మంచి వాక్పటిమ కూడా వీరి సొంతం. వీరు మంచి పొదుపరులు. దైవభక్తి కలిగి ఉంటారు. స్వేచ్ఛా ప్రియులు. కష్టపడి విజయాలు సొంతం చేసుకుంటారు. కానీ వీరు పొగడ్తలకు లొంగిపోతారు. పొగిడితే ఏ పనైనా, మంచైనా, చెడైనా చేస్తారు. దీని వలన ఒక్కొక్కసారి అపజయం పాలవుతారు.

వీరు విలాస వస్తువులు, బంగారు ఆభరణాల పట్ల ఆసక్తి కలిగి ఉంటారు. కొంచెం నిర్లక్ష్యంగా ఉంటారు. దాని వలన శత్రువుల కుట్రలు తెలుసుకోలేరు. వీరిని మంచి ఆలోచనా పరులు అనేకంటే మంచి కార్యసాధకులు అనవచ్చు వీరి వివాహం మంచి కుటుంబం నుండి వచ్చిన వ్యక్తితో జరుగుతుంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉండే అవకాశం ఉంది. మగవారైతే భార్యావిధేయులుగా ఉంటారు. క్రమశిక్షణ కలిగి ఉంటారు.

వీరు తమ కింద పనిచేసే వారితో పని బాగా చేయించగలుగుతారు. నచ్చిన వారిని గుడ్డిగా నమ్ముతారు. భార్యా, పిల్లల పట్ల ఎంతో ప్రేమ కలిగి ఉంటారు. భార్య ఆరోగ్య సమస్యలు వీరిని బాధిస్తాయి. వీరి పిల్లలలో ఒకరికి వీరి పోలికలు ఎక్కువగా ఉంటాయి. పెద్ద వయస్సులో పిల్లల నుండి ప్రతిఘటన ఎదుర్కొనే పరిస్థితి రావొచ్చు.

వీరికి నాయకత్వ లక్షణాలు ఎక్కువ. అందువలన రాజకీయాలు, పెద్ద వ్యాపారాల్లో రాణించగలుగుతారు. న్యాయవాద వృత్తి, వైద్యం, రచనా వ్యాసంగం, పత్రికా రంగం అనుకూలం. వీరికి సంగీతం, క్రీడలు, సమాజసేవ పట్ల ఆసక్తి ఉంటుంది. రక్తపోటు, గుండెజబ్బులు, పంటినొప్పి, కంటి సమస్యలు మొదలైనవి బాధించవచ్చు. మంచి ఆరోగ్యం కోసం ఆహార నియమాలు పాటిస్తే మంచిది. వీరికి అనుకూల దినాలు, ఆదివారం, మంగళవారం, గురువారం. ఎరుపు, ఆరెంజ్, బంగారు రంగులు అనుకూలం.

## 5. మే

**ఈ నెలలో జన్మించిన వారు ధృఢ నిశ్చయం, దైవభక్తి కలిగి ఉంటారు. ఇంటిని అందంగా అలంకరిస్తారు. ఉన్నత పదవులు పొందుతారు.**

మే నెలలో జన్మించిన వారు సాధారణంగా స్థిర నిశ్చయం కలిగి ఉంటారు. వీరి తల్లిదండ్రులు మంచి దైవభక్తి కలిగి ఉంటారు. స్థిరమైన ఉద్యోగం చేస్తూ ధనం సంపాదిస్తూ అభివృద్ధి సాధిస్తారు. వీరు చాలా నమ్మకస్థులు. ప్రేమ, వాత్సల్యం, ఓర్పు వీరి లక్షణాలు. పరిశుభ్రత కలిగి ఉంటారు. స్నేహితులను కష్ట కాలంలో ఆదుకుంటారు. కళలు, సంగీతం, కవిత్వం పట్ల ఆసక్తి కలిగి ఉంటారు.

చాలా సంతృప్తికరమైన జీవితం గడుపుతారు. వీరి వివాహం, పురుషుడైతే, ముగ్గురు అమ్మాయిలున్న కుటుంబం నుండి వచ్చిన అమ్మాయిని చేసుకుంటారు. వీరి జీవిత భాగస్వామి, అందంగా మంచి శరీర సౌష్టవం కలిగి ఉంటారు. వీరు అతిధి సత్కారాలు బాగా చేస్తారు. ఇంటిని అందంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతారు. మంచి వస్త్రధారణ చేస్తారు. మాయమాటలు నమ్మరు. పొగడ్తలకు లొంగరు. ధనం ఎక్కువ ఖర్చు చేస్తుంటారు.

వీరికి ఫొటోగ్రఫీ ఇష్టం, బ్యాంకింగ్, ఆర్థిక సంస్థలు, బోధన, న్యాయవాద వృత్తి, నటనారంగం, వీరికి అనుకూలం. వ్యవసాయం, నీటిపారుదల మొదలగు వాటిలో చేరితే ఉన్నత పదవులు పొందగలుగుతారు. వీరికి సంతానం ఇద్దరు ఉంటారు. వీరు మంచి ఆరోగ్యవంతులుగా ఉంటారు. విశ్రాంతి తీసుకోకుండా నిరంతరం శ్రమించటం లాంటివి అదుపులో ఉంచుకుంటే ఆరోగ్యం బాగుంటుంది. జలుబు, ఆస్మా, మూత్రకోశవ్యాధులు, కిడ్నీ వ్యాధులు వీరిని బాధించవచ్చు. వీరు ధనం బాగా ఖర్చు చేస్తారు. ధనం, ఆహారం విషయంలో జాగ్రత్త పడితే, ఇంటికి, ఒంటికీ మంచిది.

వీరికి బుధవారం, శుక్రవారం, శనివారం అనుకూల దినాలు. తెలుపు, నీలం రంగులు మంచివి. ముత్యం అనుకూలం రత్నం.

## 6. జూన్

**ఈ నెలలో జన్మించిన వారు సంపన్నుల కుటుంబంలో జన్మిస్తారు. సర్దుకుపోయే గుణం కలిగి ఉంటారు. వ్యతిరేక భావాలున్న వారిని సులభంగా కలసగలరు. నీతి నిజాయితీ, పరోపకార బుద్ధి కలిగి ఉంటారు.**

జూన్ నెలలో జన్మించిన వారు సంపన్నుల కుటుంబంలో జన్మిస్తారు. వీరు ఎదుటివారి మనోభావాలు, మనస్తత్వాలు తెలుసుకొని సులభంగా వారితో కలిసిపోగలుగుతారు. ఎలాంటి పరిస్థితులకైనా సర్దుకుపోయే గుణం కలిగి ఉంటారు. వీరు చెడు సావాసాలకు దూరంగా ఉంటే మంచిది. విరుద్ధ భావాలున్న వ్యక్తులను సులభంగా కలపగలరు. ఒకే భావాలు ఉన్న వ్యక్తులను విడదీయగలరు. అందువలన వీరు సకారాత్మక దృష్టిని, పాజిటివ్ ఆలోచనలను, పెంపొందించుకుంటే మంచి మధ్యవర్తులుగా, సంప్రదింపులు జరిపే వారుగా రాణిస్తారు. వీరు నీతి, నిజాయితీ కలిగి ఉంటారు.

పరోపకార బుద్ధి కలిగి ఉంటారు. సేవాసంస్థలకు ఆర్థికసాయం చేస్తుంటారు. వృద్ధాప్యంలో భార్యా, పిల్లల నుండి వ్యతిరేకత ఎదుర్కొనే పరిస్థితి రావొచ్చు. వీరికి శృంగారం పట్ల పెద్దగా ఆసక్తి ఉండదు. వైవాహిక జీవితం గోప్యంగా ఉంచుతారు. వీరికి చాలా అందమైన జీవిత భాగస్వామి లభిస్తారు. వీరికి స్త్రీ సంతానం అధికంగా ఉంటుంది. మొదటి సంతానం తర్వాత అదృష్టం కలసి వస్తుంది. వీరి సంసార జీవితం సుఖంగానే సాగిపోతుంది.

వీరికి సాహిత్యం, తత్వశాస్త్రం, పరిశోధనల పట్ల ఆసక్తి ఉంటుంది. రచనావ్యాసంగం, జర్నలిజం, ముద్రణా రంగం, టి.వీ, రేడియో రంగాలు అనుకూలం. అలాగే వీరు, డాక్టర్లు, యాక్టర్లు, గాయకులు గా కూడా రాణిస్తారు.

వీరు చీటికి మాటికీ అనారోగ్యానికి గురవుతుంటారు. వెన్ను నొప్పి, కీళ్ళనొప్పులు, నరాల బలహీనత, నిద్రలేమి, గ్యాస్ట్రబుల్, లాంటివి బాధిస్తాయి. ఆహార నియమాలు

పాటిస్తే మంచిది. వీరికి బుధవారం, శుక్రవారం అనుకూల దినాలు. ఆకుపచ్చ రంగు అనుకూలమైనది. “పచ్చ” అనుకూల రత్నం.

## 7. జూలై

**ఈ నెలలో జన్మించిన వారు ద్వంద్వ ప్రవృత్తి కలిగి ఉంటారు. వీరికి ఆధ్యాత్మిక శక్తి ఉంటుంది. జరగబోయేవి ముందుగానే తెలుసుకోగలరు.**

జూలై నెలలో జన్మించిన వారు ద్వంద్వ ప్రవృత్తి కలిగి ఉంటారు. ఆశ, నిరాశల మధ్య వీరి మనసు ఊగిసలాడుతుంటుంది. వీరు పాజిటివ్ ఆలోచనలను అలవాటు చేసుకున్నట్లయితే తిరుగుండదు. వీరికి గొప్ప మానసిక, ఆధ్యాత్మిక శక్తి ఉంటుంది. అసాధారణ స్ఫురణ (ఇంట్యూషన్) కలిగి ఉంటారు.

బాల్యంలో కష్టాలు ఎదుర్కొంటారు. వీరికున్న ఇంట్యూషన్ వలన జరగబోయేవన్నీ ముందుగానే గ్రహించగలుగుతారు. ప్రేమ, వాత్సల్యం కలిగి ఉంటారు. ప్రకృతి దృశ్యాలు చూసినపుడు మానసిక ప్రశాంతత పొందుతారు. సాంకేతిక విద్యను అభ్యసిస్తారు. చాలా కష్టించి, పేరు, ధనం సంపాదిస్తారు. విదేశాలలో స్థిరపడే అవకాశాలు కూడా ఉన్నాయి.

వీరు, తమకు బాగా తెలిసిన వ్యక్తిని వివాహం చేసుకుంటారు. వివాహం తొందరగానే అవుతుంది. వీరికి తెలివైన జీవిత భాగస్వామి దొరికితే ఎంతో అభివృద్ధి సాధిస్తారు. కొందరికి బద్ధకస్తులైన భాగస్వామి దొరికే అవకాశం ఉంది. వీరి కుటుంబ జీవితం సాఫీగా ఉంటుంది. పిల్లలు బాగా స్థిరపడతారు.

వీరు, ఆహారపదార్థాలు, నీటి సరఫరా, స్టాక్ ఎక్స్చేంజ్, వార్తా పత్రికలు, బ్యాంకింగ్, ఎగుమతి, దిగుమతి వ్యాపారం లాంటివి వీరికి అనుకూలం. శ్వాసకోశ వ్యాధులు, జలుబు, దగ్గు, ఊబకాయం వంటి సమస్యలు వస్తాయి. ఆహారనియమాలు పాటిస్తే ఊబకాయం రాదు. వీరికి తెలుపు, బూడిదరంగులు అనుకూలం. ముత్యం అనుకూల రత్నం.

## 8. ఆగస్టు

**ఈ నెలలో జన్మించిన వారు గంభీరంగా, నాయకత్వ లక్షణాలు కలిగి ఉంటారు. అందంగా ఉంటారు. వీరికి ఆత్మవిశ్వాసం ఎక్కువ. కష్టపడి ధనం సంపాదిస్తారు. ధనం కంటే పేరు ప్రతిష్టలు కోరుకుంటారు.**

ఆగస్టు నెలలో జన్మించిన వారు గంభీరంగా ఉండి నాయకత్వ లక్షణాలు కలిగి ఉంటారు. మంచి శరీర సౌష్టవం కలిగి ఆకర్షణీయంగా ఉంటారు. మంచి కంఠస్వరం కలిగి చతురతతో మాట్లాడతారు. వీరికి ఆత్మవిశ్వాసం ఎక్కువ. జాలి, కరుణ కలిగి ఉంటారు. ఎదుటివారి దీనవదనం చూసి కరిగిపోతారు. పొగడ్తలకు లొంగిపోతారు. కష్టపడి ధనం బాగా సంపాదిస్తారు. దానధర్మాలు చేస్తారు.

ఎపుడూ వీరిదే పైచేయిగా ఉండాలని కోరుకుంటారు. రాజకీయ, మత, సామాజిక వర్గ నాయకులుగా ఎదుగుతారు. ఒక్కొక్కసారి వీరి ఆత్మవిశ్వాసం అహంకారంగా మారే అవకాశం ఉంది. నిజాలు దాచటం, నమ్మకద్రోహం లాంటివి సహించరు. ధనం కంటే, పేరు ప్రఖ్యాతులు ఎక్కువగా కోరుకుంటారు. మనసును, భావాలను అదుపులో ఉంచుకొని లౌక్యంగా ప్రవర్తిస్తే వీరికి ఎదురుండదు.

వీరి వివాహం పద్ధతైన వ్యక్తితో జరుగుతుంది. మామగారు భార్యా విధేయుడుగా ఉంటారు. వీరి జీవిత భాగస్వామిని వారి సొంత బంధువులు ఇష్టపడరు. వీరు తమ జీవితభాగస్వామిని, పిల్లలను ఎంతగానో ప్రేమిస్తారు.

వైద్యవృత్తి, వైద్యపరికరాలు, రసాయనాల అమ్మకం, ఉపాధ్యాయ వృత్తి, పరిశ్రమలు, వ్యాపారం మొదలైనవి వీరికి అనుకూలం. ఉద్యోగం కంటే వ్యాపారం లాభదాయకం. పిల్లల అనారోగ్యం వీరిని బాధిస్తుంది. వీరిని తలనొప్పి, జ్వరం, బి.పీ, కంటి సమస్యలు, గ్యాస్ ట్రబుల్, ఉదరకోశ వ్యాధులు పీడిస్తాయి. వ్యాయామం, ఆహార నియమాలు పాటిస్తే మంచిది.

వీరికి ఆదివారం, మంగళవారం, గురువారం అనుకూలం, తెలుపు, తేనె రంగు, బంగారు రంగులు మంచివి.

## 9. సెప్టెంబర్

**ఈ నెలలో జన్మించిన వారు అమ్మాయిల వలె సున్నిత మనస్కులు. ప్రోత్సాహం ఉంటే చక్కగా రాణిస్తారు. పని ప్రారంభించే ముందు భయపడతారు. సరైన సమయంలోనే వివాహం జరుగుతుంది. వీరి పిల్లలు బాగా అభివృద్ధిలోకి వస్తారు.**

సెప్టెంబర్ నెలలో జన్మించిన వారు అమ్మాయిల వలె సున్నితమైన మనసు కలిగి ఉంటారు. తెలివితేటలు, వాత్సల్యం, సౌమ్య స్వభావం కలిగి ఉంటారు. సందేహాస్పదంగా ఉంటారు. వీరికి సరియైన ప్రోత్సాహం, వెన్నుదన్నులు లభించినట్లయితే చక్కగా రాణిస్తారు. చుట్టూ వాతావరణం అనుకూలంగా ఉన్నట్లయితే వీరు తమ రంగంలో అభివృద్ధి సాధిస్తారు. సేవాగుణం కలిగి ఉంటారు. పనులు ప్రారంభించేముందు, విఘ్నాలు, కష్టాలు తలచుకొని ముందుగానే భయపడుతుంటారు.

ఈ బలహీనలను అధిగమిస్తే మంచి గుర్తింపు పొందుతారు. వీరు ఆత్మవిశ్వాసం పెంపొందించుకొనవలసి ఉంది. అధిక శారీరక శ్రమ కలిగించే పనులు చేయలేరు. తమ కష్టాలను ఇతరులకు పదే పదే చెప్తుంటారు. వీరు అప్పులు చేయకుండా జాగ్రత్త పడాలి. వీరు, వీరి కుటుంబ సభ్యులు బాగా చదువుకున్న వారై ఉంటారు. ఒక్కొక్కసారి ఎంత కష్టపడి పనిచేసినా గుర్తింపు లభించదు. వీరికి సరైన సమయంలోనే వివాహం అవుతుంది. వీరి జీవిత భాగస్వామి డామినేటింగ్‌గా ఉంటారు. వారికి శీఘ్రకోపం ఉంటుంది. వైవాహిక జీవితంలో ఒడిదుడుకులు ఉండవచ్చు. ఇంటిని, పరిశుభ్రంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతారు. వీరికి స్త్రీ సంతానం ఎక్కువ. పిల్లలు బాగా చదువుకొని అభివృద్ధిలోకి వస్తారు.

భాషలు, తత్వశాస్త్రం, కళలు, రచనా వ్యాసంగం, శిల్పకళ, మొదలగునవి వీరికి అనుకూలం. షేర్ మార్కెట్, నిర్మాణ రంగం కూడా అనుకూలం. వీరికి జీర్ణసమస్యలు, కాలేయం, గుండె సమస్యలు రావొచ్చు. వ్యాయామం, ఆహార నియమాలు పాటించాలి.

బుధవారం, గురువారం, అనుకూలమైనవి. ఆకుపచ్చ అనుకూల రంగు.

## 10. అక్టోబర్

**ఈ నెలలో జన్మించిన వారు సమానత్వం, న్యాయం, ధర్మం అనే గుణాలు కలిగి ఉంటారు. సంప్రదాయ, దైవభక్తి గల కుటుంబంలో జన్మిస్తారు. వీరికి కోపం తొందరగా రాదు. పరిశుభ్రత ఎక్కువ. వీరు కొంచెం పిరికివారు.**

అక్టోబర్ నెలలో జన్మించిన వారు సమానత్వం, న్యాయం, ధర్మం, సమభావం అనే గుణాలు కలిగి ఉంటారు. ఇతరులకి వీరికి ఏమి ఇవ్వాలో, వారి దగ్గర నుండి ఏమి తీసుకోవాలో వీరికి బాగా తెలుసు. వీరు మంచి సంప్రదాయ, దైవభక్తి గల కుటుంబంలో జన్మిస్తారు. జీవితంలో మంచి ఉన్నత స్థితిని పొందుతారు. విచక్షణ అనేది వీరికి దేవుడిచ్చిన వరం. కాలం, ధనం, అవకాశం, వీటిని వీరు సద్వినియోగం చేసుకుంటారు. దేనినీ చిన్న చూపు చూడరు, చివరకు ఒక గుండుసూదిని కూడా!

సాధారణంగా వీరికి కోపం రాదు. కానీ అన్యాయాన్ని, మోసాన్ని చూసినపుడు మాత్రం కోపం వస్తుంది. పరిశుభ్రత ఎక్కువ. ఇంటి ఆవరణను, ఇంటిని పరిశుభ్రంగా, ఆకర్షణీయంగా ఉంచుకుంటారు. వీరు సాంకేతిక విద్యాభ్యాసం చేసి ప్రభుత్వరంగంలో ఉద్యోగం చేస్తారు. కవిత్వం, పెయింటింగ్, నిర్మాణ రంగం, ప్లానింగ్ వీరికి ఇష్టమైనవి. వీరికి నగర జీవితం కంటే గ్రామీణ జీవనం పై మక్కువ ఎక్కువ. సంగీతం, కవిత్వం, నాట్యం, మొదలైన రంగాలలో పేరు పొందుతారు. అయితే వీరికి కొంచెం పిరికి తనం ఎక్కువ. ఆత్మవిశ్వాసాన్ని పెంచుకొని పిరికితనాన్ని పోగొట్టుకుంటే బాగా రాణిస్తారు.

న్యాయశాస్త్రం, వైద్యం, బోధన, వృత్తులు వీరికి అనుకూలం. న్యాయవాదులుగా, న్యాయమూర్తులుగా పేరుగాంచుతారు. లలితకళలలో కూడా రాణిస్తారు. వీరికి దైవభక్తి గల జీవిత భాగస్వామి లభిస్తారు. పురుషులకి, ఉద్యోగినులు అయిన స్త్రీలు భార్యగా లభిస్తారు. జీవిత భాగస్వామి డామినేటింగ్‌గా ఉంటారు. వీరి వివాహం తొందరగానే అవుతుంది. వృత్తి వ్యాపారాల్లో బిజీగా ఉండటం వలన కుటుంబ జీవితంలో పూర్తి ఆనందం పొందలేరు. పిల్లలు తొందరగానే కలుగుతారు. పిల్లల అనారోగ్యం కొంత బాధిస్తుంది. వీరికి అజీర్ణం, కడుపునొప్పి, విరేచనాలు, నరాల వ్యాధులు వంటివి పీడిస్తాయి.

బుధవారం, శుక్రవారం, శనివారం వీరికి అనుకూల దినాలు. తెలుపు, నీలం రంగులు అనుకూలమైనవి.

## 11. నవంబర్

**ఈ నెలలో జన్మించిన వారు అందంగా ఉండి ఇతరులను ఆకర్షిస్తారు. మధ్యతరగతి కుటుంబంలో జన్మిస్తారు. అన్ని విషయాలు రహస్యంగా ఉంచుతారు. వీరు సర్జన్లుగా, ఇన్వెంటర్లుగా, పరిశోధనా నిపుణులుగా రాణిస్తారు. పిల్లలు ఆలస్యంగా పుడతారు.**

ఈ నెలలో జన్మించిన వారు, అందంగా ఉండి ఇతరులను తొందరగా ఆకర్షిస్తారు. మధ్య తరగతి కుటుంబంలో జన్మిస్తారు. వీరిలో ఉన్న నెగిటివ్ లక్షణాలు, క్రూరత్వం, చెడు తలంపులు లాంటివి వదులుకుంటే మంచి కీర్తి ప్రతిష్టలు సంపాదిస్తారు. వీరు మంచి వాక్పటిమ, రచనా శక్తి కలిగి ఉంటారు. స్వార్థం, మోసం లాంటి గుణాలు అదుపు చేయకపోతే న్యాయపరమైన సమస్యలు కలుగుతాయి. పరిసర ప్రభావాలకు లోనవుతారు కాబట్టి, చెడు సావాసాలకు దూరంగా ఉంటే మంచిది.

వీరి ఎదుట మంచి, చెడు మార్గాలు రెండూ కనబడుతుంటాయి. విజ్ఞతతో మంచి మార్గం ఎన్నుకుంటే విజయం సాధిస్తారు. వీరు అన్ని విషయాలు గోప్యంగా ఉంచుతారు. చిన్నతనంలో వీరి చెడు మార్గాల వైపు వెళ్లకుండా అదుపు చేయగలిగితే వీరు మంచి సర్జన్లు, ఆవిష్కరణ కర్తలు, పరిశోధనా నిపుణులుగా రాణిస్తారు. మందులు, రసాయనాలు, వ్యాపారాలు అనుకూలం. వృత్తి ఉద్యోగాలలో ప్రయాణాలు చేయాల్సి వస్తుంది. పోలీసు, పోస్టల్, మిలిటరీ, కమీషన్ ఏజెన్సీ, లాంటివి కూడా వీరికి అనుకూలం.
చేతిలో డబ్బు లేకపోయినా వీరికి పరపతి బాగానే ఉంటుంది. అందమైన, పొడుగైన, లోతైన చూపులు గల జీవిత భాగస్వామి లభిస్తారు. వీరి భాగస్వాములు అందంగా, కష్టపడి పనిచేస్తూ, గలగలా మాట్లాడే వారుగా ఉంటారు. వీరికి శృంగారం పట్ల ఆసక్తి ఉంటుంది. సంతానం ఆలస్యంగా కలుగుతుంది. పుట్టిన సంతానం బాగా రాణిస్తారు. వీరికి బాల్యంలో అనారోగ్యం కలుగవచ్చు. ఉదర కోశ వ్యాధులు, పైల్స్, శ్వాస కోశ వ్యాధులు లాంటివి బాధిస్తాయి.

వీరికి మంగళవారం, గురువారం, ఆదివారం అనుకూలం. నలుపు రంగు అనుకూలం. కెంపు, మూన్ స్టోన్ అనుకూలమైనవి.

## 12. డిసెంబర్

**ఈ నెలలో జన్మించిన వారు టెన్షన్ కలిగి ఉంటారు. వీరికి గురి ఎక్కువ. వీరికి భూ సంబంధిత ఆస్తులు ఉంటాయి. స్నేహితులంటే ఇష్టం. అన్యాయం సహించరు. అభివృద్ధి చెందినా తృప్తి చెందరు. వీరికి స్నేహితులు శాశ్వతంగా ఉండరు. వీరి జీవిత భాగస్వామి పొట్టిగా, ఆకర్షణీయంగా ఉంటారు.**

డిసెంబర్ నెలలో జన్మించినవారు 'టెన్షన్' ఎక్కువ కలిగి ఉంటారు. వీరికి గురి ఎక్కువ. పైకి చూడటానికి సామాన్యంగా ఉన్నా వీరి మనసు మాత్రం, విడిచి పెట్టిన బాణంలా ఉంటుంది. వీరు ఏ కుటుంబంలో జన్మిస్తారో, ఆ కుటుంబ సభ్యులు చాలా మొండి వారుగా ఉంటారు. కలహ ప్రియులుగా ఉంటారు. వీరు తమ శక్తియుక్తులు ఇతరుల కోసం వినియోగిస్తూ, వీరు కూడా సమాజంలో ఉన్నత స్థానాన్ని చేరుకుంటారు. వీరికి భూ సంబంధిత ఆస్తులు ఉంటాయి. వీరికి స్నేహితులంటే అభిమానం. అన్యాయాన్ని సహించలేరు.

ఎంత అభివృద్ధి చెందినా తృప్తి చెందరు. హంగు, ఆర్భాటం, పేరు ప్రఖ్యాతుల కోసం ప్రయత్నిస్తుంటారు. ఎంత కష్టమైన పనైనా వీరికి నచ్చితే ప్రారంభిస్తారు. తృప్తి లేకపోతే మధ్యలోనే వదిలేస్తారు. అందుకే వీరికి శాశ్వత స్నేహితులు ఉండరు. వీరి మాటలో స్పష్టత ఉంటుంది. కరకుదనాన్ని విడిచిపెడితే మంచిది. వీరు చిన్న వయసులోనే ఉద్యోగం, వృత్తి, వ్యాపారం లాంటి వాటిలో చేరతారు. బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, ఎగుమతి, దిగుమతి వ్యాపారం, న్యాయవాద వృత్తి బోధన, నటన మొదలగునవి వీరికి అనుకూలం.

వీరికి వివాహం తొందరగా అవుతుంది. క్రీడాకారుల కుటుంబం నుంచి జీవిత భాగస్వామిని పొందుతారు. వీరి జీవిత భాగస్వామి పొట్టిగా, ముచ్చటగా ఉంటారు. వీరికి ఇద్దరు పిల్లల సంతానం ఉంటుంది. పుత్ర సంతానం ఉంటుంది. వీరి జీవిత భాగస్వామి ముక్కు, ఉదర సంబంధిత వ్యాధులకు లోనవుతారు. టెన్షన్ ఎక్కువ. దానివలన నరాల వ్యాధులు వస్తాయి. జలుబు, శ్వాసకోశ వ్యాధులు, కాలేయ వ్యాధుల ప్రమాదం ఉంది. ఆహార నియమాలు పాటిస్తూ వ్యాయామం చేస్తే మంచిది.

ఆది, మంగళ, గురువారాలు వీరికి అనుకూలం. ఆరెంజ్, తేనె, బంగారు రంగులు అనుకూలం.

# జన్మ రాశులు

వెస్ట్రన్ ఆస్ట్రాలజీకి అనగా సూర్య గమనానికి, న్యూమరాలజీకి చాలా దగ్గర సంబంధం ఉన్నది. ఏ వ్యక్తి అయినా అతను పుట్టిన తేది, డెస్టినీ నెంబరుతో పాటు, ఆ వ్యక్తి పుట్టినపుడు చంద్రస్థితితో పాటు, సూర్యుడు ఏ రాశిలో సంచరిస్తున్నాడో ఆ రాశి యొక్క ఫలితాలను కూడా పొందుతాడు.

| మీరు పుట్టిన నెల పిరియడ్ | మీ సూర్య రాశి | రాశి అధిపతి | అదృష్ట సంఖ్యలు |
|---|---|---|---|
| మార్చి 21 నుండి ఏప్రిల్ 20 వరకు | మేషం | కుజుడు | 9 |
| ఏప్రిల్ 21 నుండి మే 20 వరకు | వృషభం | శుక్రుడు | 6 |
| మే 21 నుండి జూన్ 21 వరకు | మిథునం | బుధుడు | 5 |
| జూన్ 22 నుండి జూలై 22 వరకు | కర్కాటకం | చంద్రుడు | 2, 7 |
| జూలై 23 నుండి ఆగస్టు 22 వరకు | సింహం | సూర్యుడు | 1, 4 |
| ఆగస్టు 23 నుండి సెప్టెంబర్ 22 వరకు | కన్య | బుధుడు | 5 |
| సెప్టెంబర్ 23 నుండి అక్టోబర్ 22 వరకు | తుల | శుక్రుడు | 6 |
| అక్టోబర్ 23 నుండి నవంబర్ 21 వరకు | వృశ్చికం | కుజుడు | 9 |
| నవంబర్ 22 నుండి డిసెంబర్ 21 వరకు | ధనస్సు | గురువు | 3 |
| డిసెంబర్ 22 నుండి జనవరి 20 వరకు | మకరం | శని | 8 |
| జనవరి 21 నుండి ఫిబ్రవరి 19 వరకు | కుంభం | శని | 8 |
| ఫిబ్రవరి 20 నుండి మార్చి 20 | మీనం | గురువు | 3 |

దీనిని వెస్ట్రన్ పద్ధతిగా పాటిస్తున్నారు. వ్యక్తి పుట్టిన తేది ఏ పీరియడ్‌లోకి వస్తుందో ఆ పీరియడ్ యొక్క గుణగణాలు కూడా తీసుకోవలసి వస్తుంది.

మనుషుల గుణగణాలు, దశ, దిశా నిర్దేశం, మొదలైన అంశాలు, వారు జన్మించిన కాలం, (మాసం)పై ఎంతో ఆధారపడి ఉన్నాయి. ఇపుడు మనం మేషరాశి నుండి మీనరాశి వరకు జన్మించిన వ్యక్తుల యొక్క గుణగణాలు సూర్యమానం ప్రకారం (పాశ్చాత్య పద్ధతి) తెలుసుకుందాం.

# 1. మేష రాశి

**మేషరాశి వారు ధృడకాయులు, పోరాట పటిమ కలవారుగా ఉంటారు. స్వేచ్ఛాప్రియులు. పెద్ద వ్యాపారం చేయగలుగుతారు. పొగడ్తలకు లొంగిపోతారు. శత్రువుల కుట్రలు తెలుసుకోలేరు. పిల్లల్లో ఒకరికి వీరి పోలికలు ఉంటాయి.**

మార్చి 21 నుండి ఏప్రిల్ 20 మధ్యలో పుట్టిన వారు మేషరాశిలోనికి వస్తారు. మేషం అంటే పొట్టేలు, కాబట్టి వీరు శారీరకంగా ధృడకాయులు. పొట్టేలు వలె పోరాటపటిమ కలిగి ఉంటారు. మంచి వాక్పటిమ కలిగి పెద్ద వ్యాపారాలు చేయగల దక్షత వీరికి ఉంటుంది. వీరు స్వేచ్ఛాప్రియులు. కష్టపడి విజయాలు సొంతం చేసుకుంటారు. కానీ పొగడ్తలకు లొంగిపోతారు. పొగిడితే ఏ పనైనా, మంచైనా, చెడైనా చేస్తారు. దీని వలన ఒక్కొక్క సారి అపజయం పొందుతారు.

సమర్థత, ధృడ సంకల్పం కలిగి కొత్త కొత్త ప్రణాళికలు వేసుకుంటారు. కొంచెం నిర్లక్ష్యంగా ఉంటారు. దాని వలన శత్రువుల కుట్రలు తెలుసుకోలేరు. మంచి ఉత్సాహం కలిగి ఉంటారు. వీరు మంచి ఆలోచనా పరులు అనేకంటే, మంచి కార్యసాధకులు అని అనవచ్చు. అనుకున్నది వెంటనే అయిపోవాలి అనుకుంటారు. మంచి క్రమశిక్షణ కలిగి ఉంటారు. వీరు తమ క్రింద పనిచేసే వారితో పని బాగా చేయించగలుగుతారు. దయాహృదయం కలిగి ఉంటారు. నచ్చిన వారిని గుడ్డిగా నమ్ముతారు.

**కుటుంబం**

వీరికి సరియైన సమయంలో వివాహం అవుతుంది. జీవిత భాగస్వామిని ఎన్నుకొన్నపుడు పొరపాటు చేసే అవకాశం ఉంది. వీరు భార్యా, పిల్లల పట్ల ఎంతో ప్రేమ కలిగి ఉంటారు. కానీ, వీరి క్రమశిక్షణకి వారు భయపడుతుంటారు. భార్య ఆరోగ్య సమస్యలు వీరిని బాధిస్తాయి. వీరి పిల్లలలో ఒకరికి వీరి పోలికలు ఎక్కువగా ఉంటాయి. పెద్ద వయసులో పిల్లల నుండి ప్రతిఘటన ఎదుర్కోవలసిన పరిస్థితి రావొచ్చు.

వీరికి నాయకత్వ లక్షణాలు మెండు. అందువలన రాజకీయాలు, పరిశ్రమలు, పెద్దవ్యాపారులు, మొదలగు వాటిలో రాణించి ఉన్నత స్థానానికి చేరుకుంటారు. సంగీతం, క్రీడలు, సమాజసేవ పట్ల ఆసక్తి కలిగి ఉంటారు. వైద్యం, మెకానికల్ ఇంజనీరింగ్‌లలో కూడా రాణిస్తారు.

### ఆరోగ్యం

రక్తపోటు, గుండె జబ్బులు, తలకు గాయాలు, పంటి నొప్పి, కంటి సమస్యలు మొదలైనవి బాధించవచ్చు. మంచి ఆరోగ్యం కోసం ఆహార నియమాలు పాటించాలి.

| | | |
|---|---|---|
| అనుకూల తేదీలు | : | 1, 3, 9, 10, 12, 18, 19, 21, 27, 28 |
| ప్రతికూల తేదీలు | : | 5, 7, 8, 14, 16, 17, 23, 25, 26 |
| అనుకూల వారాలు | : | ఆదివారం, మంగళవారం, గురువారం |
| అనుకూల రంగు | : | ఎరుపు, ఆరెంజ్, బంగారు రంగు |

## 2. వృషభ రాశి

**వృషభరాశి వారు శక్తికి, పునరుత్పత్తికి గుర్తు. ప్రేమ, వాత్సల్యం, స్థిరత్వం వీరి లక్షణాలు. స్నేహితులను కష్టకాలంలో ఆదుకుంటారు. అతిథి సత్కారాలు బాగా చేస్తారు. మాయమాటలు నమ్మరు. కష్టపడి ధన సంపాదన చేస్తారు.**

ఏప్రిల్ 21 నుండి మే 20 తేదీలోపు జన్మించిన వారు వృషభ రాశిలోకి వస్తారు. వృషభం అనగా ఎద్దు. వృషభం శక్తికి, పునరుత్పత్తికి సంకేతం. అలాగే సహనానికి కూడా వృషభం పెట్టినపేరు. స్థిరత్వం, ప్రేమ, వాత్సల్యం, ఓర్పు వీరి లక్షణాలు. చాలా నమ్మకస్తులు. ఆపన్నులను, స్నేహితులను కష్టకాలంలో ఆదుకుంటారు. స్థిర నిశ్చయం కలిగి ఉంటారు. పరిశుభ్రత ఎక్కువ. కళలు, సంగీతం, కవిత్వం పట్ల ఆసక్తి ఉంటుంది.

జీవితాన్ని ఆస్వాదిస్తూ అలాగే ఇతరులను కూడా సంతోష పెడుతుంటారు. అతిథి సత్కారాలు బాగా చేస్తారు. ఇంటిని, ఎంతో అందంగా తీర్చిదిద్దుతారు. ఆకర్షణీయమైన వస్త్రధారణ చేస్తారు. మాయమాటలు నమ్మరు. పొగడ్తలకు లొంగరు. క్రమశిక్షణ కలిగి ఉంటారు. ధనం ఎక్కువ ఖర్చు చేస్తుంటారు. ఓపిగ్గా, కష్టపడి పనిచేసి ధన సంపాదన చేస్తారు–ఖర్చు చేస్తారు. వీరు అందంగా ఉంటారు. వీరు తమ మనసుని, బుద్ధిని అదుపులో ఉంచుకోగలిగితే మంచి కళాకారులవుతారు. ఆధ్యాత్మికత, మనోవికాసం కలిగి ఉంటారు.

### కుటుంబం

వీరు ఆలస్యంగా వివాహం చేసుకుంటే మంచిది. వీరి తొలిప్రేమ ఫలించదు.

30 ఏళ్ళ తర్వాత పెళ్ళి చేసుకొంటే మంచిది. జీవిత భాగస్వామి అనారోగ్యం వీరిని బాధిస్తుంది. ప్రథమ సంతానం తరువాత భార్యకు, ద్వితీయ సంతానం తరువాత భర్తకు అనారోగ్యం.

వీరు అభివృద్ధి చెందుతున్న కాలంలో వీరి జీవితంలో చెప్పలేనంత మార్పు వస్తుంది. అందరి మన్ననలు పొందుతారు. సంగీత, సాంస్కృతిక కార్యక్రమాల్లో విరివిగా పాలుపంచుకుంటారు. పెయింటింగ్, ఫొటోగ్రఫీ అంటే వీరికి ఇష్టం. మంచి వక్తలుగా రాణిస్తారు. వీరు అధ్యాపకులు, న్యాయవాదులు, నటులుగా రాణిస్తారు. వ్యవసాయం, నీటిపారుదల, ప్రజాపనులు మొదలగు వాటిలో చేరితే ఉన్నత పదవులు లభిస్తాయి.

**ఆరోగ్యం**

వీరు మంచి ఆరోగ్యవంతులుగానే ఉంటారు. విశ్రాంతి తీసుకోకుండా నిరంతరం శ్రమించటం లాంటివి అదుపు చేసుకుంటే ఆరోగ్యం బాగుంటుంది. జలుబు, అస్తమా, మూత్రకోశ వ్యాధులు, కిడ్నీ వ్యాధులు బాధించవచ్చు. వీరికి ధనానికి ఎటువంటి కొరత ఉండదు. కానీ అదే విధంగా ఖర్చు కూడా చేస్తారు. అందరికి ధన సహాయం చేస్తుంటారు. వీరు ధనం, ఆహారం విషయంలో జాగరూకతతో ఉంటే ఇంటికీ, ఒంటికి మంచిది.

అనుకూల తేదీలు : 3, 6, 9, 12, 15,18, 21, 24, 27, 30
ప్రతికూల తేదీలు : 1, 7, 10, 16, 25
అనుకూల వారాలు : బుధవారం, శుక్రవారం, శనివారం
అనుకూల రంగు : తెలుపు, నీలం

## 3. మిథున రాశి

**మిథున రాశి వారు ఎదుటి వారి మనసు తెలుసుకొని వారితో తొందరగా కలిసిపోతారు. విరుద్ధ భావాలున్న వ్యక్తులను సులభంగా కలపగలుగుతారు. ఒకే భావాలున్న వ్యక్తులను సులభంగా విడదీయగలుగుతారు. వీరు మంచి మధ్యవర్తులుగా రాణించగలుగుతారు. పరోపకారం చేస్తారు.**

మే 21 – జూన్ 21 తేదీల మధ్య జన్మించిన వారు "మిథున రాశి"లోకి వస్తారు.

మిధునం అంటే జంట. ఆడ, మగ జంటగా ఉండటం వలన రాశికి ఈ పేరు వచ్చింది.

ఈ రాశి వారు ఎదుటి వారి మనోభావాలు, మనస్తత్వాలు తెలుసుకొని సులభంగా వారితో కలిసిపోతారు. ఎలాంటి పరిస్థితులకైనా సర్దుకుపోయే గుణం కలిగి ఉంటారు. వీరు చెడు సావాసాలకి లోనుకాకుండా చూసుకుంటే మంచిది. విరుద్ధ భావాలు గల వ్యక్తులను వీరు సులభంగా కలపగలుగుతారు. అలాగే ఒకే భావాలున్న వ్యక్తులను సులభంగా విడదీయగలరు. అందువలన వీరు సకారాత్మక దృష్టిని పెంపొందించుకుంటే మంచి మధ్యవర్తులుగా, సంప్రదింపులు జరిపేవారుగా రాణిస్తారు.

వీరికి పరోపకారం ఎక్కువ. నీతి, నిజాయితీల మీద నమ్మకం ఎక్కువ. పలు సేవా సంస్థలకి ఆర్థిక సహాయం చేస్తుంటారు. వీరు, తమ పనులను ఇతరులకు అప్పజెప్పక వీరే చేసుకుంటారు. దాని వలన వృద్ధాప్యంలో భార్యా, పిల్లల వలన వ్యతిరేకత ఎదుర్కొంటారు. వీరికి పెద్ద పెద్ద వ్యాపార సంస్థలు నడిపే సత్తా ఉంటుంది.

**కుటుంబం**

శృంగారం పట్ల ఎక్కువ ఆసక్తి కలిగిఉండరు. వైవాహిక జీవితం గోప్యంగా ఉంచుతారు. స్త్రీ సంతానం అధికంగా ఉండే అవకాశం ఉంది. మొదటి సంతానం తరువాత అదృష్టం కలిసి వస్తుంది. సాహిత్యం, తత్త్వం, పరిశోధనల పట్ల ఆసక్తి కలిగి ఉంటారు. రచనా వ్యాసంగం, జర్నలిజం, ముద్రణ, ప్రచురణ, టీవీ, రేడియో రంగాలు అనుకూలం. విజ్ఞాన శాస్త్ర పరిశోధనలలో కూడా రాణించగలరు.

**ఆరోగ్యం**

వీరు చీటికిమాటికీ అనారోగ్యానికి గురవుతుంటారు. వెన్నునొప్పి, కీళ్ళ నొప్పులు, నరాల బలహీనత, నిద్రలేమి, గ్యాస్ట్రబుల్ వంటివి బాధిస్తాయి. ఆహార నియమాలు పాటిస్తే మంచిది.

| | | |
|---|---|---|
| అనుకూల తేదీలు | : | 5, 14, 23 |
| ప్రతికూల తేదీలు | : | 4, 8, 13, 17, 22, 26 |
| అనుకూల వారాలు | : | బుధవారం, శుక్రవారం |
| అనుకూల రంగు | : | ఆకుపచ్చ |

## 4. కర్కాటక రాశి

**కర్కాటక రాశి వారు ద్వంద్వ ప్రవృత్తి కలిగి ఉంటారు. ఆశ, నిరాశల మధ్య ఊగిసలాడతారు. వీరికి సిక్స్త్ సెన్స్ ఎక్కువ. అతీంద్రీయ జ్ఞానం వలన అద్భుతాలు సాధిస్తారు. వీరికి గొప్ప ఆధ్యాత్మిక శక్తి ఉంటుంది.**

జూన్ 22 – జూలై 22 మధ్యలో జన్మించిన వారు ఈ కర్కాటక రాశిలోనికి వస్తారు. ఈ రాశి చిహ్నం ఎండ్రకాయ.

ఈ రాశిలో జన్మించిన వారు మానసికంగా ద్వంద్వ ప్రవృత్తి కలిగి ఉంటారు. ఆశ, నిరాశల మధ్య వీరి మనసు ఊగిసలాడుతుంది. వీరు సకారాత్మక దృష్టిని ఆలోచనలను అలవాటు చేసుకున్నట్లయితే వీరికి తిరుగుండదు. వీరికి గొప్ప మానసిక, ఆధ్యాత్మిక శక్తి ఉంటుంది. వీరికి "సిక్స్త్ సెన్స్" ఎక్కువ. భవిష్యత్తులో జరుగబోయేవి వీరికి ఈ "సిక్స్త్ సెన్స్" ద్వారా గ్రహించే అనుభూతి కలిగి ఉంటారు.

వీరు ప్రేమ, వాత్సల్యం కలిగి ఉంటారు. వీరి మనసు స్థిరంగా ఉండి, సకారాత్మక దృష్టి కలిగి ఉంటే, వీరికి ఉన్న అతీత జ్ఞానం వలన అద్భుతాలు సాధించగలుగుతారు. సముద్ర తీరప్రాంతాలు, కొండలు, కోనలు చూసి మానసిక ప్రశాంతత పొందుతారు. ఖాద్య పదార్థాలు, నీటి సరఫరా, స్టాక్ ఎక్స్చేంజ్, వార్తా పత్రికలు, బ్యాంకింగ్, ఆర్థిక వ్యవహారాలు, ఎగుమతి, దిగుమతి వ్యాపారం లాంటివి వీరికి అనుకూలం. వీరికి ఉద్యోగం కంటే వ్యాపారం లాభదాయకం.

**కుటుంబం**

వీరికి తొందరగానే వివాహం అవుతుంది. వీరికి తెలివైన భార్య దొరికితే ఎంతో అభివృద్ధి సాధిస్తారు. సంతాన సౌఖ్యం ఉంటుంది. పిల్లలు బాగా స్థిరపడతారు.

**ఆరోగ్యం**

శ్వాసకోశ సమస్యలు, జలుబు, దగ్గు, ఉబకాయం వంటివి వీరిని పీడిస్తాయి. ఆహార నియమాలు పాటిస్తే మంచిది.

అనుకూల తేదీలు : 1, 2, 4, 7, 10, 11, 13, 22, 25, 28, 31

ప్రతికూల తేదీలు : 8, 9, 17, 18, 26, 27

అనుకూల రంగు : తెలుపు, బూడిదరంగు

## 5. సింహ రాశి

**సింహ రాశి వారు సింహం వలె గంభీరంగా ఉంటారు. నాయకత్వ లక్షణాలు ఎక్కువ. మంచి కంఠస్వరంతో మాట్లాడతారు. ఎదుటివారి దైన్యాన్ని చూసి కరిగిపోతారు. డబ్బు సంపాదిస్తారు. అలాగే ఖర్చుచేస్తారు. దాన ధర్మాలు చేస్తారు.**

జూలై 23 – ఆగస్టు 22 మధ్య జన్మించిన వారు సింహ రాశిలోకి వస్తారు. ఈ రాశి చిహ్నం సింహం.

ఈ రాశివారు సింహంలా గంభీరంగా ఉండి, నాయకత్వ లక్షణాలు కలిగి ఉంటారు. వీరు మంచి శరీర సౌష్టవం కలిగి ఆకర్షణీయంగా ఉంటారు. మంచి కంఠస్వరం కలిగి చతురతతో మాట్లాడతారు. వీరికి ఆత్మవిశ్వాసం ఎక్కువ. జాలి, కరుణ కలిగి ఉంటారు. ఎదుటి వారు దీనవదనాలు చూసి కరిగిపోతారు. పొగడ్తలకు లొంగిపోతారు. ధనం బాగానే సంపాదిస్తారు. ఖర్చు చేస్తారు. దానధర్మాలు చేస్తుంటారు. ఎప్పుడూ వీరిదే పైచేయిగా ఉండాలని కోరుకుంటారు.

రాజకీయ, మత, సామాజిక వర్గాలకు నాయకులుగా ఎదుగుతారు. ఒక్కోసారి వీరి ఆత్మవిశ్వాసం అహంకారంగా మారే అవకాశం కూడా ఉంది. నిజాలు దాచడం, నమ్మకద్రోహం లాంటివి సహించరు. ధనం కంటే పేరు ప్రఖ్యాతులు ఎక్కువగా కోరుకుంటారు. మనసుని, భావాలను అదుపులో ఉంచుకొని, లౌకికంగా ప్రవర్తిస్తే వీరికి ఎదురుండదు.

వైద్యవృత్తి, వైద్య పరికరాలు, రసాయనాల అమ్మకం, ఉపాధ్యాయ వృత్తి, పరిశ్రమలు, వ్యాపారాలు మొదలగు వాటిలో రాణిస్తారు. వీరికి ఉద్యోగం కంటే వ్యాపారం లాభదాయకం.

**కుటుంబం:** అనుకూలమైన జీవిత భాగస్వామి దొరుకుతారు. పిల్లల అనారోగ్యం బాధిస్తుంది.

**ఆరోగ్యం:** తలనొప్పి, జ్వరం, బీపీ, కంటి సమస్యలు, గ్యాస్ట్రబుల్, ఉదరకోశ వ్యాధులు పీడిస్తాయి. వ్యాయామం, ఆహార నియమాలు పాటిస్తే ఉబకాయం రాకుండా ఉంటుంది.

| | | |
|---|---|---|
| అనుకూల తేదీలు | : | 1, 24, 7, 9, 10, 11, 13, 16, 18, 19, 20, 22, 25, 27, 28, 31 |
| ప్రతికూల తేదీలు | : | 5, 8, 14, 17, 23, 26 |

అనుకూల వారాలు : ఆదివారం, మంగళవారం, గురువారం
అనుకూల రంగు : తెలుపు, బంగారు రంగు, తేనె రంగు

## 6. కన్యా రాశి

**కన్యా రాశి వారు అమ్మాయిల వలె సున్నితమైన మనసు కలిగి ఉంటారు. మనసులో భయాందోళనలు కలిగి ఉంటారు. సేవాగుణం కలిగి ఉంటారు. కష్టాలు, ఆటంకాలు తలచుకొని ముందుగానే భయపడుతుంటారు. వీరు అప్పులు చేయకుండా ఉంటే మంచిది.**

ఆగస్టు 23 – సెప్టెంబర్ 22 తేదీల మధ్య జన్మించిన వారు 'కన్య' రాశి లోనికి వస్తారు. ఈ రాశికి చిహ్నం "అమ్మాయి".

ఈ రాశి వారు "అమ్మాయిల" వలె సున్నితమైన మనసు కలిగి ఉంటారు. తెలివితేటలు, వాత్సల్యం, సౌమ్య స్వభావం కలిగి ఉంటారు. మనసులో భయాందోళనలు కలిగి ఉంటారు. సందేహాస్పదంగా ఉంటారు. వీరికి సరైన ప్రోత్సహం, వెన్నుదన్నులు లభించినట్లయితే చక్కగా రాణిస్తారు. వీరి చుట్టూ వాతావరణం అనుకూలంగా ఉన్నట్లయితే వీరు తమ రంగంలో అభివృద్ధి సాధిస్తారు. వీరు సేవాగుణం కలిగి ఉంటారు. పనులు చేసినపుడు ఆటంకాలు, కష్టాలు, విఘ్నాలను తలచుకొని ముందుగానే భయపడుతుఅంటారు. ఈ బలహీనతను అధిగమిస్తే వీరు మంచి గుర్తింపు పొందుతారు.

వీరు ఆత్మవిశ్వాసం పెంపొందించుకుంటే మంచిది. వీరు అధిక, శారీరక శ్రమ కలిగించే పనులు చేయలేరు. ఊరికే తమకష్టాలను బాధలని ఇతరులకి పదేపదే చెప్పకుండా ఉంటే మంచిది. అప్పులు చేయకుండా జాగ్రత్తపడాలి. భాషలు, తత్త్వశాస్త్రం, కళలు, రచన, శిల్పకళ మొదలైనవి వీరికి అనుకూలం. షేర్ మార్కెట్, నిర్మాణ రంగం కూడా అనుకూలం.

**కుటుంబం**

చాలా మంది సరైన సమయంలోనే వివాహం చేసుకుంటారు. ఇంటిని వదిలి ఎక్కువ కాలం ఉండలేరు. భార్య, పిల్లలు, కుటుంబాన్ని బాగా ప్రేమిస్తారు. ఈ రాశిలో పుట్టిన స్త్రీలు, పురుషుల కంటే ఎక్కువ ప్రేమ కలిగి ఉంటారు. ఇంటిని అందంగా

పరిశుభ్రంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దుకుంటారు. వీరికి స్త్రీ సంతానం ఎక్కువ. పిల్లలు బాగా చదువుకొని అభివృద్ధిలోకి వస్తారు.

**ఆరోగ్యం**

జీర్ణ సమస్యలు, కాలేయం, గుండె సమస్యలు బాధిస్తాయి. వ్యాయామం, ఆహార నియమాలు పాటిస్తే మంచిది.

| | | |
|---|---|---|
| అనుకూల తేదీలు | : | 5, 14, 23 |
| ప్రతికూల తేదీలు | : | 8, 9, 17, 18, 26, 27 |
| అనుకూల వారాలు | : | బుధవారం, గురువారం |
| అనుకూల రంగు | : | ఆకుపచ్చ |

## 7. తులా రాశి

**తులా రాశి వారు న్యాయం, సమానత్వం, ధర్మం అనే గుణాలు కలిగి ఉంటారు. ఇతరుల నుంచి ఏమి తీసుకోవాలో వారికి ఏమి ఇవ్వాలో వీరికి బాగా తెలుసు. గుండుసూదితో సహా దేనిని చిన్నచూపు చూడరు. మోసాన్ని సహించరు. వీరికి పరిశుభ్రత ఎక్కువ. వీరు న్యాయమూర్తులుగా రాణిస్తారు.**

సెప్టెంబర్ 23 – అక్టోబర్ 22 తేదీల మధ్య జన్మించిన వారు 'తుల' రాశి లోనికి వస్తారు. ఈ రాశి చిహ్నం "తక్కెడ పట్టుకున్న మనిషి".

తులారాశిలో జన్మించిన వారు సమానత్వం, న్యాయం, ధర్మం, సమభావం అనే గుణాలు కలిగి ఉంటారు. ఇతరులు వీరికి ఏమి ఇవ్వాలో, వీరు ఇతరులకు ఏమి ఇవ్వాలో వీరికి బాగా తెలుసు. వీరు జీవితంలో మంచి ఉన్నతిని సాధిస్తారు. విచక్షణ అనేది వీరికి దేవుడిచ్చిన వరం. కాలం, ధనం, అవకాశాలన్నీ వీరు సద్వినియోగం చేసుకుంటారు. దేనిని చిన్నచూపు చూడరు, ఒక గుండుసూదిని కూడా! సాధారణంగా వీరికి కోపం రాదు. కాని అన్యాయాల్ని, మోసాల్ని చూసినపుడు మాత్రం కోపగించుకుంటారు. వీరికి పరిశుభ్రత ఎక్కువ. ఇంటి ఆవరణ, ఇంటిలోపల చాలా పరిశుభ్రంగా, అందంగా, ఆకర్షణీయంగా ఉంచుకుంటారు.

కవిత్వం, పెయింటింగ్, నిర్మాణ రంగం, ప్రణాళికలు, వీరికి ఇష్టమైనవి. వీరికి నగర జీవితం కంటే గ్రామీణ జీవితం ఇష్టం. సంగీతం, కవిత్వం, నాట్యం మొదలైన వాటితో పేరుగడిస్తారు. వీరికి కొంచెం పిరికితనం ఉంటుంది. ఆత్మవిశ్వాసం పెంచుకొని పిరికితనాన్ని పోగొట్టుకుంటే బాగా రాణిస్తారు. న్యాయశాస్త్రం, వైద్యం, ఉపాధ్యాయ వృత్తి వీరికి అనుకూలం. న్యాయవాదులుగా, న్యాయమూర్తులుగా రాణించగలుగుతారు. లలిత కళలలో కూడా రాణిస్తారు.

**కుటుంబం**

వీరికి వివాహం త్వరగానే అవుతుంది. వృత్తి వ్యాపారాలలో బిజీగా ఉండటం వలన కుటుంబ జీవితంలో పూర్తి ఆనందం పొందలేరు. పిల్లలు తొందరగానే కలుగుతారు. పిల్లల అనారోగ్యం బాధిస్తుంది.

**ఆరోగ్యం**

అజీర్ణం, కడుపునొప్పి, విరేచనాలు, నరాల వ్యాధులు వంటివి బాధిస్తాయి.

| | | |
|---|---|---|
| అనుకూల తేదీలు | : | 2, 4, 8, 11, 16, 17, 20, 22, 26, 31 |
| ప్రతికూల తేదీలు | : | 9, 18, 27 |
| అనుకూల వారాలు | : | బుధవారం, శుక్రవారం, శనివారం |
| అనుకూల రంగు | : | తెలుపు, నీలం |

## 8. వృశ్చిక రాశి

**వృశ్చిక రాశి వారు చెడుగుణాలను అణచుకొని, మంచి గుణాలు అలవరచుకుంటే కీర్తి ప్రతిష్ఠలు పొందుతారు. చెడు సావాసాలకు దూరంగా ఉంటే మంచిది. అన్ని విషయాలు రహస్యంగా ఉంచుతారు. వీరు మంచి సర్జన్లుగా, ఇన్వెంటర్లుగా రాణిస్తారు.**

అక్టోబర్ 23 – నవంబర్ 21 తేదీల మధ్య జన్మించిన వారు వృశ్చిక రాశిలోకి వస్తారు. ఈ రాశి గుర్తు వృశ్చికం అంటే తేలు.

వీరు మంచి ఆకర్షణీయంగా ఉంటారు. ఇతరులను తొందరగా ఆకర్షిస్తారు.

వీరిలో ఉన్న నకారాత్మక గుణాలు, దుర్మార్గత్వం, క్రూరత్వం, చెడు తలంపులు లాంటివి అణచుకొని, సకారాత్మక గుణాల్ని ప్రేరేపించినట్లయితే కీర్తి, ప్రతిష్ఠలు పొందుతారు. మంచి వాక్పటిమ, రచనాశక్తి కలిగి ఉంటారు. స్వార్థం, సంకుచితత్వం, మోసం లాంటి గుణాలను అదుపు చేయకపోతే మాత్రం న్యాయపరమైన సమస్యలు కలుగుతాయి. చెడు సావాసాలకి దూరంగా ఉంటే మంచిది.

వీరి ఎదుట, మంచి మార్గం, చెడు మార్గం రెండూ కనబడుతుంటాయి. విజ్ఞతతో మంచి మార్గం ఎన్నుకుంటే విజయం సాధిస్తారు. అన్ని విషయాలు గోప్యంగా ఉంచుతారు. చిన్నతనంలో వీరిని చెడు మార్గాలవైపు పోకుండా చూసుకుంటే మంచి సర్జన్లుగా, ఆవిష్కారవేత్తలుగా, పరిశోధనా నిపుణులుగా పేరుపొందుతారు. మందులు, రసాయనాలు, నూనె, గ్యాస్ వ్యాపారంలో రాణిస్తారు.

**కుటుంబం**

వీరికి శృంగార భావాలు ఎక్కువగా ఉంటాయి. ద్వితీయ వివాహం అవకాశం ఉంది. భార్య అనారోగ్యానికి గురికావచ్చు. కుటుంబం కోసం త్యాగాలు చేస్తారు. వీరికి పిల్లలు కలగటం ఆలస్యం అయ్యే అవకాశం ఉంది. కానీ తరువాత పుట్టిన సంతానం బాగా రాణిస్తారు.

**ఆరోగ్యం**

బాల్యంలో అనారోగ్యం కలుగవచ్చు. ఉదరకోశ వ్యాధులు, పైల్స్, శ్వాసకోశ వ్యాధులు కలుగవచ్చు.

అనుకూల తేదీలు : 7, 9, 16, 18, 25, 27
ప్రతికూల తేదీలు : 2, 5, 11, 14, 20, 23, 29
అనుకూల వారాలు : మంగళ, గురు, ఆదివారాలు
అనుకూల రంగు : నలుపు

## 9. ధనస్సు రాశి

**ధనస్సు రాశి వారికి టెన్షన్ ఎక్కువ. వీరు సమాజంలో ఉన్నత స్థానాన్ని పొందుతారు. స్నేహితులంటే ఇష్టం. అన్యాయం సహించరు. అభివృద్ధి సాధించినా తృప్తి పొందరు. కష్టమైనా ఇష్టమైన పని చేస్తారు.**

నవంబర్ 22 – డిసెంబర్ 21 తేదీల మధ్య జన్మించిన వారు ధనస్సు రాశిలోకి వస్తారు. ధనస్సు అంటే విల్లు. ఈ రాశి చిహ్నం, మానవ అశ్వరూపం ఎక్కుపెట్టిన విల్లు ధరించి ఉంటుంది.

ధనస్సురాశి వారికి టెన్షన్, ఎక్కువ. వీరికి గురి కూడా ఎక్కువే. వీరు పైకి చూడటానికి సామాన్యంగా ఉన్నా, మనసు మాత్రం విడిచిపెట్టిన బాణంలా ఉంటుంది. వీరు సమాజంలో ఉన్నత స్థానాన్ని పొందుతారు. తమ శక్తియుక్తులను ఇతరుల కోసం వినియోగిస్తుంటారు. స్నేహితులంటే ఇష్టం. వీరు అన్యాయాన్ని సహించరు.

ఎంత వృద్ధి సాధించినా, తృప్తి పొందరు. హంగు, ఆర్భాటం, పేరు ప్రఖ్యాతుల కోసం ప్రయత్నిస్తుంటారు. ఎంత కష్టమైన పనైనా నచ్చితే ప్రారంభిస్తారు. అందులో తృప్తి లేకపోతే మధ్యలోనే వదిలేస్తారు. అందువల్ల వీరికి పర్మినెంట్‌గా స్నేహితులు ఎవరూ ఉండరు. వీరి మాటల్లో స్పష్టత ఉంటుంది. కరకుదనాన్ని విడిచిపెడితే మంచిది. బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, ఎగుమతి, దిగుమతి, న్యాయవాది, ఉపాధ్యాయ వృత్తి, నటన మొ॥నవి అనుకూలం.

**కుటుంబం**

వీరికి వివాహం తొందరగా అవుతుంది లేకపోతే చాలా ఆలస్యం అవుతుంది. భార్యాపిల్లలను ప్రేమిస్తారు. స్త్రీ సంతానం కంటే, పుత్రసంతానం ఎక్కువ. పిల్లల అనారోగ్యం వీరిని బాధిస్తుంది.

**ఆరోగ్యం**

వీరికి టెన్షన్ ఎక్కువ దాని వలన నరాల వ్యాధులు వస్తాయి. జలుబు, శ్వాసకోశ వ్యాధులు, కాలేయ వ్యాధులు ఉండవచ్చు. ఆహార నియమాలు పాటిస్తూ వ్యాయామం చేయటం మంచిది.

| | | |
|---|---|---|
| అనుకూల తేదీలు | : | 3,9,10,12,18,19,21,27,30 |
| ప్రతికూల తేదీలు | : | – |
| అనుకూల దినాలు | : | ఆదివారం, మంగళవారం, గురువారం |
| అనుకూల రంగు | : | ఆరెంజ్, తేనె రంగు, బంగారు రంగు |

## 10. మకర రాశి

**మకర రాశి వారు తెలివితేటలు, ధృడ సంకల్పం కలిగి ఉంటారు. అనుకున్నది సాధించేంత వరకు మొసలిపట్టు వదలరు. వాస్తవికంగా ఆలోచిస్తారు. తొందరపాటు ఉండదు. నెమ్మదిగా ముందుకు సాగుతూ విజయం సాధిస్తారు. కానీ వీరికి ధైర్యం తక్కువ. అనుమాన పక్షి అని అందరూ అంటారు.**

డిసెంబర్ 22 – జనవరి 20 తేదీల మధ్య జన్మించిన వారు ఈ రాశిలోకి వస్తారు. మకర రాశి చిహ్నం “మొసలి”.

మకరరాశి వారు, మంచి తెలివితేటలు, ధృడ సంకల్పం కలిగి ఉంటారు. వీరు జాగరూకులై ఉంటారు. వీరు తల్లిదండ్రుల పట్ల విధేయత కలిగి ఉంటారు. ఇష్టమైన ఏ విషయంలోనైనా మంచి పట్టు కలిగి ఉంటారు. అనుకున్నది సాధించేంత వరకు పట్టువదలరు (మొసలిపట్టు). వీరికి స్నేహితులు ఎక్కువైనా ఎవరినీ నమ్మరు. ఏ విషయాన్నైనా వాస్తవికంగా ఆలోచిస్తారు. వీరికి తొందరపాటు తక్కువ. నెమ్మదిగా సాగుతూ ముందుకుపోతూ విజయం సాధిస్తారు.

నకారాత్మక దృష్టి ఉన్నట్లయితే నాస్తికులుగా ఉంటారు. క్రూరత్వం కూడా పెరుగుతుంది. అందువల్ల సకారాత్మక దృష్టిని పెంపొందించుకుంటే మంచిది. తెలివైనవారిని బాగా ఇష్టపడతారు, వారు తప్పుచేసినా సరే! కానీ వీరికి ధైర్యం తక్కువ. వీరు చాలా కష్టపడి పనిచేసే స్వభావం కలిగి ఉంటారు. వీరు అతి జాగరూకులై ఉండటం వలన అందరూ వీరిని అర్థం చేసుకోలేరు. అనుమానం పక్షి అనుకొంటారు. ప్రభుత్వ ఉద్యోగం, పురపాలక సంఘాలు, దౌత్య కార్యాలయాలు, ప్రజా సంబంధాల సంస్థలలో ఎలాంటి పదవినైనా వీరు బాగా చేయగలుగుతారు.

**కుటుంబం**

వీరు భార్యా పిల్లలను బాగా చూసుకొంటారు. కాని చాలా జాగ్రత్తతో వ్యవహరిస్తారు. వీరి పిల్లలు బాగా చదువుకొని రాణిస్తారు.

**ఆరోగ్యం**

మూత్రకోశ వ్యాధులు, జలుబు, దగ్గు మొదలగునవి బాధించవచ్చు.

| | | |
|---|---|---|
| అనుకూల తేదీలు | : | 6,8,15,17,24,26 |
| ప్రతికూల తేదీలు | : | – |
| అనుకూల దినాలు | : | బుధ, శుక్ర, శనివారాలు |
| అనుకూల రంగులు | : | నలుపు |

## 11. కుంభ రాశి

**కుంభ రాశి వారు భయం, సందేహం వదిలించుకుంటే చక్కగా రాణిస్తారు. సేవా సంస్థలకు సాయం చేస్తారు. పనిలో కొత్తదనానికి ప్రయత్నిస్తారు. మనసులో ప్రేమ బయటకు తెలియజేయరు. నిండుకుండలా ఉంటారు.**

జనవరి 21, ఫిబ్రవరి 19 తేదీల మధ్య జన్మించిన వారు కుంభరాశి లోనికి వస్తారు. కుంభం అంటే కుండ. ఈ రాశి గుర్తు "కుండ". కుంభరాశిలో జన్మించిన వారు చాలా ప్రత్యేకమైన స్వభావం కలిగి ఉంటారు. వీరు నిర్దిష్ట అభిప్రాయాలు, అలౌకిక స్ఫురణ, కలిగి ఉంటారు.

భయం, సందేహం, సందిగ్ధత లాంటివి వదులుకుంటే చక్కగా రాణించగలుగుతారు. వీరు పేరు ప్రఖ్యాతులు, ధనం గురించి ఎక్కువ పట్టించుకోకపోయినా, వీరు సాధించిన విజయాలు వీరికి వాటిని ప్రాప్తింపచేస్తాయి. వీరు తమ చుట్టూ ఉన్న సమాజంలో సమస్యలను పరిష్కరించటానికి ప్రయత్నిస్తుంటారు. సేవాసంస్థలకు సహాయం చేస్తుంటారు. ఇతరులకు సాయం చేయటంలో ఆనందం పొందుతారు.

సమస్య ఎటువంటిదైనా, దాన్ని పరిష్కరించటానికి ప్రయత్నిస్తుంటారు. ఎన్నో విషయాలు తెలుసుకుంటూ ఉంటారు. ఏదో ఒక విషయంపై పరిజ్ఞానం పెంచుకొంటే

అది వారికి ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. పనిలో నూతనత్వానికి ప్రయత్నిస్తుంటారు. వీరు తమ మనసులో ఉన్న ప్రేమ, వాత్సల్యం బయటకి కనిపించనీయరు నిండుకుండ తొణకదు అన్నట్టుగా. అందువల్ల వీరిని బంధువుల కంటే స్నేహితులే ఎక్కువ ప్రేమిస్తారు.

**కుటుంబం**

వీరికి వివాహం తొందరగా అవుతుంది లేదా చాలా ఆలస్యంగా అవుతుంది. అహంభావి అయిన జీవిత భాగస్వామి దొరికే అవకాశం ఉంది. జాగ్రత్త పడితే మంచిది. వీరి సంతానం తెలివైన వారుగా, బాగా చదువుకొని స్థిరపడే వారుగా ఉంటారు.

**వృత్తి**

వీరు సమాజంలో ఉన్నత స్థానంలో ఉంటారు. ఇంజనీరింగ్, యోగా, మనోవికాస శాస్త్రం, సినిమాలు మొదలైనవి వీరికి అనుకూలం. వీరికి ఉన్న అలౌకిక స్ఫురణ వలన వీరు మంచి జ్యోతిష్యులుగా రాణించగలరు.

**ఆరోగ్యం**

తలనొప్పి, బి.పి. నరాల సమస్యలు, ఒత్తిడి మొదలైనవి ఉండవచ్చు.

| | | |
|---|---|---|
| అనుకూల తేదీలు | : | 1,4,10,13,19,22,28,31 |
| ప్రతికూల తేదీలు | : | 8,17,26 |
| అనుకూల దినాలు | : | ఆదివారం, బుధవారం, శుక్రవారం |
| అనుకూల రంగులు | : | బూడిద రంగు |

## 12. మీన రాశి

**మీన రాశి వారు సున్నిత మనస్కులు. ఎవరి మీద పెత్తనం చేయకపోయినా అందరూ వీరి మాట వింటారు. వీరి చూపు చాలా శక్తివంతమైనది. అన్నింటికీ సర్దుకుపోతారు. ఇతరులకు హాని చేయటానికి నచ్చరు. అపాత్రదానం చేస్తుంటారు. వీరిలో ఇన్సెక్యూరిటీ ఫీలింగ్ ఉంటుంది.**

ఫిబ్రవరి 20 – మార్చి 20 మధ్య తేదీలలో జన్మించిన వారు మీన రాశిలోకి వస్తారు. ఈ రాశి గుర్తు “రెండు చేపలు”

వీరు చాలా సున్నిత మనస్కులు. ఎంతో విధేయత కలిగి ఉంటారు. వీరు కావాలని ఇతరులని అజమాయిషీ చేయరు గానీ, అందరూ వీరి మాట వింటారు. వీరి కంటే గొప్పవారు, పై అధికారులు కూడా వీరిని ఇష్టపడుతుంటారు. శత్రువులు కూడా వీరికి హాని చేయటానికి సంకోచిస్తారు. వీరిలో ఏదో తెలియని అలౌకిక శక్తి, వీరి చుట్టూ ఉన్నవారిని ప్రభావితం చేస్తుంటుంది. వీరి చూపు చాలా శక్తివంతమైనది.

అందరితో కలసిపోయి, వారి సాధక బాధకాలు అర్థం చేసుకుంటారు. అన్నిటికి సర్దుకుపోయే గుణం, ఒక బలహీనతగా మారకుండా చూసుకోవాలి. వీరు తమ చుట్టు ప్రక్కల ఉన్న వ్యక్తులు, పరిస్థితుల ప్రభావానికి తొందరగా లోనవుతారు. అందువలన చెడుసావాసాలకు పోకుండా ఉంటే మంచిది. ఇతరులను అకారణంగా హాని చేయటానికి నచ్చరు. వీరిలో అభద్రతా భావం ఉంటుంది. ఒక్కొక్క సారి అపాత్రదానం చేస్తుంటారు.

**కుటుంబం**

వీరికి వివాహం తొందరగానే అవుతుంది. వైవాహిక జీవితం ఆనందంగా సాగిపోతుంది. భార్యా, పిల్లలను ఎంతో ప్రేమిస్తారు. మంచి సంతానం కలుగుతుంది. ముసలితనంలో పిల్లల వలన సౌఖ్యం.

**వృత్తి**

ప్రజాపనులు, నిర్మాణ రంగం, పాఠశాలలు, ఖాద్య పదార్థాల వ్యాపారం, నీరు ద్రావాణాల వ్యాపారం, షేర్ మార్కెట్, ముద్రణ, ప్రచురణ, ప్రసారం మొ॥నవి అనుకూలం.

**ఆరోగ్యం**

అజీర్ణ సమస్య, మానసిక సమస్య, ఒత్తిడి, టి.బి., ఆస్మా, మధుమేహం లాంటివి రావొచ్చు తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

| | | |
|---|---|---|
| అనుకూల తేదీలు | : | 3, 6, 7, 12, 15, 15, 21, 24, 25 |
| ప్రతికూల తేదీలు | : | 4, 8, 22, 26, 31 |
| అనుకూల దినాలు | : | సోమ, గురు, శుక్రవారాలు |
| అనుకూల రంగు | : | తేనె, తెలుపు, బంగారు రంగు |

# జన్మ సంవత్సరం

**మీరు జన్మించిన సంవత్సర సంఖ్య మీ జీవితంపై కొంచెం ఆలస్యంగా ప్రభావం చూపుతుంది. కాని చాలా ప్రభావవంతంగా పనిచేస్తుంది. మీ జీవితంలో రెండవ భాగం ఎలా ఉంటుందో ఇది తెలియజేస్తుంది.**

మీ జనన తేదీలోని కేవలం జన్మ సంవత్సరంను అనుసరించి కూడా మీ యొక్క గుణగణాలు, దశ, దిశా నిర్ధేశం లాంటివి గణించవచ్చు. వీరు ఏఏ వృత్తులలో స్థిరపడతారో వాటిని తెలుసుకొనవచ్చు. అయితే వ్యక్తుల యొక్క జీవితంపై ఈ జన్మ సంవత్సర సంఖ్య అనేది కొంచెం ఆలస్యంగా ప్రభావం చూపుతుంది. జన్మ సంవత్సర సంఖ్యను ఈ విధంగా గణించాలి. ఉదాహరణకు ఒక వ్యక్తి 10-5-1976 న జన్మించినట్లయితే, అతని జన్మ సంవత్సర సంఖ్య = 1+9+7+6=23 = 2+3 = 5. ఈ సంఖ్యను అనుసరించి ఇపుడు మనం మన స్థితిగతులు ఎలా ఉంటాయో తెలుసుకుందాం.

## సంఖ్య - 1

**వీరి చేతివ్రాత బాగుంటుంది. వ్యాధుల నుండి తొందరగా కోలుకునే శక్తి ఉంటుంది. మంచి సంతానం కలుగుతుంది.**

**ఉదా : 1945, 1954, 1963, 1972, 1981, 1990**

సంఖ్య 1 సూర్యుని సంకేతం. అందువలన వీరికి విజయం, శక్తి, గౌరవం, వ్యాధుల నుండి తొందరగా కోలుకునే శక్తి ఉంటుంది. చేతివ్రాత బాగుంటుంది. మంచి విద్యాభ్యాసం చేస్తారు. వివిధ భాషల పరిజ్ఞానం ఉంటుంది. సంఘంలో గౌరవ మర్యాదలు కలిగి ఉంటారు. ప్రయాణాలు చేస్తుంటారు. మంచి సంతానం కలిగి ఉంటారు.

మంచి వృత్తి, ఉద్యోగ, వ్యాపారాలలో స్థిరపడతారు. వీరికున్న ధృడ సంకల్ప బలం వలన, కష్టాలను, ఆటంకాలను, తొలగించుకుంటూ చివరికి విజయం సాధిస్తారు. మంచి స్నేహితులు, బలహీన శత్రువులు కలిగి ఉంటారు. కంటి సమస్యలు, మోకాళ్ల వ్యాధులు వీరిని బాధిస్తాయి.

## సంఖ్య – 2

**వీరి ఆలోచనా విధానం రెండు రకాలుగా ఉంటుంది. సెంటిమెంటు ఎక్కువ. జీవితంలో ఎక్కువ మార్పులు చోటుచేసుకుంటాయి.**

ఉదా : 1946, 1955, 1964, 1973, 1982, 1991

సంఖ్య 2 చంద్రునికి సంకేతం. సంఖ్య 2 ఉన్నవారి ఆలోచనా విధానం, రెండు రకాలుగా ఉంటుంది. జీవితంలో ఎక్కువ మార్పులు చోటుచేసుకుంటాయి. వృత్తి ఉద్యోగాలలో మార్పులు ఉంటాయి. వీరు సెంటిమెంటల్ గా ఉంటారు.

ఇతరుల ఆసరాతో పనులు చేస్తారు. ప్రతి పనికి వేరొకరిపై ఆధారపడుతుంటారు. 20 ఏళ్ళ వయసులో అభివృద్ధి మొదలవుతుంది. ఆర్థిక సమస్యలుంటాయి. విద్యాభ్యాసంలో ఆటంకాలు ఉండవచ్చు. విదేశీయానం చేస్తారు. దీర్ఘాయుష్షు కలవారై ఉంటారు. వీరు స్వస్థలంలో కంటే వేరే చోట అభివృద్ధి సాధించగలుగుతారు.

## సంఖ్య – 3

**వీరికి జీవితంలో అన్ని ఆలస్యంగా జరుగుతాయి. మంచి కుటుంబంలో జన్మిస్తారు. మంచి తల్లిని కలిగి ఉంటారు. వృద్ధాప్యంలో ఒంటరిగా ఉంటారు.**

ఉదా : 1947, 1956, 1965, 1974, 1983, 1992

సంఖ్య 3 గురుగ్రహానికి సంకేతం. ఈ సంఖ్య ఉన్న సంవత్సరంలో జన్మించిన వారికి, అన్నీ ఆలస్యం అవుతుంటాయి. విద్యాభ్యాసంలో కూడా ఆటంకాలు కలుగుతుంటాయి. మంచి కుటుంబంలో జన్మిస్తారు. మంచి తల్లిని కలిగి ఉంటారు. సంతానం బాగా చదువుకొని, పేరు ప్రఖ్యాతులు గడిస్తారు.

విజయం తొందరగా కలుగదు. ప్రభుత్వ ఉద్యోగం చేస్తారు. ఉదరకోశ వ్యాధులు వస్తాయి. వీరికి 'ప్రమాదాల' ప్రమాదం పొంచి ఉంటుంది. నమ్మదగ్గ స్నేహితులు ఉండరు. వీరు వృద్ధాప్యంలో ఒంటరి జీవితం గడిపే అవకాశం ఉంది.

## సంఖ్య - 4

**వీరు అందంగా ఉంటారు. బాగా చదువుకుంటారు. వీరికి దీర్ఘాయుష్షు ఉంటుంది. జీవితం నెమ్మదిగా, సాఫీగా సాగిపోతుంది. చక్కని కుటుంబ జీవితం గడుపుతారు.**

ఉదా : 1948, 1957, 1966, 1975, 1984, 1993

సంఖ్య 4 రాహువు కు సంకేతం. ఈ సంఖ్య సంవత్సరంలో జన్మించిన వారు మంచి శరీర సౌష్టవం కలిగి ఉంటారు. మంచి విద్యాభ్యాసం చేస్తారు. వీరి జీవితం నెమ్మదిగా, సాఫీగా సాగిపోతుంది. దీర్ఘాయుష్కులుగా ఉంటారు. పరుల సాయంతో జీవితంలో ఉన్నతిని సాధిస్తారు.

గౌరవ ప్రదమైన వృత్తి, ఉద్యోగాలు చేస్తారు. స్నేహితులు అధికం. చక్కని కుటుంబ జీవితం గడుపుతారు. ప్రయాణాలు చేసే ఉద్యోగం చేస్తారు. దూర ప్రయాణాలుచేస్తుంటారు. స్త్రీలతో వివాదాలు ఉంటాయి. మంచి ఆదాయం కలిగి ఉంటారు. వీరు ఒంటరిగా ఉండటానికి ఇష్టపడినా, చివరకు జీవిత భాగస్వామిని పొందుతారు. వీరిది సహజ మరణం.

## సంఖ్య - 5

**వీరు ఉత్సాహం, చొచ్చుకుపోయే గుణం కలిగి ఉంటారు. బాగా చదువుకుంటారు. ప్రయాణాలు చేస్తారు. మంచి సంతానం కలుగుతుంది. జీవిత భాగస్వామి తెలివైన వారుగా ఉంటారు.**

ఉదా : 1949, 1958, 1967, 1976, 1985, 1994

సంఖ్య 5 బుధుడికి సంకేతం. ఈ సంఖ్య గల సంవత్సరంలో జన్మించిన వారు. శక్తి, ఉత్సాహం, చొచ్చుకుపోయే గుణం కలిగి ఉంటారు. సుఖజీవితం గడుపుతారు. విద్యాభ్యాసం బాగుంటుంది. గౌరవప్రదమైన జీవితం ఉంటుంది. ప్రయాణాలు చేస్తుంటారు. ప్రయాణాలలో కొత్త విషయాలు తెలుసుకుంటూ ఉంటారు.

మంచి సంతానం కలిగి ఉంటారు. వీరి జీవిత భాగస్వామి, మంచితనం,

తెలివితేటలు కలిగి ఉంటారు. ఇతరులపై ఆధారపడకుండా సొంతంగా విజయాలు సాధిస్తారు. ఆర్థిక సంస్థలు, బ్యాంకులు, విద్యాసంస్థలు మొదలైనవాటిలో పనిచేస్తారు. ఆపోజిట్ సెక్స్ స్నేహితులు ఉంటారు. దిగువ స్థాయి వ్యక్తులతో వివాదాలు ఉంటాయి.

## సంఖ్య – 6

**వీరు అందంగా, ఆకర్షణీయంగా ఉంటారు. మంచి కుటుంబం కలిగి ఉంటారు. నిర్లక్ష్యం వలన అనారోగ్యం వస్తుంది. జీవిత భాగస్వామి పట్ల మమకారం కలిగి ఉంటారు.**

ఉదా : 1950, 1959, 1968, 1977, 1986, 1995

సంఖ్య 6 శుక్రుడికి సంకేతం. ఈ సంఖ్య గల సంవత్సరంలో జన్మించిన వారు అందంగా ఆకర్షణీయంగా ఉంటారు. మంచి కుటుంబం కలిగి ఉంటారు. మంచి జీవితాన్ని అనుభవిస్తారు. విదేశీ ప్రయాణాలు చేస్తారు. విద్యాభ్యాసం బాగా ఉంటుంది. వీరికి తెలివైన సంతానం కలుగుతారు.

నిర్లక్ష్యం వలన అనారోగ్యం వస్తుంది. జీవిత భాగస్వామి పట్ల ఎక్కువ మమకారం కలిగి ఉంటారు. ప్రయాణాలు చేయటానికి ఇష్టపడుతుంటారు. దైవభక్తి గల స్నేహితులు ఉంటారు. సేవా తత్పరత కలిగిన ఉద్యోగం నిర్వహిస్తారు. ఈ సంఖ్య గల వారికి భాగస్వామి అవసరం తప్పని సరిగా ఉంటుంది.

## సంఖ్య – 7

**వీరు ఆధ్యాత్మికత కలిగి ఉంటారు. త్యాగబుద్ధి కలిగి, సంపదలను నచ్చరు. 40 సంవత్సరాల తర్వాత జీవితంలో అభివృద్ధి ఉంటుంది.**

ఉదా : 1942, 1951, 1960, 1969, 1978, 1987, 1996

సంఖ్య 7 నెప్ట్యూన్ (కేతువు) కి సంకేతం. ఈ సంఖ్య గల సంవత్సరంలో జన్మించిన వారు గొప్ప ఆధ్యాత్మిక పరులుగా ఉంటారు. వీరు త్యాగశీలురుగా ఉంటారు. గొప్ప ఆధ్యాత్మికవేత్తలకి ఈ సంఖ్య ఉంటుంది. భౌతిక సంపదలు ఎక్కువగా ఇష్టపడరు. కాని

40 సంవత్సరాల తర్వాత గొప్పజీవితాన్ని అనుభవిస్తారు. ధన సంపాదన బాగానే ఉంటుంది.

గృహ సంబంధ సమస్యలు ఉంటాయి. పిల్లలు బాగా చదువుకుంటారు. భార్యతో కలతలు వచ్చే అవకాశం ఉంది. అందువల్ల ద్వితీయ వివాహానికి అవకాశం ఉంది. మంచి గౌరవప్రదమైన ఉద్యోగం చేస్తారు. అపోజిట్ సెక్స్ స్నేహితులుంటారు. స్త్రీల మూలంగా సహాయం పొందుతారు. అనవసర వివాదాలు, సంసార జీవితంలో కలతలు వీరికి ఉంటాయి.

## సంఖ్య - 8

**వీరు మొదట్లో సాధారణ జీవితం గడిపినా తరువాత గొప్ప మార్పుని చూస్తారు. డబ్బు కొరత ఎప్పుడూ ఉంటుంది. తెలివైన, విధేయులైన జీవిత భాగస్వామి లభిస్తారు. ఒంటరితనాన్ని ఇష్టపడతారు.**

ఉదా : 1943, 1952, 1961, 1970, 1979, 1988, 1997

సంఖ్య 8 శని గ్రహానికి సంకేతం. ఈ సంఖ్య గల సంవత్సరంలో జన్మించినవారు జీవిత ప్రథమంలో సాధారణ జీవితం గడిపిన తరువాత గొప్ప మార్పు చూస్తారు. మంచి జీవితం గడుపుతారు గాని డబ్బు కొరత అనేది ఎపుడూ ఉంటుంది. తెలివైన విధేయురాలైన భార్య దొరకుతుంది. ప్రయాణాలు చేస్తుంటారు. మంచి కుటుంబం ఉంటుంది. వీరి సంతానం బాగా స్థిరపడతారు.

వీరు ఒంటరిగా ఉండటానికి ఇష్టపడతారు. వీరికి తమ తల్లి పట్ల ప్రేమ ఎక్కువగా ఉంటుంది. తండ్రి గిట్టదు. వెన్ను నొప్పి, మోకాళ్ళ నొప్పులు బాధిస్తాయి. స్వయం ఉపాధి మార్గాల ద్వారా ధనం సంపాదిస్తారు. బంధువులతో స్నేహంగా ఉంటారు.

## సంఖ్య - 9

**వీరు శాస్త్ర, కళారంగాల్లో రాణిస్తారు. పవిత్రంగా జీవిస్తారు. కుటుంబంలో కలతలు ఉంటాయి.**

ఉదా : 1944, 1953, 1962, 1971, 1980, 1989, 1998.

సంఖ్య - 9 కుజుడికి సంకేతం (Mars). ఈ సంఖ్య గల సంవత్సరంలో జన్మించినవారు శాస్త్ర కళా రంగాలలో విజ్ఞానులుగా ఉంటారు. ఈ జ్ఞానాన్ని నిజజీవితంలో ఉపయోగిస్తే విజయాలు సొంతం చేసుకుంటారు. పవిత్ర జీవనం గడుపుతారు. కుటుంబంలో కలతలు ఉంటాయి.

ప్రయాణాలలో ఆనందం పొందుతారు. అనుమానపు జీవిత భాగస్వామి దొరికే అవకాశం ఉంది. అందువలన సంసార జీవితంలో కలతలు వస్తాయి. కంటి, వెన్నముక సమస్యలు ఉంటాయి. విద్యాసంస్థలలో పనిచేస్తారు. పై అధికారుల వలన సమస్యలు ఉంటాయి. వీరికి స్నేహితులు ఎక్కువగా ఉండరు.

# 6వ భాగం

# సంఖ్యల్లో సుఖ జీవనం

# సఖ్యత - సహజీవనం

**దంపతుల యొక్క జన్మదినం, నామ సంఖ్యలు బట్టి ఆ దంపతుల యొక్క సఖ్యత, సహజీవనం ఎలా ఉంటుందో తెలుసుకోవచ్చు.**
**దంపతులలో ఒకరి జన్మ తేదీలో లేని సంఖ్యలు, రెండవ వారిలో ఉంటే, వాటి ప్రభావం, ఆ సంఖ్యలు లేని వారిపై పాజిటివ్ ప్రభావాన్ని కలిగిస్తాయి.**

వ్యక్తుల యొక్క వ్యక్తిత్వాన్ని, గమ్యాన్ని, లక్షణాలని, మొదలైన వాటిని మనం న్యూమరాలజీతో అంచనా వేయవచ్చు. ఇంకో ఆసక్తికరమైన విషయం కూడా న్యూమరాలజీ ద్వారా తెలుసుకునే అవకాశం ఉంది. అదే దంపతుల మధ్య, సఖ్యత, సహజీవన భావం. దంపతుల మధ్య సంబంధ బాంధవ్యాలు, వారిద్దరి మధ్య ఉండే ప్రేమ, నమ్మకం మీద ఆధారపడి ఉంటాయి. కొందరిలో కొద్ది ప్రయత్నంతో ఈ బంధాలు బలపడతాయి. మరికొందరి విషయంలో దీని కోసం గట్టిప్రయత్నాలు చేయాల్సి ఉంటుంది. ఈ ప్రయత్నం కూడా దంపతులలో ఒకరు మాత్రమే సాధారణంగా చేస్తుంటారు. ఇరువురు కలిసి చేస్తే, గృహమే కదా స్వర్గసీమ!

న్యూమరాలజీలో సహజీవన సూచిక ద్వారా, ఎవరితో సహజీవనం బాగా ఉంటుందో తెలుసుకొని దాని ప్రకారం వివాహం చేసుకోవచ్చు. ఈ సహజీవన సూచిక గురించి మూడు విధాలుగా తెలుసుకోవచ్చు.

1. స్త్రీ, పురుషుల జన్మతేదీలు పరిశీలించి, అందులో ఒకరి జన్మతేదీలో లేని సంఖ్యలు, రెండవ వారి జన్మతేదీలో ఉన్నాయా అని చూడాలి.
2. ఇద్దరి డెస్టినీ నెంబర్లు సఖ్యత కలిగి ఉన్నయా అని చూడాలి.
3. ఇద్దరి వ్యక్తిగత సంవత్సర సంఖ్యలు సఖ్యత కలిగి ఉన్నాయా అన్న విషయం కూడా చూడాలి.

ఇపుడు మనం ఇద్దరి దంపతుల సహజీవన సూచిక తెలుసుకుందాం. రామకృష్ణ జన్మదినం 12-7-1975, లావణ్య జన్మదినం 27-6-1984 అనుకుందాం. ఇద్దరి జన్మదినంలో 1,2,7,9 సంఖ్యలు ఉన్నాయి. రామకృష్ణకు 1 రెండుసార్లు, లావణ్యకు 1 ఒకసారి వచ్చింది. ఇలా సంఖ్యలు ఎక్కువ, తక్కువ అనే దాని వల్ల చెప్పుకోదగ్గ ప్రభావం

ఉండదు. లేని సంఖ్యలు చూడాలి. రామకృష్ణకి 8 సంఖ్య లేదు. లావణ్య యొక్క 8, రామకృష్ణకి కొత్త శక్తిని ఇస్తుంది. అలాగే లావణ్యలో ఉన్న 6, ప్రేమభావాన్ని రామకృష్ణలో కలిగిస్తుంది. లావణ్య జన్మతేదీలో లేని 5, రామకృష్ణ జన్మతేదీలో ఉంది. ఈ సంఖ్య లావణ్యలో లోపించిన శక్తిని ఉత్తేజితం చేస్తుంది. ఇలా ఒకరిలో లేని సంఖ్యలు, ఇంకొకరిలో ఉంటే, ఆ సంఖ్యల పాజిటివ్ ప్రభావం లేని వారిపై పడుతుంది.

ఇపుడు విధి సంఖ్య గురించి తెలుసుకుందాం

రామకృష్ణ విధి సంఖ్య = 12-7-1975 = 32 = 5

లావణ్య విధి సంఖ్య = 27-6-1984 = 37 = 1

| | | |
|---|---|---|
| రామకృష్ణ బర్త్ నెంబరు | - | 3 |
| లావణ్య బర్త్ నెంబరు | - | 9 |

ఈ రెండింటికీ సఖ్యత ఉంది. అలాగే

| | | |
|---|---|---|
| రామకృష్ణ డెస్టినీ నెంబరు | - | 5 |
| లావణ్య డెస్టినీ నెంబరు | - | 1 |

ఈ రెండింటికీ కూడా సఖ్యత ఉంది. భార్యాభర్తల బర్త్‌నెంబర్లు, డెస్టినీ నెంబర్లకి సఖ్యత ఉంటే వారి సహజీవనం బాగుంటుంది. ఈ విధంగా విధి సంఖ్యను అనుసరించి సహజీవన భావం తెలుసుకోవటం, అందులో కేవలం ఒక భాగం మాత్రమే, పూర్తి ప్రభావం, 3 పద్ధతులలో తెలుసుకోవాలి.

ఇపుడు వ్యక్తిగత సంవత్సర సంఖ్యలు గురించి తెలుసుకుందాం. రామకృష్ణ వ్యక్తిగత సంవత్సర సంఖ్య 2012లో 12-7-2012 = 15 = 6. లావణ్య వ్యక్తిగత సంవత్సర సంఖ్య 2012లో 27-6-2012= 20=2

2,6, వ్యక్తిగత సంవత్సర సంఖ్యలు రెండూ కూడా శృంగార ప్రేమ భావాలను కలిగిస్తాయి. దాని వలన 2012 సంవత్సరం, రామకృష్ణకి, లావణ్యకి మధ్య సహజీవనం బాగుంటుంది.

ఇలా కాకుండా వ్యక్తిగత సంవత్సర సంఖ్యలు విరుద్ధ భావాలు కలిగి ఉన్నపుడు సహజీవనం కొంచెం ఇబ్బందికరంగా, ఆ సంవత్సరంలో ఉంటుంది. ఉదాహరణకు వ్యక్తిగత సంవత్సర సంఖ్యలు 3,4 దంపతులకు వచ్చాయనుకుందాం. అపుడు 3 కలవారు, ఆనందంగా టైంపాస్ చేయాలనుకుంటారు. 4 కలవారు కష్టపడి పనిచేయాలనుకుంటారు.

పొంతన కుదరదు. ఇద్దరికి ఒకే వ్యక్తిగత సంవత్సర సంఖ్య వస్తే అది చాలా మంచి కాంబినేషన్. దంపతుల వ్యక్తిగత సంవత్సర సంఖ్యల మధ్య తేడా '1' రాకుండా ఉంటే మంచిది.

కొన్ని జంటల జన్మతేదీలు కొంచెం చిత్రంగా ఉండవచ్చు. భర్త జన్మతేదీ 5-6-1960, భార్య జన్మతేదీ 28-5-1967, అయినపుడు, భర్త జన్మతేదీలలో సంఖ్యలు అన్ని భార్య జన్మతేదీలో ఉన్నాయి. కానీ భార్య జన్మతేదీలోని 2,7,8 సంఖ్యలు భర్తకు లేవు దానివలన ఆ సంఖ్యల పాజిటివ్ ఎనర్జీ భర్తకు లభిస్తుంది కానీ భార్యకు భర్త వలన ఏమీ లభించదు. దీని వలన ఆ భార్య ఏదో కోల్పోయానన్న భావంలో ఉంటుంది. అందువలన ఒకరిలో లేని సంఖ్యలు ఇంకొకరిలో ఉండే జన్మతేదీలు గల భార్య భర్తలకు మంచి ఫలితాలు కలుగుతాయి. సమతుల్యత లేని జన్మతేదీల వలన ఆ దంపతులకు ప్రయోజనం ఉండదు. పైన చెప్పిన భార్య యొక్క విధిసంఖ్య 2, భర్తవిధి సంఖ్య 9, అవుతుంది. అందువలన భార్య సంబంధ బాంధవ్యాల కంటే తాను సొంతంగా ఉండటంలో ఆనందం పొందుతుంది. భర్త మంచి సహృదయం కలవాడు. పరోపకారిగా ఉంటూ, ఇంటి విషయాలకంటే, సమాజంలో మిగతా వ్యక్తుల సేవలో ఎక్కువగా కాలం గడుపుతాడు. దాని వలన భార్య నిరాశకు గురవుతుంది.

భార్యా భర్తల నామసంఖ్యలను పరిశీలించి, వారి మధ్య సఖ్యత, సహజీవనం అంచనావేయటం పాశ్చాత్య పద్ధతిలో చేస్తారు. వ్యక్తుల యొక్క నామసంఖ్యలు 3 విధాలుగా ఉంటాయి.

1. పేరులో ఉన్న అచ్చుల అక్షర సంఖ్యలు కలుపగా వచ్చేది మోటివేషన్ నెంబరు
2. పేరులో ఉన్న హల్లుల అక్షర సంఖ్యలు కలుపగా వచ్చేది ఇంప్రెషన్ నెంబరు
3. పేరులో ఉన్న అక్షరాలన్నీ (అచ్చులు, హల్లులు కలిపి) కలుపగా వచ్చే సంఖ్య ఎక్స్‌ప్రెషన్ నెంబరు.

దంపతుల మధ్య సఖ్యత, సహజీవనం అంశాలపై వారి నామసంఖ్యలో గల మోటివేషన్ నెంబరు, ఎక్స్‌ప్రేషన్ నెంబరు కీలక పాత్ర వహిస్తాయి.

ఇపుడు ఉదాహరణకు రామకృష్ణ, లావణ్యల సహజీవనం తెలుసుకుందాం.

R A M A K R I S H N A

2 1 4 1 2 2 1 3 5 5 1 = 27 = 9

మోటివేషన్ నెంబరు (అచ్చులు కూడగా వచ్చినది) = 4

LAVANYA

3 1 6 1 5 1 1 = 18 = 9

మోటివేషన్ నెంబరు (అచ్చులు మరియుY యొక్క సంఖ్య కలపగా వచ్చినది)=4

Note : 'y' అక్షరం ప్రక్కన అచ్చువచ్చినపుడు y ని కూడా అచ్చుగానే తీసుకోవాలి.

రామకృష్ణ జన్మదినం = 12- 7-1975

డెస్టినీ నెంబరు = 32 = 5

జన్మసంఖ్య = 12 = 3

లావణ్య జన్మదినం = 27-6-1984

డెస్టినీ నంబరు = 37 = 10 = 1

జన్మసంఖ్య = 27 = 9

| | **రామకృష్ణ** - | **లావణ్య** |
|---|---|---|
| డెస్టినీ నెంబరు | 5 | 1 |
| జన్మసంఖ్య | 3 | 9 |
| ఎక్స్‌ప్రెషన్ నెంబరు | 9 | 9 |
| మోటివేషన్ నెంబరు | 4 | 4 |

పై దంపతుల ఇద్దరి సంఖ్యలలో కనీసం రెండు కామన్ సంఖ్యలు ఉంటే వారి సహజీవనం బాగుంటుంది. ఇపుడు రామకృష్ణకు, లావణ్యకు కామన్‌గా 9, 4 సంఖ్యలు ఉన్నాయి. కాబట్టి వీరి సహజీవనం బాగుంటుంది.

జీవితంలో కొందరు వ్యక్తులు, వారి భాగస్వాముల పట్ల ఎందుకంత ఆకర్షణ కలిగి ఉంటారో అన్నది ఎవరికి తెలియదు. నా మనవి ఏమనగా దంపతుల సఖ్యత కోసం న్యూమరాలజీతో పాటు, జ్యోతిష్యం యొక్క సహయం కూడా తీసుకోవాల్సి ఉంది.

# వివాహ ముహూర్తాలు

మానవ జీవితంలో వివాహం ఒక అపురూప సంఘటన. ఈ సృష్టిలో ఉన్న జీవరాశులన్నింటిలో "వివాహం" అనేది మానవ జాతిలో మాత్రమే ఉంది. మనదేశంలో వివాహం అనేది 90% వరకు జీవితంలో ఒకసారే జరుగుతుంది. కాబట్టి ఈ వివాహ దినానికి అంత ప్రాముఖ్యత ఉంది. మనిషి జీవితంలో పుట్టిన తేదీ, డెస్టినీ నంబరు ఎంత ముఖ్యమైనవో అలాగే వివాహ తేదీ కూడా అంత ముఖ్యమైనది.

వేర్వేరు చోట్ల, వేర్వేరు వాతావరణాలలో పుట్టి పెరిగిన స్త్రీ, పురుషులిద్దరు ఈ వివాహం వలన ఒకటిగా మారతారు. వివాహ తేదీ నుంచి కొత్త జీవితాన్ని ప్రారంభిస్తారు. కాబట్టి దీనిని 'మరో జన్మదినం'గా చెప్పుకోవచ్చు.

చాలా మంది దంపతులు, వారి జన్మదిన తేదీలు తెలియనివారుగా ఉంటారు. కానీ వివాహ తేదీ తెలియని వారు ఎవరూ ఉండరు. దంపతుల యొక్క వృత్తి, ఉద్యోగం, సంపద, ఆరోగ్యం, కుటుంబ వృద్ధి, పదవులు, కీర్తి ప్రతిష్ఠలు, కోర్టు కేసులు, కుటుంబ కలహాలు, భార్యాభర్తలు, వృత్తిరీత్యా వేర్వేరు ప్రాంతాల్లో గడపడం మొదలైన అంశాలు, ఈ వివాహ తేదీపైనే ఆధారపడి ఉంటాయి.

కొంతమంది దంపతులు, కుటుంబ గౌరవం కోసం, పిల్లల కోసం భార్యాభర్తలుగా గడుపుతుంటారు కానీ వారి మధ్య ఎలాంటి ప్రేమానురాగాలు, సత్సంబంధాలు ఉండకపోవటం నేను చాలా సందర్భాలలో చూశాను. కొందరైతే పెండ్లి మండపంలోనే గొడవలు పడడం చూస్తున్నాం. మరికొంతమందిలో పెండ్లి జరిగిన కొద్దికాలానికే దంపతులలో ఒకరు అకాల మరణం పొందటం కాని ప్రమాదంలో చిక్కుకోవడం గాని చూస్తుంటాం. ఇలా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారి వివాహదినాలను పరిశీలిస్తే వధూవరుల పుట్టిన తేదీలకు సఖ్యత లేని, శత్రు సంఖ్యలు గల దినాలలో వారి వివాహం జరిగినట్లుగా పరిశీలనలో తెలుస్తుంది.

హిందూ సంప్రదాయం ప్రకారం వధూవరుల నామనక్షత్రం ప్రకారం ముహూర్తాన్ని నిర్ణయిస్తారు. ఇది పూర్వకాలం నుంచీ వస్తున్న సంప్రదాయం. మనం దీనిని అంగీకరించవలసిందే. అయినా మంచి ముహూర్తంలో పెండ్లి చేసుకున్న వారు కూడా

చాలా మంది రకరకాలుగా బాధపడటం మనం చూస్తున్నాం. దీనికి ముఖ్య కారణం, వధూవరులలో పొంతన ఉన్నప్పటికీ, వారి పుట్టిన తేదీలలో విరోధ సంఖ్యలు ఉండటం, ఇంకా వివాహతేదీ, వారి పుట్టిన తేదీలకు అనుకూలం కాని తేదీగా ఉండటం వలన ఇటువంటి ఇక్కట్లు కలగటం జరుగుతుంది. పెండ్లికి ముందు, అమ్మాయిలు, అబ్బాయిలు, వారి వివాహం గురించి ఎన్నో కలలు కంటారు. వారి కొత్త జీవితం, ఆనందమయంగా ఉండాలని కోరుకుంటారు. కానీ దురదృష్టకరమైన తేదీలో వివాహం చేసుకుని ఆ తరువాత దుర్భర జీవితం గడుపుతారు.

అందువలన పండితులు, సిద్ధాంతులు, వివాహ ముహూర్తంతో పాటుగా న్యూమరాలజీ ప్రకారం కూడా వధూవరులకు అనుకూలమైన వివాహతేదీలు నిర్ణయిస్తారనే భావనతో నేను ఆంధ్రదేశంలో చాలా ప్రాంతాలలో న్యూమరాలజీలో శిక్షణా తరగతులు నిర్వహించాను. ఇదివరకైతే వివాహాలు, న్యూమరాలజీపై అవగాహన లేక, వారి పెద్దలు కుదిర్చిన ముహూర్తాలలో జరిపించటం అనేది ఉండేది. కానీ ఇప్పుడు న్యూమరాలజీ అందరికి అందుబాటులోకి వచ్చింది. కాబట్టి ఇకముందు వివాహం అనేది ముహూర్తంతో పాటుగా, వధూవరుల పుట్టిన తేదీలకు సఖ్యత కలిగిన తేదీలలో వివాహం జరిపించటం అభిలషణీయం.సంఖ్యాశాస్త్రం ప్రకారం వివాహానికి 4,5,7,8 సంఖ్యలు మంచివి కావు. అది ఏ విధంగా ఉంటుందో ఇపుడు తెలుసుకుందాం.

4,13,22,31 తేదీలు వివాహానికి మంచికావు. వివాహ తేదీ 4, వివాహతేదీ మొత్తం సంఖ్య (డెస్టినీ నెంబరు) 4 గా ఉన్న తేదీలలో వివాహం జరిపించకపోవటం మంచిది. పై తేదీలలో వివాహం జరిగిన దంపతులు అకారణంగా పోట్లాడుకోవటం, స్పర్థల కారణంగా, విడాకుల కోసం కోర్టులకు వెళ్ళటం లాంటివి జరుగుతాయి. అందువలన 4,13,22,31 తేదీలు, ఆ తేదీల యొక్క డెస్టినీ నెంబరు 4 వచ్చినట్లయితే అవి వివాహానికి మంచివి కాదు. ఈ తేదీలలో వివాహం అయిన వారు చింతించకుండా ఈ అధ్యాయం చివరన ఇచ్చిన రెమెడీని పాటిస్తే మంచిది.

5,14,23 తేదీలు మరియు ఆ తేదీ యొక్క మొత్తం సంఖ్య (డెస్టినీ నెంబరు) 5 వస్తే, ఆ తేదీలలో వివాహం మంచిది కాదు. అంటే వివాహ తేదీ మొత్తం సంఖ్య 5,14,23,32,41,50 ఉన్నట్లయితే, ఆ వివాహం జరిగిన దంపతులు ఏదైనా కారణం

వలన వేరువేరుగా ఉండాల్సిన పరిస్థితి వస్తుంది. ఉద్యోగ రీత్యా వేరువేరు ప్రదేశాలలో ఉండటం, పిల్లల చదువుకోసం వేరుగా ఉండటం లాంటివి జరుగుతాయి. దీని వలన వీరు కుటుంబ జీవితాన్ని సంపూర్ణంగా ఎంజాయ్ చేయలేరు. ఈ తేదీల్లో వివాహం జరిగిన వారు అధ్యాయం చివరన ఇచ్చిన రెమెడీని పాటించాలి.

7,16,25 తేదీలలో కూడా వివాహం చేయకపోవటం మంచిది. ఈ తేదీల మొత్తం సంఖ్య (డెస్టినీ నెంబరు) 7 వస్తే కూడా పెళ్ళి చేస్తే వివాహం జరిగిన దంపతులు కుటుంబ జీవితం కంటే ఆధ్యాత్మిక జీవితంపై ఆసక్తి చూపిస్తారు. కానీ, 7,16,25 తేదీలలో జన్మించిన వారు మాత్రం ఈ రోజు వివాహం చేసుకోవచ్చు. ఇది వరకే ఈ తేదీలలో వివాహం అయిన వారు చివరన ఇచ్చిన రెమెడీ పాటించగలరు.

8,17,26 తేదీలలో వివాహం మంచిది కాదు. వివాహతేదీ యొక్క మొత్తం సంఖ్య (డెస్టినీ నెంబరు) 8 వస్తే వివాహం జరుపరాదు (మొత్తం సంఖ్య 17,26,35,44,53,62,71,80). ఇలా వివాహం జరిగిన వారి జీవితంలో అసంతృప్తి ఉండటం, అనుకున్నంత ఆదాయం, మనశ్శాంతి లేకపోవటం లాంటివి జరుగుతాయి. ఇది వరకే ఈ తేదీలలో వివాహం జరిగిన వారు, అధ్యాయం చివరన ఇచ్చిన రెమెడీని పాటించాలి.

వివాహం అనేది మన జీవితంలో ఒక మరుపురాని మధుర సంఘటన అలాంటి దాని కోసం సమయం లేదనీ, ఆదరాబాదరాగా వివాహం జరిపించటం అంత మంచిది కాదు. వధూవరులు వివాహ జీవిత మాధుర్యాన్ని చవి చూడాలంటే, మంచి ముహూర్తంతో పాటుగా, మంచి తేదీల కోసం, కొంచెం ఆలస్యం అయినా సరే, వేచి ఉండి వివాహం చేయటం మంచిది. అబ్బాయి అమెరికా వెళ్ళిపోవాలి, సమయం లేదు, వెంటనే పెళ్ళి చేయాలి అని చేస్తే, తరువాత చింతించాల్సి వుంటుంది. స్త్రీ పురుషులపై వారి జన్మదినం ఏ విధంగా ప్రభావం చూపుతుందో, దంపతులయ్యాక వారి వివాహతేదీ కూడా అలాంటి ప్రభావాన్నే చూపుతుంది. ఎందుకంటే న్యూమరాలజీ ప్రకారం, వివాహతేదీని అనుసరించి దంపతుల భవిష్యత్తును ఖచ్చితంగా చెప్పవచ్చు.

అందువలన 4,5,7,8,13,14,16,17,22,23,25,26,31 తేదీలలో వివాహం జరిపించకుండా ఉంటే మంచిది.

**కానీ, ఇదివరకే, పై తేదీలలో వివాహం జరిగిన వారు ఏం చేయ్యాలి అంటే**

1. శ్రీశైల క్షేత్రంలో గానీ, వారికి అందుబాటులో ఉన్న ఏ పుణ్యక్షేత్రంలో అయిన గానీ, "పార్వతీ కళ్యాణం" జరిపించాలి. దీనినే "శివ కళ్యాణం", "శాంతి కళ్యాణం" అని వివిధ క్షేత్రాల్లో వివిధ రకాలుగా చేస్తుంటారు. అంతే కాక ప్రతీ సంవత్సరం వచ్చే, "మహాశివరాత్రి" పర్వదినాన "పార్వతీ కళ్యాణం" జరిపించటం వలన దంపతుల మధ్య వివాదాలు సమసిపోయి సఖ్యత పెరిగి, ఆర్థికాభివృద్ధి, సంతాన వృద్ధి జరుగుతుంది.

2. మంచి ముహూర్తంతో పాటుగా, వివాహతేదీలు, పెండ్లి రోజు యొక్క డెస్టినీ నెంబరు, తేదీ సంఖ్య, సఖ్యతతో ఉండేటట్లు చూసుకోవాలి. అలాగే వధూవరుల యొక్క పుట్టిన తేదీలు, వారి వివాహ తేదీతో సఖ్యతతో ఉండేట్లుగా చూసుకోవాలి. పై విధంగా కాకుండా, ఇదివరకే విరోధ సంఖ్యలతో వివాహం అయిన దంపతులు, వారి జన్మతేదీలకు, వివాహతేదీలకు అనుకూలంగా, నామ సంఖ్య ఉండేటట్లు పేరు మార్పు చేసుకోవాలి. దాని వలన ఆ దంపతులకు ఆరోగ్యవంతమైన సంతానం, సుఖ సంసారం, ధన ధాన్యాభివృద్ధి కలుగుతుంది.

# నిత్యజీవితంలో సంఖ్యలు

ప్రిడిక్టివ్ న్యూమరాలజీలో వ్యక్తిగత సంఖ్యలకు కూడా చాలా ప్రాముఖ్యత ఉంది. వ్యక్తిగత సంఖ్యలు అంటే, వ్యక్తి యొక్క ఇంటి నెంబరు, వాహన నెంబరు, మొబైల్ నెంబరు మొదలైనవి. ఈ సంఖ్యల యొక్క ప్రభావం కూడా ఆయా వస్తువుల యొక్క స్వంతదారులపై ప్రభావం చూపిస్తాయి. అది ఏ విధంగా ఉంటుందో తెలుసుకుందాం.

## ప్లాటు / సైటు నెంబరు

ఇంటి నెంబరు, ఆ ఇంటిలో నివసించే వ్యక్తుల గురించి ఏవిధమైన వివరణ ఇస్తుందో, అదేవిధంగా ఇంటి స్థలం నెంబర్, అంటే ప్లాటు / సైటు నెంబరు, ఇంటి నిర్మాణం, నిర్మాణ వ్యయం. ఇంటి యొక్క ఆకారం, వీటన్నింటిని తెలియచేస్తుంది. ఊదాహరణకు సైటు నెం. 16 అంటే 1+6=7. ఆ సైటు నెంబర్ 7 అవుతుంది. ఇపుడు 1 నుండి 9 వరకు సైటు / ప్లాటు యొక్క లక్షణాలు తెలుసుకుందాం.

### సైటు నెంబరు - 1

**సైటు నంబరు 1లో నిర్మాణంలో సమస్యలు రావు.**

ఈ నెంబరు గల స్థలం చాలా మంచిది. అనుకూలమైనది. స్థలం కొన్నపుడు, ఎటువంటి సమస్యలు రావు. నిర్మాణ సమయంలో కూడా ఎలాంటి ఆటంకాలు గాని ఆర్థిక ఇబ్బందులు గాని రావు. ఇల్లు చాలా విశాలంగా ఉండి గాలి వెలుతురు బాగా వచ్చేటట్లు ఉంటుంది. నిర్మాణ సమయంలో బిల్డర్‌తో ఎటువంటి సమస్యలు రావు.

### సైటు నెంబరు - 2

**సైటు నంబరు 2 హఠాత్తుగా కొనటం జరుగుతుంది.**

ఈ నెంబరు గల సైటు చాలా మంచిది. ఈ స్థలం హఠాత్తుగా కొనడం జరుగుతుంది. ఈ స్థలంలో ఇంటి నిర్మాణం వేగంగా జరుగుతుంది. ఈ స్థలంలో ఇల్లు నిర్మించే వ్యక్తి,

దీనిని తన స్వంత వినియోగం కంటే, అద్దెకు ఇచ్చే అవకాశం ఉంది. నిర్మాణ ప్రారంభంలో ధనం తక్కువగా ఉన్నా, తరువాత ధనం అనుకోకుండా లభించి నిర్మాణం జరుగుతుంది.

## సైటు నెంబరు - 3

**సైటు నంబరు 3 ఆకారం సరిగా ఉండదు.**

ఈ నెంబరు గల స్థలం ఆకారం సరిగా ఉండదు. ఈ స్థలంలో నిర్మాణం వలన చాలా ధన వ్యయం, కాలాయాపన జరుగుతాయి. బిల్డర్‌తో కూడా సమస్యలు వస్తాయి. ఈ స్థలంలో నిర్మించిన ఇంటిలో నివసించే వారికి అనారోగ్య సమస్యలు వస్తాయి.

## సైటు నెంబరు - 4

**సైటు నంబరు 4లో నిర్మాణంలో ఎక్కువ ధన వ్యయం ఉండదు.**

ఇది చాలా మంచి స్థలం. ఇంటి నిర్మాణం బాగా జరిగి, చాలా అందమైన ఇల్లుగా రూపు దిద్దుకుంటుంది. అనవసర ధన వ్యయం జరగదు. నివాసానికి చాలా అనుకూలమైన ఇల్లు బిల్డరుతో కూడా ఎటువంటి సమస్యలు రావు.

## సైటు నెంబరు - 5

**సైటు నంబరు 5లో అందమైన ఇల్లు కట్టబడుతుంది.**

ఇది కూడా చాలా మంచి స్థలం. ఇంటి నిర్మాణ సమయంలో అధిక, అనవసర, ధన వ్యయం జరగదు. చాలా చక్కని డిజైన్‌తో అందమైన ఇల్లు రూపుదిద్దుకుంటుంది.

## సైటు నెంబరు - 6

**సైటు నంబరు 6లో నిర్మాణం ప్రారంభంలో ధనం లేకపోవటం, బిల్డరుతో గొడవలు లాంటివి వస్తాయి.**

ఇది చాలా అదృష్టవంతమైన స్థలం. నిర్మాణ ప్రారంభంలో ధనం లేకపోయినా,

తరువాత ధనం సమకూర్చబడి చక్కని ఇంటి నిర్మాణం జరుగుతుంది. ధన వ్యయం అధికంగా ఉంటుంది. బిల్డర్‌తో సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. ఇల్లు చిన్నదిగా ఉన్నా, చూడటానికి విశాలంగా ఉంటుంది. నిర్మాణం తరువాత, కొంత కాలం వరకు ఆర్థిక సమస్యలు ఉంటాయి.

## సైటు నెంబరు - 7

**సైటు నంబరు 7లో నిర్మాణం సమస్యలు కలిగిస్తుంది.**

ఈ స్థలం కొంత సమస్యలు కలిగిస్తుంది. స్థలం కొనుగోలు ఆలస్యం అవుతుంది. నిర్మాణ ప్రారంభం కూడా ఆలస్యమవుతుంది.

## సైటు నెంబరు - 8

**సైటు నంబరు 8లో కూడా సమస్యలు ఉంటాయి.**

ఈ స్థలం కూడా కొన్ని సమస్యలు కలిగిస్తుంది. స్థలం కొనుగోలు సమయంలో, ఇంటి నిర్మాణ సమయంలో ఆర్థిక సమస్యలు వస్తాయి. నిర్మాణం తరువాత కొంతకాలం వరకు ఈ ఆర్థిక సమస్యలు ఉంటాయి.

## సైటు నెంబరు - 9

**సైటు నంబరు 9లో మొదట్లో సమస్యలు వచ్చినా తరువాత శుభకార్యాలు జరుగుతాయి.**

ఇది మంచి స్థలం. కొనుగోలు, నిర్మాణ సమయాల్లో సమస్యలు వచ్చినా, నిర్మాణం జరిగిన తరువాత ఈ ఇంట్లో చాలా శుభకార్యాలు జరుగుతాయి. ఈ ఇంటికి మంచినీటి సరఫరా ఉంటుంది. బర్త్‌నెంబరు, లేదా డెస్టినీ నెంబరుతో సమానమైన నంబరు గల ప్లాటు / సైటు నెంబరు ఉంటే కలిసి వస్తుంది. లేదా వ్యక్తిగత సంఖ్యలు అనే అధ్యాయంలో ఇచ్చిన బర్త్‌నెంబరు, డెస్టినీ నెంబరు కి సఖ్యత గల సంఖ్యలు ఇవ్వటం జరిగింది అటువంటి నెంబరు ఉన్నా ఫరవాలేదు.

# ఇంటి నెంబరు

**ఇంటి యొక్క నంబరు కూడా ఆ ఇంటిలో నివసించే వారిపై, సొంత వారైనా, అద్దెకున్న వారైనా సరే ప్రభావం చూపిస్తుంది.**

ఒక వ్యక్తి జీవితంలో "ఇల్లు" అనేది ఎంత విలువైనదో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. సొంత ఇంటి కోసం మనం అందరం ఎంత తహతహలాడతామో తెలిసినదే. పక్షులు, జంతువులు కూడా వాటి వాటి సొంత నివాసాలు ఏర్పరచుకుంటాయి. అలాంటిది బుద్ధి జీవి అయిన మనిషికి ఇల్లు–స్వర్గసీమ.

అటువంటి ఇంటిపై, ఆ ఇంట్లో నివాసం ఉన్న వ్యక్తులపై, ఆ ఇంటి సంఖ్య ప్రభావం ఎంతో ఉంటుంది. అద్దె ఇంట్లో ఉన్నా ఆ ప్రభావం ఉంటుంది. ఇంటి నెంబరు గణించినపుడు ఆ ఇంటి చిరునామాలో ఇంటి నెంబరు మాత్రమే తీసుకోవాలి.

ఉదాహరణకు, 16, Akbar Road, New Delhi.
ఇంటి నంబరు 16 అవుతుంది. 16 = 1+6=7

ఇపుడు ఇంటి సంఖ్య 7 అవుతుంది. ఈ విధంగా ఇంటి నెంబర్లు కూడా 1 నుండి 9 వరకు ఉంటాయి. ఇపుడు వాటి గురించి విడివిడిగా తెలుసుకుందాం.

**ఉదాహరణకు:** ఇంటి నంబరు 8–3–825/5/3/6/3 ఉంటే
ఇంటి నంబరు 8+3+8+2+5+5+3+6+3 = 43
ఇంటి నంబరు = 43 అంటే 7 అవుతుంది.

కొన్నిసార్లు ఇంటి నంబరు, ప్లాట్ నంబరు రెండు ఉంటే అప్పుడు ప్లాట్ నంబరుని ఓనర్ యొక్క బర్త్ డేట్‌కి సఖ్యత చూసుకొని ఇంటి నంబరులో 'ఎ', 'బి' వంటి వాటిని చేర్చి సరిచేసుకోవచ్చు. ముఖ్యంగా ఇంటి నంబరు కన్నా ప్లాట్ నంబరు ముఖ్యమని పాఠకులు గుర్తించాలి.

## ఇంటి నెంబరు - 1

**ఇంటి నంబరు 1లో ఉన్నవారు విద్యావంతులు, క్రమశిక్షణ కలిగిన వారు నాయకులుగా ఉంటారు.**

ఇందులో నివాసం ఉన్నవారు మంచి విద్యావంతులు, క్రమశిక్షణ కలిగిన వారుగా ఉంటారు. విందు వినోదాలలో పాల్గొంటుంటారు. నాయకులుగా, సంస్థల అధిపతులుగా, గొప్ప మేధావులుగా ఉంటారు. ఈ ఇంటి సంఖ్య అభివృద్ధికి ఎంతో దోహదకారిగా ఉంటుంది. వ్యతిరేక ప్రభావం విషయానికి వస్తే, కుటుంబ సభ్యుల మధ్య "అహం" చోటు చేసుకుంటే మానసిక ప్రశాంతత లోపిస్తుంది.

## ఇంటి నెంబరు - 2

**ఇంటి నెంబరు 2లో ఉన్నవారు సహకార గుణం కలిగి ఉంటారు.**

ఈ సంఖ్య ఉన్న ఇంటిలో, సహాయ సహకారాలు, పరస్పర భావాలను గౌరవించటం, మొదలైన మంచి లక్షణాలు ఉన్నవారు నివసిస్తారు. వారు ఎంతో సాధారణ జీవితం గడుపుతూ, గొప్ప దైవభక్తి కలిగి, ఆధ్యాత్మికత కలిగి ఉంటారు. ఇంటిలోని వ్యక్తులు, వివిధ రకాలు ఉద్యోగ, వృత్తులు చేస్తుంటారు. ప్రయాణాలు చేస్తుంటారు. ఇక వ్యతిరేక ప్రభావం చూస్తే, ఇంటిని శుభ్రంగా ఉంచరు. తగాదాలు వస్తుంటాయి. వాటిని అరికట్టగలిగితే ప్రేమ, వాత్సల్యం, అతిధి సత్కారాలు వంటివి ఈ ఇంటిలో చోటుచేసుకుంటాయి.

## ఇంటి నెంబరు - 3

**ఇంటి నంబరు 3లో ఉన్నవారు కళాకారులుగా ఉంటారు.**

ఈ సంఖ్య గల ఇంటిలో ఉన్నవారు కళాకారులుగా, సృజనాత్మకత, విశాల హృదయం ఉన్నవారుగా ఉంటారు. ప్రేమ, శృంగారం, ఆనందం ఎపుడు వీరికి ఉంటాయి. మంచి ఆదాయం కలిగి ఉంటారు. మంచి ఉద్యోగం చేస్తారు. ఇక వ్యతిరేక ప్రభావం

చూస్తే, అనారోగ్యం, అధిక ఖర్చులు చేయటం, అందరికి ఉచిత సలహాలు ఇవ్వటం లాంటివి జరగవచ్చు.

## ఇంటి నెంబరు - 4

**ఇంటి నంబరు 4లో ఉన్నవారు పొదుపరులు.**

ఈ సంఖ్య గల ఇంటిలో ఉన్నవారు పొదుపరులుగా ఉండి ధనం బాగా కూడబెడతారు. చుట్టు ప్రక్కల వారితో మంచి సంబంధాలు కలిగి ఉంటారు. ధైర్య సాహసాలు, ఆత్మబలంతో మంచి, ప్లానింగ్‌తో విజయాలు సాధిస్తారు. ఇక నెగిటివ్ ప్రభావం చూస్తే, వీరు బిజినెస్ మైండెడ్‌గా ఉంటారు. ఇతరులకు సాయం చేయటానికి సంకోచిస్తారు. ఈ ఇంటిలో స్త్రీలకు స్వేచ్ఛ ఎక్కువగా ఉంటుంది.

## ఇంటి నెంబరు - 5

**ఇంటి నంబరు 5లో ఉన్నవారు రెండు రకాలు ఉద్యోగం, వ్యాపారం చేస్తారు.**

ఈ సంఖ్య గల ఇల్లు చాలా మంచిది. ఇందులో ఉన్నవారు మంచి మనసు కలవారై, అతిథి మర్యాదలు పాటించే వారై ఉంటారు. రెండురకాల ఉద్యోగ వ్యాపారాలు చేస్తుంటారు. మంచి సుఖజీవితం గడుపుతారు. ఆర్థిక, విద్యా సంస్థలలో అధికారులుగా పనిచేస్తారు. వీరి ఇల్లు ఎపుడూ అతిథులతో స్నేహితులతో సందడిగా ఉంటుంది. ఆర్థికంగా ఎటువంటి లోటు ఉండదు. ఈ ఇంటిలో నివసించే వారు ఎంతో అభివృద్ధి సాధిస్తారు. ఇక వ్యతిరేక ప్రభావం అయితే, స్వార్థం, కరుకుదనం, కరుకుగా మాటలాడటం, అలసట, మొదలైనవి ఉంటాయి. వాటిని తొలగించుకుంటే, ఈ ఇల్లు నిజంగా స్వర్గసీమ.

## ఇంటి నెంబరు - 6

**ఇంటి నంబరు 6లో ఉన్నవారు ప్రేమ, వాత్సల్యం కలిగి ఉంటారు.**

ఈ సంఖ్యగల ఇల్లు కూడా చాలా అద్భుతమైనది. ఈ ఇంటిలో ఉన్న వారు,

ప్రేమ, వాత్సల్యం, సంప్రదాయ జీవనం కలిగి ఎంతో బాధ్యతాయుతంగా ఉంటారు. బంధువులతో స్నేహితులతో మంచి సంబంధాలు కలిగి ఉంటారు. మానవత్వం కలిగి ఉంటారు. చక్కగా, తియ్యగా మాట్లాడుతారు. వీరికి వాహన సౌఖ్యం ఉంటుంది. ప్రజా సంక్షేమ కార్యక్రమాలలో పాల్గొంటారు.

రోగాలు, ఒత్తిడి, వీరిదరికి చేరవు. మంచి సంపన్నులు, ఉమ్మడి కుటుంబాలు ఇటువంటి ఇళ్ళలో ఉంటారు. ఇక వ్యతిరేక ప్రభావం అధిక బాధ్యతలు నెత్తిన వేసుకోవటం వలన చిన్న చిన్న సుఖాలకు ఆనందాలకు దూరం కావాల్సి వస్తుంది. కుటుంబ సభ్యుల మధ్య 'అహం' భావం రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

## ఇంటి నెంబరు – 7

**ఇంటి నంబరు 7లో ఉన్నవారు ఆధ్యాత్మికత కలిగి ఉంటారు.**

ఈ సంఖ్య గల ఇంటిలో నివసించే వారు చాలా ప్రత్యేకంగా ఉంటారు. భౌతిక సుఖాలపై ఆసక్తి తక్కువగా ఉండి ఆధ్యాత్మికత, ఆత్మజ్ఞానం, విద్య మొదలైన వాటి యందు ఆసక్తి కలిగి ఉంటారు. ఆర్థిక సమస్యలు ఉండవు. ఈ ఇంటిలోని పిల్లలు చక్కగా చదువుకొని ఉన్నత విద్యను అభ్యసిస్తారు. ఈ ఇంటి వాతావరణం ఆధ్యాత్మిక అనుభూతిని కలిగిస్తుంది. గొప్ప గురువులు, వేదాంతులు, ఆధ్యాత్మిక గురువులు ఉండదగ్గ ఇల్లు. ఇక వ్యతిరేక ప్రభావానికి వస్తే, భౌతిక సుఖాల వైపు ఎవరైనా ఆసక్తి చూపితే వారు ఈ ఇంటిలో ఎక్కువ కాలం ఉండలేరు.

## ఇంటి నెంబరు – 8

**ఇంటి నంబరు 8లో ఉన్నవారు న్యాయమూర్తులు, న్యాయకోవిదులుగా ఉంటారు.**

ఈ సంఖ్య గల ఇంటిలో గొప్ప వ్యాపారవేత్తలు, న్యాయమూర్తులు, న్యాయ కోవిదులు, నిర్మాణ రంగ నిపుణులు ఉంటే చక్కని అభివృద్ధి సాధిస్తారు. చాలా కష్టించి పని చేసి ఉన్నతిని సాధించగలుగుతారు. మంచి గౌరవప్రదమైన వ్యక్తులు ఉండేదగ్గ ఇల్లు. ఈ ఇంటిలో స్త్రీల ఆధిపత్యం ఉంటుంది. ఈ ఇంటిలోని వారు ఆధ్యాత్మికతను

కూడా కలిగి ఉంటారు. ఇక వ్యతిరేక ప్రభావానికి వస్తే, అతి క్రమశిక్షణ వలన చిన్న చిన్న ఆనందాలు కోల్పోవలసి రావచ్చు. దాని వలన ప్రేమ, వాత్సల్యం కంటే, హంగూ, ఆర్భాటం మాత్రమే కనిపిస్తాయి.

## ఇంటినెంబరు - 9

**ఇంటి నంబరు 9లో ఉన్నవారు సమాజసేవ చేస్తారు.**

మానవతావాదులు, సామాజిక సేవాపరులు ఉండదగిన నివాసం ఇది. ఈ ఇంటిలో పిల్లలు కళాకారులుగా, సృజనాత్మకపరులుగా ఉంటారు. పెద్దలు, తత్వవేత్తలుగా, మానవాతా వాదులుగా, సమాజ సేవా తత్పరులుగా ఉంటారు. రచయితలు, వక్తలు, రక్షణ శాఖకు చెందిన వారికి కూడా ఈ ఇల్లు అనుకూలం. కళలు, విజ్ఞాన శాస్త్రాలు ఈ ఇంటిలో వికసిస్తాయి. ప్రేమ, ఆదరం కలిగి ఉంటారు. ఇక వ్యతిరేక ప్రభావానికి వస్తే, మోసం, స్వార్థం చోటు చేసుకుంటాయి. ఒడిదుడుకులు వస్తుంటాయి. అగ్ని ప్రమాదాలు జరుగవచ్చు.

జన్మసంఖ్య, లేదా డెస్టినీ నెంబరు తో సమానమైన నంబరు గల ఇంటి నెంబరు ఉంటే కలిసి వస్తుంది. లేదా వ్యక్తిగత సంఖ్యలు అనే అధ్యాయంలో ఇచ్చిన బర్త్‌నెంబరుకి, డెస్టినీ నెంబరుకి, సఖ్యత ఉన్న సంఖ్యలు ఇవ్వటం జరిగింది. అటువంటి నెంబరు ఉన్నా ఫరవాలేదు.

# వాహన సంఖ్య (వెహికల్ నెంబర్)

ఈ ఆధునిక యుగంలో, మానవ జీవితంలో, వాహనానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. పొద్దున్న లేచిన దగ్గర నుండి మళ్ళీ రాత్రి నిద్రపోయే వరకు, నేడు మనం అంతా వాహనాల మీదే ఆధారపడుతున్నాం. స్కూలుకి, కాలేజికి, ఆఫీసుకి, బజారుకి, సినిమాకి, స్నేహితుల ఇళ్ళకు, ఎక్కడికి వెళ్ళలన్నా, వాహనమే మనకు శరణ్యం.

మన జీవితంలో అంత ప్రాముఖ్యత కలిగిన వాహనానికి కూడా నెంబరు ఉంటుంది. అది రిజిస్ట్రేషన్ నెంబరు. వాహన రిజిస్ట్రేషన్ నెంబర్ ఏ విధంగా ఉంటుందో మనందరికి తెలుసు ఉదాహరణకి AP29AT3142. ఇది ఒక రిజిస్ట్రేషన్ నెంబరు. ఈ నెంబరును రాష్ట్ర ట్రాన్స్‌పోర్టు అథారిటీ వారు జారీ చేస్తారు.

ఈ నెంబరులో అక్షరాలు, అంకెలు రెండూ ఉన్నాయి. అయితే వాహన సంఖ్యను తీసుకొన్నపుడు, చివరి నాలుగు సంఖ్యలనీ తీసుకోవాలి. పైన చెప్పిన నెంబరులో 3142 మాత్రమే వాహన సంఖ్యగా తీసుకోవాలి. 3+1+4+2 = 10 1+0 = 1. ఆ వాహన సంఖ్య –1 ఇపుడు మనం 1 నుండి 9 వరకు వాహన సంఖ్య గల వాహనాల భవిష్యత్తు తెలుసుకుందాం.

## వాహన సంఖ్య – 1

**వాహన సంఖ్య 1 ఉంటే ప్రమాదాలు జరుగవు.**

ఇది చాలా మంచి సంఖ్య. ఈ వాహనదారుడికి ప్రమాదాలు జరుగవు. అనవసర ప్రయాణాలు చేయరు. కాబట్టి ఈ నెంబరు వ్యాపార వాహనాలకు ఉంటే చాలా మంచిది.

## వాహన సంఖ్య – 2

**వాహన సంఖ్య 2 ఉంటే అనవసరంగా తిప్పుతారు.**

ఇది కూడా మంచి సంఖ్య, ప్రమాదాలు జరుగవు. కానీ, వాహనదారుడు వాహనాన్ని ఎక్కువగా, అనవసరంగా తిప్పుతారు. వ్యాపార వాహనాలకు ఈ సంఖ్య మంచిది.

## వాహన సంఖ్య – 3

**వాహన సంఖ్య 3 ఉంటే ప్రమాదాలు జరుగుతాయి.**

ఇది అంత మంచి సంఖ్య కాదు. ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. వాహన ముందు భాగానికి ప్రమాదాలు జరుగవచ్చు. వ్యాపార వాహనాలకు ఈ సంఖ్య మంచిది కాదు. 3, 12, 21, 30 తేదీల్లో జన్మించి, డెస్టినీ నంబరు 3 అయితే ఇది మంచిది.

## వాహన సంఖ్య – 4

**వాహన సంఖ్య 4 ఉంటే సొంతవారి దగ్గర ఎక్కువ కాలం ఉంటుంది.**

ఇది మంచి సంఖ్య. ప్రమాదాలు జరుగవు. ఈ వాహనం సొంతదారుడి దగ్గర ఎక్కువ కాలం ఉంటుంది. ఇది వ్యాపార వాహనాలకి అనుకూలమైన సంఖ్య. ఈ వాహనంపై ఆదాయ వ్యయాలు సమానంగా ఉంటాయి.

## వాహన సంఖ్య – 5

**వాహన సంఖ్య 5 ఉంటే ప్రమాదాలు జరగవు, రిపేర్లు ఉండవు.**

ఇది మంచి సంఖ్య. ప్రమాదాలు జరుగవు. రిపేర్లు ఎక్కువ ఉండవు. కాబట్టి దీనిని వ్యాపార వాహనానికి పెట్టుకోవచ్చు.

## వాహన సంఖ్య – 6 :

**వాహన సంఖ్య 6 ఉంటే వాహన ఖరీదు ఎక్కువ.**

ఇది చాలా మంచి సంఖ్య. ఈ సంఖ్య గల వాహనం ఖరీదు ఎక్కువగా ఉంటుంది. వాహనం సొంతదారులు ఈ వాహనాన్ని కొన్న తరువాత చాలా అభివృద్ధి చెందుతారు. ప్రమాదాలు జరుగవు.

సొంతదారుని వద్ద ఈ వాహనం ఎక్కువ కాలం ఉంటుంది. దీన్ని వ్యాపార వాహనానికి పెట్టుకుంటే మంచిది.

## వాహన సంఖ్య – 7

**వాహన సంఖ్య 7 ఉంటే రిపేర్లు ఎక్కువ.**

ఇది అంత మంచి సంఖ్య కాదు. రిపేర్లు ఎక్కువ. దూర ప్రయాణాలు ఉంటాయి. వ్యాపార వాహనానికి పెట్టుకోవచ్చు. దొంగిలింపబడే అవకాశం ఉంది. 7, 16, 25 తేదీల్లో జన్మించి, డెస్టినీ నంబరు 7 గల వారికి ఈ వాహన సంఖ్య కలిసి వస్తుంది.

## వాహన సంఖ్య – 8

**వాహన సంఖ్య 8 ఉంటే రిపేర్లు జరుగుతాయి.**

ఇది కూడా అంత మంచి సంఖ్య కాదు. రిపేర్లు ఎక్కువ. ప్రయాణాలు ఎక్కువ. వ్యాపార వాహనంగా వాడితే సొంతదారుడికి నష్టం. కొత్త వాహనం కూడా పాతదాని వలె కనిపిస్తుంది.

## వాహన సంఖ్య – 9

**వాహన సంఖ్య 9 ఉంటే దూర ప్రయాణాలు ఎక్కువ.**

ఈ సంఖ్య గల వాహనం, వాహనదారుడి ఇతర సంఖ్యలు అంటే జన్మదినం, పేరు, సంఖ్య, మొదలైన వాటిపై ఆధారపడి మంచి, చెడు ఉంటాయి. దూర ప్రయాణాలు ఉంటాయి. ప్రమాదం ఒక్కసారి జరిగినా చాలా ఘోర ప్రమాదం జరుగవచ్చు.

పైన చెప్పిన వాహన సంఖ్యలలో చెడు సంఖ్యలు అంటే 3, 7, 8 లాంటివి, వాహన సంఖ్యలో గల 4 అంకెలలో ఎక్కువ రాకుండా చూసుకోవాలి. ఉదా: 3331, 8878, 6777 లాంటివి, ఆ నాలుగు సంఖ్యల మొత్తం మంచి సంఖ్య అయినా సరే, అందులో చెడు సంఖ్యలు ఎక్కువ రాకుండా చూసుకోవాలి.

బర్త్ నెంబరు, లేదా డెస్టినీ నెంబరుతో సమానమైన నంబరు గల వాహన నంబరు ఉంటే మంచిది లేదా వ్యక్తిగత సంఖ్యలు అనే అధ్యాయంలో బర్త్‌నెంబరు, డెస్టినీ నెంబరుకి సఖ్యత గల సంఖ్యలు ఇవ్వటం జరిగింది. అటువంటి నెంబరు ఉన్నా ఫరవాలేదు.

# మొబైల్ టెలిఫోన్ నెంబర్లు

కొన్ని దశాబ్దాల క్రితం, టెలిఫోన్ అనేది సామాన్యులకి అందని ద్రాక్షగా ఉండేది. టెలిఫోన్, గొప్ప సంపన్నులు, పెద్ద డాక్టర్లు, పెద్ద వ్యాపారవేత్తల వద్ద మాత్రమే అందుబాటులో ఉండేది. ఆ రోజుల్లో ఫోను మాట్లాడాలంటే, పోస్టాఫీసుకో, టెలీఫోన్ ఎక్చేంజీకో వెళ్ళాల్సిందే. కానీ, ఆ తరువాత నెమ్మది నెమ్మదిగా టెలీఫోన్ అందరికీ అందుబాటులో వచ్చింది. కానీ మొబైల్ ఫోను వచ్చిన తరువాత చాలా విప్లవాత్మకమైన మార్పులు, మానవ జీవితంలోను, సమాచార వ్యవస్థలోను, ప్రాపంచీకరణలోను చోటు చేసుకున్నాయి.

మొబైల్ ఫోన్ అనేది, ఇపుడు ఒక విలాస వస్తువు కాదు. కనీస అవసరం అయిపోయింది. మొబైల్‌ఫోను లేనివారు ఎవరూ లేరు. వ్యాపారస్తులు, ఉద్యోగస్తులు, వృత్తిదారులు, రైతులు, శ్రామికులు, నిరుద్యోగులు, చివరకు స్కూలు పిల్లల దగ్గర కూడా మొబైల్ ఫోన్లు ఉంటున్నాయి. ఈ మొబైల్ ఫోను వలన మనుషుల మధ్య “దూరం” దూరం అయ్యింది.

మానవ జీవితంలో ఇంతటి ప్రాముఖ్యత కలిగిన మొబైల్ ఫోను నెంబరు కూడా దాని స్వంతదారు బర్త్‌నెం మరియు డెస్టినీ సంఖ్యతో సఖ్యత కలిగి ఉంటే, దాని వలన శుభ ఫలితాలు పొందుతారు. మొబైల్‌ఫోన్ పోగొట్టుకోవటం, దుర్వార్తలు వినటం లాంటివి నివారించవచ్చు. సాధారణంగా మొబైల్‌ఫోను 10 సంఖ్యల నెంబరు కలిగి ఉంటుంది. దీనిని “సిమ్‌కార్డ్” నెంబరు అని కూడా అంటాం. అయితే, ఈ 10 సంఖ్యలలో మనం చివరి 4 సంఖ్యలను మాత్రమే లెక్కలోనికి తీసుకొని వ్యక్తుల యొక్క నామసంఖ్యలను మాత్రమే లెక్కలోనికి తీసుకొని, వ్యక్తుల యొక్క నామసంఖ్యతో సఖ్యత కలిగి ఉండేటట్లు చూసుకోవాలి. ఇలా చూసినపుడు ముందు మొత్తం 10 సంఖ్యలు తీసుకొని కూడా చూడాలి. కాని ప్రధానంగా చివరి 4 సంఖ్యలు చూస్తే సరిపోతుంది.

**ఉదాహరణ**

వ్యక్తి పేరు : P. A N A N D P R A S A D

8 1 5 1 5 4 8 2 1 3 1 4

8 16 19 = 43 = 7

మొబైల్ నెంబరు : 9581988073

చివరి 4 సంఖ్యలు = 8073 = 18 = 9

నామ సంఖ్య 7కు ఫోను సంఖ్య 9 శత్రు సంఖ్య కాబట్టి మొబైల్ నెంబరును 7 కి మిత్రసంఖ్య అయిన 2 వచ్చేటట్లుగా సిమ్‌కార్డు మార్చుకోవాలి.

జన్మదినంలో ఉన్న అంకెలు, మొబైల్ నెంబర్‌లో ఎంత ఎక్కువ వస్తే, ఆ వ్యక్తికి, ఆ మొబైల్ అంత ఉపయోగకరంగా ఉంటుంది.

బర్త్ నెంబరు లేదా డెస్టినీ నెంబరుతో సమానమైన నెంబరు గల మొబైల్ నెంబరు ఉంటే మంచిది. లేదా వ్యక్తిగత సంఖ్యలు అనే అధ్యాయంలో బర్త్‌నెంబరు, డెస్టినీ నెంబరుకి సఖ్యత గల సంఖ్యలు ఇవ్వటం జరిగింది. అటువంటి నెంబరు ఉన్నా మంచిదే.

# బ్యాంకు ఖాతాలు

ఈ రోజుల్లో బ్యాంకు అకౌంటు లేని వారు ఎవరూ లేరు అనటంలో అతిశయోక్తి లేదు. సామాన్య రైతులు, శ్రామికులు కూడా వివిధ ప్రభుత్వ పథకాల ద్వారా లభించే లబ్ధికోసం బ్యాంకు ఖాతాలు తెరుస్తున్నారు. నిరుద్యోగులు, వికలాంగులు, వయోవృద్ధులు కూడా, ప్రభుత్వ పింఛను పథకం కోసం బ్యాంకు ఖాతాలు కలిగి ఉంటున్నారు. ఇక ఉద్యోగస్తులు, వ్యాపారస్థులు, వృత్తులలో ఉన్నవారు తప్పనిసరిగా బ్యాంక్ ఖాతాలు కలిగి ఉంటారు. పెద్ద పెద్ద వ్యాపారాలయితే, బ్యాంకు లావాదేవీల ద్వారానే ఈ రోజుల్లో జరిగిపోతున్నాయి.

ఈ విధంగా బ్యాంకు ఖాతాలు అనేవి మానవజీవితంలో దైనందిక కార్యక్రమాలలో ఒక భాగమై పోయింది. అటువంటి ప్రాధాన్యత కలిగిన బ్యాంకు ఖాతాలు, వ్యక్తుల యొక్క నామసంఖ్యతో సఖ్యత కలిగి ఉండటం ఎంతో అవసరం. మనం ఎంతోమందిని చూస్తుంటాం. ఎన్ని ఆర్థిక లావాదేవీలు జరుగుతున్నా వారి ఖాతాలలో ఎపుడూ "ధనం" ఎక్కువగా ఉండదు. అకౌంటులో డబ్బు నిలువలేకపోవటానికి కారణం, ఆ అకౌంటు సంఖ్యకి, సొంతదారు జన్మసంఖ్య, డెస్టినీ నెంబరుకు సఖ్యత లేకపోవటమే!

కాబట్టి, బ్యాంకు ఖాతా నెంబరు సఖ్యత లేనిదైతే దానిని బ్యాంకు అధికారులను ఒప్పించి తగు విధంగా మార్పు చేసుకుంటే, అకౌంటులో "ధన లేమి" అనేది ఉండదు.

ఈ రోజుల్లో "కోర్ బ్యాంకింగ్" వ్యవస్థ వలన అందరి బ్యాంక్ ఖాతాల నెంబర్లు చాలా పెద్దవిగా ఉండటం మనం చూస్తున్నాం. ఖాతా నెంబర్‌లో 13 నుండి 16 సంఖ్యల వరకు ఉండటం మనం గమనించగలం. కానీ ఈ బ్యాంకు ఖాతా నెంబరు మార్పు చేసుకున్నపుడు చివరి 5 సంఖ్యలనే లెక్కలోనికి తీసుకోవాలి. అది ఖాతాదారు యొక్క వ్యక్తిగత నెంబరుగా ఉంటుంది. ఇపుడు బ్యాంకు ఖాతా నెంబరు ఏ విధంగా ఉండాలో పరిశీలిద్దాం.

ఉదా : వ్యక్తి పేరు : P. S U R E S H K U M A R

8 3 6 2 5 3 5 2 6 4 1 2 = 47 = 11 = 2

పుట్టిన తేదీ : 19.10.1963 = 30 = 3

జన్మ సంఖ్య = 19 = 10 = 1

డెస్టినీ సంఖ్య = 3

బ్యాంకు ఖాతా నెంబరు : 1089101024823

చివరి 5 సంఖ్యలు : 24823 = 19 = 10 = 1

నామ సంఖ్య 2 కి, జన్మ సంఖ్య1, డెస్టినీ సంఖ్య 3, ఖాతా సంఖ్య1, మిత్ర సంఖ్యలు కాబట్టి ఈ బ్యాంకు ఖాతా నంబరు పై వ్యక్తికి సరిపోతుంది.

పై విధంగా, వ్యక్తి యొక్క, నామసంఖ్య, జన్మసంఖ్య, డెస్టినీ సంఖ్య, ఖాతా సంఖ్యకు సఖ్యత కలిగి ఉండాలి. అపుడే ఆ ఖాతాలో ధనం నిలువ ఉంటుంది. సంఖ్యల సఖ్యత లేనపుడు వ్యక్తి యొక్క పేరు మార్పు చేసి నామసంఖ్య ఒక్కొక్కసారి మార్పు చేయాల్సి ఉంటుంది.

బర్త్ నెంబరు, లేదా డెస్టినీ నెంబరుతో సమానమైన నెంబరు గల బ్యాంకు అకౌంటు నెంబరు ఉంటే మంచిది. లేదా వ్యక్తిగత సంఖ్యలు అనే అధ్యాయంలో ఇచ్చిన బర్త్‌నెంబరు, డెస్టినీ నెంబరుకి సఖ్యత గల సంఖ్యలు ఇవ్వటం జరిగింది. అటువంటి నెంబరు ఉన్నా మంచిదే.

## వ్యాపార సంస్థలు

ఈ ప్రపంచంలో మనుషులు, ధన సంపాదన అనేది, వివిధ వృత్తులు, ఉద్యోగాలు, వ్యాపారాల ద్వారా చేస్తున్నారు. ఉద్యోగం, వృత్తి అనేవి కొద్ది మందికి మాత్రమే, వారి వ్యక్తిగత ఉపాధికి మూలంగా ఉంటాయి. కానీ వ్యాపారం విషయానికి వస్తే మాత్రం అది సమాజశ్రేయస్సుకు కారణభూతంగా ఉంటుంది. ఎందుకంటే, వ్యాపార సంస్థల నిర్వహణ సొంతదారులకు వ్యక్తిగతఉపాధి కల్పించటమే కాకుండా, అనేక మంది నిరుద్యోగులకు, జీవనోపాధిగా మారుతుంది. అందువలన వ్యాపారం చేసే వ్యక్తులపై మరింత, సామాజిక బాధ్యత ఎక్కువగా ఉంటుంది.

కాబట్టి వ్యాపారం, వ్యాపార సంస్థలు ప్రారంభించే వారు ఆ వ్యాపారసంస్థ యొక్క నామసంఖ్య, వారి బర్త్ నెంబరు, డెస్టినీ నెంబరు, నామసంఖ్యతో సఖ్యత కలిగి ఉండేట్లు చూసుకుంటే, ఆ వ్యాపారం దినదినాభివృద్ధి చెంది, సంపద, ఉద్యోగాలు పెరిగి, మనుషుల

జీవన స్థితిగతులు మెరగవుతాయి. ఇంత గురుతర బాధ్యత వ్యాపారస్తులపై ఉందన్న విషయం మరచిపోరాదు.

ఇపుడు వ్యాపార సంస్థల పేర్లు, వాటి సొంతదారుల పేర్లతో ఏ విధంగా సఖ్యతగా ఉండాలో తెలుసుకుందాం.

ఉదా : రాధాకృష్ణ అనే వ్యక్తి రాధాకృష్ణ క్లాత్ సెంటర్ ప్రారంభిస్తే,

RADHAKRISHNA CLOTH CENTRE

2 1 4 5 1 2 2 1 3 5 5 1 2 2 7 4 5 3 5 5 4 2 5

**-32- - 22 - 24- = 78 = 15 = 6**

సొంతదారు పేరు : RADHAKRISHNA

2 1 4 5 1 2 2 1 3 5 5 1 = 32 = 3+2 = 5

సంఖ్య 5 కి సంఖ్య 6 మిత్ర సంఖ్య కాబట్టి ఈ వ్యాపార సంస్థ మంచి లాభాలు ఆర్జిస్తుంది.

K. RAMA RAO RAMA MOTORS అనే సంస్థను ప్రారంభిస్తే

K. RAMA RAO

2 2 1 4 1 2 1 7 = 20 = 2

RAMA MOTORS

2 1 4 1 4 7 4 7 2 3 = 35 = 8

సంఖ్య 2 కు సంఖ్య 8 శత్రు సంఖ్య కాబట్టి సంస్థ పేరును

RAMMOTORS

2 1 4 4 7 4 7 2 3 = 34 = 7

మిత్ర సంఖ్య అయిన 7 వచ్చేటట్లుగా పేరు మార్పు చేసుకోవాలి.

జన్మదినం తెలిసిన వారు వారి వ్యాపార సంస్థ నామసంఖ్యకు, జన్మదినంలో డెస్టినీ నెంబరుకు సఖ్యత ఉన్నట్లుగా చూసుకుంటే మరింత మంచి ఫలితాలు ఉంటాయి.

బర్త్‌నెంబరు లేదా డెస్టినీ నెంబరుతో సమానమైన నెంబరు గల వ్యాపార సంస్థ ఉంటే మంచిది. లేదా వ్యక్తిగత సంఖ్యలు అధ్యాయంలో ఇచ్చిన బర్త్, డెస్టినీ నెంబరుకి సఖ్యత గల సంఖ్యలు ఇవ్వటం జరిగింది. అటువంటి నెంబరు ఉన్నా మంచిదే. వ్యాపార సంస్థల పేర్లు అనుభవం గల ఆస్ట్రో న్యూమరాలజిస్ట్‌తో పెట్టించుకోవడం మంచిది.

# మనవి

న్యూమరాలజీ నేర్చుకునే విద్యార్థులకు మరియు ఇప్పుడిపుడే, న్యూమరాలజీ నేర్చుకుని, ప్రాక్టీస్ ప్రారంభించిన వర్ధమాన న్యూమరాలజిస్టులకు నా మనవి ...

న్యూమరాలజీ వృత్తిని చేపట్టాలనుకునే వారు ముందుగా, వారి స్నేహితులు, కుటుంబ సభ్యులు, తోటిపని వారు ఇరుగుపొరుగు వారు, ఇలా ఎవరు కనిపించినా, వారి యొక్క పేరు, జన్మదినం మొదలైన వాటిని తెలుసుకొని న్యూమరాలజీని ప్రాక్టీసు చేయటం ప్రారంభించాలి. ఈ వృత్తిలో ఆనందమే కాదు, బాధ్యత కూడా ఉందని గుర్తెరిగి ప్రవర్తించాలి.

మీరు ముందుగా తెలుసుకోవాల్సిన విషయం ఏమిటంటే న్యూమరాలజీ, భౌతిక విజ్ఞాన శాస్త్రం కాదు. ఇది మానసిక, ఆధ్యాత్మిక విజ్ఞాన శాస్త్రం. భౌతిక విజ్ఞాన శాస్త్రంలో కొన్ని నియమాలు, సిద్ధాంతాలు, పరిమితులు, ప్రమాణాలు, పరిమాణాలు, కొలతలు ఉంటాయి. అయితే న్యూమరాలజీ ఆధ్యాత్మిక మనో విజ్ఞాన శాస్త్రం కాబట్టి దీనికి కూడా, కొన్ని నియమాలు సిద్ధాంతాలు, పరిమాణాలు, ప్రమాణాలు ఉంటాయి కాని పరిమితులు ఉండవు.

ఒక వ్యక్తిని భౌతిక విజ్ఞాన శాస్త్ర ఆధారంగా, అతని భౌతిక దేహం యొక్క బరువును కొలవవచ్చు. మరి అతని మేధస్సుని, మనసుని, బుద్ధిని, ఆలోచనలను, భావాలను, ఆవేశాలను, లక్షణాలను, గుణాలను కొలవగలమా ? న్యూమరాలజీ మనో విజ్ఞానశాస్త్రం కాబట్టి, దానితో "కొంత" వరకు కొలవవచ్చు.

ఎన్నో వేల సంవత్సరాల నుండి మనపూర్వీకులు వారి యొక్క అనుభవాల సారాన్ని, పరిశోధనని క్రోడీకరించి, ఒక శాస్త్రంగా తయారు చేసి మనకు అందించారు. వ్యక్తుల యొక్క మనసులను ఎవరు పూర్తిగా కొలవలేరు కాబట్టి, న్యూమరాలజిస్టులు 100% ఫలితాలు చెప్పలేరు. ట్రెండ్ ఎలా ఉంది అని అంచనా వేయగలరు. ముఖ్యంగా న్యూమరాలజీని ప్రాక్టీసు చేసే వారు గుర్తించుకోవలసిన విషయం, వారి దగ్గరకు వచ్చే వ్యక్తుల బలహీనతలు, లోటుపాట్లు తెలియచేసేటపుడు ఎంతో జాగ్రత్త వహించాలి. ఇది వారి సామాజిక బాధ్యత.

ఉదాహరణకు, మీ దగ్గరకు సలహా కోసం వచ్చిన వ్యక్తికి ఆత్మవిశ్వాసం తక్కువగా ఉందని మీరు గ్రహిస్తే "మీకు ఆత్మ విశ్వాసం తక్కువ" అని చెప్పకూడదు. ఎందుకంటే, సలహా కోసం వచ్చిన వ్యక్తి, ఊరికే సరదాగా మీ దగ్గరకు రాలేదు, సమస్యతో వస్తారు. ఆ సమస్య వలన బాధతో ఉంటారు. ఆ బాధలో కూడా మీకు ఫీజు చెల్లిస్తారు. సన్నిహిత మిత్రులు, బంధువులు, భార్యా పిల్లలకు కూడా చెప్పుకోలేని రహస్యాలు మీతో చెప్తారు, మీ మీద విశ్వాసంతో! అటువంటి వారికి, ఆత్మవిశ్వాసం, ఉత్సాహం కలిగించి, ప్రోత్సహించి, దిశానిర్దేశం, మార్గదర్శకత్వం చూపాల్సిన గురుతర బాధ్యత మీపై ఉంది.

ఆత్మవిశ్వాసం తక్కువగా ఉన్న వ్యక్తి వచ్చినపుడు "మీలో చాలా ప్రతిభా పాటవాలు శక్తి సామర్థ్యాలు ఉన్నాయి. అయితే అవి మీరు గుర్తించలేకపోతున్నారు – ఈ విధంగా చేయండి!" అని సమస్యకు పరిష్కారం చెప్తే, వారిలో నూతన ఉత్సాహం వచ్చి, జీవితంపై పాజిటివ్ దృక్పథం పెంచుకుంటారు.

ప్రతి న్యూమరాలజిస్టుకు ఉండాల్సిన ప్రథమ లక్షణం, తమ క్లయింటు పట్ల ఆదరాభిమానాలతో కూడిన ప్రేమ. క్లయింటు మిమ్మల్ని నమ్మి వస్తాడు. ఎందుకంటే అలాంటి క్లయింటుకి మీరు కొత్త వ్యక్తి అయినా తమ మనసులో భావాలు చెప్తారు. వారి గాయపడిన మనసుకు, మీ ఆదరణ, విశ్వాస పూరితమైన మాటలు మందులా పనిచేయాలి. న్యూమరాలజీ మనోవిజ్ఞాన శాస్త్రం కదా! న్యూమరాలజీ, ఒక విశిష్టమైన, ఆదాయం కలిగించే, బాధ్యతాయుతమైన వృత్తి. న్యూమరాలజిస్టు ప్రాధాన్యం ఇవ్వలవలసినది గోప్య నీయత. న్యూమరాలజిస్టును నమ్మి క్లయింట్లు తమ మనోభావాలను, రహస్యాలను, బలహీనతలను వెల్లడిస్తారు. ఎట్టి పరిస్థితులలో న్యూమరాలజిస్టు వాటి గురించి ఇతరులతో చర్చించటం వాటిని బహిర్గతం చేయటం కానీ చేయకూడదు. ఇది విశ్వసనీయతను దెబ్బతీస్తుంది. న్యూమరాలజీని మన పూర్వీకులు వారి వారసత్వంగా మనకు అందించారు. దీని శాస్త్రీయతను సరళతరం చేసి ప్రజలకు న్యూమరాలజీ మరియు అతీంద్రియ శక్తుల యొక్క ప్రభావం తెలియచేయడానికి చేసిన నా ఈ చిరు ప్రయత్నాన్ని ఆదరిస్తారని ఆశిస్తూ ...

**మీ మహమ్మద్ దావూద్ ...**



శ్రీ మహమ్మద్ దావూద్, బాపట్ల, గుంటూరు జిల్లాకు చెందినవారు. వృత్తి రీత్యా హైదరాబాద్‌లో స్థిరపడి, న్యూమరాలజీని ప్రవృత్తిగా చేసుకొని, ఎందరికో న్యూమరాలజీ పరంగా అపారమైన సేవ చేస్తున్నారు. చీరాలలో M.com వరకు చదువుకొని, 1983లో రైల్వేలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగిగా చేరారు. 1999లో న్యాయ శాస్త్రంలో పట్టా పుచ్చుకున్నారు. M.A (జ్యోతిషం) లో ఉత్తీర్ణులయ్యారు. ప్రస్తుతం M.Sc (సైకాలజీ) చేస్తున్నారు. ఈ విధంగా శ్రీ మహమ్మద్ దావూద్ ఉన్నత విద్యాభ్యాసం చేసిన వ్యక్తి. భృగు నాడీ జ్యోతిష విధానం శ్రీ AV Sundaram గారి వద్ద నేర్చుకున్నారు. 2006లో "జ్యోతిష విద్వాన్" 2008లో "జ్యోతిష రత్న" బిరుదులు పొందారు.

చిన్నతనం నుండి, న్యూమరాలజీ, జ్యోతిషశాస్త్రాల పై మక్కువ కలిగి, వాటిని అభ్యసించి, అధ్యయనం, పరిశోధన చేసి, చేతి వ్రాత, సంతకాల విశ్లేషణ పై పట్టు సాధించారు. వీరి రచనలు అనేక ఆంగ్ల, తెలుగు పత్రికలలో ప్రచురితమయ్యాయి. - ఇంకా అవుతున్నాయి. పలు టి.వి ఛానెల్స్‌లో కూడా న్యూమరాలజీపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌లో మొట్ట మొదటి సారిగా, మీడియా మాధ్యమం ద్వారా న్యూమరాలజీ పై ప్రజలలో అవగాహనా కార్యక్రమాలు శ్రీ మహమ్మద్ దావూద్ నిర్వహించారు.

న్యూమరాలజీలో ముఖ్యంగా ఆధునిక సంఖ్యా శాస్త్రంలో ప్రిడిక్టివ్ పద్ధతులు, ఆస్ట్రోన్యూమరాలజీ మొదలైన వినూత్నమైన పద్ధతులలో శ్రీ మహమ్మద్ దావూద్ నిష్ణాతులు. వీటి పై రాష్ట్రం నలుమూలలా పర్యటించి అవగాహనా సదస్సులు మరియు తరగతులు నిర్వహించారు. ఆస్ట్రాలజీ, న్యూమరాలజీ గ్రాఫాలజీ మూడింటిని అనుసంధానం చేస్తూ సమస్యలకు పరిష్కారం చెప్పటంలో శ్రీ మహమ్మద్ దావూద్ ఆద్యులు.

శ్రీ మహమ్మద్ దావూద్ తనలో ఉన్న పరిజ్ఞానం, అనుభవం, క్రోడీకరించి తెలుగు పాఠకుల ప్రయోజనార్థం ఈ గ్రంథం మీ ముందుకు తీసుకురావటం జరిగింది. పాఠకులు దీనిని చదివి ఆకళింపు చేసుకొని ప్రయోజనం పొందుతారని మహమ్మద్ దావూద్ గారి ప్రగాఢ విశ్వాసం. ఈ గ్రంథం చదివి పాఠకులు తమ అమూల్యమైన సలహాలు, సూచనలు తెలియజేయ గలరని ప్రార్థన.

For e-book:
**Kinige**
www.kinige.com

గమనిక :- సలహాలు, సూచనలు ఈ క్రింది ఈ -మెయిల్‌కు పంపగలరు.

mddwood1@yahoo.com
Ph:9985038135

Website: www.mddawood.com